

శ్రీవిష్ణవీయ

(శ్రీ విష్ణు సహస్రనామ భాష్యము)

సామవేదం షణ్ముఖ శర్మ



ప్రథమ ప్రతి స్వీకర్త

పురుషోత్తమక్షేత్ర ధైవం -

బలభద్రా సుభద్రా సమేత శ్రీ జగన్నాథస్వామి.

SRI SARADA PEETHAM

SRINGERI

श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्री शारदापीठम्, शृङ्गेरी
Sri Sri Jagadguru Shankaracharya Mahasamstanam
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.

Ref : Camp : SRINGERI Date :

Camp : మైసూరు

సర్వధారి సంవత్సర నృసింహ జయంతి
18-5-2008

వేదవ్యాసమహర్షి విరచిత మహాభారతసాగరంలోని అమోఘరత్నములలో విష్ణుసహస్రనామస్తోత్రంకూడా ఒకటి. సకలధర్మమర్మజ్ఞుడయిన భీష్మ పితామహుడు శరతల్పమునందుండి యుధిష్ఠిరునకువదిశించిన యమోఘ రత్నమిది. సర్వజనసులభము సర్వోత్కృష్టఫలదము అయిన దీనిని ప్రతియొక్కడూ పఠించి తరించవలయునన్న మహోన్నతాశయమే ఏతదుపదేశనిదానము. పరశివావతారులయిన శ్రీమదాదిశంకర భగవత్పాదులు దీనికి భాష్యము వ్రాసియుండుట దీని ఉత్కర్షను వేనోళ్ళ చాటుచున్నది. తదనుసారముగ దీనినవగతముచేసికొని మననము చేయుట సకల శిష్టజనకర్తవ్యము. దీనినపేకులు పలువిధములుగను పలుభాషలలోనూ అనువదించి ధన్యులయిరి.

శ్రీయుతులు సామవేదం షణ్ముఖశర్మగారు తమదే అయిన విశిష్టరీతిలో దీనిని వ్యాఖ్యానించి విష్ణువిద్యయను పేరున ప్రచురించుచుండుట ముదావహము. శ్రీశర్మగారు బహుగ్రంథ పరిశీలనపురస్సరముగ దీనిని రచించిరని ఏతద్గ్రంథావలోకనముచే ప్రస్ఫుటమగుచున్నది.

శ్రీశారదాచంద్రమౌళీశ్వరుల కృపవలన ఈ గ్రంథము బహుళ ప్రచారమునందుగాక, శ్రీశర్మగారు ఇదేవిధముగా పద్యగ్రంథములవాంఙ్మ ప్రజానీకమునకందించుచూ పితపక్ష శీతకిరణోపమయశోవిరాజితులగుదురుగాకయని శ్రీజగద్గురు చరణులాశీర్వదించిరి.

శుభమస్తు

T Dakshinamurthi

Phone : 08265-250123 / 250192 Fax : 08265-250792
E-mail : info@sringerisharadapeetham.org Visit us : www.sringerisharadapeetham.org

శ్రీవిష్ణువిద్య

(శ్రీవిష్ణుసహస్రనామ భాష్యమ్)

తృతీయ భాగము

సామవేదం షణ్ముఖ శర్మ

ఋషిపీఠం ప్రచురణలు

హైదరాబాద్

శ్రీవిష్ణువిద్య

(శ్రీవిష్ణు సహస్రనామ భాష్యమ్)

తృతీయ భాగము

294.5512
షణ్ముఖ-శ్రీవి

-సామవేదం షణ్ముఖ శర్మ

ప్రథమ ముద్రణ: **మే 2008**

Cat-2536

సర్వహక్కులు రచయితవి

వెల: రూ.400/-

ముఖచిత్రం : రాము.పి, విజయవాడ



ప్రతులకు:

సామవేదం షణ్ముఖశర్మ,

ప్లాట్: నెం.299, ఫేస్-1, సాకెత్ కాలనీ,

పోస్ట్: ఇ.సి.ఐ.ఎల్., కాప్రా, హైదరాబాద్-500 062.

ఫోన్: 040-2713250

ఋషిపీఠం కమ్యూనికేషన్స్ ప్రై.లిమిటెడ్,

శివజ్యోతి, ప్లాట్ నెం-1, ఫస్ట్‌ఫ్లోర్,

10వ వీధి, హౌస్ నెం-1-8-105, చిక్కడపల్లి,

హైదరాబాద్-20. ఫోన్: 040-27655859

అర్పణమ్

ఇది 'శ్రీవిష్ణువిద్య' మూడవ భాగం.

విష్ణు సహస్రనామాలు 501వ నామం నుండి 1000వ నామం వరకు భాష్యం. ఇంత వరకూ వచ్చిన వివిధ సంప్రదాయాల భాష్యాలను పరిశీలించి, భగవానుడు నాకు ప్రసాదించిన కొలది భావనాశక్తికి తోచిన విషయాలను సమీకరించి ఔచిత్యంగా అనిపించిన వాటిని సమకూర్చి అందించిన వేయి నామాల వివరణ ఈ 'శ్రీవిష్ణువిద్య'.

ఆదిశంకర భగవత్పాదుల భాష్యం సంపూర్ణంగా గ్రహించి, మిగిలినవారివి ఔచితికి తగినవి మాత్రమే స్వీకరిస్తూ, శ్రుతి స్మృతుల ప్రమాణాల ద్వారా కొన్ని కొత్త అర్థాలను తెలియజేస్తూ – నా శక్తి మేరకు నేను సమగ్రంగా రచించాలని ప్రయత్నించాను.

ముఖ్యంగా ఈ నామ స్తోత్రం ఉపాసనాగ్రంథం. భక్తితో పారాయణం చేసుకోవలసిన నామరాశి. 'భక్త్యా' 'సతతోత్థితః' – అని భీష్ముని మాట. అందుకే భక్త్యానుభూతిని పొందుతూ, పొందించాలనే ప్రయత్నంలో ఇతర సాహిత్యాలు, వాగ్గేయకారుల కృతిరచనలను కూడా ఎడనెడా ఉట్టంకించడం జరిగింది. ఇది ఆ నామ మాధుర్యాన్ని మరింత ఆస్వాదించాలనే భక్తి పూర్వక ప్రయత్నమే తప్ప, భాష్యానికి ప్రమాణవాక్యాలుగా చెప్పడం ఉద్దేశం కాదు.

సామాన్యుని రసానుభూతికి అవరోధం కారాదనే ఎక్కువగా వ్యాకరణశాస్త్రాది వివరణలను ఇవ్వలేదు. శాస్త్ర విరుద్ధం చెప్పరాదని గురువుల చరణాలను స్మరిస్తూ అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాను.

నామార్థాన్ని వ్యక్తపరచి వ్యుత్పత్తిని సాధించడానికి పనికివచ్చే శ్రుతి స్మృతి వాక్యాలకు స్పష్టంగా తెలుగులో అర్థం వ్రాశాను.

కానీ, ఆ నామం పేర్కొనబడిన కొన్ని శ్రుతివాక్యాలను కేవలం 'తత్పదాన్విత మంత్రాలు ఇవి' అని చూపి, 'శ్రుతినిగదిత నామాలు' అని ప్రతిపాదించడమే ఉద్దేశం కనుక – రచనాక్రమంలో వాటికి అర్థం ఇవ్వలేదు. అర్థబోధక ప్రమాణవాక్యాలకు తెలుగులో అర్థం వ్రాసినా, నామపదాన్విత మంత్రాలను కేవలం సూచికలుగా మాత్రమే గ్రహించాను.

అయితే – 'ఋషిభిః పరిగీతాని' అనే భీష్మ వాక్యాన్ని బలపరచి చూపించేందుకు, ఆ యా నామాలు ఏయే శ్రుతి మంత్రాలలో వాడబడ్డాయో కొన్ని అధికంగా పేర్కొన్నప్పుడు మాత్రం, ఆ మంత్రాలకు అర్థం వ్రాయలేదు. ఇది ప్రధానార్థ గ్రహణానికి అవరోధం కాదనే ఉద్దేశంతో చేసిన పనే.

కానీ వాటికి కూడా అర్థం అందించి మరింత సమగ్రం చేయాలనే ఆలోచన, పెద్దల ద్వారా కలిగి– ఇందులో అర్థాలు వ్రాయని వాక్యాలన్నిటికీ వేదార్థవేత్తల సహకారంతో పూర్తిగా అర్థాలను 'అనుబంధంగా' అందించబోతున్నాను.

కొన్ని నామాల క్రమంలో భావనాత్మకమైన చిత్రణను దర్శింపజేయడం జరిగింది. గ్రంథం కేవలం శాస్త్రంగానే కాక, అనుభూతి ప్రధానంగా, భక్తిస్ఫోరకంగా భాసించ డానికై అటువంటి భగవద్భావనలను స్మరించడం.

నా జన్మను స్థారకం చేసుకోడానికి, ప్రతి నామాన్ని భావించి భక్తి పారవశ్యాన్ని పొంది, తన్మయం చెందడానికి వ్రాసుకున్న గ్రంథమిది. సహృదయులకు ఈ ప్రయోజనమే కలిగించాలని ప్రచురించడం జరిగింది.

వ్రాయడానికి ప్రోద్బలం చేసిన సహృదయ మిత్రులు, నిత్యకృషీవలురు డా॥ వ్యాకరణం ఆంజనేయశాస్త్రిగారు దీనిని ప్రజలకు అందించడంలో పోషణ బాధ్యత సైతం వహించారు. కృతిని వెలువరించిన సుకృతాన్ని పదిలం చేసుకున్నారు.

దీనిని సర్వాంగ సుందరంగా ముద్రించిన స్నేహితులు శ్రీ ఉపద్రష్ట శివప్రసాద్ గారికి ప్రత్యేక శుభాభినందనలు. గ్రంథరూప సంతరణలో ఆకర్షణను అందించిన శ్రీ పి.రాము గారికి, అత్యంత శ్రద్ధగా ప్రూఫులు దిద్ది, అక్షర శుద్ధతకు చిత్తశుద్ధితో శ్రమించిన సహృదయులు శ్రీ తుంబలి శివాజీగారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రచురణలో సహకరించిన శ్రీ బి.ఎస్.శర్మగారికి, శ్రీమతి రత్నప్రభగారికి ధన్యవాదాలు.

ముఖ్యంగా– దీనిని ఆమూలాగ్రం చదివి ఆశీర్వదించి, శ్రీశ్రీశ్రీ శృంగేరీ జగద్గు రువుల వారికి ఈ గ్రంథాన్నందించి, వారిచే తిలకింపజేసి, వారి సుమంగళాశీస్సులను స్వయంగా తీసుకువచ్చి అందించిన బ్రహ్మవిద్వరులు బ్రహ్మశ్రీ ముదిగొండ శంకర శర్మగారి అపార వాత్సల్యానికి కైమోడ్పులు.

మూర్తీభవించిన ఆర్షచైతన్యం, మాకు ఆరాధ్యస్థానీయులు, పాండిత్యానికి అసలైన అర్థస్వరూపులు మహామహోపాధ్యాయ ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచన్ద్రుడుగారి దీవెనలను ధన్యతతో శిరసావహిస్తున్నాను.

నాకు ప్రథమ, ప్రధాన ఆచార్యులు, జీవితాన్ని తీర్చిదిద్దిన నా తండ్రిగారు బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మగారికీ; శివశక్తుల కృపకు పూర్ణపాత్రునిగా మలచిన శ్రీవిద్యావాచస్పతి శ్రీశ్రీశ్రీ మహాదేవానందనాథులకు; జీవన్ముక్తులై తన కరుణాకటాక్షాన్ని నాపై ప్రసరిస్తున్న శివశ్రీ సద్గురు కందుకూరి శివానందమూర్తి గారికీ .....సహస్ర ప్రణామాంజలి.

అపార కారుణ్యంతో ఆశీస్సులననుగ్రహించి, శ్రీముఖాన్ని ప్రాదించిన శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీశృంగేరీ జగద్గురు శ్రీదక్షిణామ్నాయ శారదాపీఠాధీశ్వర శ్రీశ్రీశ్రీ భారతీతీర్థమహాస్వామివారి దివ్యచరణకమలాలకు ప్రణామాంజలి.

సర్వం గజానన షడానన సమేత

శ్రీ ఉమామహేశ్వర చరణారవిన్దార్పణమస్తు.

– సామవేదం షణ్ముఖ శర్మ.

ధన్యత

'శ్రీ విష్ణువిద్య' మూడవ భాగాన్ని ముందుకు తీసుకు వచ్చాము. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు నా మాట మన్నించి ఒక తపస్సుగా వేనామాల వ్యాఖ్యానాన్ని సిద్ధం చేశారు. ప్రవచనాలతో, సంచారంతో, పత్రికా సంపాదకత్వంతో, ఇతర రచనలతో తీరిక లేని స్థితిలో ఉన్నా, ప్రత్యేక దీక్షగా స్వీకరించి, ఈ గ్రంథాన్ని రచించారు.

మొదటి రెండు భాగాలు (500 నామాలు) చక్కగా సహృదయుల ఆదరణకు నోచుకున్నాయి. భగవద్విజ్ఞానంగా ఈ పుస్తకాన్ని రచించిన శర్మగారు, దీనిని భగవదర్పణంగానే అంకితం చేశారు.

ఈ సత్కృతిని వెలుగులోకి తెచ్చే భాగ్యం నాకు లభించడం ఆ విష్ణుదేవుని కృపయే. నాకు జన్మనిచ్చి తీర్చిదిద్దడమేకాక, శ్రీవిష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణను చేయమని ఆదేశించిన మా అమ్మగారి దివ్యస్మృతి ఈ పుస్తకాన్ని వెలికితేవడంలో ప్రేరణగా ఉంది.

నా షష్టిపూర్తి నాటికి ముందే శ్రీకారం చుట్టిన ఈ గ్రంథం ఇన్నేళ్ళకి పూర్తయి సమగ్రాకృతితో ముందుకు రావడం, నాకు ఒక చిత్రమైన ఆనందాను భూతినిస్తోంది.

అందంగా తీర్చి ముద్రించిన ప్రచురణకర్త శ్రీ ఉపద్రష్ట శివప్రసాద్‌గారు అభినందనీయులు.

ఈ మంచి పని నేను చేస్తున్నానని అభినందించిన ఆత్మీయులకి, నా చే ఈ పని చేయించిన బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారికీ కృతజ్ఞతాంజలి.

-దా॥ వ్యాకరణం ఆంజనేయశాస్త్రి.

తృతీయ భాగము

ఉత్తరో గోపతి ర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః।
శరీరభూతభృ ద్భోక్తా కపీన్ద్రో భూరిదక్షిణఃll 53

494. ఉత్తరః, 495. గోపతిః, 496. గోప్తా,
497. జ్ఞానగమ్యః, 498. పురాతనః, 499. శరీరభూతభృత్,
500. భోక్తా, 501. కపీన్ద్రః, 502. భూరిదక్షిణఃll

కపీన్ద్రః.. 501

1. గమనము చేసేవాటిలో గతిశక్తిగా ఉన్నవాడు.

   'కపి సంచలనే' అను ధాత్వర్థాన్ని అనుసరించి, చలనశీలము కలది కపి. సూర్యుడు, గ్రహములు మొదలైనవి కపులు. 'ఇది ఐశ్వర్యే' – అనే ధాతువు ననుసరించి ఐశ్వర్యవంతుడు – 'ఇంద్రుడు'. కపులలో ఐశ్వర్యము = చలన శీలము గల వాటిలో చలన శక్తిగా ఉన్న పరమేశ్వరుడు, కపీన్ద్రుడు. సూర్యాదులలోనున్న గమనశీలచైతన్యము ఈతడే.

2. సూర్యుడు రాశి నుండి రాశికి మారినట్టు జీవుడు దేహాంతరాలు పొందు తున్నాడు. చంద్రునివలె మనస్సు చలనశీలంగా ఉన్నది. ఇలా 'జీవునిలో, దేహంలో చలన చైతన్యమంతా పరమాత్ముని వలననే కలుగుతోంది. శరీరం లోని రక్తప్రసరణాది గమనములు, మనస్సు యొక్క ఆలోచనాది చలనములు, అన్ని కదలికలకీ హేతువైన చైతన్యమే కపీన్ద్రుడు.

   యథేమే ద్యావాపృథివీ సద్యః పర్యేతి సూర్యః ll (అథర్వణ)
   సూర్య ఏకాకీ చరతి చన్ద్రమా జాయతే పునఃll (యజుర్వేదం)

– వంటి శ్రుతి వాక్యాలు చలనశీలత కలిగిన సూర్య చన్ద్రాదుల గమనశక్తిని, తచ్ఛక్తిదాయకుడైన పరమాత్మను ప్రస్తావిస్తున్నాయి.

3. జలము నుండి భూమిని ఉద్ధరించిన శ్రేష్ఠమైన యజ్ఞవరాహమితడు.
'కపి' శబ్దం (101 వ నామాన్ని చూడండి) వరాహాన్నీ, 'ఇన్ద్ర' శబ్దం శ్రేష్ఠత్వాన్నీ తెలియజేస్తోంది.

4. వానరులను ప్రభువుగా ఏలుకున్న శ్రీరాముడు.

సర్వలోకేశ్వరః సాక్షాత్ లోకానాం హితకామ్యయా ।
సర్వైః పరివృతో దేవైః వానరత్వ ముపాగతైః ॥

(రామాయణం- యుద్ధకాండ)

"సర్వలోకాలకు ప్రభువైన విష్ణువు (శ్రీరాముడు) లోక హిత కాంక్షిగా వానరరూపధారులైన దేవతలతో పరివేష్టించబడినా"డని వాల్మీకి వర్ణన.
యజ్ఞవరాహరూపుడై ; యజ్ఞసంభవుడై; యజ్ఞ రక్షకుడై, యజ్ఞంలోని ఆహుతులను స్వీకరించే దేవతలచే పరివృతుడైన శ్రీరాముడై గోచరించిన విష్ణువు యజ్ఞాంగ మైన దక్షిణలు అసంఖ్యాకంగా కలవానిగా--

భూరిదక్షిణః.. 502

1. బహు దక్షిణలు కలవాడు. (యజ్ఞము చేయువాడు-యజమాని ధర్మ మర్యాదలను లోకానికి చూపించుటకై యజ్ఞాలను తాను ఆచరిస్తున్న భగవానుడు, ఆ యజ్ఞంలో బహుదక్షిణలను ఇచ్చువాడు.)
యజ్ఞ స్వరూపాన్ని 'కపీన్ద్రః' నామం నుండి ప్రస్తావిస్తూ, యజ్ఞాంగంగా ఈ నామాన్ని ప్రస్తావిస్తున్నారు. యజ్ఞము చేసే యజమాని దక్షిణలను ఇస్తాడు. ఆ యజమాని ఈశ్వర విభూతియేనని శాస్త్రవచనం.

విశ్వ యజ్ఞ నిర్వాహకుడైన విష్ణువే బహు దక్షిణలను ప్రసాదిస్తున్నవాడు. యజ్ఞాంగములు, యజ్ఞము, యజ్ఞకర్త కూడా పరబ్రహ్మ స్వరూపమేననే సమ్యగ్దర్శనాన్ని భగవద్గీత బోధిస్తోంది.

'బ్రహ్మార్పణం బ్రహ్మహవిః'
'బ్రహ్మాగ్నౌ వపరే యజ్ఞం యజ్ఞే నైవోపజుహ్వతి'. (గీత)

యజ్ఞ దక్షిణలన్నీ ఈశ్వరస్వరూపములే. అనంతుడు, బహుశక్తియుతుడు కనుక భూరిదక్షిణుడు.

2. **అశ్వమేధ శతైరిష్ట్వా తథా బహు సువర్ణకైః।**
గవాం కోట్యయుతం దత్వా బ్రహ్మలోకం గమిష్యతి ॥

(శ్రీరామాయణం. బాలకాండ)

'శ్రీరాముడు వందలాదిగా అశ్వమేధయాగములను చేసి, సువర్ణమును, కోట్లాది గోవులను దక్షిణలుగా ఇచ్చి బ్రహ్మలోకాన్ని (నిజధామాన్ని) ప్రవేశిస్తాడ'ని రామకథ. శ్రీకృష్ణాది ఇతర అవతారాలలో కూడా ఈ విధంగానే తన భూరి దక్షిణ స్వభావాన్ని కనబరచాడు.

3. **'భూసత్తాయామ్' 'దక్ష వృద్ధౌ శీఘ్రార్థే చ'** అనే ధాత్వర్థాల ననుసరించి – 'సృష్టిలో అన్నిటికీ వృద్ధి శక్తినీ, *శీఘ్రగతి* శక్తినీ అందించే చైతన్య స్వరూపుడు'.

'నాక్షస్తృప్యతే భూరి భారః' ***(ఋగ్వేదం)***

భూరిదక్షిణుడు, యజమానుడైన విష్ణువే, యజ్ఞద్రవ్యమైన సోమాన్ని పానము చేస్తున్నందున –

సోమపోఽమృతపః సోమః పురుజిత్పురుసత్తమః।
వినయో జయః సత్యసంధో దాశార్హః సాత్వతాంపతిః॥ 54

***503.** సోమపః, **504.** అమృతపః, **505.** సోమః, **506.** పురుజిత్,*
***507.** పురుసత్తమః **508.** వినయః, **509.** జయః. **510.** సత్యసన్ధః,*
***511.** దాశార్హః, **512.** సాత్వతాం పతిః ॥*

సోమపః.. 503

1. సోమమును పానము చేయువాడు.

'షుఞ్ అభిషవే' అనే ధాతువునకు 'మన్' ప్రత్యయం వలన ఏర్పడిన శబ్దం 'సోమః'. రసం, జలము –అని సోమశబ్దానికి అర్థాలు.

2. యజ్ఞమునందు సోమలత యొక్క రసాన్ని హవిస్సుగా వినియోగించి, యజ్ఞాంతంలో అవశిష్టమైన ఆ సోమాన్ని స్వీకరించే యజమానిని 'సోమపీథి' (సోమపః) అని వ్యవహరిస్తారు. యజ్ఞకర్తయందున్న యజమాన రూప చైతన్యాన్ని సైతము విష్ణు విభూతిగా భావించే నామమిది.

సర్వ యజ్ఞములలో 'యష్టవ్య'(ఆరాధింపబడు) దేవతారూపంతో సోమ పానము చేయువాడు విష్ణువు. యజ్ఞములో ఆరాధింపబడే సర్వదేవతలు విష్ణు విభూతులే.

3. జలములను తన కిరణాలతో పానం చేసే సూర్యుడే సోముడు. రసస్వీకరణ శక్తిగా సర్వులలో వ్యాపించిన చైతన్యమే విష్ణువు.

సోమో గౌరీ అధిశ్రితః (ఋగ్వేదం)

ఇక్కడ 'గౌరీ' అనే శబ్దం. (గో-కిరణములు) కిరణమాలి అయిన సూర్యుని తెలియజేస్తోందని వేదశబ్దవేత్తల మాట. అగ్ని స్వరూపునిగా యజ్ఞ ద్రవ్యమైన సోమాన్ని గ్రహించేది కూడా ఈతడే.

ఆత్మయే శరీరంలో సూర్యుడు. ఆ ఆత్మజ్ఞాన ప్రాప్తియే సోమపానం. దానిని పొందినవాడు ఆత్మయే. (బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి). అతడే సోమపుడు.

ఆ ఆత్మరూపానందమే అమృతము కనుక, ఆ అమృతరస పానము చేతనే-

అమృతపః.. 504

1. అమృతమును పానము చేయువాడు.

యజ్ఞ ఫలమే అమృతము. దానిని స్వీకరించువాడు అమృతపుడు.

'యస్య ఛాయామృతమ్' (ఋగ్వేదం)

నిత్యత్వమే అమృతం. అదే ఆత్మ యొక్క స్థితి. ఆ స్వాత్మ రసానందానుభవస్థితి సదా కలవాడు అమృతపుడు. 'స్వాత్మారాముడు'.

'ఆత్మారామః' 'యోగీశ్వరేశ్వరః' - అని శ్రీకృష్ణుని వర్ణించింది భాగవతం.

2. క్షీరసాగర మథన సమయంలో అసురుల చేతబడిన అమృతాన్ని రక్షించి తిరిగి గ్రహించి దేవతలచే త్రాగించి, తానునూ పానము చేసినవాడు.

3. **యత్కించిద్ధూయతే వహ్నౌ హవిర్మన్త్రై ర్విధానతః ।**
తత్సర్వమమృతం కృత్వా విష్ణవే సంప్రయచ్ఛతి ॥

మంత్ర విధానములచే అగ్ని యందు హుతము చేయబడినదంతా అమృతమే. అది విష్ణువునకు చేరుతున్నది. దానిని స్వీకరించువాడు నారాయణుడే 'అమృతపః'.

"భోక్తారం యజ్ఞతపసా"

"అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ" అని గీతావచనాలు.

4. **అమృతం పాయయతి - అమృతపః**

అమృతమును పొందించువాడు. బ్రహ్మానందానుభవమే అమృతము. 'తన అనుభవమనే' ఈ అమృతాన్ని భక్తులకు ప్రసాదించి పాలించువాడు.

'యత్ర దేవా అమృతమాన శానాస్తృతీయే
ధామన్యభ్యైరయన్త' అని యజుర్వేద వాక్యం.

'సఖల్వమృతోపమః' (రామాయణం)

అతడు అమృతము వంటివాడు కదా!

తనను చేర్చుకొనే సేతువు తానే అని శ్రుతి వాక్యం -

'అమృతస్యైష సేతుః'.

అమృత స్వీకర్త, దాత మాత్రమే కాక అమృతమే ఈతడు-

సోమః.. 505

1. చన్ద్ర స్వరూపుడు.

చన్ద్ర రూపంగా ఓషధులను పండించువాడు.

'పుష్ణామి చౌషధీస్సర్వా స్సోమోభూత్వారసాత్మకః' *(గీతావాక్యం).*

ఆపః సోమః, శశీ సోమః, మనః సోమోపి తద్వశాత్।

విష్ణుః సోమస్వరూపత్వాత్ సవై సోమ ఉదాహృతః॥

జలము, చంద్రుడు, మనస్సు – సోమ వాచకాలు.

జల, చంద్ర, మనోరూప చైతన్యాలుగా విస్తరించినవాడు.

"సోమ రారన్ధి నో హృది గావో నయవసేష్వా" *(ఋగ్వేదం)*

తద్వాయుస్తదు చన్ద్రమాः ॥ *(యజుర్వేదः)*

2. ఆనందమయుడు కనుక అమృత స్వరూపుడు.

'తృతీయ స్వామితో దివి సోమ ఆసీత్' *(యజుర్వేదం)*

సోమపదం అమృత బోధకం. **'రసోవైసః'** – అని శ్రుతి వాక్యం.

అమృతము వలె ఆస్వాదింపదగిన పరతత్త్వము ఇతడే.

"శాన్తి సమృద్ధమమృతమ్" (యజుర్వేదం)

'శాంతితో నిండిన అమృతము' పరమాత్మ.

"అమృత స్యైవ నాతృప్యన్ ప్రేక్షమణాः జనార్దనమ్"

– అమృతము వలె, దర్శించు వారికి తనివితీరనివాడు జనార్దనుడు.

"రాజ్ఞాం దశరథేనాపి లబ్ధో మృతమివామరైः"

దేవతలకు అమృతము వలె దశరథునకు రాముడు లభించాడని రామాయణ వాక్యం.

ఇలా రామాది అవతారములలో తన ఆనంద (అమృత) తత్త్వాన్ని ప్రదర్శించినవాడు.

3. ఉమతో ఉన్న *(స+ఉమ)* శివుడు నారాయణ స్వరూపుడేనని జగద్గురు భాష్యం.

'నమస్సోమాయ చ రుద్రాయ చ' అని శతరుద్రీయ మంత్రం.

'ఉమా శంకరయోర్యోగం సయోగో విష్ణురుచ్యతే' అని 'రుద్రహృదయోపనిషత్తు'! ఉమాశంకరుల సమన్వయమే విశ్వవ్యాపకమైన శివశక్తి. అదే విష్ణువు.

4. **జీవనీయం భవేత్ యత్తత్ సర్వం సోమ ఉచ్యతే।**

ఏతవానేవ సోమోర్థో లోకే వేదే వ్యవస్థితః॥ (సత్యదేవవాసిష్ఠ)

జీవింపజేసేదంతా సోమమే. సర్వులను జీవింపచేసే చైతన్యస్వరూపుడైన పరమేశ్వరుడే సోముడు.

మంగళమయమైన ఈ లక్షణం చేతనే, సర్వవిశ్వమును వశమందుంచుకున్న-

పురుజిత్.. 506

1. అనేకులను జయించువాడు.

'పురు' అనగా 'బహు'(అనేకము) అని అర్థం.

ఇక్కడ 'జయ' శబ్దం "వశంచేసుకొనుట" అనే భావంలో గ్రహించితే - లెక్కలేనన్ని గ్రహ తారకలతో నున్న ఖగోళాన్నీ, బహు వన నదీసముద్రాదులతో కూడిన భూగోళాన్ని, అసంఖ్యాకమైన విశ్వాన్నంతటినీ తన వశమునందుంచుకున్న పరమేశ్వరుడే విష్ణువు.

మన శరీరంలో అనేక ఇంద్రియాలను, ప్రాణశక్తులను, మనోవృత్తులను వశమునందుంచుకున్న ఆత్మ చైతన్యమే పురుజిత్.

2. *శ్రీరామాది అవతారాలలో తన వివిధ గుణాలతో అనేకులను వశపరుచుకున్న (జయించిన) వాడు విష్ణువు.*

సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః ।
గురూన్ శుశ్రూషయా వీరో ధనుషాయుధి శాత్రవాన్ ॥

"సత్యంతో లోకాన్ని, దానంతో దీనులను, శుశ్రూషతో గురువులను, ధనుస్సుతో యుద్ధంలో శత్రువులను" జయించినవాడు రాముడు.

(శ్రీమద్రామాయణం)

ఈ పరాక్రమ లక్షణం చేతనే సర్వోత్కృష్టుడైన -

పురుసత్తమః.. 507

1. విశ్వరూపుడైన ఉత్కృష్టుడు.

బహురూపములతో కూడిన విశ్వమే తానైన విశ్వరూపుడు, ఉత్కృష్టుడైన

(సర్వాధికుడైన) వాడు.

సత్తా (ఉనికి) కలిగిన వాటిలో కెల్లా శ్రేష్ఠుడు. ఉనికి కలిగిన బహు రూపములైన జగమునందంతటా వ్యాపించిన 'శాశ్వత సత్' స్వరూపుడు.

జగములు లయించినా తాను నశించని సత్తారూపుడు కనుక సత్తముడు. 'ఉనికి' లక్షణం చేత అంతటా ఉన్నవాడితడే.

2. అనేకులైన తన భక్తులలో(తో) కరుణతో అతిసన్నిహితుడై యున్నవాడు. "మహత్సు అస్తితమః" – 'మహాత్ములతో ఉన్నవాడు' అని పరాశరభట్టరు వ్యాఖ్య.

సర్వోత్కృష్టుడైన విశ్వరూపుడు విశ్వనియమ ప్రవర్తకుడై –

వినయః.. 508

1. విశేషంగా తీసుకువెళ్ళు (నడిపించు) వాడు. పొందించువాడు. దండించువాడు.

విశేషేణ నీయతే, ప్రాప్యతే – వినయః

వినయం దండం కరోతి – వినయః.

విశేషంగా విశ్వ వ్యవస్థాపన చేయువాడు.

దుష్టులను దండించువాడు.

వైవిధ్యముతో విశ్వమును బహువిధములుగా విభజించి నడుపువాడు.

స సంనయః స <u>వినయః</u> పురోహితః స సుష్టుతః

స యుధి బ్రహ్మణస్పతిః ॥ (ఋగ్వేదం).

2. **'వినీయన్తే అస్మాత్'** – విధేయులనుగా మార్చినవాడు వినయుడు. మారీచాదులను సైతం వధించకుండానే తన పరాక్రమంతో విధేయులనుగా మార్చిన వాడు. (పరాశరభట్టు)

ఈ విశ్వ నిర్వహణ శక్తితో సర్వమును తనకు లొంగదీసుకున్నవాడై –

జయః.. 509

1. సర్వ ప్రాణులను జయించినవాడు.

   అతిశయించుట, వశపరచుకొనుట - అని 'జయ'శబ్దానికి అర్థాలు. ఈ రెండు లక్షణాలు కలిగిన విష్ణువే జయుడు. సర్వమును మించినవాడు, తన అధీనమందుంచుకున్నవాడు.

   ..... **సర్వాః పృష్ఠే నినద్ధో జయతి ప్రసూతః ॥** (ఋగ్వేదం)

2. భక్తులచే వశపరచుకోబడువాడు.

   జేయతే విధేయీక్రియతే - జయః

   "అజ్ఞాప్యోహం తపస్వినాం" తపస్సుల చేత ఆజ్ఞాపింపబడినవాడను - అని శ్రీరాముని ప్రకటన.

   'తతో నారాయణో విష్ణుః నియుక్త స్సురసత్తమైః' -

   నారాయణుడు దేవతల చేత అవతార కార్యాలలో నియమింప బడినవాడు. జయలక్షణం కలవాడైన ఆయన సంకల్పాలు వ్యర్థం కానివి. కనుకనే-

సత్యసన్ధః.. 510

1. సత్యమైన సంకల్పము కలవాడు.

   సఫలమైన సంకల్పం కలవాడు. "సత్యసంకల్పః" అని శ్రుతి వాక్యం. ఆయన సంకల్పము ఏనాడూ వ్యర్థము కాదు.

2. 'సన్ధా' శబ్దానికి చక్కగా ధరించు (పోషించు)వాడు అని కూడా అర్థం.

   'సత్'- ప్రకృతి. సచ్చిదానంద రూపుడైన విష్ణువు ప్రకృతి ద్వారా (సత్యా) నిత్యమూ సకల విశ్వాన్ని ధరించి(పోషించి) యున్న కారణంగా సత్యసన్ధుడు.

3. సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు.

   "సత్యసన్ధో జితేన్ద్రియః" "ధర్మాత్మా సత్యసన్ధశ్చ" అని వాల్మీకి శ్రీరాముని స్తుతించాడు.

   అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! సలక్ష్మణామ్।

న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః।।

"ఓ సీతా ! నేను ప్రాణాలనైనా, నిన్నయినా, లక్ష్మణుని అయినా విడిచి పెడతాను కాని, బ్రహ్మవేత్తలకిచ్చిన ప్రతిజ్ఞా వాక్యాన్ని మాత్రం విడువలేను" అని శ్రీరాముని మాట. ఋషివాక్యాలైన వేదవచనాలను సత్యం చేయడమే పరమాత్ముని సత్యసన్ధత. ఇటువంటి మహా లక్షణాల వలన అందరిచే పూజింప బడుతున్నందున-

దాశార్హాః.. 511

1. *దానమునందుకొనుటకు అర్హుడు.*

'దాశః' - అంటే 'దానం' అని అర్థం. దానికి అర్హుడైన వాడు, అర్పించుటకు తగినవాడతడే.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి ద్దదాసియత్।
యత్తపస్యసి కౌన్తేయ! తత్కురుష్వ మదర్పణమ్।।

"అర్జునా ! ఏది చేస్తున్నావో, తింటున్నావో, ఆహుతిస్తున్నావో, దానం చేస్తున్నావో, తపస్సునాచరిస్తున్నావో దానిని నాకు అర్పణంగా చేయుమ"ని భగవానువాచ.

ఈశ్వరార్పణ చేయుటయే యజ్ఞం. యజ్ఞస్వరూపుడైన విష్ణువే అర్పణకు తగినవాడు.

స్వీకరించుటకు యోగ్యమైన పాత్రుడు, పూజార్హుడైన దైవము విష్ణువే. **'అహం దాశుషే వి భజామిభోజనమ్'** (ఋగ్వేదం)

2. *శరణువేడదగిన పూజ్యుడు శ్రీకృష్ణ రూపంగా "దాశార్హులు" అనబడే యాదవ వంశంలో జన్మించుట చేత దాశార్హుడు.*

ఆ వంశంలో ఉద్భవించుటయే కాక, తన శ్రేష్ఠతచే ప్రభువైనందున-

సాత్వతాం పతిః.. 512

1. సాత్వతులకు పతి.

యాదవ వంశరాజులకు 'సాత్వతులు' అని పురాణప్రసిద్ధి. ఆ వంశీయులకు నాయకుడు శ్రీకృష్ణుడు.

2. 'సత్' అనగా బ్రహ్మము. బ్రహ్మమును ధ్యానించువారు సత్వంతులు. వారి చేష్టయే (పద్ధతియే) సాత్వతము. దానిని అనుసరించు సాత్వతులను అనుగ్రహించు భగవానుడే 'సాత్వతాంపతిః'.

3. సాత్వత తంత్ర సంప్రదాయాన్ని అనుసరించేవారికి పతి – యోగక్షేమములను కలిగించే రక్షకుడు.

నిరాశీః కర్మ సంయుక్తాన్ సాత్వతాం శ్చాప్యకల్పయన్।
సాత్వత జ్ఞాన దృష్టోహం సాత్వతః సాత్వతీపతే॥

"ఫలాపేక్షలేక కర్మనాచరించు సత్వగుణ సంపన్నులను సృజించితిని. వారి (సాత్వతుల) జ్ఞానముచే గ్రహింపబడువాడను నేను" అని భగవానుని మాట (పాంచరాత్రాగమం).

యోగక్షేమములను నిర్వహించుతూ, జీవింపజేస్తున్నందున–

జీవో వినయితాసాక్షీ ముకుందోఽమితవిక్రమః।
అంభోనిధి రనంతాత్మా మహోదధిశయోఽంతకః॥ 55

513. *జీవః,* ***514.*** *వినయితా సాక్షీ,* ***515.*** *ముకున్దః,*
516 *అమిత విక్రమః,* ***517*** *అంభోనిధిః,* ***518.*** *అనన్తాత్మా,*
519. *మహోదధిశయః,* ***520.*** *అన్తకః.*

జీవః.. 513

1. ప్రాణములను ధరించువాడు.

'జీవ – ప్రాణధారణే' అను ధాతువు నుండి 'జీవ' శబ్దం ఏర్పడింది. దేహమున

ప్రాణములను నిలిపే క్షేత్రజ్ఞ (జీవ) రూపమున ఉన్నవాడు.

'జీవోజీవస్య జీవనం' అని పెద్దలమాట. జీవమే జీవానికి జీవం. ఓషధులు, పశు, తృణాదులన్నీ ప్రాణములను ఇచ్చునవి-దాల్చునవి. ఇలా ప్రాణధారణ కారణంగా సకలమునందున వ్యాపించిన భగవానుడే జీవుడు.

'సంజీవయత్యఖిల శక్తిధరః స్వధామ్నా' అని భాగవత వచనం. 'అఖిల శక్తిధరుడైన హరి తన ప్రకాశముతో దేహాదులను చక్కగా జీవింపజేస్తున్నాడు.'

ఇమం జీవేభ్యః పరిధిం దదామి॥ ఋగ్వేదం ॥

శతం జీవ శరదో వర్ధమానః ॥ఋగ్వేదం ॥

జీవేమ శరదః శతమ్ ॥ యజుర్వేదం ॥

క్షేత్రజ్ఞరూపునిగా హరి సర్వమును దర్శించువాడగుటచే-

వినయితా సాక్షీ.. 514

1. *గతిని కలిగించుచూ సర్వమును దర్శించువాడు.*

సర్వజగతికి గతిని కలిగించువాడు వినయితా. విద్యుచ్ఛక్తి తనశక్తితో యంత్రానికి 'గతిని కలిగించునట్లు'గా (కదిలించునట్లుగా) విశ్వాన్ని నడుపువాడు. అనగా 'సంచాలకుడు'. ఈ కదలికను కలిగిస్తూ సర్వమును దర్శించే చైతన్య స్వరూపుడు - 'వినయితాసాక్షీ'

'ఏష హితో వినీయతేన్తః

శుభ్రావతా యథా ॥ ఋగ్వేదం ॥

ఆ దేవోయాతి భువనాని పశ్యన్ ॥ఋగ్వేదం॥

2. **వినయతి విశేషేణ గచ్ఛతి దేహాత్ దేహాంతరమితి.**

విశేషంగా దేహం నుండి దేహానికి మారే జీవుడు 'వినయితా'. దేనికీ అంటకుండా నిర్వికారంగా ఉన్న పరమాత్మ 'సాక్షి'. దేహాంతర వ్యాపక భావంతో జీవాత్మగా వ్యవహరింపబడేవాడు, సాక్షీస్థితిలో పరమాత్మయే. ఈ ఏకత్వాన్ని చేప్పే నామమే 'వినయితాసాక్షీ'.

'అసాక్షీ' – అని విభజించితే –ఆత్మతత్త్వము కానిదానిని సాక్షాత్తుగా (నేరుగా) చూడదు.

3. 'వినయం' అనగా 'శిష్ట ప్రవర్తన'. ఆ ధర్మమే వినయితా. జీవులలోని ఈ వినయధర్మాన్ని, వారి హృదయంలో అంతర్యామిగా ఉండి స్వయంగా ఎల్లవేళలా చూసేవాడు వినయితాసాక్షీ.
4. **'ణయగతౌ రక్షణే చ'** – విశేషంగా భక్తులను రక్షించే కరుణాస్వరూపుడు – వారి నడవడిని యోగక్షేమములను నిత్యము గమనించువాడు –

ఈ సాక్షిత్వము చేతనే యోగులకు మోక్షమునిస్తున్నందున–

ముకున్దః.. 515

1. ముక్తినిచ్చువాడు.

ముక్తిం దదాతీతి ముకున్దః.

అజ్ఞానము నుండి విడుదల కలిగించువాడు. కర్మ బంధము నుండి విడుదల కల్పించి, స్వస్థితిని అందించువాడు.

ఉర్వారుకమివబంధనాత్ మృత్యోర్ముక్షీయ మాఽమృతాత్॥ *(యజుర్వేదం)*

ఏ ఒక్కరూ ఇవ్వలేని మోక్షాన్ని అనుగ్రహించగలడు కనుక హరిని మించిన శక్తిశాలి లేనందున –

అమితవిక్రమః.. 516

1. హద్దులేని విక్రమము కలవాడు.

'క్రముం పాదవిక్షేపే' అను ధాత్వర్థాన్ని అనుసరించి, హద్దులేని విధంగా, విశేషంగా అడుగులుంచినవాడు – అని భావం.

త్రివిక్రమునిగా త్రిలోకాలలో అడుగులతో వ్యాపించినవాడు.

'విక్రమ' శబ్దానికి చలనం, శక్తి, వ్యాపకత్వం–అని అర్థాలున్నాయి. అపరిమితంగా వ్యాపించి తన శక్తిని నింపి, చలింపజేసేవాడు 'అమిత విక్రముడు'.

న పాతం చ విక్రమణం చ విష్ణోః ॥ (ఋగ్వేదం)

పురాం భిన్దుర్యువా కవిరమితౌజా అజాయత ॥ (ఋగ్వేదం)

అమితంగా వ్యాపించుట చేతనే ఈతడే అనంత ఆధారశక్తి కనుక –

అంభోనిధిః.. 517

1. *జలములను తనయందు కలవాడు.*

'అంభస్సు' – అనగా జలము. ఈ జలములు సర్వభూతాంతర్యామి అయిన పరమాత్మ చేతనే విశ్వమంతటా వ్యవస్థ చేయబడుతున్నాయి. జలములందుండి వ్యవస్థపరచువాడు. అంతరిక్షము, సముద్రము కూడా ఈ శబ్దము ద్వారా తెలియబడుతున్నాయి.

'సరసామస్మి సాగరః' – అనే గీతాచార్యుని వాక్యానుసారం – జలములందు 'సాగరము' నారాయణ విభూతియే.

అపాం రేతాంసి జిన్వతి ॥ (ఋగ్వేదం)

అంభో అమోమహాఃసహాఃఇతి త్వోపాస్మహేవయమ్॥ (అథర్వవేదం)

2. 'అంభః' అనే శబ్దానికి వేదశాస్త్రానుసారం 'దేవ,మనుష్య, పితరులు, అసురులు' అని అర్థం.

తాని వా ఏతాని చత్వార్యంభాంసి

దేవాఃమనుష్యాఃపితరోఽసురాఃll

– అని శ్రుతివాక్యం. "దేవతలు, మనుష్యులు, పితరులు, అసురులు ఈ నాలుగు –'అంభః' అనే శబ్దం ద్వారా చెప్పబడేవారు". వీరందరికీ ఆధారమైనవాడు 'అంభోనిధి'.

3. *అంభసి నిధేయతే* – జలమునందున్నవాడు.

సాగరశయనునిగా, మత్స్యముగా, కూర్మముగా జలమునందు ఉన్నవాడు.

'అనన్తబలశక్తయే భువనభృతే కచ్ఛపాత్మనే' – అని కూర్మరూపుడైన హరిని మంత్రవర్ణం వర్ణించింది.

సర్వకాలములందు సర్వమునకు ఆధారమైన – అనడంలోనే ఈతని అనంతత్వం తెలుస్తున్నందున–

4. *అంభసినిధీయతే – జలమునందున్నవాడు, సాగరశయనునిగా, మత్స్యముగా, కూర్మముగా జలమునందు ఉన్నవాడు.*

'అనన్తబలశక్తయే భువనభృతే కచ్ఛపాత్మనే' – అని కూర్మరూపుడైన హరిని మంత్రవర్ణం వర్ణించింది.

అనన్తాత్మా.. 518

1. *అన్తములేని స్వరూపములు కలవాడు.*

దేశ కాల వస్తు పరిమితులు కలది అంతం. సమాప్తమయ్యేది అంతము. ఈ అంతములేని అపరిమితుడు అనంతుడు. అటువంటి అనంతుడైన స్వరూపుడు కునుక 'అనంతాత్మా'!

2. 'అనప్రాణనే' అనే ధాతువుననుసరించి – 'అనన్తుడు' అనే మాటకు 'ప్రాణకుడు' (రక్షకుడు) అని అర్థం. 'రక్షించు స్వరూపము కలవాడు' – అనన్తాత్మా. స్వామి స్వరూపము, స్వభావము జగద్రక్షణయే.

రక్షితా పాయురదబ్ధః స్వస్తయే ॥యజుర్వేదం॥

అన్నీ అంతమైనా తాను మాత్రమే మిగిలే అనన్తుడు కనుక–

మహోదధిశయః.. 519

1. *గొప్ప సముద్రమునందున్నవాడు.*

సర్వభూతాలను సంహరించి జగతిని ఏకార్ణవంగా చేసి ఆ మహా సముద్రాన్ని ఆశ్రయించి శయనించువాడు. శేతే శయనించుట, నిద్రించుట, ఉండుట అని అర్థములు. ప్రళయకాలంలో యోగనిద్రాగతుడైన విష్ణువు.

2. మహోదధి – శబ్దానికి వేదపరంగా అంతరిక్షం, సముద్రం అని అర్థాలు. 'అర్ణవం' వంటి సముద్రార్థాన్నిచ్చే మాటలని అంతరిక్షపరంగా కూడ వేదం

సంస్కృత గ్రంథాలయ
A.C. No. 1787

పలికింది. పృథ్వి నుండి జలములు ఆవిరులై అంతరిక్షంలో చేరుతున్నాయి. ఆకాశం జలనిధియై వర్షిస్తోంది. అంతరిక్షంలోని జలానికీ, భూమియందు నీటికీ ఆధారమైనవాడు.

అగ్నిం సముద్రవాస సమ్ । (ఋగ్వేదం)

పరిప్రాసిష్యదత్ కవిః సింధోరూర్మావధి శ్రితః ॥ (సామవేదం)

మహోదధిలోనున్న తేజః స్వరూపుడీతడే.

ఈ ప్రళయార్ణవ శయనునిగా అన్నిటినీ తనయందు చేర్చుకున్నందున-

అంతకః.. 520

1. *(ప్రాణులను) అంతమొందించువాడు.*

పూర్తిచేసే చైతన్యమే ఈతడు.

'సంయోగా విప్రయోగాన్తాః' - అని సిద్ధాంతం.

ప్రతి కలయికా చివరికి విడిపోవడంతోనే పూర్తవుతుంది. ప్రాణదేహాదుల సంయోజనమే జీవితం. అది విడిపోవడమే మరణం (అంతం). విశ్వంలో కలిపి, విడదీసే చైతన్యంగా వ్యాపించిన పరమేశ్వరుడే అన్తకుడు.

యమాయ స్వాహాఽన్తకాయ స్వాహా మృత్యవేస్వాహా ॥యజుర్వేదం॥

2. 'అనన్తాత్మా' నుండి ఈ నామం వరకు సంకర్షణరూపుడైన ఆదిశేషుని నామములుగా శ్రీపరాశరభట్టరు భావన.

అన్తే పృథ్వ్యాం సలిలే దృశ్యసే త్వం మహోరగే।

"ప్రళయంలో పృథ్వి అంతా నశించగా జలమందు ఆదిశేషుడై శయనించు వాడవు నీవు" అని రామాయణంలో దేవతలు శ్రీరాముని స్తుతించారు.

"ఆస్తే పాతాళమూలస్థః శేషో శేషసురార్చిత" అంటూ విష్ణుపురాణం - భగవంతుని ఆదిశేష రూపాన్ని వర్ణించింది.

యస్యైసా సకలాపృథ్వీ ఫణామణి శిఖారుణా।
ఆస్తే కుసుమ మాలేవ కస్తద్వీర్యం వదిష్యతి"

గన్ధర్వాప్సరసః సిద్ధాః సకిన్నర మహోరగాః।
నాన్తం గుణానాం గచ్ఛన్తి తేనా నన్తోయముచ్యతే।।
తస్యవీర్యం ప్రభావం చ స్వరూపం రూపమేవ చ।
న హి వర్ణయితుం శక్యం జ్ఞాతుం వా త్రిదశైరపి।।
కల్పాన్తే యస్య వక్త్రేభ్యో విషానల శిఖోజ్వలః।
సంకర్షణాత్మకో రుద్రో నిష్క్రమ్యాత్తి జగత్త్రయమ్।।

"ఏ శేషుని శిరస్సులపై ఈ పృథ్వి పూలమాలవలె, పడగల మణుల కాంతులతో ప్రకాశిస్తున్నదో, ఆ అనన్తుని వీరత్వాన్ని ఎవరు చెప్పగలరు? ఆ అనన్తుని అనేక గుణాలను వర్ణించడంలో గన్ధర్వాదులు కూడా అశక్తులే. ఆ అనన్తుని బలం, ప్రభావం, స్వభావం, రూపం దేవతలు కూడా తెలుసుకొన లేరు. కల్పాన్తకాలంలో తన విషజ్వాలల ముఖాలతో సంకర్షణాత్మకుడైన రుద్రుడు ముల్లోకాలను భక్షిస్తున్నాడు". ఈ శ్లోకాలన్నీ అన్తకుడైన ఆదిశేషుని తెలియజేస్తున్నాయి.

అన్నిటినీ అంతం చేసే ఆయనకు అంతము, ఆది లేవు కనుక-

అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః।
ఆనన్దో నన్దనో నన్దః సత్యధర్మా త్రివిక్రమః।। 56

521.అజః, 522.మహార్హః, 523.స్వాభావ్యః, 524.జితామిత్రః,
525.ప్రమోదనః। 526.ఆనన్దః, 527.నన్దనః, 528.నన్దః,
529.సత్యధర్మా, 530.త్రివిక్రమః ।।

అజః.. 521

1. కలుగని వాడు.

దేని నుండీ కలుగక, స్వతఃసిద్ధమైన పరమాత్మ.
తన స్వరూపము నుండి మారనివాడు.

అజ ఏక పాద్దేవః ॥ (ఋగ్వేదం)

2. **'అ ఇతి బ్రహ్మా'** - అని శాస్త్రోక్తి.

'అ' శబ్దం బ్రహ్మవాచకం. దాని నుండి ఉద్భవించినది 'అజ'ము. ప్రాకృత వికారసమూహం. ఆ సమూహరూపమైన మహద్బ్రహ్మయే అజుడు.

తతో విరాడజాయత విరాజో అధిపురుషః । (యజుర్వేదం)

విశ్వాన్యర్యో భువానా జజాన ॥ (ఋగ్వేదం)

3. *'అ' కారము ద్వారా తెలియబడువాడు.*

ప్రణవము (అ-ఉ-మ్) లోని ప్రథమాక్షరముచే వాచ్యుడైన పరమాత్మ నారాయణుడే. అన్ని అక్షరములకు మూలము, ఆది 'అ'. **'అక్షరాణాం అకారోస్మి'**- అని గీతాచార్యుని పలుకు.

ఆ 'అ' కారం ద్వారా కలుగు (తెలియబడు) వాడు.

4. *'అ' (విష్ణువు) నుండి జన్మించిన కాముడు.*

'కామోస్మిభరతర్షభ!' అని శ్రీకృష్ణుని మాట.

విష్ణు విభూతియైన కాముడు ఈ నామము ద్వారా వాచ్యుడు.

ఆదియైన ఈతనినే సర్వులూ ఆరాధిస్తున్నందున-

మహార్హః.. 522

1. *పూజకు తగినవాడు.*

'మహ పూజాయామ్' అనే ధాతువు ననుసరించి మహ+అర్హ్. పూజించుటకు అర్హుడు.

శ్రుతులన్నీ సర్వవిధ పూజలకు ఈతడే తగినవాడని పేర్కొన్నాయి.

"నమ ఉక్తిం తే విధేమ" (యజుర్వేదం)

బ్రహ్మణే త్వామ హసే ఓమిత్యాత్మానం యుఞ్జీత ॥ (యజుర్వేదం).

"పరబ్రహ్మ! తేజోరూపుడవైన నీకు ప్రణవపూర్వకంగా నన్ను సమర్పిస్తున్నాను (అనుసంధానిస్తున్నాను).

ఆత్మనివేదనయే పూజ. దానికి అర్హుడైన పరమాత్మయే మహార్హుడు.

ఈ అర్హత ననుసరించియే రాజసూయయాగ సందర్భంలో ధర్మరాజాదులు శ్రీకృష్ణుని పూజించి ధన్యులయ్యారు.

'పూజాదిష్వనురాగ ఇతి పారాశర్యః' (నారదభక్తిసూత్రాలు)

పూజలలో అనురాగమే భక్తి- అని పరాశరతనయుడైన వ్యాసుని ఉద్దేశం. ఈ పూజ్యతకు తగిన అర్హతలలో ప్రధానమైనది - ఆ పరమేశ్వరుని సర్వ వ్యాపకత.

స్వాభావ్యః.. 523

1. తనంత తానుగా అంతటా ఉన్నవాడు.

'స్వేన - ఆత్మనా, ఆ - సర్వతః, భావ్యం - భవనమస్యాస్తి' (సత్యభాష్యం).

స్వభావసిద్ధంగా అన్నిటా 'సత్తా' (ఉనికి) కలిగినవాడు. ఆయన కలుగుటకు ఏదీ హేతువు కాదు. తనకు తానే కారణమై, తన మహిమతో తాను వ్యాపించినవాడు.

స్వేన -స్వభావేన అభావ్యః - స్వాభావ్యః.

శాశ్వతమయిన స్వయంప్రకాశ చిద్రూపము ఈతడే (స్వభావము) కనుక, ఇతరములచే కలుగువాడు కాడు.

2. **స్వామిత్వేన అవశ్యం భావనీయత్వాత్ స్వాభావ్యః** (పరాశరభట్టరు)

తన వారిచే (యోగులచే) తమకు స్వామి అనే అనుకూలభావంతో అవశ్యముగా భావింపబడువాడు. (స్వైః అభావ్యతే).

స్వోజ్జీవనేచ్ఛయతితే స్వసత్తాయాం స్పృహాయది।
ఆత్మదాస్యం హరేః స్వామ్యం స్వభావంచ సదాస్మర॥

"నీకు ఉజ్జీవనేచ్ఛ (ఉన్నతస్థితిలో నుండు కోరిక) ఉన్నట్లయితే, ఆత్మనాశం పొందకుండా బాగుపడాలనే స్పృహ ఉంటే-

శ్రీమహావిష్ణువునే 'స్వామి' (స్వంతమైనవాడు) అని ఎరిగి, ఈ 'స్వస్వామి'

సంబంధాన్ని స్వాభావికమని, నిత్యం తలచుకోవాల"ని భాగవతుల బోధ.

తనకు తానే కలిగిన పరాక్రమం చేతనే -

జితామిత్రః.. 524

1. *మిత్రులు కానివారలను (శత్రువులను) జయించువాడు.*

విశ్వనియమోల్లంఘన చేసే అధర్మపరులే, ధర్మరక్షకుడైన హరికి అమిత్రులు. విశ్వక్షేమానికై వారిని జయించువాడు. హిరణ్యాక్ష హిరణ్యకశిపు రావణ కుంభకర్ణ శిశుపాలాది లోకకంటకులను గెలిచిన పరాక్రమశాలి.

అంతశ్శత్రువులైన రాగద్వేషాదులను జయించిన నిర్మలుడు విష్ణువు.

"నమే ద్వేష్యోస్తి నప్రియః" అని చెప్పినట్లుగా అమిత్రములైన రాగద్వేషాదులు లేని హరి జితామిత్రుడు. **'సమోహం సర్వభూతేషు'** - అని గీతాచార్యునిగా చెప్పిన విష్ణువు అజ్ఞానజనితమైన రజోగుణ వికారం లేనివాడు.

ద్యుమాం అమిత్ర దంభనః। (ఋగ్వేదం)

అమిత్ర సేనామభి భంజమానో ద్యుమద్ వద దుందుభే సూనృతావమ్। (అథర్వవేదం)

తం తమింద్ర మర్త్యామ మిత్రయన్తమద్రివః।। (ఋగ్వేదం)

దుఃఖకారకులైన శత్రువులను జయించి లోకానికి సుఖాన్ని సమకూర్చువాడు కనుకనే--

ప్రమోదనః.. 527

1. *హర్షమును కలిగించువాడు.*

"ముదహర్షే" అని ధాత్వర్థం. విశ్వమంతా వ్యాపింపజేసిన తన విభూతులతో సర్వజీవులను హర్షింపజేయువాడు. సూర్య చంద్రాదులు, సస్య నదీ పర్వతాదులు, జీవుల ఇంద్రియచైతన్యం, ఆత్మతత్త్వం.... అన్నీ ఆనందరూపములే-ఆనందదాయకములే. ఇన్ని రూపాలుగా వ్యాపించిన హర్షప్రదాత,

భక్తులను తన ధ్యాన, స్మరణాదులచే ఆనందింపజేసి, కైవల్యానందాన్ని సమకూర్చువాడు.

2. హర్షమును పొందువాడు.

తన ఆత్మతత్త్వమనే రసాస్వాదన వలన నిత్యము ప్రమోదించువాడు. సచ్చిదానందమయమైన తన ఆత్మయందు తానున్న పరిపూర్ణుడు.

తన ఆనందస్థితియే తానైన వాడు కనుకనే-

ఆనందః.. 526

1. ఆనంద స్వరూపుడు.

పరిపూర్ణుడని తెలియజేసే నామమిది.

'ఏతస్యై వానంద స్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి"

(బృహదారణ్యకోపనిషత్)

"ఈ పరమాత్మస్వరూపమైన ఆనంద మాత్రను (లేశమును) ఆశ్రయించియే జీవులన్నీ జీవిస్తున్నాయి."

ఆనందాదేవ ఖల్విమాని భూతానిజాయంతే...

ఆనందో బ్రహ్మ...(తైత్తిరీయోపనిషత్తు-ఆనందవల్లి)

మిత్ర ఈక్షణ ఆవృత్త ఆనన్దః (అథర్వవేదం)

తైత్తిరీయోషనిషత్తులోని ఆనంద వల్లి - వాఙ్మనసాతీతమైన ఆనందమునే పరమముగా ప్రతిపాదించింది.

మానుషానందము కంటె నూరురెట్లధికమైనది పితృదేవానందము, దానికి మించి ఒకదాని కంటె ఒకటి నూరురెట్లు అధికమై కర్మదేవ, గంధర్వ, ఇంద్ర, బృహస్పతి, బ్రహ్మాదుల ఆనందాలు పెరిగి ఉన్నాయి. ఆ చతుర్ముఖ బ్రహ్మానందం కంటె నూరురెట్లు అధికమైనది పరమాత్మానందము. ఆతడే విష్ణువు.

ఈ ఆనందముచేత జగతిని వృద్ధి చెందించు (జీవింపజేయు) చున్నందున-.

నన్దనః.. 527

1. వృద్ధి చెందించువాడు.

'టునాది సమృద్ధౌ' అను ధాత్వర్థాన్ని అనుసరించి – 'నందనం' అనే శబ్దానికి 'సమర్ధనం' 'సంవర్ధనం' అని అర్థాలు శాస్త్రసిద్ధాలు.

2. జగతిని ఆనందింపజేయువాడు. తన అవతార విశేషములచే కౌసల్యా, యశోదాదులకు ఉపాసకులకు ఆనందప్రదాత.

ఆనన్ద నన్దావాన్ద్రౌ మే భగః సౌభాగ్యం పసః। (యజుర్వేదం)

సిద్ధావస్థలో జ్ఞానిపొందే స్థిరానందము పరమాత్ముని అనుగ్రహమే కనుక మోక్షదాయకుడైన ఆ స్వామి నందనుడు.

వృద్ధి కలిగించే సర్వసమృద్ధులు కల పరిపూర్ణుడు కనుకనే–

నన్దః.. 528

1. అన్ని విధములైన సమృద్ధికలవాడు.

అన్ని విధములైన సిద్ధులతో నిండియున్న ఈయన వలననే ఈ విశ్వం సమృద్ధి చెందుతున్నది (నందతి సమృద్ధం భవతి).

2. దీని పై నామానితో దీనిని 'నన్దనోఽనన్దః' 'నన్దనః–అనన్దః' అని విసంధి చేయవచ్చు. నన్దనః – ఆనందింపజేయువాడు. కానీ తాను 'అనన్దుడు'. లోకాలకు సుఖాలనిచ్చే స్వామి – ఆ లౌకిక సుఖాలకు పరిమితుడు కాదు. లోక విషయములను (శబ్దాదులను) అనుభవించడం వల్ల కలిగే సుఖము ఎవనికి లేదో అతడు 'అనన్దుడు'. పరిమితమైన సుఖములు లేనివాడు. ఈ అపరిమితానంద స్వరూపాన్ని ఛాందోగ్యం ఇలా చెబుతోంది.

'యోవై భూమా తత్సుఖం – నాల్పే సుఖమస్తి'.

'ఏది పూర్ణమో అదే సుఖస్వరూపము. అల్పమైనదాని యందు సుఖములేదు. ఈ అల్ప సుఖాతీతుడైన పూర్ణుడే నన్దుడు.

లౌకికానందాలను మొదలుకొని, ఆత్మానందము వరకు సర్వానందములు

పరమాత్ముని స్వరూపాలే. సర్వలోకగతమైనవి ఆనందాంశములు మాత్రమే. పరమాత్మ అఖండ పరిపూర్ణ సుఖరస స్వరూపుడు. ఆ సముద్రము వంటి ఆనందము నుండియే బిందువుల వంటి జీవులలో ఆనందప్రకాశం లభిస్తుంది. సర్వవ్యాపకానంద చైతన్యాన్ని 'ప్రమోదనః' నామం నుండి 'నందః' నామం వరకు విస్తరింపజేశారు. ఈ నామాల వరుసలో 'లౌకిక-పరమ' ఆనందాల విస్తృతి నిండివుంది.

పూర్ణమైన తన ఉనికి చేతనే ఈ విశ్వాన్ని ధరిస్తున్నందున-

సత్యధర్మా.. 529

1. సత్యము, ధర్మము కలవాడు.

శాశ్వతమైన ఉనికియే సత్యము. ధరించునది ధర్మము. శాశ్వతముగా విశ్వమును ధరించే శాశ్వతుడు.

2. జ్ఞానాదులే సత్యములు. ఇవియే ధర్మములుగా కలవాడు.

సత్యమే (శాశ్వత అస్తిత్వమే) పరమాత్ముని తత్త్వము. దానియందు ఆధారమై ఉన్నది ఈ విశ్వం.

'త్రిపంచాశః క్రీడతి వ్రాత ఏషాం దేవ ఇవ సవితాసత్యధర్మా। (ఋగ్వేదం)

సత్యం బ్రహ్మా। (శతపథ బ్రాహ్మణము)

సత్యమేవ దేవాః - అనృతం మనుష్యాః।। (శతపథ బ్రాహ్మణము)

సత్యసంహితావై దేవాః। అనృతసంహితామనుష్యాః ।। (ఐతరేయ బ్రాహ్మణము)

విశ్వాధారాలైన భగవద్ధర్మాలే సత్య ధర్మములు. వీటిచేతనే ముజ్జగాలను నిర్వహిస్తున్నందున-

త్రివిక్రమః.. 530

1. మూడు విధములుగా విక్రమించు (వ్యాపించు) వాడు.

   మూడు లోకములలో వ్యాపించిన మూడు పాదన్యాసములు కలవాడు.

   పాదన్యాసము = అడుగువేయుట.

   'త్రీణి పదా విచక్రమే' – 'మూడడుగులతో విక్రమించినవాడ'ని శ్రుతి వాక్యం.

   త్రిరిత్యేవ త్రయోలోకాः కీర్తితా మునిసత్తమైः।

   క్రమతే తాంస్త్రిధా సర్వాం స్త్రివిక్రమ ఇతి శ్రుతఃి।(హరివంశం)

   "త్రి – అనగా ముల్లోకాలని మునులు కీర్తిస్తున్నారు. వాటిని మూడు విధములుగా (విశేషంగా) క్రమించువాడు (వ్యాపించువాడు) కనుక త్రివిక్రముడని ప్రసిద్ధి".

2. ఇదే విధంగా **"త్రిరిత్యేవ త్రయోవేదాः"** అనే ప్రమాణాన్ని అనుసరించి –ఋగ్యజుస్సామాత్మక వేదత్రయమునందు వ్యాపించిన వేదవేద్యుడైన విష్ణువు త్రివిక్రముడు. **'నారాయణపరాः వేదాः'** అనే భాగవతవాక్యం, **"సర్వేవేదాः యత్రైకం భవన్తి"** అనే యజుర్వేదవాక్యం ఈ విషయాన్నే స్పష్టపరుస్తున్నాయి. ఈ జగమంతా మూడు విధములుగా ఉన్నది. ముల్లోకాలు, మూడుకాలాలు, మూడుగుణాలు, మూడుక్రియలు(సృష్టి స్థితి లయలు), మూడువేదాలు, మూడగ్నులు (గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు), మూడుమూర్తులు, మూడు సంధ్యలు, అకార ఉకార మకారాత్మక ప్రణవం, త్రిపదాగాయత్రి, స్థూల సూక్ష్మ కారణశరీరాలు, జాగ్రత్ స్వప్న సుషుప్తులు – ఇలా విశ్వమంతా త్రయాత్మకం. కాలం కూడా నాలుగేసి మాసముల చొప్పున మూడుగా అయిన వత్సరాత్మకం. రాశిచక్రం కూడా చతుర్వర్గములతో మూడుగా అయినది. నవ సంఖ్య పూర్ణమైనది. అది కూడా మూడు యొక్క మూడురెట్లు. ఇలా మూడింటితో కూడిన ఈ విశ్వమంతా వ్యాపించి (క్రమించి), మూడింటినీ అతి'క్రమించిన' వాడు. – త్రివిక్రముడు.

   ఈ విధముగా వ్యాపించి దర్శించు సర్వద్రష్ట కనుక–

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః।
త్రిపద స్త్రిదశాఽధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్॥ 57

531. మహర్షిః కపిలాచార్యః, *532.* కృతజ్ఞః, *533.* మేదినీపతిః।
534. త్రిపదః, *535.* త్రిదశాధ్యక్షః, *536.* మహాశృంగః,
537. కృతాంతకృత్।

మహర్షిః కపిలాచార్యః.. 531

1. గొప్ప ద్రష్ట అయిన కపిలాచార్యుడు.

'ఋషిర్దర్శనాత్' (నిరుక్తం) దర్శనము చేత ఋషి.

'ఋషయో మన్త్రద్రష్టారః' -వేద మంత్ర ద్రష్టలయిన వారు ఋషులు.

అతీన్ద్రియమైన దర్శనశక్తి చేత వేదములను భాసింపజేసుకున్నవారు ఋషులు. ఋషులలో గొప్పవాడు మహర్షి. ఇతర ఋషులు వేదములందు అల్పాంశములను దర్శించినవారు. భగవానుడు సర్వవేదములను దర్శించి - దర్శింపజేసినవాడు. అంతేకాదు-సకల కాల, కర్మ, విశ్వసాక్షి(ద్రష్ట). ఆ కారణమున మహర్షి.

'విశ్వాధిపో రుద్రో మహర్షిః' (శ్వేతాశ్వతరోపనిషత్తు)

తస్మాద్యజ్ఞాత్సర్వహుత ఋచః సామాని జజ్ఞిరే।
ఛన్దాంసి జజ్ఞిరే తస్మాద్య జుస్తస్మాదజాయత॥ (యజుర్వేదం)

- వంటి శ్రుతి వాక్యాలు వేదమూలుడైన నారాయణుని కీర్తించాయి.

2. ఈ నారాయణుడే విజ్ఞానద్రష్ట అయిన కపిలాచార్యునిగా అవతరించాడు.

"శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్యమిత్యభిధీయతే" - శుద్ధమైన ఆత్మతత్త్వ విజ్ఞానమే సాంఖ్యము. **సమ్యక్ ఖ్యాతం** - చక్కగా చెప్పబడినది- సాంఖ్యం.

చతుర్వింశతి తత్త్వాత్మకంగా ప్రకృతిని సంఖ్యలతో విభజించి, తదతీతమైన పరమాత్మను ప్రతిపాదించిన శాస్త్రమది. ఆ సాంఖ్యవిజ్ఞానానికి ఆచార్యుడు కపిలుడు.

'ఋషిం ప్రసూతం కపిలమ్' (శ్వేతాశ్వతరోపనిషత్తు)

'సిద్ధానాం కపిలో మునిః' (భగవద్గీత)

'ఋషిరూపునిగా జన్మించిన కపిలుని' – అని శ్రుతివాక్యం, 'సిద్ధులలో కపిలుడను నేను' అనే స్మృతి వాక్యం దీనికి ప్రమాణాలు.

'శ్రుతే ఋగాద్యాః వక్త్రేభ్యః ప్రోద్గిరన్తం అతఃస్మరేత్॥

– అనే కపిలుని ధ్యానశ్లోకం, **సాంఖ్యస్య వక్తా కపిలః పరమర్షిస్స ఉచ్యతే॥** అనే స్మృతివాక్యం భగవానుని మహర్షిత్వాన్నీ, కపిలావతారాన్ని స్పష్టం చేస్తున్నాయి.

3. జ్ఞాన (దర్శన)స్వరూపుడై, కాంతిమయుడై, విశ్వమును నడుపువాడు.

ఋషి యనగా దర్శనశక్తి, జ్ఞానము కలవాడు.

'కముకాన్తౌ' 'కవృవర్ణే'.... వంటి ధాత్వర్థాల ననుసరించి' – **'కవేఃపశ్చ'** అనే సూత్రాన్ని అనుసరించి కపిలుడు– అంటే కాంతితో కూడినవాడు అని అర్థం. పసుపు, తెలుపు కలిసిన ప్రకాశపూర్వకవర్ణం 'కపిలవర్ణం'. ఇది సూర్యకాంతి విశేషం.

దర్శనశక్తిమంతుడైన సూర్యుడే 'మహర్షి'. కాంతిమయుడు కనుక 'కపిలుడు'. ఆచరతి– చక్కగా చరించువాడు. (చరగతిభక్షణయోః ..... అనే ధాతువు ప్రకారంగా) గగనాన కాంతికిరణాలుగా చరించుతూ, గ్రహాదులను చరింప జేస్తున్న 'ఆచార్యుడు' సూర్యుడు. ఆదిత్యరూపుడైన నారాయణుడు. జలమును పానము చేయువాడు, కలిగించువాడు 'కపిలుడు' అని కూడా అర్థాన్ని భావించవచ్చు.

సూర్యతేజునిగా గోచరించే విష్ణువుని తెలియజేస్తున్న నామమిది.

4. మనలో ఆత్మరూపునిగా సర్వమును సాక్షిగా దర్శించుచూ (మహర్షిః), చిత్ ప్రకాశస్వరూపుడై (కపిలః), మనలను నడిపించువాడు (ఆచార్యుడు).

ఈ సర్వదర్శన శక్తి చేతనే సర్వజగతిని తెలుసుకుంటున్నవాడు.

కృతజ్ఞః.. 532

1. చేసినది తెలుసుకొను(తెలిసిన)వాడు.

కృతం – అనగా చేయబడినది. భగవానుడు చేసిన కార్యరూపమైన విశ్వమే కృతం. కారణరూపమైన జ్ఞానస్వరూపుడు జగతికి (కృతమునకు) ఆత్మ.

'కృతము'– ఆతడే, 'జ్ఞః' –ఆతడే.

ఆత్మకృత్ పరిణామాత్.

'స్వయముగా కార్యముగా(జగద్రూపముగా) పరిణమించినవాడు– అని బ్రహ్మ సూత్రం.

'తదాత్మాన స్వయమకురుత' – తననే జగద్రూపంగా వ్యక్తపరచినవాడు అని ఉపనిషద్వాక్యం.

కార్యరూపమైన జగత్తు తానే– ఆత్మయు తానే. విశ్వములో ప్రతివారి కృతమును తెలుసుకొను సర్వసాక్షి.

కృతాని యా చ కర్త్వా। (ఋగ్వేదం)
ఇన్ద్రే విశ్వాని వీర్యా కృతాని కర్త్వాని చ।।
యమర్క్యా అధ్వరం విదుఃII (ఋగ్వేదం)

–అని శ్రుతివాక్యాలు కృతజ్ఞుని ప్రతిపాదిస్తున్నాయి.

ఆత్మకృతేఃపరిణామాత్– 'స్వయముగా కార్యముగా, జగద్రూపముగా పరిణమించినవాడు– అనే బ్రహ్మసూత్రం. **'తదాత్మనా స్వయ మకురుత'** – తననే జగద్రూపంగా వ్యక్తపరచినవాడు అని ఉపనిషద్వాక్యం.

మేదినీపతిః.. 533

1. భూమికి ప్రభువు.

సముద్రజలంతో అంతరిక్ష జలంతో స్నిగ్ధమై (తడిసినదై) జీవులను కాపాడునది ('ణిమిదా స్నేహనే' అనే ధాతువుననుసరించి) మేదిని. అనగా భూమి. ఈ భూమిని పాలించే జగదీశుడు నారాయణుడు.

'తమ ఆసీత్తమసా గూఢమగ్రే ప్రకేతం సలిలం సర్వమా ఇదమ్' అని 'ఋగ్వేదం' – జలసంభూతమైన పృథివి, కల్పాంతంలో జలముచే విస్తీర్ణమవుతున్నదని వర్ణించింది.

యస్యేయం వసుధా సర్వా వాసుదేవస్య ధీమతః।

కాపిలం రూపమాస్థాయ ధారయత్యనిశం ధరామ్।। (వాల్మీకి రామాయణం)

'కాంతి స్వరూపుడై పాతాళమునందుండి ఈ వసుధనంతటినీ ధరించువాడు వాసుదేవుడే!

2. రక్త శుక్రాది ద్రవరూపాలతో పోషింపబడుతున్న శరీరమే మేదిని. దీనికి పతియైన ఆత్మయే మేదినీపతి. పై 'కృతజ్ఞః' నామంతో ఇది అనుసంధేయం.

ఇహో యన్తు ప్రచేతసే మేదినీర్వచసోమమ।

యథేమం పారయామని పురుషం దురితాదధి।। (అథర్వవేదం,)

భూమిని మొదలుకొని సర్వలోకములకు పతియైనవాడు కనుక –

త్రిపదః.. 534

1. మూడు అడుగులు కలవాడు.

మూడడుగులతో ముజ్జగాలను కొలిచిన త్రివిక్రముడీతడు.

"త్రీణిపదా విచక్రమే" – మూడు అడుగులతో ముల్లోకాలను విక్రమించిన పరమాత్మను శ్రుతి వర్ణించింది.

2. ప్రధానం, పురుషుడు, పరము... అని 'ప్రకృతి – పురుష – ఈశ్వర' అనే మూడు తత్త్వములను తెలియజేసిన కపిలమునిని ఈ జ్ఞానత్రయ స్వరూపునిగా పరాశర భట్టరు భావించారు.

సత్త్వానాం ఉపకారాయ ప్రధానం పురుషం పరమ్।

దర్శయిష్యామి లోకేషు కాపిలం రూపమాస్థితః।।

3. మూడు స్థానములు కలవాడితడు.

'పదం' అనే శబ్దానికి గమనం, పాదం, స్థానం, జ్ఞానం... అని అర్థాలున్నాయి.

భూర్భువ స్వర్లోకాలు, అ-ఉ-మ లతో కూడిన ప్రణవం, మూడు కాలాలు... ఇలా సర్వము త్రయాత్మకం. ఈ మూడింటితో కూడిన విశ్వమే తన స్థానముగా కలవాడు త్రిపదుడు.

అ-ఉ-మ లతో కూడిన ప్రణవము చేత తెలియబడువాడు (ప్రద్యతే జ్ఞాయతే), ప్రణవస్వరూపుడు.

4. **త్రికకుదో వారాహం రూపమాస్థితః.** (పరాశరభట్టు)

ఎత్తైన మూడు (ककుదములు) మూపురములు కల వరాహస్వామి త్రిపదుడు.

'త్రిప్రతిష్ఠితే' (అథర్వవేదం), త్రిబంధు, త్రిర్బర్హిషి, త్రిభుజం, త్రిమాతా, త్రిమూర్ధానమ్, త్రియుగం, త్రివృత్, త్రిశీర్షాణమ్ - అంటూ ఋగ్వేదం పలు చోట్ల పేర్కొన్నది.

త్రిదశాధ్యక్షః.. 535

1. *మూడు దశలలో అధివసించి వ్యాపించువాడు.*

'అక్షూ వ్యాప్తౌ' అనే ధాతువుననుసరించి 'అక్షః' వ్యాపకతని తెలియజేసే శబ్దం. 'అధి' వసించి వ్యాపించిన విష్ణువు అధ్యక్షుడు. గత (త్రిపద) నామాలలో చెప్ప బడిన త్రయాత్మకమైన జగతియందు అధిష్ఠించి వ్యాపించినవాడు.

2. *జీవుల జాగ్రత్ స్వప్న సుషుప్తులకు అధ్యక్షుడు.*

సత్త్వ రజస్తమస్సుల ఆవేశంచే కలిగే మూడు దశలకు పైన తానుండి, వాటిని చూచువాడు. ఏ చైతన్యం చేత మూడు అవస్థలు (త్రిదశలు) కలుగు తున్నాయో ఆ చైతన్యమే వాటికి అతీతమై నిర్వకారంగా భాసిస్తున్నది.

3. *దేవతలకు నాయకుడు.*

కేవల బాల్య కౌమార యౌవనాలనే మూడు దశలు మాత్రమే కల దేవతలు 'త్రిదశు'లు. వార్ధక్యం, మరణం - అనే మిగిలిన రెండవస్థలు లేనివారు. అంతేకాదు ఎల్లవేళలా ముప్పది (త్రిదశ) ఏళ్లవయస్సున్నవారివలె కనిపించు నిత్యయౌవనులు దేవతలు. వారందరికీ ఆధారమై పాలించుచూ రక్షించువాడు.

ఈ రక్షణలో భాగంగానే సర్వమును ధరించు ఆధారరూపుడైనందున -

మహాశృంగః.. 536

1. గొప్ప 'శృంగము' కలవాడు.

'శృంగము' అనే మాటకు 'హింసించునది' అని అర్థం. కొనదేలిన కోర, కొమ్ము, శిఖరం... అనే అర్థాలు దీనికి ప్రసిద్ధం.

తన కోరతో భూమినెత్తిన ఆది వరాహస్వామి. ఆ దంష్ట్ర లోకోన్నతమైనది కనుక అతడు మహాశృంగుడు.

'ఏక శృఙ్గో వరాహస్త్వమ్' అని రామాయణవచనం.

దంష్ట్రాగ్ర విన్యస్త మశేషమేతత్
భూమండలం నాథ విభావ్యతేతే।
విగాహతః పద్మ వనం విలగ్నం
సరోజినీ పత్ర మివోఢ పఙ్కమ్॥

- అని దంష్ట్రలపై భూమిని ధరించిన వరాహమూర్తిని విష్ణు పురాణం వర్ణించింది. ఈ నామం నుండి కొన్ని నామాలు వరాహావతారాన్ని చెబుతున్నట్లుగా శ్రీపరాశర భట్టరు దర్శనం.

మత్స్యావతారంలో తన కొమ్మున కట్టిన నావ యందు మహా సముద్రంలో మనువులను మహర్షులను కాపాడిన గొప్ప శృంగము కలవాడు.

2. శృంగం - అనే శబ్దానికి సూర్య చన్ద్రులనే అర్థాన్ని వేదం తెలియజేస్తోంది. పృథ్వికిపైన (ఉన్నత స్థానాన) సూర్య చన్ద్రులుగా భాసిస్తూ తన ప్రకాశాదులతో జగతికి ఆధారమైనవాడు. 'కాంతులే కొమ్ములుగా కోరలుగా కల సూర్యనారాయణుని భావించవచ్చు.

'తిగ్మ శృంగః' (ఋగ్వేదం)

శృంగాభ్యాం రక్ష ఋషత్యవర్తి హన్తి చక్షుషా' (ఋగ్వేదం)

శబ్ద బ్రహ్మ స్వరూపునిగా, యజ్ఞ స్వరూపునిగా **'చత్వారి శృంగాస్త్రయో అస్య పాదాః....'** అని ఋగ్వేదం పేర్కొన్నది.

3. గొప్ప శిఖర స్థానమందున్నవాడు - గొప్ప శిఖరమైనవాడు.

మూడుదశలకు, లోకాలకు, కాలాలకు పాలకుడై (త్రిపదః, త్రిదశాధ్యక్షః) ఉండడమేకాక, వాటికి అతీతంగా మహోన్నత స్థితికి చెందినవాడు. తురీయ భూమిక అయిన సమాధియందు లభ్యుడయే పరమాత్మ.

త్రయాత్మిక జగతిని నడిపే ఈ మహోన్నతుడు, సమయాన సమయింప జేస్తున్నవాడు కనుక,

కృతాన్తకృత్.. 537

1. చేసిన దానిని అంతము చేయువాడు.

తాను చేసిన జగము కృతం. దానిని నశింపజేయువాడు. కార్యమైన దానిని క్రమంగా తిరిగి కారణంలో లయింప జేయువాడు.

అనన్తం వితతం పురుత్రా నన్తమన్తవచ్చా సమన్తే।

– అని అథర్వశ్రుతి వివరిస్తోంది.

2. అన్తముచేయుదానిని ఛేదించువాడు.

కృతాంతం మృత్యుం కృంతతి. మృత్యువును (అశాశ్వతత్వాన్ని) ఛేదించువాడు. అనగా మోక్షప్రదాత.

ధర్మాదులను అంతము చేయాలని ప్రయత్నించువారిని వరాహాది అవతారములెత్తి సంహరించువాడు కనుకనే –

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ।
గుహ్యో గభీరో గహనో గుప్త శ్చక్రగదాధరః॥ 58

538. మహావరాహः,	*539.* గోవిందः,	*540.* సుషేణः,
541. కనకాంగదీ,	*542.* గుహ్యः,	*543.* గభీరः,
544. గహనः,	*545.* గుప్తः,	*546.* చక్రగదాధరः.

మహావరాహः.. 538

1. గొప్ప వరాహ రూపము ధరించినవాడు.

సృష్ట్యాదియందు మహార్ణవంలో మగ్నమైన భూమిని ఉద్ధరించిన యజ్ఞ వరాహస్వామి. ఈ స్వామి మహిమను పురాణేతిహాసాలు బహుధా కీర్తించాయి.

తతస్సముక్షిప్య ధరాం స్వదంష్ట్రయా
మహావరాహః స్ఫుట పద్మలోచనః।
రసాతలాదుత్పల పత్రసన్నిభః
సముత్థితోనీల ఇవాచలోమహాన్ ॥ (విష్ణుపురాణం)

నల్లకలువవంటి దేహకాంతి కల వరాహమూర్తి పృథ్విని రసాతలం నుండి తన కోరతో ధరించి తిరిగి పైకి వచ్చాడు. ఆ స్వరూపము గొప్ప నీల పర్వతమువలె ఉన్నదని 'మహావరాహ' శబ్దాన్ని పురాణం చెబుతోంది. శ్రీరాముని కీర్తిస్తూ రామాయణంలో, శ్రీకృష్ణుని గురించి మహాభారతంలో 'వరాహ స్వరూపంగా'నే ప్రధానంగా పేర్కొన్నారు.

2. మహత్తుల చేత వరింపబడువాడు *(శ్రేష్ఠమైన తత్త్వమని తెలియబడువాడు)* ఆ *శ్రేష్ఠతతో గమించువాడు (వ్యాపించువాడు).*

'హన హింసాగత్యోః' అనే ధాతువుననుసరించి – హింసించుట, గమనము చేయుట అనే లక్షణములను 'అహ' అనే శబ్దం తెలియజేస్తోంది. గొప్పదైన, కోరదగిన గమనముతోపాటు అంధకారాదులను హింసించే తేజఃస్వరూపుడైన ఆదిత్యుని వేదం 'వరాహ' రూపునిగా భావించింది.

మహివ్రతః శుచిబన్ధుః పావకః
పదావరాహో అభ్యేతి రేభన్॥ (ఋగ్వేదం)
షడక్షం త్రిశీర్షాణమ్ విప్రా వరాహమ్ ॥ (ఋగ్వేదం)

తన మహత్త్వము చేత, శ్రేష్ఠత చేత తాను ఉదయించిన నుండి అస్తమించు వరకు స్వప్రకాశంతో ఇతరుల తేజస్సులను అధఃకరించే ఆదిత్యస్వరూపుడైన నారాయణుడు.

3. **మహాన్తి అవరాణి చ వ్యాప్నోతి – మహావరాహః.** (సత్యభాష్యం)

పరమునందు, అపరమునందు వ్యాపించినవాడు.

(అహ-వ్యాప్తౌ... అనే ఛాందస (వైదిక) ధాతువు)

ఈ వరాహరూపుడై భూమిని ఉద్ధరించడం చేత-

గోవిన్దః.. 539

1. *భూమిని పొందినవాడు.*

"నష్టాంచ ధరణీం పూర్వం అనిన్దఞ్చ గుహాంగతామ్,
గోవిన్ద ఇతి తే నాహం..." (మహా భారతం - శాంతి పర్వం)

జలగర్భంలో రహస్యంగా ఉన్న భూమిని తెలుసుకొని, తిరిగి సముద్ధరించి దానిని పొందిన వరాహమూర్తి.

2. *గోవులచే తెలియబడువాడు.*

గోవులనగా వేదవాక్యములు. వేదముల చేత ప్రతిపాదింపబడువాడు.

'గోభిరేవ యతోవేద్యో గోవిన్దస్సముదాహృతః' (విష్ణుతిలకం)

3. *గమనధర్మము కలవి గోవులు. వాటిని పొందిన (వాటియందు వ్యాపించిన) సర్వజ్ఞుడు, వాటి ద్వారా తెలియబడే పరతత్త్వం గోవిన్దుడు.*

గోశబ్దం ద్వారా జగతి, సూర్యకాంతి, భూమి, ఇన్ద్రియాలు, వేదవాక్యాలు తెలియజేయబడుతున్నాయి. వాటి యందున్న చైతన్యస్వరూపుడు గోవిన్దుడు. **'ఆయం గౌః'** అని సూర్యపరంగా ఋగ్వేదం తెలియజేసింది.

కదిలే వాటిని బట్టి కదిలించే వానిని తెలుసుకోగలం.

ఇన్ద్రియాలు, మనస్సు చలనధర్మం కలవి. వాటి చలనం వలన వాటికి ఆధారమైన ఆత్మను గ్రహించగలం. అలాగే సూర్యాదులకు, జగతికి మూలమైన చైతన్యం ఈశ్వరుడేనని తెలుసుకోగలం. ఇలా గ్రహింపబడే పరమాత్మయే గోవిన్దుడు.

తన నుండి వెలువడిన జగతిని తానే నడిపించడం చేత -

సుషేణః.. 540

1. చక్కని సేనలు కలవాడు.

శోభనకరమైన, మంగళకరమైన పార్షదగణములను సేనలుగా కల విష్ణువు.

సుష్ఠు సమ్యగ్వా సినోతి బధ్నాతీతి సుషేణః (సత్య భాష్యం)

చక్కగా విశ్వాన్ని వ్యవస్థతో నిబద్ధం చేసి నడిపిస్తున్న భగవానుడు.

అయముపర్యర్వాగ్వసుస్తస్య సేనజిచ్చ

సుషేణశ్చ సేనానీ గ్రామణ్యౌ । (యజుర్వేదం)

ఋతజిచ్చ సత్యజిచ్చ సేనజిచ్చ సుషేణశ్చ॥ (యజుర్వేదం)

ఈ విధంగా విశ్వాన్ని నడుపుతూ దీనికి వెలుగును, కదలికను ప్రసాదిస్తున్న-

కనకాంగదీ.. 541

1. ప్రకాశమును, గతినీ ఇచ్చువాడు.

కనతి ప్రకాశతే ఇతి కనకః. ప్రకాశించునది కనకము. **అంగతి గచ్ఛతి ఇతి అంగః.** కదలిక గలది అంగః.

ప్రపంచానికి ప్రకాశాన్నీ, కదలికనీ (చైతన్యాన్ని) ప్రసాదించే పరమాత్ముడు కనకాంగదీ.

సూర్యనారాయణునిగా ఈ నామ వాచ్యుడు.

హిరణ్యయేన సవితా రథే నా దేవో యాతి భువనాని పశ్యన్॥ (యజుర్వేదం)

సాధ్వర్యా అతిధినీరిషిరాः స్పార్హా సువర్ణా అనవద్యరూపాः ॥ (ఋగ్వేదం)

సర్వజీవులకు చక్షురాది ఇంద్రియ దీప్తినీ, చైతన్యాన్నీ ప్రసాదించే ఆత్మయే కనకాంగదీ.

2. స్వామి దివ్యవిగ్రహం సువర్ణముతో చేయబడిన భుజాభరణాలతో అలంకరింపబడినది.

ఇక్కడ భుజాభరణములను ఉపలక్షణంగా (సూచనగా) గ్రహించి సర్వాభరణ భూషితుడనే అర్థాన్ని స్వీకరించాలి.

చైతన్యాన్నిచ్చే అంతర్యామి కనుకనే -

గుహ్యః.. 542

1. హృదయాకాశమున ఉన్నవాడు.

పరం పుమాంసం నిహితం గుహాయాం - అని ఉపనిషత్తు.

ఏకో దేవ సర్వభూతేషు గూఢః అని ఉపనిషత్తుక్తి. హృదయగుహలో - రహస్యంగా - ఉన్నవాడు. **తదంతరస్య సర్వస్య.**

2. రహస్యమైన ఉపనిషద్వచనములచే వేద్యుడు.

గూఢంగా అంతటా ఉన్నవాడు కనుకనే అంతుపట్టని వాడై -

గభీరః 543

1. లోతైనవాడు - లోతుగా ఉన్నవాడు.

చాలా లోతైన జ్ఞాన ఐశ్వర్య బల వీర్యాది ఉత్తమ లక్షణాలతో గంభీరమైన వాడు. అగాధ శక్తిమంతుడు. అంతుపట్టని మహా మహిమ చేత గంభీరుడు (గభీరుడు).

2. చరాచరము నందు ప్రతిష్ఠితుడైనాడు.

గాధ్యతే ప్రతిష్ఠ విషయో భవతీతి గభీరః (సత్య భాష్యం)

కిమావరీవః కుహకశ్చ శర్మన్నహ్నః కిమాసీద్ గహనం గభీరమ్। (ఋగ్వేదం)

పై వేదమంత్రంలోని 'గహన, గభీరాల' క్రమాన్ని పరిశీలిస్తే ఈ నామాల కూర్పులోని వైదిక భావనలు తెలిసి వస్తాయి. ఆ గూఢమైన గభీరతత్త్వం సర్వులకు తేలికగా సాక్షాత్కరించదు కనుకనే -

గహనః.. 544

1. తేలికగా ప్రవేశించుటకు వీలుకాని వాడు.

భగవత్తత్త్వము స్థూలదృష్టి కలవారికి అవగతం కానిది.

'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్' (ఉపనిషద్వాక్యం)

'ఏ ఒక్క ధీరుడో ప్రత్యగాత్మను చూడగలడు'.

ప్రత్యగాత్మ రూపుడుగా తురీయ స్థితియందున్న పరతత్త్వము సులభ సాధ్యము కాదు.

జాగ్రత్ స్వప్న సుషుప్తులనే మూడు దశలకు, వాటికి అతీతంగా సాక్షిగానూ ఉన్నవాడు - కనుక ఈతని పూర్ణతత్త్వము తెలుసుకొనుట తేలికకాదు.

దూరే చత్తాయ చ్ఛత్తన్ద్ గహనం యదినక్షత్।। (యజుర్వేదం)

ఏష సర్వేషు భూతేషు గూఢోఽత్మా నప్రకాశతే। (కఠోపనిషత్తు)

'ఈ ఆత్మ సర్వభూతాలలోనూ ఉన్న రహస్యతత్త్వం కనుక అనుభవగోచరము కాదు'.

2. **'గాహూ విలోడనే'** అనే ధాతువుననుసరించి, **'విలోడయితా మన్థితా గహనః'** - జగత్తున వ్యాపించి మథించు- (పరిణమింపజేయు) వాడు.

అంతుపట్టని (గభీరః) తత్త్వము తానై, తేలికగా లభించకుండా తనను తాను దాచుకొనుట చేత-

గుప్తః.. 545

1. *దాచబడినవాడు.*

ఇంద్రియాదులకు, స్థూల జ్ఞానానికి లభించకుండా హృదయ గుహలో తనను తాను దాచుకున్నవాడు. యోగుల హృదయాలలో భద్రంగా భాసించే తత్త్వరూపుడు. మాటకీ, మనసుకీ కూడా అగోచరుడు.

రత్నమును పదిలపరచినట్లుగా, యోగులు ఈయనను తమ మదిలో భద్రపరచుకుంటున్నారు. ఆ పరతత్త్వ జ్ఞానాన్ని భద్రంగా రక్షించుకుంటున్నారు.

2. *రక్షించువాడు.*

విశ్వమును రక్షించుటచే (**విశ్వం గోపయతీతి గుప్తః**) గుప్తుడు.

ఇన్ద్రేణ గుప్తో విదథా నిచిక్యద్ ధృద్ద్యోతనో

ద్విషతాం యాహి శీభమ్।। (అథర్వవేదం)

'గుహ్య' శబ్దము నుండి 'గుప్తః' శబ్దం వరకు రహస్యమైన అవ్యక్త తత్త్వమితడని చెప్పబడింది. ఆ అవ్యక్తమే జగద్రక్షణకై వ్యక్తమైన దివ్యాకృతి కలదై -

చక్ర గదాధరః.. 546

1. చక్రమును, గదను ధరించినవాడు.

మనస్తత్త్వాత్మకం చక్రం బుద్ధి తత్త్వాత్మికాం గదామ్।
ధారయన్ లోక రక్షార్థ ముక్తశ్చక్రగదాధరః।।

– అనే పురాణోక్తి ననుసరించి – సంకల్ప వికల్పాత్మకమై మనస్తత్వమే చక్రం, నిశ్చయాత్మకమైన బుద్ధి తత్త్వమే గద. లోక రక్షకై వీటిని ధరించిన ఆత్మ చైతన్యరూపుడే చక్ర గదాధరుడు.

2. **'చక్యతే క్రియతే యేన చక్రం', 'గదవ్యక్తయాంవాచి'** (సత్యభాష్యం).

విశ్వము దేనితో చేయబడినదో అది చక్రం. ఆ శక్తిని ధరించిన స్వామి చక్రధరుడు.

సూర్యుడు, భువనములు, కాలము – నిరంతరం ఆవృతమయ్యే లక్షణంచేత చక్రములు. వీటిని నడుపువాడు చక్రధరుడు.

'గదా' అనగా వాక్కు. వేద స్వరూపములైన వాక్కులను తానై దాల్చినవాడు గదాధరుడు. విశ్వక్రియలకీ, శబ్దములకు ఆధారమైన హరి.

తమసః పరమోధాతా శంఖ చక్రగదాధరః।। (రామాయణం)

చీకటి కావల ప్రకాశించే సృష్టి కర్త శంఖ చక్ర గదాధరుడు. ఇలా విశ్వశక్తిని ధరించి నిర్వహిస్తున్నందుననే –

వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః।
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః।। 59

547. వేధాః,	**548.** స్వాంగః,	**549.**అజితః,
550. కృష్ణః,	**551.**దృఢః,	**552.** సంకర్షణోఽచ్యుతః।
553. వరుణః	**554.** వారుణః,	**555.** వృక్షః
556. పుష్కరాక్షః,	**557.** మహామనాః।	

వేధాః.. 547

1. *(లోకములను) నిర్మించి నిర్వహించువాడు.*

'వి' ఉపసర్గతో **'డు ధాఞ్ ధారణ పోషణయోః'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి 'విశేషముగా ధరించి పోషించువాడు' అని అర్థం.

"విధ విధానే", సృష్టి విధాన కర్త - వేధాః.

ఈ సృష్టి విధాన నిర్మాణంలో తన శక్తులనే ఉపకరణాలుగా కలిగిన వాడు కనుక -

స్వాంగః.. 548

1. *విశ్వ కృత్యములలో తనకు తానే సహకారి.*

'స్వం స్వయమేవ అంగం - కార్యకరణే సహకారి యస్య' (శంకర భాష్యం)

ఇక్కడ 'అంగః' అనేది 'సహకారము' అనే అర్థంలో స్వీకృత్యం.

2. *తన సృష్టియందు చరించువాడు.*

"అగి గతౌ" అనే ధాత్వర్థాన్ననుసరించి గమనమును కలిగినది 'అంగం'.

స్వ - అంగః తనదైన - తాను రచించిన సృష్టిలో వ్యాపించి చరించే చైతన్య స్వరూపుడు.

3. *తనయందు అధిష్ఠించిన గమనశక్తి కలవాడు.*

చైతన్యానికి ఆయనే ఆధారం. శరీరంలో ఆత్మ చైతన్యమే ఇంద్రియాలను కదిలిస్తున్నది. ఆ చైతన్యం లేనప్పుడు ఇంద్రియాలను కదిలించుట **(అంగయితుం చాలయితుం)** ఎవరికీ సాధ్యం కాదు. శరీరంలో ఆత్మవలె ఈ జగమంతా తానే వ్యాపించి కదిలిస్తున్నందున 'స్వాంగుడు'.

స్థిరేభిరంగైః పురురూప ఉగ్రో బభ్రుః

శుక్రేభిః పిపిశే హిరణ్యైః॥ (ఋగ్వేదం) - అని వేదం వినుతించింది.

తన కిరణాది శక్తులందున్న గమన లక్షణంచేతనే జగతిని కదిలిస్తున్న సూర్య స్వరూప నారాయణుని కూడా ఈ నామం ద్వారా భావించవచ్చు.

ఈ అనంత చైతన్య శక్తియైన తనను ఏ ఒక్కరూ అధిగమించలేరు కనుకనే -

అజితః.. 549

1. జయింప బడనివాడు.

'జయం' అంటే 'ఆధిక్యం'. శ్రీహరిని మించిన అధికత దేనికీ లేదు. కనుక అతడు అజితుడు. సర్వాధికుడు. తన అవతారములన్నిటిలోనూ ఏ ఒక్కరి చేత ఓటమి లేనివాడు. ఆయనతో సమానంగా లెక్కించ దగిన వారెవరూ లేరు.

'న ద్వితీయో నతృతీయ శ్చతుర్థోన' - అని అథర్వవేదం.

ఈ అజిత లక్షణం చేతనే అన్నిటినీ పట్టి నియమిస్తున్నందున -

కృష్ణః.. 550

1. *(ఆ)* కర్షించువాడు.

విశ్వాన్ని తనలోనికి లాగుకొను కాల స్వరూపుడు. తన రక్షణ శక్తితో ప్రతిదానినీ 'లాగి' (నియమించి) నడిపించువాడు.

ఆకృష్ణేన రజసా వర్తమానో నివేశయన్।। (యజుర్వేదం)

ద్యావా పృథివీ వరుణస్య ధర్మణా విష్ణుతే అజరే

భూరిరేతసా।। (యజుర్వేదం)

"సంకోచింపజేయుట - వ్యాకోచింపజేయుట" - ఈ రెండు శక్తులను 'కర్షణ బృంహణములు' అంటారు. విశ్వాన్ని తనయందు లయింపజేసుకొని, తిరిగి వ్యాప్తి చేయువాడు - కృష్ణుడు. **'చికిత్సితం కర్షణ బృంహణాఖ్యం'** - అని 'శార్ఙ్గధరసంహిత'.

2. నల్లని శరీరము గలవాడు.

నీలమేఘ శ్యామ వర్ణంతో భాసించువాడే కాక -

వరాహాది అవతారములందు మేదినిని తన కోరతో పట్టి నిలిపినవాడు. భూమిని చీల్చే శక్తి తానై ఉన్నవాడు.

కృషామి మేదినీ పార్థ! భూత్వా కృష్ణాయసోమహాన్।

కృష్ణో వర్ణశ్చ మే యస్మాత్ తేన కృష్ణోహమర్జున।।

– అని భారతం శాంతిపర్వంలో శ్రీకృష్ణుడు స్వయంగా చెప్పిన మాట.

3. వేదవ్యాస స్వరూపుడు.

"వ్యాసో నారాయణోహరిః" – జగతికి జ్ఞానజ్యోతిని ప్రసాదించిన విష్ణుని ఆచార్యావతారం వ్యాసుడు. ఈయన పేరు 'కృష్ణుడు'. ద్వీపంలో ఉద్భవించినందున 'ద్వైపాయనుడు'. వేదాలను వ్యాసం చేసినందున వేదవ్యాసుడు.

కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం ప్రభుమ్।
కోహ్యన్యః పుండరీకాక్షాత్ మహాభారతకృత్ భవేత్।।

"కృష్ణ ద్వైపాయనుడనే వ్యాసుడు ప్రభువైన నారాయణుడే. విష్ణువు కానివాడు వేరెవడు మహాభారతాన్ని రచించగలడు?" అని విష్ణుపురాణ వచనం.

తన (ఆ) కర్షణ శక్తి చేతనే జగతిని గట్టిగా పట్టి నిలుపుతున్నవాడే –

ధృఢః.. 551

1. బలమైనవాడు, స్థూలమైనవాడు.

జగన్నిర్వహణ అంతా ఆయన బలము చేతనే జరుగుతున్నది. పట్టుసడలని బలమది. అవతారాది లీలలలో కూడా తన స్వరూప సామర్థ్యాల నుండి చెదరనివాడు మహా విశ్వశరీరుడైన స్థూలుడు.

విశ్వంలో ప్రతి వస్తువునందున్న బలమే దానిని నియమిస్తున్నది. తన శక్తి చేతనే సముద్రం చెలియలి కట్టను దాటడంలేదు. రాయి తన బలంచేతనే గట్టిగా ఉన్నది. ఇలా విశ్వమంతా బలస్వరూపుడై వ్యాపించి నియమించువాడు శ్రీహరి.

ధృఢో నక్షత్ర ఉత విశ్వదేవో
భూమి మాతాన్ ద్యాం ధాసినాయోः (ఋగ్వేదం)
యేన ద్యౌరుగ్రా పృథివీ చ ధృఢా
యేన స్వ స్తభితం యేన నాకः।
యే అన్తరిక్షే రజసో విమానः

కస్మై దేవాయ హవిషా విధేమ॥ (యజుర్వేదం)

ఈ బలం చేతనే సమగ్రంగా జగతిని పట్టి, తాను సడలకుండా, తాను ధరించిన వాటిని జారనీయకుండా నడిపిస్తున్నందున –

సంకర్షణోఽచ్యుతః.. 552

1. *(విశ్వాన్ని) తనలోనికి చక్కగా ఆకర్షించువాడై, తన స్వస్థితి నుండి జారనివాడు.*

సంకర్షణః – అచ్యుతః.

ప్రళయకాలంలో సర్వమును తనలోనికి లయం చేసుకొనువాడు. (తన కార్యమును పూర్తి చేసుకొనువాడు). అయినప్పటికీ తాను దేనికీ అంటని మోహరహితుడు. తన స్వరూపమైన సచ్చిదానంద స్థితి నుండి సడలనివాడు.

స పర్వతో న ధరుణోష్వచ్యుతః
సహస్రమూతిస్త విషీషు వావృధే॥ (ఋగ్వేదం)

మేదినీపతిః (533) నుండి ఈ 'సంకర్షణోఽచ్యుత' నామం (552) వరకు పరిశీలిస్తే వరాహావతార విశేషం స్పష్టంగా గోచరిస్తుంది.

భూమికి ప్రభువైనందున (మేదినీపతిః) దానిని రక్షించుటకై వరాహావతారాన్ని ధరించాడు. మూడు మూపురములతో (త్రిపదః), దేవతలకు అధికమై (త్రిదశాధ్యక్షః), గొప్ప కోరతో (మహాశృఙ్గః) ఆవిర్భవించి, ధర్మ నాశకుడైన హిరణ్యాక్షుని సంహరించిన (కృతాన్తకృత్) మహా వరాహమిది.

భూమిని తెలుసుకొని, రక్షించి (గోవిందః), ప్రకాశవంతమైన యజ్ఞ, వేదాంగములతో భాసించి (కనకాంగదీ), సముద్రగర్భంలో రహస్యంగా దాగి (గుహ్యః), లోతునకు చేరి (గభీరః), ఇతరులకు కానరాకుండా (గహనః) లోతున ఇమిడి పుడమిని కాపాడి (గుప్తః), తిరిగి చక్ర గదా ఆయుధాలతో సాక్షాత్కరించి (చక్ర గదాధరః), సృష్టి విధానమును ఏర్పరచి (వేధాః), తన సహకారంతోనే పృథ్విని నిలిపి (స్వాఙ్గః), దనుజులందరినీ ప్రతాపంచే జయించి(అజితః) – దేవాధికుడై (అజితః) తేజరిల్లాడు.

'జితం జితంతే జితయజ్ఞ భావన' అని భాగవతంలో వరాహస్వామిని స్తుతించారు. ఈ అజితుడు భూమిని తన శక్తితో లాగి పట్టి నిలిపి *(కృష్ణః)*, తన బలంతో *(దృఢః)*, చక్కగా వ్యవస్థీకరించి *(సంకర్షణః)*, తాను సడలకుండా, తాను ధరించిన జగతిని తన పట్టు నుండి జారనీయకుండా (అచ్యుతః) కాపాడినవాడు.

❖ ❖ ❖

– ఇలా ఈ నామాల క్రమంలో సూటిగా, తేటగా వరాహావతార లీల అంతా స్మరించబడుతోంది.

ఈ అచ్యుత లక్షణంతో అంతటినీ ఆవరించువాడై–

వరుణః.. 553

1. కప్పివేయువాడు.

వృణోతి సర్వం ఆవృణోతి – అన్నిటినీ అంతటినీ తన వ్యాపక చైతన్యముతో నింపినవాడు.

సూర్యునకు, జలమునకు కూడా వరుణ శబ్దం వ్యవహారంలో ఉంది. సర్వమును తన రశ్ములతో కప్పివేయువాడు సూర్యుడు. ఆవరించే లక్షణం కల జలము కూడా నారాయణ స్వరూపము కనుక విష్ణు నామంగా వ్యవహృతం.

సాయంకాల సూర్యుని 'వరుణః' అని కీర్తించింది వైదిక సంప్రదాయం.

స వరుణః సాయమగ్ని ర్భవతి ॥ (అథర్వ వేదం)

ఉదుత్తమం వరుణ పాశమస్మదవాధమం విరుధ్యమం శ్రయాధి ॥

(యజుర్వేదం)

ఇదం మిత్రం వరుణం....

ఏకం సత్ విప్రా బహూధా వదన్తి ॥ (అథర్వవేదం)

ఇమం మే వరుణ శ్రుధీ హవమ్॥ (ఋగ్వేదం)

'ఓ వరుణా! మా పిలుపును ఆలకించు" అని వేదం వరుణ రూప హరిని కీర్తించింది.

'కృష్ణః - ధృధుః - సంకర్షణోఽచ్యుతః' నామాల తరువాత ఈ 'వరుణ' నామాన్ని కూర్చడంలో వైదిక విజ్ఞాన క్రమం గోచరిస్తుంది.

'ద్యావాపృథివీ వరుణస్య ధర్మణా విష్కభితే అజరే
భూరి రేతసా॥" (యజుర్వేదం) అనే మంత్రంలో - "క్షీణతలేని మహా తేజస్వి అయిన వరుణుని (ఆవరించువాని) ధర్మము చేత, ఈ ఆకాశ భూములు ఆకర్షించబడుతున్నాయి" అని చెప్పబడినది.

'యే నావృతం ఖం చ మహీ చ।

"ఎవని చేత ఈ ఆకాశము, భూమి ఆవరింపబడి ఉన్నాయో" అని శ్వేతాశ్వత రోపనిషత్ వచనం.

తనచే ఆవరించబడిన వాటికి తాను భిన్నుడు కానందున -

వారుణః.. 554

1. వరుణునకు సంబంధించిన - లేదా - వరుణ ద్వారా ఉద్భవించిన వాటి రూపమున నున్నవాడు.

ఆవరించు ధర్మం గలవి వారుణములు.

రస స్వరూపములు, రసముచే పోషింపబడు శరీరాదులు వారుణములు.

'వారుణ' శబ్దం విష్ణుపరంగా, జలపరంగా చెప్పబడుతున్నది. ఆవరించిన జలమయమైన నారాయణుడు వారుణుడు.

2. వరించువారు వరుణులు (భక్తులు). వారియందున్న భక్త వత్సలుడు వారుణుడు. (శ్రీపరాశరభట్టు)

'తేషు చాప్యహమ్" (గీత) - 'వారియందు నేనుంటాను' అని పరమాత్మ వచనం.

అప్సు తే రాజన్ వరుణ గృహో హిరణ్యయో మిధః॥ (అథర్వవేదం)
ప్రాస్మత్ పాశాన్ వరుణ ముఞ్చ
సర్వాన్ య ఉత్తమా అధమా వారుణా యే ॥ (అథర్వవేదం)

– మొదలైన మంత్రాలలో 'వరుణ' 'వారుణ' శబ్దాలు కనవస్తున్నాయి. ఆవరించిన ఆయన నీడలోనే అంతా పరచుకున్నది కనుక ఆతడు –

వృక్షః.. 555

1. కదలక నిలచువాడు.

'వృక్ష వరణే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి – పై 'వరుణ, వారుణ' నామాల కొనసాగింపు ఈ నామం. తన నీడతో ఆవరించునది వృక్షం. **వృశ్చతి స వృక్షః** – నిలచి ఉన్నది వృక్షం. తాను స్థిరంగా నిలచి, అంతటినీ ఆవరించు వృక్షము వంటివాడు.

వృక్ష ఇవ స్తబ్ధో దివితిష్ఠత్యేకః (శ్వేతాశ్వతరోపనిషత్తు).

'వృక్షము వలె స్థిరముగా నుండి ద్యులోకంలో (అతీతంగా) ఒకే ఒకడైన పరమాత్మ ఉన్నాడు'. దివి అనగా దేహాదులకు అతీతమైన దహరాకాశం. అక్కడ ఉన్న సాక్షిస్వరూపుడు.

చిగురింత, ఆకురాలుట, పూచుట, ఫలించుట... ఇన్ని మార్పులు జరుగుతున్నా మార్పులేని వృక్షము వలె – సకల జగతిలో జీవగతులు మారుతున్నా తాను పరిణమించకుండా, స్వయం ప్రకాశ స్థితిలో నున్నవాడు. 'అచ్యుతా'ది పూర్వ నామాలలో చెప్పబడిన తత్త్వాన్ని ఈ 'వృక్ష' నామం దృఢ పరుస్తోంది.

'నివాసవృక్షః సాధూనాం ఆపన్నానాం పరాగతిః'

"ఎన్నో పక్షులకు ఆశ్రయాన్నిచ్చే వృక్షమువలె –శరణాగతులైన సాధువులకు ఆపన్నులకు ఆశ్రయస్థానమైన అభయ స్వరూపుడు శ్రీరాముడు" – అని తార, వాలితో శ్రీరాముని గురించి వివరించింది (వాల్మీకి రామాయణం)

కః స్విద్ వృక్షో నిష్ఠితో మధ్యే అర్ణసః ॥(ఋగ్వేదం)

వృక్షో న పక్వః ॥ (ఋగ్వేదం)

వృక్ష ఇవ విద్యుతా హత ఆమూలాదను శుష్యతు ॥ (అథర్వవేదం)

యస్మిన్ వృక్షేమధ్వదః సుపర్ణా నివిశన్తే స్తువతే
చాధి విశ్వే ॥ (ఋగ్వేదం)

వృశ్చతి విభజతి –ఫల పత్ర శాఖాదులుగా తనను విభజించుకొను వృక్షము వలె – ఆత్మ శక్తి ద్వారా ఇంద్రియాదులు, గుణకర్మలు విభజింపబడుతున్నాయి. ఈ విభజనకు కారణమై ఉన్న ఆత్మ స్వరూపుడైన హరియే – వృక్షః.

ఇలా హృదయాకాశమునందు ఆత్మరూపుడై యున్నందున –

పుష్కరాక్షః.. 556

1. హృదయ పద్మంలో వ్యాపించినవాడు.

'అక్షూ వ్యాప్తౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, 'అక్షః' అంటే 'వ్యాపించినవాడు'. 'పుష్కరం' అనగా పద్మం. ఇది హృత్పద్మము.

"హృత్పుండరీకం" అని వేదమే హృదయాన్ని పద్మంతో పోల్చినది. **పుష్కరే ఈక్ష్యతే** – హృదయమందు చూడబడువాడు – ధ్యానించబడు స్వప్రకాశ స్వరూపుడు.

2. **"పుష పుష్టౌ"** అనే ధాత్వర్థప్రకారం, పోషణకరమైన దృష్టి కలవాడు పుష్కరాక్షుడు.

విశ్వే దేవా పుష్కరేత్వాదదన్న ॥ (ఋగ్వేదం)

ఈ విధంగా సర్వ విధ జ్ఞాన సంపత్తితో వ్యాపించినందున –

మహామనాః.. 557

1. అనంత జ్ఞాన స్వరూపుడు.

'మన జ్ఞానే' అనే అర్థాన్ని అనుసరించి – మహా జ్ఞానము కలవాడు– మహామనాః. అనంతత్వం, వ్యాపకత్వం– 'మహా' శబ్దం ద్వారా వాచ్యాలు. **'మనాంసి జ్ఞానాని'** బహువిధ జ్ఞానముచే విశ్వమంతటా వ్యాపించిన నారాయణుడు.

మనసైవ జగత్ సృష్టిం సంహారం చ కరోతి యః

"తన మనస్సుతోనే జగత్ సృష్టి సంహారాదులను ఆచరించు వాడు" అని విష్ణు పురాణం పేర్కొన్నది. సర్వ సృష్టినీ నిర్వహించగలిగే అత్యంత శక్తిమంతమైన (మహా) మనః (జ్ఞాన) శక్తి కలవాడు.

ఈ అనంత జ్ఞానాది ఐశ్వర్యముల వలన, అందరిచే సేవించబడువాడు –

భగవాన్ భగహా౽ ఽ నందీ వనమాలీ హలాయుధః।
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణు ర్గతిసత్తమః॥ 60

558. భగవాన్,	*559. భగహా,*	*560. ఆనన్దీ ,*
561. వనమాలీ,	*562. హలాయుధః।*	*563. ఆదిత్యః,*
564. జ్యోతిరాదిత్యః,	*565. సహిష్ణుః*	*566. గతిసత్తమః॥*

భగవాన్.. 558

1. ఐశ్వర్యము గలవాడు.

ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశసః శ్రియః
జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇతీరణా॥ (విష్ణు పురాణం)

సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శ్రీ (శోభాదులు), జ్ఞానము, వైరాగ్యము – అనే ఆరింటికి 'భగం' అని వ్యవహారం. ఈ ఆరు లక్షణముల సముదాయం కలవాడు భగవానుడు.

ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానా మాగతి గతిం,
వేత్తి విద్యామవిద్యాంచ స వాచ్యో భగవానితి॥ (విష్ణు పురాణం)

"సర్వ భూతముల ఉత్పత్తి ప్రళయాలను, రాకపోకలను, విద్యా౽ విద్యలను (జ్ఞానాజ్ఞానములను) ఎరిగినవాడు భగవానుడు.'

'భజ సేవాయాం' అనే ధాత్వర్థాన్ని అనుసరించి –

సేవింపబడే – కోరబడే సర్వైశ్వర్యములు ఎవనియందు గలవో అతడు భగవానుడు. 'నిత్య అనంత' అనే లక్షణాలతో సర్వైశ్వర్యములు నారాయణుని యందున్నాయి. నిత్యానంత ఐశ్వర్యవంతుడు, నిత్యానంత యశస్కుడు, నిత్యానంత జ్ఞానము, నిత్యానంత విస్తారము గలవాడు భగవానుడు.

2. అభిలషించే ఐశ్వర్యాదులకు నిధానమైన సూర్య రూప నారాయణుని వేదం

'భగః' అని కీర్తించింది. అందరిచే సేవింపబడే ఆదిత్యుడు భగుడు.

ప్రాతర్భగం పూషణం బ్రహ్మణస్పతి ప్రాతః సోమముత రుద్రం హువేమ ॥

(యజుర్వేదం).

భగ ప్రణేతర్భగ సాత్యరాధే
భగేమాం ధియముదయా దదన్నఃి
భగ ప్రనోజనయ గోభి రశ్వైఃి
భగ ప్ర నృభిర్నువన్తఃి స్యామ్॥ (యజుర్వేదం)
భగ ఏవ భగవాన్ అస్తు... (యజుర్వేదం)

3. విస్తరింప జేసే లక్షణము గలది 'భగము'. తల్లక్షణం కలవాడు భగవానుడు. అనంత జ్ఞానాదుల విస్తారము చేత ఈ పదవాచ్యుడు. 'భగ' మనగా విస్తార లక్షణంగల ప్రకృతి – అని శాస్త్ర వచనం.

'భం' వృద్ధిం 'గ'చ్ఛతీత్యర్థఃి .... అని పురాణోక్తి.

వృద్ధిని (విస్తారాన్ని) పొందేది భగము – ప్రకృతి. ఈ ప్రకృతిని అధిష్ఠించిన పరమాత్మ భగవానుడు.

భగహా.. 559

1. ఐశ్వర్యమును, ప్రకృతిని (సంహారకాలంలో) ఉపసంహరించువాడు.

విశ్వాన్ని విస్తరింపజేసే ఈతడే దీనిని నియంత్రించి, ఆ విస్తార లక్షణాన్ని సంకోచింపజేయువాడు.

సంకోచం లయం, వికాసం సృష్టి. సంకోచ వికాసాలు ప్రత్యణువులో వ్యాపించిన నిత్య చైతన్య లక్షణాలు. వీటిని కలిగించే చైతన్య స్వరూపుడే 'భగవాన్' (విస్తారము కలవాడు), 'భగహా' (విస్తారమును హరించువాడు). తాను విస్తరింపచేసిన జగతిని తానే లయింపజేయువాడు.

హన్తి – ప్రాప్నోతి సంక్షిపతి... అనే అర్థం ప్రకారం

ఐశ్వర్యాదులను, ప్రకృతిని (భగమును) పొందినవాడు (ప్రాప్నోతి), వాటిని

సంక్షేపించు (లయింపజేయు) వాడు – భగవా.

కృతాంతకృత్, మృత్యుః, అంతకః – మొదలైన నామాల వద్ద ప్రస్తావించిన భావమే ఈ నామంలో ద్యోతకమౌతోంది. ఈ విస్తరించుట, సంక్షేపించుట – అనే క్రియలు చేస్తున్నా, తన స్వస్థితియైన ఆనందము మాత్రం చెదరనిదీ – తన విశ్వ నిర్వహణ సామర్థ్యము (సమృద్ధి భావం) తరగనిది కనుకనే –

అనన్దీ.. 560

1 సుఖస్వరూపుడు.

ఆనందాదేవ ఖల్విమానిభూతాని జాయన్తే.

ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్

..... మొదలైన శ్రుతి వాక్య ప్రమాణంగా పరిపూర్ణ సచ్చిదానంద ఘనుడు.

2. సమృద్ధి కలవాడు.

"సమంతాత్ నందనం – సమర్ధనం (సమృద్ధి భావం) యస్యయస్మిన్ వా అస్తి సః అనన్దీ " (సత్యభాష్యం)

పరిపూర్ణమైన సమృద్ధి ఎవనికి కలదో, ఎవనియందు కలదో అతడు అనన్దీ.

నారాయణునిలో లోటు అనేది లేదు. పరిపూర్ణుడు. సర్వ సంపత్ సమృద్ధి కలవాడు.

యత్రానందాశ్చ మోదాశ్చ ముదః ప్రముద ఆసతే॥
సర్వే నన్దన్తి యశ సాగతేన సభాసాహేన సఖ్యాసఖాయః (ఋగ్వేదం)
కాలేన సర్వా నన్దన్త్యాగతేన ప్రజా ఇమాః॥ (అథర్వవేదం)
న కుతశ్చ నోనః ॥ – దేనికన్నను తక్కువ కానివాడు... అని శ్రుత్యుక్తి.

ఈ సమృద్ధి కల శక్తి చేతనే సర్వమును చక్కగా విభజించి, ధరించువాడు–

వనమాలీ.. 561

1. వనమాలను దాల్చినవాడు.

వనతి సంవిభజతీతి వనమ్ (సత్యభాష్యం)

చక్కగా విభజించునది వనము. విభాగముచేయుట – పంచుట.. అనే అర్థములు. **'అగ్నిర్నో వనతే రయిమ్'** – అని ఋగ్వేద మంత్రం.

'అగ్ని మనకు సంపదలను విభజించి యిచ్చుగాక!'.

ఇలా బహువిధములుగా విభక్తమై, భిన్నభిన్నంగా గోచరించే ఈ విశ్వం వివిధ కుసుమాల మాలవలె ఉండగా, ఆ పూల వరుసల సూత్రమువలె 'సూత్రాత్మక బ్రహ్మము'గా అంతర్యామియైనవాడు వనమాలీ. విభజన 'వనము'. ఏకత్వం 'మాల'. విభిన్నతలో ఏకతత్త్వం – వనమాలీ. 'అవిభక్తం విభక్తేషు'... (విడిగా ఉన్నవాటిలో ఏకమై ఉన్న పరతత్త్వం)

'మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ' – అని భగవద్గీతావచనం.

తస్మిన్ హతస్థుర్భువనాని విశ్వా। (యజుర్వేదం)

"స్వమాయాం వనమాలాఖ్యాం".... (భాగవతం)

త్రిగుణాత్మకమైన తన మాయనే వనమాలగా దాల్చినవాడు.

భూత తన్మాత్ర రూపమయిన 'వైజయన్తి' అనే వనమాలను ధరించివాడు.

2. జగతిని పలు విధములుగా విభజించి శోభనిచ్చువాడు – వనమాలీ.

మాం శోభాం లాతి – మాలా – శోభను ఇచ్చునది.

మాన పూజాయాం – అను ధాత్వర్థాన్ని అనుసరించి పూజకు యోగ్యమైనది మాల. (**మాన్యయే అనయా ఇతి – మాలా**).

3. **'మల ధారణే'** అనే ధాతువు ప్రకారం– **మల్యతే ధార్యతే యా సా మాలా**. ధరింపబడునది మాల. జగతిని గుణ విభాగములుగా చేసి ధరించిన చైతన్య రూపుడే వనమాలీ.

ఏకాత్మకుడై, విభిన్నరూప జగతిని సృజించి నడిపే తన శక్తినే ఆయుధంగా (ఉపకరణంగా) కలిగినవాడై –

హలాయుధః.. 562

1. *నాగలిని ఆయుధంగా కలిగినవాడు.*

'హల విలేఖనే' అనే ధాతువుననుసరించి, 'దున్నుటకు – నేలను చీల్చుటకు' ఉపకరించే సాధన హలం. దానిని ఆయుధంగా కలిగిన హరి.

విశ్వక్షేత్రాన్ని జీవోత్పత్తికి అనువుగా మలచే శక్తియే హలం. ఆ శక్తితో జగతినీ, జీవుల క్షేత్రాన్నీ అనుభవయోగ్యమైన సాఫల్యంగా మలచే వాడు హలాయుధుడు.

మమ యోనిర్మహద్బ్రహ్మ తాసాంగర్భం దధామ్యహమ్।
తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా।।

సర్వ ఓషధులకు నిధియైన పృథ్విలో, ఏ శక్తి ఆ ఓషధులను వెలికి తీస్తున్నదో ఆ శక్తియే హలం. దీనిని నిర్వహించువాడు హరి.

ఇన్ద్ర ఆసీత్ సీరపాణిః (అథర్వవేదం)।।

– అని వేదం హలాయుధునిగా పరమేశ్వరుని వర్ణించింది. (సీరం అనగా హలం)

ఈ హలశక్తితోనే జగతిని సమృద్ధిగా వర్ధిల్లజేస్తున్నాడు.

సర్వ సంపదలను సమృద్ధిగా పండించి పంచేవాడితడే.

2. బలభద్ర స్వరూపంతో అవతరించిన వాడు.

ఈ అవతారంలో హలాన్నే ఆయుధంగా ధరించాడు.

బలభద్రం సమృద్ధ్యర్థం సీరకర్మణి చిన్తయేత్।।

'భూమిని దున్నే కాలంలో సమృద్ధికోసం బలరాముని చింతించాలి' అని శాస్త్రోక్తి. క్షేత్రమును దున్ని పంటలను పండించే నైపుణ్యం విశ్వవ్యాపక ఈశ్వర చైతన్య విశేషమే. 'ఆనన్దీ' నామంలోని 'సమృద్ధి' అర్థానికి ఈ నామార్థం అనుసంధేయం.

ఇలా భూమిని తన శక్తితో ఫలవంతం చేసే స్వరూపం సూర్యకాంతిలో కూడా గోచరిస్తున్నది. చీలి, విభజించే ఈ శక్తితో జగతిని నడుపుతున్న, తాను మాత్రం ఛేదింపబడని అఖండ తేజుడు కనుకనే–

ఆదిత్యః.. 563

1. అదితికి జనించినవాడు.

ఖండనము కానిది అదితి – ఇది ఆకాశం. దీని యందు జనించిన తేజఃస్వరూపుడు ఆదిత్యుడు.

అదితిర్ద్యౌరదితి రన్తరిక్షం
అదితిర్మాతా స పితా స పుత్రః ।
విశ్వే దేవా అదితిః పంచజానా ।
అదితిర్జాత మదితిర్జనిత్వమ్॥ (యజుర్వేదం)

అదితీకశ్యపులకు జనించిన వాడు ఆదిత్యుడు.

2. అఖండ చైతన్యరూపుడైన బ్రహ్మము నుండి జనించిన జగమే ఆదిత్యం.

నిరంతరం ఈ జగతిని అఖండముగా వ్యాపకగుణముతో నిర్వహించు బ్రహ్మమే విష్ణువు ఆదిత్యుడు.

3. సంకర్షణ స్వరూపుడైన బలరాముడు, తన (సంకర్షణ) బీజమంత్రమైన 'అ' కారం చేత పొందబడేవాడు. (**అతా ఇత్యః ఆదిత్యః**) ఆదిత్యునిగా భాసించే జ్యోతి కనుకనే –

జ్యోతిరాదిత్యః.. 564

1. ప్రకాశస్వరూపుడైన ఆదిత్యుడు.

'ద్యుత దీప్తౌ' అని ధాతువు. వ్యాకరణ రీత్యా ద్యుతి శబ్దమే జ్యోతి. సూర్యుని యందున్న ప్రకాశము నారాయణుడే.

'యదాదిత్యగతం తేజః' (గీత) **'జ్యోతిషామపి యజ్జ్యోతిః'** (శ్రుతి)

ఆదిత్యాది జ్యోతిర్గణాలలోని ప్రకాశము పరమాత్మునిదే. అంతేకాదు – ఆ ఆదిత్యాది మండలములు కూడా తానే. కనుక ప్రకాశము, ఆదిత్యుడు – రెండూ తానుగా చెప్పబడుతున్నాడు.

'అమృతమైన బ్రహ్మమే తన ఛాయ కూడా' అని శ్రుతి చెబుతున్నది.

యస్య ఛాయామృతం .... (యజుర్వేదం)

వెలుగే దాని మూలమైన మండలాన్ని చూపిస్తుంది. ఆ మండలానికీ, ఆ వెలుగుకీ భేదమే లేదు. అలాగే జ్యోతికీ, ఆదిత్యునికీ అభేదాన్ని తెలియజేస్తున్నదీ నామం.

2. అగ్నిలక్షణమైన జ్యోతి ఆదిత్యుని రూపమేననే భావాన్ని కూడా దీనిలో గ్రహించవచ్చు.

'అగ్నియే సూర్యుడు-సూర్యుడు అగ్ని' అని వేదం పలుచోట్ల ప్రస్తావించింది.

3. జ్యోతిస్సునందు - అనగా 'సవితృమండలమందు' ఉన్నవాడు.

'ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ....' అని జ్యోతిర్గణాదులలో భాసించే ఈ చైతన్య స్వరూపుడే వీటన్నిటినీ సహించి నిర్వహిస్తున్నందున -

సహిష్ణుః.. 565

1. సహించు స్వభావము కలవాడు.

శరీరాదులలోను, ప్రత్యణువులోనూ ప్రవేశించి ప్రకాశించే చైతన్యమే వాటిని సహించి నిర్వహిస్తున్నది.

యేన సహాంసి సహసా సహన్తే।। (ఋగ్వేదం)

2. విరోధులను ఎదుర్కొను ప్రతాపశాలి ఈతడే. ప్రపన్నుల అపరాధాలను క్షమించే సహనశీలుడు కూడా ఇతడే.

విభేద బలం భృగుర్న ససహే శత్రూన్ మదే సోమస్య।। (అథర్వవేదం)

సహోసి సహో మయి ధేహి।। (యజుర్వేదం)

ఈ సహన స్వభావం చేతనే సర్వ జగతికి ఆశ్రయమైనవాడే -

గతి సత్తమః.. 566

1. ఆశ్రయమైన శ్రేష్ఠుడు.

'గతి' శబ్దానికి 'ఆశ్రయం' అని అర్థం. సర్వమునకు ఆధారమైనవాడు,

అన్నిటి కంటె శ్రేష్ఠుడు (సత్తముడు).

2. 'గతి' అంటే గమనశక్తి. ఆదిత్యాది కాంతులుగా గమనము చేయువాడు. సర్వమునకు అధికుడై భాసించువాడు – గతిసత్తముడు.
3. శీతోష్ణాది ద్వంద్వాలను సహించువాడు, అతీతుడు.
4. అపరాధాలను సహించి అనుగ్రహించే దైవం కనుక, సర్వులు ఈతనినే గతి అని ఆశ్రయింపదగినవాడు.

✤ ✤ ✤

'జ్యోతిరాదిత్యః'(564) నామం నుడి 'దారుణః' (569) నామం వరకు నారాయణావతారం చెప్పబడినదని శ్రీ పరాశరభట్టరువారి దర్శనం. జ్ఞాన ప్రకాశస్వరూపుడైన (జ్యోతిరాదిత్యః) నారాయణుడు అపూర్వమైన క్షమను తన తపఃశక్తితో ప్రదర్శించి(సహిష్ణుః) దేవతలకు సైతం తానే ఆశ్రయుడైనాడు. వారికి పరమ ధర్మాలను ఉపదేశించే ఆచార్యుడైనాడు (గతిసత్తమః)"

✤ ✤ ✤

ఆశ్రయించిన వారికి సద్గతి ఈతడే కనుక, ధర్మ రక్షణకై ఆయుధ ధారియైనవాడు కనుక –

సుధన్వా ఖండపరశు ర్దారుణో ద్రవిణప్రదః।
దివిస్పృక్ సర్వదృగ్వ్యాసో వాచస్పతి రయోనిజః॥ 61

***567.** సుధన్వా, **568.** ఖండపరశుః, **569.** దారుణః, **570.** ద్రవిణప్రదః।*
***571.** దివిస్పృక్, **572.** సర్వదృగ్వ్యాసః, **573.** వాచస్పతిః, **574.** అయోనిజః॥*

సుధన్వా.. 567

1. మంచి ధనువు కలవాడు.

మేలును కలిగించే ధనువు – సుధనువు. దనుజశక్తులను దునుమాడి

జగతికి హితము కలిగించే 'శార్ఙ్గ ధనువు'ను ధరించిన వాడు.

"ఇంద్రియాదిమయం శార్ఙ్గం" అని పురాణ వచనం. ఇంద్రియములు మొదలైన తత్త్వముల రూపమే శార్ఙ్గము.

భూతాది మింద్రియాదిశ్చ ద్విధాహంకార మీశ్వరః ।
బిభర్తి శంఖరూపేణ శార్ఙ్గ రూపేణ చ స్థితమ్ ॥

– అని 'విష్ణుపురాణం'. ఇంద్రియాహంకారం, భూతాహంకారం– అని రెండు విధాలు. ఇందులో భూతాహంకారమే శంఖరూపంగా, ఇంద్రియాహంకారమే శార్ఙ్గ రూపంగా ధరించే ఆత్మ చైతన్యమే విష్ణువు.

దీనిని నిర్వహించే ఆత్మచైతన్యమే సుధన్వుడైన నారాయణుడు. రామాద్యవతారాలలో ధనుర్ధారియై దేవతలకు సైతం మేలు కలిగించినవాడు.

శ్రుతులలో ధనుర్ధారియైన పరమేశ్వరుని అనేక విధముల ప్రస్తుతించారు.

ధనుర్హస్తాదా దదానో మృత స్యాస్తే క్షత్రాయ వర్చసే బలాయ ।
అత్రైవ త్వమిహ వయం సువీరా ..... ॥ (ఋగ్వేదం)

2. 'భ్రుకుటి' (కనుబొమల)ని ధనువుగా పేర్కొనడం శాస్త్రములందు పరిపాటి. జగతికి చక్షువైన సూర్యుడు భ్రుకుటి వంటి మండలమును ధరించి ఉన్నాడు.

'చక్షోఃసూర్యో అజాయత' (యజుర్వేదం) –అని పురుషసూక్తం. సూర్యుడే కన్నుగా కల నారాయణుడు, ఆ నేత్ర సూర్యునికి శోభగా కనుబొమలను దాల్చి ఉన్నాడు!

గొప్ప ధనుర్ధారి మాత్రమే కాక, శత్రువులను ఖండించే పరశువును ధరించుట చేత–

ఖండపరశుః.. 568

1. *ఖండించే పరశువును ధరించినవాడు.*

శత్రువులను ఖండించే దివ్యాయుధమును ధరించిన వాడీతడే. జమదగ్నికి పుత్రుడుగా అవతరించిన పరశురాముడు ఈ నామంలో స్ఫురిస్తాడు.

2. మహాభారత శాంతి పర్వం ఆధారంగా – బదరీనారాయణుడు తన ప్రతాపానికి సూచనగా ప్రయోగించిన దర్భ పరశువుగా మారినదనీ, అది రుద్రుని తాకినదనీ, అయన యందు ఖండింపబడినదనీ, ఆ కారణంగా హరికి 'ఖణ్డ పరశువు' అనే నామం వచ్చినదనీ చెప్పబడింది.

క్షిప్తశ్చ సహసా రుద్రే ఖణ్డనం ప్రాప్తవాం స్తదా ।
తతోహం ఖణ్డపరశుః తతః పరశు ఖణ్డనాత్ ॥

(భారతం. శాంతి పర్వం)

రుద్రుని నామాలలో కూడా 'ఖండపరశువు' నామం చెప్పబడింది. శత్రువులను ఖండించే గొడ్డలిని ధరించిన శివుడు సైతం విష్ణుస్వరూపుడని గ్రహించవచ్చు.

3. **ఖండ-పర-శుః** అని విభజించి చూస్తే, వైదికమైన ఈశ్వరవాచక అర్థం స్పష్టమౌతుంది.

ఖనతి ఖండయతి ఖండః.
పృణాతి పాలయతి పూరయతి వా పరః
పరం శత్రుం శృణాతి హినస్తీతి పరశుః.

(ఖండించి) విభజించి – అనగా జగతిని బహువిధాల విభజించి, పాలనచేసి తగినశక్తితో పూరించి, సర్వమును సరియైన కాలంలో సంహరించువాడు 'ఖండపరశుః'. (సత్యభాష్యం)

4. దీనినే *'అఖండపరశుః'* అని కూడా గ్రహించవచ్చు.

అ-అనే శబ్దానికి **'అతతి సర్వం సదా గచ్ఛతి వ్యాప్నోతి'** అని అర్థాన్ని స్వీకరిస్తే అంతటను వ్యాపించి నానా విధముల విభజించి, పాలన చేసి, సమస్తమును నశింపచేసే సృష్టిస్థితిలయకారకుడు అనే స్పష్టమైన ఈశ్వరస్వరూపాన్ని ఆవిష్కరించవచ్చు.

ఏ ఒక్కరూ ఛేదించలేని పరశువును ధరించిన పరమేశ్వరుడే అఖండపరశువు. ఛేదించలేని కాంతితో, ధర్మద్రోహులను అంధకార శక్తులను నశింపజేసే ఆదిత్య మండలాంతర్గత పరమేశ్వర చైతన్యమే ఈ నామం ద్వారా వ్యక్తం. ఈ విధంగా దైత్యశక్తులను ఛేదించడం చేతనే –

దారుణః.. 569

1. ఛేదించువాడు.

'దృవిదారణే' అనే ధాతువు ననుసరించి 'చీల్చువాడు' అని అర్థం. తాను అఖండ పరశుధారి, పరశువుతో ఇతరులను ఖండించే ఖండ పరశువు. అణువులను సైతం విఘటింపజేసి, బహువిధాలుగా జగతిని పరిణమింపచేయువాడు; ఆదిత్యాది స్వరూపాలతో చీకటిని ఛేదించువాడు.

2. **ద్విధాకరోతీతి దారుణః.**

రెండు విధములుగా చేయువాడు.

బంధనము, మోక్షము – రెండింటిని కలిగించువాడు (విభజించువాడు).

యద్దారుణి బధ్యసే యచ్చరజ్జ్వాం
యద్ భూమ్యాం బధ్యసే యచ్చ వా చా ॥అథర్వవేదం॥
విజిహీష్వలోకం కృణు బంధాన్ముంచసి బద్ధకమ్ ॥అథర్వవేదం॥

3. *బాహ్య శత్రుప్రలను, అంతర శత్రువులను ఖండించే భయంకరుడు.*

ప్రతికూలములను భంజించుట, లోకైశ్వర్య విధానంలో భాగమే. ఆ విధంగా అభ్యుదయ విరోధులను తొలగించి, సమృద్ధిగా ఐశ్వర్యాన్ని ప్రదానం చేస్తున్నందున –

ద్రవిణ ప్రదః.. 570

1. ధనమును ఇచ్చువాడు.

భక్తులకు వాంఛితమైన దానిని ప్రసాదించువాడు.

2. **ద్రవతి గచ్ఛతీతి ద్రవిణం** – కదలునది (గమన లక్షణము కలది) ద్రవిణం. విశ్వమునందున్న గతిశక్తి విష్ణు చైతన్య స్వరూపమే. ప్రతి అణువునా ఈ గతి శక్తిని (చైతన్యాన్ని) నింపినవాడు ద్రవిణప్రదుడు.

ధనము కూడా ఒకరి నుండి ఒకరికి చేరే గతి లక్షణం కలది.

విశ్వంలో ఏ జీవుడు దేనిని పొందితే కృతకృత్యుడౌతాడో అది ధనం.

దానిని ఆయా జీవులకు సమకూర్చువాడు విష్ణువు.

దధాసి రత్నం ద్రవిణఞ్చ దాశుషేగ్నే సఖ్యే ॥ (ఋగ్వేదం)

ద్రవిణోదా ద్రవిణసో గ్రావహస్తాసో అధ్వరే ॥ (ఋగ్వేదం)

3. జ్ఞానము నిచ్చువాడు.

జీవునికి ధన్యతనిచ్చే ధనం జ్ఞానమే. దానిని ప్రదానం చేసే జ్ఞానస్వరూపుడు.

ఈ నామం నుండి నారాయణుని జ్ఞానావతారమైన శ్రీ వేదవ్యాసునికి సంబంధించిన నామాలుగా కొన్నిటిని దర్శించారు శ్రీ పరాశరభట్టరు.

వ్యాసుని విష్ణ్వవతారంగా భాగవతం, విష్ణుపురాణం, భారతం కూడా పేర్కొన్నాయి. 'వ్యాసాయ విష్ణురూపాయ'... అని ప్రసిద్ధి.

వహన్వై వామహస్తేన సర్వశాస్త్రార్థ సంచయన్ ।

దక్షిణేన చ శాస్త్రార్థాన్ ఆదిశంశ్చ యథా స్థితాన్ ॥

'సకల శాస్త్రార్థాలను (గ్రంథాన్ని) ఎడమచేత దాల్చి, కుడిచేతితో శాస్త్రాల అర్థాన్ని బోధించే చిన్ముద్రను పూనిన వ్యాసు'ని మూర్తిని ధ్యానశ్లోకంలో వర్ణించారు.

విశ్వమంతా ఉన్న విభిన్న జ్యోతిర్మండలాలకు, జీవకోటికి గతిశక్తినీ, ఐశ్వర్యాన్నీ ప్రదానం చేసే సువిశాల స్వరూపుడు కనుకనే –

దివిస్పృక్.. 571

1. ద్యులోకమును స్పృశించువాడు.

ఊర్ధ్వమైన ఆకాశమును స్పర్శించుట .... సర్వవ్యాపకతకు సూచన. సర్వ జ్యోతిస్సుల రూపంలో పరమాత్ముడు ద్యులోకమును 'చేరి' (స్పృశించి) అక్కడ భాసిస్తున్నాడు.

2. ఇది సూర్య పరమైన అర్థాన్ని అందిస్తున్నది.

దివి యందుండి అంతటా వ్యాపించే, గ్రహోపగ్రహాలను వ్యవస్థీకరించే భానుడే 'దివిస్పృక్'. వేదం సూర్య మండలాంతర్వర్తి అయిన పరమాత్మను

ఈ భావనతోనే స్తుతించింది.

దివిస్పృగ్యాత్యరుణాని కృణ్వన్నుతో ఏతి పృథివ్యా రేణు మస్యన్ ॥

(ఋగ్వేదం)

'దివిక్షితా' 'దివిజాః' 'దివిజయుః' 'దివియోనిః' –అని పలుచోట్ల ఋగ్వేదం లోనూ, 'దివిసదమ్' వంటి శబ్దాలు యజుర్వేదంలోను, 'దిషిషదః' 'దివిచరాః' 'దివిశ్రితః' వంటి నామాలు అథర్వవేదంలోను సూర్యుని పరంగా చెప్ప బడుతున్నాయి.

3. శరీరంలో శిరస్సు దివిస్థానం.

ఆకాశం నుండి భూమికి జ్యోతిస్సుల ద్వారా, పర్జన్యాల ద్వారా సమస్త శక్తులు సమకూరుతున్నట్లుగానే; శరీరానికి శిరఃస్థానం నుండే జ్ఞానశక్తి లభిస్తున్నది. ప్రతి ప్రాణికోటి శిరస్సునందు భాసించే జ్ఞానచైతన్య స్వరూపుడే 'దివిస్పృక్' అనబడే విష్ణువు.

'నభఃస్పృశం దీప్తం'.... అని 'భగవద్గీత' విశ్వరూపుని వర్ణిస్తున్నది.

'శిరోద్యౌః' అని విరాట్పురుషుని ధ్యాన శ్లోకం.

విశ్వాత్మకుడైన నారాయణుని పాద పీఠమే భూమి, శిరస్సు నభస్సును తాకుతున్నది.

4. పరమోన్నతమైన జ్ఞానమే 'దివి'. ఇది పరావిద్య. దానిని ఎరుగుటయే 'స్పర్శించుట'. పరావిద్యను ఎరిగిన వ్యాసుడు 'దివిస్పృక్'.

ఈ జ్ఞానశక్తి చేతనే అన్నిటినీ తెలుసుకొనగలిగే విస్తారరూపుడైనందున –

సర్వదృగ్ వ్యాసః.. 572

1. అన్ని విధముల జ్ఞానములను విస్తరింపజేయువాడు.

'వేదాఃశాస్త్రాణి విజ్ఞానం ఏతత్సర్వం జనార్దనాత్' –నారాయణుని నుండి సర్వ జ్ఞానములు అనుగ్రహించబడినాయి.

చూపులు (దృక్కులు) అనగా జ్ఞానములు. అనంతమైన జ్ఞానాన్ని విస్తరించి

స్పష్టపరచినవాడు. **'వ్యస్యంతే విభజ్యంతే ఇతి వ్యాసః'** – విభజించువాడు వ్యాసుడు.

2. నిజమైన 'సర్వదృక్కు' వేదమే. ఇది అందరికీ దృక్కు, మన బుద్ధీంద్రియాలకు అందని సత్యాన్ని దర్శించి, దర్శింపజేసే దృక్కు– వేదం. దానిని బహుముఖాలుగా విస్తరింపజేసినవాడు 'సర్వదృగ్వ్యాసుడు' అనగా 'వేదవ్యాసుడు'. వేదం నారాయణుని శబ్దరూపం కనుక ఈ నామం విష్ణువునే తెలియజేస్తున్నా, విష్ణ్వవతారమైన వ్యాసదేవునికి కూడా అన్వయిస్తున్నది.

వేదాన్ని ఋగ్యజుస్సామాథర్వణములుగా నాలుగుగా విభజించినవాడు. ఇరవైఒక్క శాఖలలో ఋగ్వేదాన్నీ, నూటొక్క శాఖలుగా యజుర్వేదాన్నీ, వేయి శాఖలలో సామవేదాన్నీ, తొమ్మిది శాఖలుగా అథర్వవేదాన్నీ విభజించాడు. అంతేకాక – ఆ వేదధర్మాన్ని అష్టాదశపురాణాలుగా, భారత భాగవతాలుగా, బ్రహ్మసూత్రాలుగా విస్తరించి అందించినవాడు వ్యాసదేవుడు.

యుగానుసారబోధానామభేద జననాయవై ।
విభజంస్తు చతుర్ధావై వేదమేతం త్రికాలవిత్ ॥

ప్రతి మహాయుగంలో నారాయణతేజం వ్యాసరూపంగా అవతరించి, ముక్కాలాలను తెలిసిన ఆయన ద్వారా వేదవిజ్ఞానం జగతికి అందుతున్నది.

3. అంతటినీ దర్శించి, కాలాన్ని దినరాత్రులుగా మొదలుకొని పక్షాలుగా, మాసాలుగా, ఋతువులుగా విభజించి విస్తరింపజేసే సూర్యనారాయణుడే సర్వదృగ్వ్యాసుడు.

యమా ఇవ సుసదృశః సుపేశసః ॥ (ఋగ్వేదం)

సర్వమును తెలిసినా అతడే దేనిని ఎలా విభజించి విస్తరింపజేయాలో తెలియగలడు, చేయగలడు. ఈ విధంగా సమస్త జ్ఞానమున అధికారం కలిగియుండడం చేత –

1. విద్యలకు పతియైనవాడు – తనకు ఏ కారణము లేనివాడు.

   వాక్కులనగా విద్యలు. వాటికి పతి వాచస్పతి. విద్యలన్నిటికీ తానే కారణం. కానీ తనకు ఏదీ కారణము లేదు.

   యోని – అనగా కారణం. తనకు కారణము లేకనే కలుగువాడు అయోనిజుడు. కర్మబంధములు జీవుల పుట్టుకలకు కారణం. తాను కర్మరహితుడు. కేవలం తన మాయాశక్తితో తనను తాను వ్యక్తం చేసుకుంటాడు. విద్యలకు పతి కనుకనే, ఆ వేదవాగ్ధర్మాన్ని నిలిపేందుకు తాను అవతరించినా, తనకు ఏ ఆధారము లేకుండా వ్యక్తమౌతున్నాడు.

2. బ్రహ్మదేవుడు 'ఓం' శబ్దాన్ని ఉచ్చరించాడు. ఈ సరస్వతి (శబ్దం) నుండి ఉత్పన్నమైన 'అపాంతరతముడే' అనంతరకాలంలో పరాశరునికి పుత్రుడై ఆవిర్భవించాడు. అలా ఓంకార సరస్వతి నుండి ఉద్భవించుట చేత ఈ విద్యాపతి (వాచస్పతి) అయిన అపాంతరతముడు (వ్యాసుడు) 'అయోనిజుడు'. ఈ విషయాన్ని ఈ క్రింది శ్లోకం స్పష్టపరుస్తోంది –

   అధభూయో జగ తృష్ట్వా భోశబ్దేనానువాదయన్ ।
   సరస్వతీ ముచ్చచార తత్ర సారస్వతోఽభవత్ ॥

   (భారతం–శాంతిపర్వం)

   ఇక్కడ వాక్పతులనబడే బృహస్పతి వంటి దేవతా విశేషాల కంటే అధికుడైన పరమాత్మ ఈతడు – అని తేటపరచేందుకే ఈ 'విశేషణంతో కూడిన ఒకేనామం' చెప్పబడింది.

త్రిసామా సామగ స్సామ నిర్వాణం భేషజం భిషక్।
సన్న్యాసకృ చ్ఛమః శాంతో నిష్ఠా శాంతిః పరాయణమ్॥ 62

574. త్రిసామా, 575. సామగః, 576. సామ, 577. నిర్వాణమ్,
578. భేషజమ్, 579. భిషక్। 580. సన్న్యాసకృత్, 581. శమః,
582. శాన్తః, 583. నిష్ఠా, 584. శాంతిః, 585. పరాయణమ్॥

త్రిసామా.. 574

1. మూడు సామములు కలవాడు.

'దేవవ్రతములు' అనబడే సామములు మూడు. బృహత్, రథంతర, వామదేవ్యములనబడే ఆ త్రిసామముల స్వరూపుడు, వాటిచే స్తుతించబడువాడు 'త్రిసాముడు!

ఇన్ద్రాయా సామ గాయత విప్రాయ బృహతే బృహత్॥ (ఋగ్వేదం)

2. గాయత్రీ స్వరూపుడు.

మూడు సమిధలు కలిగిన 'త్రిసామ'మే గాయత్రి. గాయత్రి మూడు సమిధలు కలిగి ఉన్నదని వేదభావం.

త్రిపాద అయిన గాయత్రి ఋగ్యజుస్సామములనే వేదత్రయికి, అకార ఉకార మకారములనబడే ప్రణవానికి సాకారమై ఉన్నది.

గాయత్రస్య సమిధస్తిస్ర ఆహుః॥
గాయత్రేణ ప్రతి మిమీతే అర్క మర్కేణ సామత్రైష్టుభేన వాకమ్॥
యద్ గాయత్రే అధి గాయత్ర మాహితం త్రైష్టు భాద్వా
త్రైష్టుభం నిరతక్షత॥ (ఋగ్వేదం)

– అని ఋగ్వేదం పలుచోట్ల చెబుతున్నది.

యోజాగార తము సామాని యన్తి।
అగ్నిర్జాగార తము సామాని యన్తి! ..... వంటి మంత్రాలు ఋగ్వేదంలోను,

సామవేదంలోను గోచరిస్తున్నాయి.

ఈ సామవిద్యకు తానే మూలమైనందున -

సామగః.. 575

1. *సామమును గానము చేయువాడు.*

గానం ఆనందస్వరూపం. నాదస్వరూపుడైన పరమాత్మ చైతన్యమే సామగానముగా వ్యక్తమౌతున్నది. సామాది వేదములన్నీ స్వామి నుండే వెలువడినవి. సామగానము చేసే శక్తి నారాయణ విభూతి.

2. **స్యతి అంతం గమయతీతి సామ.**

అంతమును కలిగించునది సామ. అజ్ఞానాన్ని అంతం చేసే వేదాధ్యయనమే సామ. వేదవిజ్ఞానాన్ని గ్రహించుట పూర్తవగానే జ్ఞానముత్పత్తి అవుతున్నది. వేదమునకు అంతం - సమగ్రవేదజ్ఞానప్రాప్తి. అదే వేదాంతం.

3. ప్రతి జీవులలో శబ్దము, జ్ఞానము -'వాక్' అనే శబ్దంచే రూపించబడుతున్నాయి. ఆ శబ్దజ్ఞానాలకు కారణమైన ఆత్మయే 'వాచస్పతి'. ఈ ఆత్మ స్వయం ప్రకాశం కనుక అయోనిజం. దేహపరంగా ఆత్మయే సూర్యుడు. **'అగ్నిర్మేవాచిశ్రితః'** - తేజః స్వరూపుడైన అగ్నియే వాగ్దేవత. ఆ అగ్నికి కారణమైన సూర్యుడు 'వాచస్పతి'.

దేవ సవితః ప్ర సువ .....

వాచస్పతిర్వాచం నః స్వదతు॥ అని 'యజుర్వేదం' చెబుతున్నది.

తాత్పర్యంగా - "అవిద్యను నశింపజేసే వేదమునకు అంతమును (వేదాంత విద్యయైన ఆత్మ జ్ఞానమును) ఇచ్చువాడు"

వేదములన్నీ అయననే గానం చేస్తున్నాయి.

ఉభేవాచౌ వదతి సామగా ఏవగాయత్రం చ

త్రైష్టుభం చాను రాజతి ॥

ఉద్గాతేవ శకునో సామగాయసి బ్రహ్మపుత్ర ఇవ

స వనేషు శం ససి॥ (ఋగ్వేదం)

ఉచ్చముగా గానం చేయబడుటచే సామమే 'ఉద్గీథమ్' అని వేదవిజ్ఞానం. గాన ప్రధానమైనది సామం.

సామముచే గానం చేయబడే 'త్రిసాముడే', గానము చేయువాడు కూడా 'త్రిసామా'. అంతేకాదు – ఆ గానం ఉన్న సామము కూడా ఆయనేనని తరువాతి నామం. ఈమూడు (త్రిసామా సామగ స్సామ) చక్కని త్రిపుటి.

వేదవాక్కులకు మూలమైన, తనకే మూలమూ లేని పరమాత్మునే– వేదములన్నీ స్తుతిస్తున్నందున –

సామః.. 576

1. *సామస్వరూపుడు.*

సామమనగా దేవతలను లొంగదీసుకొనే (అనుకూలపరచుకొనే) గానం. ఆ గానమందే ఆ శక్తి ఉన్నది. ఆ శక్తి విష్ణు చైతన్య విశేషమే.

'వేదానాం సామవేదోస్మి' – అని గీతలో పరమాత్మ వచనం.

2. *అంతమొందించువాడు.*

వెనుకటి నామంలో చెప్పిన **'స్యతి అంతం కరోతీతి సామ'.** సర్వవేదములు, కర్మములు దేనియందు లయమౌతున్నాయో ఆ బ్రహ్మమే 'సామ'. అనగా 'జ్ఞేయము'. జ్ఞానము లయించే చోటు జ్ఞేయము. స్తుతి స్తుత్యము (స్తుతింపబడేదాని) నందు లీనమౌతున్నది. స్తుతికి అంతము స్తోత (స్తుతించువాని) యొక్క అభీష్టసిద్ధియే. దానిని కలిగించువాడు 'సామ' స్వరూపుడు.

3. *తనను గానం చేసే (కీర్తించే) వారి పాపములను నశింపజేయువాడు.*

అపూర్వేణేషితా వాచస్తా వదన్తి యథాయథమ్ ।
వదన్తీర్యత్ర గచ్ఛన్తి తదాహు ర్బ్రాహ్మణం మహత్ ॥ (అథర్వవేదం)
తదైవ బ్రహ్మ విదో విదుః (అథర్వవేదం)

ఇక్కడ 'సామ' శబ్ద సంబంధమైన మూడు నామాలు (త్రిసామా

సామగస్సామ), తరువాత రానున్న 'సామగాయనః' (988) అనే నామం – వేదాలలో 'సామము'నకున్న ప్రత్యేక విభూతిని ప్రకటిస్తున్నాయి. "సామగాన లోల మనసిజ లావణ్య ధన్య మూర్ధన్యులెందరో మహానుభావులు" "మోదకర నిగమోత్తమ సామవేదసారం" "సామనిగమజ సుధామయ గాన విచక్షణ" .... వంటి కృతులలో శ్రీ త్యాగరాజస్వామి 'నాదబ్రహ్మ' సామగాన స్వరూపు నిగా పరమాత్మను సంభావించారు.

గానమయమైన స్తుతియే సామం. యజ్ఞము నందు దీని ద్వారానే దేవత యజమానికి అనుకూలుడౌతున్నాడు. దేవతానుగ్రహ హేతువైన ఈ సామస్వరూపమే విష్ణువిభూతి.

'ద్రవిణప్రదః'(570) నుండి చెప్పబడుతున్న జ్ఞానస్వరూపం, వేద స్వరూపమే ఈ నామాలలో విస్తరించింది. ఈ వేదాంత జ్ఞానమే పరమానందమైన కైవల్యపదం. కనుక –

నిర్వాణమ్.. 577

1. *(సర్వ దుఃఖముల) నిర్మూలనమే తన రూపంగా కల పరమానంద తత్త్వము.*

అగ్నిం హృదయ్యం శోకం తం తే నిర్వాపయామసి। (అథర్వవేదం)

నిర్వాపణమ్ – అనగా 'అంతము చేయుట'. అవిద్యను అంతము చేసి, కర్మ బంధాలను తొలగించగా మిగిలే పరమానందమే 'మోక్షం'. దుఃఖాల నుండి విడుదల. ఇదే పరమగతి. కేవలానంద స్వరూపం.

సామమే (భగవత్ స్తుతిగానమే) నిర్వాణసౌఖ్యమని చైతన్యమహాప్రభుని దర్శనం – **"చేతో దర్పణ మార్జనం భవ మహాదావాగ్ని నిర్వాపణమ్... శ్రీకృష్ణ సంకీర్తనమ్"।**

ఈ విధంగా దుఃఖాలనంతమొందించే దివ్యౌషధస్వరూపుడైనందున –

భేషజం.. 578

1. చికిత్స స్వరూపుడు.

'భిషజ్ చికిత్సాయాం' అనే ధాత్వర్థాన్ననుసరించి –

రోగాదులను నిర్మూలన చేసే చికిత్సా శక్తి దేనియందున్నదో అది భేషజం.

భవరోగములను, అజ్ఞానమనే పెనువ్యాధిని అంతమొందించే మోక్షప్రదుడు.

2. విశ్వంలో దేనియందు చికిత్సోపయోగమైన గుణమున్నదో అది విష్ణు విభూతి. ఆధి వ్యాధులకు చికిత్సనిచ్చే పరతత్త్వమే శ్రీహరి.

పరి పరి విధముల భవరోగములకు
హరిపాదజలమే ఔషధము
అన్నిటికినిది పరమౌషధము
వెన్నుని నామమె విమలౌషధము – అని 'అన్నమయ్య' పాట.

జలాది భూతములలో, సస్యములలో, ఓషధులలో – రోగాలను నిర్మూలించే చికిత్సనిచ్చే దివ్యగుణం భేషజం. అదే అమృతం. అదే హరిస్వరూపం.

అప్స్వన్తరమృతమప్సు భేషజ మపామీత ప్రశస్తయే।।

– అని 'ఋగ్వేదం' – "జలములలోనున్న భేషజ లక్షణమే అమృత"మని పేర్కొన్నది.

యత్ సిన్ధో యదసిక్న్యాం యత్సముద్రేషు మరుతః సుబర్హిషః।
యత్ పర్వతేషు భేషజమ్ ॥ (ఋగ్వేదం)
సోమస్య మిత్రావరుణోదితా సూర ఆదదే। తదాతురస్య భేషజమ్।। (ఋగ్వేదం)

ఔషధాన్ని తెలుసుకొని, దానిని అందించి, తగిన చికిత్స చేసే శక్తి కూడా శ్రీహరి స్వరూపమే. జ్ఞానమైన ఔషధాన్నిచ్చే ముక్తిదాత కనుకనే –

భిషక్.. 579

1. చికిత్స చేయువాడు.

సంసారమనే రోగం నుండి సమగ్రంగా విడుదల కలిగించే పరావిద్యను

భగవద్గీతాదుల ద్వారా ఉపదేశించిన ఆచార్యుడు నారాయణుడు. ఆయన అనుగ్రహం చేతనే భవరోగం నుండి విడుదల.

వ్యాధిని నిర్మూలించే విజ్ఞానం, శక్తి నారాయణ విభూతి.

ఉన్నో వీరాం అర్పయ భేషజేభిః ।

భిషక్తమం త్వాం భిషజాం శృణోమి॥ (ఋగ్వేదం)

ప్రథమోదైవ్యో భిషక్॥ (యజుర్వేదం)

యత్రౌషధీః సమగ్మత రాజానః సమితావివ।

విప్రః స ఉచ్యతే భిషగ్ రక్షోహామీవచాతనః॥ (ఋగ్వేదం)

ఈ విధంగా తాను భవరోగ చికిత్సకుడై, కర్మ బంధములను సమూలంగా తొలగింపజేయుట చేత –

సన్న్యాసకృత్..... 580

1. *సన్న్యాసమును చేయు (ఏర్పరచు)వాడు.*

'అసు క్షేపణే' – అనే ధాత్వర్థాన్ని అనుసరించి – 'తొలగించు స్థితి' అని అర్థం. 'సం-నిః' అనే ఉపసర్గలు 'సంపూర్ణముగా' అనే అర్థాన్ని తెలియజేస్తున్నాయి. సర్వమును తొలగించిన (విడిచిన) స్థితి – సన్న్యాసం. సర్వ కర్మ బంధములను పరిహరింపజేసే, మోక్ష సాధనమైన సన్న్యాస స్థితిని కలిగించువాడు భగవానుడు. ఈశ్వరానుగ్రహము చేతనే కర్మబంధమోచక స్థితి లభిస్తుంది.

2. కేవల మోక్ష పురుషార్థానికై ఏర్పరచిన వ్యవస్థ సన్న్యాసం. ముముక్షువులకు సన్న్యాసమనే చతుర్థాశ్రమ మార్గాన్ని ఏర్పాటు చేసినది విద్యారూపుడైన నారాయణుడే. శ్రుతి విహితమైన సన్న్యాసాశ్రమం, మోక్షసాధనార్థం నియమించబడినది.

'వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సన్న్యాసయోగా యతయశ్శుద్ధ సత్త్వాః'

– వంటి ఉపనిషద్వాక్యాలు సన్న్యాసయోగ ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. అయితే ఆశ్రమ స్వరూపంగానేకాక, చిత్తశుద్ధి కలిగిన వివేకి వేదాంత విచారణ

ద్వారా సాధించే 'విషయలాలస నుండి విముక్తి'ని సన్న్యాసస్థితిగా నిర్వచించుకోవచ్చు. ఆ స్థితి భగవానుని కృపవలననే లభిస్తున్నదని ఈ నామార్థం.

3. సన్న్యాసమార్గముతో సంసార బంధనాన్ని నిర్మూలించువాడు.

సన్న్యాసేన కృన్తతీతి సన్న్యాసకృత్.

రజస్తమస్సులను ఛేదించి. 'నాది' అనే అభిమానాన్ని తొలగించడమే సన్న్యాసం. సాత్విక భర న్యాసం సన్న్యాసం.

'భరన్యాసం' – అనగా పరమాత్మయందు బుద్ధిని ఉంచుట.

ఈ నిలుకడను కలిగించి, తద్వారా బంధనాన్ని 'కృన్తనము' ఛేదించువాడు – సన్న్యాసకృత్.

బ్రహ్మభావ భావితస్తస్యైవ సన్న్యాసశ్రమోపదేశః (సత్యభాష్యం)

కేవల బ్రహ్మభావనయే సన్న్యాసం. దానిని కలిగించే బ్రహ్మమే సన్న్యాసకృత్.

4. **ఋతస్య తన్తుం వితతం విచృత్య తదపశ్యత్ తదభవత్ తదాసీత్॥**

విశ్వధర్మాలను నిర్వహిస్తూనే వాటితో తన సంగమును విచ్ఛేదించి (విచృత్య) చూచువాడు, కలుగువాడు, ఉండువాడు. కేవల సాక్షియైన పరమాత్మ.

'నిర్వాణమ్' (577) నామం నుండి 'పరాయణమ్' (585) నామం వరకు వేదాంత మార్గం చెప్పబడినట్లుగా భావించవచ్చు. సన్న్యాసమును కలిగించి (ఏర్పరచి) అనుగ్రహించే స్వామి. తదాశ్రమానికి ముఖ్యమైన 'శమము'ను బోధించువాడు కనుక–

శమః.. 581

1. ఇన్ద్రియ వృత్తులను నిరోధించుట 'శమము'. అది నారాయణ స్వరూపము. దానిని కలిగించువాడు కూడా అయనయే.

ఇంద్రియములు తమ తమ విషయాలలో ప్రవర్తిల్లకపోవడమే శమం. ఇది యతికి (సన్న్యాసికి) ప్రధానధర్మం. '**తత్కరోతి – తదాచష్టే**'... అనే పాణినీయ సూత్రానుసారం – శమమును కలిగించువాడు, బోధించువాడు – 'శమః'.

యతీనాం ప్రశమో ధర్మో నియమో వనవాసినాం।
దానమేవ గృహస్థానాం శుశ్రూషా బ్రహ్మచారిణామ్॥

"బ్రహ్మచారులకు శుశ్రూషయే ధర్మం. గృహస్థునకు దానం, వానప్రస్థులకు నియమము, యతులకు మిక్కిలి 'శమము' (ఇంద్రియవృత్తులను పూర్ణముగా నిరోధించుట) - ధర్మములు" అని స్మృతి వాక్యం. ఆత్మజ్ఞాన మయమైన 'సన్న్యాసకృత్' నామం తరువాత ఈ నామం ఉండడంలో ఔచిత్యాన్ని గమనించ వచ్చు.

ఈ శమమే పరిపూర్ణ జ్ఞానరూపుడైన పరమాత్ముని తత్త్వం. తనను ఆరాధించు వారికి ఈ శమాన్ని ఉపదేశించి, కలిగించేవాడు ఆయనే. **శాన్త్యుపాయమాచష్టే ఇతి శమః** (శ్రీపరాశరాభట్టరు).

2. *ప్రళయంలో సర్వభూతకోటిని శమింపజేయువాడు కనుక 'శముడు'.*

సూర్యుడు చీకటిని శమింపజేయునట్లు, స్వాత్మ స్వరూప జ్ఞానంతోనే అజ్ఞానాంధకారం శమింపబడుతోంది.

ఆవః శమం వృషభం తుగ్ర్యాసుః ॥ (ఋగ్వేదం)
ఇన్ద్రో యాతోఽవసితస్య రాజా శమస్య చ
శృంగిణో వజ్రబాహుః॥ (ఋగ్వేదం)

శమము ద్వారా లభించే నిర్వికారస్థితి ఆ పరతత్త్వమే కనుక -

శాన్తః.. 582

1. *శమమును పొందియున్నవాడు.*

విషయసుఖాసక్తి లేని స్థితి శమము. పరమాత్మ నిస్సంగుడు, పరిపూర్ణుడు. **"శాంతః - అవికృతమానసః; స్వస్థోవా"**, - తన స్థితి యందు తానుండి, వికారములకు లోనుకాని స్వభావము కలవాడు శాన్తుడు.

సముద్రమువలె అనంతుడైనప్పటికీ, అలలు లేని స్తబ్ధ వార్ధివలె ఏ వికారము లేనివాడు.

నిష్కలం నిష్క్రియం శాంతం॥ (శ్వేతాశ్వతరోపనిషత్)

శాంతో అగ్నిః క్రవ్యాచ్ఛాన్తః పురురేషణః।

అథో యో విశ్వదావ్యస్తం క్రవ్యాదమశీశమమ్ ॥ (అథర్వవేదం)

ఈ శాన్త స్వభావము చేతనే తాను చెదరని స్వస్థితియందుండుటచే -

నిష్ఠా.. 583

1. అన్నీ తనయందు నిలిచి యున్నవాడు.

ప్రళయంలో అన్ని భూతములు అతనియందే పూర్ణముగా నిలిచి యుంటాయి. **నితరాం తిష్ఠంతి.**

'స్థ' అనే శబ్దమే 'ష్ఠ'గా వ్యవహరింపబడుతున్నది.

చలనమునకు వ్యతిరేకమైన స్థిరత్వమే 'ష్ఠ'. అది పూర్ణముగా ఉండుట 'నిష్ఠ'.

గతి (చలము) దేనియందు నివర్తింపబడినదో అది 'నిష్ఠ'. (గతి నిరోధాశ్రయము). చలనశీలమైన పరిణామ జగతి ఈ నిశ్చలుడైన జగన్నాథునియందే నిలచి ఉన్నది.

నిశ్చలుడైన సూర్యుని ఆధారం చేసుకొని గ్రహాదులు చలిస్తున్నాయి. వాటి చలనానికి ఆధారమైన సుస్థిర సూర్యతేజం వలె, జగచ్చలనానికి జగన్నాథుడే నిష్ఠ.

యూథే నః నిష్ఠా వృషభో వి తిష్ఠసే॥ (ఋగ్వేదం)

శాంత స్థితిలో ఇంక ఏ వికారమూ లేని నిశ్చలత్వమే, అదే నిష్ఠ. అది హరి స్వరూపం.

సమస్తమైన అజ్ఞానం నివృత్తి చెందే ఆ స్థితి -

శాన్తిః.. 584

1. సమస్త అవిద్య నివృత్తి చెందిన స్థితి. ఇది బ్రహ్మ స్వరూపం.

సమస్తావిద్యానివృత్తిః శాన్తిః - అని జగద్గురు వచనం.

సూర్య చంద్రాదులు, భూతములు ఎవరి చేత ధరింపబడుతున్నాయో, నిగ్రహింపబడుతున్నాయో, ఎవరి యందు శమిస్తు (లయిస్తు)న్నాయో ఆ

పరతత్త్వమే శాన్తిః. సర్వమునకు ఆధారమైన బ్రహ్మమే శాన్తి. ఈ బ్రహ్మమునందే సర్వము శమిస్తున్నది. ఈ బ్రహ్మమునందు మనోలయాన్ని పొందినవాడు శాన్తుడౌతాడు.

'శమః' నుండి ఈ నామం వరకు నాలుగు నామాలు సర్వ వికారములు అణగిన పరబ్రహ్మస్థితిని బోధిస్తున్నాయి.

"ద్యౌః శాన్తి రన్తరిక్షం శాంతిః పృథివీశాన్తిరాపః శాన్తి రోషధయశాన్తిః వనస్పతయః శాన్తి ర్విశ్వాదేవాః శాంతిర్బ్రహ్మా...

.... శాన్తిరేవ శాన్తిః" (యజుర్వేదం)– పృథివ్యాదులన్నీ ఈ బ్రహ్మము చేతనే ధరింపబడి, దీనియందే లీనమౌతున్నాయి.

ఈ శాంతిని మించిన గొప్ప గతి లేదు కనుక –

పరాయణమ్.. 585

1. ఉత్కృష్టమైన గతి తానైనవాడు.

పునరావృతి లేని శాశ్వత కైవల్యమే తాను. వేదాంతార్థ విచారణ వేత్తలైన సన్న్యాసులకు శమము ద్వారా లభించిన శాన్తస్థితియే బ్రహ్మ ప్రాప్తి. దానిని మించినది మరియొకటి లేదు. మృత్యువు (అవిద్య) నుండి దాటుటకు ఈ ఆత్మ (బ్రహ్మ) ప్రాప్తి తప్ప మరో మార్గం లేదని శ్రుతి మాతృ బోధ –

వేదాహమేతం పురుషం మహన్తరే ఆదిత్య వర్ణం తపసః పరస్తాత్।
తమేవ విదిత్వాతిమృత్యుమేతి నాన్యః పథా విద్యతేఽ యనాయ॥

(యజుర్వేదం)

దీనికి 'పరాయణః' అనే పుంలింగ శబ్దం పాఠాంతరంగా కనిపిస్తున్నది.

'పరం అయినం యస్యసః' 'ఎవని స్థానము ఉత్కృష్టమైనదో అతడు – పరాయణుడు.

'తద్ధామ పరమం మమ'

'విముచ్య నిర్మమ శ్శాన్తో బ్రహ్మ భూయాయకల్పతే ।
బ్రహ్మభూతం ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।
సమస్సర్వేషు భూతేషు మద్భక్తింలభతేపరామ్॥

"బ్రహ్మ భూతుడైనవాడు దేనికీ శోకించడు. దేనినీ వాంఛించడు. సర్వ భూతములందు సమబుద్ధి కలిగి నా యందు పరాభక్తిని పొందుతున్నాడు."

ఇక్కడ 'పరాభక్తి'యే పరాయణమ్. అదే జీవుని లక్ష్యం.

'అయ గతౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి అందరికీ పరమోత్కృష్టమైన గతి (ఆశ్రయం) ఈతడే. శాన్త స్థితి ద్వారా పొందే గతి ఇది. మోక్ష పురుషార్థ సాధనమైన సన్న్యాసానికి ఈ కైవల్యమే ఫలం.

నమోపవర్గాయ పరాయణాయ॥ – అని గజేంద్రుడు శ్రీమహావిష్ణువును స్తుతించాడు.

అవిద్యకు అతీతమైన ఈ శాంతమే శుభం. ఆ శుభమే తన స్వరూపంగా కలిగి ఉన్నందున –

శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః।
గోహితో గోపతి ర్గోప్తా వృషభాక్షో వృషప్రియః॥ 63

***586.** శుభాంగః, **587.** శాన్తిదః, **588.** స్రష్టా, **589.** కుముదః,*
***590.** కువలేశయః, **591.** గోహితః, **592.** గోపతిః, **593.** గోప్తా,*
***594.** వృషభాక్షః, **595.** వృషప్రియః॥*

శుభాఙ్గః.. 586

1. శుభమైన అంగములు కలవాడు.

శాంతమైన పరతత్త్వమే భక్తానుగ్రహార్థం, జగన్నిర్వహణార్థం లీలామయ మంగళ రూపాన్ని ధరిస్తున్నది. శుభమైన అంగములతో శోభించే దివ్య మంగళ విగ్రహుడు విష్ణువు.

"శాన్తాకారం భుజగశయనం..... మేఘ వర్ణం శుభాఙ్గమ్" – అనే ధ్యాన శ్లోకంలోని క్రమం. 'శాన్తః, శాన్తిః' వంటి నామాల తరువాత ఈ 'శుభాఙ్గ' నామం ద్వారా స్ఫురిస్తుంది.

2. బ్రహ్మ ప్రాప్తి సాధనకు అనువైన శమదమాదులతో కూడిన అష్టాంగ యోగవిద్య శ్రీహరిస్వరూపమని – ఈ నామం సూచిస్తున్నది. శుభమైన ఎనిమిది యోగాంగములే శుభాంగములు – వాటితో కూడిన యోగస్వరూపుడు శుభాంగుడు.

1. యమ, 2. నియమ, 3. ఆసన, 4. ప్రాణాయామ, 5. ప్రత్యాహార, 6.ధారణ, 7. ధ్యాన, 8. సమాధులే యోగాంగములు.

నారాయణుని రూపము, లీలలు, గుణ మహిమలు... అన్నీ శుభములైన అంగములే.

3. **అఙ్గతి గచ్ఛతి వ్యాప్నోతీత్యఙ్గాః.** వ్యాపించునవి అంగములు.

శుభముగా (ప్రకాశముగా) వ్యాపించు చైతన్య స్వరూపుడు శుభాంగుడు. ప్రకాశ, వ్యాపకత్వములు కల విష్ణువు.

ఆ ద్యోతనిం వహతి శుభ్రయామా ॥ (ఋగ్వేదం)

శుభాంగునిగా భాసించుట శాంతి ప్రదానం కొరకే –

శాన్తిదః.. 587

1. శాన్తిని ఇచ్చువాడు.

రాగము, ద్వేషము మొదలైన దోషాల నుండి పూర్తిగా విడుదల... అనే స్థితి శాంతి. దీనిని ప్రసాదించునది శాంతమే తానైన బ్రహ్మమే. దానిని గ్రహించినవానికే విడుదల.

విశ్వస్యైకం పరివేష్టితారం జ్ఞాత్వా శివం శాన్తిమత్యన్తమేతి॥

(శ్వేతాశ్వతరోపనిషత్తు)

విశ్వమంతా ఒకడై వ్యాపించిన త్రిగుణాతీతుడైన పరమ మంగళుడైన పరమాత్మను ఎరిగినవాడే పరమశాంతిని పొందుతున్నాడు.

తత్ప్రసాద్ పరాం శాన్తిస్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ । (భగవద్గీత)

"ఆ సర్వేశ్వరుని అనుగ్రహం చేతనే శాశ్వతమైన పరమశాన్తి స్థానాన్ని పొంద గలవు." అని గీతాచార్యుని బోధ.

2. జగతిని ప్రళయమందు తనలో శమింపజేయువాడు, తిరిగి ఈ విశ్వ చక్రాన్ని సృజింపజేయువాడు. కనుకనే -

స్రష్టాః.. 588

1. సృష్టించినవాడు.

ఆదిగా ఈ జగతిని, భూత జాలాన్ని సృజించినవాడు అతడే.

"కల్పక్షయే పునఃస్తాని

కల్పాదౌ విసృజామ్యహమ్" - "కల్పాదియందు నేనే విశిష్టముగా, వివిధముగా సృజించుచున్నాను" - అని గీతలో పరమాత్ముని వచనం.

ప్రళయకాలమందు తనలో సర్వమును విలీనం చేసి (శాన్తిదః), తిరిగి కల్పాదిలో సృజింపజేసేవాడు.

సృజామి సౌమ్యం మధుః ॥ (ఋగ్వేదం)

సృజింపజేసిన సృష్టియందు తానే ఆనంద స్వరూపుడై వ్యాపించినవాడు -

కుముదః.. 589

1. భూమియందు హర్షించువాడు.

'కు' అనగా భూమి. **'ముదహర్షే'** అనే ధాత్వర్థాన్ననుసరించి 'మోదము' అనగా హర్షము. భూమి భూతాదులకు భోగములను కలిగించే స్థానం. ఈ భోగముల ద్వారా జీవులను భూమి యందు ప్రవర్తింపజేసి, వారియందు ఆనంద స్వరూపుడై భాసించువాడు.

పృథివియందు 'తాను భోక్తను' అనే భావంచే ఆత్మ చైతన్యం జీవునిగా వ్యవహరింపబడి భోగాలననుభవిస్తున్నది.

అనీశశ్చాత్మా బధ్యతే భోక్తృభావాత్ (శ్వేతాశ్వతరోపనిషత్).

ఆ విధంగా వ్యాపించిన ఆత్మస్వరూపుడు కుముదుడు.

2. లీలగా పృథ్వీపై అవతరించి వినోదించువాడు.

3. 'కై శబ్దే' అను ధాత్వర్థాన్ని అనుసరించి **'కాయతి మోదతే చేతి కుముదః।** (సత్యభాష్యం)।

తన ఆనందాన్ని వ్యక్తీకరించుటకు ధ్వనిని చేయువాడు - కుముదుడు. విశ్వమునందు ఆనందముతో పలికే ధ్వని ఈశ్వర రూపం.

వేదాదులన్నీ ఆనంద ధ్వనులే.

వాచస్పతిం విశ్వకర్మాణమూతయే।। (ఋగ్వేదం)

ఆనందామోదాః ప్రముదో భీమోదముదశ్చ యే ।। (అథర్వవేదం)

పృథివియందు ఆనందించు ఈతడే, ఈ భూమిని ఆవరించిన జలమందు కూడా భాసిస్తున్నాడు. కనుకనే -

కువలేశయః.. 590

1. *సముద్రమునందు శయనించువాడు.*

'కు' అనగా భూమి. 'వల' అనగా చుట్టియున్నది. భూమిని చుట్టియున్న సముద్రము 'కువల'. దానియందు శయనించు (సాగర శయనుడు) శ్రీహరి.

2. సర్పముల ఉదరం భూమిని ఆశ్రయించి ఉన్నది. కనుక 'కువల'మనగా సర్పోదరం. దానియందు శయనించువాడు. అనగా ఆదిశేషుని ఉదరమందు శయనించిన ఆదినారాయణుడు.

"కౌ భూమ్యాం వలతే సంశ్రయతే ఇతి సర్పాణాం ఉదరం - కువలం. తస్మిన్ శేతే ఇతి కువలేశయః" (శ్రీ శంకరభాష్యం)

3. *సర్వజీవుల యందు వ్యాపించునది.*

'కువలేశులు' అనగా జీవులు. **'కౌ భూమే అసంసారం భ్రామ్యన్తీతి కువలాః జీవాః. కువలాశ్చతే ఈశాశ్చ కువలేశాః. కువలేశానేయాతీతి కువలేశయః'** (శ్రీపరాశరభట్టరు).

భూమియందు సంసారమున్నంతవరకు చుడుతూ ఉండువారు కువలులు (జీవులు). వారు తమ దేహేంద్రియాలకు తామే 'ఈశుల'మని భావించువారు.

వారియందు వ్యాపించినవాడు కువలేశయుడు – శ్రీ విష్ణువు.

4. **'వల సంవరణే సఞ్చరణే చ'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి, 'వల' శబ్దానికి ఆవరించునది, సంచరించునది – అని అర్థాలు.

భూమి (కు) యందు సంచరించు సర్వ జీవులను శాసించువారు బ్రహ్మాది దేవతలు.

తాన్ యాతి – ఈశన శక్తి దాతృత్వేన ప్రాప్నోతీతి కువలేశయః (సత్యభాష్యం)

వారియందు శాసించు శక్తినిచ్చుట ద్వారా వ్యాపించిన పరమాత్ముడు కువలేశయుడు. వారికి తాను శక్తిని ప్రసాదించి జగచ్చక్రాన్ని ప్రవర్తింపజేస్తున్నాడని భావం.

5. పృథ్విని తన తేజస్సుతో ఆవరించి, తన కాంతికిరణముల ద్వారా సంచరించు సూర్యుడే 'కువలుడు'. ఆ సూర్య మండలమందు (శేతే) భాసించే సర్వజగదంతర్యామి విష్ణువు కువలేశయుడు.

6. మన శరీరమే 'కు' (పార్థివం). దీనియందు తన చైతన్యాన్ని ఆవరింపచేసిన ఆత్మయే 'కువలేశయుడు'.

7. 'కు' అనగా (చూ. 589 నామం) వాక్ (జ్ఞాన) శక్తి. 'వల' – సంచరణ శక్తి. 'ఈశ'– శాసక శక్తి. ఈ వాక్, చలన, శాసక శక్తులతో జగమంతా వ్యాపించిన విష్ణువు.

యేన ద్యౌరుగ్రా పృథివీ చ దృఢా ॥ (యజుర్వేదం)

య ఈశే అస్య ద్విపదశ్చతుష్పదః॥ (యజుర్వేదం)

.... తదు సర్వస్యాస్య బాహ్యతః॥ (యజుర్వేదం)

– వంటి వేద వాక్యాలు పై భావాన్ని దృఢపరుస్తున్నాయి.

8. తక్షక స్వరూపుడు.

కువలస్య బదరీఫలస్య (శ్రీశంకరభాష్యం)

'కువలం' అనగా రేగుపండు – దానియందు చేరి, ఋషివాక్యాన్ని నిజం చేస్తూ పరీక్షిత్తును కాటువేసిన సర్పం తక్షకుడు. దివ్య సర్పాలలో ఒకటైన

తక్షకుడు కూడా విష్ణు విభూతి విశేషమే.

– పై విధాలుగా పృథివిపై నిర్వహిస్తున్న వైనమంతా; భూమి, దానియందున్న జీవుల హితం కొరకే కనుక –

గోహితః.. 591

1. *భూమికి హితము కలిగించువాడు.*

'గో' శబ్దానికి బహ్వర్థాలు. అన్నిటినీ ఇక్కడ భావించవచ్చు. 'గో' అనగా భూమి. వెనుకటి (కుముదః, కువలేశయః) రెండు నామాల ననుసరించి, ఈ నామానికి 'భూమి' అనే అర్థాన్ని స్వీకరించడమే సమంజసం.

గోవులనగా ప్రాణులు అని కూడా అర్థం. **'గమ్లృ గతౌ'** అనే ధాత్వర్థాన్ననుసరించి 'చలించునవి– గోవులు'. ఈ ప్రాణులకు, జగతికి హితము కలిగించువాడు గోహితుడు.

'హితః – గతః – వ్యాపకత్వేన ప్రాప్తః' – సర్వ ప్రాణులయందు వ్యాపకుడైనవాడు– గోహితుడు. చేతనములందు చైతన్యముగా ఉన్నవాడు.

2. భూహితాన్ని కోరిన ఆతడే, భూదేవి గోరూపముగా ఆశ్రయించి ప్రార్థించిన మీదట, అవతరించాడు. భూమికి హితముగా దివ్య దేహాన్ని స్వీకరించి, భూభారాన్ని తొలగించి, గోవర్ధన గిరిని ఉద్ధరించి – గోవులకు, గోపీ గోపకులకు హితము కలిగించిన శ్రీకృష్ణుడు.

పైన చెప్పిన భూమికి, ప్రాణులకు హితుడై ఉన్న ఆతడే ప్రభువు కనుక –

గోపతిః.. 592

1. *సర్వప్రాణులను పాలించువాడు.*

కదలుతున్న రథాన్ని రక్షించి, నడిపించి, పాలించువాడు సారధి. అదే విధంగా సర్వ ప్రాణులను కదిలించి ఏలుకొనువాడు గోపతి. భూమికి పతియైన శ్రీహరి, తన పాలనతో ధర్మ ప్రతిష్ఠాపన చేస్తున్నవాడు.

దేహము గోష్ఠ (గోశాల) దేవతలు (ఇంద్రియాధిదేవతలు) గోవులు. వారిని నియమించి పాలించు ఆత్మ స్వరూపుడు గోపతి. ఈ భావమే వేదమాత ఇలా వివరిస్తోంది.

తస్మా ద్వై విద్వాన్ పురుషమిదం బ్రహ్మేతి మన్యతే ।
సర్వాహ్యస్మిన్ దేవతాగావో గోష్ఠ ఇవాసతే ॥ (అథర్వవేదం)

గోహితాన్ని కోరే 'పతి'గా నిరంతరం రక్షిస్తున్న కారణంగా –

గోప్తా .. 593

1. *జగద్రక్షకుడు.*

'గుపూ రక్షణే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి 'గోపనము (రక్షణము) చేయువాడు'– గోప్తా. సర్వ రక్షకుడు.

2. *తనను తాను మరుగుపరచుకొనువాడు.*

గోపనము అనగా 'కప్పుట' 'దాచుట' అని అర్థాలున్నాయి. తన మాయా శక్తిచే తన స్వరూపాన్ని ఆవరింపజేయువాడు. తాను పరమాత్మయై యుండి కూడా, తన స్వస్థితిని మరుగుపరచి మోహింపజేసిన కృష్ణాది అవతారాలు ఇక్కడ స్మరణీయాలు.

అగ్నిర్మా గోప్తా పరిపాతు విశ్వత
ఉద్యన్ సూర్యోనుదతాం మృత్యుపాశాత్।

ఈ హితత్వ, పతిత్వ, రక్షకత్వములతో అభీష్టములను వర్షింపజేస్తున్నందున–

వృషభాక్షః.. 594

1. *వర్షించు కన్నులు కలవాడు.*

'వర్షతి ఇతి వృషః – వృషభః'. భక్తాభీష్టములను తన దయామయ నేత్రములతో (దృష్టితో) వర్షింపజేస్తున్న భక్త వత్సలుడు మాధవుడు.

2. *ధర్మదృష్టి కలవాడు.*

సర్వకామములను వర్షింపజేసే ధర్మమే వృషభము. ఆ ధర్మమునే తన దృష్టి (అక్షి)గా కలవాడు. సర్వ జగతిని ధర్మ దృష్టితో నియమించువాడు.

3. సంసార చక్రానికి ఆధారమై ఉన్న బండికన్ను (ఇరుసు) ధర్మమే. అటువంటి ధర్మమే విష్ణువు.

4. **'వృషు సేచనే', 'అక్ష వ్యాప్తౌ'**- అనే ధాత్వర్థాల ననుసరించి తన కిరణజాలాలను క్రమంగా మేఘాల ద్వారా నీటిని భూమిపై వర్షింపజేస్తూ, వ్యాపించిన సూర్యరూప నారాయణుడు 'వృషభాక్షుడు'. అగ్నికి కూడా ఈ నామం వర్తిస్తున్నది. సూర్యాగ్నులు హరిస్వరూపాలే.

త్వమగ్నే వృషభః పుష్టి వర్ధన ఉద్యతస్రుచే భవసి శ్రవాయ్యః।। (ఋగ్వేదం)
భువశ్చక్షు ర్మహః - ।।ఋగ్వేదం।।
ధర్మ స్వరూపుడు కనుకనే -

వృషప్రియః.. 595

1. *ధర్మమునకు ప్రియుడు.*

స్వామికి ప్రీతి కలిగించేది ధర్మమే. ప్రవృత్తి నివృత్త్యాత్మకమైన వేద ధర్మమే. ఇదే వృషము.

2. వర్షించువాడు, ప్రియమైనవాడు.

భక్తులకు కోరినవి వర్షింపజేసే ఈ కరుణాళువే, భక్తులకు ప్రీతిపాత్రుడు. ధర్మస్వరూపుడు - ప్రియ స్వరూపుడు... ఈతడే.

3. **'ప్రీఞ్ తర్పణే కాన్తౌ చ'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి -
ప్రీణతీ చ ప్రియః. తృప్తి కలిగించువాడు, శక్తిని వెదజల్లువాడు 'ప్రియుడు'. వర్షించి ప్రీతిని కలిగించువాడు. కాంతినీ, మేఘాలను వర్షింపజేసి జగతికి ప్రీతి కలిగించే సూర్యాది జోతిస్స్వరూపుడు.
వృషోగ్నిః సమిధ్యతేశ్వో న దేవవాహనః ।। (ఋగ్వేదం)
ప్రియ మిన్ద్రస్య కామ్యం సనిం మేధామయాసిషమ్ ।। (ఋగ్వేదం)
ఈ ధర్మ నిర్వహణలో వెనుతిరగని వాడైనందున -

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృ చ్ఛివః।
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాంవరః॥ 64

596.అనివర్తీ, 597. నివృత్తాత్మా, 598. సంక్షేప్తా, 599. క్షేమకృత్,
600.శివః, 601.శ్రీవత్సవక్షాః, 602. శ్రీవాసః, 603. శ్రీపతిః,
604 శ్రీమతాంవరః॥

అనివర్తీ.. 596

1. ధర్మము నుండి మరలువాడు కాడు.

ధర్మప్రియుడైన స్వామి ఏనాడు విశ్వనియమమైన ధర్మము నుండి మరలడు, మరలనివ్వడు. తన రామాది అవతారాలలో ఎన్నడూ స్వధర్మము నుండి మరలకుండా ప్రవర్తించినవాడు.

'నాహమర్థపరోలోకే కేవలం ధర్మమాస్థితమ్' అని శ్రీరాముని గా తానే ప్రకటించాడు. (నేను అర్థ పరుడనుకాను – కేవలం ధర్మము నందున్నవాడను) (వాల్మీకి రామాయణం).

2. దేవాసురసంగ్రామంలో ఎన్నడూ వెనుతిరగని మహావీరుడు.
3. సూర్యుడు తన కిరణములను వెదజల్లుట, జలము ప్రవహించుట, ఆకాశము వ్యాపించుట, వాయువు చలించుట.... వంటి ధర్మములు ఏనాడూ విడువనివి. విశ్వమంతా సృష్ట్యాది యందు ఏర్పడిన ఈ నిత్య నియమాలను మరల్చకుండా ప్రళయపర్యంతం యథా విధంగా నిర్వహిస్తున్నవాడు.

చిత్తో న యాయన్నశ్వినో రనివృత్తః
పరి వృణక్త్య శమనస్పృణా దహన్॥ (ఋగ్వేదం)

4. ధర్మము రెండు విధాలు. ఒకటి ప్రవృత్తి. రెండవది నివృత్తి. 'వృష' నామం ద్వారా వ్యక్తమైన ధర్మ స్వరూపాలలో మొదటిది ఈ 'అనివర్తీ' (ప్రవృత్తి రూప

ధర్మం) నామం ద్వారాను, రెండవది తరువాతి (నివృత్తాత్మా) నామం ద్వారాను చెప్పబడుతున్నాయి. ధర్మాన్ని విశ్వమంతా ప్రవర్తింపజేస్తున్నప్పటికీ విశ్వానికి అతీతుడైన నిస్సంగుడు కనుక–

నివృత్తాత్మా.. 597

1. విషయముల నుండి మరలని స్వభావము కలవాడు.

ఇది నివృత్తి రూపధర్మాన్ని తెలియజేస్తోంది. విశ్వమంతటినీ నిర్వహిస్తున్నప్పటికీ, తాను దేనికీ అంటక భాసించే ఆత్మ స్వరూపుడు.

ఉప త్వా రాతిః సుకృతస్య నిష్కాన్నివర్తస్వ హృదయం తప్యతేమే।। (ఋగ్వేదం).

2. ముందుగా జగతిని సృష్ట్యాదులతో ప్రవర్తింపజేయువాడు, తిరిగి ప్రళయంలో అంతటినీ నివర్తింపజేయువాడు.

పై విధంగా జగతిని సంకోచపరచి, వ్యాకోచపరచువాడు కనుక –

సంక్షేప్తాఃఃః

క్షేమకృత్.. 599

1. లభించిన దానిని కాపాడువాడు.

'యోగక్షేమం వహామ్యహం' అని భగవానుని మాట. యోగము– లేనిది లభించుట. క్షేమం– ఉన్నదానిని కాపాడుట. సాధన ద్వారా పొందిన ఫలం యోగం. ఆ పొందబడిన దానిని రక్షించుట క్షేమం.

ముముక్షువులైన నివృత్తి మార్గగాములకు మోక్ష రూపమైన క్షేమాన్ని ప్రసాదించువాడు. 'సంక్షేప్తా' కర్మ బంధ కారకత్వాన్నీ, క్షేమకృత్' మోక్ష ప్రదానాన్ని తెలియజేస్తున్నాయి.

"సంసార మోక్షస్థితి బంధ హేతుః". జీవుల అధికారాన్ని అనుసరించి కర్మలంపటులకు బంధాన్నీ, బ్రహ్మ నిష్ఠులకు మోక్షాన్ని ప్రసాదించువాడు.

2. **'క్షి క్షయే' 'క్షి నివాస గత్యోః' 'క్షి హింసాయామ్'** అనే మూడు రకాల ధాత్వర్థాలను గమనించినట్లయితే –

సర్వ బంధనముల పరిహారమే క్షేమం. దానిని కలిగించువాడు.

ఆశ్రయము, గతి – క్షేమం. దానిని కలిగించువాడు.

– అని రెండు అర్థాలను స్వీకరించవచ్చు.

స హి క్షేమో హవిర్భుజుః । (ఋగ్వేదం)

యస్యోరుషు త్రిషు విక్రమణే ష్వధిక్షియన్తి భువనాని విశ్వా ॥ (ఋగ్వేదం)

సకల బంధనాలను తొలగించిన తరువాత మిగిలే, త్రిగుణాతీత అఖండ పరతత్త్వమే శాశ్వతమంగళం కనుక –

శివః.. 600

1. అన్నిటినీ తనయందుంచుకొనువాడు.

శేతేస్మిన్ సర్వమితి శివః. ఆ తత్త్వమునందు అన్నీ ఆధారపడి ఉన్నాయి తిరిగి దానియందే సంక్షేపాన్ని పొందుతున్నాయి. అన్నీ లయమైన తరువాత, అన్నిటికీ ఆధారమైన అధిష్ఠాన చైతన్యమే మిగిలి ఉంటుంది. ఆ శాశ్వత బ్రహ్మమే శివం.

2. తన నామస్మరణ మాత్రం చేతనే పావనం చేయువాడు.

అఖండ మంగళస్వరూపుడు, త్రిగుణాతీతుడు కనుక త్రిగుణజనితమైన కర్మ దోషాలన్నిటినీ దహింపజేసి, శాశ్వత మంగళమైన మోక్షాన్ని ప్రసాదించువాడు. అదే పరమశాంతస్థితి - **'ప్రపంచోపశమం శాంతం శివం చతుర్థం'** (మాండూక్యోపనిషత్తు) 'తురీయ స్థితి'యే శివం. నిర్వికల్ప సమాధ్యవస్థలో అనుభూతమయ్యే సచ్చిదానంద తత్త్వమిది.

అందరికీ ఆశ్రయమైన అధిష్ఠాన చైతన్య స్వరూపమే సర్వైశ్వర్య మయం కనుక -శ్రీవత్సవక్షః(601)

"శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్రస్య షష్ఠం నామశతకం సంపూర్ణమ్॥

- శ్రీవిష్ణువిద్య (శ్రీవిష్ణుసహస్రనామభాష్యం)లో ఆరవశతకము సంపూర్ణము-

శ్రీవత్సవక్షాఃఃః

'అభయవచనము పలుకువాడు' శ్రీవత్సవక్షుడు.

శ్రీవత్సులు – లక్ష్మీ వాత్సల్యపాత్రులు, వేద విద్యావేత్తలు, దైవీ సంపన్మయులు, శుభంకర వచనాలను పలికే సత్పురుషులు. వారికి అనుగ్రహవచనాలతో అభయాన్నిచ్చి, వారి హృదయమందు భాసించువాడు శ్రీవత్సవక్షుడు.

మందోదరి శ్రీరాముని అభివర్ణిస్తూ **"శ్రీవత్సవక్షా నిత్యశ్రీః"** అని స్తుతించినది (శ్రీమద్రామాయణం).

శ్రీవత్సలాంఛనంతోపాటు శ్రీదేవిని కూడా తన హృదయాన వసింపజేస్తున్నందున –

శ్రీవాసః.. 602

1. లక్ష్మీకి నివాసమైనవాడు.

సర్వశోభలకు ఆవాసమైన స్వామి వక్షఃస్థలాన, ఎన్నడూ బాయకుండా (అనపాయినిగా) వసిస్తున్నది శ్రీ. జగన్నిర్వహణ హేతువులైన ఈశ్వరశక్తులే విభూతులు. ఆ విభూతుల సమైక్యరూపమే 'శ్రీ'. ఆ విభూతులన్నిటికీ ఆధారమైన వాడు, తనయందే వాటిని వసింపజేయువాడు శ్రీవాసుడు.

శ్రీణాముదారో ధరుణో రయీణామ్। (ఋగ్వేదం)
నృమ్ణా శీర్షస్వాయుధారథేషు వో విశ్వా వః
శ్రీరధి తనూషు పిపిశే।। (ఋగ్వేదం)

సర్వశోభలూ హరిశక్తులు. అవి ఆయనయందే సంపూర్ణంగా భాసిస్తున్నాయి. నారాయణుని ఆశ్రయించుకున్న శక్తియే లక్ష్మీ.

శ్రీయతే, శ్రయతి ఇతి శ్రీ. ఆ లక్ష్మీకి ఆశ్రయస్థానమైనందున శ్రీవాసుడు. తనయందు సంపదలను దాల్చడమేకాక, వాటికి నియామకుడుగా ఉన్నదీ తానే ఐనందున –

శ్రీపతిః.. 603

1. సిరికి ఏలిక – రక్షకుడు.

లక్ష్మీదేవికి పతి శ్రీహరి. అమృతమథనమందు ఆవిర్భవించిన శ్రీలక్ష్మి సురాసురులందరినీ వదలి, నారాయణుని భర్తగా వరించినది.

అన్యేశానా జగతో విష్ణుపత్నీ !

హ్రీశ్చ (శ్రీశ్చ) తే లక్ష్మీశ్చ పత్న్యౌ – వంటి శ్రుతి వాక్యాలు ఇందుకు ప్రమాణం.

2 **రక్షితా పాతి రక్షతి ఇతి పతిః**, జగదైశ్వర్యాలన్నింటినీ రక్షించి పాలించువాడు.

3. శ్రీయనగా వేదము. **'ఋచఃసామాని యజూగ్ంషి – సా హి శ్రీరమృతాసతామ్"** ఋగ్యజుస్సామాత్మకమైన వేదవిద్యయే శ్రీ. ధర్మరక్షకుడైన శ్రీమన్నారాయణుడే వేదములకు ప్రభువు. **"వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః"** అని గీతాచార్యుని వాక్కు.

పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే (శ్వేతాశ్వతరోపనిషత్)

'వివిధములుగా జగతియందు ప్రసిద్ధిచెందిన ఆయన యొక్క శక్తి సర్వోన్నతమైనది. అదే శ్రీ. సమస్తమైన శ్రీలకు ఈతడే ప్రభువైనందున –

శ్రీమతాం వరః.. 604

1. శ్రీమంతులలో శ్రేష్ఠుడు.

ఋగ్యజుస్సామాత్మకమైన వేదవిద్య శ్రీ. దానిని కలవారు శ్రీమంతులు– వేదమంత్రస్వరూపులైనవారు బ్రహ్మాదులు. వారందరు శ్రీమంతులు.

సాహి శ్రీ రమృతా సతాం – సత్ పురుషులకు ఉన్న శ్రీ – విద్యయే.

అది శాశ్వతం. వేదమంత్రవేత్తలైన దేవతలందరిలోను శ్రేష్ఠుడితడు.

2. **'వృ వరణే'** అను ధాత్వర్థాన్ని అనుసరించి 'వరుడు' అనగా 'వరింపబడినవాడు, పూజింపదగినవాడు' అని అర్థాలను స్వీకరించవచ్చు. శ్రీమంతులైన వేద విదులచే, దేవతలచే పూజింపబడువాడు.

భగవానుని శక్తియైన శ్రీదేవి కాసింత కటాక్షిస్తే చాలు, శ్రీమంతులౌతారు. నారాయణుని సంకల్పాన్ని అనుసరించి ఆ శక్తి కటాక్షం. ఆ శక్తి పూర్తిగా నారాయణుని అధీనం. అందుకే ఆ కటాక్షాలకి నోచుకున్నవారందరినీ మించిపోయిన వాడతడు.

శుక్ల మాల్యాంబరధరా స్నాతా భూషణ భూషితా ।
పశ్యతాం సర్వదేవానాం యయౌ వక్షస్థలం హరేః ॥
తయావలోకితాః దేవాః హరివక్షఃస్థలస్థయా।
లక్ష్మ్యా మైత్రేయ సహసా పరాం నిర్వృతి మాగతాః॥ (విష్ణుపురాణం)

"క్షీరసాగరం నుండి ఉద్భవించిన శ్రీలక్ష్మీదేవి శుద్ధమైన మాలలను, వస్త్రాలను ధరించి, సర్వాలంకార భూషితురాలై వచ్చి శ్రీవిష్ణువును వరించి, స్వామి వక్షస్థలాన్ని పొందినది. మైత్రేయా! విష్ణు వక్షఃస్థిత అయిన ఆ లక్ష్మి వాత్సల్యంగా ప్రసరించిన కటాక్షాలకే దేవతలు సంతృప్తి పొందారు."

ఐశ్వర్యాధికారాలు కలిగిన బ్రహ్మేంద్రాదుల కంటె అధికుడితడు.

సర్వైశ్వర్యనాథుడైన కారణంగానే, ఎవరికి ఏది కావాలో ఎరిగి ఇచ్చే వాడైనందున–

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః।
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః॥ **65**

605. *శ్రీదః,* ***606.*** *శ్రీశః,* ***607.*** *శ్రీనివాసః,* ***608.*** *శ్రీనిధి,*
609. *శ్రీవిభావనః,* ***610.*** *శ్రీధరః,* ***611.*** *శ్రీకరః,* ***612.*** *శ్రేయః,*
613. *శ్రీమాన్,* ***614.*** *లోకత్రయాశ్రయః.*

శ్రీదః.. ***605***

1. సిరిని ఇచ్చువాడు.

సర్వ జీవులకు అనుగుణమైన సంపదలనిచ్చువాడు. సూర్యాది జ్యోతిస్సులకు,

ఇంద్రాది దేవతలకు, పంచ భూతాలకు వాటి లక్షణైశ్వర్యాలను విస్తరింప చేసేది ఈ పరమేశ్వరుడే. ఆశ్రయించిన భక్తులకు అభీష్ట సంపదలను ఇచ్చువాడీతడే.

శ్రీలు విష్ణువునకు మాత్రమే స్వీయములు. అందుచే ఆతడే శ్రీదాత.

భూరిదా హ్యసి శ్రుతః పురుత్రా శూర వృత్రహన్ ॥ (ఋగ్వేదం)

సంపదలపై నియామకత్వము కలవాడు కనుకనే, తగిన వాటిని అనుగ్రహిస్తున్నాడు. ఆ కారణం చేతనే -

శ్రీశః.. 606

1. సంపదలకు నియామకుడు. సర్వైశ్వర్యములకు ఈతడే అధికారి.
2. లక్ష్మీదేవికి ప్రభువు.

ఆదావాత్మగుణత్వేన భోగరూపేణ విగ్రహే।
ఆధారక స్వరూపేణ దాసీ భావేన వా సదా॥

"మొదటిగా ఆత్మగుణంగాను, విగ్రహాలలో భోగ్యరూపంగానూ ఆధార స్వరూపంగాను, లేక - దాసీభావంతోనూ'' లక్ష్మి ఈయనచే నియమింపబడుతున్నది.

శ్రీనివాసః.. 607

1. సిరికి నివాసమైనవాడు.

పరమేశ్వరుని విభూతులన్నిటి సమాహార స్వరూపమే శ్రీ. వెలుగు సూర్యుని యందు నివసించునట్లు విభూతులన్నీ స్వామియందే సదా స్థిరమై ఉన్నవి.

ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్ ॥ (యజుర్వేదం)

2. శ్రీమంతులయందు నివసించువాడు.

జ్ఞానం, ఐశ్వర్యం, వైరాగ్యం - వంటి విభూతులు కలవారు శ్రీమంతులు. వారియందు భాసించువాడు శ్రీనివాసుడు.

3. లక్ష్మీదేవికి చోటైనవాడు.

స్వామిని ఆధారం చేసుకొని లక్ష్మీదేవి అల్లుకుని ఆశ్రయించినది. సిరి తరగనిదై ఈయన యందున్న కారణంగా -

శ్రీనిధిః.. 608

1. అన్ని సిరులు ఈతనియందు నిక్షిప్తమై ఉన్నాయి.

సర్వశక్తిమయుడు శ్రీహరి. ఆ సర్వశక్తులే సిరులు.

అవి అక్షయమై ఉన్నవి - అని దీని భావం. భువనమునందలి విభూతులన్నిటికి మూలం, లక్ష్యం ఈతడే. జగత్ సృష్టికి పూర్వము శ్రీ విష్ణువునందు - బీజములో వృక్షమువలె - అవ్యక్తమై దాగిన శ్రీలు - సృష్టియందు వ్యక్తమై 'ఈతనియందే' భాసిస్తూ లయావస్థలో తిరిగి ఈయనలోనే లీనమౌతున్నాయి.

నిధీనాం త్వా నిధిపతిగ్ం హవామహే ॥ (యజుర్వేదం)

'నిధి చాల సుఖమా' అని త్యాగయ్య ఈ శ్రీనిధిని గుర్తించి కీర్తించాడు.

"పరమయోగులకు భావ నిధానము - అరయ బ్రహ్మాదుల కైశ్వర్యము" (అన్నమయ్య)

నిధియైన తనయందు కల సిరులనే ప్రసాదిస్తున్నందున -

శ్రీవిభావనః 609

1. సిరులను విశేషంగా కలిగించువాడు.

విశ్వమంతా వివిధ ఉపాధుల యందు భాసించే విభూతులన్నీ స్వామి ప్రసరించినవి. ఆయా జీవులకు కర్మానుగుణంగా వివిధ శ్రీలను విశేషంగా కలుగజేయువాడు.

2. విభూతులను, సంపదలను వివిధ రూపాలుగా కలిగించువాడు.
3. లక్ష్మీ సంబంధము చేతనే ప్రసిద్ధినొందినవాడు.

వెలుగు చేత సూర్యునివలె – తన అనంత విభూతుల వలననే తెలియబడేవాడు.

ఆ లక్ష్మిని నిరంతరం దాల్చుటచేతనే –

శ్రీధరః.. 610

1. *లక్ష్మిని ధరించినవాడు.*

సర్వ లోకజనని అయిన లక్ష్మీదేవిని తన వక్షఃస్థలమందు ధరించినవాడు. రత్నం కాంతినీ, కుసుమం పరిమళాన్నీ, చంద్రుడు వెన్నెలను, అమృతం మాధుర్యాన్ని ధరించినట్లు శ్రీదేవిని స్వాభావికంగా ధరించినవాడు.

'న విహాతు మయా శక్తా కీర్తి రాత్మవతా యధా' (రామాయణం)

'మనస్వి అయిన పురుషుడు ఏవిధంగా కీర్తిని వీడడో – అటులే నేను ఈ సీతను విడువజాలను' అని రామ నారాయణుని మాట.

తన అనంత విభూతులను తానే దాల్చిన శ్రీహరి, ఆ శ్రీలను తన భక్తులకు కలిగించుతున్నందున –

శ్రీకరః.. 611

1. *శ్రీలను కలిగించువాడు.*

అన్ని సిరులకు ఆతడే కారణం.

శోభ, విభూతి, విచిత్ర గుణ బలాదులు – 'శ్రీ'లు. వాటికి కారణమైనవాడు. జగతిలో సూర్యాది గ్రహనక్షత్రాలకు, పంచభూతాలకు వలసిన శోభను ప్రసాదించినవాడు.

ఆశ్రయించి, స్మరించి, స్తోత్రించి, అర్చించే భక్తులకు వలసిన శ్రీలను కలిగించువాడు. **'దైవీ సంపద్విమోక్షాయ'** అని గీతలో చెప్పినట్లుగా, దైవీ సంపదను ప్రసాదించే కైవల్య కారకుడు విష్ణువు.

2. *అన్ని స్థితులలోను తనకు తగినట్లుగా లక్ష్మిని కావించుకున్నవాడు.*

దేవత్వే దేవదేహేయం మానుషత్వే చ మానుషీ ।

విష్ణోర్దేహాను రూపాం వై కరోత్యేషాత్మనస్తనుమ్ ॥ *(విష్ణుపురాణం)*

'తాను దేవరూపంతో నున్నప్పుడు, లక్ష్మి దేవరూపంగాను, మనుష్యరూపం దాల్చినప్పుడు మానుషరూపంతోను – ఇలా తన రూపానికి తగినట్లు రూపం ధరించి హరిని వీడనిది సిరి'.

సుఖ కారకాలైన శ్రీలను ఇవ్వడమేకాక, క్షేమంకరమైన సౌఖ్యమే తన స్వరూపంగా కలవాడు కనుకనే–

శ్రేయః.. 612

1. *అపాయము లేని సుఖ ప్రాప్తి స్వరూపుడు.*

'అనపాయి సుఖావాప్తి లక్షణః శ్రేయః' (శంకరభాష్యం)

ఏనాటికీ దూరంకాని సుఖప్రాప్తిని 'శ్రేయము' అంటారు.

'శ్రీ'కి స్థానం శ్రేయస్సు. అదే నారాయణతత్త్వం.

మోక్షకారకమై, భగవత్ప్రాప్తికరమైన నివృత్తి మార్గానికి 'శ్రేయస్సు' అనీ, లౌకిక భోగకరమైన ప్రవృత్తి మార్గానికి 'ప్రేయస్సు' అనీ నిర్వచనాలు.

మోక్ష పురుషార్థమే శ్రేయస్సు. ఆ శాశ్వత క్షేమంకర సుఖమే పరతత్త్వం.

శ్రేయశ్చ ప్రేయశ్చ మనష్యమేతస్తౌ సంపరీత్య వివినక్తి ధీరః।
శ్రేయోహి ధీరోఽభిప్రేయసో వృణీతే ప్రేయోమన్దో యోగక్షేమాద్ వృణీతే॥
(కఠోపనిషత్)

ఉతస్వేన క్రతునా సంవదేత
శ్రేయాంసం దక్షం మనసా జగృభ్యాత్ ॥ (ఋగ్వేదం)

ఇహపరాలకు సంబంధించిన అన్ని సిరులు ఈతనికి స్వాభావికం కనుకనే–

శ్రీమాన్.. 613

1. *సిరులు కలవాడు.*

'శ్రీ' శబ్దానికి అర్థాలైన శోభ, సౌందర్యం, తేజస్సు, సంపద, విభూతి

మొదలైనవి అన్నీ నారాయణునివే.

2. లక్ష్మీవంతుడు.

'శ్రీ' (లక్ష్మి) ఎల్లవేళలా ఈయనను ఆశ్రయించుకున్నది. స్వామిని ఆశ్రయించినది- 'శ్రీ'. **'విష్ణోరేషానపాయినీ'** - (విష్ణు పురాణం) విష్ణువును వీడని ఈమె (లక్ష్మి).

ముజ్జగాలకి ఆశ్రయం విభూతులే.

ఆ విభూతులకు ఆశ్రయమైనవాడు శ్రీహరి. కనుక సర్వలోకాలకు ఈతడే ఆశ్రయ స్థానం -

లోకత్రయాశ్రయః.. 614

1. మూడు లోకాలకు ఆధారమైనవాడు.

భూర్భువ స్వర్లక్షణమైన త్రిజగాలకు ఈతడే ఆధారభూతుడు. 'చూడబడునవి - చూచునవి' లోకములు.

2. 'లోకము' అనే శబ్దానికి 'వేదశాస్త్రం' అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు. దర్శింపజేసే జ్ఞాన నిధానాలైన శాస్త్రాలకు 'లోకములు' అని అర్థాన్ని సంప్రదాయజ్ఞులు ప్రకటించారు. ఋగ్యజుస్సామాత్మకమైన వేదమే త్రయి. ఆ వేద విద్యయే 'శ్రీ'. **(సాహిశ్రీ రమ్యతా సతాం** - శ్రుతి) లోకత్రయం = వేదత్రయం. ఆ వేదానికి ఆధారమైన జ్ఞాన స్వరూపుడు.

3. 'శ్రీ' లక్ష్మి లోకానికి జనని, నారాయణుడు జగజ్జనకుడు. జగన్మాతయైన లక్ష్మితో కూడి సమస్తానికి, జనకుని వలె ఆశ్రయమైన జగన్నాథుడితడు. **'త్వం మాతా సర్వలోకానాం దేవదేవో హరిః పితా'** అని విష్ణు పురాణం. **యస్యోరుషు త్రిషు విక్రమణేష్వధిక్షియన్తి భువనాని విశ్వా ॥** (ఋగ్వేదం)

✤ ✤ ✤

'శ్రీవత్సవక్షాః (601) నామం నుండి 'లోకత్రయాశ్రయః'(614) నామం వరకు 'శ్రీ'యుత నామాల వరుస చెప్పబడింది. 'సర్వ శ్రీలకు స్థానమై, విశ్వమంతా

వ్యాపింపజేసే. ఆశ్రయుడైన వాడితడే' అనే భావాన్ని చక్కని క్రమంతో చెప్పిన నామాలివి.

❖ ❖ ❖

ముల్లోకాలకు ఆశ్రయమైన ఈ జ్ఞాన స్వరూపుడు, ఆశ్రయ లక్షణం చేత జగతికి క్షేమంకరమైన దర్శన శక్తి కలిగియున్న కారణంగా –

స్వక్షః స్వంగః శతానందో నంది ర్జ్యోతిర్గణేశ్వరః।
విజితాత్మాఽ విధేయాత్మా సత్కీర్తి శ్ఛిన్నసంశయః॥ 66

615. స్వక్షః, **616,** స్వంగః, **617.** శతానన్దః,
618. నన్దిః, **619.** జ్యోతిర్గణేశ్వరః, **620.** విజితాత్మా,
621. అవిధేయాత్మా, **622.** సత్కీర్తిః, **623.** ఛిన్నసంశయః॥

స్వక్షః.. 615

1. చక్కని కన్నులు కలవాడు.

పుండరీక సమానమైన నేత్రములు కలవాడు. శుభకరమైన దర్శన శక్తి కలవాడు.

2. **శోభనం అశనం – వ్యాపనం – యస్య= సు+అక్షః= స్వక్షః.**

శోభామయంగా, మంగళకరంగా జగమంతా వ్యాపించినవాడు.

శ్రియే సుదృశో వపురస్య సర్గాః ॥ (ఋగ్వేదం)
త్వయాశ్రియా సుదృశో దేవదేవాః ॥ (ఋగ్వేదం)
తం సుప్రతీకం సుదృశం ॥ (ఋగ్వేదం)

చక్కని వ్యాపక – దర్శన స్వరూపుడే కాక – ఆ దర్శనానికి తగ్గ స్వరూపం కలవాడు కనుకనే –

స్వంగః.. 616

1. సుందరమైన అవయవములు కలవాడు.

సు+అంగః=స్వంగః. మంగళకరమైన తనువును భక్తానుగ్రహం కోసమే ధరించే సగుణ స్వరూపం ఈ నామంలో వ్యక్తమౌతోంది. (601) 'శ్రీవత్సవక్షః' నుండి కొనసాగుతున్న నామముల ద్వారా 'శ్రీమంతమైన సర్వశుభ లక్షణ స్వరూపుడితడు' అని ఈ నామం స్పష్టపరుస్తోంది.

రామః 'కమలపత్రాక్షః' సర్వసత్వమనోహరః (రామాయణం. సుందరకాండ)

– అని హనుమ వర్ణించినట్లుగా 'పద్మములవంటి నేత్రములతో (స్వక్షః) సర్వప్రాణి మనోహరమైన దివ్యాకృతిని (స్వంగః) కలవాడు'. సచ్చిదానంద లక్షణమే 'సు'. ఆ తత్త్వమే విగ్రహముగా కలవాడు 'స్వంగః'.

2. గమన లక్షణం కలవి అంగములు. **'అగి గతౌ'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి, మంగళకరమైన శోభాయమానమైన గతులు (వ్యాపించే శక్తులు) కలవాడు.

అగ్నిర్భానునా రుషతా స్వంగం ఆ జాతో విశ్వా.... ॥ (ఋగ్వేదం)

అనంత గతుల వ్యాపించిన సచ్చిదానంద స్వరూపుడీతడే కనుక –

శతానందః 617

1. అపరిమితానంద స్వరూపుడు.

ఏకమైన ఆనంద రూప బ్రహ్మమే ఉపాధిభేదముల చేత అనేక విధాలుగా గోచరిస్తున్నది. **'మృత్పిండమేకో బహుభాండరూపః'** అని వేదాంత శాస్త్రం వర్ణించినట్లుగా – అనేక కుండలలో మట్టి ఒక్కటే ఎన్నో నీటి కుండలలో ఎన్నో విధాలుగా వెలిగే సూర్య ప్రతిబింబాలు – ఒకే సూర్యునివి అదేవిధంగా అఖండానందస్వరూపమైన బ్రహ్మమునాశ్రయించి (లోకత్రయాశ్రయః) సర్వ భూతములు జీవిస్తున్నవి.

'ఏతస్యైవాఽఽనందస్యాఽన్యాని భూతాని మాత్రా ముపజీవన్తి' (బృహదారణ్యకోపనిషత్తు) 'ఈ ఆనంద రూపుని ఆనందలేశాన్ని ఆశ్రయించి,

దాని సన్నిధిలో సర్వ ప్రాణులు జీవిస్తున్నాయ'ని వేదాంత వచనం.

2 అనంతానందమే బ్రహ్మ. **'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ', 'ఆనందో బ్రహ్మేతి'.** ఇత్యాది ఉపనిషద్వచనాలనాధారంగా నిర్విషయకమైన ఈ బ్రహ్మానందమునందే అన్నీ లీనమౌతున్నాయి. ఈ శతానందానికి వేరైన విషయానందాలన్నీ దుఃఖ పర్యవసాయులే

బహు ఉపాధులలో భాసించే 'స్వాత్మ స్వరూపుడైన' శతానందుడు, అఖండానంద తత్త్వము కనుక –

నన్దిః.. 618

1. ఆనంద స్వరూపుడు.

ఆనందమే ఆయన స్వరూపం. ఆనందింపజేయడమే ఆయన లక్షణం. దీని చేతనే సర్వ జగతిని సమర్ధించుచున్నాడు.

నన్దతి సమర్ధతి – ఇతి నన్ది.

(సృష్టిని సమృద్ధి చేయువాడు. సూర్య రూపంలో విశ్వ చక్రాన్ని సమృద్ధి చేస్తున్నదీతడే

✣ ✣ ✣

'కాంతి (శ్రీ)తో కూడిన, జగన్మంగళకర దర్శన శక్తి (స్వక్షః), గమన శక్తి (స్వంగః) కలిగి, అనేక విధముల జగతిని సమృద్ధపరచే (శతానన్దః), సమృద్ధి స్వరూపుడు (నందిః) – ఆదిత్యుడు' – అని ఆదిత్యపరమైన అర్ధాన్ని ఈ నామాల క్రమంలో భావించవచ్చు.

✣ ✣ ✣

సర్వే నన్దన్తియశసాగతేన ॥ (ఋగ్వేదం)

ఈ అఖండానంద బ్రహ్మజ్యోతి నుండియే సర్వ కాంతి వస్తువులు ప్రకాశాన్ని పొందుతున్న కారణంగా –

జ్యోతిర్గణేశ్వరః.. 619

1. జ్యోతిర్గణములకు ఈశ్వరుడు.

'द्युत दीप्तौ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **द्योतत इति ज्योतिः.** ప్రకాశ లక్షణములు కలవి జ్యోతులు. సూర్య, నక్షత్ర, అగ్న్యాదులు. ఈ జ్యోతుల సమూహమే జ్యోతిర్గణము. వీటన్నిటికీ శాసకుడు, పాలకుడు, నియామకుడు అయిన పరంజ్యోతి విష్ణువు.

'तमेव भान्तमनुभाति सर्वम्' (కఠోపనిషత్తు)

'స్వయం ప్రకాశకుడైన పరమాత్ముని అనుసరించి (ఆధారం చేసుకొని) అన్నీ ప్రకాశిస్తున్నాయి'.

'यदादित्यगतं तेजः' (భగవద్గీత - 15.12)

'ఆదిత్యాదులను ప్రకాశింపజేసే తేజస్సునాది' అని శ్రీకృష్ణ పరమాత్మ వచనం.

2. మన శరీరంలో ఇన్ద్రియ మనోబుద్ధులను చైతన్యవంతం చేసే ఆత్మయే నారాయణుడు. ఆత్మ ప్రకాశంచేతనే ఇన్ద్రియాదులు చేతనత్వాన్ని పొందుతున్నాయి. **"नाहं प्रकाशः सर्वस्य"** అని గీతాచార్యుని పలుకు. అన్నిటినీ ప్రకాశింపజేసే పరమాత్మను ఏదీ ప్రకాశింపజేయలేదు కనుక -

విజితాత్మా.. 620

1. జయించిన మనస్సు కలవాడు.

'ఆత్మా' శబ్దం మనః పరంగా, స్వరూప పరంగా కూడా వ్యవహరింప బడుతున్నది. అన్నిటినీ జయించిన (మించిన) స్వరూపమీతనిది.

अयं ह येन वा इदं स्वर्मरुत्वता जितम्। (ఋగ్వేదం)

సర్వ జీవాంతర్యామి అయిన ఈతని చేతనే ఇన్ద్రియాదులు ప్రకాశిస్తున్నాయి. తెలుసుకోబడుతున్నాయి. కానీ ఆ ఇన్ద్రియాదులు ఈతనిని తెలుసుకోలేవు. **'यो बुद्धेः परतस्तु सः'** (గీత) సర్వ జగతికీ తాను నియామకుడు కానీ, తనను నియమించునవి లేవు.

ఆ కారణంచేతనే ఏ విధానమునకూ కట్టుబడనివాడై -

అవిధేయాత్మాః.. 621

1. విధానము చేయుటకు లొంగని స్వరూపము కలవాడు.

విధిని ఏర్పరచునది విధానము. "ఇలా ఉంటుంది – ఇలా చేయి" – అని చెప్పడం విధానం. ఆ విధానానికి లొంగి ఉండేవాడు విధేయుడు. విధానానికి కట్టుబడనివాడు 'అవిధేయుడు'. పరమాత్ముడు జగతికి విధానమేర్పరచాడు. కాని ఆయనకు ఏ విధానమూ లేదు. విధానాలకు అందని స్వరూపం ఈతనిది. సర్వస్వతంత్రుడు.

2. 'విజితాత్మాఒ విధేయాత్మా' అనే రెండు నామాలనీ 'విజితాత్మా – అవిధేయాత్మా' అని స్వీకరించడమేకాక, 'విధేయాత్మ'గా కూడా స్వీకరించవచ్చు.

జగద్విధానాన్ని అనుసరించి నడిపే ఈశ్వరుడు – ధారణ పోషణలను నిర్వహిస్తున్న, ధర్మ విధానాలను ప్రవర్తింపజేస్తున్నందున 'విధేయాత్మా'.

3. భక్తులకు లొంగిపోయేవాడు. (విజితాత్మా), వారిని అనుసరించి అనుగ్రహించే వాత్సల్య స్వరూపుడు (విధేయాత్మా).

సర్వోన్నతుడు సర్వ స్వతంత్రుడు – అయిన ఈతనికి విధేయులై శ్రుత్యాదులు కీర్తిస్తున్నాయి. కనుకనే –

సత్కీర్తిః.. 622

1. సత్యమైన కీర్తి కలవాడు.

యథార్థమైన కీర్తి కలిగినవాడు విష్ణువు.

గుణాన్ని ప్రకాశింపజేసేది– స్తుతి, వస్తుతత్వాన్ని తెలియజేసేది – కీర్తి.

భగవద్గుణాలను స్తుతించుటయే భగవత్కీర్తి. అది యథార్థమైనది. ఎన్ని స్తుతులు చేసినా ఆయన ఎడల సత్యములే.

అవి వ్యర్థములు కాని యథార్థములు.

యధా సర్వేశ్వరః కృష్ణః ప్రోచ్యతే సర్వ పండితైః
తథాపి స్వల్ప మేవోక్తం భూతార్థే కతమాస్తుతిః॥

సుందరయ్య గ్రంథాలయ
A.C. No.

"పండితులందరూ 'శ్రీకృష్ణుడు సర్వేశ్వరుడ'ని చెబుతున్నారు. అది చిన్నమాటే. యథార్థంగా ఆయనను చెప్పడానికి స్తోత్రము సరిపోతుందా?"

స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్యత్యను రజ్యతే చ ॥ (భగవద్గీత - 11.36)

"ఓ హృషీకేశా! నిన్ను స్తోత్రించుటయే సముచితం (సత్యం). దాని వలన జగమంతా ఆనందాన్నీ, రంజననీ పొందుతున్నది" అని అర్జునుడు స్తుతించాడు.

సర్వస్తుతులకు పాత్రమైన అనన్త జ్ఞాన సంపన్నుడు కనుకనే -

ఛిన్న సంశయః.. 623

1. సంశయములు లేనివాడు.

నిర్మల జ్ఞాన రూపుడు.

'ఛిద్యన్తే సర్వ సంశయాః' (ముండకోపనిషత్)

పరతత్త్వ జ్ఞానం కలిగిన వెంటనే సర్వ సందేహాలు ఛేదింపబడతాయని ఉపనిషద్వచనం. అజ్ఞాన లక్షణం సంశయం. సంపూర్ణ జ్ఞానమే పరమాత్మ. వెలుగులో చీకటికి ఆస్కారం లేదు - పరమాత్మలో సందేహానికి తావులేదు.

అయమస్మి జరితః పశ్య మేహ విశ్వా జాతాన్యభ్యస్మి మహా ॥ (ఋగ్వేదం)

తననాశ్రయించిన భక్తులను అనుగ్రహించి, అజ్ఞానాన్ని నాశనం చేసే జ్ఞానప్రదుడు, సృష్ట్యాది నుండి ప్రళయాంతం వరకు విశ్వ విషయజ్ఞానం సంపూర్ణంగా (నిస్సందేహంగా) అరచేతిలో ఉసిరికవలె తెలిసిన ఈతడే జగద్వ్యవస్థను సమగ్రంగా నిర్వహిస్తున్నాడు.

ఈ అనంత జ్ఞానము చేతనే ఆతడు ఉన్నతుడు -కనుకనే -

ఉదీర్ణః సర్వతశ్చక్షు రనీశః శాశ్వతస్థిరః।
భూశయో భూషణో భూతి ర్విశోకః శోకనాశనః॥ 67

624. ఉదీర్ణః, 625. సర్వతశ్చక్షుః, 626. అనీశః,
627. శాశ్వత స్థిరః, 628. భూశయః, 629. భూషణః,
630. భూతిః 631. విశోకః, 632. శోకనాశనః॥

ఉదీర్ణః.. 624

1. ఉత్కృష్టముగా ఉన్నవాడు.

అందరికంటే పైవానిగా (సర్వ భూతములకంటె మహోన్నతునిగా) ఉన్నవాడు. తాను నియమించే లోకమున కంటె అతీతంగా ఉన్న తత్త్వమితడే.

'యో బుద్ధేః పరతస్తు సః' (భగవద్గీత)

బుద్ధికి కూడా అతీతమైన ఆత్మ ఇతడే.

2. తన వల్ల ప్రకాశించే పృథివ్యాదులకు ఉన్నత స్థితిలో భాసించే సూర్య నారాయణుని ఈ నామం ద్వారా పేర్కొనవచ్చు.

ఏషస్య భానురుదియర్తి ॥ (ఋగ్వేదం)
ఇన్ద్రః సముద్రముదియర్తి ॥ (ఋగ్వేదం)
దివిస్వనో యతతే భూమ్యో పర్యనన్తం
శుష్మముదియర్తి భానునా॥ (ఋగ్వేదం)

సర్వోన్నత స్థితిలో నున్న కారణంగానే, అన్నిటినీ సమగ్రంగా దర్శించగలిగిన వాడై –

సర్వతశ్చక్షుః.. 625

1. అన్ని వైపుల నేత్రములు కలవాడు.

చైతన్య స్వరూపుడైనందున సర్వమును చూచువాడు. సూర్యునిగా అనంత దర్శన శక్తి కల జగచ్చక్షువు. సాక్షాత్ ద్రష్ట.

విశ్వతశ్చక్షురుత విశ్వతో ముఖో ॥ (ఋగ్వేదం)

విశ్వతశ్చర్షణిరుత...(అథర్వవేదం)

విశ్వతశ్చక్షుః । (శ్వేతాశ్వతరోపనిషత్)

అన్ని వైపుల, అన్నింటినీ, అన్ని కాలములను సాక్షిగా దర్శించే సమగ్ర దర్శన స్వరూపుడు.

అన్నిటినీ ఈక్షించడంలోనే తన ఈశత్వాన్ని నిర్వహిస్తున్నందున –

అనీశః.. 626

1. ఈయనకు ఈశ్వరుడెవడూ లేడు.

సర్వమునకు ఈతడే ఈశుడు. ఈయనను శాసించువాడు, నియమించువాడు లేనందున ఈతడు అనీశుడు.

న తస్యేశే కశ్చన (నారాయణోపనిషత్తు).

అయమగ్నిః సువీర్యస్యేశే మహః సౌభగస్య।

రాయ ఈశే స్వపత్యస్య గోమత ఈశే వృత్రహథానామ్॥ (ఋగ్వేదం)

2. సర్వమును తన అధీనమునందుంచుకున్న స్వామి, భక్తులకు స్వాధీనుడై, అస్వతంత్రుడై అనుగ్రహిస్తున్నాడు.

భక్తుల మనోనుకూలంగా వర్తించే భక్త పరతంత్రుడు.

పరిణామశీలమైన జగతికి అతీతుడై (ఉదీర్ణః), సర్వ జగత్ జ్ఞానముతో (సర్వతశ్చక్షుః), తనకెవడూ పైన శాసకుడు లేక (అనీశః) పరిణామము లేని సనాతనుడై –

శాశ్వతస్థిరః.. 627

1. ఎల్లప్పుడును ఉన్నవాడై, ఏ మార్పును పొందనివాడు.

'స్థిర' శబ్దం మార్పులేనితనాన్ని తెలియజేస్తుంది.

ఎల్లప్పుడూ ఉండుట శాశ్వతత్వం. సదా ఏ వికృతినీ పొందనిది ఆత్మయే.

ఇదే వ్యాపకమై ఉన్న విష్ణు తత్వం.

2. తాను ఎల్లప్పుడు ఒకే స్థానంలో ఉండి, గ్రహాదులను సంచరింపజేస్తున్న సూర్యనారాయణ తత్వాన్ని కూడా ఈ నామం స్ఫురింపజేస్తోంది.

స హి స్థిరో విచర్షణి ॥ (ఋగ్వేదం)

శాశ్వతమైన ఉనికిగా ఉన్నందుననే -

భూశయః.. 628

1. ఉన్నవాటియందు ఉన్నవాడు.

భూశేతే - భూశయః.

'భూ సత్తాయామ్' అనే ధాత్వర్థాన్ని అనుసరించి కలిగినవి, ఉన్నవి సమస్త భూత కోటి. వాటియందు అంతర్యామిగా ఉన్న శాశ్వతమైన చైతన్యమే నారాయణుడు.

2. భూమియందు అవతరించినవాడు.

వివిధావతారములు దాల్చి భూమి యందున్న వాడు, అనేక క్షేత్రాలలో వెలసి ఆరాధింపబడుతున్నవాడు.

3. లంకకై త్రోవను అన్వేషిస్తున్న సందర్భాన సాగరుని ఉద్దేశించి, భూమిపై శయనించిన శ్రీరాముడు.

శేషే వనేషు మాత్రోః సంత్వా మర్తాస ఇన్ధతే ॥ (ఋగ్వేదం)

ఈ చైతన్యం చేతనే జడమైన జగతి, అలంకరింపబడినట్లుగా భాసిస్తున్నందున-

భూషణః.. 629

1. అలంకార స్వరూపుడు.

జడాత్మిక అయిన ప్రకృతిని చైతన్యరూపుడై తాను క్రియాశీలం చేస్తున్నాడు. తద్వారా ప్రకృతి చేతనత్వాన్ని పొందింది. కనుక (చైతన్యమే) ఆత్మయే అలంకారం. అదియే విష్ణువు.

2. స్వేచ్ఛగా ఈ పృథ్వీపై అవతరించి తన ఉనికి చేత, లీలల చేత, ధర్మోద్ధరణ చేత భూమిని శోభింపచేసినవాడు.

"మార్గాభరణంబులైన హరిచరణంబులు" అని భాగవత వచనం. స్వామి అడుగులే భూమికి ఆభరణములు. ఆయన అవతార గాథలే పృథ్వికి శోభ.

సర్వేంద్రియాలకు విష్ణు నామస్మరణయే అలంకారము కనుక – ఆతని ధ్యానం వలన హృదయం, కథాశ్రవణం వలన శ్రోత్రములు, స్తుతి వలన వాక్కు శోభిస్తున్నాయి. ఇలా సర్వేంద్రియాలను అలంకారింపజేసే అసలైన సోయగం ఆ పరమ చైతన్యమే.

3. జడమై, అంధకారమైన జగతికి తన కాంతితో శోభనిచ్చే అలంకారం – జ్యోతిఃస్వరూపుడైన ఆదిత్య రూప నారాయణుడే.

అరం హి ష్మా సుతేషు ణ: సోమేష్విన్ద్ర భూషసి ॥ (ఋగ్వేదం)

అగ్నిఃసనోతి వీర్యాణి విద్వాన్త్సనోతి వాజమమృతాయ భూషన్ ॥ (ఋగ్వేదం)

ఆత్మ దేహానికీ, సూర్యుడు భూమికీ, పరమాత్మ సమస్త విశ్వానికి భూషణాలు.

ఈ భూషణాలన్నీ నారాయణుడే.

అలంకారంగా భాసించే ఐశ్వర్యమే ఆయన కనుక –

భూతిః.. 630

1. ఉనికియైనవాడు.

భూతిః – భవనం – సత్తా. ఈ మూడు 'ఉనికి' అని అర్థాన్నిచ్చే శబ్దాలు. నిత్యశుద్ధమైన ఉనికియే పరమాత్మ.

2. ఐశ్వర్య స్వరూపుడు.

అన్ని ఐశ్వర్యములకు మూలకారణమైనవాడు.

విభూతుల రూపమున వ్యాపించి ఉన్నవాడు.

సర్వ దేవతారూపుడై భాసించే పరమైశ్వర్య స్వరూపుడు. లోక వ్యవహార హేతువులైన సంపదలు కూడా నారాయణ విభూతులే. ఆయా కాలాలకు

అనుగుణమైన భూతిని సృజించి, వాటియందు అధిష్ఠించే వాడితడని శ్రుతి చాటుతున్నది.

కాలో భూతి మసృజత కాలే తపతి సూర్యః
కాలో హ విశ్వా భూతాని కాలే చక్షుర్విపశ్యతి ॥(అథర్వవేదం)
భూతిశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్ ॥ (యజుర్వేదం)

ఆనందకరమైన భూతియే తానైనందున -

విశోకః (అశోకః).. 631

1. *శోకము లేనివాడు.*

కేవలానంద స్వరూపుడు కనుక, శోకాదులు లేనివాడు. సర్వ జీవులయందు భాసించే శుద్ధమైన ఆనంద ఘనుడీతడు.

అంతటా తానే వ్యాపించిన పరిపూర్ణునకు శోకమెక్కడ?

తత్ర కో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః ॥ (యజుర్వేదం)

2. 'శోకః' శబ్దానికి మరో అర్థం 'తడి' (తేమ).

తేమ ఎరుగని ప్రకాశ స్వరూపుడు వేడిమి కిరణాల సూర్యాత్మకుడైన విష్ణువు (సత్యభాష్యం).

చీకటిలేని జ్యోతి, తనను ఆశ్రయించినవారి చీకటిని సైతం పోగొట్టునట్లుగా-

శోకనాశనః.. 632

1. *శోకములను నశింపజేయువాడు.*

జ్ఞాన స్వరూపుడైన పరమాత్మునితో తాదాత్మ్యం చెందినవాడు, శోకము లేనివాడు. ఆనంద తత్త్వాన్ని ఎరిగినవాడు, ఆనందమే తానవుతున్నాడు. **'రసగ్ హ్యేవాయం లబ్ధ్వా ఆనందీభవతి'** (ఛాందోగ్యం)

'స శోకం తరతి' అని శ్రుతి అభయమిస్తున్నది.

సోహం భగవశ్శోచామి తమ్మా భగవాన్ శోకస్య పారం తారయతు

(ఛాన్దోగ్యోపనిషత్)

'స్వామి! (అజ్ఞానముచే బాధపడు) నేను శోకిస్తున్నందున మహాత్ములైన మీరు ఆ శోకాన్ని తీర్చాలి' అని బ్రహ్మజ్ఞుని ఆశ్రయించుతాడు సాధకుడు. బ్రహ్మవిద్యయే శోకాన్ని దాటిస్తుంది. ఆ బ్రహ్మవిద్యా స్వరూపుడు శ్రీహరి.

ఈయనను ఆశ్రయించినవాడు అజ్ఞానరూపమైన శోకాన్ని దాటుతున్నాడు.

ఈ ఆనంద ఘన తత్త్వమే విజ్ఞులచే పూజింపబడుతున్నది –

అర్చిష్మా నర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః।
అనిరుద్ధో ఽప్రతిరథః ప్రద్యుమ్నో ఽమితవిక్రమః॥ 68

633. *అర్చిష్మాన్,* ***634.*** *అర్చితః,* ***635.*** *కుంభః,*
636. *విశుద్ధాత్మా,* ***637.*** *విశోధనః,* ***638.*** *అనిరుద్ధః,*
639. *అప్రతిరథః,* ***640.*** *ప్రద్యుమ్నః,* ***641.*** *అమితవిక్రమః॥*

అర్చిష్మాన్.. 633

1. పూజించుటకు తగినవాడు.

'అర్చ పూజాయామ్' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, పూజార్హుడు శ్రీహరి. సర్వ దేవతలచే, ఋషులచే, లోకంచే పూజింపబడువాడు. పూజించుటకు తగిన తత్త్వ, దివ్య గుణాదులు కలవాడు.

గాయన్తి త్వా గాయత్రిణోఽర్చన్త్యర్క మర్కిణః ॥ (ఋగ్వేదం)

2. తేజోమయుడు.

'అర్చ' ధాతువునకు 'దీప్తి' అని కూడా అర్థాన్ని గ్రహించితే, 'దీప్తి (ప్రకాశము) కలవాడు' అని చెప్పవచ్చు. సూర్య చన్ద్రాదులను కూడా తేజోమయులుగా చేస్తున్న స్వయంప్రకాశ స్వరూపుడు.

అర్చీంషి విద్యంతే అస్య - అర్చిష్మాన్. మహత్త్వము కల కిరణములు (జ్వాలలు) కలవాడితడు.

"తేజోభిరాపూర్య జగత్సమగ్రం, భానస్తవోగ్రాః ప్రతపన్తివిష్ణో"!

"సర్వతో దీప్తమంతం"

– "నీ ఉగ్రమైన దీప్తి – తన తేజస్సుచే దిక్కులని వారిస్తూ, అంతటినీ చాలా తపింపజేస్తున్నది" "అన్ని వైపులా ప్రకాశించువాడు" –అని భగవద్గీత విశ్వరూప సందర్శన యోగంలో అర్జునుడు కీర్తించాడు.

పూజార్హుడై, సర్వాధిక తేజోమయుడైనందున, ఈతనిని సర్వులూ పూజిస్తున్నారు –

అర్చితః.. 634

1. పూజించబడినవాడు.

అందరిచే అర్చింపబడే బ్రహ్మాదులచే కూడా అర్చింపబడే వాడు.

"పద్భ్యాం భక్త హృదిస్థాభ్యాం
వంద్యాభ్యాం లోకవందితైః" (శ్రీమద్భాగవతం) –

"లోకములచే పూజింపబడే వారిచే పూజింపబడే హరిచరణాలు, భక్తుల హృదయాలలో కొలువైయున్నవి."

స మాయా అర్చినా పదా ॥ (ఋగ్వేదం)

దేవతలు, శ్రుతులు, ఋషులు కూడా ఈ పరమాత్ముని ఆరాధిస్తున్నందున ఈతడు అర్చిష్మంతుడు.

2. (పరాశరభట్టు ప్రకారం) అర్చావతారులు.

నారాయణుని పరస్వరూపం అవ్యక్తం. ఆయన విభవావతారం ఏదో ఒక కాలంలో, ఏదో ఒక స్థలంలో మాత్రమే ఉండేది. అన్నిచోట్ల ఉండేది కాదు. అందరి చేత లభ్యంకానిది.

కానీ అర్చావతారాలు అయా క్షేత్రాలలోనేకాక, గృహాలలో అర్చింపబడుతున్నాయి.

సురూపాం ప్రతిమాం విష్ణోః ప్రసన్న వదనేక్షణామ్।
కృత్వామనః ప్రీతికరీమ్ సువర్ణరజతాదిభిః ॥

తామర్చయేత్ తాం ప్రణమేత్ తాం యజేత్ తాం విచిన్తయేత్ ।

"చక్కని రూపంతో, ప్రసన్న వదనముతో, నేత్రములతో, తన మనస్సునకు ప్రీతికరమైన విధముగా, బంగారు వెండి వంటి లోహాలతో భగవదాకృతిని మలచి..... దానిని అర్చించాలి. నమస్కరించాలి. ధ్యానించాలి. తలంచాలి. అలా చేసినట్లయితే అన్ని పాపముల నుండి తొలగి బ్రహ్మము నందు లీనమవుతాడు" అని 'విష్ణుధర్మోత్తర పురాణం' లోని వచనం.

'అర్చిష్మాన్ అర్చితోఽత్యర్థః' అని రామాయణ 'సుందరకాండ'లో హనుమ శ్రీరాముని వర్ణించాడు. 'అర్చించుటకు యోగ్యుడైన తేజోవంతుడైన శ్రీరాముడు అందరిచే మిక్కిలిగా అర్చింపబడతాడు'.

అలా అర్చించువారిచే కోరబడేవాడు కనుకనే -

కుంభః.. 635

1. కోరబడువాడు.

   'కామ్యతే ఇతి కుంభః'. ప్రతివారు కోరుకునే ఆనందము యొక్క పరిపూర్ణత పరతత్త్వ స్వరూపుడైన విష్ణువే.

2. భూమి యందు ప్రకాశించువాడు.

   కౌ భాతీతి కుంభః, దివ్య క్షేత్రాదులలో భాసించి అనుగ్రహించువాడు.

   అధ్వావనిషు సర్వాసు నిత్యం కుర్వతి సన్నిధిమ్ ।
   ముక్తయే సర్వభూతానాం విశేషేణతు వై భువి ॥

   'సర్వ ప్రాణులకు ముక్తిని కలిగించడానికి, భూమిపై వారి మార్గములలో నిత్యము సన్నిధిని కావిస్తున్నవాడు.'

3. అన్నిటికీ ఆధారమైనవాడు.

   కడవలో నీరువలె, విశ్వంలోని సమస్తము విశ్వరూపుడైన ఈతనియందే నిలుకడ పొంది ఉన్నాయి.

4. జగతిని తన శక్తితో ఆచ్ఛాదించువాడు.

కుంభయతి ఆచ్ఛాదయతి సూర్యుడు తన కిరణాలతో భూమిని కప్పినట్లుగా, తన అనంత చైతన్యంతో అఖిలజగతినీ ఆచ్ఛాదించువాడు. **'ఈశావాస్య మిదం సర్వం'** (ఈశావాస్యోపనిషత్తు)

5. భూమిని ప్రకాశింపజేసేవాడు.

'కుం భాసయతి ప్రకాశయతీతి కుంభః' 'కు' అనగా భూమి. ఈ పృథ్విని చైతన్యము చేసే నారాయణుడు కుంభుడు. భూమిని ప్రకాశింపజేసే సూర్యునికి కూడా ఈ నామం వర్తిస్తుంది. (సత్యభాష్యం)

6. శరీరాన్ని చైతన్యవంతం చేసే ఆత్మ స్వరూపుడు.

అనేక వికారాలతో కూడిన పార్థివ శరీరమే 'కు'. దానిని ప్రకాశింపజేసే ఆత్మయే కుంభుడు.

పూర్ణః కుంభోధికాల ఆహితః।। (అథర్వవేదం)

కాలం పూర్ణరూపమైనది- కుంభంతో సమానం.

7. కాల స్వరూపుడు.

కాలం సర్వ విశ్వ బీజాలను తనలో దాచుకుని, సృష్టి గమనంలో వెలికి తీస్తుంది. తిరిగి లయ వేళలో తనలోనికి తిరిగి తీసుకుంటుంది. కనుక కాలాన్ని కుంభ స్వరూపంగా వేదం దర్శించింది. కుంభంలో వస్తువుల వలె సర్వము కాల స్వరూపుడైన విష్ణువునే ఆధారం చేసుకుని ఉన్నది.

కుంభో వనిష్యర్జనితా శచీభిర్యస్మిన్నగ్నే యోన్యాం అన్తః (యజుర్వేదం)

సత్రే హ జాతా విషితా నమోభిః కుంభే రేతః సిసిచతుః సమానమ్।। (ఋగ్వేదం)

అన్నిటికీ ఆధారమై ప్రకాశింపజేస్తున్నప్పటికీ, తనచే ప్రకాశింపబడే ఉపాధుల దోషాలేవీ అంటని పరమాత్ముడు కనుక -

విశుద్ధాత్మా.. 636

1. నిర్మల స్వరూపుడు.

'శుధశౌచే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి - శుద్ధత - అంటే పవిత్రత.

విశేషమైన శుద్ధతయే విశుద్ధత. ఏ మాలిన్యము లేని పరిపూర్ణ శుద్ధుడు పరమాత్మయే. పుట్టుట, పెరుగుట, క్షీణించుట, మారుట, నశించుట అనే దోషాలు ఉపాధులకి సహజం. కానీ ఉపాధులను చైతన్యవంతం చేసే ఆత్మ స్వరూపం పూర్తిగా శుద్ధమైనది. గుణత్రయాలకు అతీతమైన తత్త్వమిది. భూమిని ప్రకాశింపజేసే (కుంభః) సూర్యుడు సైతం భూవికారాలకు అంటని విశుద్ధ తేజః స్వరూపుడు.

సపర్యగాతే... శుద్ధమపాపవిద్ధమ్ ॥ (యజుర్వేదం)

ఏతో న్విన్ద్రం స్తవామ శుద్ధం శుద్ధేన సామ్నా॥

ఇన్ద్ర శుద్ధో న ఆ గహి శుద్ధ శుద్ధాభిరూతిభిఃll (ఋగ్వేదం)

శుద్ధ స్వభావుడు కనుకనే శుద్ధి చేయగలడు –

విశోధనః.. 637

1. *పవిత్రులను చేయువాడు.*

పాపరాహిత్యమే శుద్ధత. స్వామి నామస్మరణ, ఆరాధన వంటి వాటి వలన జీవుని పాపాలు నశింపబడుతున్నాయి. కనుక శ్రీహరి పాపనాశకుడైన నిర్మలుడు. ఆత్మజ్ఞానమే సర్వ పాపనిర్మూలనం.

'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి...'

"నిన్ను సర్వ పాపముల నుండి విడుదల చేస్తాను"

అని భగవానునిఅభయం (గీత).

2. *తన కిరణజాలాలతో అంధకారాది మాలిన్యాలను తొలగించే సూర్యరూప నారాయణుడు.*

పవిత్రీకరించే (చైతన్యవంతం చేసే) ఈ అపరిమితుని ఆవరించగలిగేవీ, అడ్డుకునేవీ ఏవీ లేవు. మాలిన్యమే కాదు, ఆవరణ కూడా లేనివాడు. కనుక –

అనిరుద్ధః.. 638

1. అడ్డగించుటకు సాధ్యము కానివాడు.

   శత్రువులు ఈయనను అడ్డుకొనలేరు. జగద్రక్షణకై స్వామి ప్రకటించే పరాక్రమ, ప్రతాప గుణాలను చెప్పే నామమిది.

2. నాలుగు వ్యూహాలలో నాలుగవది.

   వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ- చతుర్వ్యూహాలు.

3. ఆవరణలు లేని పరమాత్ముడు.

   'రుధిర్ ఆవరణే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి – ఏ ఆవరణలూ (కప్పుటలు) లేని అఖండాత్మ స్వరూపుడు.

   అనిరుద్ధరిన్ద్రః సఖ్యం తే అస్త్యధేమా విశ్వాః పృతనా జయాసి ॥ (ఋగ్వేదం)

   ఎవ్వరూ ఎదుర్కొనలేని అమిత ప్రతాపుడు కనుకనే –

అప్రతిరథః.. 639

1. ప్రతి పక్షములేనివాడు.

   ఈతనితో సమానులు గానీ, అధికులు కానీ లేరని తాత్పర్యం.

2. సూర్యపరంగా –

   సూర్యనారాయణుని గమన శక్తి ఏకచక్ర రథంగా సంభావించబడింది. ఆ కాంతిమయ రథానికి సమానమైనది లేదు.

   సూర్యుని అనుసరించి అన్నీ సంచరించవలసినదే – ఆయనను ఎదుర్కొని, చరించగలిగే ప్రతిరథం (ఎదుర్కొనే రథం) లేదు కనుక సూర్యుడే 'అప్రతిరథుడు'.

3. ఏకమైన ఆత్మతత్త్వంతో సమానమైనది మరొకటి లేదు.

   అపరాజితమస్తుతమషాఢమ్ ॥ (ఋగ్వేదం)

   'రథచర్షణే' 'రథవతే' 'రథవాహనం' – వంటి నామాలు ఋగ్వేద మంత్రాలలో గోచరిస్తున్నాయి.

   ఆటంకం లేని, సాటిలేని విశేషమహిమా సంపన్నుడైనందున–

ప్రద్యుమ్నః.. 640

1. శ్రేష్ఠమైన ప్రకాశము కలవాడు.

ప్ర-ద్యు-మ్నః, 'ప్ర' అనే ఉపసర్గకి 'మిక్కిలి', 'ఉత్తమము' అని అర్థాలు. 'ద్యు' శబ్దం ప్రకాశాన్ని తెలియజేస్తుంది. 'దేవనం – ద్యోతనం– భాసనం' అనే భావాన్ని ప్రకటించేది 'ద్యు' శబ్దం. 'మ్నుః' – **'మ్నా అభ్యాసే'** అనే ధాత్వర్థాన్ననుసరించి – 'పౌనఃపున్యం' (మాటిమాటికి – ఎడతెగక) అని అర్థం.

విశేషంగా ఎడతెగక ప్రకాశించే మహాతేజః స్వరూపుడు ప్రద్యుమ్నుడు.

2. ఉపాధుల భేదాలు ఎన్ని ఉన్నా, అన్నిటా భాసించి, భాసింపజేసే ఆత్మయే ప్రద్యుమ్నుడు.
3. తాను భాసిస్తూ జగతిని భాసింపజేసే పరమతేజస్వి ఆదిత్యుడు.
4. నారాయణుని చతుర్వ్యూహ స్వరూపాలలో మూడవది.
5. ఉత్తమమైన ధనం కలవాడు.

శుద్ధ జ్ఞాన ప్రకాశమే ఐశ్వర్యం. అది కల చిత్స్వరూపుడు విష్ణువు.

అక్షాసో అస్య వితిరన్తి కామం ప్రతిదీవ్నే దధతి అకృతాని। (ఋగ్వేదం)

ద్యుమత్తమః (ఋగ్వేదం)

ఈ ప్రకాశముతోనే అంతటా హద్దులేకుండా వ్యాపించడం చేత –

అమితవిక్రమః.. 641

1. పరిమితం కాని శక్తి కలవాడు.

అఖండమైన ఈయన వ్యాప్తికి హద్దులు లేవు.

2. ఎవరిచేతనూ బాధింపబడని విక్రమం కలవాడు.

'మీఙ్ హింసాయామ్' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, 'మితి' అనగా హింసింపబడుట (దెబ్బతీయుట, అడ్డుకొనుట మొదలైన అర్థాలు).

3. హద్దులు లేని పాదన్యాసం కలవాడు.

'విక్రమ' శబ్దానికి 'విశేషముగా అడుగు వేయుట (గమనం చేయుట)' అని అర్థం. అఖండ ప్రకాశ స్వరూపుడు కనుక ఈ గమనానికి అవరోధాలు లేవు. సర్వత్ర వ్యాపించే తేజస్సు, చైతన్యం ఈతనిదే.

పురాం భిన్దుయుర్వా కవిరమితౌజా అజాయత।। (ఋగ్వేదం)

గోజితా బాహూ అమితక్రతుః.....।। (ఋగ్వేదం)

వవక్ష ఇన్ద్రో అమితమృజేష్యభే ఆ పప్రౌరోదసీ మహిత్వాం।। (ఋగ్వేదం)

పరోమాత్రయా తన్వావృధాన

న తే మహిత్వ మన్వశ్నువంతి ।। (ఋగ్వేదం)

– అని విష్ణు సూక్తం. 'నీవు పరిమాణాలకు అతీతుడవై వ్యాపించి వృద్ధి చెందిన వాడవు. నీ మహిమను వేరొకరెవ్వరు తెలుసుకొనగలరు?' అని పేర్కొంది. అవధిలేని వ్యాపకత్వంతో ప్రకాశించడం చేతనే కాలపు హద్దులను కూడా అతిక్రమించి –

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః।
త్రిలోకాత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః।। **69**

642. కాలనేమినిహా,	**643.** వీరః,	**644.** శౌరిః,
645. శూరజనేశ్వరః,	**646.** త్రిలోకాత్మా,	**647.** త్రిలోకేశః,
648. కేశః,	**649.** కేశిహా,	**650.** హరిః।।

కాలనేమినిహా.. 642

1. కాలచక్రాన్ని నడపువాడు.

కాలము యొక్క నియంత్రణ 'కాలనేమి'. చక్రరూపంలో గమించే కాలము యొక్క హద్దు. దానిని ఛేదించినవాడు 'కాలనేమినిహా'. కాలపు హద్దులను అతిక్రమించిన వాడు.

2. కాలమును నియంత్రించువాడు 'కాలనేమి'. అలా నియమించే (హద్దుపెట్టే)

గ్రహ తారకలను కూడా నడిపించువాడు 'కాలనేమినిహా'!

'ని' ఉపసర్గతో **'హన్ హింసాగత్యోః'** (హన్ – హింస, గతి – అని అర్థాలు) అనే ధాత్వర్థాన్ని పురస్కరించుకొని పై అర్థాన్ని భావించవచ్చు.

సూర్య చంద్రుల ననుసరించి కాలమానాలను నిర్ణయిస్తున్నాం. కనుక వారు కాలమును కొలతపెట్టే హద్దుల వంటివారు. (కాల నియామకులు). వారిని సైతం నడిపే పరమ చైతన్యం నారాయణ బ్రహ్మము.

అవిద్యాఖ్యా చ యా నేమిః కాల చక్రస్య దుర్ధరా ।
సామాయీ యం సమాశ్రిత్య విగ్రహం విధునోతి చ ॥
ధ్యాయేత్తత్ప్రసరఘ్నంచ దేవమ్.... ॥

కదలించుతున్న దాని ప్రచారాన్ని అణచే దేవుడు 'కాలనేమినిహా'. కాలము చక్రంవలె తిరుగుతున్నది. దానికి 'అవిద్య'యే కమ్మి. అఖండమైన దానికి హద్దును చూపించుటయే మాయ. ఆ అవిద్యను నశింపజేయువాడు శ్రీహరి.

3. కాలనేమి అనే రాక్షసుని సంహరించినవాడు విష్ణువు.

ఈ కాలనేమి కంసునిగా పుట్టినప్పుడు నారాయణుడు కృష్ణునిగా అవతరించి సంహరించాడు.

ఇటువంటి అపార ప్రతాపాన్ని కలిగినందున –

వీరః.. 643

1. వీరత్వము కలవాడు.

తన ప్రతాప ప్రకాశాలతో సర్వులను మించినవాడు.

అనేక రాక్షసులను దునుమాడిన పరాక్రమ శాలి.

('అనిరుద్ధః' (638) నామం నుండి 'శూరజనేశ్వరాః' (645) నామం వరకు విష్ణు ప్రతాపాన్ని సంభావించవచ్చు)

'అనంత సూర్యతేజుడట కాంతి చెప్పనంత!
దనుజాంతకుండట ప్రతాపమెంత!' – అని అన్నమయ్య పాట.

మొదటి వాక్యం 'ప్రద్యుమ్నః' వంటి నామాలను స్ఫురింపజేస్తే, రెండోవాక్యం 'అమితవిక్రమః' 'వీరః' అనే నామాలను తోపజేస్తున్నాయి.

ప్రతద్విష్ణుః స్తవతే వీర్యేణ ॥ (ఋగ్వేదం)

దివిశ్రవో దధిషే నామ వీరః। (ఋగ్వేదం)

అగ్నీ రాదేసీ వి చరత్ సమంజన్నగ్నిర్నారీం వీరకుక్షిం పురన్ధిమ్ ॥ (ఋగ్వేదం)

ధర్మ రక్షణార్థం వీరుడై అవతరించినందున -

శౌరిః.. 644

1. *శూరుని వంశంలో జనించిన శ్రీకృష్ణుడు.*

శూరుడనబడే యాదవుని వంశంలో వసుదేవుని తనయుడిగా ఉద్భవించిన భగవానుడు.

2. *అత్యంత శూరుడు.*

'శూరస్య అపత్యంపుమాన్ శౌరిః'

'అపత్యం పుమాన్' అనే శబ్దం 'సంతానం' అర్థాన్నే కాక, 'అత్యంత అధిక్యా'న్ని తెలియజేస్తుంది.

శూరగ్రామః సర్వ వీర సహావాంజేతా పవస్వసనితా ధనాని ॥ (ఋగ్వేదం)

విశ్వంలో ప్రతి శూరునిలోని శౌర్యమూ శ్రీహరి విభూతియే కనుక, ఈతడు -

శూరజనేశ్వరః.. 645

1. *శూర జనులకు ప్రభువు.*

శౌర్యము కలవారు శూరజనులు.

ఇంద్రాది దిక్పాలకులు, లోకపాలకులు, తేజస్వులు శూరులు. వారికి శాసకుడైన వాడు విష్ణువు.

అవతార సమయంలో కూడా సుగ్రీవ, హనుమ, విభీషణాదులకు, భీష్మ ద్రోణాదులకు, పాండవాదులకు నియామకుడై తన సర్వాధిక శౌర్యాన్ని ప్రకటించాడు.

ముజ్జగాల లోకపాలకులకు సైతం శాసకుడు - అనే భావనలోనే త్రిలోకాలకు నియామకుడని స్పష్టమౌతున్నందున -

త్రిలోకాత్మా.. 646

1. మూడు లోకాలలో వ్యాపించినవాడు.

   ఆతయితా ఆతితా వా ఆత్మా

   వ్యాపింపజేసినవాడు, వ్యాపించినవాడు 'ఆత్మా'.

   ముజ్జగాలను విస్తరింపజేసి, వాటియందు నిండిపోయిన చైతన్యమే విష్ణువు.

2. ముల్లోకాల ప్రాణులందరిలో అంతర్యామిగా ఉన్నవాడు. 'అంతర్యామి= దేహాలలో వ్యాపించిన చైతన్యము'.

3. మూడు లోకాలు తన స్వరూపమైనవాడు.

   'ఆత్మా' శబ్దానికి 'స్వరూపం' అని కూడా అర్థం.

   పరమార్థ దృష్టితో లోకత్రయం పరమాత్మ కంటె వేరుకావు.

   సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ ॥ (యజుర్వేదం)

వ్యాపించి సర్వులను శాసించు (ప్రేరేపించు) చైతన్యస్వరూపుడైనందున -

త్రిలోకేశః.. 647

1. మూడు లోకాలను శాసించువాడు.

   ముల్లోకాలు, అందలి లోకపాలకులు, జీవులు ఈశ్వరుడైన ఈతని ఆజ్ఞానువర్తులై, తమ తమ కృత్యాలలో ప్రవర్తిస్తున్నాయి.

   తమీశానంజగతస్తుస్థుషస్పతిమ్ ॥ (ఋగ్వేదం)

   ఇనో విశ్వస్య భువనస్య రాజా ॥ (ఋగ్వేదం)

వ్యాపక శాసకత్వాలను నిర్వహించే తేజోమయుడు కనుక -

1. కిరణములు కలవాడు.

'కేశములు' అని వ్యవహరింపబడే కిరణాలే సూర్యాది తేజోమండలాలలో సంక్రమించాయి. ఆ కిరణ పుంజాలన్నీ ఈ తేజోమయుడైన నారాయణునివే.

అంశవో యే ప్రకాశంతే మమ తే కేశ సంజ్ఞితాః ।
సర్వజ్ఞాః కేశవం తస్మా న్మామాహుర్ద్విజ సత్తమాః ॥

(భారతం. శాంతి పర్వం)

"ప్రకాశిస్తున్న నా అంశువులు (కిరణాలు) కేశాలు. అందుకే సర్వజ్ఞులైన ద్విజశ్రేష్ఠులు నన్ను 'కేశవుడు' అంటున్నారు".

2. బ్రహ్మ విష్ణు శివ స్వరూపుడు. 'త్రిలోకాత్మా' 'త్రిలోకేశుడైన' హరి సృష్టి స్థితి లయలనే మూడు కృత్యములకై మూడు రూపాలుగా భాసిస్తున్నాడు.

'త్రయః కేశినః' అని శ్రుతి వచనం.

క – అ – ఈశ = అనగా బ్రహ్మ – విష్ణు – రుద్రులు.

ఈ ముగ్గురు ఒకే నారాయణుని అభివ్యక్తులు.

'మత్కేశా వసుధా తలే' (విష్ణు పురాణం). 'నా కేశములే భూతలంలో ప్రసిద్ధాలు!

కో బ్రహ్మేతి సమాఖ్యాతః ఈశోహం సర్వ దేహినాం।
ఆవాం తవాంగే సంభూతౌ తస్మాత్కేశవ నామవాన్॥ (హరివంశం)

"కః" – అనగా బ్రహ్మ అని ప్రసిద్ధి. నేను సర్వ ప్రాణులకు 'ఈశు'డను. మేమిరువురము నీ స్వరూపాలుగా ఉద్భవించాము. అందువలననే నీవు కేశవుడవు" అని హరివంశంలో శివవచనం.

(23వ నామానికి వ్యాఖ్య గమనించవచ్చు).

కేశీ కేశా రశ్మయః తై స్త ద్వాన్ భవతి॥ అని యాస్కుని నిరుక్తం.

అధి యస్తస్థౌ కేశవన్తా వ్యచస్వన్తా నపుష్ట్యై ॥ (ఋగ్వేదం)

కేశవుడైన నారాయణుడు, ఈ నామానికి తన కృష్ణావతారంలో మరియొక అర్థాన్ని అందించాడు.

1. 'కేశి' అనే రాక్షసుని హతమార్చినవాడు.

'కేశవం కేశిహన్తారం'... భాగవతాదులలో కూడా ఈ వృత్తాంతం ప్రసిద్ధి. కంసుడు పంపిన 'కేశి' అనే రాక్షసుడు అశ్వ రూపంలో రాగా సంహరించినవాడు.

2. బాధించు వాటిని నశింపజేయువాడు.

క్లిశ్యతే అనేన ఇతి కేశః (సత్యభాష్యం) (**క్లిశేరన్‌లోపశ్చలః** – అనే సూత్ర ప్రకారం – **'క్లిశేర్ధాతోः' అన్ ప్రత్యయో లకారస్య లోపశ్చ'**)

దేనితో బాధ (క్లేశం) కలుగుతుందో అది కేశం. ఈ బాధాలక్షణం కలవాడు 'కేశి'– లోకాన్ని బాధించువాడు. అటువంటి లోక కంటకులను సంహరించు ధర్మ రక్షకుడు విష్ణువు.

3. కేశులను నడుపువాడు.

'హన్తి గతయే ప్రేరయతి' – 'హా' అనే శబ్దము గమనానికి ప్రేరేపించే చైతన్యాన్ని తెలియజేస్తున్నది.

ఈశ్వర తేజోరశ్ములతో (కేశములతో) నిండిన అగ్ని, జలము, వాయువు, విద్యుత్తు... మొదలైనవి కేశులు. వాటిని ప్రేరేపించి నడిపించే వ్యాపక చైతన్య స్వరూపుడు 'కేశిహా'.

కేశ్యగ్నిం కేశీ విషం కేశీ బిభర్తి రోదసీ ।
కేశీ విశ్వం స్వర్దృశే కేశీదం జ్యోతిరుచ్యతే ॥ (ఋగ్వేదం)

'కేశి' అనే శబ్దానికి వేదం పై అర్థాలను చెప్పింది. అగ్ని, విషం (జలం), రోదసి, విశ్వం, జ్యోతి మొదలైనవి 'కేశి' శబ్ద వాచ్యాలు.

సారథి రథమందుండి నడిపించునట్లుగా పైవాటి యందుండి నడిపించే అంతర్యామి విష్ణువు.

ఇన్ని రూపాలుగా (రూపాలలో) వ్యాపించి, తమస్సును హరించే తేజోమయుడు కనుక –

హరిః.. 650

1. హరించువాడు.

జనన మరణ రూపమైన సంసారాన్నీ, సంసారహేతువైన అవిద్యను కూడా హరింపజేసే జ్ఞాన స్వరూపుడు. ఆశ్రయించిన భక్తుల పాపాలను, తమస్సును, ప్రళయకాలంలో జగతినీ హరింపజేసే వాడితడే.

ద్యామిన్ద్రో హరిధాయసం పృథివీం హరవర్పసమ్।
ఆధార యద్ధరితోర్ఋరి భోజనం యయోరన్తర్హరిశ్చరత్। (ఋగ్వేదం)
హరిః పవిత్రే అవ్యత వేధా న యోనిమాసదమ్॥ (ఋగ్వేదం)

✣ ✣ ✣

'అనిరుద్ధః' *(238)* నామం నుండి 'హరిః' *(650)* నామం వరకు శ్రీకృష్ణ స్వరూపునిగా అవతరించిన విష్ణు ప్రతాపాన్ని తెలియజేసినట్లుగా భావించవచ్చు. 'అనిరుద్ధ' నామం నుండి వరుసగా 'వివిధ క్షేత్రాలలో నున్న విష్ణువును చెప్పినట్లు' శ్రీ పరాశరభట్టరు సంభావించారు.

1. **జనార్దనాఖ్యయా దేవస్త్వనిరుద్ధో జగత్ప్రభుః।**
భూభాగే వసుభాండాఖ్యే నిత్య సన్నిహితః స్థితః॥

అనిరుద్ధుడు భూమిలో వసుభాండమనే క్షేత్రంలో జనార్దన రూపంలో సన్నిహితుడయ్యాడు. *(అనిరుద్ధః)*

2. **యామునం జలమాశ్రిత్య దేవదేవః త్రివిక్రమః స్థితః.**

యమునా తీర్థంలో ఉండేవాడు త్రివిక్రముడు. *(అమితవిక్రమః)*

3. **ఉత్పలావదకే దేశే శౌరి సంజ్ఞోచ్యుతః స్థితః॥**

ఉత్పలావదకం *(తిరుక్కణ్ణపురం)* లో 'శౌరి' నామంతో స్వామి ఉన్నాడు. *(శౌరిః)*

4. **ధరాధరే చిత్రకూటే రక్షః క్షయకరో మహాన్।**

చిత్రకూటంలో 'శూరుడైన రాముడు విచ్చేసి ఉన్నారు. *(శూరః)*

5. **మగధా మండలే విప్రమహామేధ ధరాశ్రితః॥**

సంస్థితో లోకనాథాత్మా దేవదేవో జనార్దనః॥

మగధ దేశంలో ఉన్నవాడు 'త్రిలోకాత్మా'. (లోకనాథాత్మ)

6. శుభమాసాద్య భూభాగం ప్రాగ్జ్యోతిషపురే తథా।
దేవం విశ్వేశ్వరాఖ్యంతు స్థితమేత్య స్వగోచరాత్॥

ప్రాగ్జ్యోతిషపురంలో విచ్చేసినవాడు 'త్రిలోకేశుడు'. (విశ్వేశ్వరుడు)

7. కేశవః క్లేశహా లోకే ద్వైరూప్యేణ క్షితౌ స్థితః।
మధురాఖ్యే మహాక్షేత్రే వారాణస్యామపి ద్విజ।

మధురలో, కాశీ క్షేత్రంలో క్లేశహరుడైన కేశవుడు. (కేశవః)

8. గిరౌ గోవర్ధనాఖ్యేతు దేవః సర్వేశ్వరో హరిః।
సంస్థితః పూజితః స్థానే.... ॥

గోవర్ధన పర్వతంపై 'హరి' అనే పేరుతో ఉన్నవాడు. (హరిః)

9. కామదేవస్తు భగవాన్ సర్వేషాం సర్వకామదః।
శంకరాలయ మాసాద్య సంస్థితోప్సరసార్చితః ॥ (కామదేవః)

శంకరాలయ క్షేత్రంలో కామదేవుడు సర్వ పురుషార్థ ప్రదాయకుడు

- వైష్ణవాగమాల ప్రకారం పై క్షేత్ర దైవతాల ప్రశస్తి చెప్పబడింది.

✣ ✣ ✣

సర్వ క్లేశ హరుడైనందున ఈ హరినే అందరూ కోరుకుంటున్నారు.

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః।
అనిర్దేశ్యవపు ర్విష్ణు ర్వీరోఽనంతో ధనంజయః॥ 70

651. కామదేవః, *652.* కామపాలః, *653.* కామీ, *654.* కాన్తః,
655. కృతాగమః , *655.* అనిర్దేశ్యవపుః, *657.* విష్ణుః, *658.* వీరః,
659. అనన్తః, *660.* ధనఞ్జయః॥

కామదేవః.. 651

1. కోరబడు (ప్రార్థింపబడు) దేవుడు.

ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాలను కోరేవారు ఈతనిని ప్రార్థిస్తున్నారు. **కామ్యత ఇతి కామః.** కోరబడువాడు కాముడు.

2. 'దేవ' శబ్దాన్ని ఇక్కడ దానార్థకంలో స్వీకరిస్తే - అన్ని కోరికలను ఇచ్చువాడు 'కామదేవుడు'. ఈ సర్వాభీష్ట ప్రదాయక లక్షణాన్ని వేదం అనేక విధాల కీర్తించింది -

కోఽదాత్ కస్మా అదాత్ కామోఽదాత్ కామాయాదాత్।
కామో దాతా కామః ప్రతిగ్రహీతా కామైతత్తే । (యజుర్వేదం)

3. క-అ-మ = కామ, క-బ్రహ్మవాచకం, అ - విష్ణు వాచకం, మ-రుద్ర వాచకం. బ్రహ్మ విష్ణు రుద్రాత్మకుడైన పరమేశ్వరుడే 'కాముడు'. ఈ కామరూపంలో దీపించేవాడు 'కామదేవుడు'.

ఆశ్రితుల కోరికలను తీర్చి, వారిని పాలిస్తున్నందున -

కామపాలః.. 652

1. కోరికలను (కోరినవారిని) పాలించువాడు.

తానిచ్చిన (నెరవేర్చిన) కోరికలను రక్షించువాడు. కోరికలను తీర్చుట ద్వారా, తనను కోరిన వారిని పాలించువాడు.

'యోగక్షేమం వహామ్యహమ్' అని గీతాచార్యునిగా పరమాత్మ వాక్కు.

లేనిది లభించుట యోగం. లభించినది భద్రంగా నిలబడుట క్షేమం. ఈ రెండింటినీ తీర్చువాడు నారాయణుడు.

కామస్తదగ్రే సమవర్తత మనసో రేతః ప్రథమం యదాసీత్।
సకామః కామేన బృహతా సయోనీ రాయస్పోషం యజమానాయ ధేహి ॥
(అథర్వవేదం)

యత్కామం కామయమానా ఇదం కృణ్మసి తే హవిః। (అథర్వవేదం)
అస్మా అశ్రుణ్వ న్నాశాః కామేనా జయన్త్స్వాః ॥ (అథర్వవేదం)

– అని శ్రుతి 'కామదేవుడు' 'కామపాలుడు' అయిన సర్వేశ్వరుని బహువిధాల ప్రస్తావించింది.

అందరి కోరికలు తీర్చే ఇతనికి కోరవలసింది లేదు – పరిపూర్ణుడు కనుక–

కామీ.. 653

1. పూర్ణములైన కోరికలు కలవాడు.

ఈ పరమాత్ముడు ఆప్తకాముడు, పూర్ణకాముడు. ఈతడు పొందవలసినవి లేవు. కొరత ఉంటే కోరిక ఉంటుంది. కోరిక, కొరత లేనివాడు పరిపూర్ణుడు.

2. విశ్వ రచనకు కోరికొనినవాడు.

స అకామయత – అని శ్రుతి పేర్కొంది.

ఏకమై ఉన్న పరతత్త్వం అనేకమవాలని కోరుకోవడం చేతనే జగతి ఆవిర్భవించింది. **'కామస్తదగ్రే'** అనే వేదమంత్రంలోని ఆంతర్యమిదే. అలా విశ్వ రచనకు సంకల్పించిన 'సత్యకామః సత్యసంకల్పః' – విష్ణువు.

3. కోరినవారికి ప్రసాదించుటకు భోగ్యపదార్థములు (కామములు – ఐశ్వర్యములు) అపారంగా తనయందు కలిగినవాడు.

విశ్వవ్యాపకమైన విష్ణు చైతన్యం చేతనే ఆబ్రహ్మ కీటాంతం అందరిలో మనో వేగరూపంతో కామం ద్యోతకమౌతోంది.

కామీ హి వీరః సదమస్య పీతిం
జుహోత వృష్ణే తదిదేష వష్టి।
కోరబడే ఆనంద స్వరూపం తానే కనుక –

కాన్తః.. 654

1. కోరబడువాడు.

అందరిచేత కోరబడే ఆనందమే ఈతని స్వరూపం.

'ఆనందోబ్రహ్మేతి వ్యజనాత్' (శ్రుతి వాక్యం)

2. సర్వమనోహరమైన కమనీయ రూపం కలవాడు.

రామః కమలపత్రాక్షః సర్వ సత్త్వ మనోహరః।। (రామాయణం)

కామ్య పదార్థాలలో కోరిక తీర్చే శక్తి ఈతడే. ఆ విధంగా కోరికకు లక్ష్యమైన ఫలస్వరూపుడు కనుక, ఈతడే 'కోరబడేవాడు.'

3. బ్రహ్మదేవుని అంతమొందించువాడు.

'క' అనగా బ్రహ్మ. **కస్య అంతం కరోతి – కాన్తః.**

బ్రహ్మదేవుని కాల పరిమాణాన్ని అనుసరించి అతనికి 'ద్విపరార్థాలు' (నూరు సంవత్సరాలు) ముగియగానే, ఆతనిని సైతం అంతమొందించేవాడు.

4. ప్రకాశించువాడు. వ్యాపించినవాడు.

'కనీ దీప్తి కాన్తిగతిషు' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, సంపూర్ణంగా ప్రకాశించువాడు, అంతటా గమనము చేయువాడు (వ్యాపించువాడు).

ఈ వ్యాపకశక్తి చేతనే అన్నిటి గతులను నిర్దేశించి, రాకపోకలను నియమించుతున్నందున –

కృతాగమః.. 655

1. అన్నిటి రాకలను ఏర్పరచినవాడు.

సూర్యచంద్రాదులు, ఋతువులు, జీవులు మాటిమాటికి జరిగే వారి నిత్య

వ్యవహారములు 'ఆగమములు'. వాటిని నియమించి నిర్వహించే చైతన్య స్వరూపుడు కృతాగముడు. ఈతని వలననే పునః పునరాగమనాలు – ఆవృత్తులు విశ్వంలో జరుగుతున్నాయి.

2. శాస్త్రాలను ఏర్పరచినవాడు.

వేదాది శాస్త్రాలు ఈతనిచే ఏర్పడినవి.

'యస్య నిశ్శ్వసితం వేదాః' (వేదములు ఎవని నిట్టూర్పులో)

శ్రుతి స్మృతీ మమైవాజ్ఞే (శ్రుతులు స్మృతులు నా ఆజ్ఞలు)

వేదాః శాస్త్రాణి విజ్ఞానం ఏతత్సర్వం జనార్దనాత్.

(వేదాలు, శాస్త్రాలు, విజ్ఞానం. . ఇది అంతా జనార్దనుని నుండి ఉత్పన్నమైనవి) – అని శ్రుతి స్మృతులు పేర్కొన్నాయి.

శాస్త్రము, దాని నుండి కలిగే జ్ఞానము 'ఆగమం'. జ్ఞానమునకు మూలమైన చైతన్య స్వరూపుడు, జ్ఞానరూపుడు విష్ణువు.

నానా మన్త్రమయీ దివ్యాం వ్యఞ్జయత్యమలాత్మనామ్ ॥ అని ఆగమవాక్యం

నిగమములు వేదములు. ఆగమములు మంత్ర విద్యలు. ఈ రెండింటికీ మూలమైన జ్ఞానరూపుడు నారాయణుడు.

శ్రుతులలో సైతం ఆగమ (శాస్త్ర) కర్తగా భగవానుని పేర్కొన్నారు –

కదు స్తువన్త ఋతయన్త దేవత ఋషిః కోవిప్ర ఓహతే ।

కదా హవం మఘవన్నిన్ద్ర స్తున్వతః కదుస్తువత ఆగమఃఽ। (ఋగ్వేదం)

కదా సుతం తృషాణ ఓక ఆగమ ఇన్ద్ర స్వర్దీవ వంసగఃఽ। (ఋగ్వేదం)

ప్రవతా హి ఋతు నామా హా ప దేవ గచ్ఛసి ।

అధక్షి సూర్యే సచా ॥ (ఋగ్వేదం)

శాస్త్రయోనిత్వాత్ – శాస్త్రములకు కారణమైనవాడు అని బ్రహ్మసూత్ర వచనం

శాస్త్రాదులను తానే ఏర్పరచినప్పటికీ, వాటికి కూడా అందని పరతత్త్వమైనందున –

అనిర్దేశ్య వపుః..

656

1. నిర్దేశించుటకు వీలుకాని స్వరూపము కలవాడు.

   త్రిగుణాలకీ, మనోవాక్కులకు కూడా అతీతుడైన పరతత్త్వమితడు.

   "వేదములకున్ వీక్షింపగారాని నిన్ను..." అని భాగవత వచనం.

   దృశ్యానికి అతీతమైన దృగ్రూపచైతన్యమితడు.

2. లీలగా ఎన్నో ఆకృతులు ధరించినప్పటికీ, 'ఇది ఇంతే' అని నిర్దేశించి కొలత పెట్టడానికి వీలుకానివాడు. **'యుగానుసారి కాన్తిశ్చ'...** అయా యుగాలకు అనుగుణమైన శరీరాన్ని ధరించడం చేత, 'ఇటువంటిది' అని నిర్దేశించలేని శరీరం కలవాడు.

   ద్యుపతయ ఏవ తే నయయురన్త మనన్తతయా
   త్వమపి యదన్తరాణ్డ నిచయా నను సావరణాః ।
   ఖ ఇవ రజాంసి వాన్తి వయసా సహ యద్భృతయః
   త్వయి హి ఫలన్త్యతన్నిరసనేన భవన్నిధనాః॥ (శ్రీమద్భాగవతం. శ్రుతిగీతలు)

   ఆకాశంలో ధూళికణాలవలె కాలచక్రంతో సహా సమస్త బ్రహ్మాండాలు నీ రోమకూపాలలో తిరుగుతున్నాయి. నీ అనంతత్వం చేత బ్రహ్మాది లోకపాలురు కూడా నీ హద్దును తెలుసుకొనలేరు. నీవు కూడా నీ హద్దును తెలుసుకోలేవు. పర్యవసానంగా నీలో లీనమయ్యే శ్రుతులు సైతం నిన్ను 'అస్థూలః అనణుః' (స్థూలము కానివాడు – అణువు కానివాడు) అని, ఏవికావో చెప్తున్నవే తప్ప నువ్వు ఏమైయున్నావో చెప్పలేక పోతున్నవి– 'ఇది యిట్లు' అని నేరుగా ప్రతిపాదించలేకపోతున్నవి.

   'సగుణమైన విశ్వరూపం అనంతము – నిర్గుణం– అవ్యక్తము'.

   'సగుణస్య అనంతత్వాత్ నిర్గుణస్య అగోచరత్వాత్' (శ్రీధరాచార్యుల వ్యాఖ్య). కనుక నీవు నిర్దేశించుటకు వీలు కాని వాడవు.

   కొలత కందని విస్తార స్వరూపుడు కనుకనే–

విష్ణుః.. 657

1. అంతటా ప్రవేశించి, వ్యాపించినవాడు.

విశతి వ్యాప్నోతి విష్ణుః.

చరాచర జగమంతా వ్యాపించిన చైతన్య రూపుడు.

ఈ నామం 2 మరియు 258 నామాలుగా చెప్పబడినది. ఇది మూడవ పర్యాయం. ఇక్కడ 'అనిర్దేశ్యవపుః' 'కృతాగమః' 'వీరః' నామాల క్రమంలో గ్రహించినట్లయితే ఈ విష్ణు నామానికి అతి విస్తారుడైన అనంత స్వరూపుడు అనే అర్థాన్ని చెప్పుకోవాలి.

యస్యోరుషుత్రిషు విక్రమణేష్వధిక్షియన్తి భువనాని విశ్వా। (ఋగ్వేదం)

మూడు లోకములందు విశేషముగా క్రమించి (అడుగులు వేసి, వ్యాపించి) ఉన్న అనంతుడు. ఇంత విస్తృతి కాగల వీరత్వం కలవాడు కనుకనే –

వీరః.. 658

1. దేనిలోనైనా చేరువాడు, వ్యాపించువాడు, సృష్టించువాడు, ప్రకాశించువాడు, విసరివేయువాడు, భక్షించువాడు.

వీ+రః = వీరః

'వీ గతి వ్యాప్తి ప్రజన కాన్త్యసన ఖాదనేషు' ధాతుః.

1. గతి, 2. వ్యాప్తి, 3. ప్రజన, 4. కాన్తి, 5. అసన, 6. ఖాదన – అనే ఆరు అర్థాలు 'వీ' ధాతువునకు ఉన్నాయి. వీటిని చేయువాడు 'వీరుడు'.

1. గతి – సూర్యుని కాంతి వలె చైతన్య రూపుడై అన్నిటియందు చేరువాడు.

2. వ్యాప్తి – సూర్యకిరణాలవలె అంతటా వ్యాపించువాడు.

3. ప్రజన(న) – చక్కగా ఆవిర్భవించువాడు (సూర్యునివలె ఉదయించువాడు), ఆవిర్భవింపజేయువాడు.

4. కాన్తి – ప్రకాశించువాడు.

5. అస్యతి(అసన) – (అ) కిరణాలను (విసరు) వెదజల్లువాడు.

(ఆ) సురలను విసరువాడు.

6. ఖాదన – కిరణశక్తులతో అన్నిటినీ తనలో స్వీకరించువాడు. ప్రళయకాలంలో తనలోనికి సర్వం లయంచేయువాడు.

పై ఆరు లక్షణాలు పరమేశ్వరునిలోనూ, ఆయన స్వరూపమైన ఆదిత్యునిలోనూ గోచరిస్తున్నాయి. 'విష్ణు'వై సర్వజీవులలోనూ పై ఆరు గుణాలను వ్యాపింపజేసినవాడితడే.

'తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః" (గతి, వ్యాప్తి) అని యజుర్వేదమంత్రం. **'ప్రజాపతిశ్చరతి గర్భే అన్తరజాయ మానోబహుధా విజాయత'** అనే యజుర్మంత్రం – 'ప్రజాయతే' అనే అర్థాన్ని స్పష్టపరుస్తోంది.

మాం హవన్తే పితరం న జన్తవో అహం దాశుషే

విభజామి భోజనమ్ ॥ – అనే ఋగ్వేద మంత్రం 'ఖాదనమ్' అనే అర్థాన్ని తేటపరుస్తోంది.

2. **విశేషేణ ఈరయతీతి వీరః** – *'విశేషముగా ఇచ్చువాడు' అని అర్థం.*

స్తోత్రం రాధానాం పతే గిర్వాహో వీర యస్యతే ।

విభూతిరస్తు సూనృతా ॥ (ఋగ్వేదం)

హవ్యం వీర హవ్యా హవన్తే ॥ (ఋగ్వేదం)

బ్రహ్మన్ వీర బ్రహ్మ కృతిం జుషాణః॥ (ఋగ్వేదం)

దివి శ్రవో దధిషే నామ వీరః॥ (ఋగ్వేదం)

ఈ విశేషమైన విభూతులను విస్తృతంగా వ్యాపింపజేస్తున్నప్పటికీ– ఆయనకు గానీ, ఆయన శక్తులకు గానీ అంతం లేనందున –

అనన్తః.. 659

1. పరిమితి (అంతం) లేనివాడు.

దేశకాల వస్తు పరిమితి లేనివాడు.

సర్వత్ర వ్యాపించినవాడు కనుక 'దేశ పరిమితి' లేనివాడు. 'నిత్యుడు' కనుక

కాల పరిమితి లేదు. సర్వము తానే కనుక 'వస్తు పరిమితి' లేనివాడు.

'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' అని శ్రుతి వాక్యం.

గన్ధర్వాప్సరసస్సిద్ధాः కిన్నరోరగచారణాः।

నాన్తంగుణానాం గచ్ఛన్తి తేనానన్తోయమవ్యయः ॥ (విష్ణు పురాణం)

"గన్ధర్వులు, అప్సరసలు, సిద్ధులు, కిన్నరులు, నాగులు, చారణులు ఆ పరమాత్మ గుణాలను తెలియలేకపోయారు. కావున ఆ పరమేశ్వరుడు అనన్తుడు, అవ్యయుడు (తరుగుదల లేనివాడు)".

అదైతస్యై వాన్తోనాస్తి యన్ బ్రహ్మ। (యజుర్వేదం)

'ఇదియే బ్రహ్మమవడం చేత దీనికి అవధి లేదు.'

యస్యా అనన్తో ఆహుత స్త్వేషశ్చరిష్ణు ర్ధవః ॥ (ఋగ్వేదం)

అనన్తాస ఉరవో విశ్వతः సీం పరిద్యావా పృథివీయాన్తి పన్థాः। (ఋగ్వేదం)

అనన్తే అంతరరశ్మని।। (ఋగ్వేదం)

అనన్తే అన్తः పరివీత ఆగాచ్ఛుచిः శుక్రో ఆర్యో రోరుచానः ॥ (ఋగ్వేదం)

తాను 'వీరుడై' విశ్వమంతా పంచిన ధనాలను సైతం మించిపోయిన అనన్తుడు కనుక –

ధనఞ్జయः.. 660

1. ధనమును జయించినవాడు– సమకూర్చేవాడు.

సర్వ ధనాలనీ సంపాదించి సమకూర్చేవాడు మాత్రమే కాక, అన్ని ధనాలనీ మించి పోయిన అఖండైశ్వర్య స్వరూపుడు.

ధన్యతను చేకూర్చేది ధనం. అన్ని ధనాలకీ మించిన ధనం పరమాత్ముడు.

బట్ట బయటి ధనము పరమాత్ముడు ॥

ముంగిట నల్లదివో మూలనున్న ధనము ॥ (అన్నమయ్య వాక్కులు)

'ధనమగ్నిర్ధనం వాయుः ధనం సూర్యో ధనం వసుः...' అని శ్రుతి వాక్యం.

అగ్ని వాయు సూర్య వసు మొదలైనవారిని మించిన పరతత్త్వమితడు.

అగ్న్యాది ధనాలన్నిటినీ సమకూర్చినవాడీతడు.

అన్నిటినీ మించినవాడు కనుకనే ఈయనను సంపాదించాలని భక్తులు, జ్ఞానులు తపిస్తున్నారు. ఈయనను సంపాదించడం కంటె ధన్యత వేరొకటి లేదు. సంపాదించిన ధనంపై లోభం, దానిని రక్షించుకోవడం, దానిచే జీవించడం వంటి సమస్త భావాలు ఎలా ఉంటాయో, భక్తులకు ఈయనపై అటువంటి లోభాదులు ఏర్పడతాయి.

సంపాదించదగిన గొప్ప సంపద ఈతడే...

స పవస్వ ధనఞ్జయ ప్రయన్తా రాధసో మహః॥ (ఋగ్వేదం)

విద్మా హి త్వా ధనఞ్జయం వాజేషు దధృషం కవేః ॥ (ఋగ్వేదం)

2. 'పాండావానాం ధనఞ్జయః' - పాండవులలో ధనఞ్జయుడను (అర్జునుడను) నేనే - అని గీతాచార్యుడు శ్రీకృష్ణుడు విభూతి యోగంలో సెలవిచ్చాడు. ధర్మ జుని రాజసూయ యాగానికై దిగ్విజయకాలంలో అత్యధిక ధనాన్ని జయించి తెచ్చినందున అర్జునునికి ఈ పేరు లభించింది. నారాయణుని దివ్యావతారములైన నర నారాయణులలో నరుడే అర్జునుడు.

సంపదలను అందించి, వాటిని మించిన వాడే కాకుండా, జ్ఞానాన్ని సైతం జగతికి ప్రసాదించిన కారణంగా -

బ్రహ్మణ్యో బ్రహ్మకృద్బ్రహ్మా బ్రహ్మా బ్రహ్మవివర్ధనః।
బ్రహ్మవిద్బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః॥ 71

661. *బ్రహ్మణ్యః,* ***662.*** *బ్రహ్మకృత్,* ***663.*** *బ్రహ్మా,* ***664.*** *బ్రహ్మ,* ***665.*** *బ్రహ్మవివర్ధనః,* ***666.*** *బ్రహ్మవిత్,* ***667.*** *బ్రాహ్మణః,* ***668.*** *బ్రహ్మీ,* ***669.*** *బ్రహ్మజ్ఞో,* ***670.*** *బ్రాహ్మణ ప్రియః॥*

బ్రహ్మణ్యః.. 661

1. బ్రహ్మమునకు హితము కలిగించువాడు.

తపో వేదాశ్చ విప్రాశ్చ జ్ఞానం చ బ్రహ్మ సంజ్ఞితమ్ ।

తేభ్యో హితత్వాత్ బ్రహ్మణ్యః...

'బ్రహ్మ' శబ్దానికి తపస్సు, వేదం, విప్రులు, జ్ఞానం – అని అర్థాలు. వాటికి హితం కలిగించేవాడు బ్రహ్మణ్యుడు.

2. వృద్ధిని, హితాన్ని కలిగించువాడు.

'బృహ బృహి వృద్ధౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి స్వయంగా వృద్ధ (వృద్ధి చెందిన – పరిపూర్ణమైన) స్వరూపుడు. వృద్ధిని కలిగించువాడు 'బ్రహ్మ'. 'యత్' ప్రత్యయం 'హితం' అనే అర్థాన్ని తెలియజేస్తుంది.

విశ్వ వర్ధనం, విశ్వహితం కలిగించువాడు విష్ణువు.

ఉత బ్రహ్మణ్యా వయం తుభ్యం ప్రవృద్ధ వజివః।

విప్రా ఉతక్ష జీవసే ॥ (ఋగ్వేదం)

తపస్సు మొదలైనవి ఏర్పరచినవాడు కూడా తానే –

బ్రహ్మకృత్.. 662

1. తపస్సు, వేదము, వేదవేత్తలు, జ్ఞానము – మొదలైన వాటిని ఏర్పరచినవాడు. జగద్ధితానికై వాటిని ప్రవర్తనం చేసినవాడు.

2. **బృహత్ కరోతీతి బ్రహ్మకృత్.**

'బృంహణత్వాత్ బ్రహ్మ'. విస్తృతి, వృద్ధి – అనే అర్థంలో 'బ్రహ్మ' శబ్దం వాడబడుతున్నది. తనను ఆశ్రయించిన వారిని అన్ని విధాల వృద్ధి చెందించువాడు బ్రహ్మకృత్.

అధ ప్రియం శూషమిన్ద్రాయ మన్మ బ్రహ్మకృతో బృహదుక్థ్యవాచి ॥ (ఋగ్వేదం)

సర్వజగతికి సమృద్ధిని ఏర్పరచినవాడు.

వేదాదులను ఏర్పరచి, తదనుగుణంగా సృష్టిరచనను కావించేవాడు కనుక –

బ్రహ్మ.. 663

1. సృష్టికర్తయైన చతుర్ముఖ బ్రహ్మ.

   సర్వమును సృజించిన బ్రహ్మ దేవుడితడే. చతుర్వేద విజ్ఞాని – వేద వ్యాపకుడు.

2. స్వయంగా వృద్ధి స్వరూపుడు.

   వర్ధన శీలుడైన 'బ్రహ్మ'గా పరతత్వం యజ్ఞ వృద్ధికై ప్రార్థించబడుతోంది. మహదహంకారాది ప్రకృతిని విస్తరింపజేయు సర్వస్రష్ట.

బ్రహ్మ.. 664

1. పరబ్రహ్మ స్వరూపుడు.

   పై 'బ్రహ్మ' నామం పుంలింగ శబ్దం – అది బ్రహ్మను తెలియజేస్తోంది. ఇది నపుంసక లింగ శబ్దం. శుద్ధ పరబ్రహ్మను స్పష్టపరుస్తోంది.

   ఇంకొక కోణంలో గమనిస్తే – 'బ్రహ్మ' శబ్దం 'సగుణ బ్రహ్మ'ను, 'బ్రహ్మ' నామం 'నిర్గుణ బ్రహ్మ'ను తెలియజేస్తోంది.

   తస్మై బ్రహ్మచ బ్రహ్మ చ ఆయుః కీర్తిం ప్రజాం దదుః ॥ (యజుర్వేదం)

   బ్రహ్మ మరియు బ్రహ్మ సాధకునకు ఆయుః కీర్తి సంతానాది సంపదలను ఇస్తారు.

2. **సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ.** (తైత్తిరీయోపనిషత్తు)

   సత్యం, జ్ఞానం, నిరవధికం అయిన బ్రహ్మ తత్త్వం.

   'మిగుల పెద్దది' అని బ్రహ్మ శబ్దానికి అర్థం.

   బృహి – వృద్ధౌ – అనే ధాతువు ననుసరించి **'బృంహతి – బృంహయతీతి బ్రహ్మ'** వృద్ధి నందునది – చాలా పెద్దదిగా నున్నది – వృద్ధి నందించునది– అని అర్థాలు.

   ప్రత్యస్తమిత భేదం యత్ సత్తామాత్ర మగోచరం।
   వచసా మాత్మ సంవేద్యం తద్ జ్ఞానం బ్రహ్మ సంజ్ఞితం॥ (విష్ణు పురాణం)

   భేదరహితం (స్వగతాది భేదాలు లేనిది – అఖండం), సత్తామాత్రం (ఉనికి

మాత్రమే అయినది), మాటలకందనిది, తనకు తాను తెలియునది (అంతర్ముఖ వృత్తిగల ఆత్మకు మాత్రమే తెలియునది) అయిన జ్ఞానమే బ్రహ్మ.

బృహత్వాత్ బృంహణత్వాచ్చ బ్రహ్మేతి పరికీర్త్యతే ॥

అతి పెద్దదై, వ్యాపించినదై, వృద్ధి నందించేది 'బ్రహ్మ' అని చెప్పబడుతున్నది.

ఆదిత్యాత్ విష్ణుం సూర్యం బ్రహ్మాణంచ బృహస్పతిమ్ ॥ (ఋగ్వేదం)

త్వం నో అగ్నే అగ్నిభిర్బ్రహ్మ యజ్ఞంచ వర్ధయ ॥ (ఋగ్వేదం)

బ్రహ్మ చ నో వసో స చేన్ద్ర యజ్ఞంచ వర్ధయ ॥ (ఋగ్వేదం)

ఈ వర్ధన స్వరూపుడు వేదాదులన్నిటినీ వర్ధిల్లజేస్తున్నందున-

బ్రహ్మ వివర్ధనః.. 665

1. తపస్సు, వేదం, విప్రులు, జ్ఞానము – వీటిని వృద్ధి పొందించువాడు.

తపో బ్రహ్మ (తైత్తిరీయోపనిషత్)

బ్రహ్మ వై యజ్ఞః (ఐతరేయ బ్రాహ్మణం)

'వర్ధ ఛేదన పూరణయోః' అనే ధాతువు ననుసరించి – బ్రహ్మము ద్వారా చెప్పబడే తపో వేద జ్ఞాన యజ్ఞాదులను విశేషంగా వర్ధిల్లజేయువాడు.

అస్మాకం బ్రహ్మేదమిన్ద్ర భూతు తేహా విశ్వా చ వర్ధనమ్॥ (ఋగ్వేదం)

వేదాది జ్ఞానం సంపూర్ణంగా తెలిసివాడు, జ్ఞాన స్వరూపుడైన నారాయణుడొక్కడే కనుక –

బ్రహ్మవిత్.. 666

1. వేద – వేదార్థాదులను తెలిసినవాడు.

'అనంతా వై వేదాః' – వేదాలు అనంతం. వేదాలలోని దానికి సంబంధించిన గాథ ఉంది. ఎన్నో వందల ఏళ్ళు అకుంఠితంగా వేదాధ్యయనం చేసినప్పటికీ పర్వతాలలో పిడికెడంత ప్రమాణమేనని – భరద్వాజుడు పరమేశ్వరుని ద్వారా తెలుసుకున్నాడు.

వేదాల పూర్ణ స్వరూపం తెలిసినవాడు పరమాత్ముడొక్కడే.

'వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యో
వేదాన్తకృత్ వేదవిదేవచాహమ్ ॥

'వేదముల ద్వారా తెలియబడే పరతత్త్వము నేనే. ఆ తత్త్వ జ్ఞానాన్ని కలిగించేవాడను నేను. వేదములను తెలిసిన వాడను నేనే" అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముని మాట.

అనాదినిధనం బ్రహ్మ నదేవాः నర్షయో విదుः।
ఏకస్తద్వేద భగవాన్ ధాతా నారాయణः స్వయమ్॥ (మహాభారతం)

'ఆద్యంతాలు లేని వేదాన్ని దేవతలు, ఋషులు తెలుసుకోలేరు. ఆ నారాయణుడొక్కడే ఎరిగినవాడు.'

2. బ్రహ్మ చేత ఏర్పడిన వర్ధన శీలమైన జగతి గురించి కూడా సంపూర్ణంగా ఎరిగినవాడు.

సూత్రం సూత్రంచ యో విద్యాత్ సవిద్యాత్ బ్రాహ్మణం మహత్॥ (అథర్వవేదం)

యత్ర లోకాంశ్చ కోశాంశ్చాపో బ్రహ్మవిదో విదుः॥ (అథర్వవేదం)

ఈ జగతియంతా తానే వ్యాపించి విశ్వమై ఉన్నవాడు కనుకనే–

బ్రాహ్మణः.. 667

1. *జగతిని కలిగినవాడు.*

బ్రహ్మ చేసిన జగం బ్రాహ్మణం. దానిని కలిగినవాడు – అనగా జగతిగా వ్యాపించిన చైతన్య స్వరూపుడు, జగతికి ఆధారమైనవాడు – బ్రాహ్మణుడు. **"బ్రాహ్మణం జగత్, తదస్యస్తీతి బ్రాహ్మణో విష్ణుः॥** (సత్యభాష్యం).

2. తపస్సు, వేదము, యజ్ఞము, జ్ఞానము – 'బ్రహ్మ' వాచకములు. వాటిని కలిగినవాడు బ్రాహ్మణుడు. తపోజీవనుడు, వేదవేత్త, యజ్ఞాచరణ పరాయణుడు, జ్ఞాని –ఆ బ్రహ్మమునే కలిగియున్నందున, వారు విష్ణు విభూతులు. వీరి

ద్వారానే యజ్ఞ తపో వేదజ్ఞానాదులు ప్రవర్తిల్లుతున్నాయి.

'వేద స్వరూపం ఇది' అని వేదార్థాలను తెలియజేసేవాడు.

కపిల, దత్తాత్రేయాది బ్రాహ్మణావతారాలను ధరించి వేద విజ్ఞానాన్ని బోధించిన వాడు.

బ్రహ్మ నయతీతి బ్రాహ్మణః - వేదాదులను ప్రవర్తింపజేసేవాడు.

బ్రాహ్మణోస్య ముఖమాసీత్ (యజుర్వేదం) - విరాట్పురుషుని జ్ఞానాంగమైన ముఖంగా, వేదాది ధర్మ స్వరూపులు అభివర్ణించబడ్డారు. ఇలా -

వేదాలను తెలిసిన ఆతడే (బ్రహ్మవిత్), వాటిని అనుష్ఠించి ప్రవర్తింప జేస్తున్నవాడై (బ్రాహ్మణః), వాటిని తనకు అభిన్నంగా కలిగియున్నందున -

బ్రహ్మా. 668

1. *వేదతపో యజ్ఞాదులే అంగములుగా కలవాడు.*

జ్యోతిని వెలుగే తెలియజేయునట్లు, వేదాదులే వేదవేద్యుడైన విష్ణు బ్రహ్మమును తెలియజేస్తున్నాయి. వెలుగు జ్యోతికి అభిన్నమైన విధంగా, వేదాదులే ఈయనకు అభిన్నాలైన అంగాలు.

2. *విశ్వరూపమైన 'బ్రహ్మ' ఈతనికే, ఈతని యందే ఉన్నది.*

విస్తారమైన జగమంతా తనయందే భాసిస్తున్నది.

సచరాచరం విశ్వరూపం అస్య - అస్మిన్నస్తీతి బ్రహ్మా.

విశ్వంపై అధికారం కలవాడు, విశ్వానికి ఆధారమైనవాడు.

వేదాదులలో 'బ్రహ్మణస్పతి' మొదలైన అనేక శబ్దాలు ఈ భావాలను వ్యంజిస్తున్నాయి.

సర్వవస్తుస్వరూపము విష్ణువే. **'సర్వ బ్రహ్మమయో హరిః'.**

తన నుంచి కలిగిన జగతిలోని ప్రత్యణువునూ తెలిసినవాడు -

బ్రహ్మజ్ఞః.. 669

1. *తన స్వరూపమే అయిన జగతిని సమగ్రంగా తెలిసినవాడు.*

జగతికి తాను ఆధారమై, వ్యాపకుడై యుండుటే కాక, కేవల జ్ఞానరూపుడై, సర్వాన్నీ నియంత్రిస్తున్నవాడు.

బ్రహ్మజ్ఞుడు – సర్వజ్ఞుడు.

2. *తన స్వరూపాలైన వేదాదులనన్నిటినీ ఎరిగినవాడు. విద్వాంసుడు.*

విశ్వానిదేవ వయునాని విద్వాన్ ॥ (ఋగ్వేదం)

3. *ఆత్మజ్ఞాని.*

సర్వం బ్రహ్మమయమని అనుభవపూర్వకంగా ఎరిగి, ఆ బ్రహ్మకు తాను అభిన్ననిగా ఎరిగినవాడు.

బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి – బ్రహ్మవేత్త బ్రహ్మయే అగుచున్నాడు.

ఎరిగిన తాను, ఎరిగిన వానిపట్ల ప్రీతి కలిగినవాడు –

బ్రాహ్మణ ప్రియః.. 670

1. *విశ్వానికి ప్రీతి కలిగించువాడు, ప్రకాశకారకుడు.*

'ప్రీఞ్ తృరణే కాంతౌచ' – అనే ధాత్వర్థాన్ని అనుసరించి తర్పణ (తృప్తి) కారకుడు, దీపింపజేయువాడు ప్రియుడు.

విస్తృతమైన విశ్వమే బ్రాహ్మణం. (చూ. 667)

విశ్వాన్ని తృప్తి చెందించువాడు. ప్రకాశింపజేయువాడు విష్ణువు.

బ్రాహ్మణశబ్దం వేదమందు సూర్య, అగ్ని, ఉషా, వేదం – మొదలైన వాటికి పర్యాయంగా ప్రయోగింపబడింది.

2. *బ్రాహ్మణులకు ఇష్టుడు.*

వేద తపోయజ్ఞ జీవనుడు, జ్ఞాని బ్రాహ్మణుడు. వారికి తాను ఇష్టుడు, తనకు వారు ఇష్టులు.

ప్రియో హి జ్ఞానినోఽత్యర్థః

యేతు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే।
శ్రద్ధధానాః మత్పరమాః భక్తాస్తేతీవ మేప్రియాః॥

'భక్తులు జ్ఞానులు తనకు అత్యంత ప్రీతిపాత్రులు' – అని గీతాచార్యుని వాక్కులు.

'భౌమస్య బ్రాహ్మణోగుప్త్యై' – (భారతం – శాంతి పర్వం). జ్ఞానుల రక్షణార్థం అవతరించిన శ్రీకృష్ణుని భీష్ముడు స్తుతించాడు.

వేద, జ్ఞానాదుల స్వరూపుడై, రక్షకుడై, ఇష్టుడై ఉన్న జ్ఞానమయుని కీర్తించినవీ నామాలు. *(661 నుండి 670 వరకు)* పది నామాలు 'బ్రహ్మ' శబ్దాత్మకమైనవి.

ఈ వేద, జ్ఞాన, జగములను (బ్రహ్మమును) రక్షించే స్వభావంచేత, దీనియందంతా వ్యాపించడం చేత –

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః।
మహాక్రతు ర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః॥ 72

671. మహాక్రమః, ***672.*** మహాకర్మా, ***673.*** మహాతేజాః,
674. మహోరగః, ***675.*** మహాక్రతుః, ***676,*** మహాయజ్వా,
677. మహాయజ్ఞః, ***678.*** మహాహవిః॥

మహాక్రమః.. 671

1. గొప్ప అడుగులువాడు.

పాదవిక్షేపాన్ని 'క్రమము' అంటారు. గొప్పగా పాదములుంచినవాడు. 'పాదమునుంచుట' అనే దానికి వ్యాపించుట, గమనం చేయుట అని భావార్థం.

గొప్పగా విశ్వమంతటా 'ఆక్రమించిన'వాడు.

వామనునిగా వచ్చి రెండు పాదాలతోనే గొప్పగా ఈ విశ్వాన్నంతా ఆక్రమించిన వాడితడు.

విష్ణు రురుక్రమః ॥ (యజుర్వేదం)

2. గొప్ప క్రమము కలవాడు.

ఒకదాని వెంట ఒకటి సాగే పద్ధతి క్రమం. విశ్వ గమనమే గొప్ప పద్ధతి. దానిని నిర్వహించే విశ్వపతి విష్ణువు.

'చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తలమోపిన పాదము
తలకక గగనము తన్నినపాదము
బలరిపు గాచిన పాదము
కామిని పాపము కడగిన 'పాదము'

– ఇలా గొప్ప పనులను గొప్పగా చేసి విష్ణుపాదాన్ని, పాదన్యాసాన్ని (క్రమాన్ని) కీర్తించాడు అన్నమయ్య.

3. తరింపజేసే సాధనా క్రమాలను ఏర్పరచినవాడు.

శిశువునకు మొదట స్తన్యాన్నిచ్చి, పిదప గోక్షీరాన్ని అందించి, ఆపై ఆహారాన్నిచ్చి, అటు తరువాత భోగాదులను అనుభవింపజేయడంలో తల్లి ఏ విధంగా వ్యవహరిస్తున్నదో – అదే విధంగా సాధకుడైన జీవునకు 'క్రమక్రమంగా' సాధనాపథంలో స్థిరపరచి, పురోగమింపజేసి చేరదీసుకొనే వాడు.

అభ్యాస యోగయుక్తేన మా మిచ్ఛాప్తుం ధనంజయ॥
బహూనాం జన్మానామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే॥

– అనే 'భగవద్గీత' ప్రకారం అభ్యాసాదుల క్రమంతో అనేక జన్మల తదుపరి జ్ఞాని తనను పొందునట్లుగా చేసే పరమాత్ముడితడు.

జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః ।
నరాణాం క్షీణ పాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే॥ (విష్ణు ధర్మోత్తర పురాణం)

'అనేక జన్మలలో తపోధ్యాన యోగాదుల చేత, పాపం తొలగిన నరులకు కృష్ణ భక్తి కలుగుతున్నది.'

గొప్ప క్రమము ద్వారా గొప్ప పనులు చేస్తున్న గొప్పవాడు కనుక –

మహాకర్మా.. 672

1. గొప్ప కర్మ కలవాడు.

జగదుత్పత్తి స్థితి లయ రూపమైన కర్మయే మహాకర్మము. అంతునెరుగనిది, దీర్ఘమైనది, ఇతరులు చేయలేనిది, ఆశ్చర్యకరమైనది మహాకర్మ. దానిని చేసే వాడితడు.

విష్ణోः కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పశే ॥ (యజుర్వేదం)

అనితరసాధ్యమైన మహాకర్మలకు తగినట్లుగానే గొప్ప తేజస్సు కలవాడై –

మహాతేజాः.. 673

1. గొప్పతేజస్సు కలవాడు.

తీక్ష్ణీకరించునది తేజస్సు. శక్తి, కాంతి – మొదలైనవి తేజో వాచకాలు.

విశ్వాన్ని ప్రకాశింపజేసే సూర్యాదులు, దేవతలు తేజోవంతులు. వారందరికీ తేజస్సునిచ్చే పరంజ్యోతి మహాతేజస్స్వరూపం.

యేన సూర్య స్తపతి తేజసేద్ధः (తైత్తిరీయ బ్రాహ్మణం)

2. జగద్రక్షణకై – క్రౌర్య శౌర్యాది తీక్ష్ణతలు కలవాడు.
3. మునుపటి నామాలలోని జ్ఞానార్థాన్ని అనుసంధానిస్తే –

వేదాది జ్ఞానముల క్రమమే (మహాక్రమः), గొప్ప కర్మలుగా (మహాకర్మా), అజ్ఞానాంధకారాన్ని తొలగించే పరమజ్ఞాన స్వరూపుడు (మహతేజాः).

ఈ జ్ఞాన పరమైన అర్థం తరువాతి నామాలతోను కలిపి చూడవచ్చు. తేజోనిధియై బహుకాంతులను ప్రసరిస్తున్నందున –

మహోరగः.. 674

1. గొప్పవాడై, మనస్సుతో గమనం చేయువాడు.

ఉరసా గచ్ఛతీతి ఉరగः, రొమ్ముతో (హృదయంతో) ప్రాకినడుచునవి. చరణాదులు లేకనే సంచరించే స్వభావం కలవి సర్పములు. ఇటువంటి గమనం

కలిగినవి కాంతి కిరణాలు. గొప్ప కాంతి స్వరూపుడై వ్యాపించడం చేత మహోరగుడు. ఇవి సూర్య రూప నారాయణుని స్ఫురింపజేసే నామాలుగా కూడా భావించవచ్చు.

2. మనసా *(సంకల్పమాత్రం చేత)* జీవుల హృదయాలలో గమించి వ్యాపించినవాడు.
3. సర్పములలో గొప్పవైన వాసుకి, అనంతుడు విష్ణు విభూతులే.

   'సర్పాణా మస్మి వాసుకిః' –అని గీతాచార్యుని వచనం.

   గొప్ప సర్పాన్ని తనకు శయ్యగా మలచుకొనినవాడితడు.
4. గొప్ప సర్పం – అనగా 'కుండలినీశక్తి' అని కూడా భావించవచ్చు.

   గొప్పక్రమంగా (మహాక్రమః) షట్ చక్రాలలో సంచరించే 'మహాకర్మ'తో భాసించే 'మహాతేజస్సు' 'మహోరగ'మైన కుండలిని.

   కుండలినీ సాధనయే మహాయజ్ఞం.

   తేజస్సుతో, వ్యాపించి చేసే విశ్వ నిర్వాహక మహాకర్మలన్నీ విష్ణుని క్రతువులే....

మహాక్రతుః.. 675

1. గొప్ప క్రతువులు కలవాడు.

   కరోతీతి క్రియతే వా క్రతుః. చేయునది, చేయబడునది క్రతువు. ఈ జగమే విష్ణుని క్రతువు. విశ్వక్రియలే మహా క్రతువులు.

   క్రతువనగా యజ్ఞమే. గొప్ప యజ్ఞాలు విష్ణునిరూపాలు.

   యథాశ్వమేధః క్రతురాట్ – (మనుస్మృతి) క్రతువులలో అశ్వమేధము రాజు. విష్ణువే ఆ క్రతు స్వరూపుడు. తత్త్వపరంగా ఇంద్రియములే అశ్వములు. తత్త్వ విచారణ (మథనం) ద్వారా 'దేహేంద్రియాలు తాను' అనే భ్రాంతిని విడచుట అశ్వమేధయాగం అని జ్ఞానపరంగా సమన్వయించవచ్చు. కర్మకాండ పరంగా యజ్ఞార్థం కూడా గ్రాహ్యమే. ఈ విధమైన జ్ఞాన, యజ్ఞ స్వరూపుడు మహా క్రతువు.

త్వం సోమ క్రతుభిః సుక్రతుర్భూస్త్వం
దక్షైః సుదక్షో విశ్వ వేదాః ॥ (ఋగ్వేదం)

2. *అతి సులభంగా చేయగల 'ఆరాధన' కలవాడు. ఆరాధనమే క్రతువు.*

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసియత్ ।
యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ (భగవద్గీత)

"చేయునది, తినునది, వ్రేల్చునది, ఇచ్చునది, తపించునది అన్నిటినీ కృష్ణార్పణం చేయడమే" మహాక్రతువు. అతడే ఈ ఆరాధనను పొందువాడు. క్రతువులు తానై, వాటిని ఆచరించువాడు కూడా తానై–

మహాయజ్వా.. 676

1. *గొప్ప యజ్ఞములను చేయువాడు.*

విశ్వ నిర్వహణమే గొప్ప యజ్ఞం. దానిని ఆచరించినవాడు.

యజ్ఞాదుల నాచరించేవానియందు – ఆ సామర్థ్యంగా ఉన్నవాడితడే.

రామకృష్ణాది అవతారాలలో లోక సంగ్రహణార్థం అనేక యజ్ఞాలను ఆచరించి మహాయజ్వ అయినాడు.

2. *గొప్ప యాజకులు కలవాడు.*

సర్వయజ్ఞములచేత, యజ్ఞ కర్తల చేత యాజింపబడు బ్రహ్మమీతడే. ఉత్కృష్టులైన యాజకులు ఈయనకు ఉన్నందున ఈతడు మహాయజ్వ.

తేషామే కాన్తినః శ్రేష్ఠాః తేచైవానన్య దేవతాః ॥

అనన్యులైన ఏకాన్తులు శ్రేష్ఠ భక్తులు. వారిచే ఆరాధింపబడుతున్న పరమాత్మ విష్ణువు.

యజ్ఞేన యజ్ఞ మయజన్త దేవాస్తాని ధర్మాణి ॥ (యజుర్వేదం)

ఆ హోతా దున్ద్రో విదథాన్యస్థాన్ సత్యో యజ్వా కవితమః స వేధాః ॥ (ఋగ్వేదం)

యజ్వల యజ్ఞములన్నీ ఈయన కొరకే ఐనందున –

మహాయజ్ఞః.. 677

1. గొప్ప యజ్ఞ స్వరూపుడు.

'యజ్ఞో వై విష్ణుః' - యజ్ఞమే విష్ణు స్వరూపం.

శ్రేష్ఠుడు - యజ్ఞ స్వరూపుడు 'మహాయజ్ఞుడు'.

'యజ్ఞానాం జపయజ్ఞోస్మి' (భగవద్గీత)

'యజ్ఞాలలో జపయజ్ఞాన్ని నేను' అని శ్రేష్ఠయజ్ఞ స్వరూపాన్ని తానేనని సెలవిచ్చాడు. ఇటువంటి శ్రేష్ఠ యజ్ఞాలన్నీ విష్ణుని రూపాలే.

2. గొప్పవారిచేత, గొప్పగా, గొప్ప యజ్ఞములచే ఆరాధింపబడువాడు.

సర్వ యజ్ఞములకు లక్ష్యమీతడే.

యస్మాదృతే నసిద్ధ్యతి యజ్ఞో విపశ్చితశ్చన।
సధీనాం యోగమిన్వతి ॥ (ఋగ్వేదం)

యజ్ఞమూ, కర్తా మాత్రమే కాక యజ్ఞ ద్రవ్య స్వరూపుడైనవాడు -

మహాహవిః.. 678

1. గొప్ప హవిః స్వరూపుడు - గొప్ప హవిస్సు కలవాడు.

'హూయతే అనేన హవిః - హూయత ఇతి వా హవిః - జుహోతీతి వా హవిర్విష్ణుః'.

హవనము చేయబడునది హవిస్సు. దేవతా ప్రీతిగా సమర్పించబడే యజ్ఞ ద్రవ్యం. విశ్వమంతా ఈ పరమాత్ముని యందే కలిగి, ఈయన యందే సమర్పించబడుతోంది. గొప్పదైన ఈ విశ్వమే విశ్వరూపునికి అర్పింపబడే హవిస్సు. ఈ విశ్వరూప హవిస్సు విష్ణువే.

2. దేవతలకు 'ప్రీతి'గా అర్పింపబడేది హవిస్సు.

ప్రీతికరమైన దాన విషయము- ఆశ్రయించదగిన తత్వము - విష్ణువు. ఇతని కంటే ప్రీతి విషయం మరొకటి లేదు కనుక ఇతడు మహా హవిస్సు.

3. గొప్ప హవిస్సులన్నీ ఈ యజ్ఞ పురుషునికే సమర్పించబడుతున్నందున ఈతడు 'మహాహవిః'.

తనను తాను హవిస్సుగా, ఈ పరమాత్మకు సమర్పించుకుంటారు భక్తులు, జ్ఞానులు. ఈ ఆత్మ నివేదనే మహా హవిస్సు.

ఇదమహం మామృత యోనౌ సూర్యే జ్యోతిషిజుహోమి ॥

(తైత్తిరీయ ఉపనిషత్తు)

'ఈ నన్ను నేను అమృత కారణుడైన సూర్యుని జ్యోతిస్సులో హోమం చేసుకుంటున్నాను'.

య ఇమా విశ్వా భువనాని జుహ్వదృషి ర్హోతా
న్యసీదత్ పితా నః ॥ (ఋగ్వేదం)

ఈ సమస్త భువనములు ఆయనకు హవిఃస్థానీయములు.

'బ్రహ్మ' శబ్దం కలిగిన పది (661-670 వరకు) నామాల తరువాత ఈ నామాల స్థానం ఔచితీమంతమైనది. 'బ్రహ్మ-మహత్' శబ్దాలు సమానార్థకాలు. మొదటిగా 'బ్రహ్మ' శబ్దం (వేద తపో జ్ఞానాదుల) ద్వారా చెప్పబడిన పద్ధతులు, కర్మములు, యజ్ఞములు.... అన్నీ విష్ణు స్వరూపాలే. ఈ భావమే 671. (మహాక్రమః) నామం నుండి ఇప్పటి వరకు చెప్పబడింది.

యజ్ఞము - యజ్ఞ కర్త - యజ్ఞ గమ్యం - యజ్ఞ ద్రవ్యం - అంతా బ్రహ్మమేననే ఏకత్వ ప్రతిపాదనం ఈ నామాల క్రమంలో బోధించే తత్త్వం.

ఈ బ్రహ్మ జ్ఞానాన్నే గీత బోధిస్తోంది -

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్॥
బ్రహ్మైవ తేనగంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥



ఈ 'మహా'తత్త్వము చేతనే స్తుతింపదగిన తత్త్వమీతడు.

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః।
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తి రనామయః॥ 73

679. స్తవ్యః, 680. స్తవప్రియః, 681. స్తోత్రం, 682. స్తుతిః,
683. స్తోతా, 684. రణప్రియః, 685. పూర్ణః, 686. పూరయితా,
687. పుణ్యః, 688. పుణ్యకీర్తిః, 689. అనామయః ॥

స్తవ్యః.. 679

1. పొగడదగినవాడు.

స్తుతించుటకు తగిన తత్త్వ, గుణ, మహిమాదులు కలవాడు.

యజ్ఞాదులలో స్తుతి ప్రధాన కర్తవ్యం. దేవతా ప్రీతికరమైన స్తుతి ప్రక్రియలోనున్న దివ్యత్వం ఇక్కడ నుండి ఐదు నామాలలో నిబద్ధమై ఉంది. స్తుతి ద్వారా వ్యక్తమయ్యే ఈశ్వరమహిమ సాధకునికి యజ్ఞ ఫలాన్ని ప్రసాదిస్తుంది. యజ్ఞంలో ప్రధాన భాగమైన స్తోత్రం ద్వారా పరమేశ్వరతత్త్వమే చెప్పబడుతున్నది కనుక – యజ్ఞ సంబంధమైన నామాల క్రమంలో ఈ 'స్తుతి' పరమైన నామాలు సమకూర్చారు.

బృహద్ – రథన్తర – వామదేవ్యాదికాలతో స్తుతింపబడేవాడు. సామగాన ప్రియుడు.

వేదాదులయందు ఈశ్వరుని స్తుతించుటలోనున్న ప్రశస్తి బహుధా ప్రస్తావించబడింది.

మహः సు వో అరమిషే స్తవామహే మీఢుషే
అరంగమాయ జగ్మయే ॥ (ఋగ్వేదం)
సుతే సోమే స్తుమసి ...
స్తవిష్యామి త్వా మహం....
ఉతో న ఏభి స్తవథైరిహ స్యాः ॥ (ఋగ్వేదం)

అందరిచే స్తుతింపబడేవాడు.

ఆదరేణ యథా స్తౌతి ధనవన్తం ధనేచ్ఛయా ।
తథా చేద్విశ్వ కర్తారం కో నముచ్యేత బంధనాత్ ॥

'ధనాన్ని కోరేవాడు ధనవంతుని స్తుతిస్తాడు. ఆ విధంగా విశ్వకర్తయైన పరమాత్మను స్తుతిస్తే, ఎవడు సంసార బంధనం నుండి విడివడడు?'

స్తుతించుటకు తగినవాడు నారాయణుడొక్కడే.

ఆదరంగా చేసే స్తుతిని, ప్రీతిగా గ్రహించే ప్రసన్నుడు కనుక –

స్తవప్రియః.. 680

1. స్తవముల పట్ల ప్రీతి కలవాడు.

తెలిసిగానీ, తెలియకగానీ, ఏ భాషలోనైనా, ఎవరిచేనైన స్తుతింపబడి ప్రసన్నుడయ్యే స్వామి.

స్తోత్రించేవారి సోత్రాలచే తాను ప్రీతుడై, వారికి ప్రీతి కలిగించేవాడు.

ఆ నః కామం పూపురన్తు స్తవానాః ॥ (ఋగ్వేదం)
ఆ వో వాహిష్ఠో వహతు స్తవధ్యై ॥ (ఋగ్వేదం)

విశ్వ వ్యాపకమైన లక్షణ మిది. స్తుతిచే ప్రీతి చెంది, ప్రియాన్ని కలిగించటం ప్రాణి సహజం. తద్రూపంగా వ్యాపించిన ప్రీతి తత్త్వ స్వరూపుడు. ప్రీతి చెందించే స్తుతి రూపంగా ఉన్న శక్తి కూడా నారాయణ విభూతియే కనుక –

స్తోత్రమ్.. 681

1. స్తుతి సాధనమైనవాడు.

ఏ వాఙ్మయంలో స్తుతి చేస్తున్నామో ఆ భగవద్గుణ సంకీర్తనాత్మకమైన స్తోత్రం కూడా స్వామి స్వరూపమే. స్తోత్రమందంతటా స్తవ్యుని (స్తుతింపబడేవాని) గుణమహిమలే నిండి ఉంటాయి. కనుక, అది భగవంతుని శబ్ద స్వరూపమే.

శ్రీమన్నారాయణుని దర్శించిన వెంటనే ఆయన కృపచేతనే స్తోత్రం

పలుకబడుతోంది. ధ్రువుడు శ్రీహరిని దర్శించి పరవశించినప్పుడుహరి తన చేతి శంఖము ద్వారా ఆతని కంఠాన్ని పలికించాడు. స్తుతి రూపంగా వ్యక్తమయ్యాడు.

'యోన్తః ప్రవిశ్య మమ వాచమిమాం ప్రసుప్తాం
సంజీవయత్యఖిల శక్తి ధరః స్వధామ్నా (భాగవతం)

లోన ప్రవేశించి, నిద్రించిన వాక్కును, తన శక్తిచే సంపూర్ణంగా జీవింపజేసే అఖిలశక్తి ధరుడు విష్ణువు.

స్తూయతే అనేన ఇతి స్తోత్రం. దేనిచే స్తుతింపబడుతున్నాడో అది స్తోత్రం. అది వేదమే. వేద స్వరూపుడు విష్ణువు.

వదన్తీర్యత్ర గచ్ఛన్తి తదాహోర్బ్రాహ్మణం మహత్ ॥ (అథర్వవేదం)
మహి స్తోత్రమవ ఆగన్మ సూరోరస్మాకం సుమఘవన్ బోధి గోపాః। (ఋగ్వేదం)

స్తోత్రమనే ప్రక్రియ మాత్రమే కాక - క్రియ కూడా ఆతడే -

స్తుతిః.. 682

1. పొగడు క్రియ.

స్తుతించుటకు అవసరమైన చిచ్ఛక్తి స్వరూపుడు. స్తోత్రమనే సాధనమే కాక, దానికి అవసరమైన క్రియా రూప శక్తి ఈతడే. ఈ ఔపాధిక చిచ్ఛక్తి చేతనే స్తుతి రూపయజ్ఞం సాగుతున్నది.

2. 'స్తుతః' అని పాఠాంతరం.

పొగడదగినవాడు (స్తవ్యః) కనుకనే స్తోత్ర రూపములైన వేదాదుల చేత స్తుతింపబడినవాడు. వేద పురాణేతిహాసాలే కాక, ఛందః స్వరూపుడైన గరుత్మంతుడు, వేయిపడగల అనంతుడు, బ్రహ్మాదులు, మహర్షులు, భక్తులు నిరంతరం ఈతని స్తుతిస్తున్నారు

స్తుహి శ్రుతం గర్త సదం యువానం... (యజుర్వేదం)

హృదయ గుహాంతర్వర్తియైన శాశ్వత పరంజ్యోతిని స్తుతించమని వేదమాత అనుశాసనం.

పురా నూనం చ స్తుతయ ఋషీణాం... ॥ (ఋగ్వేదం)

అస్య స్తుతిం జరితుర్భిక్షమాణాः ॥ (ఋగ్వేదం)

– అని శ్రుతి వచనాలు.

అశేష దేవేశ నరేశ్వరేశ్వరైः

సదా స్తుతం యచ్చరితం మహాద్భుతమ్॥

సమస్త దేవరాజుల చేత, నరప్రభువుల చేత, లోకపాలకుల చేత సదా స్తోత్రం చేయబడిన అద్భుతస్వరూపుడు.

'స్తుతింపబడేవాడు–స్తోత్రం–స్తుతించేవాడు' – ఈ త్రిపుటి ఏకమైన కైవల్యస్థితి ఈయన అసలు స్వరూపం కనుక–.

స్తోతా.. 683

1. *స్తుతించేవాడు.*

స్తుతిసాధనం, క్రియ మాత్రమే కాక; స్తుతించేవానిలోనున్న చైతన్యము కూడా ఈతడే.

లోకంలో తనను తాను స్తుతించుకొనే లక్షణం సర్వ జీవులలోను ఉంది. ఈ గుణంగా వ్యాపించినది ఈశ్వర చైతన్యమే.

2. *తనను స్తుతించే వారిని కూడా స్తుతించగలిగే స్వభావం కలవాడు.*

తన దివ్యావతారాలలో తాను స్వయంగా మహాత్ములను స్తుతించాడు. రామకృష్ణాది అవతారాలలో గురువులను, దేవతలను స్తుతించి ఆదర్శాన్ని చూపించాడు. ఈ విధంగా స్తోతగా వ్యవహరింపబడ్డాడు.

3. *యజ్ఞాదులయందు స్తోతృ స్థానంలో ఉన్న వేద విజ్ఞాని యందు వేదవిభూతి ఈతడే.*

స్తుతియైన వాక్ స్వరూపం ఈ నామాలలో స్పష్టమౌతోంది. స్తుతింపబడేవాడు – స్తోత్ర ప్రక్రియ – స్తుతి కర్తలలో ఏకమైన వాక్ చైతన్యాన్ని ఈ నామాలు క్రమబద్ధంగా వ్యక్తీకరిస్తున్నాయి.

'వాగర్థంబులు శ్రోతృవక్తలు జగద్వంద్యుండు అద్వైతవి –
ద్యాగోష్ఠిన్ పరికింప ఈశ్వరుడె కాదా...' అని ధూర్జటి మహాకవి మాట.

స్తోతా వా అమృతః స్యాత్ ॥ (ఋగ్వేదం)

స్తోతా స్యాం తవ శర్మణి ॥ (ఋగ్వేదం)

స్తుతి రూపవాక్కు నాదాత్మకం. ఆ నాదం పట్ల ప్రీతి కలిగిన వాడు కనుక–

రణప్రియుఁ.. 684

1. *శబ్ద (నాద) ప్రియుడు.*

నాదమయమైనది వాక్కు. ఈ నాదం రెండు విధాలు – స్వరాత్మకం, పదాత్మకం. స్తుతిలో ఉండే ఈ రెండు రూపాల నాద (శబ్ద) బ్రహ్మము పట్ల ప్రీతి చెందేవాడు విష్ణువు.

'నాదప్రియ తే నమోనమో – నారాయణ తే నమోనమో' అని అన్నమయ్య కీర్తించాడు. 'సామగానలోల' 'నాదలోలుడై...' మొదలైన మాటలతో త్యాగయ్య సన్నుతించాడు.

రణతి శబ్దాయతే ఇతి రణఃు

శబ్దించునది రణము. స్తుతి శబ్ద స్వరూపం. ఆ శబ్దం పట్ల ప్రీతి కలిగేవాడు. యజ్ఞం వేదమయం.

వేదం శబ్దస్వరూపం. వేదప్రియుడే రణప్రియుడు.

కస్య వృషా సుతే సచా నియుత్వాన్ వృషభో రణత్ । (ఋగ్వేదం)

ఆ యాహ్యగ్నే అత్రివత్ సుతే రణఃు। (ఋగ్వేదం)

2. *శబ్దగుణకమైన ఆకాశమును ప్రకాశింపజేసే సూర్యుడు.*

పవస్వ గోజిదశ్వజిత్ విశ్వజిత్ సోమరణ్యజిత్ ॥(ఋగ్వేదం)

3. *యుద్ధ ప్రియుడు.*

లోక రక్షణార్థం ఎల్లవేళలా శంఖ చక్ర గదా శార్ఙ్గ కౌమోదకీ ఆయుధాలను ధరించి, తన నిత్య సమరసంసిద్ధతను తెలియజేసేవాడు. స్తుతికి సంతోషించి

ఆసురీశక్తులను దునుమాడే సమరప్రియుడు. వేదాది స్తుతి రూప వాక్కులచే పొగడదగిన నిండైనవాడు కనుక –

పూర్ణః.. 685

1. నిండైనవాడు.

కొరతలేని వాడు విష్ణువు. తాను పొందవలసినవి ఏమీ లేనివాడు. అవాప్త సమస్త కాముడు – కామిత ఫలములన్నీ తీరినవాడు.

సకల కళలతో పూర్ణుడు. అనంత కల్యాణగుణ సంపూర్ణుడు.

2. తనివి నొందించువాడు (తడుపువాడు)

'పూరీ ఆప్యాయనే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **ప్యాయయతి చ సర్వం రసరూపేణాన్తః ప్రవిశ్యేతి– పూర్ణః** (సత్యభాష్యం)

అన్నిటియందు రస స్వరూపుడై ప్రవేశించి ఆప్యాయనము చేయువాడు.

పూర్ణ ఆహావో మదిరస్య మధ్వో యం విశ్వం

ఇదభి హర్యన్తి దేవాః ॥ (ఋగ్వేదం)

ప్ర నూనం పూర్ణ బంధురః స్తుతో యాహి వశాం అనుయోజాన్విన్ద్ర తే హరీ॥ (ఋగ్వేదం)

ఇమా గిరః సవితారం సుజిహ్వం పూర్ణగభస్తి మీడతే సుపాణిమ్ ॥ (ఋగ్వేదం)

పై వేదమంత్రాలలోని 'స్తుతి–పూర్ణ' శబ్దాల సమన్వయమే ఈ నామాల వరుసను సమకూర్చడంలోని ఔచిత్యాన్ని స్ఫుటీకరిస్తోంది.

నిండైన తాను తన శక్తులతో అంతటినీ నింపినవాడై –

పూరయితా.. 686

1. నింపువాడు.

స్తుతించిన భక్తుల కోరికలను పూరించువాడు – సర్వ సంపదలను నింపువాడు.

విశ్వమంతా తన శక్తులను పూరించిన పూర్ణుడు.

2. తన కాంతులతో ఆకాశాదులను నింపిన సూర్య రూప విష్ణువు.

ఆ దేవో యాతు సవితా సురత్నోన్తరిక్షప్రా వహమానో అశ్వైః ॥ (ఋగ్వేదం)

'అన్తరిక్షప్రా' అనే మాటతో సూర్యనారాయణుని ప్రస్తుతించింది వేదం.

అన్తరిక్షం ప్రాతి పూరయతీతి అన్తరిక్షప్రా.

అన్తరిక్షాన్ని నింపి, నిండుతనమిచ్చిన పూర్ణుడు.

స్తుతికర్తయైన యజమానికి పూర్ణత్వాన్ని ప్రసాదించడమే కాక, పవిత్రతను సమకూర్చువాడు.

పుణ్యః.. 687

1. పవిత్ర స్వరూపుడు – పవిత్రము చేయువాడు.

దోషములేని శుద్ధుడు. తనను స్మరించినంత మాత్రాన కల్మషాలను నశింపజేసి, పవిత్రులను చేసే పరిపూర్ణుడు.

స్తుతి ఫలితాన్ని 'పూరయితా' 'పుణ్యః' అనే నామాలు తెలియజేస్తున్నాయి. 'బ్రహ్మణ్యః' (661) నామం నుండి క్రమంగా చెప్పబడే యజ్ఞ తత్త్వమైన హరి – యజ్ఞఫలాలుగా అభీష్టాలను పూరింపజేసి, చిత్తశుద్ధిని ప్రసాదిస్తున్నాడు.

విశ్వతో నః శకునే పుణ్యమా వద ॥ (ఋగ్వేదం)

పవిత్ర పతే పవిత్ర పూతస్యయత్కామఃఃి (యజుర్వేదం)

పూర్ణుడై, పవిత్రుడైన స్వామి యొక్క యశస్సును స్తుతిస్తే చాలు పవిత్రమౌతున్నాం కనుక –

పుణ్యకీర్తిః.. 688

1. పవిత్రమైన యశస్సు కలవాడు.

పుణ్యకరమైన కీర్తి. ఈతని యశస్సును, మహిమను కీర్తించడం జీవులకు పుణ్యాన్ని కలిగిస్తున్నది.

నామ సంకీర్తనం భక్త్యా విలాయన మనుత్తమమ్।
మైత్రేయాశేష పాపానాం ధాతూనా మివ పావకః॥
అవశేనాపి యన్నామ్ని కీర్తితే సర్వ పాతకైః ।
పుమాన్ విముచ్యతే సద్యః సింహాత్రస్తైః మృగైరివ॥

"మైత్రేయా! భక్తితో భగవానుని నామ సంకీర్తనం చేయడం చేత, వాని గుణాలలో నిమగ్నమవడం చేత, అగ్నిచే వృక్షాదులవలె, సమస్త పాపాలు నశించుతాయి. అప్రయత్నంగానైనా హరిని సంకీర్తించితే, సింహానికి భయపడి మృగాలు పారిపోయినట్లుగా, సమస్త పాపాలు తొలగుతాయి" అని పరాశరుని మాట. (విష్ణు పురాణం)

తద్విప్రాసో విపణ్యవో
జాగృవాంస స్సమింధతే।
విష్ణోర్యత్పరమం పదమ్॥ (ఋగ్వేదం)

విశేష ప్రజ్ఞ కలిగిన మహాత్ములు విష్ణుని పరమపదాన్నే విలువైనదిగా ఎంచుకొంటున్నారు. శబ్దార్థాలను విష్ణునియందే సమర్పణ బుద్ధితో వినియోగిస్తున్నారు.

'కలౌ కౌశవ కీర్తనాత్' – అనే వ్యాసవచనానుసారం, కలిదోషాలను సైతం పోగొట్టే పవిత్ర కీర్తి కలవాడు విష్ణువు. యజ్ఞ స్వరూపుడైన విష్ణువు తన కీర్తిగానమనే స్తోత్రానికి ఫలితంగా పుణ్యాన్ని ప్రసాదించి, దుఃఖాలను తొలగిస్తున్నందున–

అనామయః.. 689

1. దుఃఖాలు లేనివాడు.

ఆమయం – అనగా ఆధి వ్యాధులు. అవి లేనివాడు అనామయుడు. దుఃఖాలకు మూలం అజ్ఞానం. పూర్ణ జ్ఞానస్వరూపుడు కనుక సమూలంగా దుఃఖాలు లేనివాడు. తనను స్తుతించువారికి ఆధి వ్యాధుల్ని తొలగించే పరమ పావనుడు.

అనంతానంద రూపుడైన విష్ణువు, తన ఆశ్రితుల దుఃఖాలను తొలగించు చున్నాడు.

హృద్రోగం మమ సూర్యో హరిమాణం చ నాశయ ॥ (ఋగ్వేదం)

సూర్యమండలాంతర్వర్తియైన హరి – తనను స్తోత్రించేవారిని అనుగ్రహించి, దుఃఖ వ్యాధిరహితుల్ని చేస్తున్నాడు.

✤ ✤ ✤

*71*వ శ్లోకంలోని పది నామాలు – వేద స్వరూపాన్ని చెప్పిన నామాలు. *72*వ శ్లోకం – *(మహాక్రమో)* నుండి ఎనిమిది నామాలు వేదకర్మ స్వరూపాన్ని బోధించాయి. *73*వ శ్లోకం *(స్తవ్యః)* నుండి *13* నామాలు స్తుతి స్వరూపాన్ని స్పష్టపరచాయి.

మొదటి శ్లోకంలోని నామాలు మనస్సుని *(అంతఃకరణాన్నీ)*, రెండవ శ్లోకంలోని నామాలు కర్మనీ *(శరీర స్వరూపాన్ని)* మూడవ శ్లోకంలోని నామాలు వాగ్రూప యజ్ఞాన్ని బోధిస్తున్నాయి. ఇలా త్రికరణాత్మక యజ్ఞానికి ఫలప్రదాత విష్ణువు. 'పూర్ణత్వా'న్నీ, పుణ్యాన్నీ ఆధివ్యాధి రాహిత్యాన్ని ప్రసాదిస్తున్నాడు.

✤ ✤ ✤

భక్తుల ప్రార్థన విన్న వెంటనే భగవానుడు భక్తునికి అనుకూలంగా వ్యవహరించడంలో అతి శీఘ్రంగా కృపని చూపించడం చేత –

మనోజవ స్తీర్థకరో వసురేతా వసుప్రదః।
వసుప్రదో వాసుదేవో వసు ర్వసుమనా హవిః॥ 74

690.మనోజవః, 691.తీర్థకరః, 692. వసురేతాః,
693.వసుప్రదః, 694.వసుప్రదః, 695.వాసుదేవః,
696. వసుః, 697.వసుమనాః, 698. హవిఃll

మనోజవః.. 690

1. మనస్సుతో సమానమైన వేగం కలవాడు.

సర్వవ్యాపకుడైనందున మనస్సు యొక్క వేగం వంటి వేగం కలవాడు. భక్తులననుగ్రహించటంలో వారి వారి మనస్సు ననుసరించి వేగముగా అనుగ్రహించేవాడు.

గజేన్ద్రుని అనుగ్రహించడానికై వస్తున్న నారాయణుని వర్ణిస్తూ **"మనస్సమాన సంచారుండై"** – అని పోతనగారు వర్ణించారు.

గజేన్ద్రుడు చేసిన ఉపనిషత్ప్రతిపాద్య తత్త్వ 'స్తుతి' చేత, తన సర్వ వ్యాపకత్వాన్ని ఋజువు చేస్తూ విష్ణువు వెంటనే సాక్షాత్కరించాడు.

తత్రాఖిలామరమయో హరిరావిరాసీత్ ॥ (భాగవతం)

సర్వదేవమయుడైన హరి అక్కడే ఆవిర్భవించాడు.

2. జ్ఞాన రూపమైన వేగము *(గతి)* కలవాడు.

జ్ఞాన రూపమైన తన శక్తిచే జగద్గతిని నిర్వహిస్తున్నాడు. తన మనశ్శక్తి చేత 'సత్యసంకల్పుడైన' హరి ఈ జగతికి గమనాన్ని కల్పిస్తున్నాడు.

నమో నమస్తుభ్యమసహ్యవేగ
శక్తి త్రయాఖిల ధీగుణాయ ॥ – అని గజేన్ద్రకృత విష్ణుస్తుతి.

గ్రహాదుల వేగములన్నీ విష్ణుని జ్ఞానముచేతనే నిశ్చయింపబడినాయి.

మనోజవసా వృషణా స్వస్తి ॥ (ఋగ్వేదం)
మనోజవేభిరిషుభిః శయధ్యై ॥ (ఋగ్వేదం)

తన జ్ఞాన వేగంచేత తరింపజేసేవాడు కనుక –

తీర్థకరః.. 691

1. తీర్థములను చేయువాడు.

   తీర్థ శబ్దానికి విద్య, శాస్త్రం అని అర్థాలు.

   వేదాది విద్యలను, బ్రహ్మ విద్యను సృష్టించినవాడు, ప్రవర్తింపజేసినవాడు – తీర్థకరుడు.

   నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, మీమాంస, న్యాయశాస్త్రం, పురాణం, ధర్మశాస్త్రం – అనే పదునాల్గు వైదిక విద్యలు. 'హయగ్రీవ రూపంతో మధు కైటభుల్ని దునుమాడి సర్వ వేదాది విద్యలను బ్రహ్మకు ఉపదేశించిన విష్ణువు. దేవశత్రులైన రాక్షసులను వంచించుటకై ఆతడే వేద బాహ్య విద్యను ఉపదేశించాడు' అని పురాణ కథనం.

2. తరింపజేసేది తీర్థం. **'తృ ప్లవన సంతరణయోః'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి – అజ్ఞానం నుండి, పాపం నుండి దాటించేది తీర్థం. అటువంటి తారక విద్యలను అనుగ్రహించడమే కాక –

   జగత్తారణకై తన నుండి గంగాది పుణ్యతీర్థాలను ఏర్పరచినవాడు, ఆ తీర్థాలకు తీర్థత్వాన్ని (పరిశుద్ధి చేసే గుణాన్ని) ఇచ్చినవాడు. **'స్రోతసామస్మి జాహ్నవీ'** అని తన విభూతిగా గంగను పేర్కొన్నాడు పరమాత్మ. (భగవద్గీత)

3. ఉత్పత్తికి ఆధారాన్ని ఏర్పరచినవాడు.

   నిపా(దా) నాగమ యోస్తీర్థం ఋషిజుష్ట జలే గురౌ। అని 'అమరకోశం'.

   తీర్థం శాస్త్రాధ్వరక్షేత్రోపాధ్యాయమన్త్రిషు।

   అవతార ఋషి జుష్టాంభః స్త్రీ రజస్సు – అని విశ్వ నిఘంటువు.

   "నీటి తొట్టె, శాస్త్రం, ఋషులు సేవించే జలము, గురువు, అధ్వరుడు, క్షేత్రం, ఉపాధ్యాయుడు, మన్త్రి, అవతారం, స్త్రీ రజస్సు' – అని తీర్థ పదానికి అర్థాలు.

విశ్వ యజ్ఞానికి అధ్వరుడు, ఋషి సేవ్యుడైన రస స్వరూపుడు, జగద్గురువు, శాస్త్రకర్త, ఉత్పత్తికి మూలమైన క్షేత్రాన్ని, రజస్సునీ ఏర్పరచినవాడు – పరమాత్మ.

'తాసాం బ్రహ్మ మహద్యోనిః'

'మమయోనిః మహద్బ్రహ్మ తాసాం గర్భం దదామ్యహమ్– అని పరమాత్ముని మాట.

ప్రకృతికి మూలమైన మహత్తును విశ్వోత్పత్తికి ఆధారమైన రజస్సుగా చేసినవాడు – తీర్థకరుడు.

4. తరింపజేసే అవతారాలను దాల్చినవాడు.

భగవత్తత్త్వం అనంతమైనదీ, గాఢమైనదీ అయినప్పటికీ తన దివ్యావతారములనే తీర్థ ఘట్టములుగా చేసి అనుగ్రహిస్తున్నాడు.

కృతం తీర్థం సుప్రపాణం శుభస్పతీ
స్థాణుం ప్రథేష్టామప దుర్మతిం హతం॥ (ఋగ్వేదం)
నమస్తీర్థ్యాయ చ కూల్యాయ చ ॥ (యజుర్వేదం)

శాస్త్రాదుల ద్వారా జగతిని నిర్వహిస్తున్న ఈతడే – ఈ జగదుత్పత్తికి హేతువు కనుక –

వసురేతాః.. 692

1. అన్నిటి ఉత్పత్తికి హేతువైనవాడు.

'వస నివాసే' – అనే ధాత్వర్థాన్ని అనుసరించి, 'సర్వం దేనియందు వసిస్తున్నాయో' అది వసువు. సర్వ నివాసమైనది జగతి. దాని ఉత్పత్తికి హేతువైన బీజప్రదాత పరమేశ్వరుడైన విష్ణువు.

'అహం బీజప్రదః పితా' – అని 'భగవద్గీత'.

సర్వనివాస హేతువు, సర్వోత్పత్తి హేతువు – అని అర్థం.

2. *'వసు' అనగా అగ్ని, సువర్ణం (సంపద) అని అర్థాలు. అగ్నిమయమైన సృష్టి బీజం కలవాడు.*

'హిరణ్యరేతాః' అని శ్రుతి వర్ణించింది. విశ్వహేతువైన మహాతేజస్సే హిరణ్యము. దీనికే 'వసు' అని నామాంతరం.

'అగ్నీ షోమీయం' – అగ్ని, రసములతో కూడినది జగతి. ఆ 'అగ్నీషోమ తత్త్వము'ను 'వసురేతాః' శబ్దం తెలిజేస్తుంది.

దేవ పూర్వ మహః సృష్ట్వా తాసువీర్య మవాసృజత్ ।

తదండమభ్ధి మం బ్రహ్మాణః కారణం పరమ్॥ (మహాభారతం)

"భగవానుడు మొదటిగా జలాలను సృష్టించి వాటియందు వీర్యవ్యాప్తిని చేశాడు. అది సృష్టి కర్తయైన చతుర్ముఖ బ్రహ్మ ఉత్పత్తికి హేతువైన, ఉత్కృష్టమైన హిరణ్మయాండముగా ఐనది" –అని వ్యాసవచనం.

3. *వసువనగా ధనం, ఐశ్వర్యం. విశ్వ ఐశ్వర్యాలకు బీజమైన వాడు, ఐశ్వర్యమైన బీజము కలవాడు.*

ఆదీం కేచిత్ పశ్యమానాస అప్యం
వసురుచో దివ్యా అభ్యనూషత ॥ (ఋగ్వేదం)
త్ర్యనీకః పత్యతే మహినావాన్ రేతోధా
వృషభః శాశ్వతీనాం ॥ (ఋగ్వేదం)

ఈ విధంగా ఉత్పత్తి హేతువై, సర్వులకు స్థానమిచ్చినవాడు కనుక –

వసుప్రదః.. 693

1. వాసమును ఇచ్చినవాడు.

వసన్త్యస్మిన్నితి వసుర్వాసః తం ప్రదదాతీతి వసుప్రదః. (సత్యభాష్యం)

దేనియందు వసిస్తామో అది వాసము – వసువు. దానిని ఇచ్చువాడు వసుప్రదుడు. స్థానప్రదాత. తానే అందరికీ వాసస్థానమై ఆధారమైనవాడు.

2. *వసువనగా ధనం, సువర్ణం. దానిని అందరికీ అనుగ్రహించువాడు ధనాధ్యక్షుడు.*

వసుం ధనం ప్రకర్షేణ దదాతి – ధనాన్ని మిక్కిలిగా ఇచ్చువాడు.

కామేశ్వరో వైశ్రవణో దదాతు

కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయ నమః॥

– అనే శ్రుత్యుక్తి ననుసరించి, ధనాధ్యక్షుడైన కుబేరుడు విష్ణు విభూతి. ఆ స్వరూపంగా భాసించి పూజింపబడుతున్నాడు.

3. 'వసు' శబ్దానికి తేజస్సు అని అర్థం. 'తేజః ప్రదాత' – వసుప్రదుడు. వాసాన్నీ, ఐశ్వర్యాన్నీ కాక – తీర్థకరుడైన (విద్యాప్రదాయకుడైన) గురువుగా మోక్షాన్ని కూడా ప్రసాదిస్తున్నందున –

వసుప్రదః.. 694

1. *గొప్పఫలమైన మోక్షాన్ని ఇచ్చువాడు.*

విజ్ఞాన మానందం బ్రహ్మ – రాతిర్దాతుః పరాయణం –
తిష్ఠమానస్య తద్విదః (బృహదారణ్యకోపనిషత్తు)
"బ్రహ్మము విజ్ఞానరూపం – ఆనందరూపం.
అది ధనదాతకును, బ్రహ్మతత్త్వవేత్తకును పరమగమ్యం."
'ధనదాత' అనగా యజ్ఞమాచరించే యజమాని – దక్షిణదాత.
ఆ యజ్ఞ కర్తకు కర్మఫలప్రదాత, బ్రహ్మవేత్తకు పరమగతి – వసుప్రదుడు.
ఉత్కృష్ట ఫలమైన మోక్షమనే సంపదను భక్తులకు ప్రదానం చేయువాడు.

2. *ఆసురీప్రవృత్తి కలవారి సంపదలను (వసువులను) మిక్కిలిగా నశింపజేయువాడు.*

ప్రకర్షేణ దృతి ఖండయతి – ప్రదః,
'మిక్కిలిగా ఖండించువాడు.'
ఐహికమైన ఐశ్వర్యములు, ఆముష్మికమైన పారమార్థిక సంపద – రెండింటినీ ప్రసాదించువాడు అని స్పష్టంచేయడానికై ఒకే నామం రెండు అర్థాలుగా ప్రయుక్తమైనది.

స బోధి సూరిర్మఘవా వసుపతే వసుదావన్ ॥ (ఋగ్వేదం)
స నో వసూన్యా భర ॥ (ఋగ్వేదం)

అర్హులైనవారికి వసువుల నొసగి, అసురుల వసువులను ఖండించే వసునియామకుడైనందున –

వాసుదేవః.. 695

1. అన్నిటా వసించి ప్రకాశించువాడు.

'ఉండువాడు – ఉంచేవాడు – వాసుః'. అంతటా తానుండువాడు – అన్నిటినీ తనయందుంచినవాడు –

ఈ వాస ధర్మంతో సర్వత్రా, ప్రకాశించు చైతన్య స్వరూపుడు – వాసుదేవుడు.

వాసనాద్వాసుదేవస్య వాసితం భువనత్రయం।
సర్వభూత నివాసోఽసి వాసుదేవ నమోస్తుతే ॥

"ముల్లోకాలు ఈతని చేత ఉనికి కలిగిఉన్నాయి. సర్వభూతముల యందు వసించు చైతన్య రూపుడు."

(చూ. 332 నామం)

ఏకో 'దేవః' సర్వభూతేషు గూఢః – అని ఉపనిషద్వాక్యం. సర్వభూతములయందు రహస్యంగా భాసించు ఏకదైవమితడు.

2. వసుదేవుని కుమారుడు.

'వసురేతాః' నామం నుండి కొన్ని నామాల వరకు నారాయణుని పూర్ణావతారమైన శ్రీకృష్ణునకు సంబంధించిన నామాలుగా శ్రీ పరాశర భట్టరు వ్యాఖ్యానించారు.

ఈ దేవుని యందే అన్నీ వసించడం చేత –

వసుః.. 696

1. అంతటా కప్పినవాడు.

'వస ఆచ్ఛాదనే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, అంతటా వ్యాపించినవాడు. అన్నిటికీ ఆధారమైనవాడు.

2. తేజః స్వరూపుడు – సంపత్స్వరూపుడు.

తాను ప్రసాదించే సంపదలన్నీ తన స్వరూపాలే.

విశ్వ వ్యాపకమైన తేజస్సు వసురూపుడైన విష్ణువు.

దేవతలకు సైతం తేజస్సుగా ఉన్న వాడితడు –

యః శుక్ర ఇవ సూర్యో హిరణ్య మివ రోచతే ।
శ్రేష్ఠో దేవానాం వసుః ॥ (ఋగ్వేదం)

(చూ. 104, – 270)

అష్టవసువులు, అష్ట సిద్ధులు, అష్టైశ్వర్యాలు – అన్నీ ఈ సంపత్స్వరూపుడే. ఈ 'వసుమతి' అందంతటా వ్యాపించిన వసువు విష్ణుని విభూతి. ఇదే సూర్య చంద్రాగ్న్యాదులలో ప్రకాశించే తేజస్సు.

ఈ విధంగా వసించే చైతన్య రూపమైన జ్ఞానం కలవాడు కనుక –

వసుమనాః.. 697

1. వసించే మనస్సు కలవాడు.

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరం ॥(భగవద్గీత)

సర్వ భూతములయందు సమంగా ఉన్న పరమేశ్వరుడు.

సముగా వసించే మనస్సు కలవాడు. **'మన అవబోధనే'** వసించే జ్ఞాన స్వరూపుడు. కేవల చైతన్య స్వరూపుడు.

సర్వ జీవుల మానసమందున్న ఈతని చేతనే జగతి చలిస్తున్నది.

2. ఐశ్వర్యమయమైన మనస్సు కలవాడు.

(చూ. 105వ నామం)

ఆయనకు సమర్పించే వాటియందున్న ఐశ్వర్యరూపుడు కూడా తానే కనుక –

హవిః.. 698

1. యజ్ఞమునందు అర్పించబడు ద్రవ్యస్వరూపుడు.

హూయత ఇతి హవిః.

'బ్రహ్మ హవిః' – అని గీతావాక్యం. హవిస్సు కూడా బ్రహ్మస్వరూపమే.

యమాయ సోమంసునుత యమాయ జుహుతాహవిః॥ (ఋగ్వేదం)

యజ్ఞ స్వరూపంగా నారాయణుని ఆవిష్కరించే నామాల క్రమంలో, యజ్ఞాగ్ని యొక్క తేజో లక్షణాన్నీ, సంపత్స్వభావాన్నీ 'వసురేతాః' నామం నుండి క్రమంగా చెబుతూ, ఆ అగ్నియందు సమర్పింపబడే హవిస్సు కూడా ఆ తేజస్సుకి అభిన్నమని చెప్పడం ఈ నామంలోని ఉద్దేశం.

2. కొనిపోబడినవాడు.

ఒక దాని నుండి మరొక దాని వద్దకు తీసుకు వెళ్ళబడినవాడు – **హూయతే ఇతి హవిః.** తాను నిశ్చలుడైన పరమాత్మ అయినప్పటికీ పరిణామాత్మకమైన జగతిలో, ఒకచోటు నుండి మరొక చోటుకు ఒక కాలం నుండి మరొక కాలానికి అనుస్యూతంగా వ్యాపించడం చేత సర్వ కాలములందు, సర్వస్థలములందు భాసిస్తున్నాడు.

భూమియందు వసించాలనే మనస్సుతో (వసుమనాః) అవతరించిన సర్వైశ్వర్యశాలి (వసుః, వాసుదేవః), తన ఆజ్ఞ చేతనే వసుదేవుని ద్వారా యశోదానందుల గృహానికి కొనిపోబడినవాడు.

యజ్ఞాదులయందు శ్రద్ధతో హవిస్సుల నిచ్చినవారికి లభించే ఉత్తమ గతులన్నీ ఈయన స్వరూపములే కనుక –

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః।
శూరసేనో యదుశ్రేష్ఠః సంనివాసః సుయామునః॥ 75

699. *సద్గతిః,* ***700.*** *సత్కృతిః,* ***701.*** *సత్తా,*
702. *సద్భూతిః,* ***703.*** *సత్పరాయణః,* ***704.*** *శూరసేనః,*
705. *యదుశ్రేష్ఠః,* ***706.*** *సన్నివాసః,* ***707.*** *సుయామునః॥*

సద్గతిః.. 699

1. సత్పురుషులకు గతి అయినవాడు.

సత్పురుషులచే పొందబడినవాడు.

'అస్తి బ్రహ్మేతి చేద్వేద సంతమేనం తతో విదుః' (తైత్తిరీయోపనిషత్తు)

'బ్రహ్మతత్త్వమే 'ఉన్నది' అనే ఎరుక కలవాడు. 'సత్' శబ్దముచే చెప్పబడువాడు' – అనగా 'సత్పురుషుడు'(సంతులు). అటువంటి సంతులచే పొందబడే పరతత్త్వం విష్ణువు.

'బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి' – అను వేదాంత శాస్త్రోక్తి ప్రకారం, కేవలం 'ఉనికి'యైన పరమాత్మను పొందినవారు అదే తామవుతున్నారు. ఆ కైవల్య స్వరూపుడు.

'సర్వదాభిగతః సద్భిః సముద్ర ఇవ సింధుభిః' (రామాయణం)

– 'నదులు సముద్రాన్ని ఆశ్రయించినట్లు సత్పురుషులు ఈతనిని అన్ని విధముల ఆశ్రయిస్తున్నారు'. నదులకు సముద్రమే పరమగమ్యం. అలాగే సత్పురుషులు పొందదగిన పరతత్త్వమితడు.

శ్రీకృష్ణుడు అవతరించడం చేతనే సత్పురుషులు సంతోషించారని విష్ణుపురాణం చెబుతున్నది.

సతాం సన్తోషమధికం ప్రశమం చణ్డ మారుతః (విష్ణుపురాణం)

'సాధువులకు అధిక సంతోషకరుడై దుష్టులకు చండ మారుతమువంటి వాడై యుండువాడు.'

2. యజ్ఞాదులచే పొందబడే సద్గతి స్వరూపుడు.
3. అన్ని విధముల ఉత్కృష్టమైనది సత్. అటువంటి మహోన్నతమైన 'గతి'– బుద్ధి –కలవాడు.
4. ఎల్లవేళలా ఉన్న గతి స్వరూపుడు.

ప్రవాహనిత్యత్వం వలె ఈ జగతి నిత్యం భ్రమిస్తున్నది.

గ్రహాదులు 'గతి' కలిగి ఉన్నాయి. తాను ఉంటూ, ఈ గతిని నిత్యము ఉంచిన చైతన్య స్వరూపుడు విష్ణువు.

సద్గతులను సమకూర్చుటకై, అవతరించి సత్కార్యాలాచరించినవాడు కనుక–

సత్కృతిః.. 700

1. గొప్ప కార్యము కలవాడు.

జగద్రక్షణమనే గొప్ప పనిని చేస్తున్నవాడు.

ఈ విశ్వమే స్వామి చేసిన, చేస్తున్న సత్కృతి.

సదసస్పతి మద్భుతమ్ । (యజుర్వేదం) అని శ్రుతి కీర్తించింది.

సత్ – కారణ రూప బ్రహ్మ, అసత్ – కార్య రూపబ్రహ్మ. ఈ రెండింటికీ ప్రభువు అద్భుత స్వరూపుడు. మూల ప్రకృతికీ, ప్రపంచానికీ నియామకుడు.

2. తన దివ్యావతారములన్నీ సత్కృతులే. వాటిని విని, కని, ఆనందించిన వారి సంసార బంధనాలను తొలగించుట – స్వామి యొక్క అసలైన సత్కృతి.

జగద్రచన, అవతారలీలలు, సత్పురుషులకు ముక్తినిచ్చుట – ఈ గొప్ప పనులు చేసిన, చేస్తున్న విష్ణువు. ఇన్ని గతులు, కృతులు కలిగిస్తున్నా, తాను మాత్రం కేవలం ఉనికిగా ఉన్నవాడు కనుక – 'సత్తా' (701)

–సప్తమ శతకమ్ సంపూర్ణమ్–

"శ్రీ విష్ణు సహస్ర నామ భాష్యరూపమైన 'శ్రీ విష్ణువిద్య'లో సప్తమ శతకము సంపూర్ణము ॥

సత్తా.. 701

1. కేవలం 'ఉనికి' అయినవాడు.

ఉన్నది బ్రహ్మమొక్కటే. రెండవది లేదు.

ఏకమేవాఽద్వితీయమ్' – (ఛాందోగ్యం)

సజాతీయ విజాతీయ స్వగత భేదములేని అనుభూతియే సత్తా.

ఒకే జాతి కలిగిన వాటి మధ్య భేదము 'సజాతీయం'.

ఉదా॥ రెండు అశ్వముల నడుమ భేదం. భిన్న జాతుల నడుమ భేదం 'విజాతీయం'. ఉదా॥ గుఱ్ఱాలకు, ఆవులకు నడుమ భేదం. ఒకే వస్తువులో భేదం 'స్వగతం'. ఒకే శరీరంలో కాళ్ళు, చేతులు, తల మొదలైన భేదాలు.

ఈ భేదములేవీ లేని కేవల చైతన్య స్వరూపుడు.

న తదస్తి వినా యత్స్యాత్ మయా భూతం చరాచరమ్ ॥ (భగవద్గీత)

"లోకంలో చరాచరాత్మక పదార్థాలలో నాచే వ్యాప్తం కాని వస్తువేదీ లేదు" – అని పరమాత్మ వచనం.

రకరకాల చిత్రాలకు ఒకే కుడ్యం (గోడ) ఎలా ఉనికి (ఆధారం) అయినదో అలా గతులలో, కృతులతో భేదమున్నా, ఆధారమైన తాను మాత్రం భేదరహితమైన ఉనికి మాత్రమే.

తాను తన సత్తాయందు – ఈ జగమంతా 'సత్తు'ను (ఉనికిని) కలిగినట్లుగా భాసింపజేస్తున్నాడు. కుండలలో మట్టివలె ఈ భిన్నములందంతటా అభిన్నముగా వ్యాపించిన ఏక రస స్వరూపుడు.

సత్తా స్వరూపుడైన ఆయన నుండే 'ఉండుట' అని 'ఎరుక' కలుగుతున్నందున –

సద్భూతిః.. 702

1. *'ఉండుట' అనే 'భూతి' (అనుభూతి) స్వరూపుడు.*

'సన్' ఇతి 'భూతిః'.

'సన్' (ఉండుట) అనే అనుభూతియే పరమాత్మ. 'చిత్' స్వరూపుడు.

ఏది ఉండడం వలన అన్నీ ఉన్నట్లు కనిపిస్తున్నాయో అది 'సద్భూతిః'. 'నేను ఉన్నాను' అనే స్ఫురణకు మూలమైనది ఆత్మ (చైతన్యం). అది ఉండడం చేతనే దానియందు మాయా కల్పితమైన జగతి ఉన్నట్లుగా భాసిస్తున్నది. నిజానికి 'ఉండుట' ఆత్మ తత్త్వమే.

ఉనికి నుండి విడదీయరాని ఎరుకయే పరమాత్ముని రూపం.

'భూతిః' అనేది 'చిత్'. ఆ చిత్ తత్త్వ స్వరూపుడు కనుక సద్భూతిః.

'ఇప్పుడుంది – మరొకప్పుడు లేదు – ఇలా ఉంది – అలా లేదు' అనబడే పరిణామాత్మకమైన జగత్తు, ఎప్పుడూ పరిణామము లేని ఆత్మ చేతనే స్ఫురి

స్తున్నది. ఈ స్ఫురణకు ఆధారమైన ఆత్మ అంతటా ఒకే విధంగా వ్యాపించి ఉన్నది. 'వసు' – 'వాసుదేవ' మొదలైన నామాల ద్వారా సమంగా వ్యాపించిన ఆ ఏకత్వాన్ని తెలియజేస్తూ, దాని 'సత్-చిత్' తత్త్వాన్ని ఇక్కడ స్పష్టం చేశారు.

ఉన్నట్లుగా గోచరించే జగతి దేని వలన అలా స్ఫురిస్తున్నదో అదే శాశ్వతమైన 'ఉనికి' – ఆత్మ స్వరూపం.

2. శాశ్వతమైన ఆత్మ తత్త్వం – సత్. దానిని ఆధారం చేసుకొని ఏర్పడిన 'భూతిః' జగత్. వ్యవహారంలో జగత్స్వరూపుడు. పరమార్థంలో సత్ స్వరూపుడు. 'సత్' అనగా మూల కారణమైన ప్రకృతి. ఆ ప్రకృతి రూపంలో వివిధ విధములుగా అయినవాడు.

3. సత్పురుషులకు ఐశ్వర్యమైనవాడు.

'భూతిః' అనే మాటకు 'ఐశ్వర్యం' అనే అర్థాన్ని గ్రహిస్తే, సత్పురుషులకు ఈయనే ఐశ్వర్యం. కృష్ణాద్యవతారాలలో గోపికలు, మహాత్ములు ఈతడే తమ సర్వస్వమైన ఐశ్వర్యంగా భావించి, ఆరాధించారు. వారందరికీ ఐశ్వర్య రూపుడైన వాడు.

విశ్వమంతా ఉన్నవి ఆతని సద్విభూతులే.

ఈ విధంగా తత్త్వ జ్ఞానులకు, భక్తులకు పరమమైన ఆశ్రయమితడే కనుక –

సత్పరాయణః.. 703

1. సత్పురుషులకు మిగుల గొప్పదైన గమ్యము.

తత్త్వ జ్ఞానము కలవారు పొందే పరతత్త్వమితడు.

2. లయస్థానం. 'సత్' అనే మాటకు ప్రకృతి అనే అర్థం తీసుకుంటే – ఈ ప్రకృతికీ, ప్రకృతి వలన కలిగే జగతికీ కూడా లయ స్థానమితడు – అనే అర్థాన్ని గ్రహించవచ్చు.

అంతేకాదు – ఉనికిగా భాసించే ఈ విశ్వమంతా, ఆతనినే పరమమైన

ఆశ్రయంగా ఉన్నది – తరంగాలు సముద్రాన్ని ఆశ్రయించినట్లుగా. తరంగాలకు సముద్రమే పరాయణం (పరమమైన ఆశ్రయం). సర్వ జీవులకు శాశ్వతమైన పరమమైన-ఆశ్రయమైనవాడు పరమాత్ముడైన విష్ణువు.

3. అవతార సమయంలో శ్రీకృష్ణుని ఆశ్రయించుకొని పాండవాది దైవీగుణ సంపన్నులు వర్తించారు.

కృష్ణాశ్రయాः కృష్ణ బలాः కృష్ణనాథాశ్చ పాండవాः।
కృష్ణः పరాయణం తేషాం॥ (భారతం. ద్రోణ పర్వం)

పాండవులు కృష్ణునే ఆశ్రయించినవారై, కృష్ణునే బలంగా కలవారై, కృష్ణునే నాథునిగా గ్రహించి, ఆతనినే తమకు పరమైన గతిగా భావించారు. అలాగే భీష్మ, విదుర, గోపికా, ఉద్ధవాదులు ప్రవర్తించారు. రామావతారంలో సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న సుగ్రీవ హనుమద్విభీషణాదులు ఈతనినే పరమగతిగా ఆశ్రయించారు.

4. అలా తనను ఆశ్రయించిన వారినే తనకు పరమప్రీతియైన ఆశ్రయంగా భావించి, వారిపట్లనే వర్తించాడు స్వామి. 'సత్పురుషులనే తనకు ఆశ్రయంగా భావించినవాడు.' **'మయితే తేషు చాప్యహం'** అని గీతలో చెప్పినట్లుగా – 'వారియందు తాను – తనయందు వారు'గా ఉన్నవాడు.

'మమ ప్రాణాహి పాణ్డవాः' 'పాండవులు నాకు ప్రాణములు' అని స్వామి ప్రకటించాడు.

'పాండవానాం భవాన్నాథः భవన్తం చాశ్రితాः వయమ్'

'నీవు పాండవులకు నాథుడవు. మేము నిన్నే ఆశ్రయించాము'– అని సత్పురుషులు కృష్ణుని వేడుకున్నారు.

"జ్ఞానీత్వాత్మైవ మేమతమ్"

'జ్ఞాని నా స్వరూపుడే' అని గీతలో కృష్ణుడే ప్రకటించాడు.

స్వామిని ఆశ్రయించిన జ్ఞానులు, భక్తులే శూరులు. వారే స్వామికి సేనలు కనుక –

శూరసేనః.. 704

1. *శూరులను సేనలుగా కలవాడు.*

మహాశౌర్యవంతులైన హనుమదాదులను సేనలుగా కలిగిన శ్రీరాముడు, యాదవ పాండవాది శూరులను తన సేనలుగా స్వీకరించి ధర్మప్రతిష్ఠాపన చేసిన శ్రీకృష్ణుడు నారాయణుని దివ్యావతారాలు.

2. శూరసేనుని వంశంలో ఉద్భవించి, ఆ నామ సార్థక్యాన్ని తాను స్థిరపరచి, ఆ వంశాన్ని పావనం చేసిన శ్రీకృష్ణుడు. తాను ఏ వంశంలో అవతరించదలచుకున్నాడో ఆ వంశంలోని పితరులలో దివ్య విభూతిగా తన అంశని ఉంచిన నారాయణుడు.

శ్రీరాముని పూర్వీకులైన ఇక్ష్వాకులు, శ్రీకృష్ణుని పూర్వీకులైన శూరసేనాదులు విష్ణు విభూతితో కూడినవారే. 'సోహమా జన్మశుద్ధానాం'... అంటూ సూర్యవంశరాజుల చరిత్రను 'రఘువంశ' కావ్యంగా కీర్తించాడు కాళిదాస మహాకవి. "ఆ రాజులొక్కరొక్కరు నారాయణ మూర్తులు.." అని కవి సమ్రాట్ విశ్వనాథ కల్పవృక్ష వాక్యం.

3. *'శూర' శబ్దానికి గతిమంతుడు (గమనము కలవాడు) అని అర్థం.*

'షిఞ్ బంధవే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి 'సేనా' అంటే 'బంధించునది' అని అర్థం. 'గతిమంతులను బంధించువాడు (నియంత్రించువాడు) – శూర సేనుడు'. **"శూరాన్ = గతి మతోసౌ సినాతి = బధ్నాతి ఇతి శూరసేనః"** (సత్యభామ)

కళ్లు ఇటూ అటూ కదులుతాయి – కానీ క్రిందపడవు. అంటే కదులుతున్నప్పటికీ శరీరాంతర్గతమైన చైతన్యమే దానిని క్రిందపడకుండా బంధిస్తున్నది. అలాగే కదలిక కలిగిన ఇంద్రియాలు ఒకే దేహంలో బంధింపబడి వ్యవస్థ చేయబడినాయి. ఇది శరీరాంతర్గత చైతన్య శక్తి.

అలాగే గతిశీలాలైన గ్రహాదులను (శూరులను), భూతకోటిని వాటి వాటి గతి నియమాలలో బంధించి, నడుపుతున్న విశ్వ నిర్వాహకుడు (సేనః) విష్ణువు.

యశసం వీరవత్తమమ్ ॥ (ఋగ్వేదం)

శూరులను నియంత్రించే మహాశూరుడితడు.

4. శూరులు, వీరులు అనే మాటలు జ్ఞానులను, భక్తులను తెలుపుతున్నాయి. ఇంద్రియాలను జయించి, ఆత్మజ్ఞులైన వారే మహా శూరులు, వీరులు, ధీరులు. వారే పరమాత్ముని సేనలు.

'వీరారాధ్యా' 'ధీరసమర్చితా' వంటి లలితా నామాలలో కూడా ఈ భావమే స్పష్టమౌతోంది. ఎన్నో విఘ్నాలను అధిగమించి, విషయ వాంఛలను విసర్జించిన ఉపాసక శ్రేష్ఠులే పరమాత్మను గ్రహించగలరు.

'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్' – అని ఉపనిషత్తు, అంతర్ముఖ ప్రజ్ఞ కలిగిన వారిని 'ధీరులు' అని స్పష్టం చేసింది.

నారీ కటాక్ష పటు నారాచభయరహిత
శూరులెరుగుదురు నిను చూచేటి చూపు.
ఘోర సంసార సంకుల తర విచ్ఛేద.
ధీరు లెరుగుదురు నీ దివ్య విగ్రహము
ఇతరులకు నినునెరుగ తరమా?
సతత సత్యవ్రతులు సంపూర్ణ మోహ విరహితులెరుంగుదురు నిను ఇందిరారమణా!

– అని అన్నమయ్య కీర్తించాడు.

శూరులను తన వారిగా చేసుకొని అవతార కార్యాన్ని నిర్వహించిన, యదు వంశమౌళి.....

యదుశ్రేష్ఠః.. 705

1. యదువులలో ముఖ్యుడు.

యదువంశంలో ఉద్భవించిన శ్రీకృష్ణుడు ఆ వంశీయులలో, యాదవులలో శ్రేష్ఠుడై భాసించాడు. యయాతి శాపం చేత అధోగతి పొందిన యదువంశంలో,

తాను జన్మించి ఆ వంశాన్ని ఉద్ధరించి కీర్తి తెచ్చిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు.

అయం స కథ్యతే ప్రాజ్ఞైః పురాణార్థ విశారదైః।
గోపాలో యాదవం వంశం మగ్నమభ్యుద్ధరిష్యతి ॥ (విష్ణు పురాణం)

పురాణ తత్త్వవేత్తలైన ప్రాజ్ఞులచే – 'ఈ ఆది దేవుడు గోపాలుడై అవతరించి యదువంశాన్ని ఉద్ధరింపజేయగలడు' అని చెప్పబడినవాడు ఈతడే.

2. ప్రయత్న శీలురలో శ్రేష్ఠుడు.

'యతీ ప్రయత్నే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి 'యదుః' అంటే ప్రయత్న శీలుడని అర్థం. అలాంటి ప్రయత్న శీలురైన వారిలో అత్యంత ప్రథముడు – యదుశ్రేష్ఠుడు.

ప్రయత్నిస్తున్నట్లుగా కనిపిస్తున్న దేహేంద్రియాదుల కంటే శ్రేష్ఠమైనది హృదయం. ఆ హృదయాన్ని సైతం చైతన్యవంతం చేస్తున్న ఆత్మయే 'యదుశ్రేష్ఠుడు'.

'ఈశ్వర స్సర్వభూతేషు హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా'

– అని గీతలో పరమాత్మ చెప్పినట్లుగా, సర్వజీవుల హృదయస్థానంలో ఉండి చలింపజేసే యదుశ్రేష్ఠుడు నారాయణుడు.

యంత్రంలో తేజస్సు ఎలా దానిని చలింపజేస్తున్నదో, అదే విధంగా జీవులను, విశ్వాన్నీ చలింపజేస్తున్న నిజమైన ప్రయత్నశీలుడు విష్ణువు.

సూర్యునిచే చేతనత్వం పొందిన జగతికంటె శ్రేష్ఠుడు సూర్యుడు. ఇంద్రియాలకంటే బుద్ధి, బుద్ధి కంటే పరమాత్ముడు పరమమైన తత్త్వం. అదే 'శ్రేష్ఠత్వం.'

యదిన్ద్రాగ్నీ యదుషు తుర్వశేషు
యద్ ద్రుహ్యుష్వనుష పురుష స్థః ॥ (ఋగ్వేదం)
ఉత దాసా పరివిషే స్మిద్దష్టీ గోపరీణసా।
యదుస్తుర్వశ్చ మామహే॥ (ఋగ్వేదం)
అస్మై శ్రేష్ఠేభిర్ఋనుభి ర్విభాహ్యుషో దేవీ ప్రతిరన్తీన ఆయుః॥ (ఋగ్వేదం)

యదుశ్రేష్ఠుడై అవతరించిన ఈతడు సత్పురుషులతో నివసించిన వాడైనందున –

సన్నివాసః. 706

1. *సత్పురుషులకు నివాస (ఆశ్రయ) మైనవాడు.*

తత్త్వజ్ఞులైన విద్వాంసులు ఈతనినే ఆశ్రయించి ఉన్నారు.

'నివాస వృక్షః సాధూనాం' – 'సత్పురుషులకు నివాస వృక్షము వంటి వాడు' అని శ్రీరాముని వర్ణించాడు వాల్మీకి.

సత్పురుషులతో కలసి మెలసి నివసిస్తూ, వారికి తాను ఆధారుడై ప్రకాశించాడు.

సనన్ద నాద్యైః మునిభిః సిద్ధ యోగై రకల్మషైః
సంచిన్త్యమానం తత్రస్థైః నాసాగ్రన్యస్తలోచనైః। (విష్ణుపురాణం)

పరిశుద్ధులైన సనక సనన్దనాది మునులు సిద్ధయోగంతో నిశ్చలులై నాసాగ్ర దృష్టి వీనియందే నిలిపి సమగ్రంగా ధ్యానిస్తున్నారు.

ఇలా నిత్య సమాధి స్థితిలో ఉన్న జీవన్ముక్తులు సత్ పురుషులు. వారు ఈ పరతత్త్వమందే ఎల్ల వేళలా నిష్ఠులై వసించి ఉన్నారు కనుక ఈతడు సన్నివాసుడు.

2. **సతాం – వినాశ రహితానాం వాసః.** (సత్యభాష్యం)

ప్రళయ కాలం వరకు వినాశం పొందనివి 'సత్' వస్తువులు. సూర్య చన్ద్రాగ్నులు, పంచభూతాలు, దేవతలు. వాటన్నిటికీ ఆధారమైనవాడు, ఆశ్రయమైనవాడు.

పరిణామశీలమైన జగతిలో 'ప్రవాహనిత్యత' వలె సృష్ట్యాది ప్రళయాంతం జరిగేవన్నీ సత్యములు. వాటికి ఆధారమైన – పరిణామము లేని అసలు సత్యం – సన్నివాసుడైన పరమాత్మ.

సత్పురుషులు ఈయనను వీడలేక పావన యమునా తీరంలో జన్మించి, సేవించుకున్నారు –

సుయామునః.. 707

1. మేలైన యమునాతీర సంబంధులు కలవాడు.

సు –శోభనులు – మంచివారు.

యామునులు –యమునాసంబంధులు. యమునా తీరవాసులు.

మధుర, బృందావనాలలో జన్మించిన స్వామితో పాటు సంచరించి నిరంతరం శ్రీకృష్ణానందంలో ధనులైన భాగ్యశాలురు దేవకీ, వసుదేవ, నందయశోదాదులు – గో గోప గోపికలు. వారితో పరివేష్టించబడిన శ్రీకృష్ణుడు – సుయామునుడు. ఎందరో దేవతలు, యోగులు, తాపసులు – కృష్ణానుగ్రహం చేత ఆతనితో సాంగత్యాన్ని పొంది యమునా తీరంలో విహరించారు.

యమునా గంగానదులు పరమపావనాలు.

'చలో మన్ గంగా జమునా తీర్' అని కృష్ణభక్తి యోగిని మీరాబాయి కీర్తించింది. ఆధ్యాత్మిక విభూతి కలిగిన దివ్య నదులివి. అందుకే స్వామి యమునా తీరంలో అవతరించి, వేణుగానంలో, రాసకేళితో, జలక్రీడలతో, కాళియమర్దనాది లీలలతో యమునాజలాలను, తీరాలను శోభామయం చేశారు. ఇలా యమునా సంబంధమైన జల, తీర, వన, మానవాదులందర్నీ దివ్యశోభతో రంజితం చేసిన భవ్యావతారం కృష్ణావతారం.

'ధీర సమీరే యమునాతీరే' 'రమతే యమునాపులినవనే' –అని జయదేవుడు గీత గోవిందంలో గానం చేశాడు.

నేటికి దివ్య యమునాతీరంలో అభౌమస్థాయిలో కృష్ణలీలల్ని దర్శిస్తున్న సిద్ధులు ఎందరో!

2. చక్కని లయాన్ని చేకూర్చువాడు.

'యమ ఉపరమే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి,

"యచ్ఛతి ఉపరమయతీతి యమునః-యమున యేవ యామునః"

కార్యకారణరూపమైన విశ్వాన్ని చక్కగా ఉపరమింప (ఉపశమింప) జేసే లయ కారకుడు. వ్యవసాయదారుడు బీజాన్ని రక్షించినట్లుగా, పరమకారణ

బీజస్థితిగా లయింపజేసి చక్కగా వ్యవస్థీకరిస్తున్న వాడు నారాయణుడు.

యస్మిన్ క్షియన్తి ప్రదిశః షడుర్వీః (అథర్వవేదము) అని వేదమాత ఈ విషయాన్నే చెబుతున్నది. కార్యమైన జగతిని కారణావస్థగా లయింపజేసేది ఈతడే.

ఇలా లయస్థితిలో తన యందు నిక్షిప్తమైన బీజరూప జగతినే తిరిగి కార్యంగా పరిణమింపజేసినపుడు కూడా తానే ఆధారమై ఉన్నవాడు. కనుక-

భూతాఽఽవాసో వాసుదేవఃసర్వాఽసునిలయోఽనలః
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోఽథాపరాజితః॥ 76

708. భూతావాసః,	*709. వాసుదేవః,*	*710. సర్వాసునిలయః,*
711. అనలః,	*712. దర్పహా,*	*713. దర్పదః,*
714. దృప్తః,	*715. దుర్ధరః, (అథ),*	*716. అపరాజితః ॥*

భూతావాసః.. 708.

1. సకల భూతములకు సమగ్రమైన నివాస స్థానము.

భవంతీతి భూతాని – ఈ విశ్వంలో కలిగినవి, ఉన్నవీ భూతములు. పంచభూతాలు, జీవులు – కూడా 'భూత' శబ్దం చేత చెప్పబడుతున్నాయి.

ఆ-వాసః-సమంతాద్ వసన్తి యస్మిన్ సః భూతావాసః.

సమగ్రముగా భూతములన్నీ ఈయన యందు, ఈయన వలన నివసిస్తున్నాయి. ఈతడే తమకు రక్షకుడనే 'అభిముఖీ'భావంతో ఈయన యందు వసిస్తున్నాయి.

వసంతి త్వయి భూతాని 'భూతావాస' స్తతో భవాన్.

'నీ యందు భూతములు వసిస్తున్న కారణంగా నీవు భూతావాసుడవు' అని 'మహాభారతం-హరివంశం' లోని వచనం.

'భూత' శబ్దం జీవవాచకం. విశ్వంలోని సర్వజీవులకు తాను ఆశ్రయమై,

విశ్వంలో మళ్లీ ప్రతి జీవుల అంతరంగంలో వసించు నారాయణుడు.

త్వం హి నః పితా వసోత్వం మాతా శతక్రతో బభూవిథ
అధా తే సుమ్న మీమహే ॥ (ఋగ్వేదం)

వసించి, వసింపజేసి లీలగా జగతిని నిర్వహిస్తున్నందున –

వాసుదేవః.. 709

1. తన మాయా శక్తితో కప్పివేసి, క్రీడిస్తున్నవాడు.

వాసయతి అచ్ఛాదయతి మాయయా – (శంకరభాష్యం)

తన మాయాశక్తితో తనను తాను మరుగుపరచుకొని, జీవులనాక్రమించి, వ్యాపించి, క్రీడిస్తున్నందున వాసుదేవుడు.

వసతి వాసయతి–వాసుః. తాను వసించి, వసింపజేస్తున్నందున వాసుః.

దీవ్యతి–క్రీడతి–దేవః–చరాచరాన్ని తన యందు వసింపజేసి, వసిస్తూ లీలగా నడుపుతున్నవాడు.

వాసుదేవజ్ఞానం పరమోత్తమమని భాగవతమతం.

'వాసుదేవః సర్వమితి' – భగవద్గీత.

వాసుదేవ పరా వేదా వాసుదేవపరా మఖాః ।
వాసుదేవ పరా యోగా వాసుదేవ పరాక్రియాః ॥
వాసుదేవ పరం జ్ఞానం వాసుదేవ పరం తపః।
వాసుదేవ పరో ధర్మో వాసుదేవ పరా గతిః।। (భాగవతం)

వేదములు, యజ్ఞములు, యాగములు, కర్మలు వాసుదేవ మయములు. జ్ఞానం, తపస్సు, ధర్మం, లక్ష్యం వాసుదేవ మయములు.

జగతికి ఆధారమైన ప్రాణశక్తిగా జీవులలో భాసించే ఆతడే, ఆ ప్రాణాలను సైతం తనలో విలీనం చేసుకొనే పరమాత్ముడు కనుక –

సర్వాసునిలయః.. 710

1. *అన్ని ప్రాణాలు తనయందే మిక్కిలిగా లయము నందియున్నవాడు.*

'అసుః'-అనగా ప్రాణం.

అన్ని ప్రాణాలు ఏ ఆశ్రయంలో సమగ్రంగా లయం చెంది ఉంటాయో ఆ జీవరూప చైతన్యమితడే.

2. *అన్ని (అందరి) ప్రాణాలకు ఆశ్రయమైనవాడు.*

నిలయ ఆశ్రయ ఇత్యర్థః. 'నిలయ' శబ్దానికి ఆశ్రయం, ఆధారం అని అర్థం.

అందరి ప్రాణాలకు ఆధారమైన ఈతడే, **అందరిలో ప్రాణశక్తిరూపంలో లీనమై ఉన్నవాడు.**

ప్రాణాయ నమోయస్య సర్వమిదం విశే।। (అథర్వవేదం) అని శ్రుతి ఈ భావాన్నే స్పష్టం చేసింది.

తన వల్ల జీవించే భూత కోటికి మితులున్నాయిగానీ, ఆధారమైన తాను పరిమితులు లేని వాడు కనుక -

అనలః.. 711

1. *చాలన్నది లేనివాడు.*

అలం-పర్యాప్తి వాచకం, అనగా "ఇంతతో ముగుస్తుంది" అనే మాట. ఇది హద్దును తెలియజేస్తుంది. అటువంటి అవధి లేనివాడు అనలుడు. ఆయన శక్తులకు, సంపదలకు అవధిలేదు.

దేశదిక్కాలావధులు లేని పరిపూర్ణుడు.

2. 'అలం' తృప్తి వచనం. ఆ తృప్తి వచనం లేనివాడు. ఎంతకీ తనివితీరని ఆనందస్వరూపుడితడు. అంతేకాదు- జగన్నిర్వహణ, భక్తరక్షణ 'ఇంకచాలు' అని లేకుండా నిరంతరం చేస్తున్నవాడు.

భగవదానందంలో 'ఇంకచాలు' అనే ముగింపు భక్తునికీ ఉండదు - భక్తరక్షణలో భగవానునికీ తృప్తి తీరదు.

ఋణం ప్రవృద్ధామివ మే హృదయాన్నాపసర్పతి ॥

(మహాభారతం. ఉద్యోగపర్వం)

ద్రౌపది 'గోవిందా' అని ఆర్తితో పిలిచిన భక్తురాలు. "ఆమె పెరిగిన అప్పువలె నా హృదయం నుండి తొలగడం లేదు" అని కృష్ణుని మాట.

3. **'అలం భూషణ పర్యాప్తి వారణేషు'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి, భూషణము, హద్దు, అడ్డుకొనుట-అని 'అలం' శబ్దానికి అర్థాలు. అవి లేనివాడు అనలుడు.

ఆయనను అలంకరింపజేసేవాడు లేడు. ఏ భూషలూ అవసరం లేని సహజసుందరుడు. హద్దులేని శక్తి, సంపదలు కలవాడు. ఆయనను ఎవరూ అడ్డుకొనలేరు. పై మూడు అర్థాలు 'అనలః' అనే నామానికి గ్రహించవచ్చు.

న త్వదన్యః కవితరో న మేధయా ధీరో వరుణ స్వధావన్ ॥ (అథర్వవేదం)

న ద్వితీయః న తృతీయః ॥ (అథర్వవేదం)

పరిమితి కల జీవులు 'అల' శబ్దవాచ్యులు. ఈ పరిమితుల తృప్తులతో దర్పించే వారిని, తన అపరిమిత శక్తితో అణచువాడితడు -

దర్పహా.. 712

1. *గర్వాన్ని తొలగించువాడు.*

'దృప హర్ష మోహనయోః' అనే ధాత్వర్థాన్ని అనుసరించి ఆనందించుట, మోహించుట దర్పం. శరీరాది ఉపాధులతో తన్మయుడై, వాటినే పూర్ణమని తృప్తి చెందే జీవుల మోహాన్ని తొలగించేవాడు.

రూపవంతుడనని తృప్తిపడి, గర్వించేవారిని కాలం ముసలితనం రూపంలో, ఆ దర్పాన్ని పోగొడుతోంది. ఆ రూపం ఎక్కడికి పోయింది? రూపాదులను ప్రసాదించిన విధాత, విశ్వ వ్యవస్థను అనుసరించి తిరిగి లయింపజేస్తున్నాడు. ఈ విధంగా ప్రాణుల దర్పాలను తొలగిస్తున్న పరమేశ్వరుడు విష్ణువు.

2. ధర్మ విరుద్ధ మార్గాలలో ప్రవర్తించే వారి దర్పాన్ని హరించేవాడు. తన పరాక్రమంతో శత్రువుల దర్పాన్ని అణచిన విష్ణువు, కృష్ణావతారంలో బ్రహ్మ,

ఇన్ద్ర, మన్మథాదుల దర్పాన్ని తొలగించి, సర్వాధికంగా భాసించాడు.

బ్రహ్మాది జయ సంరూఢ దర్ప కందర్ప దర్పహా ।
జయతి శ్రీపతిర్గోపీ రాసమండల మండనః ॥

– అని శ్రీధరాచార్యులు భాగవత వ్యాఖ్యలో ప్రకటించారు. "బ్రహ్మాదులను జయించిన దర్పంతో మిడిసిపడుతున్న మన్మథుని దర్పాన్ని పోగొట్టినవాడు – రాసమండలానికే అలంకారమైన శ్రీకృష్ణుడు."

3. ధర్మమార్గంలో ఉన్నవారికి అహంకారాది 'మోహా'లను తొలగించి అనుగ్రహించువాడు.

తొలగించే ఈతడే, తగినవిధంగా కలిగించేవాడు కనుక –

దర్పదః..... 713

1. దర్పమును ఇచ్చువాడు.

హర్ష మోహాలను కలిగించేవాడితడు. సృష్టిలో హర్షింపజేసే ప్రతిదానిలో భాసించేదితడే. సూర్యచంద్రాదులలో, అనంత విశ్వంలో హర్షాన్నీ, మోహాన్నీ కలుగజేసే లీల ఈతనిదే.

తదేవాగ్నిస్తదాదిత్య స్తద్వాయు స్తదు చన్ద్రమాః ।
తదేవ శుక్రం తద్బ్రహ్మ తా ఆపః స ప్రజాపతిః ॥ (యజుర్వేదం)

అగ్ని, ఆదిత్య, చన్ద్ర, శుక్ర, బ్రహ్మ, ఆపస్సు (జలము), ప్రజాపతి– వీరియందు భాసించే హర్షస్వరూపుడు నారాయణుడు. ఈ రూపాలతో జగతిని హర్షింపజేస్తున్నవాడు.

2. గోపికాది భక్తులకు హర్షాన్నీ, మోహాన్నీ కలిగించిన వాడితడు.

ఏవం భగవతః కృష్ణాల్లబ్ధమానా మహాత్మనః ।
ఆత్మానం మేనిరే స్త్రీణాం మానిన్యోఽభ్యధికం భువి ॥
తాసాం తత్సౌ భగమదం వీక్ష్యమానం చ కేశవః ।
ప్రశమాయ ప్రసాదాయ తత్రైవాన్తర ధీయత ॥ (భాగవతం)

"శ్రీ కృష్ణునితో గోపికలు విహరిస్తూ- 'తమను మించిన భాగ్యవంతులైన స్త్రీలు లేర'ని దర్పిస్తున్న సమయంలో, వారి 'సౌభాగ్యజనిత గర్వా'న్ని పోగొట్టి, అపరిమితమైన తన తత్త్వాన్ని ప్రసాదించడానికై ఆ ప్రాంతంలో అంతర్ధానుడయ్యాడు."

ఈ విధంగా గోపకాంతలకు దర్పములను కలిగించి, తిరిగి పోగొట్టినవాడు. తత్త్వమెరిగిన తరువాత రాసలీల ద్వారా దివ్యమైన తృప్తిని ప్రసాదించినవాడు.

దర్పభంజకుడై, దర్పదాయకుడైన తాను నిత్యతృప్తుడైనందున -

దృప్తః / అదృప్తః.. 714

1. నిత్యానంద స్వరూపుడు. 2. గర్వము లేనివాడు.

1. తనయందు తాను ఆనందించే స్వామి. తన స్వరూపమనే అమృతరసాన్ని, సదాపానం చేయడం చేత, నిత్యమూ మిక్కిలిగా హర్షించువాడు. 'అఖండానంద స్వరూపుడు' అని తాత్పర్యం.

   విశ్వమందు వ్యాపించిన హర్షశక్తి ఈశ్వరుని విభూతియే. భక్తుల భక్తికి తృప్తిపడేవాడితడే.

2. మొదటి నామం తర్వాత ఈ నామం (దర్పదః - అదృప్తః) 'అదృప్తః' అని స్వీకరించవచ్చు.

   హర్షమోహాలు లేనివాడు. పరిమిత భావం వలన కలిగే ఆనందం దర్పం. అపరిమితుడైన ఈతడే సర్వవ్యాపకుడు కనుక అనంత విశ్వ రచన చేస్తున్నప్పటికీ హర్షించడం, మోహపడడం లేని నిర్వికారుడు.

   ఏవం విధాని కర్మాణి కృత్వా గరుడ వాహనః ।
   నవిస్మయ ముపాగచ్ఛత్ పారమైశ్వ్యేన తేజసా ॥ (మహాభారతం)

   "గరుడవాహనుడైన కృష్ణుడు ఇటువంటి కార్యాలను ఎన్నో చేసినప్పటికీ పరంజ్యోతి స్వరూపుడైనతాను, తన మహిమల గురించి కొంచెం కూడా గర్వించలేదు".

ఈ నిర్వికార తత్త్వస్వరూపుడు, వికార భావాలు కలిగిన వారికి అంత తేలికగా అంతు చిక్కకున్నందున –

దుర్ధరః.. 715

1. ధరించుటకు కష్టసాధ్యమైనవాడు.

ఈయనని పట్టుకోవడం బహు కష్టం. ధ్యానం ద్వారా పరమాత్మను ధరించుట తేలికైన విషయం కాదు.

ఎంతో శ్రమచేతనే ఈతని ధరించగలరు.

ఏ ఉపాధులు లేని ఈ అనంత, సూక్ష్మ, నిర్వికార, నిర్గుణ స్వరూపాన్ని అంతతేలికగా ధ్యానించి ధరించలేం. కానీ ఆతని అనుగ్రహం వలన వేలకొలది పుట్టుకల పుణ్యాల వలన లభించిన భావనాయోగ బలంతో ఎంతో శ్రమతో హృదయంలో నిలుపబడతాడు.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే ।
యతతా మపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ (భగవద్గీత)

"వేల కొలది మనుష్యులలో ఏ ఒక్కడో ప్రయత్నిస్తాడు. అలా యత్నించిన సిద్ధులలో ఏ ఒక్కడో నన్ను యధార్థంగా తెలుసుకోగలుగుతాడు."

క్లేశోఽధికతరస్తేషా మవ్యక్తాసక్త చేతసాం ।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥ (భగవద్గీత)

"భగవానుని అవ్యక్తరూపమైన లక్ష్యాన్ని, దేహాభిమానం కలవారు అధికశ్రమ చేతనే పొందుతున్నారు. పరమసూక్ష్మమైన ఆ అవ్యక్తోపాసనపై ఆసక్తి కల చిత్తమున్న వారికి శ్రమ అత్యధికం". నిరుపాధికమైనవాడు అదృష్టుడు.

సోపాధిక తత్త్వాన్ని ఉపాసించు వారి కంటె నిరుపాధిక తత్త్వోపాసకుల క్లేశం అత్యధికం.

2. శ్రీకృష్ణునిగా విష్ణువు అవతరించినప్పుడు, బాలకృష్ణుని భరించడం, నిలుపు జేయడం యశోదాదులకి మహాకష్టమయింది. "చిక్కడు వ్రతముల క్రతువుల.."

"చిక్కడు సిరి కౌగిటిలో – చిక్కడు శ్రుతిలతికావళి" (పోతనగారి భాగవతం). అటువంటి స్వామిని పట్టుకొనడానికి, త్రాడుతో కట్టడానికి శ్రమపడింది యశోదమ్మ. అతడి అల్లరిని భరించలేకపోయారు వ్రజవాసులు.

అంతేకాదు – ఆతనిని ధరించి బంధించాలని ప్రయత్నించిన దుర్యోధనాదులు విఫలురయ్యారు. అపరిమితుడైన అనంతుని పరిమితులైన జీవులు ధరించలేరు కదా!

దుర్గ్రహః పాణినా వాయుః దుస్పర్శః పాణినా శశీ ।

దుర్ధరా పృథివీ మూర్ధ్నా దుర్గ్రహః కేశవో బలాత్ ॥ (మహాభారతం)

'వాయువును చేతులతో పట్టుకోలేము. చంద్రుని చేతితో తాకలేము. అదే విధంగా బలంతో కేశవుని గ్రహించలేము.'

ఇమంహి పుండరీకాక్షం జిఘృక్షన్త్యల్ప చేతసః ।

పటేనాగ్నిం ప్రజ్వలితం యథా బాలో యథాబలాః ॥ (మహాభారతం)

'జ్వలించే అగ్నిని బాలుడో, బాలికో వస్త్రంతో పట్టడానికి ప్రయత్నించినట్లు, ఈ అల్పులు కృష్ణుని గ్రహించాలని భావిస్తున్నారు' .

–ఇటువంటి అంతుచిక్కని, తేలిగ్గా దొరకని లీలలని ఎన్నో ప్రకటించాడు స్వామి. భక్త సులభుడైన భగవానుడు, దర్పం కలిగిన అహంకార పూరితులకు దుర్లభుడు.

ధరించుటకు సాధ్యము కానివాడే కాక, జయించడానికి కూడా లొంగనివాడు కనుక –

అపరాజితః.. 716

1. ఓడించబడనివాడు.

ఈతనినెవరూ మించలేరు. అన్ని విధముల ఉత్కృష్టస్థితియే జయం. అది ఈతడే. ఎవరూ జయించలేని సర్వోత్కృష్టుడు విష్ణువు.

అంతరాలైన రాగద్వేషాది శత్రువులచే కానీ, బాహ్యాలైన రాక్షసాది

శత్రువులచేత కానీ ఓడించబడని పరిపూర్ణుడు.

తన రామకృష్ణాది అవతారాలలో ఈ దివ్య లక్షణాన్ని ప్రకటించడానికి రాగాది వికారాలు లేని ప్రజ్ఞాస్థితిలో ఉంటూ, సర్వులను జయించిన వాడితడు. ఈతనిని ఓడించగలిగేవాడు లేడు.

యస్యత్వం పురుషవ్యాఘ్రు సారథ్య ముపజగ్మివాన్ ।
ధ్రువ ఏవ జయ స్తస్య నతస్యాస్తి పరాజయః ॥ (భారతం)

"ఓ పురుష శ్రేష్ఠుడా! నీవెవరికి సారధిగా ఉంటావో, వారికి జయం నిశ్చయం. అపజయం కలుగదు".

శక్తోహం ధనుషైకేన నిహన్తుం సర్వపాండవాన్ ।
యద్యేషాం నో భవేద్గోప్తా విష్ణుః కారణ పూరుషః ॥ (భారతం)

"కారణపురుషుడైన విష్ణువు (కృష్ణుడు) రక్షకుడుగా లేనట్లయితే ఒక్క బాణంతోనే పాండవులను చంపగలను" అని భీష్మపితామహుని ప్రకటన.

యథాహం నాభిజానామి వాసుదేవ పరాజయం।
మాతుశ్చ పాణిగ్రహణం సముద్రస్య చ శోషణమ్ ॥
ఏతేన సత్య వాక్యేన సిద్ధ్యతా మగదోహ్యయమ్ ॥

'నా తల్లి వివాహాన్ని నేనెరగను. సముద్రం శోషించడం ఎరగను. అలాగే – వాసుదేవుడు పరాజయం పొందడం నేనెరగను. (వాసుదేవ స్మరణ ఏనాడు వ్యర్థం కాదని భావం) కనుక ఈ సత్యవాక్కు చేత ఈ వ్యాధి తొలగుగాక!" అని 'చరకసంహిత' లోని శ్లోకం.

2. దేహాదులు వ్యాధి, మృత్యువు మొదలైన వాటి చేత జయింపబడుతున్నాయి. శరీర, ప్రాణ, బుద్ధుల వలె రోగాదులచే, మృత్యువుచే, అజ్ఞానంచే జయింప బడని 'ఆత్మయే' అపరాజితుడైన విష్ణు స్వరూపం.

ఇన్ద్రో బధ్నాతు తేమణి జిగీవాం అపరాజితః ॥ (అథర్వవేదం)
సఖ్యేత ఇన్ద్ర వాజినో మా భేమ శవసస్పతే ।
త్వమభి ప్రాణోనుమో జేతారమపరాజితమ్ ॥ (ఋగ్వేదం)

అంతా తానైయున్న కారణంగానే అనంతాకారుడై –

విశ్వమూర్తి ర్మహామూర్తి ర్దీప్తమూర్తి రమూర్తిమాన్।
అనేకమూర్తి రవ్యక్తః శతమూర్తిః శతాననః॥ 77

717. విశ్వమూర్తిః, 718. మహామూర్తిః, 719. దీప్తమూర్తిః,
720. అమూర్తిమాన్, 721. అనేక మూర్తిః, 722. అవ్యక్తః,
723. శతమూర్తిః, 724. శతాననః॥

విశ్వమూర్తిః.. 717

1. విశ్వమే ఆకారమైనవాడు.

'విశ్వం' అనగా సమస్తము అనంతము. సమస్తమూ ఆయన ఆకారమే.

అహమాత్మా గుడా కేశ! సర్వభూతాశయ స్థితః ॥ (భగవద్గీత)

'అర్జునా! సర్వభూతముల హృదయాలలో వసించి, వాటికాధారముగా ఉన్నవాడను నేనే' అని పరమాత్మ ప్రకటించాడు. సమస్త ప్రపంచము తనకు శరీరంగా కలవాడు కనుకనే 'త్రిభువనవపుషం విష్ణు మీశం నమామి' అని స్తుతించారు.

విచిత్ర రచనా చాతుర్యంతో కూడినదీ విశ్వం. విశ్వంలోని ప్రతి వస్తువు నందున సర్వత్ర అవ్యక్తంగా వ్యాపిస్తూ, ఆశ్రయమై ఉన్నవాడితడే.

2. విశ్వమే మాయా శక్తిగా కలవాడు.

'మూర్ఛా -మోహ సముచ్ఛ్రయోః' అనే ధాతువునకు, **'స్త్రియాంక్తిన్'** అనే పాణినీయ సూత్ర ప్రకారం 'క్తిన్' ప్రత్యయం చేరి, **'రాల్లోపః' 'తితుత్రథసి సుసరక సేషుచ'** – అనే ప్రాణిని సూత్రాల ద్వారా – 'మూర్తిః' అనే శబ్దానికి, మోహికా శక్తి అని అర్థం. మాయారూపమైన మోహికాశక్తి మూర్తి. (సత్యభాషం)

విశ్వమంతా వ్యాపించిన విశ్వాకారుడు మాత్రమే కాక, విశ్వంలో ప్రత్యణువునా తన మాయాశక్తితో మోహింపజేయువాడు. మొత్తంగా –

సర్వవ్యాపకుడు, సర్వరూపుడు, సర్వ మోహనుడు, సర్వాశ్రయుడు – విశ్వమూర్తి.

తస్మిన్ హ తస్థుర్భువనాని విశ్వా ॥ (యజుర్వేదం)

తస్మిన్ క్షియన్తి భువనాని విశ్వా ॥ (ఋగ్వేదం)

అంతా తన ఆకృతియే కనుక, ఇంతకు మించిన మూర్తి లేదు–

మహామూర్తిః.. 718

1. గొప్పమూర్తి కలవాడు.

అంతటా వ్యాపించినవాడు కనుక అణువు ఆతడే, మహత్తు ఆతడే. మహామోహనమైన, విస్తారమైన జగద్రూపుడే విశ్వమూర్తి.

అనంతత్వానికి ప్రతీకయైన ఆదిశేషునిపై శయనించిన ఉజ్జ్వలమూర్తిగా భాసించిన అపరిమిత శరీరుడితడు.

సర్వ విశ్వాన్ని తన శరీరంలో కలిగిన రూపాన్ని ప్రదర్శిస్తూ –

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య స చరాచరమ్ ।
మమ దేహే గుడాకేశ! యచ్చాన్యద్ద్రష్టు మర్హసి ॥ (భగవద్గీత)

"అర్జునా! చరాచరాత్మకమైన సమస్త ప్రపంచాన్నీ నా శరీరంలోనే ఉండడాన్ని దర్శించు. ఇంక ఏ ఆశ్చర్యాలను చూడదలచుకున్నా చూడు" అని శ్రీకృష్ణుడు వచించాడు.

నతస్య ప్రతిమా అస్తి యస్య నామ మహద్యశః ॥ (యజుర్వేదం)

యస్య భూమిః ప్రమా అన్తరిక్షముతోదరమ్ ।
దివం యశ్చక్రే మూర్ధానం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥ (అథర్వవేదం)

భూమి అడుగు భాగంగా, అన్తరిక్షం నడిమి భాగంగా, దివి శిరస్సుగా భాసించే జ్యేష్ఠుడైన నారాయణుని బృహత్ స్వరూపాన్ని వేదం వర్ణించింది.

అతి పెద్ద (మహా) మూర్తి మాత్రమే కాక, స్వయంప్రకాశమై, సర్వప్రకాశకమై యున్నవాడు కనుక –

దీప్తమూర్తిః.. 719

1. ప్రకాశవంతమైన మూర్తి కలవాడు.

స్వయం ప్రకాశరూపుడై విశ్వమంతా వ్యాపించడం చేత అన్నిటినీ ప్రకాశింపజేస్తున్నాడు.

"యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోక మిమం రవిః" – ఒకే సూర్యుడు ఈ సమస్త ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తున్నట్లుగా సర్వ జీవులను ఈతడే చైతన్యవంతులను చేస్తున్నాడు.

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా ।
యది భాస్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః ॥

'వేల కొలది సూర్యుల కాంతి ఒకేసారి ఆకాశంలో కలిగితే ఎలా ఉంటుందో, అటువంటి కాంతి కలిగిన' విశ్వరూపుని భగవద్గీత వర్ణించింది.

2. జ్ఞానమయమైన మూర్తి.

ప్రకాశమనగా జ్ఞానం. కేవలం చిన్మయ విగ్రహుడు భగవానుడు.

సర్వేనిత్యాః శాశ్వతాశ్చ దేహాస్తస్య పరాత్మనః ।
పరమానంద సందోహాః జ్ఞానమాత్రాశ్చ కేవలాః ॥

– అని 'శివపురాణ' వచనం. నిత్యములై, శాశ్వతములై, పరమానంద మయములైన, కేవల జ్ఞానమయాకృతులు ధరించినవాడు పరమేశ్వరుడు.

3. తన ఇచ్ఛతో లీలగా గ్రహించే 'తైజసీమూర్తి' కలవాడు. తైజసమూర్తి – అనగా 'హిరణ్యగర్భ'మూర్తి. సకల తైజసమూర్తుల సమష్టియే ఈ మూర్తి.

4. విభూతులుగా ఉన్నవాడు.

యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా ।
తత్తదేవావ గచ్ఛత్వం మమ తేజోఽంశ సంభవమ్ ॥ (భగవద్గీత)

'ఐశ్వర్యం, బలం, వైభవం కలవి అన్నీ, నా తేజస్సు యొక్క అంశం నుండి పుట్టినవేనని తెలుసుకొమ్మ'ని పరమాత్ముని వచనం. ఇటువంటి విభూతి స్వరూపములుగా భాసించువాడు దీప్తమూర్తి.

ఎన్ని మూర్తులుగా భాసిస్తున్నా ఏదీ కాని వాడు ఈతడే–

అమూర్తిమాన్.. 720

1. మూర్తి లేనివాడు.

"ఇది ఈ విధమైనది" అని నిశ్చయించలేని మూర్తి కలవాడు. అన్నీ తానై, ఏమీ తాను కాని 'నిర్లేపుడు".

తాను తత్త్వతః అవ్యక్తుడు అని తెలియజేయడమే ఈ నామంలోని అంతర్యం.

యస్యాఽత్మా శరీరమ్ । (శతపథబ్రాహ్మణం)

యస్యావ్యక్తం శరీరమ్ ॥ (సుబలోపనిషత్)

ఎవనికి అత్మ శరీరమో, ఎవనికి అవ్యక్తము శరీరమో – అని శ్రుతులు పేర్కొన్నాయి. శరీరాదులు లేని వాడితడు.

2. **'సంభవామ్యాత్మ మాయమా' 'నమాం కర్మాణి లింపన్తి'** అని గీతలో చెప్పినట్లుగా – తన మాయాశక్తితో సంభవించే స్వామిని ఏ కర్మా అంటదు.

కర్మల వలన ఏర్పడే మూర్తి ఈతనికి లేదు. స్వామి దాల్చినవి లీలామూర్తులే తప్ప, కర్మమూర్తులు కావు.

భావానుసారంగా మూర్తులను ధరించేవాడు.

'మూర్తం చా మూర్తం చ' అని శ్రుతి వాక్యం.

మూర్తి ఈతడే, అమూర్తి ఈతడే.

ఇదమిత్థమని ఏ మూర్తి లేనివాడు కనుక, విశ్వనిర్వహణకై ఏ మూర్తినైనా ధరించువాడితడు. ఆ కారణం చేతనే –

అనేకమూర్తిః.. 721

1. బహు మూర్తులు కలవాడు.

స్వేచ్ఛగా లోకోపకారానికై అవతారములందు బహురూపాలను ధరించిన వాడు. అనేకావతారాలు కలవాడు – ఒకే అవతారంలో అనేక రూపాలను ధరించినవాడు.

ఇన్ద్రో మాయాభిః పురురూప ఈయతే॥ అని 'ఋగ్వేదం' బహురూపుడైన

పరమాత్మను కీర్తించింది.

షోడశస్త్రీ సహస్రాణి శతమేకం తతోఽధికమ్ ।

తావన్తి చక్రే రూపాణి భగవాన్ దేవకీ సుతః ॥ (విష్ణుపురాణం)

16,100 రాచకన్యలను అన్ని సంఖ్యల రూపాలతోనే వివాహమాడి, తన అనేక మూర్తి మహిమను శ్రీకృష్ణునిగా ప్రకటించాడు.

బహురూపాలతో (అనేక) మోహపరచాడు (మూర్తిః).

అందరు గోపికలకు అన్ని రూపాలను దాల్చాడు. ఒకే సమయంలో అనేక చోట్ల గోచరించాడు.

ఇన్ని రూపులై విహరిస్తున్నా తానేమిటో బైటపడకుండా తనను మరుగు పరచుకొని సంచరించాడు కనుక –

అవ్యక్తః.. 722

1. వ్యక్తము కానివాడు.

బైటపడనివాడు. బయటకు కనిపించే దానికి కారణం మాత్రం బయట పడనిదే. వృక్షం తన మూలం నుండి బైటపడుతుంది – కానీ మూలం అవ్యక్తమై ఉంటుంది. విష్ణు కర్మ అయిన విశ్వం వ్యక్తమౌతోంది కానీ, కారణమైన ఆతడు వ్యక్తమవడం లేదు.

అందరిలో ఉన్నా 'రహస్యంగా' ఉన్న అవ్యక్తుడు.

ఏకో దేవః సర్వేభూతేషు గూఢః ॥(శ్వేతాశ్వతరోపనిషత్తు)

ఎన్నిమూర్తులుగా గోచరించినప్పటికీ 'ఇతడు ఇటువంటివాడు' అని తనను తాను తెలియనీయనివాడు.

నాహం ప్రకాశస్సర్వస్య (భగవద్గీత)

"నేనందరకు తెలియబడువాడనుకాను".

నాహం వేదైర్నతపసా.... (భగవద్గీత)

"నన్ను వేదాల చేతనో లేక తపస్సుల చేతనో తెలుసుకోలేరు" అని

పరమాత్ముడే వివరించాడు.

తన అవతార కాలంలో కూడా తన అసలు స్వరూపాన్ని తెలియనీయకుండా సంచరించాడు.

వ్యక్తము కానీ ఆతడు అనేకంగానే కాక, అనంతంగా కూడా పలు రూపాలను ధరించడం చేత –

శతమూర్తిః.. 723

1. *అంతములేని మూర్తి(ర్తులు) కలవాడు.*

శతం, సహస్రం – అనన్త వాచక శబ్దాలు. విశ్వాన్ని శతవిధాల, సహస్ర విధాల ఏర్పరచి, వాటిలో తాను 'అనుస్యూతం'గా (పూసలలో దారంలా) వ్యాపించి అనంతాకారుడై ఉన్నవాడు.

ఇన్ద్ర, మిత్ర, వరుణాది రూపాలను ధరించి విశ్వనిర్వహణ చేస్తున్న వాడీతడు.

శతం సేనాం అజయత్సాక మిన్ద్రః ॥ (ఋగ్వేదం)

అనేక కెరటాలలో సముద్రం వలె, అనేక రూపాలతో విశ్వం. అంతటా వ్యాపించిన సముద్రమే ఈశ్వరచైతన్యం (విష్ణువు). అన్ని కెరటాలూ ఆ సముద్రానివే. కెరటాలతో కలిపి చూస్తే అది 'అనేక మూర్తిః' 'శతమూర్తిః'. ప్రతి కెరటంలో దీపించేది అదే కనుక 'దీప్తమూర్తిః'. కెరటాలన్నీ సముద్రం – అనడం సబబే కానీ, సముద్రాన్ని కెరటం అనలేం.

(సాముద్రోహి తరంగః – క్వచన సముద్రో న తారంగః'– అని ఆదిశంకరుల 'షట్పదీస్తోత్ర' వాక్యం) కనుక అతడు 'అమూర్తిమాన్'.

పశ్యమే పార్థ రూపాణి శతశోథసహస్రశః॥ అని 'భగవద్గీత' 'విశ్వరూపసందర్శన యోగం'లో ప్రకటించి, అనంత రూపాలుగా వ్యక్తమైన విశ్వరూపుడితడు.

అనంతమూర్తులుగానే కాక అనంత దర్శనాది శక్తులు కలవాడై–

శతాననః.. 724

1. *అనంతమైన వదనము(లు) కలవాడు.*

దర్శన, శ్రవణ, వాక్, ఘ్రాణ, స్పర్శాది జ్ఞానశక్తులు వదన స్థానీయాలు. సర్వాన్ని దర్శించి, విని, పలికి, ఘ్రాణించి, స్పర్శించే సమగ్ర జ్ఞానస్వరూపు డితడు. ఒకే వదనం పరిమితత్వాన్ని తెలియజేస్తుంది. అపరిమిత జ్ఞానశక్తిని తెలియజేసేది 'శతాననః'. గ్రహించడం, స్వీకరించడం – ఆనన లక్షణాలు.

అంతటా ప్రసరించగలిగే విశ్వతోముఖమైన వ్యాపక చైతన్యమే శతాననుడు. అన్నిటినీ తెలుసుకుంటూ, అన్నిటినీ స్వీకరించేవాడితడు.

సర్వతః పాణి పాదం తత్ సర్వతోక్షి శిరోముఖం।
సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ (గీత)

అంతటా వ్యాపించిన హస్తములు, పాదములు, కన్నులు, తలలు, ముఖములు, చెవులు కలిగి, విశ్వమంతా ఆవరించిన పరబ్రహ్మము ఈతడు.

ఆ – సమంతాత్ అన్యతే = ప్రాణ్యతే అనేన ఇతి ఆననం ॥

సంపూర్ణంగా దేని చేత చేష్ట కలుగుతున్నదో అది ఆననం. అనంతంగా సంపూర్ణ చేష్ట కలిగించే ప్రాణప్రదాత విష్ణువు.

ముఖాన్ని జ్ఞానస్థానంగా గుర్తించి, అనంతమైన జ్ఞానమే ఈతని వదనం – అని ఈ నామాంతర్యం.

'విశ్వమూర్తిః' (717) నుండి ఈ 'శతమూర్తిః' (724) నామం వరకు చక్కని క్రమం కనిపిస్తున్నది. 'మూర్తామూర్తములు'గా ఉన్న ఈశ్వర తత్త్వాన్ని స్పష్టీకరించే నామాలివి. విశ్వరూపాన్ని వ్యాఖ్యానించిన నామాలుగా వీటిని గ్రహించవచ్చు.

ఈ తత్త్వాన్నంతటినీ అన్నమయ్య ఒక పాట చరణంలో అద్భుతంగా కీర్తించాడు –

ఏ మూర్తిలోకంబులెల్ల నేలెడు నాత –
డే మూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడు నాత –

డే మూర్తి నిజమోక్షమియ్యజాలెడు నాత -
డే మూర్తి లోకైక హితుడు,
ఏ మూర్తి నిజమూర్తి యే మూర్తియునుగాడు
యే మూర్తి త్రైమూర్తులేకమైన యాత
డే మూర్తి సర్వాత్ముడేమూర్తి పరమాత్ము
డా మూర్తి తిరువేంకటాద్రివిభుడు ॥

"అనేక వక్త్ర నయనమ్"
"అనేక బాహూదర వక్త్రనేత్రం"

- అనే వర్ణన భగవద్గీత విశ్వరూప సందర్శన యోగంలో గోచరిస్తోంది.

కెరటాలన్నిటా ఒకే సముద్రం వలె - విడివిడిగా కనబడే విశ్వమందంతటా ఏకమైఉన్న కారణంగా -

ఏకో నైకః సవః కః కిం యత్త త్పద మనుత్తమమ్।
లోకబంధు ర్లోకనాథో మాధవో భక్తవత్సలః ॥ 78

725. ఏకః, **726.** నైకః, **727.** సవః, **728.** కః,
729. కిం, **730.** యత్, **731.** తత్, **732.** పదమనుత్తమమ్,
733. లోకబంధుః, **734.** లోకనాథః, **735.** మాధవః, **736.** భక్తవత్సలః॥

ఏకః.. 725

1. ఒకే ఒకడు.

ఒకే లక్షణం కలవారు, లేదా విభిన్న లక్షణం కలవారు మరొకరు ఉన్నప్పుడు 'రెండు-మూడు' - వంటి బహువాచకాలు చెప్పబడతాయి. అంతా ఆ పరబ్రహ్మమే కనుక, మరి రెండవది లేదు.

'ఏక మేవాద్వితీయమ్' (ఛాందోగ్యోపనిషత్తు)

'పరమాత్మ తత్త్వం ఒక్కటియే. తనతోపాటు రెండవది మరి ఏదీ లేదు.

'ఏక ఇద్రాజా జగతో బభూవ (యజుర్వేదం)

జగతికంతటికీ ఒకడే రాజై ఉన్నవాడు.

వెనుకటి నామాలలో 'అనేక' 'బహు'గా చెప్పబడుతున్న తత్త్వం 'ఏకమే'నని ప్రతిపాదించడానికి ఈ నామం.

'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' అని శ్రుతి వాక్యం.

2. 'ఏక' శబ్దానికి అనేకార్థాలున్నాయి.

(అ.) సంఖ్యావాచి – ఒక్కడు.

(ఆ.) అసహాయుడు. ఏ ఒక్కరి సాయమూ, ఆశ్రయమూ అవసరం లేనివాడు.

'స్వేమహిమ్ని ప్రతిష్ఠితః' – తన మహిమ యందు తాను ప్రతిష్ఠితుడైనాడు.

(ఇ.) అన్నిటికంటే అతీతుడు.

(ఈ.) ప్రధానుడు – ప్రథముడు.

ఈ అర్థాలన్నీ నారాయణునకు వర్తిస్తాయి.

3. అంతటా వ్యాపించువాడు.

ఏతి ఇత్యేకః ఏతి – గచ్ఛతి. 'ఇణ్ గతౌ' అనే అర్థాన్ని అనుసరించి – అంతటా వెళ్లువాడు (వ్యాపించువాడు).

స్వరూప లక్షణంగా ఏకమైనప్పటికీ, తటస్థమైన విభూతి లక్షణంగా బహువిధాల విశ్వంగా భాసిస్తున్నందున –

నైకః.. 726

1. ఒక్కడు కానివాడు.

సమస్త విశ్వ పదార్థాలలో ఉన్నవాడు.

నాన్తోస్తి మమ దివ్యానాం విభూతీనాం పరన్తప ॥ (భగవద్గీత),

"అర్జునా! నా దివ్యమైన విభూతులకు అంతమే లేదు" అని కృష్ణ వచనం.

లెక్కలేని విభూతులుగా ఉన్నవాడు.

2. ఈయన కంటే మరియొకడు లేడు.

అస్మాదన్యః కశ్చిదేక సంజ్ఞాభాక్ నాస్తి (సత్యభాష్యం)

ఈయనకంటె మరియొకడు 'ఏక' శబ్ద వాచ్యుడు లేడు.

ఉన్నది ఒకే తత్త్వం. అదే సచ్చిదానందమైన పరమాత్మ.

ఈ ఏకత్వ ప్రతిపాదనయే విష్ణు సహస్ర లక్ష్యం.

"కిమేకం దైవతం? కింవాప్యేకం పరాయణమ్" అనే యుధిష్ఠిరుని ప్రశ్నకు సమాధానమిది.

'ఏకో నారాయణః' అని శ్రుతి ప్రతిపాదన.

'ఏకత్వమనుపశ్యతి' – అంతటా ఏకత్వాన్ని (పరమాత్మను) దర్శించువాడే జ్ఞాని – అని గీతావాక్యం.

ఏకుడే అనేకుడై విశ్వంలో వసించియున్నందున–

సవః.. 727

1. *నిశ్చయముచేసి, వసించువాడు.*

స్యతి అన్తయతి నిశ్చాయయతి – వసతి సర్వత్ర – సవః (సత్యభాష్యం). సృష్టి స్థితి లయాది విశ్వ కర్మలన్నీ నిశ్చయింపబడినవే. ఆ నిశ్చయజ్ఞానమే ఈశ్వరుడు. ఈ జ్ఞానంతోనే విశ్వమంతటా వ్యాపించి నివసిస్తున్నది అతడే.

కార్యానికి ముందే కర్త నిశ్చయమై ఉంటాడు. అలాగే విశ్వానికి ముందే నిశ్చితుడై, విశ్వగతిని నిశ్చయించిన విష్ణువు 'సః'. విశ్వ వ్యవస్థను చేయువాడు, అలా వ్యవస్థీకరించిన విశ్వంలో తానే వసించుట చేత 'వః' (వసతీతి వః)

వసన్తి తత్ర భూతాని భూతాత్మా న్యఖిలాత్మని।
స చ భూతేష్వశేషేషు 'వ' కారార్థస్తతోమునే ॥

– అనే 'నిరుక్త రీతిగా –' సమస్త భూతాలు ఆ పరమ పురుషుని యందు వసిస్తున్నాయి. తాను వాటియందు వసిస్తున్నాడు. కనుక అతడే 'వ' కారానికి అర్థం."

2. *తనను తాను కలిగించుకొనువాడు.*

సవః, ప్రసవః, అనే మాటలు 'కలుగుటను' తెలియజేస్తాయి. తనకు తానే కలిగినవాడు.

3. యజ్ఞ స్వరూపుడు.

సవ మనగా యజ్ఞం. సోమరసాలలో 'అభిషవణం' (పిండుట) చేయబడే యజ్ఞానికి 'సవము' అని వ్యవహారం. యజ్ఞ స్వరూపుడైన విష్ణువు ఈ నామం ద్వారా తెలియబడుతున్నాడు.

శ్రేష్ఠం సవం సవితా సావిషన్నోభీద్ధోధర్మస్తదు షుప్రవోచత్। (ఋగ్వేదం)
అభియం దేవ్యదితిర్మణాతి సవం దేవస్య సవితుర్జుషాణా। (ఋగ్వేదం)
స నః పితేవ సువేఽగ్నే సూపాయనో భవ ।
సచస్వానః స్వస్తయే ॥ (ఋగ్వేదం)

ఎవడు? ఏది? – అనే గమ్యాన్ని తెలుసుకోగోరే ప్రశ్నలకు ఈతడే సమాధానం కనుక –

కనిపిస్తున్న జగతికి ఆధారమై, అవ్యక్తుడైనందున ఋషులు 'కః?' 'కిం?' అని ప్రశ్నించుకొని అన్వేషించారు.

'కః కారణః (కిం కారణం?) కుతో జాతః
జీవామః కేన వావయమ్?' – 'ఎవడు (ఏది) కారణం?
ఎక్కడ నుండి పుట్టినదీ జగతి? దేనిచే మనం జీవిస్తున్నాం?'

అనే ప్రశ్నలకు ధ్యాన సమాధిలో లభ్యమైన సమాధానమే బ్రహ్మము. కనబడే జగతికి, దేహాదులకు అతీతుడైన ఆత్మ తానైనందున –

కః.. 728

1. ఎవడు? అనే ప్రశ్నతో విచారించదగినవాడు.

కస్మై దేవాయ హవిషా విధేమ।। అని వేదవాక్యం.

ఎవనికి (ఏ దేవునికి) ఈ హవిస్సును సమర్పించాలి? – అనే ప్రశ్నతోనే 'ఏకస్మై' – ఒక్కడే అయిన పరమాత్మునకు – అని సమాధానమిచ్చింది.

2. సుఖ స్వరూపుడు.

'కం బ్రహ్మా' (ఛాందోగ్యోపనిషత్తు). ఆనందమే బ్రహ్మతత్త్వం. సచ్చిదానంద

స్వరూపుడైన పరబ్రహ్మ విష్ణువు.

3. ప్రకాశించువాడు.

'కనీ దీప్తికాన్తి గతిషు' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **కనతి దీవ్యతి గచ్ఛతి వా ఇతి కః.** అన్నిటి యందు ప్రకాశించువాడు, వ్యాపించువాడు.

ఈ సుఖ, ప్రకాశ స్వరూపమైన ఆత్మయే 'ఏది?' అని వెతుక్కోబడినది కనుక –

కిమ్..729

1. *ఏమిటి? ఎలాంటి? – అనే ప్రశ్నలకు విచారణీయమైన పరతత్త్వం. ప్రశ్నించ బడేది 'కిం?'*

గూఢంగా హృదయగుహలో దాగిన వాడు కనుక ప్రశ్నించబడి, అన్వేషించబడే రహస్య తత్త్వమితడే. సకల పురుషార్థ రూపుడై వెదకుబడువాడు. తత్త్వ జిజ్ఞాసువులచే ప్రశ్న చేయదగినవాడు.

సోన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః (ఛాందోగ్యోపనిషత్తు)

"అతడే వెదుకదగినవాడు, విచారించి తెలియదగినవాడు."

అంభః కి మ్లాస్తీత్ గహనం గభీరమ్ ॥(ఋగ్వేదం)

కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః ॥(ఋగ్వేదం)

ఎవడు? ఏమిటి? అని ప్రశ్నల వల్ల 'ఏది?' తేల్చబడుతుందో అది ఈ పరతత్త్వమే –

యత్..730

1. *'ఏది కలదో అది'.*

సంస్కృత సర్వ నామం 'యత్'. ఇంతకు పూర్వమే స్వతః సిద్ధమైన వస్తువును ఉద్దేశించి చెప్పే శబ్దమిది. బ్రహ్మతత్త్వం స్వతః సిద్ధ వస్తువే. కనుక ఆ పరమాత్మునికే ఈ నామం చెల్లుతుంది.

'యతోవా ఇమాని భూతాని జాయన్తే

యేన జాతాని జీవన్తి

యత్ప్రయత్యభి సంవిశన్తి' (తైత్తరీయోపనిషత్తు)

'దేని నుండి ఈ ప్రాణులు కలుగుతున్నాయో, దేనిచే జీవిస్తున్నాయో, దేనియందు లయమౌతున్నాయో – అదే పరతత్త్వం'.

'యన్మనసా న మనుతే' (కేనోపనిషత్).

'ఏది మనస్సుచే తెలియబడదో"

'యస్మిన్నిదం యతః చేదం యేనేదం య ఇదం స్వయమ్

యస్మాత్ పరస్మాత్ పరః తం ప్రపద్యే స్వయంభువమ్" (భాగవతం)

"దేనియందు, దేని వలన, దేనిచే ఇది యంతా (విశ్వమంతా) ఉన్నదో, దేనిని మించి మరియొకటి లేదో – ఆ స్వయం కారణ పరమాత్మను శరణు వేడుతున్నాను" – అని గజేన్ద్రుని స్థితి.

ఇలా 'యత్పద' వాచ్యమైన తత్త్వమే విష్ణువు.

యస్మాద్ఋతే సిద్ధ్యతి యజ్ఞో విపశ్చితశ్చన

సధీనాం యోగ మిన్వతి ॥ (ఋగ్వేదం)

యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః ॥(ఋగ్వేదం)

– ఇలా శ్రుతి పలు విధాల వ్యవహరిస్తోంది.

2. ప్రయత్నించువాడు.

'యతీతీ ప్రయత్నే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి **యతతే ఇతి యత్.** సదా ప్రయత్నించువాడు.

ప్రయత్న రూపమైన కార్యకారక శక్తి భగవానుడు. జగన్నిర్వహణ, భక్త రక్షణ భగవానుని ప్రయత్నం.

కృష్ణ కృష్ణేతి కృష్ణేతియో మాం స్మరతి నిత్యశః।

జలం భిత్త్వా యథా పద్మం నరకాదుద్ధరామ్యహమ్॥

"కృష్ణ కృష్ణ కృష్ణ – అని స్మరించే వారిని జలము నుండి వికసించే తామర

వెలువడునట్లు, నరకం నుండి ఉద్ధరిస్తాను."

అహం స్మరామి మద్భక్తం నయామి పరమాంగతిమ్ (వరాహపురాణం)

'నా భక్తుని నేను స్మరించి పరమగతిని అందజేస్తాను.'

– అని తన భక్త రక్షణ ప్రయత్నాన్ని స్వామి ప్రకటించాడు.

'యత్' అనే మాటచే ప్రతిపాదింపబడే అనిర్వాచ్య తత్త్వమైనందున –

తత్.. 731

1. అది.

వేద వేదాంత వాక్యాలచే ప్రతిపాదింపబడే పరతత్త్వం 'తత్'.

ఇది 'బ్రహ్మ ప్రతిపాదకం' అని సర్వ శాస్త్ర వచనం. మాటలకందని తత్త్వాన్ని 'అది' అని మాత్రమే పేర్కొంది వేదం. అన్ని యోగాలకీ గమ్యమైనదేదో 'అది'.

2. విస్తరించునది.

'తను విస్తారే' అనే ధాత్వర్థాన్ననుసరించి, **తనోతీతి తత్.**

విశ్వమున వ్యాపించిన బ్రహ్మమే తత్.

ఓమ్ తత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః (భగవద్గీత)

'ఓమ్, తత్, సత్ – అనే మూడు మాటలతో బ్రహ్మము నిర్దేశింపబడుతోందని విద్వాంసుల మాట'!

తత్ విష్ణోః పరమం పదం ॥ (యజుర్వేదం)

తత్ సవితు ర్వరేణ్యమ్ ॥ (ఋగ్వేదం. గాయత్రి ప్రథమ పాదం)

తస్మిన్ హ తస్థుః భువనాని విశ్వా ॥ (యజుర్వేదం)

తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే ।
ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాద్యజుస్తస్మాదజాయత ॥। (యజుర్వేదం)

మాట మనసూ కూడా చేరని సర్వోత్కృష్టమైన స్థానం అదే కనుక –

పదమనుత్తమమ్..732

1. మరియొక గొప్పదిలేని స్థానము.

పద్యతే గమ్యతే జ్ఞాయతే ప్రాప్యతే ముముక్షుభిః - పదమ్.

మోక్షం కోరుకొనేవారు తెలుసుకొనే గమ్యం - చేరే గమ్యం (కైవల్యం) 'పదం'. అది -తత్పదవాచ్యమైన బ్రహ్మత్వప్రాప్తి. దానికి మించిన గొప్ప స్థానం మరొకటి లేదు.

అన్నిటికంటే గొప్పది, ముముక్షువులు చేరే స్థానం, పరమాత్మతత్త్వం.

హిరణ్య పాణి మూతయే సవితారముపహ్వయే ।
స చేతా దేవతా పదమ్ ॥ (ఋగ్వేదం)
సమధ్వరాయోషసో నమన్త దధిక్రావేవ శుచయే పదాయ । (ఋగ్వేదం)

ఈ నామం 'తత్' పద ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నది.

అంతేగాక 'చెప్పేమాట - చెప్పబడే స్థానం' లేని పరతత్త్వమిది.

వాచకం (తత్) కూడా వాచ్యంలో లీనమై, రెండూ ఏకమైన తత్త్వం.

ఈ శ్లోకపాదంలోని 'ఏకః', 'నైకః' 'సవః' 'కః' 'కిం?' 'యత్', 'తత్' - ఈ మాటలన్నీ, అనిర్వచనీయమైన తత్త్వాన్ని స్పష్టంగా ప్రతిపాదిస్తున్నాయి. నారాయణుడే పరతత్త్వమని, అది 'అనిర్వచనీయ'మని, 'సర్వోత్కృష్టమని' ఈ నామాల క్రమంలోని తాత్పర్యం.

సర్వ లోకాలకీ అతీతమైన ఆ తత్త్వం పైననే లోకాలన్నీ ఆధారపడి ఉన్నందున-

లోకబంధుః..733

1. *లోకములను బంధించువాడు.*

లోకాలన్నీ ఈయనయందే బద్ధమై ఉన్నాయి.

సూర్యుని యందు బద్ధమై గ్రహాదులు సంచరించునట్లు, ఆత్మ చైతన్యమందు బద్ధమై శరీరగత అణువులు పరిణమించునట్లు అన్ని లోకాలు పరమాత్ముని యందు బద్ధమై సాగుతున్నాయి.

లోకాలన్నీ ఈయననే ఆశ్రయించి ఉన్నాయి.

2. **'లోక్ దర్శనే'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి కనబడే జగములు లోకములు – అని వ్యవహరింపబడడమే కాక, శాస్త్రాలను కూడా 'లోకాలు' అని చెప్పవచ్చు. శాస్త్రాలకు బంధువైనవాడు. హితాహితోపదేశాన్ని చేయగల శ్రుతి స్మృతి మొదలైన విద్యలన్నీ ఈయన నుండి ఆవిర్భవించి, ఈయన యందే నిబద్ధమై, ఈయననే ప్రతిపాదిస్తున్నాయి. నిబద్ధించిన విద్యామయుడితడు.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే – ॥
శ్రుతి స్మృతి ర్మమైవాజ్ఞా॥
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః – అని భగవానుడు పలుతావుల ప్రకటించాడు.
'శాస్త్రయోనిత్వాత్' – అని బ్రహ్మ సూత్రం.
ఉరుక్రమస్య స హి బంధురిత్థా విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః॥ (ఋగ్వేదం)
సనో బంధుర్జనితా ॥ (యజుర్వేదం)

లోకాలను జనింపజేసిన వాడితడు. జనకుని కంటే బంధువు ఉండరు కనుక ఇతడు లోకబంధువు. జనింపజేసి, ఆధారమైనవాడే కాక – శాసించువాడు కూడా ఈతడే –

మాతా పితా భ్రాతా నివాసః శరణం సుహృద్గతిర్నారాయణః (సుబలోపనిషత్)
తల్లి, తండ్రి, సోదరుడు, నివాస స్థానము, శరణం, మిత్రుడు, గతి, సమస్తం – నారాయణుడే.

లోకనాథః.. 734

1. లోకాలను శాసించువాడు.

ఈ నామానికి అనేకార్థాలున్నాయి.

'లోక' శబ్దానికి స్థావర జంగమాత్మకమైన జగతి, అందులో ఉన్న ప్రాణులు – అని ఒక అర్థం. మరియొకటి 'శాస్త్రము' (విద్యలు).

"నాథృ యాఞ్ఞోపతాపైశ్వర్యాశీఃషు" – అనే ధాత్వర్థాన్ని అనుసరించి

'యాచింపబడువాడు', 'మేలుకోరువాడు', 'ప్రభుత్వాన్ని చూపువాడు' (ఈశ్వర భావం), 'శాసించువాడు'– అని అర్థాలు. (పాణినీయధాతుపాఠం)

జగతి చేత, లోకుల చేత, విద్యల చేత ప్రార్థింపబడేవాడు (నాధ్యతే ప్రార్థ్యతే). విద్యనీ, లోకాలనీ, లోకులనీ శాసించువాడు, అధికారం వహించువాడు, వాటి మేలు కోరువాడు – లోకనాథుడు.

శాస్త్రాదులను ఏర్పరచి శాసిస్తున్న జ్ఞాన స్వరూపుడు కనుక –

మాధవః..... 735

1. జ్ఞాన స్వరూపుడు.

'మన జ్ఞానే' అనే ధాతువుననుసరించి **"మనుత ఇతిమధుః, మనురేవ మధు. మధు – జ్ఞానం మధ్వేవ మాధవోజ్ఞాన రూపో విష్ణుః"** (సత్యభాష్యం)

మధువనగా జ్ఞానం. జ్ఞాన స్వరూపుడు మాధవుడు.

2. **'ధూ కంపనే'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి **ధునోతీతి – ధవః**, తన జ్ఞానముతో (మః) అంతటినీ 'కంపింపజేయువాడు' – పరిణమింపజేయువాడు –శాసన భీతిని కల్పించి పాలించువాడు.

భీషాస్మాద్వాతః పవతి భీషోదేతి సూర్యః – అనే శ్రుతి వాక్య ప్రకారం, ఈతని శాసన భీతి చేతనే వాయువు వీస్తున్నది. సూర్యుడుదయిస్తున్నాడు.

'మధుపాణిం' 'మధుపృష్టమ్' 'మధు ప్రతీక' –అని 'ఋగ్వేదం' లో పలుతావులలో చెప్పబడ్డాయి.

3. లోకమంతా వ్యాపించిన భగవద్విభూతియే 'మా'. ఆ శక్తికి 'ధవుడు' (పతి) విష్ణువు.

ఈ జ్ఞాన, విభూతులతో తన నాశ్రయించిన వారిని అనుగ్రహిస్తు న్నందున –

భక్త వత్సలః.. 736

1. భక్తులపట్ల స్నేహ భావం కలవాడు – వారిలో వసించువాడు.

'భజతి భజతే సేవాత ఇతి భక్తః

సస్నేహం వదతీతి వసతీతి – వత్సలః'

సేవించువారు, ఆశ్రయించువారు భక్తులు. వారిపట్ల ఆదరభావంతో పలుకువాడు, వారియందు ప్రీతిగా వసించువాడు 'భక్తవత్సలుడు.'

తల్లిదండ్రులు, గురువులు సంతానం పట్ల చూపించే ఆదరభావం 'వాత్సల్యం'. అది చేరదీయుట, రక్షించుట, పోషించుట, బోధించుట మొదలైన భావాలుగా వ్యక్తమౌతోంది. ఆ విధంగా జ్ఞానస్వరూపుడైన విష్ణువు భక్తులను చేరదీసి, రక్షించి, పోషించి, జ్ఞానాన్ని ప్రసాదిస్తున్న భక్తవత్సలుడు.

2. విభజించి, స్నేహపూర్వకంగా పలుకువాడు.

భజతి విభాగం కరోతితి భక్తః.

'వత్సాం సాభ్యాం కామ బలే' అనే పాణినీయ సూత్రాధారంగా **'కామవతి – స్నేహవతి'** మత్వర్థంలో 'లచ్' ప్రత్యయం 'వత్సలః'.

తల్లి తన సంతానంలో ఒక్కొక్కరికి ప్రత్యేకంగా, వారికి కావలసినవాటిని స్నేహ పూర్వకంగా పలికి ఆదరించినట్లుగా –ఈ విశ్వంలో భిన్నభిన్నమైన వాటిని సృష్టించి, ఆయా వాక్కులతో వాటిని అనుగ్రహిస్తున్న లోకనాథుడు విష్ణువు.

సృష్టిలోని ఆయా జాతి జీవులు వాటి వాటి పలుకులతో పరస్పరం స్నేహ పూర్వకంగా ఏకీకృతమౌతున్నాయి. ఇలా వాటివాటి విభాగాలేర్పరచి వారియందు ఆయా వాక్స్వరూపాలుగా ఉన్నవాడు విష్ణువు.

మాం హవన్తే పితరం న జన్తవో

అహం దాశుషే <u>విభజామి</u> భోజనమ్ ॥(ఋగ్వేదం)

(భోగ్యవస్తువే భోజనం).

భక్తానుగ్రహార్థం దివ్య మంగళ విగ్రహాన్ని దర్శించినవాడు – ఆ విగ్రహం మేలి చాయతో ఆదర భావాన్ని ప్రకటిస్తున్నందున –

సువర్ణవర్ణో హేమాంగో వరాంగ శ్చందనాంగదీ।
వీరహా విషమః శూన్యో ఘృతాశీ రచల శ్చలః॥ 79

737. సువర్ణవర్ణః, 738. హేమాఙ్గః, 739. వరాఙ్గః, 740. చన్దనాఙ్గదీ,
741. వీరహా, 742. విషమః, 743. శూన్యః, 744. ఘృతాశీః,
745. అచలః, 746. చలః ॥

సువర్ణ వర్ణః.. 737

1. బంగారు చాయ కలవాడు.

తేజస్సు యొక్క వర్ణం సువర్ణం. మహా తేజస్వి కనుక బంగారు రంగుతో భాసిస్తున్నవాడు.

మేలు కలిగించే శుభస్వభావమే 'సు'. స్వామి మేని చాయ మేలు కలిగించేది. కనుక అది 'సు'వర్ణం.

తైజస వర్ణుడైన సూర్య రూపుడైన నారాయణుడు.

అందరిచే వరింపబడే మంచి వర్ణుడు (వరణీయుడు) ఈతడే.

యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణమ్ (ముండకోపనిషత్తు)

'ద్రష్ట యగు సాధకుడు ఎప్పుడు బంగారు వన్నెవంటి వన్నె కల పరమాత్ముని దర్శించునో...' అని ఉపనిషత్తు బోధిస్తోంది.

ఆ ప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః (యజుర్వేదం)

రుక్మాభం స్వప్న ధీగమ్యమ్ (మనుస్మృతి)

హిరణ్మయః పురుషః సర్వ ఏవ సువర్ణః (ఛాందోగ్యోపనిషత్తు)

– ఇలా శ్రుతి స్మృతి వాక్యాలు తేజః స్వరూపుడైన పరమాత్ముని బహు విధాల వర్ణించాయి.

స్వార్వాః సువర్ణ అనవద్యరూపాః ॥ (ఋగ్వేదం)

స ప్రజాపతిః సువర్ణ మాత్మన్నపశ్యత్ తత్ ప్రజానయతే ॥ (అథర్వవేదం)

ప్రసరించే వర్ణమే కాక, శరీరం సైతం స్వర్ణమే –

హేమాంగః.. 738

1. *బంగారు శరీరం కలవాడు.*

మొదట కనబడేది వెలుగు - అటుపై వెలుగుకి ఆధారమైన జ్యోతి. ఆ క్రమంలోనే మొదట వర్ణాన్ని, తరువాత శరీరాన్ని పేర్కొన్నారు.

నిత్యమై, శుద్ధ సత్త్వమయమై ప్రకాశించే రూపం కలవాడు.

య ఏషోఽంతరాదిత్యే హిరణ్మయః పురుషః (ఛాందోగ్యోపనిషత్తు)

'ఆదిత్య మండలాంతర్భాగంలో ఏ హిరణ్మయ పురుషుడు ఉన్నాడో' ఆ పరమ పురుషుడు నారాయణుడు.

2. *వృద్ధి చెందుతూ గమనం చేయువాడు.*

'హిగతి వృద్ధ్యోః' - హేమః - అనే ధాత్వర్థాన్ని అనుసరించి, వృద్ధి చెందువాడు.

సూర్యరూపుడై తన తేజస్సును క్రమక్రమంగా పృథ్విపై వర్ధిల్ల జేయుచు గమనం చేయువాడు. **అంగతి గచ్ఛతీతి - అంగః.**

వృద్ధి చెందుతూ సాగే లక్షణం కల విశ్వమందు వ్యాపించిన విశ్వ రూపుడు విష్ణువు.

అస్య ప్రేషా హేమనా హూయమానో ॥ (ఋగ్వేదం)

ఈ దివ్య దేహాన్నే సర్వులూ స్తుతిస్తున్నందున-

వరాఙ్గః.. 739

1. *శ్రేష్ఠమైన శరీరం కలవాడు.*

వృఞ్ వరణే - అనే ధాతువు ననుసరించి వరించదగిన, శ్రేష్ఠమైన మంగళ విగ్రహుడు, శోభనములైన అవయవాలు కలవాడు.

ఫుల్లేన్దీవర పత్రాభమ్ చతుర్బాహుం నిరీక్ష్యతమ్ ।

శ్రీవత్స వక్షసం జాతం తుష్టావాఽఽనక దున్దుభిః॥ (విష్ణువు)

వికసించిన నల్ల కలువవంటి నీలి చాయ కలవాడై, నాలుగు బాహువులతో, శ్రీవత్సలాంఛనంతో అవతరించిన శ్రీకృష్ణుని చూసి వసుదేవుడు స్తోత్రం చేశాడు.

రామ కృష్ణాద్యవతారములుగా, ధ్యాన యోగ్యమైన మంగళ దేహం కలవాడు.

2. **ప్రియతే స్తూయతే – అంగఃగతిః ప్రాప్తిర్వా,**

అందరిచే స్తుతింపబడుతూ, శ్రేష్ఠమైన గతితో వ్యాపించినవాడు.

య ఈం వహతే య ఈం వరేయూన్ । (ఋగ్వేదం)

తత్సవితుర్వరేణ్యం ॥ (ఋగ్వేదం)

మునుపటి శ్లోకంలో 'యత్ – తత్' పదాలతో చెప్పబడి, సవితృమండల మధ్యవర్తియైన 'భర్గః – వరేణ్యం' – శ్రేష్ఠమైన తేజస్సు పరమాత్ముడైన నారాయణుడు. ఈ క్రమం ఈ నామాల కూర్పులో ద్యోతకమౌతోంది.

"వరేణ్యం వరీతుమర్హమ్ – సవితుః భర్గః – సూర్యస్య శుద్ధతేజః ॥

వరించుటకు, స్తుతించుటకు అర్హమైన సవితృమండలాంతర్గతమైన శుద్ధ తేజస్సు – వరాంగుడు.

చూచేవారికి, తలచే వారికి ఆహ్లాదాన్ని కలిగించే స్వరూపం కనుక –

చన్దనాఙ్గదీ..740

1. *ఆహ్లాదకరమైన ఆభరణాలు ధరించినవాడు.*

స్వామి భుజకీర్తులు (కేయూరాలు) మొదలైన ఆభరణాలతో ఆహ్లాదాన్ని కలిగిస్తూ శోభిస్తున్నాడు. చన్దనాదులచే చర్చితమైన నీలతనువుతో శోభిస్తున్న శ్రీకృష్ణాది రూపాలు ఇక్కడ స్మర్తవ్యాలు. 'చన్దన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలి" (జయదేవుని గీతగోవిన్దం)

'చద ఆహ్లాదే' అనే ధాతువుననుసరించి 'ఆహ్లాదపరచునది – చందనం'.

2. *ఆహ్లాదకరమైన గతి నిచ్చువాడు.*

సూర్యాంతర్వర్తియైన విష్ణు చైతన్యమే గ్రహాదులకు గతినిస్తున్నది.

ఆ గతి జగతికి ఆహ్లాదాన్ని శ్రేయస్సుని కలిగిస్తున్నది. స్వయం ప్రకాశుడై ఇతరములకు ప్రకాశాన్నిచ్చువాడు.

నక్షత్ర గ్రహసోమానాం ప్రతిష్ఠాయోని రేవచ ।

చంద్రాద్యాశ్చ గ్రహాః సర్వే విజ్ఞేయా సూర్య సంభవాఃll

నక్షత్ర గ్రహాదులకు, రసత్వాలకు ఆధారమైనవాడు, కారణమైనవాడు. చంద్రాదులన్నీ సూర్యుని నుండే ఆవిర్భవించాయని తెలియాలి – అని పురాణ వచనం.

చన్ద్రాదులకు కాంతినిచ్చి, తద్వారా జగతిని ఆహ్లాద పరచు తేజః స్వరూపుడు.

మధ్వో రసం సుగభస్తి ర్గిరిష్ఠాం చ

నిశ్చదద్ దుదుహే శుక్రమంశుఃll (ఋగ్వేదం)

ఈ దివ్య స్వరూపం ధర్మ రక్షణకై ఉద్భవించి, పరాక్రమవంతులను అధిగమిస్తున్నందున –

వీరహా.. 741

1. *వీరులను హరించువాడు.*

దివ్య స్వరూపంగా ఆవిర్భవించిన స్వామి, ధర్మ ద్రోహులైన అసురులను సంహరించి, ధర్మ రక్షణ చేయువాడు.

2. *పర్జన్యాదులకు గతి నిచ్చువాడు.*

'వి' అనే ఉపసర్గతో కూడిన ఈరములు – వీరములు.

ఏతి గచ్ఛతియ యా సా ఇరా.

దేనిచే గమనం, ప్రవాహం కలుగునో అది ఇరా. ప్రవాహ లక్షణం కలవి. **'ఇరా ఉదకం మద్యం వా'.** వివిధములైన జలములను కలిగించే పర్జాన్యాదులే వీరులు. వాటిని తన కాంతితో గమింపజేయువాడు, తొలగించువాడు – ఆదిత్య రూపుడైన విష్ణువు.

హన్తి గమయతి పర్జన్యం – వీరహా విష్ణుః (సత్యభాష్యం)

ఇరా విశ్వస్మై భువనాయ జాయతేయత్ పర్జన్యః

పృథివీం రేత సావతి ll (ఋగ్వేదం)

వీరులను మించినవాడు కనుక ఇతనికి సాటి వేరెవరూ లేరు.

విషమః.. 742

1. తనకు సములు లేనివాడు.

విలక్షణః సమేభ్యః – పరస్పరం సములుగా ఉండు వారందరికంటే విలక్షణుడు.

న త్వత్సమోస్తభ్యధికః కుతోన్యః (భగవద్గీత).

'నీతో సములు ఇతరులెవరూ లేరు? ఇంక అధికుడైనవాడు ఎక్కడ నుండి వస్తాడు?' అని శ్రీకృష్ణుని అర్జునుడు కీర్తించాడు.

2. దుష్ట వీరులను హరింపజేయడం చేత (వీరహా) వారిపట్ల వైషమ్యం కలవాడు.

తనకు ఇతరమైనది ఏదీ లేనప్పటికీ లీలగా ఈ కృత్యాలను ఆచరించడం చేత ఏమీ అంటనివాడు కనుక–

శూన్యః.. 743

1. శూన్యము (ఏమీ లేనిది) వంటివాడు.

ఆతనిని గుర్తించేందుకు సహకరించే ఏ విశేషాలూ లేనివాడు. ఎందుకంటే ఇతని కంటె ఇతరమైనవి ఏవీ లేవు కదా!

అన్నిటికీ తాను ఆధారమై ఉన్నా, ఏ వికారమూ తనకు లేనివాడు కనుక శూన్యుడు.

2. ఆకాశము వంటివాడు. గతినిచ్చువాడు.

అన్నిటికీ అవకాశమిచ్చేది ఆకాశం. గతికి ఆధారమైనది.

'శున గతౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి – **'శునతిప్రాప్తో భవతి సర్వత్ర ఇతి శూన్యో విష్ణుః'** (సత్యభాష్యం)

అంతటా వ్యాపించే వాడు, అన్నీ తనయందు కలుగుతున్నా వేటి వికారాలూ తన యందు లేనివాడు.

'ఆకాశవత్ సర్వగతః' అని ఉపనిషద్వచనం.

తత్త్వపరంగా ఈ అర్థం చెప్పుకున్నా,

శూన్యమనగా ఆకాశం. 'ఖం బ్రహ్మ' అని యజుర్వేద వాక్యం. (ఖం-శూన్యం, ఆకాశం) "ఆకాశ శరీరము బ్రహ్మము"ని త్యాగయ్య ఈ భావాన్నే కీర్తించారు.

గతి నిచ్చేది శూన్యం.

ఈ గతి శూన్యం నుండే ఏర్పడి శూన్యంలోనే పూర్తవుతోంది. సర్వాధారమైన ఈశ్వర చైతన్యమే సర్వజగతికీ గతినివ్వడం చేత 'శూన్యుడని' పేర్కొన్నారు. గణితంలో కూడా శూన్యమే గతి నిస్తున్నది. నిర్వికారుడు కనుకనే ఏ కోరకలూ లేని వాడై -

ఘృతాశీః.. 744

1. *కరిగిన (జారిపోయిన) కోరికలు కలవాడు.*

కరిగినది, జారునది ఘృతం. ఆశించునవేవీ లేనందున సంపూర్ణకాముడు, నిష్కాముడు అయిన విష్ణువు -'ఘృతాశీః'.

2. *ఘృతమును ఆశించువాడు.*

యజ్ఞాగ్నియైన విష్ణువు యజ్ఞద్రవ్యమైన ఘృతాన్ని ఆశిస్తున్నాడు. అభిమంత్రితమైన ఘృతాన్ని స్వీకరించి, తన విభూతులైన దేవతలను పోషింపజేస్తున్న యజ్ఞస్వరూపుడు.

'ఘృ సేచనే' 'ఘృ క్షరణ దీప్త్యోః' అనే ధాత్వర్థాల ననుసరించి, కురియునది (తడుపునది), క్షయింపజేయునది, దీపింపజేయునది - ఘృతం. (సత్యభాష్యం). ఇది జలానికీ, నేతికీ కూడా వర్తించే పదం. జలాన్ని స్వీకరించే సూర్యుడు, నేతిని స్వీకరించే యజ్ఞాగ్ని కూడా ఘృతాన్ని ఆశించేవారే.

జలాన్ని కోరుకొనే దీపకలక్షణం సర్వత్ర వ్యాపించి ఉంది. ఘృతంచేత అగ్ని, అగ్ని చేత ఘృతం వర్ధిల్లుతాయి. శ్రీకృష్ణావతారంలో నేయి, పాలు, వెన్న వంటి ద్రవ్యాలను ఆరగించిన వైనం యజ్ఞేశ్వర తత్త్వప్రతిపాదనగా భావించవచ్చు.

ఘృతం తీవ్రం జుహోతన ॥ (ఋగ్వేదం)
ఋతాయ చిత్రం ఘృతవన్త మిష్యతి ॥(ఋగ్వేదం)
ఘృతేన వర్ధయాతిథిమ్ ॥
ఘృతేన వర్ధయామసి బృహచ్ఛేయా యవిష్ఠ్యా ॥ (ఋగ్వేదం)
('అతిథి' అనే మాటకి వేదపరంగా 'అగ్ని' అని అర్థం).
కరిగే వాటిని స్వీకరిస్తూ, తాను మాత్రం చలించని తేజస్వీగా ఉన్న కారణంగా –

అచలః.. 745

1. కదలనివాడు.

తన స్వరూపం నుండి , సామర్థ్యం నుండి, జ్ఞానాది గుణాల నుండి తొలగని వాడు. పరిపూర్ణుడు. తత్త్వతః – ఈతడు పరిణామంలేని ఆత్మ స్వరూపుడు.

2. తన ఆజ్ఞారూపాలైన విశ్వ నియమాల నుండి చలించనివాడు, చలింప నీయనివాడు. విశ్వవ్యవస్థ అంతా సృష్టి నుండి ప్రళయం వరకు స్వాభావిక నియమాల నుండి చెదరదు. సూర్యుడు ప్రకాశించడం, నీరు ప్రవహించడం, అగ్ని జ్వలించడం ఇలా విశ్వంలో ఉన్న స్వాభావిక ధర్మాలేవీ చెదరవు. ఆ విధంగా నిశ్చలమైన నియమవ్యవస్థగా వ్యాపించినవాడు.

షడ్ భారాం ఏకో అచరన్ బిభర్త్యృతం
వర్ష్ఠ ముపగావ ఆగుః ॥ (ఋగ్వేదం)

అచలుడైన తాను, అచలమైన నియమాలతో విశ్వాన్ని వ్యాపింపజేస్తున్నందున–

చలః.. 746

1. కదలువాడు.

తాను పరిణామం లేని వాడైనప్పటికీ, తన చైతన్యం ద్వారానే జగతిని కదిలిస్తున్నాడు. అప్పుడు ఆ చైతన్యమే కదలునట్లుగా గోచరిస్తోంది. నిరంతరం

చలిస్తున్న జగతిగా భాసించే విశ్వరూపుడే, దానికి ఆధారమైన అచలతత్త్వంగా ఉన్నవాడు. కూటస్థునిగా అచలుడైన ఆతడు, తన జ్ఞాన బల క్రియాదులతో చలిస్తున్నాడు.

2. వాయురూపుడై చలనం చేయువాడు.

జగతిలో చలించే చైతన్యమూ ఆతడే, స్థిరచైతన్యమూ ఆతడే. ఆత్మగా అచలుడు. ప్రాణంగా చలుడు.

కదలని సూర్యుడు, కదిలే గ్రహాల ననుసరించి, తాను కదులుతున్నట్లు గోచరిస్తున్నాడు. అంతేకాదు - ఆతని చలనశక్తియే భూమ్యాదులను కదిలిస్తోంది. కదిలే భూమి కదలని దానివలె కనబడుతోంది- ఈ 'కదిలే' 'కదలని' చైతన్యమంతా ఆ సూర్యునిదే అయినట్లుగా

3. కృష్ణాద్యవతారాలలో ఆయనను దుర్యోధనాదులు చలింపజేయలేకపోయారు (అప్రధృష్యుడు) తాను ప్రతిజ్ఞ నుండి అచలుడైయున్నాడు. కానీ శత్రు సంహారాదులకై తాను విజృంభించి, ప్రతిజ్ఞ నుంచి సైతం చలించి భీష్మాదులను కంపింపజేశాడు.

ఆత్మా దేవానాం భువనస్య గర్భో
యధావశం చరతి దేవ ఏషః ॥ (ఋగ్వేదం)
సూర్య ఏకాకీ చరతి చద్రమా జాయతే పునః ॥ (ఋగ్వేదం)

అన్నిటినీ కదిలించే ఆత్మ స్వరూపుడైన ఈతడు ఆత్మేతరాలకు అతీతుడు కనుక -

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృక్।
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః॥ 80

747.అమానీ, 748.మానదః, 749.మాన్యః, 750.లోకస్వామీ,
751.త్రిలోకధృక్, 752.సుమేధా, 753.మేధజః, 754.ధన్యః,
755.సత్యమేధా, 756.ధరాధరః.

అమానీ.. 747

1. *(అనాత్మ విషయాలలో) 'నేను' అనే అభిమానం లేనివాడు.*

విషయ రహితమైన అనుభూతి (సంవేదనం) స్వస్వరూపంగా గల ఈ పరమాత్మునకు, ఆత్మేతర (ఆత్మకాని) వస్తువుల విషయంలో (దృశ్య ప్రపంచ విషయంలో) 'ఇది ఆత్మ' (ఇది నేను) అనే అభిమానం ఉండదు.

అనాత్మ వస్తువులను ఆత్మగా తలచే భ్రాంతి లేనివాడు.

2. *సన్మానాదుల భావం లేనివాడు –*

'మానం – సమ్మానం' (మాన–పూజాయామ్ అనే ధాతువు ననుసరించి) ఇతరుల నుండి గౌరవాలను, సమ్మానాలను ఆశించనివాడు.

పరిపూర్ణుడు కానివాడు ఇతరుల స్తుతులను, పూజలను ఆశిస్తూ, వాటితోనే కొలవబడుతుంటాడు. కానీ ఆ కొలతలకందని పూర్ణుడు కనుక విష్ణువు – ఈ పూజాదుల కతీతుడు.

3. *ఇతరుల నుంచి సమ్మానాలను ఆశించని ఈతడు, వారి కొలతలకి కూడా అందడు.*

నతా మినన్తి మాయినో నధీరాः ॥(ఋగ్వేదం)

మానం–ప్రమాణం. మానమనగా కొలత.

'కొలత' అనేది లేనివాడు. 'దేనితో' కొలవబడుతుందో, 'ఎక్కడ' కొలవబడుతుందో' అది 'మానం'. అప్రమేయుడైన ఈతడు. 'కొలత' అనేది లేనివాడు (అమానీ).

కానీ, ఆ అపరిమితుడు జగతికి అంతటికీ కొలత నిచ్చినవాడు.

మానదः.. 748

1. *కొలతనిచ్చువాడు.*

జగతికీ, జీవులకు దేశకాల పరిమితులు ఉన్నాయి. విశ్వాతీతుడైన విష్ణువు అమానీ. విశ్వానికి పరిమితులను విధించిన 'మానదుడు'.

2. తన మాయా శక్తిచే జీవులకు అనాత్మ విషయాలపై ఆత్మాభిమానం కలిగించువాడు.

3. ఇతరుల నుండి గౌరవాన్ని ఆశించకుండా, తాను ఇతరులను గౌరవించువాడు. ఇది దివ్య కల్యాణగుణం. తన అవతారాలలో వీటిని ప్రదర్శించాడు. అహం కారాదులు లేని ఈతడు ద్యూతం, సారథ్యం వంటి కర్మలను సైతం అంగీకరించాడు. తాను స్వయంగా కుచేలుని, నారదాదులని, భీష్మాదులని సన్మానించాడు.

   భృగు మహర్షి తన వక్షస్థలం పై తన్నినా, సహించి, తాను అతనిని సన్మానించిన పురాణగాథ సువిదితమే.

   తన గొప్పతనానికి తాను విస్మితుడు కాకుండా, ఇతరుల నుండి సన్మా నాదులను ఆశించకుండా, తాను అందించే దివ్య గుణ సంపన్నుడు.

4. తన భక్తులకు సత్కారరూపమైన 'మానాన్ని' అనుగ్రహించువాడు.

   తన నాశ్రయించిన అర్జునాదులు జగతిచే సత్కరింపబడ్డారు. ఉగ్రసేనునకు పట్టంకట్టి, యుధిష్ఠిరునకు విజయాన్ని అందించిన లీలలు ఇక్కడ స్మరించాలి.

5. 'దః' అనేమాటకి 'ఇచ్చువాడు' అనే అర్థంతో పాటు 'దహించువాడు' అని కూడా అర్థం ఉంది. తత్త్వజ్ఞులకు అనాత్మ విషయాలపై అభిమానాన్ని పోగొట్టు పరమాత్మ 'మానదుడు'.

   అనాత్మ విషయాలైన శరీరాది ఉపాధులకు 'తాను' అని (ఆత్మగా) తలంచుకొనడమే 'మానం'. అది 'ఆత్మ'యైన స్వామికి లేదు – తన భక్తులకు ఆ తలంపుని తొలగించుతాడు. అజ్ఞాననాశకుడు.

   తృణాదపి సునీచేన తరోరివ సహిష్ణునా।
   అమానినా మానదేన కీర్తనీయస్సదాహరిః॥

   (చైతన్య మహాప్రభు– శిక్షాష్టకమ్)

   "గడ్డిపరక కంటే తక్కువగా (వినయంగా), వృక్షంవలె సహనంగా, ఇతరుల నుండి గౌరవాలను ఆశించక, అనాత్మవిషయాలను ఆత్మగా తలంచక,

ఇతరులను తాను గౌరవిస్తూ హరిని ఎల్లవేళలా కీర్తించాలి."

తాను కోరకున్నా, జగతిచే ఆరాధింపబడే పరమేశ్వరుడు కనుక –

మాన్యః.. 749

1. *పూజింపబడువాడు – కొలువబడువాడు.*

పూజించడానికి అర్హుడు, సర్వజగతిచే ఆరాధింపబడేవాడు విష్ణువు. సర్వ సమర్థుడై, సర్వాభీష్టప్రదాయకుడై, సర్వశక్తిమంతుడైన సర్వేశ్వరుడు కనుక అందరిచే వందనీయుడు.

తనచే కొలత విధింపబడిన జగతి అంతా, ఆతనినే కొలుచుకుంటోంది. యజ్ఞాదులు, ధ్యానాది యోగాలు, అర్చనలు, సంకీర్తనలు.... ఇలా పలు విధాలుగా పూజింపబడుతున్న విష్ణువు, కొలతకందని పరమాత్ముడు తన భక్తులచే వారి వారి భావాలకనుగుణంగా కొలువబడుతున్న 'మాన్యుడు'.

పూజకు అర్హత కలిగిన విశ్వప్రభువు కనుక –

లోకస్వామీ.. 750

1. *లోకము తన ఐశ్వర్యంగా కలవాడు.*

'స్వం' అనగా సొమ్ము (ఐశ్వర్యం). ఐశ్వర్యం కలవాడు స్వామి. ఈ లోకాలన్నీ విష్ణువునకు 'స్వం'. ఆయనకు చెందినవి. లోకాలకు ఈశ్వరుడు. తన ఐశ్వర్యంతో లోకమంతా వ్యాపించినవాడు.

తమీశానం జగతస్తస్థుషస్పతిమ్ ॥(యజుర్వేదం)

తనవైన లోకాలను తాను ధరించి నిర్వహిస్తున్నందున –

'త్రిలోక్ ధృక్' (751)

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృక్।
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః॥ 80

747.అమానీ, 748.మానదః, 749.మాన్యః, 750.లోకస్వామీ,
751.త్రిలోకధృక్, 752.సుమేధా, 753.మేధజః, 754.ధన్యః,
755.సత్యమేధా, 756.ధరాధరః.

త్రిలోకధృక్.. 751

1. మూడు లోకాలను ధరించువాడు.

భూత భవిష్యద్వర్తమానాలను, భూర్భువస్స్వర్లోకాలను, సృష్టి స్థితి లయలను నిర్వహిస్తూ- సత్వరజస్తమోగుణాలను నియమిస్తున్నవాడు.

ఋగ్యజుస్సామ స్వరూపమైన వేదవిద్యను ధరించి, అకార ఉకార మకారాలను దాల్చిన ప్రణవ స్వరూపుడు.

మనోవాక్కాయ కర్మలను, స్థూల సూక్ష్మ కారణ శరీరాలను చైతన్యపరచే ఆత్మస్వరూపుడు.

మూడింటిగా తనచే వ్యవస్థ చేయబడు విశ్వాన్ని తానే ధరించుతాడు స్వామి.

ఆ విధమైన గొప్ప తెలివి ఆతనిదే కనుక -

సుమేధాః.. 752

1. శోభనమైన ప్రజ్ఞ కలవాడు.

గొప్పతనం, శుభలక్షణం 'సు' శబ్దం ద్వారా తెలియబడుతున్నాయి. లోకానికి శుభం కలిగించే గొప్ప ప్రజ్ఞ కలవాడు విష్ణువు. విశ్వమంతా ఆతని ప్రజ్ఞ వలన ఏర్పడినదే.

ధారణాత్మికా బుద్ధియే ప్రజ్ఞ. జగతిలో ప్రతి జీవి కర్మని తెలుసుకొనే

గొప్ప ప్రజ్ఞ ఆతనిది. జగతిని ధరించే (త్రిలోకధృక్) ప్రజ్ఞ కనుక అది 'సు'. (ఎల్లవేళలా విశ్వానికి మేలు కలిగించడమే ఆతని మేధ యొక్క పని.)

పూర్తి జ్ఞానస్వరూపుడు విష్ణువు.

ఈ సుమేధసుని వలననే విశ్వంలో బుద్ధి శక్తి కలుగుతున్నది. బుద్ధిని ప్రేరేపించే చైతన్యమితడే.

...మత్తః స్మృతి జ్ఞానమపోహనం చ ॥ (భగవద్గీత)

'నా నుండియే స్మృతి, జ్ఞానాదులు' కలుగుతున్నాయని స్వామి వచనం.

సదసస్పతి మద్భుతం ప్రియమిన్ద్రస్యకామ్యమ్
సనిం మేధామయాసిషమ్। ... ...
స ధీనాం యోగమిన్వతి ॥ (ఋగ్వేదం)
యాం మేధాం దేవగణాః పితరశ్చోపాసతే ।
తయా మామద్య మేధయా అగ్నే మేధావినం కురు స్వాహా। (యజుర్వేదం)
న త్వదన్యః కవితరో న మేధయా ధీరతరో వరుణ స్వధావన్। (అథర్వవేదం)

తన అవతార కాలాలలో కూడా ఈ విశిష్టమైన, శుభకారకబుద్ధిని ప్రకటించాడు. తన భక్తులకు మేలు కలిగించే తలంపులు ఆయనవి.

మేధాశక్తిగానే కాక, మేధ వలన కలిగే కార్యాలలో కూడా తానే భాసించడం చేత –

మేధజుఁ.. 753

1. *మేధయందు కలుగు(ఉండు)వాడు.*

సునిశితమైన విచారణ వలన తెలియబడే జ్ఞానస్వరూపుడు.

ప్రతి కర్మ కూడా ముందు మేధస్సులో చిత్రింపబడి, తరువాత కార్యరూపాన్ని సంతరించుకుంటుంది. అలా మేధస్సు నుండి ఏర్పడిన కార్యరూప చైతన్యం కూడా భగవత్స్వరూపమే.

మంచి ఆలోచన, దాని యొక్క ఆచరణ స్వరూపం కూడా నారాయణుడే.

2. యజ్ఞము ద్వారా కలుగువాడు.

'మేధము' అనగా అధ్వరం (యజ్ఞం).

జ్ఞానయజ్ఞానికి ఫలం ఆ పరతత్త్వమే.

తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్। (భగవద్గీత)

– సర్వవ్యాపకుడైన పరబ్రహ్మ యజ్ఞమందు నిత్యం ప్రతిష్ఠితుడు. దశరథుని యజ్ఞఫలితంగా అవతరించినవాడు శ్రీరాముడు. దేవకీవసుదేవులు గత జన్మలలో చేసిన యజ్ఞానికి (ఆరాధనకి) ఫలితంగా శ్రీకృష్ణుడు ప్రాదుర్భవించాడు. అదితీదేవి చేసిన యజ్ఞానికి ఫలమే వామనావిర్భావం.

స్తుతోహం యత్త్వయా పూర్వం పుత్రార్థిన్యా తదద్యతే ।

సఫలం దేవి సంజాతం జాతోహం యత్తవోదరాత్।। (విష్ణుపురాణం)

"నన్ను పుత్రునిగా కోరి పూర్వం ప్రార్థించడం చేత, దానిని నెరవేర్చడానికై నేనిపుడు నీకు పుత్రునిగా కలిగాను" అని దేవకీదేవితో విష్ణుని మాట.

'శరణువేడెద <u>యజ్ఞసంభవ! రామ!</u>' అని

యజ్ఞం బహిర్యాగమే కాక– యోగరూపమైన అంతర్యాగమైనప్పుడు లభించే ఆత్మతత్త్వమితడే.

ఋతం చ సత్యం చాభీద్ధాత్తపసోధ్యజాయత।। (ఋగ్వేదం)

ఇన్ధమిద్ విమహీనాం <u>మేధే</u> వృణీత మర్త్యః।

ఇన్ధం సనిష్యురూతయే। (ఋగ్వేదం)

తం మేధేషు ప్రథమం దేవయన్తీర్విశ

ఉపబ్రువతే దస్మమారీః।। (ఋగ్వేదం)

గాథపతి <u>మేధపతి</u> రుద్రం జలాషభేషజమ్।। (ఋగ్వేదం)

అందరికీ ఫలప్రదాత అయిన తాను, పొందవలసినదేదీ లేని కారణంగా –

ధన్యః..754

1. కృతార్థుడు.

సంపూర్ణుడు కనుక, అన్నీ నెరవేరిన వాడీతడు. తన అవతార ప్రయోజనాలను నెరవేర్చినవాడు.

2. ధనము కలవాడు.

సర్వధనములూ ఆయనవే. సర్వధనేశ్వరుడు. తనను ఎవరెవరు దేనికై ప్రార్థిస్తున్నారో, వాటిని ప్రసాదించి వారిని అనుగ్రహిస్తున్నవాడు. ప్రసాదించే ధనములు ఆయనవి – వారి ప్రార్థనలను వ్యర్థం కానీయకుండా పూర్ణత్వాన్నిచ్చి కృతార్థుడైనవాడు ఆయన.

రాధానాం పతే ॥
రాధ స్పతే ॥ (ఋగ్వేదం)
గభస్తి పూతో నృభిరద్రిభిః సుతో
మహే వాజాయ ధన్వసి ॥(ఋగ్వేదం)

సర్వాన్నీ నెరవేర్చే ఆయన ప్రజ్ఞలన్నీ సార్థకమే కనుక –

సత్యమేధా..755

1. అమోఘమైన మేధ కలవాడు.

చెదరని, వ్యర్థంకాని ప్రజ్ఞ ఆతనిది. అది కాని దానిని అదిగా తలచేది అసత్యమేధా – అనాత్మను ఆత్మగా భావించుట. యథార్థజ్ఞానం – ఆత్మజ్ఞానం. ఆ ఆత్మ జ్ఞానస్వరూపుడు సత్యమేధా.

జగతిని నిర్వహించే అమోఘమైన ప్రజ్ఞ కలవాడితడు.

ఎన్నడూ వీడని ప్రజ్ఞ అది. తన స్వస్థితి నుండి జారని వాడు అతడు.

దేవ ఇవ సవితా సత్యధర్మా ॥
దేవో న యః సవితా సత్యమన్మా ॥
భువః సమ్రాడిన్ద్ర సత్యయోనిః ॥ (ఋగ్వేదం)

స్థిరమైన తన ప్రజ్ఞతో సర్వాన్నీ ధరించువాడు కనుక –

ధరాధరః.. 756

1. *భూమిని ధరించినవాడు.*

ఆదిశేష, కూర్మాది రూపాలతో భూమిని మోస్తున్నవాడు. ఆదివరాహమై పృథ్విని దాల్చినవాడు.

మనలను ధరించే భూమి- ధర. దానిని ధరించేది విష్ణుచైతన్యమే. ఇలా జగతిని ధరించే విశ్వనిర్వాహక శక్తులన్నిటికీ ఆధారమైన ఈశ్వరుడితడే.

ఆయనను మించిన ధారణ శీలిలేడు.

మందరగిరిని మోసిన కూర్మావతారం, గోవర్ధనగిరిని ధరించిన కృష్ణావతారం కూడా ఈయన యొక్క ధారణాసామర్థ్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

3. *పర్వతస్వరూపుడు అనే అర్థాన్ని కూడా భావించవచ్చు.*

మేరు, హిమ, వింధ్య, గోవర్ధన, వేంకటాచలాది దివ్యపర్వత స్వరూపుడు.

స ధా॒ధార పృథివీం ధ్యాముతేమామ్॥ (ఋగ్వేదం)

తస్మిన్ హ తస్థు ర్భువనాని విశ్వా॥ (యజుర్వేదం)

అనడ్వాన్ ధా॒ధార పృథివీమ్॥ (అథర్వవేదం)

పృథివ్యాదులను తన తేజస్సుతో ధరిస్తున్నందున -

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాం వరః।
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాఽగ్రజః॥ 81

757. తేజోవృషః, 758. ద్యుతిధరః, 759. సర్వశస్త్రభృతాంవరః,
760. ప్రగ్రహః, 761. నిగ్రహః, 762. వ్యగ్రః,
763. నైకశృఙ్గః, 764. గదాగ్రజః.

తేజోవృషః.. 757

1. *తేజస్సును కురియువాడు.*

కాంతులను, శక్తులను, సూర్యాది రూపాల ద్వారా జగతిపై కురిపించే

పరమతేజస్వి. పాలన, సంతాప లక్షణాలను తెలియజేసేది తేజస్సు. వాటిని జగతికై అందించువాడు.

పాలించువాడు, వర్షించువాడు ఈతడే.

2. జలములకు కూడా తేజస్సులని పేరు. **తేజోవృషః తేజాంసి ఆపః తాని వర్షతీతి సూర్యః** – కిరణాల ద్వారా కాంతులను మాత్రమే కాక, ఆ తాపం ద్వారా పర్జన్యాదులను ఏర్పరచి జలములనందించే ఆదిత్యస్వరూపుడు.

తేజోఽసి తేజోమయిధేహి ॥ (యజుర్వేదం)

ఆదిత్యాదుల ద్వారా ప్రకాశించే జ్యోతి ఈతడే –

ద్యుతిధరః.. 758

1. కాంతిని ధరించువాడు.

స్వయంసిద్ధం, అన్నిటినీ ప్రకాశింపజేసేది, శుద్ధ జ్ఞానాత్మకమైన చైతన్యమే ద్యుతి. ఆ ద్యుతి కలవాడు విష్ణువు.

తాను ధరించిన దివ్య రూపాలు కాంతిమంతములు.

'సర్వాధార చైతన్యం' అని దీని ప్రధానార్థం.

తేజోరూపులైన సూర్యాదులకు కూడా ఈతడే ఆధారం.

సూరో నహి ద్యుతా త్వం కృపా పావక రోచసే ॥ (ఋగ్వేదం)

ధరించి, పాలించే ఈశ్వరుడు కనుక –శాసించేవారిలో ఈతడే శ్రేష్ఠుడు .....

సర్వశస్త్రభృతాంవరః.. 759

1. ఆయుధధారులందరిలో శ్రేష్ఠుడు.

రక్షించడానికీ, శిక్షించడానికీ – నాశానికీ, ఉపకారానికీ ఉపయోగించేది ఆయుధం. లోకశాసకులైన దిక్పాలాదులు, దేవతలు శస్త్రధారులు. వారిని సైతం శాసించే శిక్షకుడు రక్షకుడు దేవదేవుడైన విష్ణువు. దేవతలలో శ్రేష్ఠుడు.

తమ తేజస్సులనే శస్త్రాలుగా ఉపయోగించే ఆదిత్యాదులందరికంటే తేజస్వి.

కోదండరాముని‌గా, శ్రీకృష్ణునిగా శస్త్రధారులలో శ్రేష్ఠుడై భాసించిన దివ్యావతారుడు.

మనుష్య ధర్మలీలస్య లీలా సా జగతీపతేః ।

అస్త్రాణ్యనేక రూపాణి యాదరాతిషు ముఞ్చతి ॥

శత్రువులపై అనేక అస్త్రాలను ప్రయోగించడం, మానవుని వలె నటించే ఆ భగవానుని లీల.

రామః శస్త్రభృతా మహమ్ ॥ (భగవద్గీత)

'శస్త్రధారులలో శ్రీరాముడను నేను' అని విభూతియోగంలో ప్రకటించాడు.

2. *శస్త్రధారులచే పూజింపబడువాడు.*

వ్రియతే - మాన్యతే పూజ్యత ఇతి వరః.

వజ్రపాశాదులను ధరించే ఇన్ద్ర వరుణాది లోకశాసకులచే ఆరాధింప బడేవాడు.

ధర్మరూప శస్త్రధారియై జగతిని అదుపులో ఉంచుతున్నవాడు కనుక-

ప్రగ్రహః.. 760

1. *గొప్పగా పట్టుకున్నవాడు.*

ఈ జగతిని తన శక్తులతో ప్రకర్షంగా (గొప్పగా) గ్రహించి (పట్టుకొని) నిర్వహిస్తున్నవాడు. విశ్వరథాన్ని నడిపే స్వామికి వివిధ శక్తులే పగ్గములు.

సుషారధిరశ్వానివ యన్మనుష్యాన్నేనీయతే...

తన్మే మనః శివసంకల్పమస్తు ॥ (యజుర్వేదం)

మన శరీరం రథంగా, ఇంద్రియాలు గుఱ్ఱంగా, అంతఃకరణమే ప్రగ్రహం (పగ్గం)గా వర్ణించబడింది. మనిషిని నడిపే మనోరూపచైతన్యం కూడా విష్ణువిభూతి విలసితమే. సర్వజీవులయందు మనశ్చైతన్యంగా ఉన్నవాడతడు. ఇంద్రియాశ్వాలను ఆయన అనుగ్రహమే పట్టి నడపగలదు.

యధాజ్యం ప్రగృహీతమాలుంపేత్ స్రుచో అగ్నయే ।

ఏవా హ బ్రహ్మభ్యో వశామగ్నయ ఆవృశ్చతే దదత్ । (అథర్వవేదం)

మనస్సు ద్వారా ఇంద్రియాలు నడవడం చూస్తున్నాం గానీ, మనస్సును సైతం నడిపే పరమ చైతన్యాన్ని తెలుసుకోగలగాలి.

ధియో యోనః ప్రచోదయాత్ ॥ (గాయత్రి)

'మా బుద్ధులను ఎవడు ప్రేరేపిస్తున్నాడో...' పగ్గం గుఱ్ఱాల్ని కట్టి ఉన్నా పగ్గాల్ని పట్టి ఉన్న సారథిని తెలుసుకోవాలి కదా!

యో బుద్ధేః పరసస్తు సః ॥ (భగవద్గీత)

అన్నిటికి పరమమైనది బుద్ధి (అంతఃకరణం). దానికి కూడా పరమమైన వాడు పరమాత్మ. ఆయన చైతన్యమే ఈ ప్రగ్రహాన్ని కూడా పట్టుకున్నది -

నిగ్రహః.. 761

1 *నిశ్చయంగా గ్రహించువాడు.*

విశ్వాన్ని అదుపులో పెట్టేవాడితడు. విశ్వనియామక దేవతాశక్తులు ప్రగ్రహాలు. అవి విష్ణు విభూతులే. వాటిని సైతం అదుపులో పెట్టేవాడు నిగ్రహుడు.

కిరణాలు పగ్గాలు. సూర్యుడు వాటిని పట్టిన నిగ్రహుడు.

'తన సర్వ శక్తులను తన వశంలో ఉంచుకొని, తన ఇచ్ఛతోనే సమస్త విశ్వాన్ని తన అధీనంలో ఉంచుకొన్నవాడు' -అని ఈ నామ తాత్పర్యం.

యేన ద్యౌరుగ్రా పృథివీ చ దృఢా
యేన స్వస్తభితం యేన నాకః ।
యో అన్తరిక్షే రజసో విమానః
కస్మై దేవాయ హవిషా విధేమ ॥ (ఋగ్వేదం)

అన్నిటినీ తన అదుపులో ఉంచి తాను శాశ్వతుడై, విశ్వరక్షణా తత్పరుడైనందున -

వ్యగ్రః.. 762

1. అంతము లేనివాడు.

అగ్రమనగా కొన-తుది. ప్రతిదానికి కొన- పూర్తి-అంతు. ఆ 'అంతు' లేనివాడు. పూర్తి కానివాడు. అనంతుడు, నాశరహితుడు.

2. 'అగ్ర' మనగా తత్పరత. ఒకే దానియందు శ్రద్ధ.

విశిష్టమైన అగ్రము కలవాడు. భక్తులకు ఈప్సితఫలాలను ఇవ్వడంలోను, విశ్వనిర్వహణలోను తత్పరుడు.

3. **"అగి గతౌ"** అనే ధాత్వర్థాన్ని అనుసరించి, 'అంగతీత్యగ్రః' (సత్యభాష్యం). గమనము కలుగుట 'అగ్రం' - వివిధమైన గమనములు కలవాడు వ్యగ్రుడు.

విశ్వశక్తుల ప్రగ్రహాలను, వశమందుంచుకొని (నిగ్రహః), వివిధ విధాల నడుపువాడు (వ్యగ్రుడు). వివిధ విశ్వగతులకు మూలమైనవాడు.

ఇమా అభి ప్రణోనుమో విపామగ్రేషు ధీతయః ।
అగ్నేః శోచిర్న దిద్యుతః ॥ (ఋగ్వేదం)

వివిధ గతుల కారణంగా, అనేక దీప్తులతో భాసించుతున్నందున -

నైకశృఙ్గః.. 763

1. అనేక దీప్తులు కలవాడు.

శృంగములు - కొమ్ములు-కొనదేలినవి - 'హింసాసాధనలు, బాధానివారకాలు'.

ప్రతికూలతలను ఎదుర్కొనడానికి పనికి వచ్చేవి శృంగాలు.

మృదు, తీక్ష్ణాది వివిధ దీప్తులతో ప్రకాశించే సూర్య రూప విష్ణువు నైకశృంగుడు.

ఉత్తరాయణ, దక్షిణాయన భేదాలతో వివిధ విధాల ఉదయాలు, ప్రకాశాలు కలవాడు.

వివిధ శాఖలతో, వివిధ విధాలుగా దీపించే అగ్ని రూప విష్ణువు.

ఏకవా ఇదం వి బభూవ సర్వమ్ ॥ (ఋగ్వేదం)

శిశానో వృషభో యథాగ్నిః శృఙ్గే దవిధ్వత్ ।

తిగ్మా అస్య హనవో న ప్రతిధృషే సుజంభః సహసో యహుఃఽ। (ఋగ్వేదం)

ప్రాదేవీర్మాయాఃసహతే దురేవాఃశశీతే శృఙ్గే రక్షసే వినిక్షే ॥ (ఋగ్వేదం)

ఏక ఏవాగ్నిర్బహుధా సమిద్ధ ఏకఃసూర్యో విశ్వమను ప్రభూతఃఽ

ఏకైవోషాఃసర్వమిదం విభాత్యేకం వా ఇదం విబభూవ సర్వమ్। (ఋగ్వేదం)

చతుఃశృఙ్గో వమీద్ గౌర ఏతత్ ॥ (ఋగ్వేదం)

అనేకములుగా విస్తరించినది ఆత్మ చైతన్యమే. అదే నైకశృంగఃఽ.

2. శబ్ద బ్రహ్మ స్వరూపుడు.

'ద్యుతిధరా'ది నామాలతో జ్యోతిఃస్వరూపుడైన విష్ణువును చెప్పి, ఈ నామంలో శబ్ద స్వరూపుని ఆవిష్కరించారు.

చత్వారిశృంగా త్రయోఽస్యపాదా

ద్వే శీర్షే సప్తహస్తా సోఽస్య

త్రిధా బద్ధో ఋషభోతోరవీతి

మహాదేవో మర్త్యాగ్ం ఆవివేశ ॥ (తైత్తిరీయ ఆరణ్యకం)

పాతంజల మహాభాష్యంలో దీనికి చక్కని వ్యాఖ్యానాన్నిచ్చారు.

వృషభంగా రూపించబడే శబ్ద బ్రహ్మకి -

నాలుగు కొమ్ములు : నాలుగు శబ్దభేదాలు. 1. నామములు, 2. ఆఖ్యాతములు (క్రియాపదాలు), 3. ఉపసర్గలు (అర్థవిశేషాన్నితెలుపుటకు క్రియాపదాలకు ముందు ప్రయోగించబడే - 'ప్ర, పరా, ప్రతి' మొదలైన నిపాతశబ్దములు.) 4. నిపాతాలు (వ్యుత్పత్తి, శబ్దరూప నిర్మాణ ప్రక్రియ; తెలియరానివీ, వివిధార్థంలో ప్రయోగించబడేవీ అయిన శబ్దాలు)

మూడు పాదాలు : 1. భూత, 2. భవిష్యత్, 3. వర్తమాన కాలాలు.

రెండు శిరస్సులు : 1. నిత్యములు (స్వయంసిద్ధాలు)

2. కార్యరూపాలు (జనించేవి)

ఏడుహస్తాలు :ఏడు విభక్తులు.

త్రిధాబద్ధా : మూడు చోట్ల కట్టివేయ(నిలుప) బడేది. హృదయం, కంఠం, శిరస్సు- శబ్దనిబద్ధస్థానాలు.

అన్ని కోరికలను, అర్థాలను వర్షింపజేసే స్వభావం చేత శబ్దబ్రహ్మ 'వృషభం' అని చెప్పబడింది. ఈ శబ్దబ్రహ్మస్వరూపుడైన పరమాత్మయే 'నైకశృంగుడు'.

3. *పగ్గాలను పట్టి (ప్రగ్రహః) రథాశ్వాలను, సైన్యాన్నీ వశపరచుకుని (నిగ్రహః), యుద్ధంలో వ్యగ్రుడై, అనేక విధాలుగా శత్రువులను బాధించే (నైకశృంగః) క్రియలు చేసిన సార్థసారథి ఈతడు.*

బుద్ధిసామర్థ్యం, సారథ్యం, ఆయుధాలను గ్రహించకపోవడం, సమయం వచ్చినప్పుడు ఆయుధాన్ని చేపట్టడం- ఈ నాలుగు శత్రుబాధక క్రియలు చేసిన నైకశృంగుడు శ్రీకృష్ణుడు. (శ్రీ పరాశర భట్టు వ్యాఖ్య)

'శృంగః' అంటే 'బాధించునది' అని అర్థం.

4. *అనేక శిఖరాలు కలిగిన మహాపర్వతము వంటివాడు.*

'ఉన్నతస్వరూపుడు' అని అంతర్యం. బ్రహ్మ, విష్ణు, రుద్ర, త్రిగుణాతీత భూమికలే నాలుగు శిఖరాలు. ఈ శిఖరాలతో దీపించే మేరుగిరి స్వరూపుడు. యోగపరంగా సహస్రార స్థానం.

ఈ పరతత్త్వము శబ్దబ్రహ్మగా ప్రథమంగా వ్యక్తమైనది కనుక -

గదాఽగ్రజః.. 764

1. *మాటగా (మాటకు) ముందు జనించినవాడు.*

శబ్దం కంటె ముందున్న పరమాత్మయే, విశ్వావిర్భావానికి పూర్వం మొదటిగా వాక్కుగా వ్యక్తమయ్యాడు.

నిత్యతత్త్వమైన శబ్దబ్రహ్మమే అందరికంటె, అన్నిటికంటె ముందే జనించియున్నది.

'గద వ్యక్తాయాం వాచి' అనే ధాతువు ననుసరించి 'గద' అనగా వాక్కు. గద (వాక్కు)గా ముందు జనించినవాడు. 'గద'కు ముందు ఉన్నవాడు.

2. మాటలకు చివరి గమ్యమైనవాడు.

మాటలనగా వేదాలు. వేదాలకు కొనలో, మాటలకు అంతంలో లభించేవాడు. కొండకు చివరి కొన వలె – మాటకు శిఖరం – వేదాంతం. మనసునీ, మాటనీ దాటిన ఉన్నత అవ్యక్త భూమిక. అదే పరతత్త్వం.

3. మంత్రముతో వ్యక్తమయ్యేవాడు.

మంత్రం ద్వారా వ్యక్తమయ్యేవారు దేవతలు.

మంత్రమే దేవత. ఆ దేవతలందరూ హరిస్వరూపాలే.

మాట యొక్క గమనమే – గదాగ్రము. **'అంగతీతి – అగ్రాః'** (సత్యభాష్యం) ఆ వాక్కుల గమనానికి గమ్యమైనవాడు.

4. వాక్కులు పలికేవారిలో శ్రేష్ఠుడు.

సృష్ట్యాదిలోనే వేదాలనిచ్చినవాడు. వేదాలు స్వామి యొక్క శబ్దరూపాలు.

5. వసుదేవుని మరియొక పత్ని సునామ. ఆమె పుత్రుడు గదుడు. దేవకీవసుదేవుల పుత్రుడైన శ్రీకృష్ణపరమాత్మ ఆ గదునకు అగ్రజునిగా పుట్టినవాడు.

ఈ శబ్దబ్రహ్మ స్వరూపుడే వేదాది నాలుగు స్వరూపాలుగా, నాలుగు వైపులా వ్యక్తమైనవాడు కనుక–

చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః।
చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేదవి దేకపాత్॥ 82

765. *చతుర్మూర్తిః,* ***766.*** *చతుర్బాహుః,* ***768.*** *చతుర్వ్యూహాః,*
768. *చతుర్గతిః,* ***769.*** *చతురాత్మా,* ***770.*** *చతుర్భావః,*
771. *చతుర్వేదవిత్,* ***772.*** *ఏకపాత్.*

చతుర్మూర్తిః.. 765

1. నాలుగు మూర్తులు కలవాడు.

(అ) విరాట్, సూత్ర, అవ్యాకృత, తురీయ – అనే నాలుగుమూర్తులు కలవాడు. సమష్టి జగద్రూపుడు 'విరాట్', జగన్మయుడు 'సూత్ర', జగన్మూల మైన తత్త్వం 'అవ్యాకృత', విశ్వానికి అతీతుడైనవాడు 'తురీయ'.

(ఆ) కృతయుగంలో తెల్లని, త్రేతాయుగంలో ఎర్రని, ద్వాపరయుగంలో పచ్చని (పీత), కలియుగంలో నల్లని మూర్తులను ధరించినవాడు. చతుర్యుగమూర్తి.

(ఇ) బలభద్ర, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు అనే నాలుగు మూర్తులతో యదుకులంలో అవతరించినవాడు.

చతుర్బాహుః.. 766

1. నాలుగు బాహువులు కలవాడు.

శంఖ చక్ర గదా పద్మధారియైన నాలుగు చేతులవాడు.

దేవకీదేవికి తనయుడిగా అవతరించినప్పుడు చతుర్భుజాలతో సాక్షాత్కరించాడు.

ఉపసంహర సర్వాత్మన్ రూపమేతచ్చతుర్భుజమ్ ।
జానాతు మాఽవతారం తే కంసోయం దితి జన్మజః ॥ (విష్ణుపురాణం)

'నాలుగు చేతులతో ఉన్న నీ రూపాన్ని ఉపసంహరించుకొనుము. ఈ కంసుడు నీ అవతారాన్ని ఎరుగకూడదు' అని అవతార సమయంలో దేవకి ప్రార్థించింది.

'తేనైవరూపేణ చతుర్భుజేన సహస్రబాహో! భవ విశ్వమూర్తే ।' (భగవద్గీత)

విశ్వమూర్తి అయిన నారాయణుని నాలుగు భుజాల సౌమ్యరూపంతో ప్రత్యక్షం కమ్మని పార్థుడు ప్రార్థించాడు.

నలుదిక్కుల విస్తరించిన చైతన్య స్వరూపుడు–

చతుర్వ్యూహః.. 767

1. నాలుగు వ్యూహాలు కలవాడు.

బహ్వృచోపనిషత్తులో చెప్పబడిన విధంగా –

'శరీర పురుషశ్ఛందః పురుషో వేద పురుషో మహాపురుషః ।

శరీర పురుష, ఛందః పురుష, వేద పురుష, మహాపురుష భేదంతో నలుగురు పురుషుల వ్యూహాలు కలవాడు.

2. నాలుగు విధాలైన వాక్ స్వరూపుడు.

చత్వారివాక్ పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః ॥

(ఋగ్వేదం)

పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరి – అనే నాలుగు విధాలైన వాక్కుల అమరికగా ఉన్నవాడు.

చతుర్గతిః.. 768

1. నాలుగు విధముల గతి అయినవాడు.

సారూప్య సామీప్య సాలోక్య సాయుజ్యాలనే నాలుగు గతులుగా ఉన్నవాడు. అధికార భేదాల ననుసరించి అనుగ్రహించేవాడు.

2. శాస్త్ర విధి ననుసరించి ప్రవర్తించే నాలుగు వర్ణాలవారికీ, నాలుగు ఆశ్రమాల వారికీ గతి అయినవాడు. ఆశ్రయస్థానం.

చతురాత్మా.. 769

1. నాలుగు స్వరూపాలుగా ఉన్నవాడు.

మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం అనే నాలుగు విధాల దశలతో ఉన్న అంతఃకరణ చైతన్యస్వరూపుడు.

2. జాగ్రత్, స్వప్న, సుషుప్తి, అనే మూడు అవస్థలలో వ్యాపించిన చైతన్యస్వరూపుడు; అవస్థాత్రయాలకు అతీతమైన తురీయ తత్త్వస్వరూపుడు.

ఈ విధంగా నాలుగవస్థలలో దీపించేవాడు.

3. చతురమైన మనస్సు కలవాడు.

రాగద్వేషాది రహితమవడం వల్ల చతురమైన మనస్సు కలవాడు.

చతుర్భావః.. 770

1. నాలుగింటిని కలిగించువాడు.

ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలు ఈతని నుండే సిద్ధిస్తాయి.

చతుర్వేదవిత్.. 771

1. నాలుగు వేదములను ఎఱిగినవాడు.

నాలుగు వేదాల యధార్థ స్వరూపాన్ని తెలిసినవాడు.

ఋగ్యజుస్సామాథర్వణములనే నాలుగు విధాలుగా ఉన్న వేదం జ్ఞాన స్వరూపం. అది అనంతం. **'అనంతా వై వేదాః'**. భరద్వాజ మహర్షి కొన్ని వందల ఏళ్ళ తపస్సుతో అధ్యయనం చేసిన వేదరాశి – కేవలం పర్వతంలోని గుప్పెడంత మాత్రమేనని ప్రాచీనగాథ. వేదం, అంతరార్థం సంపూర్ణంగా తెలిసేది ఈ వేదస్వరూపుడైన విష్ణువునకే.

"వేద విదేవ చాహమ్" 'వేదాన్ని తెలిసినవాడను కూడా నేనే'- అని గీతలో పరమాత్ముని వచనం.

'చతుర్మూర్తిః' (765) నామం నుండి *'చతుర్వేదవిత్' (771)* నామం వరకు నాలుగు సంఖ్య ప్రధానంగా ఏడు నామాలున్నాయి.

జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ - అనే నాలుగు విధాల జీవులలో – నాలుగు దిక్కులలో – నాలుగు వేదాలలో – నాలుగు వాక్కులలో- నాలుగవస్థలలో వ్యాపించిన ఈశ్వర చైతన్యాన్ని ఈ క్రమంలో స్మరించారు.

ఏకపాత్..772

1. ఏకపాదము కలవాడు.

పాదం, లేక/ పదం. **పద్యతే ఇతి పదం.** వేదాదులకు గమ్యమైన ఏకస్థానం అది. నాలుగుగా కనబడ్డా, అది ఏకతత్వం. పరమపదమైన కేవలత్వమే ఏకపాత్.

2. ఈ విశ్వమంతా ఒక పాదంతోనే వ్యాపించినవాడు.

'పాదం' – నాలుగవ వంతు.

సంపూర్ణతత్వంలోని నాలుగవ వంతే ఈ విస్తృత సృష్టి.

'పాదోఽస్య విశ్వాభూతాని' (పురుషసూక్తం)

సకల భూతములూ ఈతని ఒక పాదమే!

విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ (భగవద్గీత)

'ఈ సమస్త జగతినీ నా ఏకాంశంతో (నాలుగవ భాగంతో) వ్యాపించి ఉన్నాను' అని పరమాత్మ వచనం.

3. అంతటా తానే వ్యాపించినవాడు.

సర్వమేత్య – ప్రాప్యగతో భవతీత్యర్థః. (సత్యభాష్యం)

అంతటా తానొక్కడే ఉన్న విశ్వవ్యాపకుడు.

అన్య సహాయం లేకుండానే ఒక్కడే చరించుతున్నవాడితడు.

సూర్య ఏకాకీ చరతి ॥ (యజుర్వేదం)

ఉతనోఽహిర్బుధ్న్యః శ్రుణోత్వజ

ఏకపాత్ పృథివీ సముద్రః ॥ (ఋగ్వేదం)

శన్నో అజ ఏకపాద్ దేవో అస్తు .... ॥ (ఋగ్వేదం)

తానే అంతటా నిండి విశ్వచక్రాన్ని త్రిప్పుతున్నందున –

సమావర్తోఽనివృత్తాత్మాదుర్జయో దురతిక్రమః।
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా॥ 83

773. సమావర్తః,	*774. అనివృత్తాత్మా,*	*775. దుర్జయః,*
776. దురతిక్రమః,	*777. దుర్లభః,*	*778. దుర్గమః,*
779. దుర్గః,	*780. దురావాసః,*	*781. దురారిహా.*

సమావర్తః.. 773

1. *చక్కగా తిరుగజేయువాడు.*

విశ్వచక్రాన్ని 'లెస్సగా' తిరుగజేయువాడు.

'సం' అనే ఉపసర్గ 'సమీచీనం' అనే అర్థం కలది. 'తగిన విధముగా ప్రవర్తిల్లునట్లు' ఈ విశ్వచక్రాన్ని తిరుగజేస్తున్నవాడు. మాటిమాటికి కలిగే సూర్యోదయాస్తమయాలు, కాలచక్రగమనం, యుగాల గమనాగమనాలు ... ఇవన్నీ 'ఆవర్తనాలు'. అదేవిధంగా కర్మానుగుణంగా జీవుల జనన మరణాలు. వీటన్నిటినీ 'నియమబద్ధం'గా నిర్వహిస్తున్నవాడు.

మళ్ళీ మళ్లీ పలురూపాలతో జగతిలో అవతరించువాడు.

తాను త్రిప్పే జగతియందు వ్యాపించినవాడు కనుక -

అనివృత్తాత్మా / నివృత్తాత్మా.. 774

1. *మరలని స్వరూపము కలవాడు.*

అంతటాతానే ఉన్న కారణంగా దేని నుండి మరలని నిత్యుడు.

2. *'నివృత్తాత్మా' అని గ్రహిస్తే - 'మరలినవాడు' అని అర్థం. విశ్వాన్ని నిర్వహిస్తూ, తానే అంతటా వ్యాపించినప్పటికీ, దాని నుండి విడివడి ఉన్న నిర్లేపతత్త్వమితడు.*

సంసార చక్రంలో ప్రవర్తనమే 'ఆవర్తనం'. ఇది ప్రవృత్తి మార్గం. దాని నుండి విడివడుట 'నివృత్తం'. 'సమావర్తః' నామం ప్రవృత్తినీ, ఈ 'నివృత్తాత్మా' నామం నివృత్తినీ తెలియజేస్తున్నది.

యన్ని యానం న్యయనం సంజ్ఞానం యత్ పరాయణం ।
ఆవర్తనం నివర్తనం యోగోపా అపి తం హువే ॥ (ఋగ్వేదం)
ఆ నివర్త ని వర్తయ పునర్న ఇన్ద్ర గా దేహి ।
జీవాభిర్ఘున జామయైా। (ఋగ్వేదం)
ఆ నివర్తన వర్తయ ని నివర్తన వర్తయ ।
భూమ్యాశ్చతస్రః ప్రదిశస్తాభ్య ఏనా నివర్తయ ॥ (ఋగ్వేదం)

అంతటా తానై ఉండి, అన్నిటినీ ప్రవర్తింపజేస్తూ, దేనియందు అంటని తత్త్వరూపుడు కనుకనే, ఈతనిని ఏ ఒక్కరూ తేలికగా వశం చేసుకోలేరు -

దుర్జయః.. 775

1. కష్టంతోనైనా జయించుటకు అలవికానివాడు.

ఎంతో శ్రమతో కూడా ఈతనిని సాధించలేము.

యన్న దర్శిత వానేషః కస్తదన్వేష్టు మర్హతి ?

'వీడు తనను తాను చూపకున్నట్లయితే వీనినెవడు అన్వేషించగలడు?'

ఆయన అనుగ్రహం చేత మాత్రమే ఆయనను తెలుసుకోగలం.

'చిక్కడు క్రతువుల వ్రతముల
చిక్కడు యుక్తిని...' అని పోతనగారు చెప్పినట్లుగా సాధనలకు సైతం అలభ్యుడు.

తిగ్మాయుధో అజయచ్ఛత్రు మిన్ద్రః ॥ (ఋగ్వేదం)

విష్ణుని విశ్వనియమ ప్రవర్తనని ఏ ఒక్కరూ జయించలేరు, దాటలేరు కనుక -

దురతిక్రమః.. 776

1. ఎంత శ్రమతోనైనా అతిక్రమించుటకు వీలు కానివాడు.

విష్ణుని ఆజ్ఞలను ఏ ఒక్కరూ ఉల్లంఘించలేరు.

విశ్వనియమాలే విష్ణుని ఆజ్ఞలు. వీటిని అతిక్రమించినవారు దుఃఖానికి లోనవుతారు. గ్రహనక్షత్రాదులు, కాలచక్రం, విష్ణుశక్తిచే నియమితాలు.

భయాదస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః ।

భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః॥ (కఠోపనిషత్తు)

'ఈతని శాసన భయం చేతనే అగ్ని, రవి తపింపజేస్తున్నారు. అందువల ననే ఇంద్రుడు, వాయువు, మృత్యువు కూడా పరుగిడుతున్నారు.'

మహద్భయం వజ్రముద్యతమ్ (కఠోపనిషత్తు)

'మహాభయరూపమైన వజ్రం ధరించి ఉన్నది'

ఈ పరతత్త్వాన్ని కాదన్నవారికి గతి లేదు.

వాసుదేవ మనారాధ్య కోమోక్షం సమవాప్నుయాత్ ॥

వాసుదేవుని పూజింపక మోక్షాన్ని ఎవడు పొందగలడు?

విశ్వనియతిని అతిక్రమిస్తే దుఃఖకరం కనుక – దురతిక్రముడు.

ఎంతో కష్టపడితే కానీ దొరకని తత్త్వమితడు కనుక –

దుర్లభః.. 777

1. అత్యంత కష్టంచేతనే లభించువాడు.

ఇంద్రియ నిగ్రహాదులు లేనివారికి ఆత్మతత్త్వం లభించదు. వట్టి మాటలకు ప్రాప్తించదు.

నాయమాత్మా బలహీనేన లభ్యః।

నాయమాత్మా ప్రవచనేన లభ్యః ॥

ఇంద్రియాలను జయించటమే బలం. వాడే ధీరుడు. ఈ బలం లేని వారికి భగవానుడు లభించడు.

కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్ – ఉపనిషద్వాక్యం.

ఏ ఒక్క ధీరుడో అంతర్ముఖుడై తనలోని పరమాత్మను చూడగలడు.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।

వాసుదేవ స్సర్వమితి సమహాత్మా సుదుర్లభః ॥ (భగవద్గీత)

"అనేక జన్మల సాధనల చేత చిత్తశుద్ధి పొందిన పిదప, జ్ఞానియై నన్ను పొందుతున్నాడు. 'వాసుదేవుడే సర్వము' అని గ్రహించే మహాత్ముడు అత్యంత దుర్లభుడు" అని వాసుదేవుని వచనం.

జన్మాంతర సహస్రేషు తపోజ్ఞాన సమాధిభిః ।
నరాణాం క్షీణపాపానాం కృష్ణేభక్తిః ప్రజాయతే ॥

'వేలకొలది జన్మలలో ఆచరింపబడిన తపోధ్యాన యోగ సమాధులచే, పాపాలు క్షీణించిన వారికే కృష్ణుని యందు భక్తి లభిస్తోంద'ని వ్యాసవచనం.

భక్త్యాలభ్యస్త్వ నన్యయా (భగవద్గీత) – 'అటువంటి అనన్య భక్తికే భగవానుడు లభ్యుడు'.

తస్మాప్యన్య మనస్కస్య సులభో న జనార్దనః. (విష్ణు ధర్మోత్తర పురాణం)
అన్య విషయాలపై మనసుపడినవానికి విష్ణువు సులభుడు కాడు.

అప్రాప్యః కేశవో రాజన్! యిన్ద్రియైరజితైః నృణాం (భారతం)

'ఇంద్రియాలను జయించని వారలచే కేశవుడు పొందబడడు. ఇంతటి శ్రమ లేనివారు చేరుటకు సాధ్యం కాని వాడు కనుక –

దుర్గమః. 778

1. *ఎంతో శ్రమ చేతనే తెలియబడువాడు.*

తేలికగా తెలియబడని తత్త్వమది.

మనోవాక్కులకు కూడా అందని తత్త్వం కనుక – అది దుర్గమము. ప్రవేశించుటకు వీలుకానిది.

'ఇతరులకు నిను నెరుగతరమా' అని అన్నమయ్య,

'తెలియలేరు రామభక్తిమార్గమును' అని త్యాగయ్యభగవానుని దుర్గమత త్వాన్ని కొనియాడారు.

అన్నిటికీ అతీతమైన, పరమ గమ్యమైన తత్త్వమే దుర్గమము. అవిద్యాది

ఆవరణల చేత జీవుడు వాటిని ఛేదించి, ఆవల నున్న పరతత్త్వాన్ని అందుకోలేకపోతున్నాడు.

సుగేభిర్దుర్గమతీతా ॥ (ఋగ్వేదం)

ఈ దుర్లభ దుర్గమ స్వరూపుడు కనుకనే –

దుర్గః.. 779

1. *ప్రవేశింప సాధ్యం కానివాడు.*

కష్టపడితేగానీ ఏ వస్తువు లభించదు. మరి పరమ వస్తువైన పరమార్థాన్ని పొందాలంటే అంత తేలికా? **'ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము?'** (అన్నమయ్య)

అనంతం, అపరిమితం, అవిద్యకు అతీతం కనుక –

మాయావృతులైన జీవులకు ప్రవేశం కష్టం.

యోగమార్గంలో ఎదురయ్యే ఎన్నో విఘ్నాలను దాటినవాడు మాత్రమే చేరగలిగే చోటు అది.

ఇతరులు ప్రవేశింప వీలుకాని దానిని 'దుర్గము' అంటారు. అది దానిని ఆశ్రయించినవారిని, ఇతరుల దాడుల నుండి రక్షిస్తుంది. అదేవిధంగా పరమాత్మను చేరినవారికి, ఇంక మాయావిఘ్నాలు తాకవు. అతడు సర్వ భద్రపదస్వరూపుడు.

దురావాసః.. 780

1. *ఎంతో శ్రమతో నిలుపుకొనబడువాడు.*

యోగులు ధ్యానాది సాధనలతో ఎంతో శ్రమతో తమ హృదయాలలో ఆ పరతత్త్వాన్ని ఆవాసింపజేస్తున్నారు. నిలుపుకొంటున్నారు.

2. *భరింపలేని వాటిని తన యందు వసింపజేయువాడు.*

దుర్ధరాణాం ఆవాసః స్థానం యస్మిన్ సదురావాసః (సత్యభాష్యం)

సూర్యచంద్ర, అంతరిక్షాది, మహా'దుర్ధరా'లను (ధరించుటకు సాధ్యం కాని వాటిని) తనయందు ధరింపజేస్తున్నవాడు.

3. దుఃఖానుభవం పొందుతున్న దేహాదులలో సైతం వసించే, వసింపజేసే ఆత్మ స్వరూపుడు.

'దుర్ధరమిదం పార్థివం శరీర మావాసయతి' (సత్యభాష్యం)

తన కోసం ఎంతో శ్రమతో ప్రయత్నించే వారికి ఎదురయ్యే ప్రతికూలాలను తొలగించే వాడు కూడా ఇతడే కనుక –

దురారిహా.. 781

1. దుష్టులైన శత్రువులను హింసించువాడు.

దుఃఖం ప్రాపయతీతి దురారిః. దుఃఖాన్ని కలిగించేవారు దురారులు. దైత్యులు. దుర్మతులు. వారిని తొలగించి విశ్వధర్మాన్ని రక్షించేవాడు విష్ణువు. ఈ అనుగ్రహం చేతనే దుర్లభాన్ని కూడా సులభం చేస్తున్నాడు.

ఆసురీ ప్రవృత్తులను సంహరింపజేసి, తన తత్త్వాన్ని ఎరుకపరచువాడు.

✣ ✣ ✣

'దుర్జయః' (775) నామం నుండి ఈ 'దురారిహా', (781) నామం వరకు ఏడునామాలు – తత్త్వపరంగా పరబ్రహ్మను ప్రకటిస్తున్నాయి. మంత్రపరంగా గమనించితే శత్రు బాధానిర్మూలనమైన నామాలివి. దుర్గతులను తొలగించి, ధర్మహింసకులైన ఆసురీప్రవృత్తులను హరించే ప్రతాపస్వరూపం ఈ నామాలలో వ్యక్తమౌతోంది. 'దుర్గా' స్వరూపంగా ఈ తత్త్వమే 'దేవీ' వైభవంగా వేదపురాణాల్లో వ్యక్తమౌతోంది. విష్ణుతేజమే 'దేవీ' రూపంలో వైష్ణవి అయిన దుర్గ.

తాం దుర్గాం దుర్గమాం దేవీం దురాచారవిఘాతినీం ।
నమామి భవభీతోహం సంసారార్ణవ తారిణీమ్ ॥ (దేవ్యుపనిషత్తు)

'దుః' శబ్దం ద్వారా చెప్పబడే 'అసాధ్యాలను' తొలగించేవాడే 'దురారిహా'.

మాయారూప విఘ్నాలను తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించే పరమేశ్వర కారుణ్యం ఈ నామాల క్రమంలో గోచరిస్తోంది.

✣ ✣ ✣

దుర్గతులను తొలగించి, శుభగతిని ప్రసాదించడం చేతనే –

శుభాంగో లోకసారంగః సుతంతు స్తంతువర్ధనః।
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాఽఽగమః॥ 84

782. శుభాఙ్గః, 783. లోకసారఙ్గః, 784. సుతన్తుః,
785. తన్తువర్ధనః, 786. ఇన్ద్రకర్మా, 787. మహాకర్మా,
788. కృతకర్మా, 789. కృతాగమః.

శుభాఙ్గః.. 782

1. శుభమైన రూపము కలవాడు.

అంగతి గచ్ఛతీతి గమయతీతి వా అంగః. (సత్యభాష్యం)

జగతిని శోభామయంగా నడుపువాడు, శోభమానంగా జగమంతా వ్యాపించినవాడు. సూర్యాది విశ్వగమనాలన్నీ శుభకరమైనవి. వాటిని సాగించువాడు.

క్షేత్రాదపశ్యం సనుతశ్చరన్తం సుమదం యూథం న పురు శోభమానమ్ ॥
(ఋగ్వేదం)

ఈ శుభ స్వరూపం శాస్త్రసారం ద్వారానే పొందబడుతోంది –

లోకసారఙ్గః.. 783

1. లోకసారాన్ని గ్రహించువాడు.

జగతి యొక్క సారాన్ని గ్రహించేవాడు పరమాత్మయే.

'సారమ'నగా రసం. లోకానికి సారం పరతత్త్వమే. దానిని పొందే వరకే

జీవ భావం. పొందిన తరువాత ఆ పరమాత్మతో అభేదం కలుగుతుంది, పొందినవాడు కూడా అదే అవుతున్నాడు.

ప్రజాపతిర్లోకా నభ్యతపత్ (ఛాందోగ్యోపనిషత్తు)

'ప్రజాపతి లోకసారాన్ని గ్రహించు తలపుతో తపస్సు నాచరించాడు'

ప్రథమ ప్రజాపతి రూపుడుగా ఉన్న పరమేశ్వరుడు 'సారంగము' (తుమ్మెద - పూల 'రసాన్ని' గ్రహించునది) వలె, లోకసారాన్ని గ్రహించాడు.

2. *లోకసారం భగవత్ప్రేమ. దానిని గ్రహించే భగవానుడు లోకసారంగుడు.*

తదహం భక్త్యుపహృతం అశ్నామి ॥ (భగవద్గీత)

3. *లోకంలోని సారాన్ని - అనుభవాన్ని - గ్రహించే జీవాత్మగా భాసించునది ఈతడే.*

4. *లోకమనగా శాస్త్రం. వేదాది శాస్త్రాల సారం ప్రణవం. ఆ ప్రణవం చేత తెలియబడే (గమ్యతే) పరతత్త్వమే విష్ణువు.*

5. *జగతిలోని రసాన్ని గ్రహించే ఆదిత్యరూపుడు.*

లోకసారాన్ని గ్రహించి విస్తృత పరచుతున్నందున -

సుతన్తుః. 784

1. *చక్కగా విస్తరింపబడిన జగత్స్వరూపుడు.*

శోభనమైన ప్రపంచంగా విస్తరించినవాడు.

తను విస్తారే - తన్యతే ఇతి తన్తుః - విస్తరింపజేయునది.

ఈ ప్రపంచాన్ని సృష్టించి తానే వ్యాపించి విస్తరింపజేసినవాడు.

యో యజ్ఞో విశ్వతస్తన్తు భిస్తత ఏకశతం దేవ కర్మేభిరాయతః ॥ (ఋగ్వేదం)

తన్తుం తనుష్వ పూర్వ్యం సుత సోమాయ దాశుషే ॥ (ఋగ్వేదం)

విస్తరించిన జగతిని కొనసాగిస్తున్నందున -

తన్తువర్ధనః.. 785

1. తన్తువును పెంచువాడు.

ఏది ఎంతకాలముండాలో అంతవరకు పెంచువాడితడు. విశ్వాన్ని విస్తరిల్లజేసి, వర్ధిల్లజేస్తున్నవాడు. సాగించువాడు.

వర్ధయతి గమయతి.

వృద్ధి పొందించి నశింపజేయువాడు కూడా ఇతడే.

(వర్ధయతి ప్రాపయతి ఛేదయతి వా)

విశ్వంబుయెవ్వని విపుల క్రియాశక్తి

పెరుగుచున్నది తీగ పెంపుగాగ.. (శ్రీనాథుడు,కాశీఖండం)

ఈ రెండు నామాలు ముండకోపనిషత్తు వర్ణించిన ఊర్ణనాభ వృత్తాంతాన్ని స్ఫురింపజేస్తున్నాయి. సాలీడు తన నుండి తన్తువును (దారాన్నీ) వెలికితీసి గూడును విస్తృతపరచి, తిరిగి తనలోనే లీనం చేసుకొనునట్లుగా – పరమాత్ముని నుండి వెలికి వచ్చిన ఈ విశ్వం, తిరిగి ఆయనలోనే లీనమవుతోంది.

కర్మపాశబద్ధులైనవారికి జన్మల తన్తువును వృద్ధిపరచు కర్మఫలప్రదాత. జ్ఞానులకు ఆ జననమరణ రూప సంసార తన్తువును ఛేదించువాడు.

2. సంతానమును, వంశమును వృద్ధి పరచువాడు.

'ప్రజాతన్తుం మావ్యవచ్ఛేత్సీఃʼ – అని తైత్తిరీయోపనిషత్ వాక్యం.

సంతాన తన్తువును ఛేదించరాదు – అని గృహస్థాశ్రమ స్వీకారానికి బోధ.

విశ్వాన్ని విస్తరింపజేసే చతుర్ముఖాది సంతానాన్ని వృద్ధిపరచి, వారి ద్వారా ప్రపంచాన్ని నడిపిస్తున్నవాడు.

విశ్వానికి కావలసిన ఐశ్వర్యాలను సమకూర్చి నిర్వహిస్తున్నవాడు కనుక–

ఇన్ద్రకర్మా.. 786

1. ప్రకాశవంతమైన, ఐశ్వర్యశాలియైన కర్మలను చేయువాడు.

'ఇది ఐశ్వర్యే', 'ఇన్ధ దీప్తౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి– ఐశ్వర్యశాలి,

ప్రకాశస్వరూపుడైన పరమేశ్వరుడు ఇన్నుడు. తన ఐశ్వర్యాన్నీ ప్రకాశాన్నీ ప్రకటించుతూ, వ్యాపింపజేస్తున్న కర్మలను నడుపువాడు. విశ్వమంతా ఆయన విభూతులు, వెలుగులే నిండి నడిపిస్తున్నాయి. పృథివి ధరించుట, సూర్యుడు వెలుగుట, గాలి వీచుట ఇవన్నీ చైతన్య (ప్రకాశ)వంతమైన ఐశ్వర్య కర్మలు.

ఇన్ద్రస్య కర్మ సుకృతా పురూణి
వ్రతాని దేవా న మినన్తి విశ్వే।
దాధార యః పృథివీం ద్యాముతేమాం
జజాన సూర్య ముషసం సుదంసః ॥ (ఋగ్వేదం)

2. *ఇన్ద్రాది దేవతల ద్వారా జరిగే కర్మలన్నీ నారాయణునివే. వారికి ఆజ్ఞనీ, శక్తినీ ప్రదానం చేసి తద్వారా జగన్నిర్వహణ చేస్తున్న పరబ్రహ్మ ఇతడే.*

త్రిలోకపాలనలో అసురాదుల వల్ల విఘాతాలేర్పడినప్పుడు, ఇన్ద్రాదులు విష్ణుని ఆశ్రయించి, తమ కర్మలను ఆయన ద్వారా చక్కబెట్టుకున్నారు. ఇన్ద్రాదుల ప్రార్థన మేరకు అవతరించి చేసే కర్మలన్నీ విష్ణుని దేవహిత, లోకహిత కర్మలు.

3. *ఇన్ద్రియాలను ప్రకాశింపజేసే జీవచైతన్యమే ఇన్ద్రుడు- అని తాత్త్వికుల మాట. ఈ జీవుని కర్మలన్నీ, తత్త్వతః, పరమాత్ముని ప్రకాశం చేతనే జరుగుతున్నవి.*

దేవతలను, జీవులను నడిపే గొప్పపనుల పరమేశ్వరుడు కనుక -

మహాకర్మా..... 787

1. *గొప్ప కర్మలు చేయువాడు.*

మహదహంకారాలను, మహాభూతములైన ఆకాశాదులను నిర్మించి నిర్వహించే గొప్ప కర్మలు ఈ పరమేశ్వరునివే. సృష్టి స్థితి లయాది ఈశ్వర కృత్యములు మహాకర్మలు.

యంకర్మభిర్మహద్భిః సుశ్రుతోఽభూత్ ॥ (ఋగ్వేదం)

ఇన్ని చేస్తున్నా 'చేయాలి' అనే కర్తవ్యకర్మ లేని పరిపూర్ణుడు కనుక-

కృతకర్మా..... 788

1. చేయబడిన కర్మ కలవాడు.

జ్ఞాని అయినవాడు **'కర్తవ్యమకర్తవ్యమ్'** (చేయవలసినది, చేయకూడనిది) అనే ద్వంద్వాలకు అతీతుడు.

అతడికి కొత్తగా పొందవలసినదీ, చేయవలసినదీ ఉండదు. దేహాది ధర్మాలు కర్తవ్యంగా కాకుండా, నిమిత్తమాత్రంగా జరుగుతాయి.

ధర్మరూపమైన కర్మను చేయడమే తప్ప, దానితో సంగము కానీ, 'చేయాలి' అనే కర్తవ్యనిష్ఠకానీ భగవానునికి లేదు. నిత్యకృతార్థుడు.

2. తాను సంకల్పించగానే జరిగినది స్వామి కర్మ కృతం. అది అమోఘం.

కృతం నశ్వఫ్ఫ్ని విచినోతి దేవకే సంవర్గంయన్మఘువా సూర్య జయత్ ॥
(ఋగ్వేదం)

3. ఇతరులు చేయలేని వాటిని చేసినవాడు.

అంతేకాదు. ఈ జగతిలో సృష్టిస్థితిలయాదులు, సూర్యోదయాస్తమయాదులు అన్నీ నిత్యమూ చేసే పనులే. ఇవే కృతములు. చేసినవే చేస్తున్నవాడు కృతకర్ముడు.

వీటినే మాటి మాటికీ చేస్తూ, జగతికి ఆధారమైన శబ్దజ్ఞానాన్ని చేసినవాడు కనుక –

కృతాగమః..... 789

1. వచ్చిన వాటిని చేయువాడు.

నిరంతరాయంగా వస్తున్న జగత్కర్మలే ఆగమాలు. వచ్చీపోయే – తిరిగి ఆగమించే కర్మలను చేసినవాడు.

2. వేదాదులను ఏర్పరచినవాడు.

వేదాది శాస్త్రాలు పరమాత్ముని నుండి వచ్చిన శబ్ద రూపాలు కనుక 'ఆగ మాలు' అని పేరు. వాటిని ఏర్పరచి జగద్ధితానికై బ్రహ్మకు, తద్వారా జగతికి

ప్రసాదించినవాడితడు. వాటిని మత్స్య, హయగ్రీవాది పలు అవతారాలలో తిరిగి పరిరక్షించి అందించినవాడు.

అస్యమహతో భూతస్య నిఃశ్వసితమేతద్యదృగ్వేదః ॥(బృహదారణ్యకోపనిషత్తు)

'ఈ మహాభూతపు (పరమాత్ముని) ఊర్పులే ఋగ్వేదము'.

అన్నిటికీ ఉన్నతుడై ఉంటూ, జగద్రక్షణకై గొప్పగా ఆవిర్భవిస్తున్నందున–

ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః।
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ॥ 85

790. ఉద్భవః, 791. సుందరః, 792. సుందః, 793. రత్ననాభః,
794. సులోచనః, 795. అర్కః, 796. వాజసనః, 797. శృఙ్గీ,
798. జయన్తః. 799. సర్వవిజ్జయీ.

ఉద్భవః..790

1. *గొప్పగా కలిగినవాడు.*

తన ఇచ్ఛతో వివిధావతారాలను ఉత్కృష్టంగా ధరించినవాడు. **'జన్మకర్మ చ మే దివ్యం'** – 'నా జన్మ కర్మలు దివ్యమైనవి' – అని 'గీత'లో పరమాత్ముని మాట. లీలామయములైన, అమోఘ కర్మలతో కూడిన అద్భుతమైన అవతారధారి కనుక, ఉద్భవుడు.

2. *మీదుగా ఉన్నవాడు.*

ఉత్ – ఉచ్చైర్భవనం యస్యసః (సత్యభాష్యం)

ఊర్ధ్వంగా భాసిస్తూ జగతిని భాసింపజేస్తున్న సూర్యుని వలె అన్నిటికీ అతీతుడై అన్నిటినీ చైతన్యవంతం చేస్తున్నవాడు.

ఊర్ధ్వగతిలో జ్వలించే 'అగ్ని'రూపుడు.

ఉద్యన్నద్య మిత్రమహ ఆరోహన్నుత్తరాం దివమ్ ॥ (ఋగ్వేదం)

ఉద్యన్తం త్వా మిత్రమహో దివే దివే జ్యోగ్జీవాః ప్రతిపశ్యేమ ॥ (ఋగ్వేదం)

ఉదన్యేన జ్యోతిషా యాసి సూర్య ॥ (ఋగ్వేదం)

ఉత్తిష్ఠసి స్వాహుతో ఘృతాని ప్రతిమోదసే ॥ (ఋగ్వేదం)

3. జగతికి, జీవులకు ఉచ్చస్థితిని (ఉత్కృష్టతను) కలిగించువాడు.

అందమైన స్వరూపంతో, కరుణతో, సద్గుణాలతో శోభిస్తూ, వాటిని తన చూపులతో ప్రసరింపజేస్తున్నందున –

సుందరః.. 791

1. అందమైనవాడు.

విశ్వంలో అందరి సౌభాగ్యాన్నీ మించిన సౌభాగ్యం కలవాడు. ఇతరుల చూపుకి ఇంపు కలిగించే చక్కదనం, స్వభావం – 'సౌభాగ్యం'. అటువంటి అందమైన స్వరూపం, స్వభావం కలవాడు. తత్త్వం, గుణం, లీల, రూపం– అన్నీ అందాలే.

నిర్దోషమైన అందం కలవాడు.

రూపౌదార్య గుణైః పుంసాం దృష్టి చిత్తాపహారిణమ్ ॥

(వాల్మీకి రామాయణం)

రూపంతో ఉదారగుణాలతో సర్వజీవుల దృష్టినీ, చిత్తాన్నీ అపహరించే శ్రీరాముని సౌందర్యాన్ని ఆదికవి వర్ణించాడు. **'సర్వసత్త్వమనోహరః'** – 'సర్వ ప్రాణులకు మనోహరుడు'.

'సౌభాగ్యసీమ తదిదం వ్రజభాగ్యసీమ' – అని లీలాశుకుడు శ్రీకృష్ణకర్ణామృతంలో కీర్తించాడు.

శాశ్వతం, దోషరహితం, నిర్మలం, ఆనందకరం – అయిన నిరుపమాన సౌందర్యం కలవాడు విష్ణువు.

2. ఆనంద స్వరూపుడు.

సుతరాం ఆద్రియతే ఇతి సుందరః.

చక్కగా (అందరిచే) ఆదరింపబడేవాడు సుందరుడు. అందరికీ ఆదరణమైనది 'ఆనందం'. ఆ అఖండానంద సత్యజ్ఞానానన్త స్వరూపుడు విష్ణువు.

చన్దురువర్ణని అందచందములు హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు' (త్యాగయ్య)

చన్ద్రుని వలె ఆహ్లాదకరమైన ప్రసన్న సుందరుడు పరమాత్మ. హృదయంలో ఆ దివ్య సౌందర్యాన్ని ధ్యానించేవారు బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నారు.

3. చక్కగా చెక్కిన (చీల్చిన)వాడు.

ఇది ఒక చిత్రమైన అర్థాన్ని చెబుతోంది. కానీ ఔచితీమంతంగా ఉంది కనుక గ్రహించవచ్చు.

సుష్ఠు (నిర్దోషం) విదారణం యః కురుతే స సున్దరః (సత్యభాష్యం)

దోషరహితంగా చక్కగా చెక్కేవాడు సున్దరుడు.

విశ్వంలో అనేక రూపాలు. అవి చక్కగా చెక్కబడ్డాయి.

అంతా ఒక ముద్దలా ఉంటే అందం లేదు – కర్ణాలు, నాసిక, ముఖం... ఇలా వివిధావయవాలు మానవోపాధులలో చెక్కబడ్డాయి. వృక్షాలకు శాఖలు, పర్వతాలకు గుహలు ... ఇలా తగిన విధంగా తొలచబడిన భాగాల వల్లనే అందం ఏర్పడుతుంది. శిల్పి ఒక రాతిని వివిధ అవయవాలుగా చెక్కి, తొలచి ఆకృతినిచ్చినట్లు – అందంగా వివిధాకృతులను చెక్కినవాడు. అందంతో పాటు అపారమైన దయ కలిగినవాడు కనుక –

సున్దరః.. 792

1. చక్కగా తడిగా నుండువాడు.

సు ఉనత్తి – సమ్యక్ క్లేదయతీతి సున్దరః.

చక్కగా ఆర్ద్రతనందువాడు – ఆర్ద్రతనందించువాడు.

భక్తుల హృదయాలు స్వామి భావనతో ఆర్ద్రమౌతాయి.

స్వామి, భక్తుల పట్ల కరుణార్ద్రుడు. అపారమైన కరుణ కలవాడు. చక్కని ఆర్ద్రత – సంపూర్ణంగా అనుగ్రహించే సమగ్ర కారుణ్యం స్వామి దివ్యగుణం.

2. మేలు నిచ్చువాడు.

సుం సౌష్ఠవం దదాతి – సున్దుఃః, 'సు' అనగా సమృద్ధి (సుష్మ) మేలు, శుభం, సంపూర్ణత. వీటిని ప్రసాదించువాడు సున్దుడు.

3. మేఘాదులతో వర్షించి ఆర్ద్రపరచే రసస్వరూపుడు.

జగతిలో ఆర్ద్రత కలిగించే సూర్య, పర్జన్యాది రూపుడై, ప్రతి పదార్థంలో తేమను కలిగించి కాపాడే చైతన్యం ఈతడే.

పుష్ణామి ఓషధాస్సర్వే సోమో భూత్వా రసాత్మకః (గీత)

'ఓషధులన్నిటికీ పుష్టిని పొందించే రసాత్మకుడైన సోముడితడు'

ఈశే యో వష్టేః .... అపాం నేతా ॥ (ఋగ్వేదం)

సుందరుడై, సౌష్ఠవాన్నిచ్చే దివ్య గుణాలన్నీ తనలోనే కలిగి ఉన్నందున –

రత్ననాభః.. 793

1. *సంపదలు, సద్గుణాలు రత్నాలు. వాటిని తనయందు కలిగినవాడు – రత్ననాభుడు. (నహ్యతి బధ్నాతీతి నాభిః)*

ఏకః సముద్రో ధరుణో రయీణామ్....

ఉత్సస్య మధ్యే నిహితం పదం వేః ॥ (ఋగ్వేదం)

విశ్వస్యనాభిం చరతో ధ్రువస్య కవేశ్చిత్ తన్తుం మనసా వియన్తః ॥ (ఋగ్వేదం)

2. శ్రేష్ఠమైన నాభి కలవాడు.

రత్నములచే అలంకృతమైన నాభి – రత్నమువంటి నాభి కల సున్దరుడు. రత్నమనగా శ్రేష్ఠం. బ్రహ్మను పుట్టించిన శ్రేష్ఠ పద్మమే స్వామి నాభి నుండి ఉద్భవించింది.

3. **రమయతీతి రత్నం. రము క్రీడాయామ్.** ఆనందింపజేసే లక్షణం కలది రత్నం. ఆ ఆనందానికి కేన్ద్రమైనవాడు. క్రీడామయమైన విశ్వానికి కేన్ద్ర (మూల)మైనవాడు.

ఋతస్య నాభిరమృతం విజాయతే ॥(ఋగ్వేదం)

చత్రసో నాభో నిహితా అవోదివః ॥ (ఋగ్వేదం)

రాస్వరత్నాని దాశుషే ॥ (ఋగ్వేదం)

హోతార ం రత్న ధాతమమ్ ॥ (ఋగ్వేదం)

విశ్వంలోని రమణీయతలకీ, ఐశ్వర్యాలకీ నిధానమీతడు.

గాయన్తి త్వా గాయత్రిణోర్చన్త్యర్క మర్కిణః ॥ (ఋగ్వేదం)

సర్వజగతిచే పొగడబడే సూర్యభగవానుడు 'అర్క' నామంచే ప్రసిద్ధుడు. ఆ ఆదిత్యరూపుడైన నారాయణుడు.

మంచి చూపుగా (సులోచనః), సర్వ పూజ్యుడై జగతికి గతినిస్తూ, పోషిస్తున్నందున –

సులోచనః.. 794

1. *సమగ్రమైన, అందమైన చూపు కలవాడు.*

చక్కని దర్శనశక్తి స్వరూపుడైన సూర్యుడే సులోచనుడు. వెలుగునిచ్చే సూర్యుడు, చలువనిచ్చే చన్ద్రుడు – స్వామి నేత్రాలు. జ్ఞానకాంతిని, శాంతిశీతలతనీ ప్రసాదించే కరుణామయ నేత్రాలు. అవి సమగ్ర దర్శనం కలిగినవి. జ్ఞానస్వరూపాలు.

యస్య సూర్యశ్చక్షుశ్చన్ద్ర మాశ్చ పునర్ణవః ॥ (అథర్వవేదం)

అంతటినీ గమనించి మేలు కలిగించే చూపులవాడు.

"నల్లనివాడు పద్మనయనమ్ములవాడు
కృపారసంబుపై జల్లెడి వాడు..."

పూర్ణదర్శన శక్తి కలవాడు కనుక – ఈతడే సూర్యుడై పూజింపబడుతున్నాడు.

అర్కః.. 795

1. *అర్చింపబడువాడు – స్తుతింపబడువాడు.*

'ఋచః స్తుతౌ – అర్చ్యతే స్తూయతే ఇత్యర్కః' –

పూజ్యులైన బ్రహ్మాదుల చేత కూడా పూజింపబడేవాడు, స్తుతింపబడేవాడు. వేదమంత్రాలన్నీ ఈ పరమేశ్వరునే స్తుతించుతున్నాయి.

ఉత్కృష్టంగా కలిగే స్వామి భవములన్నీ అందమైనవే -

వాజసనః.. 796

1. అన్నములనిచ్చువాడు.

'వాజసనిః' అని 'వైదికపాఠం'.

వాజములనగా అన్నములు - జీవింపజేసే ఉపకరణములు. వాటిని ప్రసాదించువాడు వాజసనుడు. ప్రతి జీవికి ఇన్ద్రియాలచే పొందబడే అన్నాలను (ఐశ్వర్యాలను) ప్రసాదించే దాత ఈతడే. అర్థులకు అభీష్టాన్నాలను అందించువాడు.

2. సూర్యరూపుడైన అన్నప్రదాత. వర్షాదుల ద్వారా, కిరణశక్తి ద్వారా అన్నాన్ని అందిస్తున్నవాడు.

వాజసనిర్హరి వో విద్యయోధాః ॥ (ఋగ్వేదం)

వాజసనిం పూర్భిదమ్ ॥ (ఋగ్వేదం)

వాజసనిం రయిమస్మే సువీరం ప్రశస్తం ధేహి

యశసం బృహన్తమ్ ॥ (ఋగ్వేదం)

దృష్టినీ, అన్నవృష్టినీ అందించే ప్రకాశరూప కిరణాలు కలవాడు కనుక -

శృఙ్గీ.. 797

1. ప్రకాశం కలవాడు.

'శృఙ్గాణి జ్వలతా నామధేయాని' అని నిఘంటువు. **శృంగమితి దీప్తేర్నామ** (సత్యభాష్యం).

శృంగమనగా దీప్తి, జ్వాల. ప్రకాశస్వరూపాలైన కిరణాలే శృంగాలు.

వాటిని కలిగిన ఆదిత్యాగ్నిరూపుడు, అన్నిటినీ భాసింపజేసే జ్యోతిః స్వరూపుడు నారాయణుడు శృఙ్గీ.

763వ (నైకశృఙ్గఃు) నామం దగ్గర ఈ శబ్ద వివరాన్ని గమనించవచ్చు. వరాహ, మత్స్యావతారాలలో శృంగంతో భాసించిన విష్ణువు.

శృఙ్గిణో వజ్రబాహుః ॥ (ఋగ్వేదం)

వి శృఙ్గిణ మభినచ్ఛుష్ణమిన్ద్రః ॥ (ఋగ్వేదం)

తన దివ్యప్రకాశంతో అన్నిటినీ మించినవాడు కనుక –

జయన్తః.. 798

1. జయించువాడు.

జయమనగా అధిక్యం. 'మించిపోవుట'. అందరినీ జయించి, మించి ప్రకాశించే జయహేతువు విష్ణువు. అనేకులైన దైత్యులను జయించిన జయశీలుడు. అన్నిటినీ తన వశంలో ఉంచినవాడు.

2. పురుషార్థ సాధనమే జయం. ధర్మార్థకామమోక్షాలను సర్వులకు సాధించువాడు.

జయన్తం త్వా మనుమదే సోమ॥ (ఋగ్వేదం)

జయశీలురలోని బలం ఈతడే.

ఈయన జయంలో జ్ఞానం, జ్ఞానంలో జయం ఉన్నవి కనుక –

సర్వవిజ్జయీ.. 799

1. అన్నీ తెలిసినవాడు – జయశీలుడు.

తెలిసిన వాడే జయించగలడు. సర్వ విషయ జ్ఞానం కలవాడు విష్ణువు. 'సర్వం విష్ణుమయం' అన్నదే జ్ఞానం. ఈ జ్ఞానమే అజ్ఞానమనే మహాశత్రువును జయించేది.

ఈ సర్వమయ జ్ఞాన స్వరూపుని వల్లనే లోపలి రాగద్వేషాది శత్రువులు జయింపబడతాయి. బయటి హిరణ్యాక్షాది ఆసురీశక్తులు నశింపబడతాయి.

2. అన్నీ తెలిసిన వారిని జయించేవాడు.

సర్వశాస్త్రాది జ్ఞానములు తెలిసిన వారిని కూడా మించిపోయే సర్వజ్ఞుడు. జ్ఞానమూలమైన ప్రణవస్వరూపుడు కనుక –

సువర్ణబిందు రక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః।
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః॥ 86

800. *సువర్ణబిన్దుః,* ***801.*** *అక్షోభ్యః,* ***802.*** *సర్వవాగీశ్వరేశ్వరః,*
803. *మహాహ్రదః,* ***804.*** *మహాగర్తః,* ***805.*** *మహాభూతః,*
806. *మహానిధిః.*

సువర్ణబిందుః.. 800

1. ఓంకారస్వరూపుడు.

శోభన (శుభ) వర్ణాలు కలిగిన మంత్రస్వరూపుడు.

శుభమైన 'ఓ' అనే వర్ణానికి బిందువు (మ్) కలవగా ఏర్పడిన 'ఓం'కారం ప్రణవం. ఇది నారాయణ బ్రహ్మ స్వరూపం.

'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' అని శ్రుతి వాక్యం.

ప్రణవరూపుడు, ప్రణవార్థము ఇతడే.

2. బంగారు అవయవములు కలవాడు.

మేలైన వన్నె కల బిందువులు (అవయవములు) కలవాడు.

'బిది అవయవే' అని ధాతువు. **బిన్దితి – అవయవాన్ కరోతీతి బిన్దుః** – భక్తానుగ్రహార్థం మేలైన మేలిమివన్నె కలిగిన దివ్యమంగళ విగ్రహాన్ని ధరించినవాడు. సూర్యమండలాంతర్వర్తియైన సువర్ణ పురుషుడు.

ఆ ప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః (ఛాందోగ్యోపనిషత్)

జ్ఞాన ప్రకాశంతో మెరిసే చిన్మయవిగ్రహుడు.

3. జగతిలో ప్రతి వస్తుజాలానికి మేలు కలిగించే అవయవాలను ఏర్పరచే విశ్వశిల్పి.

4. గగనంలో బంగారు బిందువుగా (వృత్తంగా) భాసించే ఆదిత్యరూపుడు.

తేజోమయత్వమే సువర్ణం. అదే విశ్వవృత్తానికి కేంద్రబిందువైన నారాయణ స్వరూపం.

5. సు-వర్ణములే .... అక్షరములే తన అవయవాలుగా కలిగిన వాక్స్వరూపుడు.

మంచి అక్షరాలు అనగా మంత్రాలు. ఆ మంత్రాలే తన అవయవాలుగా కలిగిన వేద స్వరూపుడు.

6. సువర్ణం - అనగా నామరూపాత్మకమైనది.

బిందువు - నామరూపరహితమైనది.

సగుణంగా సువర్ణుడు. నిర్గుణంగా బిందుస్వరూపుడు.

ఈ తేజోమయస్వరూపం ఏ వికారాలకీ లోనుకానిది కనుక -

'అక్షోభ్యః' (801)

-'విష్ణువిద్య' (శ్రీవిష్ణు సహస్రనామ భాష్య గ్రంథం)లో
అష్టమ శతకము సంపూర్ణము -

అక్షోభ్యః..... 801

1. కలత పరచబడదు.

రాగద్వేషాది దోషాలుగానీ, శబ్ద స్పర్శరూపరస గంధాలనే ఇంద్రియ విషయాలుగానీ ఈయనను కలవరపరచలేవు. దైత్యులు ఈతనిని క్షీణింపజేయలేరు. నిశ్చలమై, నిర్వికారమైన శుద్ధజ్ఞాన స్వరూపుడు.

ఈతనిచే వ్యవస్థ చేయబడి చలిస్తున్న విశ్వం, ఈతనిని చలింపజేయలేదు.

క్షోభణశ్చర్షణీ నామ్ ॥ (ఋగ్వేదం)

ఈ జ్ఞానమే సర్వవాక్కులకీ, వాక్పతులకీ లక్ష్యమైనది, వాక్కులకు అతీతమైనది -

సర్వవాగీశ్వరేశ్వరః.. 802

1. అన్ని వాక్కులలో సమర్థులైనవారికి ఈశ్వరుడు.

మహర్షులు, బృహస్పతి, బ్రహ్మాదులు– వాగీశ్వరులు. వాక్కు అనే ఐశ్వర్యం సమృద్ధిగా కలవారు. వారందరికీ శాసకుడు, అధికుడు విష్ణువు. వారందరి వాగైశ్వర్యాలకీ మూలమైన ఐశ్వర్య స్వరూపుడు.

వేదాదులే వాగ్రూప ఐశ్వర్యాలు. వాటియందు సమర్థులు బ్రహ్మాదులు. ఆ వేదాలకు మూలమైన ఈశ్వరుడు విష్ణువు.

వాచస్పతి ర్వాచన్నః స్వదతు ॥ (యజుర్వేదం)

2. వైఖరి నుండి పరా వరకు అన్ని వాక్కులకీ అధీశ్వరుడు, అతీతుడు.
3. వాక్కులనగా మంత్రాలు. వాగీశ్వరులు మంత్రాధిదేవతలు. మంత్రాధి దేవతలందరికీ దైవమైన పరమాత్మ సర్వ వాగీశ్వరేశ్వరుడు. సంపూర్ణ జ్ఞానస్వరూపుడు.

వాక్కులకు మూలమైన అవ్యక్త స్వరూపుడు కనుక –

మహాహ్రదః.. 803

1. గొప్పవాడైన, అవ్యక్త నాదస్వరూపుడు.

'హ్రోద అవ్యక్తే శబ్దే'.

సర్వోన్నతుడు కనుక 'మహాన్'. అవ్యక్త శబ్దం కలిగించువాడు 'హ్రదుడు'. అన్ని శబ్దాలకీ మూలమై, అతీతమైన అవ్యక్తనాదం స్వామి స్వరూపం. ఏ ఒక్కరికీ అంత తేలికగా వినబడని అవ్యక్త మధుర దివ్య శబ్దం పరమేశ్వరునిది. ఈ శబ్దం నుండే సర్వ వాక్కులు జనించాయి. కృష్ణరూపంలో వినిపించిన వేణునాదతత్త్వం ఈ మహాహ్రదమే.

2. గొప్ప మడుగు వంటివాడు.

అనంత ఆనంద రస స్వరూపుడు. ఈ పరమాత్ముని పొందినవాడు సర్వసంసార బంధనాల నుండి వైదొలగి అఖండానందంలో మునిగి

శాంతులౌతారు.

తాపత్రయాలను శమింపజేసే బ్రహ్మానందానుభవమే రసమయమైన మడుగు.

భాగవతంలో నందాది గోపకులు శ్రీకృష్ణుని పరమాత్మగా తెలుసుకొని, ఆతని తత్త్వానుభూతిని కోరుకున్నారు. అప్పుడు స్వామి, దయతో "బ్రహ్మ హ్రదం" లో వారిని ముంచినట్లుగా చెప్పబడింది.

ఇతి సంచిన్త్య భగవాన్ మహాకారుణికో హరిః ।
దర్శయామాస లోకం స్వం గోపానాం తమసః పరమ్ ॥
సత్యం జ్ఞానమనన్తం యద్ బ్రహ్మజ్యోతిః సనాతనం ।
యద్ధి పశ్యన్తి మునయో గుణాపాయే సమాహితః ॥
తేతు బ్రహ్మహ్రదం నీతామగ్నాః కృష్ణేన చేద్ ధృతాః
దదృశుర్ బ్రహ్మణోలోకం ... ...॥

"పరమ దయాళువైన కృష్ణుడు, గోపకులకు చీకటికి ఆవల ప్రకాశించే తన దివ్యధామాన్ని చూపించాడు. సత్యం, జ్ఞానం, అనన్తం అయిన, బ్రహ్మ ప్రకాశస్వరూపమైన, శాశ్వతమైన ఆ దివ్యధామం గుణాతీతులైనప్పుడు మునులు చేరేది. ఆ బ్రహ్మహ్రదంలో వారిని కృష్ణుడు మగ్నులను చేశాడు"

– 'మునక' అంటే మరి బాహ్యంతో సంబంధం లేని పూర్ణానుభూతి. అలా ముంచే బ్రహ్మానంద రసస్వరూపుడు పరమాత్మ.

హ్రదా ఇవ కుక్షయః సోమ ధానాః॥ (ఋగ్వేదం)
హ్రదం న హి త్వా న్యృషన్త్యూర్మయో ॥ (ఋగ్వేదం)

3. *పరమాత్మ అనే బ్రహ్మానంద రస హ్రదమే, అనేక కాలువల వంటి అవ తారాలుగా, విశ్వంలోని పలు దేశకాలక్షేత్రాలలో చేరి, ధర్మాన్నీ, జ్ఞానాన్నీ పండించింది.*

అవతారాహ్యసంఖ్యేయా హరేస్సత్త్వ నిధేర్ద్విజాః ।
యథా విదాసినః కుల్యాస్సరసస్యు స్సహస్రశః ॥ (భాగవతం)

"ఎండుట ఎరగని అగాధ సరస్సు నుండి వేలాది పిల్లకాలువలు బయలుదేరునట్లుగా శ్రీహరి నుండి అనంతావతారాలు వెలువడినాయి".

... యథాహ్రదం కుల్యా ఇవా శత ॥ (ఋగ్వేదం)

విస్తారమైన ఆ రసతత్త్వం అనంతమే కాక, అగాధం కూడా -

మహాగర్తః.. 804

1. *గొప్ప గోయి వంటివాడు. (గొప్ప లోతైనవాడు)*

   గంభీరమైన ఈశ్వరతత్త్వం అత్యంత ఉత్కృష్టమైనదీ, అంతు చిక్కనిదీ. అతి పెద్దదైన 'గర్తము' వంటిది.

   అన్నిటినీ లీనం చేసుకొనే తత్త్వం.

   బృహన్తం గర్తమాశాతే ॥ (ఋగ్వేదం)

2. *అంతు పట్టని మాయయే పెద్ద గోయి వంటిది.*

   ఈ మాయ ఆతనిదే. 'మాయారూపమైన పెద్ద గర్తము కలవాడు'.

   మమ మాయా దురత్యయా (భగవద్గీత)

   'నా మాయ దాటరానిది' అని భగవానుని మాట.

3. *గొప్ప ఆకాశ స్వరూపుడు.*

   అన్నిటినీ తనయందు ప్రకాశింపజేసే అనంత ఆకాశమితడు.

   ఆరోహతం వరుణమిత్ర గర్తం తతశ్చక్షాథామదితిం దితించ ॥ (యజుర్వేదం)

4. *గొప్ప లోతయిన సముద్రము వంటివాడు.*

   సముద్ర స్యేవ మహిమా గభీరః ॥ (ఋగ్వేదం)

   అంతుపట్టని మహిమలవాడు.

5. *లోతైన హృదయమే మహాగర్తము -అదే చిన్మయం కనుక 'మహాహ్రదం'. దాని యందు వ్యాపించిన 'దహరాకాశస్వరూపుడు'. హృదయాంతర్వర్తి.*

   "నిహితం గుహాయాం" అని ఉపనిషద్వచనం.

   స్తుహి శ్రుతం గర్తసదం యువానం ॥ (యజుర్వేదం)

6. గొప్ప రథం కలవాడు.

గర్త శబ్దానికి రథమని నిరుక్తకారులు నిర్వచించారు.

గొప్ప రథాన్ని అధిరోహించిన శ్రీకృష్ణాది దివ్యరూపాలను భారత భాగవతాలు వర్ణించాయి. సప్తాశ్వరథారూఢునిగా సూర్యనారాయణుడు ప్రసిద్ధి.

✣ ✣ ✣

దురారిహా (781) నామం నుండి ఈ మహాగర్తః (804) నామం వరకు మోహస్వరూపాన్ని ప్రకటించి, దుష్టులను పరిమార్చడానికై, మోహ జనక శస్త్రాలను ప్రవర్తింపజేసి, మాయలోపడవేసిన బుద్ధావతారాన్ని ప్రదర్శించారు శ్రీపరాశరభట్టు.

✣ ✣ ✣

అనంతానందమయుడైన చిత్స్వరూపుడు కనుక 'సత్' రూపుడు (ఉండువాడు) ఇతడే -

మహాభూతః..805

1. గొప్పగా ఉన్నవాడు - కలిగినవాడు.

భవతీతి భూతః. మహాంశ్చాసౌ భూతో మహాభూతః - ఉన్న వాటన్నటి కంటే (అన్ని భూతాల కంటే) గొప్పగా ఉన్నదిది.

'మహతో మహీయాన్'. గొప్ప వాటిన్నిటి కంటె గొప్పవాడు. శాశ్వతమైన ఉనికియే తాను. (భూసత్తాయాం -అనే ధాతువు ననుసరించి)

ఈ మహాభూతం త్రికాలాలలోనూ ఉండునది.

త్రిలోకాలు, పంచభూతాలు దీని నుండే కలిగాయి.

కలగడమే కాదు - దీనినే ఆశ్రయించుకొని, దీనిలోనే లీనమౌతున్నాయి. అందువలననే -

మహానిధిః.. 806

1. గొప్ప నిధి వంటివాడు.

యస్మిన్ నిధీయంతే స నిధిః.

ఉంచబడే చోటు. ఇది పెద్ద-గొప్ప నిధి. సర్వభూతములు దీని యందే ఉన్నాయి. అందరికీ తగిన ఐశ్వర్యాలందించిన అఖండ నిధానం ఈ పరమ తత్త్వం.

విశ్వంలో ప్రతిదీ ఏదో ఒక దాని యందు ఆధారపడి ఉంటుంది. ఆ ఆధారతత్త్వం విష్ణుని విభూతియే. అన్ని ఆధారాలకి ఆధారమైన అనంతుడితడు.

నిధీనాం త్వా నిధిపతిగ్ం హవామహే ॥ (యజుర్వేదం)

ఆకాశంలో భూమిలో కూడా వ్యాపించి వినోదించే విశ్వలీలామయుడు కనుక -

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః।
అమృతాశోఽమృతవపుఃసర్వజ్ఞఃసర్వతోముఖః॥ 87

807. కుముదః, ***808.*** కుందరః, ***809.*** కుందః, ***810.*** పర్జన్యః,
811. పావనః, ***812.*** అనిలః, ***813.*** అమృతాశః. ***814.*** అమృతవపుః,
815. సర్వజ్ఞః, ***816.*** సర్వతోముఖః.

కుముదః.. 807

1. ఆకాశంలో ఆనందించువాడు - ఆకాశాన్ని ఆనందింపజేయువాడు.

కౌ శబ్దాశ్రయే ఖే మోదతి ఇతి -

మోదయతీతి కుముదః సూర్యః సోమో విష్ణుశ్చ ॥ (సత్యభాష్యం)

'కై శబ్దే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, శబ్దగుణకమైన ఆకాశం 'కుః'. దాని యందు ప్రకాశించి, ప్రకాశింపజేసే సూర్యచన్ద్రాదులు కుముదులు. వారి యందలి దీధితి నారాయణుడే.

యాభిః సోమో మోదతే హర్షతే చ .....॥ (ఋగ్వేదం)

ఈ సూర్యచన్ద్రాదుల చేత కమలాలు, కలువలు మొదలైన కుసుమాలు వికసిస్తున్నాయి. ఆకాశంపై వెలిగి జగతిని ఆనందింపజేస్తున్న జ్యోతిఃస్వరూపుడు.

2. *'కు' అనగా 'భూమి' అని కూడా అర్థం.*

భూమియందవతరించి, భూభారాన్ని తొలగించి అందరినీ ఆనందింప జేసినవాడు.

భూమిని ప్రేరేపించువాడు అని అర్థం కూడా చెప్పబడింది. అనగా పార్థివమైన దేహానికి చేతనత్వం కలిగించే ఆత్మస్వరూపుడు.
ఆనందింపజేసే స్వభావంతో, కామితాలను తీర్చువాడు కనుక -

కున్దరః.. 808

1. *కోరిన వాటిని ఇచ్చువాడు.*

'కము కాన్తౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **'కామ్యత ఇతి కున్దః - కమనీయః'** (సత్యభాష్యం). **కున్దంరాతి దదాతీతి కున్దరః.**

కమనీయమైనవాటిని (వాంఛితాలను) తీర్చువాడు కున్దరుడు.

మొల్ల పువ్వుల వంటి శుద్ధమైన ఫలాలను (రాతి) ఇచ్చువాడు. స్వచ్ఛమైన కుసుమాదులను భక్తుల నుండి స్వీకరించువాడు (రాతి-లాతి-స్వీకరించుట-అలయోరభేదః).

2. *భూమిని చీల్చినవాడు.*

కుం దారయతీతి కున్దరః.

వరాహరూపం ధరించి తన కోరలతో భూమిని గ్రుచ్చి ఎత్తినవాడు.

కుం ధరాం ధారయా మాస హిరణ్యాక్ష జిఘాంసయా।
వారాహం రూపమాస్థాయ ....

బలరామావతారంలో హలధారియై భూమిని చీల్చినవాడు.

సూర్యాదిశక్తులతో భూమిలో తన శక్తిని చొప్పించి, భూమి నుండి సంపదలను వెలికితీసి సృజించే చైతన్యరూపుడు.

3. **కున్దం- పరతత్త్వ జ్ఞానం రాతి దదాతి - కున్దరః**

కమనీయమైనది పరతత్త్వజ్ఞానం. దానిని ప్రసాదించే జ్ఞానస్వరూపుడు.

'దదామి బుద్ధి యోగం తం' అని 'గీత'లో స్వామి వచనం.

కమనీయమైన వాటిని అనుగ్రహిస్తూనే, కల్మషాలను తొలగించువాడు కనుక -

కున్దః.. 809

1. పాపాలను (చెడును) తొలగించువాడు.

కుం పాపం దాయతి శోధయతి - ద్యతి ఖండయతి కున్దః.

పాపాలను శోధించువాడు - ఖండించువాడు.

'కు' అనగా పాపం, చెడు. ఈ 'కు' లక్షణాన్ని తొలగించి శుద్ధి చేసే పరిశుద్ధ స్వభావుడు. కుజనులైన ధర్మద్రోహులను ఖండించే లోక రక్షకుడు.

2. భూమిని శుద్ధి చేయువాడు.

కుం-భూమిం, 'కు' అనగా భూమి అని కూడా అర్థం.

కిరణాలతో, వర్షాలతో పృథ్విని శోధించువాడు.

3. భూమిని విదారణం చేసే (చీల్చే) ప్రవాహాదుల రూపంలో నున్నవాడు.

లక్షణావృత్తిచే 'భూమి' అనే మాటకు 'భూమిపతులు' అనే అర్థాన్ని చెప్పుకుంటే - క్షత్రియ సంహారం చేసిన పరశురాముని ఈ నామంతో భావించవచ్చు. అలాగే - సముద్రం భూమిని ముంచివేసినప్పుడు, ఆ జలాన్ని తొలగించి, భూమిని తగిన విధంగా తన గొడ్డలితో వ్యవస్థపరచిన వాడు భార్గవుడు.

నిః క్షత్రియాం యశ్చ చకారమేదినీం ।
అనేకశో బాహువనం తథాచ్ఛినత్ ।

యః కార్తవీర్యస్య సభార్గవోత్తమో
మమాస్తు మాంగల్య వివృద్ధయే హరిః.

'ఏ పరశురాముడు (భార్గవోత్తముడు) అనేక మార్లు పుడమిని క్షత్రియ రహితంగా చేశాడో, ఎవడు కార్తవీర్యార్జునుని వేయి భుజాలనే మహావనాన్ని ఛేదించాడో, అట్టి హరి నాకు శుభవృద్ధిని కలిగించుగాక!

4. **కుం ఆదాత్** – భూమిని ఇచ్చినవాడు.

ఆ పరశురాముడు క్షత్రియులను సంహరించి, ఆ అఘం నుండి విశుద్ధికై అశ్వమేధ యజ్ఞం చేశాడు. అందులో మహాదక్షిణగా, తాను సాధించిన భూమినంతటినీ, మరీచి ప్రజాపతి పుత్రుడైన (మారీచాయ) కశ్యపునకు ఇచ్చాడు. ఇలా భూమినిచ్చిన ఘట్టాన్ని 'హరివంశం' ఇలా వర్ణిస్తోంది. –

"సర్వపాప విశుద్ధ్యర్థం వాజిమేధేన చేష్టవాన్ ।
తస్మిన్యజ్ఞే మహోదానే దక్షిణాం భృగునందనః ॥
మారీచాయ దదౌ ప్రీతః కశ్యపాయ వసుంధరామ్ ॥

"ఒనరంగభూదాన మొసగు చేయి" అని ఈ అంశాన్ని అన్నమయ్య కీర్తించాడు

5. కున్దకుసుమం (మొల్లపువ్వు) వంటి సుందరమైన స్వచ్ఛ రూపం కలవాడు. పృథ్విని వర్షాదుల ద్వారా శుద్ధి చేస్తున్నవాడు కనుక –

పర్జన్యః.. 810

1. వర్షించువాడు. మేఘస్వరూపుడు.

సూర్యునియందు భాసించే నారాయణ తేజమే, మేఘరూపంగా వర్షిస్తోంది.

'పృషు సేచనే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి – 'పరి' ఉపసర్గతో 'వృషు సేచనే' అనే ధాతువు ప్రకారం కూడా – పూర్తిగా (అన్ని వైపులా) వర్షించునది పర్జన్యం.

పర్జన్యాదులు కూడా విష్ణు విభూతులే.

తాపాన్ని పోగొట్టే మేఘుని వలె తాపత్రయాలను తొలగించి, అన్ని కోరికలను వర్షించే నారాయణుడు 'పర్జన్యుడు'.

దివాచిత్ తమః కృణ్వన్తి పర్జన్యేనోదవాహేన ।
యత్ పృథివీం వ్యున్దన్తి ॥ (ఋగ్వేదం)
మిమిహి శ్లోకమాస్యే పర్జన్య ఇవతత్యః।
గాయ గాయత్రముక్థ్యమ్ ॥ (ఋగ్వేదం)
ఇదం వచః పర్జన్యాయ స్వరాజో హృదో।
అస్త్వన్తరం తజ్జుజోషత్ ॥ (ఋగ్వేదం)

పర్జన్య వ్యవస్థను కలిగించే సూర్యుని కూడా వేదం 'పర్జన్య' నామంతో పలుచోట్ల స్తుతించింది.

'గారవించి దప్పి తీర్చు కాలమేఘమా!' అని అన్నమయ్య నీల మేఘశ్యాముడైన శ్రీహరిని కీర్తించాడు.

పాపాలను, తాపాలను పోగొట్టడం చేతనే –

పావనః.. 811

1. పవిత్రులను చేయువాడు.

స్మరణమాత్రం చేతనే పవిత్రులను చేసే స్వామి.

'పవిత్రాణాం పవిత్రం యో ....' అని అవతారికలోనే ప్రస్తుతింపబడినాడు.

2. వెళ్ళువాడు.

పవతే గచ్ఛతీతి పావనః. వాయు స్వరూపుడై సాగువాడు. మేఘము (పర్జన్యుడై) తానై, దానిని కదిలించు వాయువు కూడా తానైనవాడు.

శుద్ధి చేసే 'అగ్ని'గా కూడా ఈ నామం ద్వారా తెలియబడుతున్నాడు.

పర్జన్య, అగ్ని, వాయు (అనిలః) రూపాలతో సూర్యతేజస్సు ద్వారా నారాయణుడు జగతిని శుద్ధి చేస్తున్నాడు.

కురియడంతో పర్జన్యుడు, జ్వాలతో అగ్ని, ఆరబెట్టడంతో వాయువు –

భూమిని, భూవాసులను శుద్ధి చేస్తున్నారు (కున్దఃు). ఈ మూడు రూపాలుగా ఉన్న విష్ణు చైతన్యాన్ని 'కున్దఃు' నామం తరువాత చక్కని క్రమంలో పేర్కొన్నారు.

పునాతి ధీరో భువనాని మాయయా ॥ (ఋగ్వేదం)

అన్నిటినీ ప్రేరేపించే చైతన్యస్వరూపుడు కనుక –

అనిలఃు.. 812

1. *ప్రేరకుడు లేనివాడు.*

'ఇల ప్రేరణే' అనే ధాతువు ప్రకారం – ఇలుడు అనగా ప్రేరకుడు. అన్నిటినీ ప్రేరేపించే వాడితడు. ఈతనికి ఏ ఒక్కరు ప్రేరకులు లేరు. తను చేసే సృష్ట్యాది కృత్యాలలో తాను స్వతంత్రుడు. ఆయనచే చేయించే ఈశ్వరులెవరూ లేరు. **'ధియో యోనఃు ప్రచోదయాత్'!** ప్రేరేపించే బుద్ధిని సైతం ప్రేరేపించువాడు.

2. *ప్రేరకుడు (ఇలుడు) కాడు.*

జీవుల కర్మలకు తాను సాక్షీభూత చైతన్యమే తప్ప, వాటికి తాను కారణం కాడు. సూర్యుని ఉనికి చేతనే జగతిలో పలు కర్మలు జరుగుతాయి. కానీ ఆ వివిధ కర్మలకు ఆయన సాక్షీరూప ప్రేరకమే తప్ప, కర్తృరూప ప్రేరకుడు కాడు. అలాగే ఆత్మ యొక్క ఉనికి మాత్రం చేతనే దేహాదులు పని చేస్తున్నా, ఆ దేహాది కర్మలకు ఈతడు కర్త కాడు.

3. *వాయు స్వరూపుడు.*

వాయువు వలననే అన్నీ చలిస్తున్నాయి. ఆతనిని చలింపజేసేది లేదు. వాయువులను కూడా నారాయణ విభూతిగా దర్శించే నామమిది.

4. *'ఇల స్వప్న క్షేపణయోఃు'* అనే ధాతువు ప్రకారం *నిద్రించువాడు* ఇలుడు. *ఆత్మజ్ఞానం లేకపోవడమే నిద్ర. నిత్యజ్ఞాన స్వరూపుడైన కేవల చైతన్యమే పరమాత్మ. అది ఎల్లవేళలా జాగృతమే. నిద్రించని ఆ చైతన్యమే అనిలుడు.*

నిత్య ప్రబోధశాలి.

5. సులభుడు.

'నిలః' అంటే 'దుర్లభుడు', 'అనిలః' అంటే 'దుర్లభం' కానివాడు. శోధింపజేసి, తాపాన్ని పోగొట్టే కరుణాళువు, భక్తులకు సులభుడు.

భక్త సులభుడే కాక, వారికి గమ్యమైన అమృతతత్త్వమితడు.

అమృతాశః.. 813

1. అమృతాన్ని ఆరగించువాడు.

స్వాత్మానందమనే అమృతాన్ని భుజించువాడు.

అనుభవించడమే భుజించడం. ఆనందానుభవ స్వరూపుడు విష్ణువు.

2. జలం, ఘృతం– కూడా అమృతశబ్ద వాచ్యాలు. జలాన్ని స్వీకరించే సూర్యుడు, ఘృతాన్ని ఆహరించే అగ్ని కూడా 'అమృతాశులు'.

3. యజ్ఞం చేయగా మిగిలినిది అమృతం. దానిని స్వీకరించే యజ్ఞకర్తృస్వరూపుడు.

'యజ్ఞా శిష్టాశినస్సంతోఽమృత భుజఃు' (గీత)

యజ్ఞ శేషాన్ని తినడం అమృత భోజనమే.

యజ్ఞవ్యవస్థయే విష్ణువు కనుక ఆయనయే అమృతాశి.

'ఒక చోట పంచయజ్ఞోచితకర్ముని

ఒకచోట అమృతోపభోగలోలు...' (భాగవతం – పోతన)

'పంచయజ్ఞాలను ఆచరించి, అటుపై యజ్ఞశేషాన్ని (అమృతాన్ని) ఆరగిస్తున్న శ్రీకృష్ణుని నారదుడు దర్శించినట్లుగా భాగవతం వర్ణిస్తోంది.

4. ఈతని పై ఆశయే అమృతం.

భక్తులకు ఈతని విషయంలో కల ఆశ అమృతము.

ఆనంద స్వరూపం – శాశ్వతం. మోక్షమే అమృతాశ. అదే విష్ణు స్వరూపం.

5. క్షీర సాగర మథనంలో ఆవిర్భవించిన అమృతాన్ని దేవతలచే త్రాగించి, తాను సైతం గ్రహించాడు.

యోన జీవోసి న మృతో దేవానామమృత గర్భోసి ॥ (అథర్వవేదం)
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృతమశ్నుతే ॥ (యజుర్వేదం)
శాశ్వతానందానుభవమే ఆతని స్వరూపం కనుక –

అమృతవపుః.. 814

1. నాశనం లేని శరీరం కలవాడు.

   ఆనందం, శాశ్వతత్వం స్వామి స్వరూపం.

   సచ్చిదానంద విగ్రహుడు. సత్–శాశ్వతమైన ఉనికి, చిదానంద – కేవల జ్ఞానమయానందతత్త్వం.

   సనాదసి ॥ (ఋగ్వేదం)

2. శాశ్వతమైన బీజాలను వేయువాడు.

   ఈ జగతి ప్రవాహనిత్యం. 'వపుః –బీజ సంతాన సాధనం'. **'సూర్యాచన్ద్ర మసౌధాతా యథా పూర్వమకల్పయత్'** – ప్రతి కల్పారంభంలో జగతిలో సూర్యచన్ద్రాదులు, భూతాలు వెనుకటి కల్పాలలో వలె తిరిగి ప్రారంభమవుతున్నాయి. ఇలా ఈ జగతి ప్రవాహము వంటి నిత్యత్వం కలది. ఈ నిత్యమైన జగద్రూప బీజాలను ప్రళయంలో తన యందు పదిలపరచి, తిరిగి సృష్ట్యారంభంలో మొలకెత్తించువాడు.

3. నిత్యమూ కలిగే ఈ ప్రవాహ రూప జగతియే స్వామి యొక్క తనువు. దీనిని తనలో లీనం చేసుకున్నప్పుడు 'అమృతాశః'. తిరిగి దీనిని తనయందు వ్యక్తం చేసినప్పుడు 'అమృతవపుః'. కల్పారంభం నుండి ప్రళయం వరకు నశించని సూర్యచన్ద్ర దేవతాదులందరూ స్వామి విరాట్తనువులోని భాగాలే.

   ఈ పరతత్త్వం ఆనందమయం కనుక 'అమృతం'. అంతేకాదు – కేవలజ్ఞానమయం కనుక –

సర్వజ్ఞః.. 815

1. *సర్వము తెలిసినవాడు.*

సమస్తమూ తానే అయిన చైతన్యస్వరూప ఆత్మ ఇతడే. విశ్వంలో ప్రత్యంశమూ ఈతనికి ఎరుకే.

యః సర్వజ్ఞ ః సర్వవిత్ (ముండకోపనిషత్తు)

ఎవడు అన్నీ తెలిసిన విద్వాంసుడో ఆ పరమాత్ముడు.

విశ్వాని దేవ వయునాని విద్వాన్॥ (ఋగ్వేదం)

బుద్ధీంద్రియాదులకు సైతం జ్ఞానాన్నిచ్చే ప్రజ్ఞా స్వరూపుడు.

అన్ని వైపులా అన్ని కాలాలా దర్శించగలిగే కేవల జ్ఞానస్వరూపుడు కనుక –

సర్వతోముఖః.. 816

1. *అన్ని వైపులా ముఖాలు కలవాడు.*

అన్నీ చూసి, అన్నీ విని, అన్నిటినీ ఆఘ్రాణించి, అన్నిటా పలికి, అన్నిటినీ స్వీకరించే చైతన్యస్వరూపుడు.

కన్ను లేకనే అన్నీ కని, చెవులు లేకనే అన్నీ విని, అంతటా వ్యాపించి, దేశ దిక్కాల పరిమితులు లేని అనంతజ్ఞాన స్వరూపుడు ఇతడు.

సర్వతోఽక్షి శిరోముఖమ్ (భగవద్గీత)

అగ్నిముఖుడైన విష్ణువు. అంతటా జ్వలించే అగ్నియే ఈతని ముఖం.

'ముఖాదిన్ద్రశ్చాగ్నిశ్చ' (పురుషసూక్తం)

'ముఖమపిదహనో' (ఈ స్తోత్రానికి ధ్యానశ్లోకంలోని వాక్యం)

'ఉత విశ్వతో ముఖః' అనే మాట ఋగ్వేద యజుర్వేద అథర్వవేదాలలో చెప్పబడింది.

అంతటా ఉండి గమనించే జ్ఞానస్వరూపుడు కనుకనే అందరికీ సులభుడు –

సులభః సువ్రతః సిద్ధః శత్రుజి చ్ఛత్రుతాపనః।
న్యగ్రోధోదుంబరోఽశ్వత్థ శ్చాణూరాంధ్రనిషూదనః॥ 88

817. సులభః, *818. సువ్రతః,* *819. సిద్ధః,*
820. శత్రుజిత్, *821. శత్రుతాపనః* *822. న్యగ్రోధః,*
823. ఉదుంబరః, *824. అశ్వత్థః,* *825. చాణూరాంధ్ర నిషూదనః.*

సులభః.. 817

1. *సుఖంగా, సౌకర్యంగా పొందబడువాడు.*

తేలికగా పట్టుబడని దుర్లభుడు – నిష్కపట భక్తికీ, నిర్మల జ్ఞానానికీ లభించే సులభుడు.

అనన్య చేతాస్సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం 'సులభః' పార్థ! నిత్యయుక్తస్యయోగినః॥ (భగవద్గీత)

అన్య చింతలు లేని చిత్తంతో ఎల్లవేళలా నిన్ను స్మరించే నిత్యయుక్తుడైన యోగికి నేను 'సులభుడను' – అని పరమాత్మయే ప్రకటించారు.

పత్రేషు పుష్పేషు ఫలేషు తోయే –
ష్వక్రీతలభ్యేషు సదైవ సత్సు –
భక్త్యైక లభ్యే పురుషే పురాణే
ముక్త్యైకథం న క్రియతే ప్రయత్నః ॥ (మహాభారతం)

'కొనకుండానే లభ్యమయ్యే పత్రాలను పుష్పాలను ఫలాలను జలాలను అర్పించడం చేతనే, కేవల భక్తిచేత లభ్యుడయే పురాణ (శాశ్వత) పురుషుడు ఉండగా, ఇంకా ముక్తి ప్రయత్నం ఎందుకు చేయడం లేదో!'. ఈ శ్లోకం గరుడపురాణంలో కూడా గోచరిస్తోంది. కుబ్జ, సుదాముడు, కుచేలుడు ఈ సులభుని అనుగ్రహాన్ని పొందినవారే.

తనకోసం ప్రయత్నించే వారికి తాను తప్పక లభ్యుడు. ఎప్పుడూ ముందుండువాడు – కనుక సులభుడు.

అగ్నిమీళే 'పురోహితమ్'.

అంతటా ఉన్న తాను, భక్తహితానికై, జగత్ శ్రేయస్సుకై నియమబద్ధుడై ఉన్నందున–

సువ్రతః.. 818

1. *మంచి నియమము కలవాడు.*

సు–మేలు, సంపూర్ణము, సమృద్ధి. వాటిని కలిగించే నియమం స్వామిది. జగతిని పద్ధతిగా నడపడమే భగవానుని శుభ నియమం.

యస్యవ్రతే పృథివీ నన్నమీతి యస్య వ్రతే శషవజ్జర్భురీతి।
యస్యవ్రతే ఓషధీర్విశ్వరూపాः సనః పర్జన్య మహిశర్మయచ్ఛ॥ (ఋగ్వేదం)

శుభాహార స్వీకరణ – ఆహార విరమణ వ్రతాలు. జగతిని తనలోనికి గ్రహించే లయకృత్యం, దేనికీ అంటక దేనినీ కోరక పోషించే సృష్టి స్థితి కృత్యాలు స్వామి నియమాలు.

2. *భక్తజన రక్షణను దృఢదీక్షగా నిర్వహించే కరుణాళువు.*

ఈ నియమాల వల్ల అతడు పొందవలసినదేదీ లేదు. అన్నీ పొందిన పరిపూర్ణుడు –

సిద్ధః.. 819

1. *పొందియున్నవాడు.*

ఎంతటి కార్యాన్నయినా ఇతరుల అపేక్ష లేకనే స్వతంత్రంగా నెరవేర్చగలవాడు. శ్రమ, వేదన, అలసట వంటివి లేకుండానే, ప్రయత్న రహితంగానే సాధించినవాడు. విశ్వమంతా స్వామి సిద్ధస్వరూపంగా

నిర్వహిస్తున్నాడు.

సూర్యునికి కాంతి, అగ్నికి వేడిమి, నీటికి చలువ ఇలా జగతికి స్వతఃసిద్ధమైన స్వభావాన్ని తన చైతన్యంతో సిద్ధింపజేసిన స్వయంసిద్ధుడు. పరిపూర్ణుడు.

మంచి వ్రతమూ ఆయనే – దాని ఫలితమైన సిద్ధి కూడా ఆయనే.

న మా తమన్న శ్రమన్నోత తన్ద్రన్న వోచామ
మా సునోతేతి సోమమ్ ।
యో మే పృణాద్ యో దదత్ యో నిబోధాద్
యో మా సున్వన్తముపగోభిరాయత్ ॥ (ఋగ్వేదం)

శ్రమాదులు లేకనే సర్వమూ సిద్ధింపజేసే పరమేశ్వరుని శ్రుతి కీర్తించింది.

అనాయాసంగా కార్యసిద్ధిని కలిగించే శక్తిలోనే, లోకరక్షణకై అధర్మపరులను నిగ్రహిస్తున్నందున–

శత్రుజిత్..820

1. శత్రువులను జయించువాడు.

అనాయాసంగా విశ్వవ్యవస్థను నిర్వహిస్తున్న విష్ణువు, విశ్వధర్మాలకు విఘాతం కలిగించే వారిని ఓడిస్తున్నాడు. ధర్మద్రోహులు, దేవద్రోహులు, ఈ ధర్మస్వరూపునకు శత్రువులు. తన ప్రతాపంతో వారిని జయించి ధర్మప్రతిష్ఠ చేయువాడు.

శాయతి శృణాత్యవసాదయతి వా శత్రుః.

హింసించువారు శత్రువులు. వారిని హరించువాడు విష్ణువు. సిద్ధికీ, వ్రతానికీ ప్రతికూలాలే శత్రువులు, వాటిని తొలగించువాడు శత్రుజిత్.

ని రిణాతి శత్రూన్ ॥ (ఋగ్వేదం)

శత్రువులను జయించడమే కాక, వారిని శిక్షించి తపింపజేస్తున్నవాడు కనుక–

శత్రుతాపనః.. 821

1. *శత్రువులను తపింపజేయువాడు.*

భగవానునికి శత్రువులెవరూ లేరు. సత్పురుషులను ద్వేషించి, విశ్వహితానికి దెబ్బ తీసే దేవద్రోహులు, యజ్ఞద్రోహులే విశ్వశత్రువులు. విశ్వరక్షావ్రతుడైన (సువ్రతః) విష్ణువు, అనాయాసంగా (సిద్ధః) వారిని ఓడించి, తపింపజేస్తున్నాడు. తాను ప్రసాదించిన శక్తిచే, సద్వీరుల ద్వారా శత్రువులను బాధింపజేస్తున్నాడు.

అర్జునాదులు కృష్ణదత్త శక్తితోనే అసురశక్తులను దునిమాడారు.

ద్విషస్తాపయన్ హృదః శత్రూణాం తాపయన్ మనః ॥(అథర్వవేదం)

శత్రువులను క్రిందుపరచి అడ్డగించే శిక్షకుడు, తన మాయతో సర్వ భూతాలను అధఃకరించి వ్యాపించిన జగన్నిర్వాహకుడు కనుక –

న్యగ్రోధః.. 822

1. *క్రిందుపరచి, ఆవరించినవాడు.*

న్యక్–క్రిందుగా ఉన్నది న్యక్. అలా క్రిందుగా మొలిచి ఆవరించేది న్యగ్రోధం.

దీనికి 'మఱ్ఱిచెట్టు' అని కూడా అర్థం.

క్రిందికి ఊడలు దింపి విస్తరించేది కనుక మఱ్ఱికి ఈ పేరు.

విద్యా విశేషాలే జడలుగా, విస్తరించిన పురాతన జ్ఞానవృక్షంగా – మఱ్ఱితో భగవానుని పోల్చి చెప్పారు.

ఎందరికో ఆశ్రయాన్నివ్వడానికై విస్తరిల్లిన ఒక పెద్ద మఱ్ఱిచెట్టువంటివాడు విష్ణువు.

విశ్రామోయం మునీంద్రాణాం
పురాతన వటశ్శివః ।
వేదాంతసాంఖ్య యోగాఖ్యా

తిస్రస్తు జ్జటయః స్మృతః॥

వేదాంత సాంఖ్య యోగాదులే ఊడలుగా అనంతంగా విస్తరిల్లిన సనాతన జ్ఞానస్వరూపుడు శివుడు.

తుది మొదలు తెలియక విస్తరిల్లే అతి ప్రాచీనమైన విశ్వమే మహావటం. విశ్వరూపుడే ఆ మహావటవృక్షరూపుడు.

2. **న్యగ్భి రనురుధ్యతే.**

తన కంటె క్రింది నున్న వారి (న్యక్కులు) చేత ప్రార్థింపబడేవారు. లోకాలన్నింటికీ పైనున్న తాను తన మాయావరణ క్రింద, తనచే విస్తరింపబడిన, లోకులచే ప్రార్థింపబడుతున్నాడు.

3. *తన కాంతి కిరణాలను క్రింది వైపునకు (భూమిపై) పరచి, ఆ వెలుగులతో లోకాలను ఆవరించి దీపించే సూర్యభగవానుని రూపంగా ఉన్న విష్ణువు.*

క్రింది నున్న లోకాలకు తాను పైనున్నవాడు కనుక –

ఉదుమ్బరః.. 823

1. *ఆకాశం కంటె పై స్థితి యందున్నవాడు.*

'ఆకాశాత్ వాయుః' మొదట భూతం ఆకాశం. దాని కంటె మొదట ఉన్న ఆత్మస్వరూపుడు. **'ఆత్మైవ ఇదమగ్ర ఆసీత్ ఆత్మన ఆకాశస్సంభూతః'.** ముందున్నది ఆత్మయే. దాని నుండే ఆకాశాది భూతాలు ఆవిర్భవించాయి. జగత్కారణుడు కనుక, అంబరం (ఆకాశం) కంటె ఉన్నతుడు, అతీతుడు.

2. *అన్నాదుల రూపంలో ఉన్నవాడు.*

'ఊర్జా అన్నాద్యముదుంబరమ్' – అని శ్రుతి వాక్యం

ఉదుంబరం అనే వ్యవహరింపబడే అన్నాదికం బలకరం.

3. *అన్నిటి కంటె ఉత్తమ శబ్దస్వరూపుడు.*

సర్వోత్తమమైన శబ్దం వేదం. ఆ వేదస్వరూపుడితడు.

'ఉచ్చైః సర్వత ఉత్తమో వేదరూపః శబ్దో యస్యసః ఉదుంబరః సర్వేశ్వరో విష్ణుః । (సత్యభాష్యం).

'అబి శబ్దే' – అనే ధాతువు ప్రకారం – పై అర్థాన్ని సాధించవచ్చు.

4. *ఉత్కృష్టంగా కీర్తింపబడువాడు.*

దివిజులచే, ఋషులచే, భక్తులచే సర్వోన్నతంగా స్తుతింపబడే పరమాత్ముడు.

5. *ఉత్కృష్టంగా అంబరంలో భాసించే సూర్యరూపుడు.*

6. *మేడి చెట్టు రూపముగా ఉన్నవాడు.*

యజ్ఞవృక్షం, దివ్యవృక్షం మేడిచెట్టు. అంబరాన్ని దాటుతున్నదా అన్నట్లుగా పెరిగే లక్షణం చేత ఈ 'ఉదుంబర' శబ్దం వృక్షపర్యాయం. కానీ మేడిచెట్టుకి ఇది వ్యవహారం.

వివిధ జీవులతో నిండిన వివిధ బ్రహ్మాండాలే తన శరీరంలో భాగాలుగా కలిగిన విరాడ్రూప విష్ణువు – అనేక ఫలాలతో పెరిగిన మేడి చెట్టు వంటివాడు.

మేడి దేవతావృక్షం. జ్ఞానస్వరూపుడైన దత్తాత్రేయునికి ప్రీతికరం – ప్రతీక. దత్త స్వరూపుడైన నారాయణుని ఈ నామం ద్వారా స్మరించవచ్చు.

మహాన్‌వై భద్రో బిల్వోమహాన్ భద్ర ఉదుమ్బరః।
మహాం అభిక్త బాధతే మహతః సాధు భోధనమ్ ॥ (అథర్వవేదం)

(న్యగ్రోధః, ఉదుంబరః – ఈ రెండు శబ్దాలు సంధి చేస్తే 'న్యగ్రోధ ఉదుంబరః' కావాలి. కానీ ఇక్కడ ఉన్న 'న్యగ్రోధోదుంబరః' అనే సంధి ఆర్షప్రయోగంగా స్వీకరించాలి)

ఉన్నతంగా ఉండడమే కాక, అంతటా వ్యాపించుట చేత –

అశ్వత్థః.. 824

1. *వ్యాపించిన వాటియందున్నవాడు.*

'అశూ వ్యాప్తౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, వ్యాపించునవి అశ్వములు.

విశ్వంలో వ్యాపించిన పంచభూతాదులలో (స్థితః) ఉన్నవాడు – అశ్వత్థుడు.

2. వ్యాపించి ఉండువాడు.

వ్యాప్య తిష్ఠతీత్యశ్వత్థః (సత్యభాష్యం).

అన్నిటికీ ఆధారమై ఉన్న చైతన్యం.

3. కాలాతీతుడు.

'శ్వః' అనేది కాలవాచక శబ్దం. కోపంలో కలిగేవి శ్వత్థములు. కాలాతీతుడు అశ్వత్థుడు. నిత్యుడు.

ఊర్ధ్వమూలోఽవాక్శాఖ ఏషోఽశ్వత్థః సనాతనః. (కఠోపనిషత్తు)

ఊర్ధ్వమూల మవాక్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్

ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద సవేదవిత్ ॥ (భగవద్గీత)

'పై వైపునకు మొదలు, క్రిందివైపునకు శాఖలు కల అవినాశి అయిన అశ్వత్థవృక్షం ఈ ప్రపంచం–సంసారం' అని పై శ్రుతిస్మృతుల తాత్పర్యం.

విశ్వరూప వృక్షానికి శాఖలు, ఫలాలు క్రింద ఉన్నాయి. మూలం ఊర్ధ్వంలో ఉంది. దానికి వేదాలే ఆకులు.

శ్వః అపిన స్థాతా 'అశ్వత్థః'.

రేపటికి కూడా నిలవనిది – అనగా అశాశ్వతమైనది విశ్వం. దాని యందు వ్యాపించిన శాశ్వతుడు విష్ణువు. విశ్వరూప వృక్షంగా గోచరిస్తున్నాడు.

'నిన్న–నేడు–రేపు' అనే విభాగాలు లేని అనంత కాల స్వరూపం. సృష్టిలో ఉన్నవారికే విభాగం – సృష్టికర్తకు లేదు.

3. శాశ్వతం కానివి ఇన్ద్రాది పదవులు. వారియందు వ్యాపించి విశ్వ నిర్వహణ చేస్తున్నవాడు.

నశ్వాః అశ్వాః తత్ ఏషామ్ అస్తీతే అశ్వాః, ఇన్ద్రాదయః,

తేషు తిష్ఠతీతి– అశ్వత్థః. (శ్రీపరాశరభట్టు)

4. అశ్వాలనగా కిరణాలు. వ్యాపించు లక్షణం కలవి. వాటియందున్న జ్యోతిః

స్వరూపుడు.

5. రావిచెట్టు రూపంలో నున్నవాడు.

మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే।
అగ్రతః శివరూపాయ అశ్వత్థాయ నమో నమః॥

– అని సంప్రదాయ శ్లోకం. మొదలులో బ్రహ్మ, మధ్యలో విష్ణువు, కొనలో శివుడు కలిగిన – త్రిమూర్త్యాత్మక నారాయణ స్వరూపంగా అశ్వత్థాన్ని నమస్కరించడం ఈ దేశపు సనాతన సదాచారం.

అశ్వత్థమనగా రావిచెట్టు. ఇది ప్రధానంగా బ్రహ్మవిష్ణురుద్రాత్మకమైన నారాయణ స్వరూపంగా సనాతనంగా ఆరాధింపబడుతోంది.

యజ్ఞవృక్షమైన ఇది యజ్ఞమయుడైన నారాయణుడే.

యమశ్వత్థముపతిష్ఠన్త జాయవః ॥ (ఋగ్వేదం)
అశ్వత్థే వో నిషదనం పర్ణే వో వసతిష్కృతా ॥ (ఋగ్వేదం)
భద్రాన్ ప్లక్షాన్నిస్తిష్ఠస్యశ్వత్థాత్ ఖదిరాద్ధవాత్।
భద్రాన్యగ్రోధాత్ పర్ణాత్ స న ఏహ్యరున్ధతి ॥ (అథర్వవేదం)
ప్రైణాన్ వృక్షస్య శాఖయాశ్వత్థస్య నుదామహే ॥ (అథర్వవేదం)

✣ ✣ ✣

పై మూడు నామాలలో చెప్పబడిన మూడు వృక్షాలు అనాదిగా సనాతన ధర్మంలో దేవతాస్వరూపాలుగా ఆరాధింపబడుతున్నాయి. ఇవి యజ్ఞసంబంధ వృక్షాలు. వీటి ఆరాధన దివ్య ఫలదాయకం. దేవతావృక్షాలుగా వేద, పురాణాలలో వివిధ మహిమలతో వర్ణింపబడ్డాయి.

ఇవి విష్ణుపరమైన అర్థాన్ని చెప్పే నామాలుగానే కాక, ఈ వృక్షాదులు విష్ణు విభూతితో కూడినవి – అనిగ్రహించాలి.

✣ ✣ ✣

యజ్ఞస్వరూపుడు కనుక యజ్ఞమయమైన ధర్మాన్ని రక్షించడానికై అసురీశక్తుల్ని దునుమాడినందున –

चाणूरान्ध्र निषूदनः..825

1. ఆన్ధ్రుడైన చాణూరుని పరిమార్చినవాడు.

   చాణూర ముష్టికాది మల్లులను సంహరించిన శ్రీకృష్ణుడు.

   చాణూరుడు ఆన్ధ్రజాతికి చెందిన మల్లయోధుడని ప్రసిద్ధి.

2. **चाय्यन्ते पूज्यन्ते इति चाणूराः. प्रशस्त हृदयाः साधवः.** (సత్యభాష్యం)

   పూజింపబడేవారు చాణూరులు. మంచి హృదయం గల సాత్త్వికులు– దైవీగుణవిలసితులు. వారిని అంధీకరించువారు 'చాణూరాన్ధ్రులు'. **'अन्ध दृष्ट्युपघातें'** అనే ధాతువు ననుసరించి, వారి (సాత్త్వికుల) తేజస్సులు హరించే రజోగుణ తమోగుణ శక్తులే చాణూరాన్ధ్రులు. వారిని నశింపజేసేవాడు నారాయణుడు.

3. అంధకారశక్తులను హరించే తేజఃస్వరూపుడు ఆదిత్యరూప నారాయణుడు.

   ఈ మహాప్రకాశస్వరూపుడు అనంతంగా భాసిస్తున్నందున–

సహస్రార్చిః సప్తజిహ్వాః సప్తైధాః సప్తవాహనః।
అమూర్తిరనఘోఽచింత్యో భయకృద్ భయనాశనః॥ 89

826. సహస్రార్చిః, *827.* సప్తజిహ్వాః, *828.* సప్తైధాః,
829. సప్తవాహనః, *830.* అమూర్తిః, *831.* అనఘః,
832. అచిన్త్యః, *833.* భయకృత్, *834.* భయనాశనః.

సహస్రార్చిః. 826

1. వేల జ్వాలలు కలవాడు.

'సహస్రం' అనంతత్వాన్ని తెలియజేసే పదం. అర్చిస్సులనగా జ్వాలలు, ఖడ్గాలు. విశ్వమంతా వ్యాపించిన అనంత ప్రకాశుడు విష్ణువు. ఈ ప్రకాశమే సూర్యాగ్నులలో, జ్యోతిర్మండలాలలో భాసిస్తూ, సర్వజీవకోటిలో కాంతిగా, బలంగా, చైతన్యంగా దీపిస్తోంది.

దివి సూర్య సహస్రస్య భవే ద్యుగపదుత్థితా।
యది భాః సదృశీ సాస్యాద్భాసస్తస్య మహాత్మనః॥ (భగవద్గీత)

– "ఒక్కమారుగా వేయి మంది సూర్యుల కాంతి వ్యాపించినట్లయితే అది ఆ మహాత్ముని (విశ్వరూపుని) కాంతికి సమానం కావచ్చునేమో!" అని విశ్వరూపుడైన పరమాత్మను వర్ణించారు. అనంత కాంతిని ఈ నామం తెలియజేస్తోంది.

2. అగ్ని, సూర్య స్వరూపుడు.

ఆరాధింపబడే అగ్నిజ్వాలలు అనంతాలు.

ఈ నామం సూర్య పరంగా, అగ్నిపరంగా వేదంలో పలుతావుల పేర్కొనబడింది.

...సహస్రస్తరీః శతనీథ ఋభ్వా ॥
సహస్ర యాజసః ॥ సహస్ర మీడే ॥ సహస్రవీరమ్॥

సహస్రపర్ణః। సహస్రపోషిణమ్। వంటి శబ్దాలు ఋగ్వేదంలో చెప్పినవి.

సహస్రం హైత ఆదిత్యస్య రశ్మయః (బ్రాహ్మణం)

యస్యరశ్మి సహస్రేషు (శాంతి పర్వం)

ఈ శ్రుతిస్మృతి వాక్యాలు సూర్యుని సహస్రకిరణునిగా వర్ణించాయి.

వాయు, మత్స్య పురాణాల ఆధారంగా–

వర్షాన్ని కురిపించే కిరణాలు 400. ఇవి 'వృష్టిసర్జనాలు'. వేడిని కలిగించేవి 300. ఇవి ఘర్మ సర్జనాలు.

మంచును కలిగించేవి 300. హిమసర్జనాలు.

<u>వృష్టి సర్జనాల పేర్లు</u> : ఆనందనాః – 100, మేధ్యాః – 100, నూతనాః –100, పూతనాః – 100, వీటికి నామాంతరాలు: బంధనాః, బమలదాః, కాతనాః, కోతనాః.

<u>ఘర్మసర్జనాలు</u> : రుద్రాః – 100, విశ్వభృతః–100, ఉకుహాః–100. వీటికి నామాంతరాలు: శుక్రాః, మాధ్వ్యాః, శక్వర్యాః.

<u>హిమసర్జనాలు:</u> – మేష్యాః – 100, పోష్యాః – 100, హ్యదిన్యాః – 100. వీటికి నామాంతరాలు: రేష్యాః, వాష్యాః, మేధ్యాః.

వీటన్నిటికీ కలిపి 'చన్ద్రాః' అని కూడా పేరుంది.

అగ్నిస్వరూపుడై ఆరాధింపబడే యజ్ఞేశుడు కనుక–

సప్తజిహ్వాః.. 827

1. ఏడు నాలుకలవాడు.

హోమాగ్నిరూపుడైన పరమాత్మునకు ఏడు జిహ్వాలు.

కాలీ కరాలీ చ మనోజవా చ।
సులోహితాయా చ సుధూమ్రవర్ణా।
స్ఫులింగినీ విశ్వరుచీ చ దేవీ
వేలాయమానా ఇతి సప్తజిహ్వాః। (ముండకోపనిషత్తు)

1. కాలీ, 2. కరాలీ, 3. మనోజవా, 4. సులోహిత, 5. సుధూమ్రవర్ణా, 6. స్ఫులింగినీ, 7. విశ్వరుచీ – అనే ఏడు నాల్కలు. వివిధ విధాలుగా గ్రహించే అగ్నిశక్తులనే నాల్కలుగా సంభావించారు.

తద్వక్త్ర దేవతానాఞ్చ హుతభుక్ పరమేశ్వరః।
మన్త్రపూతం యదాఽదాయ హుతమాజ్యపురస్సరమ్।
బ్రహ్మాణ్డ భువనం సర్వం సన్తర్పయతి సర్వదా।।

"అగ్నిని ముఖంగాగల దేవతలలో హనిస్సును భుజించేవాడు పరమేశ్వరుడు. మంత్రించే శుద్ధమైన నెయ్యి మొదలైన హోమద్రవ్యాలచేత, బ్రహ్మాండ భువనాలన్నిటికీ సదా తృప్తిని కలిగిస్తున్నాడు" (పౌండరీక సంహిత).

దివశ్చిదగ్నే మహినా పృథివ్యా వచ్యన్తాం తేవహ్నయః సప్తజిహ్వాః ।।
(ఋగ్వేదం)

అగ్నిముఖుడైన విరాట్పురుషుడు – బహురసగ్రహణంచేసే బహు జిహ్వాలతో భాసిస్తున్నాడు. అనంత జ్వాలలను రగిల్చే అనన్త ఇన్ధనాలు కూడా ఈయన స్వరూపాలే.....

సప్తైధాః.. 828

1. ఏడు ఏధస్సులు (ఇన్ధనాలు) కలవాడు.

'ఏధాంసి – ఇన్ధనాని – దీపనాని –'

ఏడురకాల దీప్తులు కలవాడు.

సప్తవిధ వర్ణాలను కలిగిన కాంతిని భావించవచ్చు. అటువంటి కాంతి స్వరూపుడు.

సప్త తే అగ్నే సమిధాః సప్తజిహ్వాః।। (యజుర్వేదం)
సప్తతే అగ్నే సమిధః సప్త జిహ్వాః సప్త ఋషయః సప్తధామ ప్రియాణి।
సప్త హోత్రాః సప్తధా త్వా యజన్తి సప్తయోనీరాపృణస్వ ఘృతేన స్వాహా।।
(యజుర్వేదం)

సంప్రదాయ సిద్ధంగా– తులసి, అశ్వత్థం, బిల్వం, ఖదిరం, అర్కం, శమీ, పాలాశం... ఇవన్నీ దివ్య వృక్షసంబంధులు. విష్ణువిభూతి కలిగినవి.

2. సప్తగ్రహాలలో ఒకే సూర్య తేజస్సు ప్రకాశిస్తున్నది.

తేజః స్వరూపుడైన నారాయణుడు సూర్యునిగా భాసిస్తున్నవాడు కనుక.....

సప్తవాహనః..829

1. ఏడు వాహనాలు కలవాడు.

సూర్యునికి ఈ నామం ప్రసిద్ధి. సూర్య భగవానునిగా దీపించే విష్ణువు.

సప్తయుఞ్జన్తి రథమేక చక్రమేకో <u>అశ్వోవహతి సప్తనామా</u> (ఋగ్వేదం)

<u>సప్తచక్రం</u> సప్త <u>వహన్త్యశ్వాః</u> ॥(ఋగ్వేదం)

ఏకకాంతి సప్త వర్ణాలుగా విశ్లేషించబడుతున్నది – అని వర్ణ శక్తిగా ఈ నామాన్ని దర్శించారు ఆధునికులు.

2. వేదస్వరూపుడైన సూర్యనారాయణుడు – సప్తఛందస్సులతో భాసిస్తున్నవాడు.

వేద మంత్ర గమనం ఛందస్సుల ద్వారా సాగుతున్నది. గాయత్రి, బృహతి, పంక్తి, త్రిష్టుప్, ఉష్ణిక్, జగతి, అనుష్టుప్ – అనే ఏడు ఛందస్సులే ఏడు అశ్వాలు.

దీనిని ఆధ్యాత్మికంగా దర్శిస్తే–

ఒకటిగా గోచరించి సంచరించే ఏకచక్రం ఈ శరీరం. దీనిని నడుపుతున్న సప్తాశ్వాలు సప్తధాతువులు. ఇవే శరీరానికి గమనసామర్థ్యాన్నిస్తున్నాయి.

సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్
సప్తార్చిషః సమిధః సప్తహోమాః,
సప్త ఇమ్ లోకా యేషు చరన్తి
ప్రాణా గుహాశయా నిహితాః సప్తసప్త॥

'ఆ పరబ్రహ్మ నుండి సప్త ప్రాణాలు, సప్తజ్వాలలు, సప్త సమిధలు, సప్త హోమాలు, తమ హృదయగుహలలో సంచరిస్తున్న ప్రాణాలు గల ఈ

జీవులు నివసించే సప్తజగములు కలిగాయి.

వ్యాపించే జ్వాలలతో, దేనినైనా స్వీకరించగలిగే దీప్తులతో, అంతటా పయనించేవాడు, ఈ సర్వవ్యాపకుడు. కానీ, ఒక ఆకృతిగా ఇమిడేవాడు కాడు కనుక –

అమూర్తిః.. 830

1. ఆకారరహితుడు.

'మూర్తి' – అంటే 'పట్టుకోడానికి అనుకూలించే ఘనరూపం'.

'తాభ్యోఽభితప్తాభ్యో మూర్తి రజాయత'.

'అభితప్తాలైన (చక్కగా ధ్యానించబడిన) ఆ జలాల నుండి ఘనరూపం (మూర్తి) ఏర్పడింది' (అదియే పృథ్వి) అనే శ్రుతివాక్యం ఇందుకు ప్రమాణం. అటువంటి ఘనరూపంలేనివాడు. ఎవరికీ పట్టుబడనివాడు, శరీరావయవాదుల అమరికలేనివాడు.

అన్ని మూర్తులలో వ్యాపించినవాడు కనుక – 'ఇదియే మూర్తి' అని నిర్దేశింపలేని పరమాత్మ. 'విశ్వమూర్తియే అమూర్తి'.

2. మోహం లేనివాడు.

మూర్తిరాకారో మోహోవా స నవిద్యతే యస్య సోఽమూర్తిః. (సత్యభాష్యం)

'మూర్తి' అంటే ఆహారం – మోహం అని అర్థాలు. ఎటువంటి మోహం (అజ్ఞానం) లేనివాడు.

అగ్నిహోతారం ప్రవృణే మియేధే గృత్సం కవిం విశ్వవిదమమూరమ్. (ఋగ్వేదం)

<u>విశ్వవిదం + అమూరం.</u>

అమూరం – అమూర్తి.

ఈ మంత్రం అగ్నిస్వరూపాన్ని చెప్తున్నదే. ఆధ్యాత్మికంగా ఆత్మచైతన్యమే అగ్ని. అది అనంత ప్రకాశం కలది. (సహస్రార్చిః), ఏడు ఇంద్రియాల (పంచ

జ్ఞానేంద్రియాలు – మనోబుద్ధులు)తో అన్నిటినీ స్వీకరించి (సప్తజిహ్వాః), శబ్ద స్పర్శరూపరసగంధాలు, మనన, ధారణలు– అనే సప్తసమిధలను గ్రహిస్తూ (సప్తైధాః), సప్తధాతువుల ద్వారా (సప్తార్చిషః), శరీర చక్రాన్ని నడుపుతున్నది. నిజానికి అది వీటన్నిటికీ అతీతమైన పరమాత్మయే (అమూర్తిః).

ఏ దోషమూ లేని శుద్ధ బ్రహ్మమిది కనుక –

అనఘుఃః..——831

1. పాపము లేనివాడు.

   దోషం, దుఃఖంలేని శుద్ధుడు.

2. చెడు నడత లేనివాడు.

   'అఘుఃః – కుత్సితగమనఃః'

   చెడు నడతయే అఘుము. ప్రశస్తమైన గతి కలిగిన సూర్యాదుల రూపంలో ఉన్నవాడు– అనఘుడు. సత్ప్రవర్తన కలిగిన దివ్యమూర్తి. దోషరహితమైన శుద్ధ సత్త్వ స్వరూపుడు.

   సత్వే హి సత్యం నహి తత్ర దోషః (సత్త్వమునందే సత్యమున్నది. అందులో దోషంలేదు) అని శాస్త్రోక్తి.

   ఏ మూర్తీలేని అనంత తేజస్వీ, శుద్ధుడు కనుక ఊహలకు కూడా అందనివాడై–

అచిన్త్యఃః..——832

1. తెలుసుకొనుటకు సాధ్యంకానివాడు.

   'చితీ సంజ్ఞానే' అనే ధాతువు ననుసరించి – ప్రమాణాలచే లెస్సగా తెలుసుకొనుటకు శక్యుడు కాడు. ఆయనను ఏ ప్రమాణంతోనూ తెలుసు కోలేం. మనసుకి సైతం అగోచరుడు. **'ప్రమాత, ప్రమాణం, ప్రమేయం'** ...(కొలిచేది – కొలత– కొలవబడేది) అనే త్రిపుటికి కూడా సాక్షీభూతుడు.

సృష్టిలోనున్న అన్ని వస్తువుల కంటే విలక్షణుడు (ఆయా వస్తువుల లక్షణం కంటె భిన్నమైనవాడు.) కనుక 'ఈతడు ఇట్టివాడు' అని ఎవరిచేతనూ చింతించడానికి సాధ్యంకాదు.

యద్వాఽహ సత్యముత యన్న విద్మ
ధియోహిన్వానో ధియ ఇన్నో అవ్యాః॥ (ఋగ్వేదం)

బుద్ధికి అందని చైతన్య స్వరూపుడితడు.

తన అపరిమిత లక్షణాల చేత, పరిమితబుద్ధులకు అందక భీతిని కలిగిస్తున్నందున –

భయకృత్.. 833

1. *భయం కలిగించువాడు.*

అంతుపట్టని తనమే భయం. పరిమితదృష్టితో చూసినవారికి అపరిమితమైనది భయం కలిగిస్తుంది. ఒక మహా తేజస్సు, ఒక పెద్ద ఉప్పెన... ఇవన్నీ భీతిని కలిగిస్తాయి. అలాగే తన అపరిమితత్వంతో – అంతుపట్టనివాడు కనుక, అనంతాన్ని గ్రహించలేనివారు భయానికి లోనవుతారు.

ఇలా అమిత విస్తారంగా అజ్ఞులను భయపెట్టే అద్భుతతత్త్వమితడు.

విస్తారమైన మహాపర్వతాలు, మహావృష్టి, ప్రచండ భాస్కరుడు, విద్యుత్ ఇలా ఈ విశ్వమంతా, భయజనకమైన భగవద్విభూతి వ్యాప్తమై ఉంది. ఈ విషయాన్నే ఈ క్రింది మంత్రం వ్యక్తీకరిస్తోంది–

ద్యావా చిదస్మై పృథివీ నమేతే,
శుష్మా చిదస్య పర్వతా భయన్తే।
యః సోమపా నిచితో వజ్రబాహుర్యో
వజ్రహస్తః స జనాస ఇన్ద్రః॥ (ఋగ్వేదం)

2. *పాపరహితుడైన ఈతడు (అనఘుడు) పాపులకు భయంకరుడు.*

సన్మార్గాన్ని తప్పిన దుష్టులను భయపెట్టే శిక్షకుడు.

భయవిహ్వల జగతిని కాపాడే సౌమ్యుడు కూడా ఈతడే –

భయనాశనః.. 834

1. *భయాన్ని తొలగించేవాడు.*

తాపంతో బాధపడే జగతికి వర్షంతోనూ, వర్షబాధితమైన దానికి తెరిపితోనూ, అంధకారానికి కాంతితోనూ, పగటికి రాత్రితోనూ అభయాన్నిచ్చేవానిగా విశ్వమంతా నిండినవాడు.

పాపరహితులకు సంసారభయాన్ని నశింపజేయువాడు.

ధర్మవర్తనుల విషయంలో సంతోషించి అభయాన్ని కలిగించేవాడితడు. తత్త్వజ్ఞానప్రదాత.

వర్ణాశ్రమా చారవతా పురుషేణ పరఃపుమాన్।
విష్ణురారాధ్యతే, పంథా నాన్యస్తత్తోషకారకః।। (విష్ణుపురాణం)

"వర్ణాశ్రమాచారాలను సరిగా అనుష్ఠించే జీవుని చేతనే పరమపురుషుడైన విష్ణువు ఆరాధింపబడుతున్నాడు.

స్వధర్మాచరణమే భగవత్ప్రీతికర మార్గం. ఇంతకంటే మరో సంతోషకరమార్గం లేదు".

యత ఇన్ద్ర భయామహే
తతో నో అభయం కృధి ।। (ఋగ్వేదం)
ఆరే అస్మత్ కృణుహి దైవ్యం
భయమారే హేతీరదేవీః ।। (ఋగ్వేదం)

– భయాలను తొలగించి, అభయమిచ్చేవాడిగా పరమాత్మను వేదమాత వర్ణించింది.

'నబిభేతి కుతశ్చన' (తైత్తిరీయోపనిషత్తు)– సత్యం తెలిసినవాడు దానివలన భయపడడు.

'భయాభయకరః కృష్ణః' అని పురాణవాక్యం. కంసాదులకు భయాన్ని కలిగించి, ధర్మరాజాదులకు అభయాన్నిచ్చిన కర్మఫలప్రదాత.

ఉభయాన్నీ కలిగించే అనంత విస్తార స్వరూపుడు కనుక – అత్యంత సూక్ష్ముడూ – మహాస్థూలుడూ ఈయనే...

అణుర్బృహత్ కృశః స్థూలో గుణభృ న్నిర్గుణో మహాన్।
అధృతః స్వధృతః స్వాఽఽస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః॥ 90

835. అణుః, 836. బృహత్, 837. కృశః, 838. స్థూలః, 839. గుణభృత్, 840. నిర్గుణః, 846. మహాన్, 842. అధృతః, 843. స్వధృతః, 844. స్వాస్యః, 845. ప్రాగ్వంశః, 846. వంశవర్ధనః.

అణుః.. 835

1. మిక్కిలి సూక్ష్మమైనవాడు.

అంతటా వ్యాపించగలిగే శక్తియే సూక్ష్మం.

పంచభూతాలలో సూక్ష్మమైనది ఆకాశం. దాని కంటె సూక్ష్మమైనవాడు.

సూక్ష్ములైన పంచభూతాల కంటె, వాటికి హేతువులైన శబ్దాది తన్మాత్రల కంటె, అహంకార మహత్తుల కంటె సూక్ష్ముడై, హేతువై ఉన్నందున వాటన్నిటియందు, వాటితో కూడిన జగతియందు వ్యాపించినవాడు.

ఆకాశం కంటె సూక్ష్మమైనది.

సూరా అణ్వం వితన్వతే॥ (ఋగ్వేదం)

అత్యంత సూక్ష్ముడు కనుకనే, మనకంటి కగుపడని సూక్ష్మజీవులలో సైతం వ్యాపించి ఉన్నవాడు.

ఈ అత్యంత సూక్ష్ముడైన పరమాత్మ కేవలం అనుభూతిచే మాత్రమే తెలియబడేవాడు.

ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః (ముండకోపనిషత్తు)

2. **అణతి గచ్ఛతీతి అణుః.**

కదలువాడు – వ్యాపించువాడు – అణువు.

3. ***అణతి శబ్దాయతే (అణశబ్దే)*** – ధాతువుననుసరించి శబ్దించునది. అంతటా వ్యాపించిన శబ్ద స్వరూపుడు.

అంతటా వ్యాపించడం చేతనే ఈ అనంత బ్రహ్మాండాలన్నీ తానై భాసిస్తున్నందున –

బృహత్..836

1. వృద్ధి పొందినవాడు.

అతి విస్తారమైనవాడు. అతి చిన్న వస్తువు కూడా తనను తాను పూర్ణంగా, బలంగా భావించడానికి కారణం – తన యందు సైతం వ్యాపించిన అణుస్వరూపుని వలననే. ఇలా అన్నిటా, అంతటా ఉన్న మహా విస్తారస్వరూపుడు.

ఆత్మతత్త్వమే ప్రపంచ రూపంలో వృద్ధిపొంది, ప్రాణులను వృద్ధినందిస్తున్నది.

'అణోరణీయాన్' (అణువు కంటె అణువు) అని చెప్పిన కఠోపనిషత్, వెంటనే **'మహతో మహీయాన్'** అని పేర్కొంది – 'గొప్ప పరిమాణం కల ప్రతి ఒక దాని కంటె గొప్ప పరిమాణం కలది'.

ఈ అనంత విస్తార స్వరూపమే 'బ్రహ్మ' అని పరమాత్మను పేర్కొంటారు. **(బృహత్వాత్ బ్రహ్మ.)**

అగ్నే బృహతో అధ్వరే॥ జాతవేదో బృహతః సుప్రణీతే ॥ (ఋగ్వేదం)

బృహత్మేతుం పురురూపం ధనస్పృతం

సుశర్మాణం స్వవశం జరద్విషమ్॥

దీర్ఘతన్తుర్బృహదుక్షాయ మగ్నిః ॥ (ఋగ్వేదం)

ఇంకా 'బృహద్రేణుః' 'బృహన్మతే' వంటి నామాలతో పలుతావులలో 'ఋగ్వేదం' కీర్తించింది.

కృశః.. 837

1. సన్ననివాడు.

'స్థూలము కానివాడు' అని చెప్పడం దీని ఉద్దేశం. స్థూలమూ ఈతడే, స్థూలము కానివాడూ ఈతడే. 'బృహత్' ద్వారా అతి విస్తారస్వరూపుడని చెప్పబడిన పరతత్త్వం, ద్రవ్య ధర్మాలేవీ లేనిదని చెప్పడమే దీని ఆంతర్యం.

'అస్థూలం' (బృహదారణ్యకోపనిషత్తు)

సత్యం తదిన్ద్రా వరుణా కృశస్య వసాం మధ్వ
ఊర్మిదుహతే సప్తవాణీః ॥ (ఋగ్వేదం)

'క్రశిమా లఘిమా చాయత్' ఇత్యాది వచనాత్। (సత్యభాష్యం)

ఈ శబ్దానికి 'లఘువైనవాడు' అని కూడా అర్థం. ఇది కూడా సూక్ష్మమైన వ్యాపకతత్త్వాన్ని తెలియజేస్తున్నది.

ఈ వ్యాపకత్వం చేతనే ప్రపంచరూపంగా అతడు లావై గోచరిస్తున్నాడు-

స్థూలః.. 838

1. లావైనవాడు.

స్థూలత్వ, కృశత్వాది ద్రవ్యధర్మాలేవీ ఆత్మకు లేకపోయినప్పటికీ, ప్రపంచరూపంగా స్మర్వాత్ముడు కనుక - ఈతడు 'స్థూలః' అని చెప్పబడుతున్నాడు. ఇది 'ఔపచారికం'. (ఒకదానిని మరొకదానినిగా వ్యవహరించడం ఆరోపం. ఇది ప్రయోజన దృష్టితో తెలిసి చేస్తే ఉపచారం (ఔపచారికం). తెలియక భ్రాంతితో చేస్తే అధ్యాసం).

నానా విధమైన విశ్వరూపంగా అభివ్యాపించి ఉన్నవాడు (తిష్ఠతీతి స్థూలః) స్థూలుడు.

'స్థూలే పరిబృంహణే' - పరిబృంహణం = వర్ధనమ్।

విశ్వాన్ని 'బాగా వృద్ధిచెందించే' విశ్వరూపుడు.

స్థూల ముపాతసత్। (యజుర్వేదం)

ఈక్షే హి వస్వ ఉభయస్యరాజన్
ధా రత్నం మహి స్థూరం బృహన్తమ్ ॥ (ఋగ్వేదం)

(స్థూర, స్థూల శబ్దాలు సమనార్థకాలు)

స్థూలమైన ఈ శరీరం సూక్ష్మమైన ఆత్మయందే ఆధారపడి ఉంది. గతి సమర్థత కలిగి ఉంది. శరీరమంతా ఆ ఆత్మ చైతన్యమే వ్యాపించి ఉంది. ఆ కారణంగా, అతీతమైనప్పటికీ ఆత్మయే స్థూల శరీరంగా వ్యవహరింపబడుతోంది.

ఒకే చోటనే ఉండి సమస్తాన్నీ స్పర్శించి చేతనత్వం కలిగించేవాడు- అంతటా విస్తారమైన వెలుగంతా ఒక జ్యోతియందే ఉన్నట్లుగా.

విరాడ్రూపునిగా స్థూలుడై విశ్వమంతా వ్యాపించి ధరించుటచే, విశ్వంలోని అన్ని గుణాలను భరిస్తున్నవాడు-

గృణభృత్..... 839

1. గుణాలను భరించువాడు.

సృష్టి స్థితి లయలలో మాయోపాధివశంతో సత్త్వరజస్తమో గుణాలకు అధిష్ఠాతగా ఉండడం చేత - 'గుణాలను భరిస్తున్నవాడు' అని పేర్కొన్నారు.

విశ్వాన్ని వృద్ధిపరుస్తున్న (బృహత్ - స్థూలః)వాడు ఆయా గుణాలకు కూడా ఆధారభూతమై పెంపొందిస్తున్నాడు.

గుణాలకు తాను ఆధారమైనప్పటికీ, అతీతుడు కనుక -

నిర్గుణః..... 840

1. గుణాలు లేనివాడు.

విశ్వనిర్వాహకునిగా గుణాలను భరిస్తున్నప్పటికీ, తనలో ఏ గుణ వికారాలూ లేనివాడు.

'కేవలో నిర్గుణశ్చ' అని ఉపనిషద్వాక్యం.

అత్యంతశుద్ధుడు, నిర్గుణుడు. అన్ని గుణాలను తన వశంలో ఉంచి, తాను వాటికి వశంకాడు.

గుణాలను భరించినవాడైనప్పటికీ,'గుణీ' (గుణం కలవాడు) కాడు. శబ్దస్పర్శాది గుణాలేవీ లేని సర్వోన్నతుడు కనుక –

మహాన్.. 841

1. *బాగా వృద్ధిని పొందువాడు.*

దేని యందూ ఇముడనంత పెద్దవాడు.

'అసంగోఽశబ్దోఽశరీరోఽస్పర్శశ్చ మహాన్ శుచిః' (ఆపస్తంబధర్మ సూత్రాలు).

'ఆత్మ అవయవాలు కానీ, శబ్దగుణంకానీ, శరీరంకానీ లేనివాడు. స్పర్శ రహితుడునూ అయి ఉన్నాడు. కాబట్టి 'మహాన్' 'శుచిః' అని చెప్పదగిన వాడు'.

సూక్ష్ముడు, నిత్యశుద్ధుడు, సర్వగతుడు – అయిన కారణంగా ఈయనను ఇమిడ్చి ఉంచగలిగేదేదీ లేదు.

2. *పూజ్యుడు.*

'మహ పూజాయాం' అనే ధాత్వర్థాన్ని అనుసరించి **'మహ్యతే పూజ్యతే ఇతి మహాన్'** (సత్యభాష్యం).

పూజింపదగినవాడు. పై చెప్పిన సర్వోత్కృష్టతచే అందరిచే పూజింప దగినవాడు, లక్ష్యమైనవాడు ఈతడే.

యా రాయోవనిర్మహాన్త్సుపారః
సున్వతః సఖా। తస్మా ఇన్ద్రాయ గాయత్ ॥(ఋగ్వేదం)
మహాన్ అగ్నిర్వనసా రాతహవ్యః ॥(ఋగ్వేదం)
మహాన్ అసి సూర్యః ॥ (ఋగ్వేదం)

✣ ✣ ✣

'అణుః' (835) నామం నుండి ఈ నామం (841) వరకు ఏడు నామాలు ఒక చక్కని క్రమంలో ఉన్నాయి. రెండు పరస్పర విరుద్ధాలు అణుః – బృహత్, కృశః –స్థూలః, గుణభృత్ – నిర్గుణః. ఈ రెండూ తానవడం – ఏదీ తాను కాని, సర్వ వ్యాపకత్వాన్ని, నిస్సంగాన్ని సూచిస్తోంది. కనుకనే అతడు 'మహాన్' అని పూజింపబడుతున్నాడు.

✣ ✣ ✣

దేనిలోనూ ఇముడునంతటివాడు కాడు కనుక, ఏ ఒక్కదానికీ పట్టుబడని వాడు–

అధృతః.. 842

1. *ధరించబడనివాడు.*

అన్నిటినీ ధరించే ఈతనిని ఏ ఒక్కటీ, ఏ ఒక్కరూ భరించలేరు. ధారణా సమర్థాలైన భూమ్యాదులు కూడా ఈతనిని భరించలేవు. అత్యంత సూక్ష్ముడు సర్వవ్యాపీ కనుక దేనికీ పట్టుబడడు.

భూమి కంటె సూక్ష్మమైనది జలం, దాని కంటె సూక్ష్మం అగ్ని, అగ్ని కంటె సూక్ష్మం వాయువు, దాని కంటె సూక్ష్మం ఆకాశం. ఇవి ఒకదాని కంటె ఒకటి ధరించుటకు కష్టమైనవి. వాటన్నిటి కంటె సుసూక్ష్మమైన ఆత్మచైతన్యం వాక్కుతోగాని, బుద్ధిచేగానీ ధరింపబడదు.

మరి ఈతనికేది ఆధారం? తనకు తానే–

స్వధృతః.. 843

1. *తన చేత ధరింపబడువాడు.*

'స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి, స్వేమహిమ్ని' (ఛాన్దోగ్యోపనిషత్తు)

'హే భగవాన్! ఆ పరమాత్ముడు దేనియందు నిలుపబడి ఉన్నాడు!' అని

నారదుడడిగితే, 'తన మహిమయందే' అని సనత్కుమారుల సమాధానం. స్వతంత్రుడు పరమాత్మ.

విశ్వరూపుడై విశ్వాన్ని తనయందు ప్రకటిస్తూ, ఆ విశ్వంలోని దేనిచేత ధరింపబడక, తనయందు తాను ప్రతిష్ఠితుడైనవాడు. చేతులు అన్నిటినీ పట్టుకుంటున్నా, చేతిని నడిపే చైతన్యాన్ని ఆ చేయి సైతం ధరించలేదు. ఆ చైతన్యం తనను తానే ధరిస్తోంది.

అన్నిటికీ ఆధారమైన స్థితి ఈతడే కనుక–

స్వాస్థ్యః.. 844

1. చక్కని స్థితి కలవాడు.

'ఆస ఉపవేశనే' అనే ధాతువు ననుసరించి – **ఆ సనమాస్యా, స్వయం స్వస్మిన్ వా ఆస్యా యస్య సః స్వాస్థ్యః** (సత్యభాష్యం).

తాను తనయందు ఉన్నవాడు – స్వాస్థ్యుడు.

సు+ఆస్థ్యః= స్వాస్థ్యః, సు శోభనా ఆస్యా స్థితిః. శోభనకరమైన స్థితి కలిగినవాడు. స్థిరమై, సుష్ఠు అయినది 'సు'. అటువంటి ఆధార స్వరూపమే పరమాత్మ. జగతికి మేలైనస్థితి ఈతడే.

వృక్షశాఖలపై పక్షులు శోభనమైన ఆధారాన్ని పొందినట్లుగా, సమస్త విశ్వమూ విష్ణునియందే స్థితి పొంది ఉన్నాయి.

2. అందమైన ముఖం కలవాడు.

సు+ ఆస్యః. (ఆస్యమనగా మోము).

దివ్యమంగళ విగ్రహుడైన విష్ణుని వదనం అందమైన, శుభాల సదనం. 'పద్మోదరతల తామ్రం అభిరూపతమం'– అని జగద్గురు శంకరాచార్యుల వర్ణన. 'పద్మపు మధ్య భాగం వంటి అరుణ శోభ కలిగిన మిగుల అందమైన ముఖం'.

'నిగనిగమనుచు కపోలయుగముచే మెఱయు మోము సొగసు చూడ

తరమా' అని త్యాగరాజ స్వామి కీర్తించారు.

జగతికి మేలు(సు) కలిగించే సుశబ్దాలైన వేదరాశిని తన ముఖం నుండి జనింపజేసినవాడు, కనుక ఈయన ముఖం చక్కనిది.

'అస్యమహతో భూతస్య' (బృహదారణ్యకం)

'ఋగ్వేదాది వాగ్విస్తారమంతా ఈ మహాభూతవు నిఃశ్వాసితమే' (శ్వాసయే).

ఈ సుస్థితిరూపుని నుండే అన్ని పరంపరలూ ఉద్భవించాయి కనుక-

✣ ✣ ✣

'అణుః' (835) నామం నుండి 'అధృతః' (842) నామం వరకు అష్టసిద్ధి స్వరూపునిగా విష్ణుని దర్శించారు పరాశరభట్టు.

అణిమ అనే ఐశ్వర్యం (అణుః), మహిమ (బృహత్), లఘిమ (కృశః), ప్రాప్తి (స్థూలః), ఈశిత్వం (గుణభృత్), వశిత్వం (గుణాలకుతాను వశంకాక - గుణాలను తన వశంలో ఉంచుకున్నవాడు - నిర్గుణః), ప్రాకామ్యం (మహాన్), ఇచ్ఛాసిద్ధి (అధృతః).

ఇవి సంసారబద్ధులు సాధనతో సిద్ధింపజేసుకున్నట్లుగా కాక, స్వతఃసిద్ధ ఐశ్వర్యంగా ఈతనికి ఉన్నాయి (స్వధృతః). అంతేకాదు సదా ఈ ఐశ్వర్యస్థితి కలిగినవాడు (స్వాస్యః).

✣ ✣ ✣

ప్రాగ్వంశః... 845

1. ముందు నుండి తన వంశం కలవాడు.

పరమాత్ముని వంశం ఈ ప్రపంచం. ఇది అనాది - ఆది ఇది అని నిర్ణయించ శక్యం కానిది. 'అనాది' లక్షణమే 'ప్రాక్' అని చెప్పబడింది. తన పేరున వంశం (తరముల సాగుదల) కలవారి వంశాలన్నీ పాశ్చాత్యాలు (పశ్చాత్- తరువాత ఏర్పడినవి). అతి పురాతనమైన ప్రపంచమే ఈతని వంశం.

విశ్వావిర్భావానికి ముందే విశ్వ నిర్వహణ హేతువులైన సప్తర్షులు, మనువులు మొదలైనవారిని ఏర్పరచగలడు.

మహర్షయః సప్తపూర్వే చత్వారోమనవస్తథా।
మద్భావా మానసా జాతా ఏషాంలోకా ఇమాః ప్రజాః॥ (భగవద్గీత)

"సప్తర్షులు, వారి పూర్వులైన సనకాది బ్రహ్మమానసపుత్రులు నలుగురు, పదునలువురు మనువులు నా సంకల్పంచే మానసికపుత్రులై జన్మించారు. వారి నుండి ఈ లోకం, ఈ భూతజాలం ఉత్పన్నమైనవి."

పూర్వామను ప్రదిశం యాతి చేకితత్
సంరశ్మిభిర్యతతే దర్శతో రథోదైవ్యో
దర్శతోరథః ॥(ఋగ్వేదం)

2. ప్రాక్ – తూర్పుదిక్కు. అక్కడ ఉదయించి తన కిరణజాలాలను విస్తృతంగా వెదజల్లే సూర్యరూప నారాయణుడు.

1. ప్రకర్షేణ అంచతి గచ్ఛతి, వమతి ఉద్గిరతీతి ప్రాగ్వంశః. (సత్యభాష్యం)

2. ప్రగమనమేవ వమతి – సౌరమండలస్థాన్ మయూఖాన్ బహిరుద్గిరతి (సత్యభాష్యం)

ప్రాగ్దిశను ఉదయించి ఉత్కృష్టంగా గమనంచేసి, తన నుండి కిరణాలను వెలికి ప్రసరింపజేయువాడు.

తాను ఉదయించే దిశ 'ప్రాక్'. తరువాత అన్ని దిశలూ నిర్ణయింప బడతాయి. కాలం కూడా ఈ ఉదయం నుండే లెక్కింపబడుతుంది.

ప్రకర్షేణ అంచతి వనతి శబ్దయతే సంభజతే చ ప్రాగ్వంశః. (సత్యభాష్యం)

ప్రకర్షంగా గమనంచేసి, తన గమనాన్ని అనుసరించి కాలగణనాన్ని (కాల విభాగాలను) ఏర్పరచినవాడు.

ఈ ప్రపంచ వంశాన్ని వృద్ధి చేస్తున్నందున –

వంశవర్ధనః.. 846

1. వంశాన్ని వృద్ధి చెందించువాడు.

ప్రపంచ రూపమైన వంశాన్ని కొనసాగించి పెంచేది ఈ పరమాత్మ.

2. ప్రపంచాన్ని ఛేదించువాడు.

సాగుతున్న జగతిని సమయమెరిగి లయం చెందించేవాడు.

'వృధు వృద్ధౌ' అనే ధాతువు ప్రకారం "వృద్ధి చెందించుట".

'వర్ధ - ఛేదన పూరణయోః' అనే ధాతువు ప్రకారం "ఛేదించుట- నశింపజేయుట" "పూరించుట" అనే అర్థాలను 'వర్ధన' శబ్దానికి గ్రహించవచ్చు.

వంశాన్ని వృద్ధి చేసే శక్తి నారాయణ విభూతియే.

మానో మహాన్త ముతమానో అర్భకం

మాన ఉక్షన్త ముతమాన ఉక్షితం॥ (యజుర్వేదం)

"పరమేశ్వరా! మా యింటి పెద్దవారిని, పిల్లలని, వీర్య సమృద్ధి కలిగిన (వంశ వృద్ధి చేయగలిగే)వారిని హింసించకు'.

'వంశకర్త - వంశచ్ఛేత్తా' కూడా పరమేశ్వరుడు.

దుష్టవంశ నిర్మూలకుడై రావణాది దనుజులను సమూలంగా నశింపజేసిన వాడు.

గురు పరంపర, ఋషి పరంపర కూడా 'వంశం' ద్వారా తెలియజేయ బడుతోంది. వాటిని వృద్ధిచేసి విద్యలను రక్షించువాడు.

3. కాలాన్ని సాగింపజేయువాడు.

పితృ, పుత్ర పౌత్రాది పరంపరలతో వృద్ధి చెందేది- వంశం. వేదాలకి కూడా 'వంశం' అనే పేరున్నది.

పర్వాలతో (కణుపులతో) కూడినది వంశం. వెదురుకి అనేక కణుపుల వలె పితృ-పుత్ర - పౌత్ర - ప్రపౌత్రా..... వంటి విభాగాలు వంశానికి ఉన్నాయి.

అదేవిధంగా వివిధ భాగాలతో విభజింపబడిన కాలాన్ని కూడా ఈ అర్థంలో గ్రహించవచ్చు.

విభజన ఉన్నప్పటికి ఒక భాగానికీ మరో భాగానికి ఉన్న పరస్పర సంబంధం చేత - అది 'పరంపర'గా 'కొనసాగింపు' కనుక 'పర్వం' అని వ్యవహారం. కాల భాగాలను 'పర్వాలు' అనడం కూడా ప్రసిద్ధి. పరస్పరానుబంధంతో సాగే విభజన - ఒకదాని నుండి ఒక దానికి కొనసాగింపు. ఈ కొనసాగింపుని వృద్ధిచెందించుట - సృష్టి స్థితులలో గోచరిస్తుంది. లయకాలంలో ఛేదనం.

కాలకర్త - సృష్టి స్థితి లయకర్త నారాయణుడు.

సూర్యరూప నారాయణుడు కూడా కాలాన్ని వృద్ధిచెందించే మూర్తి.

(అసలు - ఆయన పేరు తోనే ఒక మహా వంశం (సూర్యవంశం) వృద్ధి చెందింది కదా!)

ప్రపంచాన్ని పెంచడమే కాకుండా, పోషిస్తున్నవాడు కనుక -

भारभृत् कथितो योगी योगीशः सर्वकामदः।
आश्रमः श्रमणः क्षामः सुपर्णो वायुवाहनः॥ 91

847. भारभृत्, **848.** कथितः, **849.** योगी, **850.** योगीशः, **851.** सर्वकामदः **852,** आश्रमः, **853.** श्रमणः, **854.** क्षामः, **855.** सुपर्णः, **856.** वायुवाहनः.

भारभृत्ः. 847

1. భారమును మోయువాడు.

'ह्रियते धार्यते पोष्यते वेति भारः, तं बिभर्तीति भारभृत्'- ధరింపబడేది, పోషింపబడేది భారం. అదియే విశ్వం. దానిని ధరించి పోషించేవాడు భారభృత్ - నారాయణుడు.

చైతన్యమే అన్ని భారాలను భరిస్తున్నది. అదియే శరీరభారాన్ని మోస్తున్న ఆత్మ. విశ్వభారాన్ని మోస్తున్న పరమాత్మ.

2. అనంత, కూర్మాది రూపాలతో భూమిని మోస్తున్నవాడు సర్వగ్రహనక్షత్రాదులను వాటి స్థితులయందుంచి భరిస్తున్న చైతన్య స్వరూపుడు.

ఈ చైతన్యపు ఉనికినే విశ్వమంతా చాటుతోంది.

కథితః..848

1. చెప్పబడినవాడు.

ప్రతిపాదించ (తెలియజేయ)బడినవాడు.

వేదపురాణాదులచే 'సర్వోత్కృష్టము'గా ప్రతిపాదింపబడిన పరతత్త్వమితడే. సర్వవేదముల చేతను ఒకే మాటగా చెప్పబడిన వాడు.

సర్వే వేదా యత్పదమామనన్తి. (కఠోపనిషత్తు)

'సర్వవేదాలు ఏ తెలియదగిన (పదం) పరబ్రహ్మ తత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నాయో'...

వేదైశ్చ సర్వైరహమేవవేద్యః (భగవద్గీత)

'వేదములన్నిటి చేత నేనే తెలియబడదగినవాడను' అని పరమాత్మ వచనం.

వేదే రామాయణే పుణ్యే భారతే భరతర్షభ।
ఆదౌ మధ్యే తథాన్తే చ విష్ణుఃసర్వత్ర గాయతే।। (మహాభారతం)

'ఓ భారత వంశశ్రేష్ఠా! (అర్జునా!) పుణ్యములైన వేద, రామాయణ, భారతాలలో, వాటి మొదలు, నడుమ, చివరలలో అంతా విష్ణువే కీర్తింపబడుతున్నాడు'.

వ్యాపన శీలుడైన విష్ణుని మార్గానికి సంబంధించిన పరమపదం (కట్టకడపటి గమ్యస్థానం – పరమతత్త్వం) ఏది? అను ప్రశ్న కలుగగా – ఆ పరమాత్ముడు (విష్ణువు) ఇంద్రియాది సర్వతత్త్వము కంటె కూడా పరుడుగా (అతీతునిగా) వేదాదులచే ప్రతిష్ఠింపబడుతున్నాడు.

ఈ విషయం –

...తద్విష్ణోః పరమం పదమ్॥

'ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః అర్థేభ్యశ్చ పరం మనః।
మనసస్తు పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్‌పరః
మహతః పరమవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః॥
పురుషాన్న పరం కించిత్ సా కష్టా సా పరాగతిః,

ఉత్కృష్టగమ్యమైన విష్ణుపదం (సర్వవ్యాపక బ్రహ్మపదం) గురించి చెబుతూ– "ఇంద్రియాలను స్థూలాలుగా గ్రహించాలి. దీని కంటే ఇన్ద్రియార్థాలు (విషయాలు) సూక్ష్మం. దాని కంటె గొప్పది మనస్సు. దాని కంటె బుద్ధి, బుద్ధి కంటె మహత్తత్వం, దాని కంటె అవ్యక్తం, దాని కంటె ప్రత్యగాత్మ పురుషుడు శ్రేష్ఠం. దాని కంటె శ్రేష్ఠమైనది మరియొకటి లేదు. అదే పరమగమ్యం."

అన్నిటినీ మించిన ఆ పరమపురుషుని కంటె పరాగతి లేదు.

అపూర్వేణోషితా వాచోయం వదన్తి యథాయథమ్।
వదన్తీర్యత్ర గచ్ఛన్తి తదాహు ర్బ్రాహ్మణం మహత్॥ (అథర్వవేదం)

"యజ్ఞఫలముగా ప్రేరేపించబడిన వాక్కులు యథాతథంగా ఎవరిని చెప్తున్నాయో, ఎవరిలో లీనమవుతున్నాయో అది పరబ్రహ్మ".

ఇలా వేదోపనిషత్పురాణాలచే చెప్పబడినవాడు.

2. ప్రకటింపబడినవాడు.

భారమ్ భరించువాడొకడున్నాడని తెలియజేస్తోంది. విశ్వంలో ప్రతి అణువూ తనను నడిపించే చైతన్యం తనలోనే ఉందని ప్రకటించుతోంది. కదిలే ప్రతివాహనం కదిలించే శక్తినీ, వ్యక్తినీ తెలియజేసినట్లే, ఇంద్రియాల పనులు లోపలి జీవుని ఉనికిని చాటినట్లే – ఈ ప్రపంచంలో వ్యక్తీకరింపబడే ప్రతిశక్తి తనకు మూలమైన ఈశ్వర్య చైతన్యం ఉందని ప్రకటిస్తోంది.

ఇంద్రియాదులను ప్రేరేపిస్తున్నా వాటికి గోచరం కానివాడు. అయినా ఇన్ద్రియాల వర్తనలు అతని ఉనికినే చెబుతున్నాయి. విష్ణుని ఉనికిని విశ్వమే చాటుతోంది.

ఈ చాటబడే తత్త్వంలోనే విశ్వం కలసి ఉంది–

యోగీ.. 849

1. కలుపువాడు.

ఈశ్వరచైతన్యంతో కలిసినదే విశ్వం. ఇలా తనతో విశ్వాన్ని బంధించినవాడు. పరాపరాల యోగం చేయువాడు. ప్రపంచానికి పరుడైనప్పటికీ, ప్రపంచ మంతా వ్యాపించి చేతనత్వం కలిగిస్తున్నవాడు. సూర్యుడు గగనంలో ఉంటూనే, తన వ్యాపక శక్తితో భువనాలను కలుస్తున్నాడు, కలుపుతున్నాడు. అలాగే సర్వోన్నతుడైన పరమాత్మ సమస్త భువనాలను తన అనంత శక్తితో యోగం వహింపజేస్తున్నాడు.

2. అఘటితఘటనా సామర్థ్యం (కూడని వాటిని కలిపేశక్తి) కలవాడు.
3. యోగమనగా జ్ఞానం. దాని ద్వారా పొందబడేవాడు (గమ్యమైనవాడు).
4. యోగమనగా సమాధి. తనను స్వాత్మయందు ఏకీభావంతో నిలిపి ఉంచడం. ఆ సమాధి స్వరూపుడు యోగి అనగా సమాధియందు కేవలం అనుభవంగా ఉండే పరతత్త్వం.

ఈ యోగి సర్వయోగులకు ప్రభువు-

యోగీశః.. 850

1. పరస్పర సంబంధం (యోగం) కలిగిన జీవజగతి యోగి.

దీనిని శాసించు సర్వశ్రేష్ఠుడు జగదీశుడు- యోగీశుడు.

తమీశానం జగతః .... (యజుర్వేదం)

జగతికి ఈశానునిగా పరమాత్మను కీర్తించారు.

2. యోగులకు ఈశుడు.

స్వరూపం నుండి ఏనాడూ ఏమరనివాడు యోగిశ్రేష్ఠుడు. ఇతర యోగులు యోగవిఘ్నాలచే దెబ్బతిని, స్వరూపానుభవం నుండి ఏమరపాటు చెందుతారు. అలాంటి ప్రమాదంలేనివాడు, నిరంతర యోగస్థితిలోనున్నవాడు.

3. తనను ఉపాసించే, విచారణ చేసే భక్తులకు, జ్ఞానులకు పాలకుడైనవాడు.

సనన్దనాదీనప కల్మషాన్ మునీన్

చకార భూయోఽతి పవిత్రతం పదం॥ (విష్ణుపురాణం)

'అపగతదోషులైన సనందనాది మహర్షులను అతి పరిశుద్ధులునుగా చేసే పరతత్త్వమితడు'.

యోగుల అభీష్టాన్ని ప్రసాదించువాడు-

సర్వకామదః.. 851

1. అన్ని కోరికలను ఇచ్చువాడు.

భక్తాది యోగుల అభీష్టాన్ని ప్రసాదించే కరుణాళువు.

'ఫలమత ఉపపత్తేః. (బ్రహ్మసూత్రం)

'కర్మఫలము ఈ పరమాత్ముని నుండే లభిస్తోంది. యుక్తులను బట్టి ఈ విషయం సిద్ధిస్తోంది'.

ఫలప్రదాత.

యోగక్షేమం వహామ్యహమ్ (యోగక్షేమాలను నేనే వహిస్తున్నాను) అని ప్రకటించిన యోగే(గీ)శుడు.

యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు, వయం స్యామ పతయో రయీణామ్॥ (ఋగ్వేదం)

'దృతి ఖండయతి' అనే అర్థం ప్రకారం - యోగీశ్వరులకు జ్ఞానులకు అన్ని కామాలను తొలగించువాడు, అని పూర్వ నామానుబంధంతో గ్రహించవచ్చు.

అన్ని కోరికలను దాటిన పూర్ణశాంతి స్వరూపుడీతడు.

ఆశ్రమః.. 852

1. విశ్రాంతి స్థానంగా ఉన్నవాడు.

సంసారమనే అరణ్యంలో దారి తప్పి ఇటు అటు తిరిగేవారికి ఆశ్రమం

వలె విశ్రాంతి స్థానంగా ఉన్నవాడు.

2. బాగా తపింపజేయువాడు.

'శ్రము తపసి ఖేదేచ' అనే ధాతువు. 'ఆ' ఉపసర్గ. ఈ ఉపసర్గ 'బాగా' 'సంపూర్ణంగా'(ఆసమన్తాత్) అనే అర్థంలో వాడబడుతుంది.

ఆశ్రమ్యన్తే కర్మానురూపాం యోనిం ప్రాపయ్యయేన – ఇత్యాశ్రమః.

ఎవరి ద్వారా కర్మానుగుణమైన పుట్టువులను జీవులు పొంది తపిస్తున్నారో ఆతడు పరమేశ్వరుడు.

కర్మానుభవాలను ప్రసాదించువాడు (సర్వకామదః– 851) కనుక, ఆయా జీవుల కర్మలకు అనుగుణంగా ఈ సంసారంలో పరిభ్రమింపజేసి తపింపజేస్తున్నవాడు.

శ్రమస్యదాయం విభజన్త్యేభ్యో
యదా యమో భవతి హర్య్యే హితః॥ (ఋగ్వేదం)

3. శ్రమ యొక్క ఫలాన్ని విభజించి ఇచ్చి నియమించువాడు ఈశ్వరుడు.

జగతిని తన ఉదయంతో మేల్కొలిపి శ్రమింపజేస్తున్న సూర్యుడు కూడా ఆశ్రముడే.

4. ఎంతో తపించి పొందబడే పరతత్త్వమితడు.

ఎవని వలన తపిస్తున్నారో ఆతడు పరమాత్మ. చతురాశ్రమాలలో (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాలు) మానవులు ఆయా స్థితులకు అనుసరించిన నియమాలతో శ్రమించుతారు. అలా శ్రమింపజేసే విధానాలే ఆయా ధర్మాలు. కనుక వాటిని 'ఆశ్రమాలు' అన్నారు.

ఆ ఆశ్రమ ధర్మస్వరూపుడు తపఃస్వరూపుడు.

ఆ పరమాత్ముని కోసమై, శాస్త్రోక్తాలైన యోగాది శ్రమయుక్త సాధనలచే తపించుతారు యోగులు.

ఇలా 'ఆశ్రమ' నామానికి 'విశ్రాంతి స్థానమ'నీ, 'శ్రమస్థానమనీ' రెండు విరుద్ధార్థాలు చెప్పవచ్చు.

ఈ రెండు స్వరూపాలూ నారాయణుడే. యోగగమ్యమైన శాంతిప్రదాయకుడు, కర్మానుభవప్రదాత – ఈతడే.

ఈ విధంగా శ్రమ కలిగిస్తున్నందున–

శ్రమణః.. 853

1. *సంతాపం కలిగించువాడు.*

అవివేకులైనవారిని సంతాపింపజేసేవాడితడు.

న్యక్ తపతి సూర్యః ॥ (ఋగ్వేదం)

క్రిందుగా (జగతిని) సూర్యుడు తపింపజేస్తున్నాడు.

ఆశ్రముడు "సాధకులను శ్రమింపజేసి ఫలమిచ్చువాడు", శ్రమణుడు "జ్ఞానరహితులకు సంసారంలో ఖేదం కలిగించువాడు"– అని అర్థాలను విభజించి గ్రహించవచ్చు.

ఈ తపనతోపాటు జగతిని లయమొందించేవాడు–

క్షామః.. 854

1. *నశింపజేయువాడు.*

క్షాయతి – నివాసయతి గమయతి నాశయతి వా సర్వమితి క్షామః. (సత్యభాష్యం)

సర్వజగతిని – నివసింపజేసి, నడిపించి (స్థితి), నశింపజేసే ఈశ్వరుడు. సంసారజాతమైన అవిద్యను క్షయింపజేయువాడు.

2. **క్షాం పృథివీం మిమీతే ఇతి క్షామః.** (సత్యభాష్యం)

పృథ్విని నియమించువాడు. భువనాలకు పరిమితులను విధించి నిర్వహిస్తున్నవాడు.

3. *'క్షమూ సహనే' అనే ధాతువు ననుసరించి, విశ్వవ్యవస్థను నియమించే క్షమ (ధారణశక్తి) కలవాడు.*

క్షమ ఏవచ 'క్షామః' స్వార్థకోఽణ్ (సత్యభాష్యం)

ఈ సహనంతో జగతిని నిర్వహించే పర్ణాలు కలవాడు కనుక –

సుపర్ణః.. 855

1. *శోభనమైన పర్ణస్వరూపుడు.*

జగద్వృక్షానికి వేదమంత్రములే పర్ణములు(ఆకులు).

'ఛన్దాంసి యస్య పర్ణాని' (భగవద్గీత).

ఆ వేదమంత్రరూపుడై జగతికి పచ్చదనాన్ని (ధర్మసమృద్ధిని) సమకూర్చుతున్నవాడు.

2. *చక్కగా తీరం చేరునట్లు చేయువాడు.*

'సుష్ఠు పారం నయతీతి సుపర్ణః'

యోగులను తమస్సుకావలి ఒడ్డును – అనగా పరమపదాన్ని – చేరేటట్లు అనుగ్రహించే స్వామి. ముక్తిప్రదాత.

స్వపారం భగవాన్ నయతి (మూల సంహిత)

భక్తులను తన తీరానికి (కైవల్యం) తానే చేర్చుకొంటున్నాడు.

అనేక జన్మ సంసిద్ధః తతో యాతి పరాంగతిమ్ (భగవద్గీత)

"అనేక జన్మల యోగసాధన సిద్ధిపొంది అటుపై, శ్రేష్ఠమైన ఈ పరమపదాన్ని పొందుతున్నాడు".

3. *సూర్య స్వరూపుడు.*

వేదంలో సుపర్ణ శబ్దం సూర్యపరంగా, అగ్నిపరంగా, మేఘపరంగా కూడా వాడబడింది.

సుపర్ణః శోభనపర్ణః శోభన పతనోవా (సత్యభాష్యం)

శోభనమైన రెక్కలు కలవాడు, శోభనంగా పడువాడు.

తన కాంతి కిరణాలే రెక్కలుగా గగనంలో భాసించి, శుభంగా తన కాంతిని క్రిందికి వెదజల్లే సూర్యుడు – తన జ్వాలలే రెక్కలుగా ప్రకాశించే

అగ్ని-

శోభనంగా నేలపై జలాన్ని కురిపించే మేఘం - సుపర్ణ శబ్దవాచ్యులు.

ఆ రూపాలతో జగతిని అనుగ్రహించేది నారాయణతేజమే.

కృష్ణం నియానం హరయః సుపర్ణా

అపో వసానా దివముత్పతన్తి॥

మేఘాలు, కిరణాలు ఆకర్షింపబడి క్రిందికి పయనించుతాయని; దివం నుండి వచ్చే జలాదులను వేదం వర్ణించింది.

దివ్యం సుపర్ణం వాయసం బృహక్తమపాంగర్భం

దర్మత మోషధీనామ్ ॥(ఋగ్వేదం)

సుపర్ణో ధావతే దివి ॥ (ఋగ్వేదం)

భచక్రం సమ్యక్ సమాప్నువన్న యతీతి సుపర్ణ (సత్యభాష్యం)

భచక్రాన్ని సంపూర్ణంగా వ్యాపించి, నడిపే సూర్య రూప నారాయణుడు.

3. గరుత్మంతుడు.

ఛందః పక్షాలతో శోభిల్లే గరుత్మంతుడు విష్ణు విభూతి స్వరూపుడు.

ఇలా చక్కని రెక్కలతో, జగతిని వ్యాపించి చలింపజేస్తున్నందున-

వాయువాహనః..... 856

1. వాయువును(చే) ప్రవర్తింపజేయువాడు.

వాహయతి - ప్రవర్తయతి - వాహనః.

భీషాఽస్మాద్వాతః పవతే (తైత్తిరీయోపనిషత్తు)

'ఈతని భయం చేతనే వాయువు వీస్తున్నది' - జగతిలో వాయువును ప్రవర్తింపజేయువాడు.

సూర్యాగ్ని మేఘాలు కూడా విభిన్న వాయువుల ద్వారా జగతిలో ప్రవర్తిస్తూ, ప్రవర్తింపజేస్తున్నాయి.

ప్రాణశక్తి (వాయువు) ద్వారా ఆత్మ చైతన్యాన్ని ప్రవర్తింపజేస్తున్న పరమాత్ము

డితడు. ఉచ్ఛ్వాస నిశ్వాసలే శోభనమైన పర్ణములుగా, వాటి ద్వారా సంచరించే ప్రాణశక్తిని వాయువుగా, దానిని ప్రవర్తింపజేసే ఆత్మచైతన్యాన్ని వాయు వాహనునిగా భావించవచ్చు.

అహమేవ వాతా ఇవ ప్రవామ్యారభమాణా భువనాని విశ్వా।
పరో దివా పర ఏనా పృథివ్యై తావతీ మహినా సంబభూవ।। (ఋగ్వేదం)

ప్రాణశక్తికి నియామకుడై జగతిలోని రాకపోకల్ని వర్తింపజేస్తున్న విష్ణువు విశ్వధర్మ శాసకుడైనందున –

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః।
అపరాజితః సర్వసహో నియంతాఽనియమో యమః।। 92

857. ధనుర్ధరః, 858. ధనుర్వేదః, 859. దణ్డః, 860. దమయితా,
861. దమః, 862. అపరాజితః, 863. సర్వసహః, 864. నియన్తా,
865. అనియమః, 866. అయమః.

ధనుర్ధరః.. 857

1. *ధనువును ధరించువాడు.*

శార్ఙ్గధనువును ధరించిన నారాయణుడు, కోదండధారియైన శ్రీరాముడు.

క్షత్రియైః ధార్యతే చాపః నార్తశబ్దో భవేదితి. (రామాయణం)

'దీననాదం వినకూడదనియే క్షత్రియులు ధనుస్సును ధరిస్తున్నారు' అని శ్రీరాముని మాట. సాధురక్షణకు, దుష్టశిక్షణకు పాలకుడు ఆయుధాన్ని ధరించాలి. జగదీశుడైన విష్ణువు లోకరక్షణకై ధనుర్ధారుడై పాలిస్తున్నాడు.

2. *ఓంకార ధనువును ధరించినవాడు.*

ప్రణవో ధనుః. (ముండకోపనిషత్తు)

ప్రణవాన్ని సారింపజేసే నాదస్వరూపుడు.

ధనుస్సు ద్వారా వ్యక్తమయ్యేది దానిని ధరించిన ప్రతాపశాలి. ప్రణవం

ద్వారా వ్యక్తమయ్యేది దానికి మూలమైన పరమాత్మయే. ప్రణవార్థ స్వరూపుడు.

3. కిరణరూప శరాలను తన మండలం నుండి ప్రసరింపజేస్తున్న సూర్యుడు, ఇన్ద్రధనువును కూడా ఆవిష్కరిస్తున్నాడు.

అలాగే పర్జన్యాదులు కూడా ధనుశ్శబ్దవాచ్యాలే. వాటినుండి వర్షరూప బాణాలను వెదజల్లుతున్నాడు. ఇలా సూర్యాది రూపాలతో వర్షాది బాణాలను వెదజల్లే ధనుర్ధారిని వేదం కీర్తించింది.

నమస్తే అస్తు ధన్వనే....

యేషామన్నం వాతా వర్ష ఇషవః.(యజుర్వేదం)

పృథ్వి నుండి అన్నబాణాలను, అంతరిక్షం నుండి వాయుబాణాలను, దివి నుండి వర్షబాణాలను ప్రయోగిస్తున్న ధానుష్కునిగా పరమేశ్వరుని వర్ణించింది వేదం.

ఆ ధనుర్విజ్ఞాన స్వరూపుడు కనుకనే -

ధనుర్వేదః.. 858

1. ధనుర్వేద స్వరూపుడు.

ధనువునకు సంబంధించిన విజ్ఞానం ధనుర్వేదం. ఇది అథర్వవేదానికి ఉపవేదం. లోకరక్షార్థమై ఏర్పడిన ఆయుధ విజ్ఞానశాస్త్రం. వేదస్వరూపుడై, ధనుర్విజ్ఞానాన్ని ప్రవర్తింపజేసినవాడు. శ్రీరామరూపుడై ధనుర్వేద విజ్ఞానిగా భాసిల్లాడు.

ధర్మరక్షణాది కృత్యాలకై శిక్షాస్వరూపుడుగా ఉన్నందున-

దణ్డః.. 859

1. శిక్షించే స్వరూపుడు.

'దండో దమయితామస్మి'

'దండించువారిలో 'దండన' స్వరూపుడను నేనే' అని భగవద్గీతలో

పరమాత్ముని వచనం. లోకనియమపాలనలో దణ్డనీతి ఒకటి. ఆ నీతి విష్ణుని విభూతి. దాని ద్వారా విశ్వధర్మాన్ని నియమిస్తున్నాడు.

నిగ్రహించుటయే దండము.

ఈ దణ్డనీతిని ప్రవర్తింపజేసే శాసక స్వరూపుడు కనుక-

దమయితా.. 860

1. *దండించువాడు.*

విశ్వ వ్యవస్థాపకుడైన విష్ణువు, ధర్మ విరోధులను దమింపజేస్తున్న జగదీశుడు. వివిధావతారాలను ధరించి కూడా ఈ దివ్యత్వాన్ని దర్శింపజేశాడు.

యమాది రూపాలతో, భూపాలాది రూపాలతో ప్రజలను దండించేది ఈతడే.

దండన ద్వారా జరిగే నిగ్రహం కూడా స్వామి విభూతియే-

దమః.. 861

1. *నిగ్రహ స్వరూపుడు.*

దమయితా అయిన స్వామి తన స్వరూపమైన దండనీతి ద్వారా నిగ్రహణను నిర్వహిస్తున్నాడు.

ఆ నిగ్రహ రూప లోకంలో రక్షణను ఆచరిస్తున్నాడు.

దేవతలను, జగద్వ్యవస్థను ఆయా స్థానములందు నియమించి తన అధీనంలో ఉంచి నిగ్రహిస్తున్న విశ్వనియామకుడితడు.

2. *దీనిని 'అదమః' (దమయితా, అదమః) అని కూడా కొందరు స్వీకరించారు. అంటే తనను దండించువాడులేనివాడు!*

అన్నిటినీ నిగ్రహించే భగవానుని ఏ ఒక్కరూ అదుపులోనుంచలేరు, యశోదాదుల శిక్షణకు, దుర్యోధనాదుల బంధనాలకు దొరకక వారిని తానే నియంత్రించిన వాడు.

భస్మం కుర్యాత్ జగత్ సర్వం మనసైవజనార్దనః।
నాయకృతం జగత్ శక్తం కించిత్ కర్తుంజనాన్ (మహాభారతం)

'జనార్ధనుడు ఈ లోకాన్నంతటినీ మనస్సు చేతనే భస్మంచేయగల సమర్థుడు. ఇవన్నీ ఒక్కటిగా కలిసినా ఆతనిని ఏమీ చేయలేవు!

సృష్టిలో ప్రతిదానియందు ఒక నియమం, నిగ్రహణ స్వాభావికంగా ఉంటాయి. సూర్యచన్ద్రాదులు, పంచభూతాలు కూడా నియమనిగ్రహాది శాసనాలకు బద్ధులై ఉన్నాయి. అలా శాసనకర్త విష్ణువు.

ఈతనిని ఎవరూ ఎదుర్కొనలేరు కనుక-

అపరాజితః.. 862

1. *ఓడింపబడనివాడు.*

ఎక్కడా, ఎవ్వరూ, ఏ కాలంలోనూ ఈతనిని అడ్డగించలేరు. ఎదురులేని ప్రతాపశాలి. ఈయననెవరూ ఎదుర్కొనలేరు. కానీ, ఈతడు ఎవరినైనా ఎదిరించగలడు కనుక-

సర్వసహః.. 863

1. *అన్నిటా సమర్థుడు.*

అన్ని కర్మలలో సమర్థుడు. సృష్టిస్థితి లయ కృత్యాలతో విశ్వనిర్వహణను అన్నివిధాలా నిర్వహించ గలిగే నేర్పరి.

2. *అన్నిటినీ ధరించువాడు.*

సమస్త భువనాలను ధరించి పోషిస్తున్నవాడు.

3. *శత్రువులనందరినీ ఎదుర్కొనగలడు.*

ఏ వికారానికీ లోనుకాకుండా అందరినీ, అన్నిటినీ ఎదుర్కొనే సర్వసమర్థుడు.

నదులన్నీ తనలో చేరినా ఏమాత్రం చలించని, మార్పునందని సముద్రం

వలె, ప్రాకృతికవికారాలకు ఏమాత్రం మార్పు పొందనివాడు.

శత్రువులకు సాధ్యపడక, వారిని ఎదుర్కొనే వీరుడు.

ఈ శాత్రవాదులను ఎదుర్కొని, జగతిలో ధర్మాన్ని నియమింప జేస్తున్నందున-

నియన్తా.. 864

1. *నియమించువాడు.*

అన్నిటినీ, అందరను తమ తమ కార్యాలలో నియమించినవాడు.

నియచ్ఛతి నిబధ్నాతి సర్వం ఇతి నియన్తా. విశ్వమంతా తాను వ్యవస్థపరచిన మార్గంలో నిబద్ధమైనట్లుగా నియమించువాడు. ప్రతి అణువూ నియమబద్ధమే. ఆ నియమాన్ని ఏర్పరచిన విశ్వరూపుడు 'నియన్తా'.

జగతిలో ప్రతివారూ ఆయనచే నియమింపబడేవారే.

కానీ ఆయనను ఎవరూ నియమించలేరు కనుక-

అనియమః(నియమః).. 865

1. *నియమం లేనివాడు. నియామకుడు లేనివాడు.*

అందరినీ నియమించే ఈ సర్వనియామకునను మరొక నియామకుడు లేడు. అపరిమితుడైన అనంతునకు ఏ నియమమూ లేదు.

2. 'నియమః' - అనే నామంగా స్వీకరించితే- నియన్తగా ఏ ధర్మంలో నియమిస్తున్నాడో ఆ నియమ రూప ధర్మం కూడా విష్ణు విభూతియే. నియమస్వరూపుడు. అష్టాంగయోగంలో చెప్పబడే 'నియమం' ఈశ్వర స్వరూపం.

నియంతగా నియమంతో నిగ్రహిస్తున్నందున-

అయమః (యమః).. 866

1. ఈతనికి యముడు (మృత్యువు) లేదు.

కాలంచే నియమింపబడని కాలాతీతుడు, శాశ్వతుడు. విష్ణ్వాజ్ఞావర్తియై లోకాన్ని శాసించే కాలస్వరూపుడు యముడు. ఇతడు జగతిని నిగ్రహించగలడు కానీ పరమాత్మని ఏమీ చేయలేడు. పరమాత్ముని ఆజ్ఞానువర్తి.

2. (యమాదులను కూడా) నిగ్రహించినవాడు కనుక 'యమః'.

'ప్రభవతి సంయమనే మమాపి విష్ణుః" (విష్ణుపురాణం)

"నన్ను కూడా నియమించి రక్షించువాడు విష్ణువే"నని యమునిమాట.

ఈతని నియమించేవారు లేకున్నా, ఈతడు నియమించే వారు దేవతాది సమస్త దేవకోటి. యమాది దిక్పాలకులు స్వామియాజ్ఞమేరకు ప్రవర్తిస్తున్నారు.

✣ ✣ ✣

యోగీ (849) నామం నుండి ఈ నామం అయమః (యమః) (866) వరకు పద్దెనిమిది నామాలు యోగవిద్యా స్వరూపుడైన విష్ణువును తెలియజేస్తున్నాయని భావించవచ్చు.

యోగవిద్యా స్వరూపుడు (యోగీ), యోగాల శాసకుడు (యోగీశుడు) యోగఫలదాత (సర్వకామదః), తపోరూపమైన యోగం (ఆశ్రమః), దానితోసాగు సాధన (శ్రమణః), సహించుట (క్షామః), ఉచ్ఛ్వాస నిశ్వాసలను నియంత్రించుట (సువర్ణః), తద్వారా ప్రాణశక్తిని క్రమబద్ధీకరించుట (వాయు వాహనః), ఓంకారాన్ని ఉపాసించుట (ధనుర్ధరః) మొదలైనవి సాధనా భూమికలు. వెన్నుదండమనే మేరువునందు ఈ ప్రణవాన్ని అనుసంధానించి, ప్రణవార్థ స్వరూపుని ధ్యానించి (ధనుర్వేదః), తనను యోగవిధానాలతో నియంత్రించి (దండః దమయితా), ఇంద్రియజయాన్ని సాధించి (దమః) - క్రమంగా యోగంలో పూర్ణత్వాన్ని సాధించి (అపరాజితుడై), అన్ని యోగ విఘ్నాలను అధిగమించి (సర్వసహాః), స్వతంత్రుడై (నియంతా), అన్నిటినీ నియమించి (నియమః) దేని నియామకానికీ లోనుకాక (అనియమః)

కాలప్రభావానికి అతీతుడౌతాడు (అయమః).

అలా సాధించిన యోగబలస్వరూపుడు (సత్త్వవాన్ 867).

యోగమార్గంలో ప్రారంభాంశం నుండి సిద్ధివరకు సర్వభూమికలలో వ్యాపించి యోగవిద్యాస్వరూపునిగా ఈ నామాలక్రమంలో ఒక భావన మాత్రమే ఇది.

* * *

ఈ శ్లోకంలో 'ధనుర్ధరః' నామం నుండి 'అయమః' నామం వరకు సర్వలోక శాసనకర్తయైన విష్ణు స్వరూపం ఆవిష్కరింపబడింది.

అన్నిటినీ నియమించే గొప్ప సమర్థత కలిగినవాడు.

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః।
అభిప్రాయఃప్రియార్హోర్హఃప్రియకృత్ప్రీతివర్ధనః॥ 93

867 సత్త్వవాన్,	*868.* సాత్త్వికః,	*869.* సత్యః,
870. సత్యధర్మపరాయణః,	*871.* అభిప్రాయః,	*872.* ప్రియార్హః,
873. అర్హః,	*874.* ప్రియకృత్,	*875.* ప్రీతివర్ధనః.

సత్త్వవాన్ః.. 867

1. బలము కలవాడు.

   జగన్నిర్వహణ సమర్థమైన శౌర్యవీర్యాది రూప బలం కలవాడితడు.

2. సద్భావస్వరూపుడు.

   'సత్-భావం'.

   సత్త్వవానిత్యనేన తస్యభగవతః సల్లక్షణతా ప్రతీయతే। (సత్యభాష్యం)

   సత్త్వవాన్ - అనే నామంద్వారా భగవానుని సల్లక్షణం చెప్పబడుతున్నది.

   సత్ - లక్షణం. శాశ్వతమైన ఉనికి -'సత్'. అన్నిటికీ ఆధారమైన తత్త్వమిది.

   స కేవలం మే భవతశ్చ రాజన్।

స వై బలం బలినాం అ పరేషామ్ ॥ శ్రీమద్భాగవతం.

"రాజా! నేనెవరి వలన బలవంతుడనయ్యానో ఆయన కేవలం నాకు మాత్రమే కాదు, నీకు, ఇతర బలవంతులకు కూడా బలమేయైయున్నాడు".

బలయుతులకు దుర్బలులకు బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్

బలమెవ్వడు ప్రాణులకున్ బలమెవ్వండట్టి విభుడు బలము – అని ప్రహ్లాద వచనం.

మహాన్ ప్రభుర్వై పురుషః సత్వస్యైష ప్రవర్తకః (శ్వేతాశ్వతరోపనిషత్తు)

మహాప్రభువైన ఈతడు సత్వప్రవర్తకుడు.

బ్రహ్మరుద్రులుగా రజస్తమస్సులను అధిష్ఠించి, సాక్షాత్తుగా సత్వాన్ని అధిష్ఠించుటచేత–

సాత్త్వికః.. 868

1. *సత్వగుణ ప్రధానుడు.*

అథయోహఖలు వావాస్య స్సాత్త్వికోంశోజాయతే సయోయం విష్ణుః.

అథయోహఖలు వావాస్య రాజసోంకో జాయతే సయోయం బ్రహ్మా

అథయోహఖలు వావాస్య తామసాంశో జాయతే సయోయం రుద్రః.

అని సామవేదీయ మైత్రాయణ్యుపనిషద్వాక్యం.

పరమేశ్వరుని సాత్త్వికాంశ విష్ణువు. రాజసాంశ బ్రహ్మ. తామసాంశ రుద్రుడు.

సత్వగుణ ఫలాలైన ధర్మ జ్ఞాన వైరాగ్య ఐశ్వర్యాలకు నియామకుడు. తత్ఫల ప్రదాత.

2. *జ్ఞానస్వరూపుడు.*

సత్త్వవాన్ 'సత్' లక్షణాన్ని తెలియజేస్తే సాత్త్వికః నామం ప్రకాశరూపాన్ని, అనగా జ్ఞానాన్ని (చిత్) తెలియజేస్తున్నది.

ససత్యసత్వన్... (ఋగ్వేదం)

ఈ జ్ఞానస్వరూపం సత్పురుషులకు గోచరిస్తున్నది కనుక –

సత్యః.. 869

1. *సత్పురుషులకు అనుకూలమైనవాడు.*

సత్సుసాధుత్వాత్ (శంకరాభాష్యం), సత్పురుషులకు సదాహితకారి. **'పరిత్రాణాయ సాధూనాం'** అని ప్రకటించాడు గీతాచార్యుడు.

2. *అన్నిటియందు ఉన్నవాడు సత్యస్వరూపుడు.*

యధార్థవైభవం కలవాడితడు. ఈతని గుణమహిమాదులన్నీ వ్యర్థంకానివి. యథార్థాలు.

అస్తీతిసత్. ఉన్న ఈ జగతిలో – సూర్య చన్ద్రాదులలో (సత్సు) అనుకూలుడై, ఆధారమై ఉన్న వాడితడు (సాధుః).

సత్యేప్రతిష్ఠితః కృష్ణః సత్యమస్మిన్ ప్రతిష్ఠితమ్ ।
సత్తాఽసత్తేచ గోవిన్దః తస్మాత్సత్యః సతాం మతః ॥ (భారతం)

"సత్యమునందు కృష్ణుడు ప్రతిష్ఠింపబడి ఉన్నాడు. సత్యం ఈతని యందు ప్రతిష్ఠితం. సత్త, అసత్తకూడా గోవిందుడే.
కనుకనే వానిని 'సత్యుడు' అని సత్పురుషులు చెప్తున్నారు".

సత్పురుషులు అనుష్ఠించే ధర్మాలకు ఈతడే ఆశ్రయం కనుక–

సత్యధర్మ పరాయణః.. 870

1. *సత్యధర్మములు ఉత్తమ ఆశ్రయంగా కలవాడు.*

భూతహిత యథార్థ భాషణం సత్యం – 'చోదనా' రూపమైనది వైదిక ధర్మం. ఇది సనాతనం (శాశ్వతం). ఈ రెండింటియందు భగవానుడు శ్రేష్ఠంగా నిలచి ఉంటాడు. (చోదనా – ఇది ఇలా చేయాలనుట)

పరాయణం – అనగా శ్రేష్ఠస్థానం.

భగవానుని మనం సత్యంలో, ధర్మంలోనే చూడగలం. లేదా 'సత్యమైన ధర్మం' – అని అర్థాన్ని స్వీకరించవచ్చు.

దేనితో ధరింపబడతామో అది ధర్మం. పట్టి ఉంచే కట్టుబాటు. ఇది

సనాతనం. మారనిది.

ఈ ధర్మాన్ని శ్రీరామకృష్ణాది అవతారాది స్వరూపాలతో అనుష్ఠించి, ధర్మ విగ్రహుడై భాసించాడు.

2. సచ్చిదానంద లక్షణమే సత్యధర్మం.

"స ఏవ పరం=పరమః. అయనం ఆశ్రయః స్వరూపంవా" (సత్యభాష్యం)

సచ్చిదానంద స్వరూపుడు.

3. సూర్యచన్ద్రాది సృష్టిగత సత్యధర్మాలను నిర్వహించేవాడు. ఈ శాశ్వత ధర్మాల ఆధారంగానే జగతి నడుస్తున్నది.

కవి మగ్నిముపస్తుహి సత్యధర్మాణ మధ్వరే ॥ (ఋగ్వేదం)

ద్రష్ట అయిన తేజస్వరూపుడైన సత్యధర్మస్వరూపుని యజ్ఞంలో స్తుతించమని ప్రబోధం.

అమృతం సత్యే ప్రతిష్ఠితమ్॥ (యజుర్వేదం)

ఆనంద రూపమైన శాశ్వతబ్రహ్మ సత్యమునందే ప్రతిష్ఠితుడు.

సృష్టియే సత్యధర్మాన్ని అనుసరిస్తున్నది కనుక సత్యధర్మాలనే ఆశ్రయించిన మానవులు, విశ్వానికి అనుకూలుడై ఉత్తమగతిని పొందుతున్నారు.

అటువంటి సత్పురుషులకు గతియైనవాడు కనుక-

అభిప్రాయః.. 871

1. కోరబడువాడు.

పురుషార్థకాంక్ష కలవారిచే అభిలషింప (కోర)బడువాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలను ప్రసాదించే ఈ పరమాత్మునే వాటిని కోరేవారందరు ప్రార్థిస్తున్నారు.

శిష్యుడు గురువును, పేద ధనికుని -కోరినట్లుగా అండరిచే కోరబడే పరమానంద స్వరూపుడితడు.

శ్రీరామావతారాలలో అయోధ్యవాసులు సుగ్రీవ హనుద్విభీషణాదులు,

శ్రీరామునే కోరుకున్నారు. గోపికలు, పాండవభీష్మాదులు శ్రీకృష్ణునే అభిలషించారు.

సత్య ధర్మ నిష్ఠలకు పరమప్రయోజనంగా కోరబడే వాడితడే. అటువంటి ధన్యులు భగవానునే కోరుకుంటారు.

2. జగతి ప్రళయకాలంలో ఆభిముఖ్యం కలిగి (ఆతనివైపునకు ప్రవర్తిల్లి), ఈతనిలో లయిస్తున్నది.

ఆతడే ప్రీతికి స్థానమైనవాడు కనుక –

ప్రియార్హః.. 872

1. ప్రియములకు తగినవాడు.

ఇష్టమైన వాటిని సమర్పించడానికి తగినవాడితడే. ప్రీతికి పాత్రమైనవాడు. 'ఈతడే ప్రియమని ఆశ్రయించడానికి అర్హుడితడే.'

మనకిష్టమైన 'మన' అనే భావాన్ని (తనని తాను) సమర్పించడానికి ఈతడే తగినవాడు. ఆనందమే ప్రియం. ఆ ఆనంద స్వరూపుడితడు. కనుకనే ప్రియంగా తలచడానికి, సమర్పించడానికి యోగ్యుడీతడే.

ఇష్టమైనవాటిని దానం చేస్తే అక్షయమవుతాయని శాస్త్రవాక్యం.

యద్యదిష్టతమంలోకే యచ్చాస్య దయితంగృహే।
తత్తద్గుణవతే దేయం తదేవాక్షయ మిచ్ఛతా।। (దక్షస్మృతి)

'తనకు ఇష్టమైనది, గృహంలో ప్రీతిపాత్రమైనది – తనకు తిరిగి అక్షయంగా లభించాలని ఆశిస్తే – వాటిని అర్హుడైన గుణములు కలవానికి ఈయాలి. అట్టి దానపాత్రం పరమాత్ముడే.

ప్రియాణాం త్వా ప్రియపతిగ్ం హవామహే ।। (యజుర్వేదం)

ప్రియమైనవాటిలో ప్రియపతిగా ఉన్న పరమాత్మను ఆరాధిస్తున్నాం.

2. ప్రియమైన వారిని అనుగ్రహించువాడు.

ప్రియం అర్హతీతి (శ్రీ పరాశరభట్టు)

ప్రియోహి జ్ఞానినోత్యర్థః॥
యోమద్భక్తః సమేప్రియః ॥ (భగవద్గీత)

జ్ఞానులు, భక్తులు తనకు ప్రియమైనవారని స్వామి వచనం. వారిని తగిన రీతి అనుగ్రహించువాడు.

అసలు అన్నిటికీ తగిన యోగ్యుడితడే –

అర్హ్యః.. 873

1. పూజింపబడువాడు.

'అర్హపూజాయామ్' అదే ధాతువుననుసరించి సర్వులచే పూజింపబడే పరమదైవమితడు.

అన్నిరకాల పూజలకు తగినవాడితడే.

స్వాగతం, ఆసనం, ప్రశంస, అర్ఘ్యం, పాద్యం, స్తుతి, నమస్కారం మొదలైన పూజా సాధనలచేత పూజింపబడేవాడితడు.

పూజార్హులైన దేవతలచే సైతం పూజింపబడేవాడు.

శ్రీకృష్ణుని మధురవాసులైన సుదాముడు పూలతో, కుబ్జగంధంతో, తదితరులు వివిధ మంగళ ద్రవ్యాలతో అర్చించి స్వామి అనుగ్రహానికి పాత్రులయ్యారు. రాజసూయంలో అందరిచే పూజార్హుడు ఈతడేనని నిర్ణయింపబడి పూజలందుకున్నాడు.

మహర్షులు, శబరి, హనుమాదాదులు శ్రీరాముని పాద్యాదులచే, ప్రశంసాదులచే, నమస్కారాలచే, స్తుతిచే పూజించారు.

ఇమం స్తోమమర్హతే జాతవేదసే
రథమివ సం మహేమా మనీషయా ॥(ఋగ్వేదం)

తనను పూజించినవారికి అభీష్టసిద్ధిని నెరవేర్చేవాడు కనుక –

ప్రియకృత్‌:..... 874

1. ప్రియమైనవి సమకూర్చువాడు.

ఇష్టమైనవి అందుకోడానికి తగిన పూజార్హుడేకాక, తనను భజించేవారికి ప్రియాన్ని ఆచరించేవాడు.

ఆనందమే ప్రియం.

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి।।-ఉపనిషద్వ్యాం.

తనకోసమే అన్నీ ఇష్టమైనవౌతాయి.

అంటే అసలు ఇష్టం 'తానే'. అనగా ఆత్మ వస్తువే.

ఆత్మయే ప్రియం. ఆ ఆత్మ తత్త్వాన్ని అనుగ్రహించువాడు. అనగా 'తననుతాను' ఇచ్చువాడు.

ఆనంద స్వరూపమైన పరమాత్మతత్త్వమే ప్రియం. దానిని తన భక్తులైన జ్ఞానులకు అనుగ్రహించువాడు.

ప్రియాలను కలిగించడమేకాక ప్రీతిభావాన్ని వృద్ధి చేస్తున్నందున.

ప్రీతి వర్ధనః..... 875

1. ప్రీతిని పెంచువాడు.

ప్రీతి అనగా ఆనందం. ఆ ఆనందాన్ని వర్ధిల్లజేయువాడు. అఖండానంద స్వరూపుడైన ఈతడు-తనను ఆశ్రయించిన వారికి ఆనందానుభవంగా లభించువాడు.

తనను పూజించేవారికి క్రమంగా సచ్చిదానంద స్వరూపమైన తనతత్త్వంపై ప్రీతిని పెంచి, పరిపూర్ణులను చేయువాడు.

2. ప్రీణ్‌ తర్పణే కాన్తేచ.

తృప్తి, కాన్తి, అనే అర్థాలను 'క్రియ' శబ్దానికి గ్రహించవచ్చు.

కాంతిని కలిగించి, వృద్ధి చెందించే (పూరించే) సూర్య రూపవిష్ణునిపై నామాల ద్వారా పేర్కొనవచ్చు.

కాంతిని వర్ధిల్లజేస్తూ గగనంలో సంచరిస్తున్న సూర్యనారాయణుడు.
ఆనందాన్ని వర్ధిల్లజేస్తూ హృదయాకాశంలో వ్యాపించే విష్ణువు ఈతడే.

విహాయసగతి ర్జ్యోతిః సురుచి ర్హుతభు గ్విభుః।
రవి ర్విరోచనః సూర్య స్సవితా రవిలోచనః॥ **94**

876. విహాయసగతిః, 877. జ్యోతిః. 878. సురుచిః, 879. హుతభుక్,
880. విభుః, 881. రవిః, 882. విరోచనః, 883. సూర్యః,
884. సవితా, 885. రవిలోచనః.

విహాయసగతిః.. 876

1. ఆకాశాన్ని ఆశ్రయించినవాడు.

హృదయపుండరీకంలోని సూక్ష్మాకాశాన్ని తన ఆశ్రయస్థానంగా కలిగిన పరంజ్యోతి విష్ణువు.

ఆకాశాన్ని ఆశ్రయించి సంచరించే ఆదిత్యుడు.

త్రివిక్రమావతారంలో తన పాదానికి ఆకాశమే ఆశ్రయమైనది.

2. తపస్సులకు గతియైనవాడు.

విజహాతీతి విహాయసాः (సత్యభాష్యం)

ప్రాపంచిక విషయాలను విడిచిన త్యాగశీలురైన తపస్సులు– విహాయసులు.

వారికి గతి అయినవాడు – వారిచే పొందబడు పరతత్త్వం.

(గమ్యతే ప్రాప్యత ఇతి గతిः)

నూనమర్చ విహాయసే స్తోమేభిः స్థూరయూపవత్।
ఋషీ వైయస్వ దమ్యాయాగ్నే ॥(ఋగ్వేదం)

ఆకాశాన ప్రకాశిస్తున్నందున –

1. ప్రకాశించువాడు.

ప్రకాశ స్వరూపాలైన సూర్య చంద్ర నక్షత్రాదుల రూపంలో భాసించువాడు. వాటిలో భాసించే తేజః స్వరూపుడు.

వేదంలో సూర్యాగ్నులు సమానార్థకాలుగా పలుచోట్ల పేర్కొనబడ్డారు.

సూర్యుని మరో రూపమే అగ్ని.

అగ్నిర్జ్యోతిర్జ్యోతిరగ్నిః స్వాహా।

సూర్యో జ్యోతిర్జ్యోతిః సూర్యః స్వాహా ॥(యజుర్వేదం)

ద్యోతతే ఇతి జ్యోతిః ॥ 'ద్యుతదీప్తౌ' అనే ధాతువు ననుసరించి, దీపించునది జ్యోతి.

'అగ్నియే జ్యోతి – జ్యోతియే అగ్ని.

సూర్యుడే జ్యోతి – జ్యోతియే సూర్యుడు' అని వేదవచనం. అగ్ని సూర్యాది రూపాలతో ఉన్న నారాయణుడే జ్యోతి.

హృదయంలో దీపించే చైతన్య స్వరూపుడు పరమాత్మయే జ్యోతి.

నారాయణ పరోజ్యోతి రాత్మా నారాయణః పరః (నారాయణమ్)

నారాయణుడే స్వయం ప్రకాశ జ్యోతి. సర్వానికీ ఆత్మ.

అజ్ఞానాంధాకారానికి ఆవల ఉన్నతంగా భాసించే ప్రకాశ స్వరూపుడైన, సర్వప్రేరక (సూర్య) జ్యోతి సర్వోత్తమమైనది.

ఉద్వయం తమసస్పరి జ్యోతిష్ పశ్యన్త ఉత్తరమ్।

దేవం దేవత్రా సూర్యమగన్మ జ్యోతిరుత్తమమ్ ॥ఋగ్వేదం॥

– ఈ మంత్రం యజుర్వేద, అథర్వవేదాలలో కూడా చెప్పబడింది.

ఈ జ్యోతియే లోకానికి హితం కలిగించే వెలుగులతో ఉన్నది కనుక –

సురుచిః.. 878

1. మేలైన వెలుగులు కలవాడు.

శుభకరమైన కాంతులతో లోకానికి హితం కలిగించే సూర్యాది జ్యోతిస్సులరూపంలో ఉన్నవాడు. హృదయంలోనున్న పరంజ్యోతి ప్రకాశమే (చైతన్యమే) సంపూర్ణమై శోభనకరమైనది.

సుష్మ- చక్కనిది సమృద్ధమైనది ఆ వెలుగు.

అసౌయస్తామ్రో అరుణ ఉత బభ్రుః సుమఙ్గలః ॥(యజుర్వేదం)

విద్యా రూప పరమేశ్వరుడే తామ్ర, అరుణ, బభ్రు వర్ణాలతో దీపిస్తున్న మేలైన మంగళస్వరూపుడు.

2. సుష్మ (చక్కని) ఇచ్ఛాశక్తి కలవాడు.

పరమాత్ముని ఇచ్ఛయే అతని వెలుగు. 'సత్యకామః సత్యసంకల్పః' అని శ్రుతి చెప్పినట్లుగా, అమోఘమైన ఆయన సంకల్ప శక్తి చక్కనిదై, ఈ జగతికి హితాన్ని కలిగిస్తోంది.

ఈ విశ్వమంతా ఆ పరమాత్ముని వెలుగే, సమగ్ర శక్తులలో దీపిస్తోంది.

తముక్షమాణం రజసి స్వ ఆ దమే
చర్షణిమవ సురుచం హ్వార ఆ దధుః ॥(ఋగ్వేదం)
యతసృచః సురుచం విశ్వదేవ్యం రుద్రం యజ్ఞానాం
సాధ దిష్టిమయసామ్ ॥(ఋగ్వేదం)

ఈ జ్యోతియే యజ్ఞాగ్నిగా భాసిస్తున్నందున -

హుతభుక్‌ః.. 879

1. హవిస్సును భుజించువాడు - రక్షించువాడు.

ఆయా దేవతలనుద్దేశించి ప్రవర్తిల్లే కర్మలలో, (సమర్పించబడిన) హవిర్ద్రవ్యాన్ని, తానే సర్వదేవతామయుడై స్వీకరిస్తున్నాడు - రక్షిస్తున్నాడు.

'భుజపాలనభ్యవహరయోః' అనే ధాతువుననుసరించి 'భుక్' అనగా

పాలించు (రక్షించు) వాడు అని అర్థాన్ని కూడా గ్రహించవచ్చు.

అగ్నిహోత్రం ద్వారా గ్రహింపబడిన హవిర్ద్రవ్యశక్తి సూర్యకిరణాల ద్వారా దేవతలకు చేరుతున్నదని వేదవిజ్ఞానం. సూర్యాగ్నియే హోమాగ్ని. హవిస్సులను స్వీకరించే సూర్యరూప విష్ణుని ఇక్కడ 'హుతభుక్' గా చెప్పారు.

శరీరగతమైన అగ్నిగా, ముఖముందు సమర్పింపబడినదానిని ఆహరించి ఆరగించి, ఆ శక్తిని శరీరమంతా వ్యాపింపజేసి రక్షించేవాడు.

అహం వైశ్వానరో భూత్వాప్రాణినాం దేహమాశ్రితః ॥(భగవద్గీత)

నేనే జఠరాగ్నిగా ప్రాణుల దేహాన్ని ఆశ్రయించాను అని భగవానుని వచనం.

హవిర్భోక్తగా యజ్ఞద్రవ్యాలను స్వీకరించి జగతిని పాలిస్తున్నందున-

విభుః. 880

1. *విశేషంగా అంతటా ఉండువాడు.*

సర్వవ్యాపి. ముల్లోకాలకు పాలకుడు.

వివిధో భవతీతి విభుః.

ఒకే వ్యక్తి అనేకమందిచేత అనేక అనుబంధాలతో వ్యవహరింపబడినట్లుగా - పరమాత్ముడు వివిధ విధాలుగా భావింపబడుతున్నాడు.

ఏకైవేషాః సర్వమిదం విభాత్యేకం వా ఇదం
విబభూవ సర్వమ్ ॥ (ఋగ్వేదం)

ఈ ఒక్కడు ఈ విశ్వమంతా ప్రకాశిస్తున్నాడు. - సర్వమూ విశేషంగా వివిధంగా కలుగుతున్నాడు (భాసిస్తున్నాడు).

విభుర్విశ్వస్మై భువనాయ ॥ (ఋగ్వేదం)

సమస్త భువనాలకై విభుడైనవాడు.

వివిధ విధాలుగా భాసించే సూర్యాది రూపాలతో ఉన్నవాడు కనుక -

రవిః.. 881

1. శబ్దించువాడు - శబ్దం పలికించువాడు.

రౌతీతి రవిః - రూయతే వా అనేనేతి రవిః

శబ్దాన్ని కలిగించేవాడు - కలిగింపజేసేవాడు.

చైతన్యం శబ్దం ద్వారా వ్యక్తమౌతుంది. అంధకారమున్నచోట శబ్దమే చైతన్యాన్ని చాటుతుంది. నారాయణుడు త్రయీ మూర్తిగా (వేదమయునిగా) సూర్య మండలంలో భాసిస్తున్నందున సూర్యుని 'రవి' అన్నారు.

రూయతే స్తూయతే ఇతి రవిః

దివ్య శబ్దాలతో స్తుతింపబడేవాడు.

వేదాది శబ్దాలను కలిగించినవాడు - జగతిని శబ్దింపజేసేవాడు.

2. రసాలను స్వీకరించువాడు.

రసానాంచ తథా ఉఉదానాత్ రవిరిత్యభిధీయతే ॥ (విష్ణు ధర్మోత్తర పురాణం)

రసాలను (జలాలను) తనకిరణాలతో గ్రహిస్తున్నందున 'రవి' అని చెప్పబడుతున్నాడు.

త్వం వృషాక్షం మఘవన్నుక్రం మర్యాకరో రవిః। (అథర్వవేదం)

సద్యో జాతో వృషభో రోరవీతి ॥ (ఋగ్వేదం)

చైతన్యాన్ని కలిగించి, రసాలను గ్రహించే కిరణాలతో ప్రకాశిస్తు న్నందున-

విరోచనః.. 882

1. వివిధాలుగా, విశేషంగా ప్రకాశించువాడు.

ఇది సూర్య పరంగాను, పరమేశ్వరుడైన విష్ణుని పరంగాను వర్తిస్తుంది.

సూర్యాదులకు సైతం ప్రకాశాన్నిచ్చే విశిష్టరోచిస్సు కల విష్ణువే, తన చైతన్యంతో అనేక విధాలుగా భాసిస్తున్నాడు.

స్వయంప్రకాశుడై విశ్వాన్ని ప్రకాశింపజేస్తున్నాడు.

తస్యావిరోచనః ప్రాహోదిర్వత్స ఆసీదయ స్పాత్రంపాత్రమ్ ॥ (అథర్వవేదం)

అయం పునాన ఉషసో విరోచయత్ ॥ (ఋగ్వేదం)

శ్రియే సుదృశీరుపరస్య యాః స్వర్విరోచమానః

కకుభామచోదతే ॥ (ఋగ్వేదం)

తన విశేష, వివిధ ప్రకాశంతో సర్వ జగతిని సృజించి, ప్రేరేపిస్తున్నందున-

సూర్యః.. 883

1. పుట్టించువాడు.

   సూతే ఇతి సూర్యః

   'షూ ఙ్ ప్రాణి ప్రసవే ' వేదా - 'షుప్రసవైశ్వర్యయోః'

   'షూఙ్ 'ప్రాణులను కనుట,' ఐశ్వర్యములనిచ్చుట' అనే ధాతువులనుండి ఈ శబ్దము నిష్పన్నమయింది.

   సర్వప్రాణి కోటిని సృజించినవాడు సూర్యుడు.

2. ఐశ్వర్యాలనిచ్చువాడు సూర్యుడు.

   కాంతి రూపమైన సిరిని అందించువాడు.

3. 'సృ గతౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి,

   'సరతి గచ్ఛతి వా సువతి ప్రేరయతి వా

   తత్తద్ వ్యాపారేషు కృత్స్నం జగదితి సూర్యః'

   - అని వేదభాష్యం. సరతి - గమనము చేయువాడు (వ్యాపించువాడు) సూర్యుడు. కాంతిగతిని కలిగినవాడు.

4. సమస్త జగతిని ఆయా కార్యాలలో ప్రేరేపించువాడు. సూర్యోదయంతోనే జగత్కార్య ప్రేరణ. సర్వ జీవులకు ప్రేరకమైన చైతన్యం పరమాత్ముడే.

   ప్రేరకుడైన సృష్టికర్త కనుక -

సవితా.. 884

1. ప్రసవించు (పుట్టించు) వాడు.

'ప్రజానాంతు ప్రసవనాత్ సవితేతి నిగద్యతే' (విష్ణు పురాణం)

ప్రజలను ప్రసవించువాడు - సృష్టికర్త - కనుక పరమాత్మను 'సవితా' అన్నారు.

వృష్టినీ, సస్యాలను, జగతిని జనింపజేస్తున్న సూర్యరూప నారాయణునకు ఈ నామం ప్రసిద్ధి.

సవితారం నృచక్షసమ్ ॥ (ఋగ్వేదం)

నరులకు చక్షువునకు సవితకు... ॥

హిరణ్యయేన సవితా రథే నా దేవో యాతి భువనాని పశ్యన్ ॥ (ఋగ్వేదం)

స్వర్ణమయుడైన సవిత (సూర్యదేవుడు) గమనం చేస్తూ భువనాలను దర్శిస్తూ ప్రయాణిస్తున్నారు.

సూర్యరూపుడై జగతిని గమనిస్తున్నందున -

రవిలోచనః.. 885

1. సూర్యుని కన్నుగా కలవాడు.

దర్శన శక్తి స్వరూపుడు సూర్యుడు. ఈ సూర్యుని ద్వారా సర్వమును గమనించే విరాట్పురుషుడు విష్ణువు.

సూర్యాదులలోని తేజస్సు శ్రీహరియే. జగతిని భాసింపజేసే రవి స్వామిలోచనం.

అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్ర సూర్యౌ (ముండకోపనిషత్తు)

విరాట్పురుషునకు అగ్ని శిరస్సుగా, చంద్ర సూర్యులు నేత్రాలుగా ఉన్నారు.

లోకాన్ని వీక్షించే తేజోమయునికి పరిమితి లేదు -

అనంతో హుతభుగ్ భోక్తా సుఖదో నైకజోఽగ్రజః।
అనిర్విణ్ణః సదాఽమర్షీ లోకాధిష్ఠాన మద్భుతః॥ 95

886. అనన్తః, *887.* హుత్‌భుక్, *888.* భోక్తా,
889. సుఖదః, *890.* నైకజః, *891.* అగ్రజః,
892. అనిర్విణ్ణః, *893.* సదామర్షీ, *894.* లోకాధిష్ఠానమ్,
895. అద్భుతః.

అనన్తః.. 886

1. పరిమితి లేనివాడు.

నిత్యుడు కనుక కాలపరిమితి లేదు. సర్వ గతుడు కనుక దేశ పరిమితి లేదు. కొలతకందడు కనుక వస్తుపరిమితి లేదు.

2. తుది లేనివాడు శాశ్వతుడు.

తాను అనంతుడైనా, అన్నిటినీ తనలో అంతం చేసుకొనేవాడు – (కెరటాలను లీనం చేసుకునే సముద్రమువలె)

హుతభుక్.. 886

1. హుతమును భుజించువాడు.

వేయబడిన హవిస్సును అగ్ని భక్షిస్తున్నది.

ఆ యజ్ఞాగ్ని స్వరూపుడితడు. (879వ నామం ఇదే. అక్కడ సూర్యపరంగా, ఇక్కడ యజ్ఞాగ్ని పరంగా గ్రహించవచ్చు)

హుతమైన దానిని అగ్ని తనలోనికి స్వీకరించినట్లుగా, సర్వ భూత సముదాయాన్ని తనలోనికి స్వీకరించువాడు. ప్రతికాలం, ప్రతి వస్తువు... ఆ కాలరూప విష్ణ్వగ్నిలో లీనమౌతున్నదే. కనుకనే –

భోక్తా.. 887

1. భుజించువాడు.

కాల, అగ్ని, సూర్యాది రూపాలతో సర్వాన్నీ భుజిస్తున్నవాడు. భోగ్య రూప అయిన ప్రకృతిని భుజిస్తున్నవాడు.

2. రక్షించువాడు.

సర్వ జగతిని కాపాడే పాలకుడు.

(143, 500 నామాలుగా ఈ నామం గోచరిస్తుంది)

పాలకుడై సుఖాలను ప్రసాదిస్తున్నందున –

సుఖదః.. 888

1. సుఖాలనిచ్చువాడు.

మోక్షరూపమైన సుఖాన్ని (ఆనందాన్ని) ప్రసాదించువాడు, మోక్షదాయకుడు పరమాత్మయే.

2. జలాలనిచ్చువాడు.

సుఖమనగా జలం అని కూడా అర్థం ఉంది.

జలాలనిచ్చే సూర్య, పర్జన్యాదుల రూపంలో నున్న నారాయణుడు. వాపీ కూప తటాకాదులను నిర్మించి హితం చేకూర్చే జలదాతలు కూడా సుఖదులే. సత్కర్మ రూపంలో నున్న విష్ణు విభూతి ఇది.

3. చక్కగా త్రవ్వబడినది.

లోతు, శూన్యభాగం 'ఖం'. ఆకాశానికి ఈ పేరు వ్యవహారం, అవకాశమే సుఖం. అవకాశాన్నిచ్చేవాడు సుఖదుడు. చక్కని ఆకాశాన్నే సూర్యాదులకు రథంగా వేదం వ్యవహరించింది. ఆ ఆకాశాన్ని తద్వారా జోతిస్సులను ప్రసాదించినవాడు.

द्यौरिह सुखंरथम् (సత్యభాష్యం)

सुपेशसं सुखं रथम् यमध्यस्था उषस्त्वम् ॥ (ఋగ్వేదం)

తక్షన్ నా సత్యాభ్యాం పరిజ్మానం సుఖం రథమ్ ॥ (ఋగ్వేదం)

ధర్మరక్షణ చేసి, సుఖాన్నివ్వడానికై అవతరిస్తున్నందున –

నైకజః.. 890

1. అనేక మార్లు కలిగినవాడు.

పుట్టుకలేని వాడైనప్పటికీ, జగద్రక్షణకై అనేకమార్లు అనేక చోట్ల అనేక విధాలుగా అవతరించిన పరమ పురుషుడు.

ఏ ఉదయాస్తమయాలు లేని సూర్యుడు, అనేక మార్లు ఉదయించినట్లు కనిపిస్తున్నాడు. అలాగే ఉపాధులు పుడుతున్నప్పుడు ఆత్మ కూడా అనేక మార్లు జన్మిస్తున్నట్లుగా భావింపబడుతోంది.

నవో నవో భవతి జాయమానోఽహ్నాం కేతు

రుషసామేత్యగ్రమ్ ॥ (ఋగ్వేదం)

అజాయమానో బహుధా విజాయతే ॥ (ఋగ్వేదం)

ఏకమైనప్పటికీ బహు విధాలుగా భాసించే ఈశ్వర్య చైతన్యాన్ని ఈ నామం తెలియజేస్తోంది.

ఈ ఏక చైతన్యమే జగతికి ఆది –

అగ్రజః.. 891

1. మొదట కలిగినవాడు.

అన్నిటికీ ప్రారంభంలో ఉన్నవాడు పరమాత్మయే.

అన్నిటికీ ముందున్నది ఆత్మయే– అని ఉపనిషద్వాక్యం.

హిరణ్య గర్భరూపంలో మొదట కలిగినవాడు ఆతడే.

హిరణ్య గర్భః సమవర్తతాగ్రే (ఋక్సంహిత)

'మొదట హిరణ్య గర్భుడు ఉండెను'

పూర్వ్యో దేవేభ్యో జాతో నమోరుచాయ బ్రాహ్మయే ॥ (యజుర్వేదం)

'దేవతలకు పూర్వమే ఎవడు (కలిగి) ఉన్నాడో ఆ తేజఃస్వరూపుడైన బ్రహ్మమునకు నమస్కారం'.

మొదట ఉన్న ఈ పరతత్త్వం జగతిలో భిన్నతలకు అంటని పూర్ణానంద స్వరూపుడు –

అనిర్విణ్ణః.. 892

1. *నిర్వేదం (విసుగు, దుఃఖం) లేనివాడు.*

'అయ్యో! ఇలా ఉన్నానే' అనే ఖేదానికి 'నిర్వేదం' అని పేరు. ఇది విసుగు చేతా, విరక్తి చేత, వివేక శూన్యత చేత కలిగే దుఃఖం. సదానందరూపుడు, వివేక (జ్ఞాన) రూపుడు విష్ణువు.

నిర్వేదం లేకుండా, అన్నిటినీ సహించే శక్తిశాలి –

సదామర్షీ.. 893

1. *ఎల్లవేళలా సహించువాడు.*

'మృష తితీక్షాయామ్' – మృషధాతువునకు 'సహించుట' అని అర్థాలు.

ఆ మృష్యతే – బాగా సహించువాడు 'మర్షీ'. సత్ – ఆ – మర్షీ = సదామర్షీ

సర్వ జగద్భారాన్ని సదా వహించువాడు – సహించువాడు

నాక్షస్తృప్యతే భూరిభారః (ఋగ్వేదం)

వహించినా తపించని వాడు. మహా విశ్వాన్ని భరిస్తున్నాడు.

2. *సజ్జనులను ఆభిముఖ్యంతో (వారి ఎదుట ఉన్నవాడై, అనుకూలంగా) క్షమించువాడు. అనగా – వారి అపరాధాలను క్షమించి, రక్షించువాడు.*

సర్వ జగతినీ భరిస్తున్న ఆధారస్వరూపుడు కనుక –

లోకాధిష్ఠానమ్.. 894

1. లోకాలకు ఆశ్రయమైనవాడు.

ముల్లోకాలు అతనిని ఆశ్రయించుకొని ఉన్నాయి. తన కేదీ ఆశ్రయం కాదు. అటువంటిది బ్రహ్మతత్త్వం.

తస్మిన్నాతస్థుర్భువనాని విశ్వా ॥ (ఋగ్వేదం)

ఈతనియందే సమస్త భువనాలు ఉన్నాయి.

విసుగుచెందక, సహించి, ఆధారమైన ఉన్న ఆశ్చర్య తత్త్వమిది –

అద్భుతః.. 895

1. ఆశ్చర్య స్వరూపుడు.

ఇటువంటి వస్తువు ఎన్నడూ కనీవినీ ఎరుగనిది.

దృశ్యజగతికి అతీతుడు.

అంతా తానై యుండి కూడా తెలియబడకపోవడం ఒక ఆశ్చర్యం.

ప్రతికాలంలో, దేశంలో అంతుపట్టని ఆశ్చర్యకర విశ్వ వ్యవస్థ మహాశ్చర్యం. ఇన్ని చేస్తూ దేనికీ అంటని పరమతత్త్వం పరమాశ్చర్యం.

శ్రవణాయాఽపి బహుభిర్యోనలభ్యః–
శృణ్వంతోఽ పి బహవో యం నఽవిద్యుః।
ఆశ్చర్యో వక్తా కుశలోఽస్యలబ్ధా
ఆశ్చర్యో జ్ఞాతు కుశలానుశిష్టః ॥ (కఠోపనిసత్తు)

"శ్రవణం చేయడానికి అనేకులచే లభ్యుడు కానివాడు –

ఒకవేళ విన్నప్పటికీ అనేకులు తెలియలేరు. అటువంటి ఈతని గురించి చెప్పేవాడు ఆశ్చర్యకరుడు.

నేర్పరుల చేత బోధింపబడినప్పటికీ, ఈతని విషయాన్ని ఎరుగగలుగువాడు కూడా ఆశ్చర్యకరుడు".

పరతత్త్వాన్ని గ్రహించడం అందరికీ సాధ్యం కాదు.

అది "అసాధారణం – అరుదు" ఈ భావమే 'అద్భుతం'. మాటతో చెప్పగలిగే వారు (గ్రహించి బోధించేవారు) అరుదు – దానిని అవగతం చేసుకునేవారు కూడా అరుదే. అలాంటి అరుదుగా లభించే ఆశ్చర్య వస్తువు పరతత్త్వం.

'ఆశ్చర్య వత్పశ్యతి కశ్చిదేనమ్' (భగవద్గీత)

'ఒకానొకడు మాత్రమే ఈతనిని ఆశ్చర్యకర వస్తువుగా చూస్తాడు.'

సదసస్పతి అద్భుతం ప్రియమిన్ద్రస్యకామ్యమ్ ॥ఋగ్వేదం॥

వషట్‌కృతస్యాద్భుతస్య దస్రా ॥ఋగ్వేదం॥

2. ఇది వరకు లేనిది అద్భుతం, కానీ ఇతడు ఎప్పుడు ఉన్నవాడైనప్పటికీ నిత్యనూతనుడు. అందుకే అద్భుతుడు. చైతన్యమే నిత్య నూతనం.

అయినా మార్పులు లేనిది కనుక –

సనాత్ సనాతనతమః కపిలః కపి రవ్యయః।

స్వస్తిదః స్వస్తికృ త్స్వస్తి స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః॥ 96

896. *సనాత్,* ***897,*** *సనాతన తమః,* ***898,*** *కపిలః,* ***899.*** *కపిః,*
900. *అవ్యయ,* ***901.*** *స్వస్తిదః,* ***902.*** *స్వస్తికృత్,* ***903.*** *స్వస్తి*
904. *స్వస్తిభుక్,* ***905.*** *స్వస్తి దక్షిణః.*

సనాత్.. 896

1. శాశ్వతమైనవాడు.

వికారాలు లేనివాడు, ఏకరస స్వరూపుడు. కేవల చైతన్య స్వరూపుడు. ఎప్పుడూ ఒక్క విధంగా ఉండడమే సనాత్.

2. చిరకాలమైనవాడు.

'సనాత్' అనే మాటకు 'చిరకాలము' అని కూడా అర్థం. కాలం పరమాత్మకి ఒకానొక (అనిర్వచనీయమైన) వికల్పం (భేదకల్పన) మాత్రమే.

పరస్య బ్రహ్మణో రూపం పురుషః ప్రథమం ద్విజ ॥

వ్యక్తాఽవ్యక్తే తథైవాన్యేరూపే కాలస్తథా పరమ్ ॥(విష్ణు పురాణం)

"ఓ విప్రా! పరబ్రహ్మకు చెందిన మొదటి రూపం పురుషుడు (చైతన్యం); ఆ విధంగా మరి రెండు అవ్యక్తం (ప్రకృతి), వ్యక్తం (మహతత్త్వం మొదలైనవి), నాలుగవది కాలం."

సనాత్ యువానమవసే హవామహే ॥(ఋగ్వేదం)॥

సనాదేవ సహసే జాత ఉగ్రః ॥(ఋగ్వేదం)॥

ఆ యో మహః శూరః సనాదనీడ్యః ॥(ఋగ్వేదం)॥

ఇంతకంటే ప్రాచీనుడు శాశ్వతుడు లేడు.

సనాతనతమః.. 897

1. *సనాతనాలకంటె సనాతనుడు.*

చిరకాలం ఉన్న బ్రహ్మాదులకంటె మహర్షులకంటె పూర్వుడు.

నిరంతరం ఒకేవిధంగా జరుగుతున్న జగత్స్వరూపాన్ని 'సనాతనం' అనవచ్చు. దానికంటె సనాతనుడు. వికార రహితుడు.

అందరికీ కారణమైనవాడు కనుక ప్రాచీనతముడు.

ఏనాటినుండో ప్రకాశిస్తున్న సూర్యాదులకంటె తొలివాడు – ఈతని తేజస్సే భాస్కరాదులలో దీపిస్తున్నందున –

కపిలః.. 898

1. ఎఱ్ఱని వర్ణం కలవాడు.

పింగళ వర్ణానికి 'కపిల' అని పేరు. ఈ వర్ణంతో ప్రకాశించే వాడు సూర్యుడు. కాంతి వర్ణమే కపిలం.

బడబాగ్ని వర్ణం కపిలవర్ణం. అది భగవద్విభూతి. కనుక ఆ రూపంలో ఉన్నవాడు.

2. జలాన్ని గ్రహించే సూర్యుని 'కపిః' అని శాస్త్ర ప్రసిద్ధంగా చెప్పేమాట. ఆ

సూర్యుని సర్వ జగతిని ప్రవర్తింపజేయడానికై (తన రూపంగా) స్వీకరించిన పరంజ్యోతి విష్ణువు.

కపిం సూర్యం లాతి ఆదత్తే సర్వస్యజగతః

ప్రవర్తనాయేతి కపిలః (సత్యభాష్యం)

ఎఱ్ఱని కాంతితో ప్రకాశించే తన కిరణాలతో జలాన్ని స్వీకరించడం చేత –

కపిః.. 899

1. జలాన్ని పానం చేయువాడు.

   కం జలం పిబతి – కపిః, తన కిరణాలతో భూగత జలాలను పానం చేయడం చేత సూర్యుడు కపి.

2. 'కపిర్వరాహః శ్రేష్ఠశ్చ'

   – కపి అనగా వరాహం, శ్రేష్ఠుడు – అని రెండు అర్థాలు.

   రెండూ విష్ణువునకు వర్తించే నామాలు.

3. **కాయతి శబ్దాయతే. కిరతి – జలం వికిరతి, కనతి దీప్తౌ భవతీతి వా కః, తం పాతి పిబతి ఇతి–కపిః** (సత్యభాష్యం)

   శబ్దంచేయునది, జలాన్ని వెదజల్లునది, ప్రకాశం – వీటికి 'కః' అని పేరు. దానిని రక్షించువాడు. పానం చేయువాడు – కపి.

   వేదశబ్దాలు, స్తోత్రాలు– 'కః'. వాటిని (వేదాది విద్యలను) రక్షించువాడు ఆ శబ్దాలను (స్తోత్రాలను) చక్కగా ఆస్వాదించువాడు – కపిః.

   మేఘాదులను, ప్రకాశాలను పాలన చేసేవాడు – వాటిని స్వీకరించేవాడు. ప్రళయ కాలంలో వీటన్నిటినీ తనలోనికి గ్రహించేవాడితడే (పిబతి–పానము చేయుట – లోనికి గ్రహించుట) అందుకే –

అవ్యయః.. 900

1. తనలోనికి చేర్చుకొనువాడు.

ప్రళయకాలంలో జగాలన్నీ ఈతనిలోనికి చేరుతున్నాయి. జలాదులన్నిటినీ తనలోనికి లీనం చేసుకొనే సూర్యాది రూపాలలో నున్న విష్ణువితడే. ముక్త జీవులను తనలోనికి చేర్చుకొనువాడు.

'అపియన్తి' జగన్తి - లీయన్తే అస్మిన్ భూతాని. ఈతనియందే భూతకోటి లీనమవుతున్నది.

జ్యోతిః (877) నామం నుండి ఈ అవ్యయః (900) నామం వరకు పునరావృత్తి రహిత పదాన్ని చేర్చే అర్చిరాది మార్గాలగురించి చెప్పబడినట్లుగా శ్రీ పరాశర భట్టుదర్శనం.

అర్చిస్సు (అగ్ని), శుక్ల పక్షం, ఉత్తరాయణం, సంవత్సరం, వాయువు, సూర్యుడు, చన్ద్రుడు, మెఱుపు, వరుణుడు, ఇంద్రుడు, బ్రహ్మ అను వీరల లోకాల మూలంగా యోగ్యుడై జీవుడు 'క్రమ ముక్తి' లో ముకుడౌతాడు.

అగ్ని, దినము, మొదలైనవాటి అభిమాని దేవతలకు చెప్తున్న మాటలు.

-శ్రీ విష్ణువిద్య (శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్ర భాష్యం)లో తొమ్మిదవ శతకం సంపూర్ణమ్ -

ఈ పాలన, లయము అన్నీ మంగళ స్వభావుని మంగళ కృత్యాలే. వీటన్నిటి ద్వారా శుభాలనిచ్చేవాడు కనుక -

స్వస్తిదః.. 901

1. మంగలాన్నిచ్చువాడు.

మేలు ఉండుట -మంగళం-సు-అస్తి.

'సత్త్వాయ - ఆత్మధారణాయ సాధనాని దదాతి' (సత్యభాష్యం)

జీవనానికై జీవనోపయోగ సాధన, స్వస్తి. తత్త్వపరంగా జ్ఞాన సాధన స్వస్తి. వాటిని భక్తులకు ప్రసాదించువాడు.

సాధనల నివ్వడమే కాక - కలిగించేవాడు కూడా.

స్వస్తికృత్..... 902

1. మంగళాలను కలిగించువాడు.

భక్తులకు శుభాలను చేసేవాడితడు.

స్వస్తి..... 903

1. మంగళ స్వరూపుడు.

మంగళాలన్నీ ఆయన విభూతులే. ఆయన పూర్ణమంగళస్వభావుడు - స్వరూపుడు.

"మంగళాయతనో హరిః" మంగళాలకు స్థానం హరి.

2. స+అస్తి.

"అస్తి"అనగా 'సత్'. కేవల సత్తా స్వరూపుడు. శాశ్వతమైన ఉనికి. అది చిదానంద తత్త్వం కనుక 'సు' మేలైన సత్స్వరూపుడు.

స్వస్తిభుక్..... 904

1. శుభాన్ని అనుభవించువాడు.

భక్తులు సమర్పించే మంగళకర భావాలను, మంగళమయ యజ్ఞ ద్రవ్యాలను స్వీకరించువాడు. నిరంతరం మంగళానుభవమే ఈతని స్వభావం.

2. భునక్తీతి భుక్. రక్షించువాడు.

మేలునీ, మంగళాన్నీ రక్షిస్తాడు. **'యోగక్షేమం వహామ్యహం'** అన్నట్లుగా స్వస్తిని ప్రసాదించి, కలిగించడమే కాక దానిని కాపాడి, పాలించేవాడితడు.

(భుజ పాలనాభ్యవహారయోః - అనురుధాది ధాతువు ఆధారంగా ఈ రూపం సిద్ధిస్తోంది)

పాలించుతూనే పూర్ణత్వాన్నిచ్చేవాడు కనుక -

1. *శుభ రూపంగా కొనసాగువాడు.*

దక్షతే వర్ధతే ఇతి దక్షిణః – వర్ధిల్లువాడు దక్షిణుడు.

వర్ధయతీతి – 'వర్ధిల్లజేయువాడు' అని కూడా అర్థాన్ని గ్రహించవచ్చు. దక్షిణుడనగా సమర్థుడు.

శుభాలను ఇవ్వడంలో, కలిగించడంలో, రక్షించడంలో కూడా ఈతడు సమర్థుడు. 'దక్షిణః శీఘ్రకారీ' అనే అర్థంలో 'శీఘ్రంగా' సమకూర్చువాడు అని కూడా చెప్పవచ్చు.

వర్ధిల్ల చేసి, శీఘ్రంగా సమకూర్చే సమర్థుడు.

స్మృతే సకల కల్యాణ భాజనం యత్ర జాయతే।
పురుషస్తమజం నిత్యం వ్రజామిశరణం హరిమ్॥

"ఎవరు స్మరింపబడినంత మాత్రాన, జీవుడు సకల శుభాలకు పాత్రుడు అవుతున్నాడో –అటువంటి జన్మరహితుడు, నిత్యుడు అయిన హరిని శరణంగా (రక్షకునిగా) పొందుతున్నాను"

స్మరణాదేవ కృష్ణ స్య పాపసంఘాత పంజరం।
శతధా భేదమాయాతి గిరిర్వజ్ర హతో యథా॥

"కృష్ణుని స్మరణ మాత్రం వలననే పాపాల రాశి అనే పంజరం, వజ్రపు దెబ్బతిన్న పర్వతం వలె నూరు చెక్కలుగా బ్రద్దలౌతోంది"

– మొదలైన వచనాలు, ఈ అర్థాన్నే సమర్థిస్తున్నాయి.

ఈ అయిదు నామాలు (901 నుండి 905) స్వస్తి పదాన్వితాలు. యజ్ఞంలో 'స్వస్తి'కి ప్రాధాన్యం. స్వస్తిలో పూర్ణమై సర్వమంగళ కరంగా యజ్ఞం ఫలించుతుంది. యజ్ఞ ఫలమ్ స్వస్తి. దానినిచ్చేవాడు – దాని స్వరూపుడు విష్ణువు. అందుకే ఈ స్వస్తి పదనామాలు.

స్వస్తి దా విశస్పతిః ॥ఋగ్వేదం॥
స్వస్తి నో ది వో అగ్నే ॥ఋగ్వేదం॥
స్వస్తి మిత్రా వరుణౌ ॥ఋగ్వేదం॥

పరమ మంగళ స్వరూపుడు కనుకనే భయక్రోధాదులు లేనివాడు -

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః।
శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః॥ 97

906. అరౌద్రః, 907. కుణ్డలీ, 908. చక్రీ,
909. విక్రమీ, 910. ఊర్జిత శాసనః, 911. శబ్దాతిగః,
912. శబ్దసహః, 913. శిశిరః, 914. శర్వరీకరః.

అరౌద్రః.. 906

1. రౌద్రం లేనివాడు.

'రుదిర్ అశ్రువిమోచనే' అనే ధాతువుననుసరించి, కన్నీటిని కలిగించే భయక్రోధాదులు రౌద్రాలు. అది లేనివాడు - సౌమ్యుడు - అరౌద్రుడు.

దుఃఖాన్ని కలిగించే కర్మ, రాగ (మమకారం), కోపాలు - రౌద్రత్రయాలు. అవి లేని వాడు విష్ణువు.

కోరిక లేవీలేని 'అవాప్తకాముడు' కనుక రౌద్ర జనక వికారాలు లేనివాడు.

ఈ సౌమ్యా కృతి దాల్చి రక్షించువాడు కనుక -

కుణ్డలీ.. 907

1. కుణ్డలం (లాలు) కలవాడు.

'కుడిదాహే' భౌవాదికధాతువు, 'కుడి రక్షణే' చౌరాదిక ధాతువులనను సరించి,

'కుణ్డలం దాహో రక్షణం వా సోస్యాస్తీతి కుణ్డలీ'.

"కుణ్డలం - దాహశక్తి, రక్షణ శక్తి అది కలవాడు కుణ్డలీ."

అనగా ప్రకాశ స్వరూపుడు, రక్షణ స్వరూపుడు కుణ్డలీ.

సూర్యరూపనారాయణుడు కూడా ఈ నామం ద్వారా ద్యోతకమౌతున్నాడు.

మండలాకృతి, చుట్టుకొనే లక్షణం కలది కుండలీ. ఇది సర్పానికి కూడా వర్తిస్తుంది.

2. ఆది మధ్యాంత రహితాన్ని సూచించే మండలాకృతి కుండలీ. పరతత్త్వం మొదలు, నడిమి, తుది లేనిది.
3. ఇది రూఢంగా సర్పాన్ని చెప్తుంది. ఆదిశేషరూపుడైన విష్ణువు కుణ్డలీ.
4. సూర్య మండలాలను పోలిన కుండలాలను ధరించినవాడు.
5. సాంఖ్యం, యోగం – అనే దర్శనాల రూపంలో ఉన్న మకరాకారపు కుండలాలు కలవాడు. (శంకర భాష్యం)

రక్షణ స్వరూపమైన తేజస్సుతో ప్రతికూలాలను నశింపజేసి, తృప్తినిస్తున్నందున –

చక్రీ.. 908

1. చక్రం కలవాడు.

'చకతృప్తౌ ప్రతి ఘాతేచ' అనే భౌవాదిక ధాతువుననుసరించి, 'చక్యతే తృప్యతే జగత్, ప్రతిహన్యతే చ తమోయేన' తచ్చక్రం – **సోస్యాస్తీతి చక్రీ.** (సత్యభాష్యం)

జగతిని తృప్తి పరచేది, అంధకారాన్ని (శత్రువులను) ఎదుర్కొని సంహరించేది చక్రం. దానిని కలవాడు తృప్తికారకుడు, శత్రు సంహారకుడు.

జగతికి తృప్తిని కలిగిస్తూ, తమస్సును ఛేదిస్తున్న సూర్యునికి కూడా ఈ నామం వర్తిస్తుంది.

వివిధ ఘటాలను చేసే కుమ్మరి చక్రం వలె – విభిన్న రూపాల జగతిని తన 'సంకల్పశక్తి' అనే చక్రం ద్వారా నిర్మిస్తున్న విష్ణువు. విష్ణు హస్తంలోని చక్రం మనశ్శక్తికి సంకేతం.

చల స్వరూపమత్యన్త జవేనాంతరితానిలం।
చక్ర స్వరూపంచ మనో ధత్తే విష్ణుః కరే స్థితమ్ ॥(విష్ణుపురాణం)

"చలించు స్వరూపం (స్వభావం) కలదీ, తన మిక్కిలి వేగంతో వాయువును మించినదీ, చక్ర స్వరూపం కలదీ అయిన మనసును విష్ణువు తన కరంలో ఉన్నదిగా ధరిస్తున్నాడు."

2. సర్వతోముఖ తత్త్వమే చక్రం. ఆ తత్త్వం కలిగినవాడు చక్రీ.
3. సృష్టి స్థితిలయాది ఆవృతులతో కూడిన విశ్వ చక్రాన్ని నిర్వహిస్తున్నవాడు.
4. సుదర్శనమనే చక్రాన్ని ధరించినవాడు.

చక్రహస్తుడై శత్రువును దునుమాడే ప్రతాపశాలి కనుక –

విక్రమీ.. 909

1. శౌర్యం కలవాడు.

'విక్రమం' అనగా పాదాన్ని ఉంచుట, శౌర్యం అని రెండు అర్థాలు. వీటిని కలవాడు విక్రముడు. తివిక్రముడు, శౌర్య శాలి కనుక స్వామికి ఈ నామం వర్తిస్తోంది. అందరి కంటె శౌర్యవంతుడు, ముల్లోకాలను ఆక్రమించి మించినవాడు.

తన విక్రమంతో జగతిని శాసిస్తున్నందున –

ఊర్జిత శాసనః.. 910

1. బలమైన శాసనం కలవాడు.

తిరుగులేని శాసనం చేసి, పాలించేవాడు.

జగన్నియమాలే శాసనాలు. ఇవి మారవు. ఏ ఒక్కరూ మార్చలేరు. సృష్టియందు పరమాత్మ నిబద్ధించిన విశ్వలక్షణాలు చాలా బలమైనవి. పరమేశ్వరుని బలమైన శాసనం విశ్వమంతా అనుల్లంఘనీయమై (దాట రానిదై) భాసిస్తోంది.

శక్తిమంతమైన శ్రుతి స్మృతి రూపమైన శాసనాన్ని ఏర్పరచిన వాడితడు. **శ్రుతీ స్మృతీ మమై వాజ్ఞే యస్త ఉల్లంఘ్యవర్తతే।**

ఆజ్ఞాచ్ఛేదీ మమద్వేషీ మద్భక్తోపి న వైష్ణవః॥

'శ్రుతి స్మృతులు నా ఆజ్ఞలే. ఎవడు వాటిని అతిక్రమించి వర్తిస్తాడో, వాడు నా ఆజ్ఞను ఛేదించినవాడు. నా ద్వేషానికి పాత్రుడు. వాడు నా యందు భక్తికలవాడైనప్పటికీ, విష్ణు సంబంధి (నాకు సంబంధించినవాడు) కాడు!' అని విష్ణు వచనం.

శబ్దస్వరూపాలైన శ్రుత్యాదులను తాను ఏర్పరచినా, వాటికి అతీతుడై భాసిస్తున్నందున –

శబ్దాతిగః.. 911

1. *శబ్దాలను అతిక్రమించి వ్యాపించువాడు.*

మాటలేవైనప్పటికీ జాతి, గుణ, క్రియ – అనే మూడు లక్షణాల్లో ఒకదానినో, కొన్నిటినో, అన్నిటినో వ్యక్తీకరిస్తాయి.

శబ్దం ఏ అర్థాన్నయినా వ్యక్తీకరించవలసి వచ్చినప్పుడు, అందుకు హేతువుగా ఆ అర్థంలో జాతి గుణ క్రియలు ఉండాలి. అవి విష్ణునిలో అసంభవాలు. కనుక శబ్దము అతనిని చెప్పలేదు.

యతోవాచోనివర్తన్తే అప్రాప్యమనసాసహ ॥ (తైత్తిరీయోపనిషత్)

'వాక్కులు మనస్సుతో కూడా ఎవనిని చేరజాలక వెనుకకు మరలుతున్నాయో!

నశబ్దగోచరం యస్య యోగిధ్యేయం పరంపదమ్ (విష్ణుపురాణం)

'యోగుల ధ్యానానికి మాత్రమే గోచరం కాదగిన ఎవని పరమ పదం, శబ్దాలకు గోచరం కాదో'–

–ఇలా శ్రుతి స్మృతులు ఆ పరతత్త్వం వాగతీతం అని స్పష్టపరుస్తున్నాయి. మాటలకందని వాడైనా, శబ్దంలో వ్యాపించిన చైతన్యమాతడే. శబ్దంచేతనే స్తుతింపబడుతున్నాడు –

శబ్దసహః.. 912

1. *శబ్దాన్ని సహించువాడు.*

తనను ప్రతిపాదించేవిగా శబ్దాలను అంగీకరించువాడు.

వేదాలన్నీ ఆతనియందుగల తాత్పర్యంతో ఆతననినే చెబుతున్నాయి. కనుక ఆతడు శబ్దసహుడు.

సర్వే వేదా యత్పదమామనంతి (కఠోపనిషత్తు)

సర్వ వేదాలు ఏతత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నాయో (ఆ తత్త్వమే విష్ణువు)

వేదైశ్చ సర్వై రహమేవవేద్యః (భగవద్గీత)

సర్వ వేదాల చేత తెలియబడువాడను నేనే.

2. *శబ్దాలకందని వాడైనప్పటికీ, భక్తుల స్తోత్రాది శబ్దాలను, మంత్రజపాలనూ అంగీకరించి, వారిని అనుగ్రహిస్తున్నాడు– గజేన్ద్రునిస్తుతిని స్వీకరించినట్లుగా.*

భక్తుడు చేసే స్తోత్రం లోని శబ్దాలు నిజానికి భగవానుని సంపూర్ణంగా వివరించలేవు. కానీ ఆతడు దయతో ఆ శబ్దాలను సహిస్తున్నాడు.

'నే పొగడకుంటే నీకేదేమీ కొదవో?' అని త్యాగరాజవినతి. భక్త వాత్సల్యంతో సహిస్తున్నాడు – దుర్బలులైన పసివారు పలికే మాటలను సమగ్రాలు కాకపోయినా, తలిదండ్రులు సహించినట్లుగా!

స్తోత్రాదికాలను స్వీకరించి శీఘ్రంగా అనుగ్రహించి, పాపహరణం చేస్తున్నందున –

శిశిరః.. 913

1. *చల్లనివాడు.*

ఆధ్యాత్మిక ఆదిభౌతిక ఆధిదైవికాలనే మూడు విధాలైన తాపాలతో, అన్ని విధాల తపించిపోయేవారికి విశ్రాంతి హేతువు. తాపత్రయ నాశకుడు – శాంతికరుడు.

2. *ఋతువులలో శిశిర ఋతువు కూడా విష్ణు విభూతియే.*

ప్రతి ఋతు పరివర్తన. కాల స్వరూపుడైన నారాయణుని శక్తియే. ఆకులు రాలే శిశిరం – కర్మ బంధాలను రాల్చే జ్ఞాన భూమికకు సంకేతంగా కూడా గ్రహించవచ్చు. జ్ఞాన ప్రదాత అయిన ముక్తి కారకుడు విష్ణువు.

శిశిరం– పేర్కొనడం ద్వారా దానికి ముందున్న అన్ని నామాలను పేర్కొన్నట్లే 'పది' చెప్తే అందులో మిగిలిన తొమ్మిది ఉన్నట్లుగా దానిని గ్రహించాలి.

గ్రీష్మోహేమన్తః శిశిరో వాసన్తః శర్షద్వర్షాः స్వితేనో దధాత।। (అథర్వవేదం)

సర్వ ఋతు స్వరూపునిగా పరమేశ్వరుని వేదం సంభావించింది.

3. 'శశప్లుత గతౌ' అనే ధాతువు ననుసరించి –

శీఘ్రముత్ ప్లుత్యగచ్ఛతీతి శిశిరः (సత్యభాష్యం)

వేగంగా దాటుతూ వెళ్ళువాడు శిశిరుడు. ఇది రాశిచంక్రమణం చేసే సూర్యచంద్రులు ఉభయులకీ వర్తిస్తుంది. గతి దాత అయిన సూర్యునియందు భాసించేది విష్ణు తేజమే– కనుక అతడు శిశిరుడు.

4. యోగనిద్రాస్వరూపుడు.

అతి శయేన శేతే ఇతి శిశిరः

బాగా నిద్రించే స్థితియే శిశిరం. ప్రళయావస్థలో యోగనిద్ర యందుండే స్వామి.

జ్ఞానమయమైన అంతర్ముఖ స్థితి యోగులకి అనుగ్రహించి, మోహమయ నిద్రను బహిర్ముఖులకు కల్పిస్తున్నవాడు కనుక –

శర్వరీకరः.. 914

1. రాత్రిని కలిగించువాడు.

శృణాతి చేష్టాः ఇతి శర్వరీ... జీవుల క్రియా వృత్తులను హింసించేది (తొలగించేది) శర్వరీ. ప్రవృత్తి రహితులుగా చేసే కాలం శర్వరీ.

సంసారులకు (బహిర్ముఖులకు–దేహాభిమానులకు) ఆత్మ తత్వం విషయంలో ప్రవృత్తి ఉండదు. ఆ విషయంలో నిద్రాళువులు. కానీ – సంసార విషయంలో

మెలకువ కలిగి ఉంటారు, కనుక వారికి ఆత్మ తత్త్వము 'శర్వరీ' (రాత్రి-నిద్రాస్థితి)

జ్ఞానులకు - అవిద్యా కల్పిత సంసారంలో ఏ మాత్రమూ ప్రవృత్తి ఉండదు. ఆత్మ విషయంలో మెలకువ కలిగి ఉంటారు. సంసారం వారికి శర్వరీ.

ఈ విధంగా ఇరువురకు రెండు విధాలైన శర్వరులను (రాత్రులను) కలిగించే పరమాత్ముడు 'శర్వరీకరుడు' అనగా - సంసారులకు మాయను క్రమ్మించి, జ్ఞానులకు దానిని తొలగించి మెలగువాడు.

యానిశా సర్వభూతానాం తస్య జాగర్తిసంయమా।
యస్యాం జాగ్రతి భూతాని సానిశా పశ్యతోమునేః॥ (భగవద్గీత)

'అందరికీ ఏది రాత్రో (ఏ పరమార్థ తత్త్వాన ప్రజ్ఞ కలిగి ఉండరో) ఆ రాత్రి జ్ఞానులు మెలకువ కలిగి ఉంటారు. (తత్త్వం తెలిసి ఉంటారు). సర్వ భూతములు (సంసార వర్తులు) మెలకువ కలిగిన దేని యందు (అవిద్యా కార్యమైన సంసారమందు) ఉంటారో, అది తత్త్వదర్శియగు మునికి (యోగికి) రాత్రిగా ఉంటుంది" అని పరమాత్ముని వివరణ.

2. కాలగతిలో రాత్రి కూడా ముఖ్యమే.

విశ్రాంతికి, సుఖానికీ మూలమైనది రాత్రి. **రాతి సుఖం దదాతీతి రాత్రి.** సుఖాన్నిచ్చేది రాత్రి. పగటి అలసటకి రాత్రి ఉపశమనం. మళ్ళీ శక్తిని పుంజీభూతం చేసే స్థితి రాత్రి. వేదాలలో 'రాత్రి సూక్తం' ప్రత్యేకించి చెప్పబడింది.

'అహః' అని ఇదివరకటి నామాలలో పగటి స్వరూపంగా విష్ణువుని దర్శిస్తూ, ఇక్కడ రాత్రిని కలిగించువానిగా పేర్కొన్నారు. రెండూ విష్ణువిభూతులే.

పైగా సూర్యుడు అస్తమించి రాత్రి కలిగిస్తున్నందున - కాల కర్త అయిన ఆతనికి కూడా ఈ పేరు వర్తిస్తుంది.

3. *శిశిరః, శర్వరీ కరః* - ఈ రెండూ కూడా చంద్ర పరంగా అన్వయించవచ్చు.

'విహాయసగతిః' నుండి సూర్యరూపుడైన విష్ణుని వర్ణిస్తూ వచ్చిన నామాలు,

ఇక్కడ చన్ద్రరూపుడైన స్వామిని పేర్కొన్నాయి.

చల్లనివాడు (శిశిరః) చన్ద్రుడు – నిశాకరుడు (రాత్రిని కలిగించువాడు) – అని ప్రసిద్ధం.

శాంతినిచ్చే సౌమ్యుడు కనుకనే –

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః।
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః॥ 98

915. అక్రూరః, *916. పేశలః,* *917. దక్షః,*
918. దక్షిణః, *919. క్షమిణాం వరః,* *920. విద్వత్తమః,*
921. వీతభయః, *922. పుణ్యశ్రవణ కీర్తనః.*

అక్రూరః.. 915

1. క్రూరుడు కానివాడు.

'క్రౌర్య' అనేది తీవ్ర కోపం– అనే చిత్తోద్రేకం వలన కలిగేది, గాఢమైన ఆసక్తి (అభినివేశం)తో కూడినది, అంతఃకరణ లోని సంతాపం – అనే మనోధర్మం. అవాప్త సమస్త కాముడు, పరిపూర్ణుడైన విష్ణువునకు చిత్తంలో ఏకమమూ లేదు కనుక ఏ కోపం లేదు. అందువలన క్రౌర్యమూ లేదు, సౌమ్య మూర్తి, ప్రశాంతమంగళ స్వరూపుడు.

2. 'కృతీ ఛేదనే' అనే తౌదాదిక ధాతువుననుసరించి – **కృన్తతీతి – క్రూరః,** ఛేదించువాడు క్రూరుడు. ఛేదించనివాడు అక్రూరుడు.

విశ్వమంతా స్వామి అక్రూరతత్త్వంగానే వ్యాపించి ఉన్నాడు. మరిలోకంలో కొందరు బాధితులు, కొందరు సుఖవంతులు– ఎందువలన? అది స్వామి కృత్యం కాదు. వారి వారి కర్మానుగుణంగా – ఒకే ఈశ్వర శక్తి కొందరికి దుఃఖానుభవంగా, ఇంకొందరికి సుఖానుభవంగా లభిస్తోంది.

రాత్రి కొన్ని జీవులకు ఉనికినిస్తోంది. అవి పగటి పూట నశిస్తున్నాయి

(ఛేదింపబడుతున్నాయి). పగటి ఉనికిని కలిగినవికొన్ని రాత్రి తొలగుతున్నాయి. ఈ రెండింటికీ సూర్యుడు కారణం కాదు. వారి కర్మానుగుణంగా, ఉపాధి లక్షణంగా సమకూరేవి మాత్రమే. అలా నిర్వికారమైన ఈశ్వర్యచైతన్యమే ఈ నామం ద్వారా వ్యక్తమౌతోంది.

ఆ దివ్య మంగళ స్వరూపం సుకుమారం సుందరం కూడా –

పేశలః.. 916

1. *శోభనమైనవాడు.*

చేతులు, మనస్సు, మాట, తనువు కూడా శోభనమైనవి కనుక – పేశలుడు. సుకుమార శోభన స్వరూప స్వభావాలు కలవాడు.

2. ***'పిశ అవయవే'*** *అనే ధాతువుననుసరించి అవయవాలు కలవాడు.*

'పేశలః' (సత్య భాష్యం)

శరీరం ఒకటిగా కనబడినా అది అనేక అవయవాల విభాగంతో కూడినది. ప్రత్యవయవం మళ్లీ మరికొన్ని భాగాలతో ఉన్నది. అలాగే నక్షత్రాలను మండలాలుగా విభజిస్తాం. కానీ ప్రతి మండలం కొన్ని నక్షత్రావయవాలతో ఉన్నది. కాలం కూడా క్షణనిమేషాది అవయవాలతో ఉన్నదే. ఇలా భిన్న భిన్నాలైన సృష్టి విశేషాలన్నిటినీ అవయవాలుగా కల దివ్య శరీరుడు 'పేశలుడు.'

సరస్వతీ మనసా పేశలం వసు
నాసత్యాభ్యాం వయతి దర్శితం వపుః ॥(యజుర్వేదం)॥

శోభనమైన ఈ విభాగాలన్నిటినీ నిర్వహిస్తున్న సమర్థుడు కనుక –

దక్షః.. 917

1. *మిగుల వృద్ధిని పొందియున్నవాడు, సమర్థుడు, శీఘ్రకారి.*

'దక్ష వృద్ధౌ శీఘ్రార్థేచ' అనే భౌవాదిక ధాతువు ననుసరించి, శీఘ్రంగా

వచ్చువాడు, శీఘ్రంగా చేయువాడు, వృద్ధినీ శుభాన్నీ పొందియున్నవాడు, సమర్థుడు – అని అర్థం.

'కాంతిని వృద్ధి చెందించువాడు', 'శీఘ్రంగా గమించువాడు' అనే అర్థంలో సూర్యాదుల పరంగా వేదం ఉపయోగించింది.

తం దక్షైః సుదక్షో విశ్వ వేదాః ॥(ఋగ్వేదం)
శుచిష్ట్వ మసి ప్రియో నమిత్రో దక్షాయ్యో
అర్యమేవాసి సోమ ॥(ఋగ్వేదం)
తం దక్షః సచతే కవిః॥ (ఋగ్వేదం)

శీఘ్రంగా వచ్చి అనుగ్రహించేవాడు కనుక –

దక్షిణః.. 918

1. *దక్షత గలవాడు.*

   నిజానికి 'దక్షః', 'దక్షిణం' రెండూ సమానార్థాలే. కానీ శబ్దభేదం వల్ల పునరుక్తి దోషం లేదు.

   వెంటనే వచ్చి సంతుష్టితో తన చేయూతనిచ్చే ఉదారుడు, సమర్థుడు

2. *దక్షిణంలో సంచరించేవాడు.*

   దక్షిణాయన, ఉత్తరాయణాలలో ఉన్నవాడు,

   యుక్తస్తే అస్తు దక్షిణ ఉత సవ్యశతక్రతో ॥ (ఋగ్వేదం)

   'సవ్య' ఉత్తరాయణాన్ని తెలియజేస్తోంది.

3. వేద సంప్రదాయాలలో దక్షిణ భాగానికి ప్రాధాన్యం. 'కుడి భుజం లాంటివాడు' అనే నానుడి ఉంది. దేవద్రవ్యాలను దక్షిణ భాగంలో ఉంచాలని పూజలలో కూడా పద్ధతి. ఆచారాలలో దక్షిణాచారం వైదికం అని ప్రసిద్ధి.

4. *'దక్ష–గతి హింసనయోః'* అనే ధాతువు ననుసరించి అన్ని వైపులకు శీఘ్రంగా వ్యాపించువాడు, ధర్మద్రోహులను హింసించువాడు అనే అర్థాలను చెప్పవచ్చు.

   ఈ సమర్థతచేతనే అన్నిటినీ ధరిస్తున్నందున –

క్షమిణాంవరః.. 919

1. సహించువారిలో శ్రేష్ఠుడు.

భరించే భూమ్యాదులను కూడా భరించువాడు.

'క్షమా గుణవతాం బలం' అని సుభాషితం. గుణవంతులకి క్షమయే బలం. క్షమ కల యోగులలో అనంత కల్యాణ గుణరాశి అయిన ఈతడే శ్రేష్ఠుడు. శరణాగతుల అపరాధాలను క్షమించే దైవమితడు.

'క్షమయా పృథివీ సమః' – 'ఓర్పు విషయంలో పృథ్వితో సమానుడు అని శ్రీరాముని వాల్మీకి వర్ణించాడు (రామాయణం).

భూమి అన్నిటినీ సహిస్తున్నది. కానీ ఆ భూమి మొదలైన బ్రహ్మాండాలను సైతం సహిస్తున్నవాడు విష్ణువు. క్షమకి భూమి ప్రసిద్ధురాలు అయినప్పటికీ, దుష్టుల భారంతో పీడితురాలైనప్పుడు ఈ నారాయణునే శరణు వేడుతోంది. కనుక ధారణ శక్తి కలిగిన భూమ్యాదులకంటె శ్రేష్ఠుడు.

2. శక్తిమంతులలో శ్రేష్ఠుడు.

క్షమిణులనగా – సమర్థులు (శక్తులు). దేవతలు సైతం కొంత మేరకే శక్తులు, కొందరు కొన్నిటికే శక్తులు. కానీ సర్వ క్రియా నిర్వహణకు మోక్ష ప్రదానానికి పరమాత్ముడైన విష్ణువే శక్తుడు.

సమర్థతకు వలసిన జ్ఞాన సంపద కలవాడు కనుక –

విద్వత్తమః.. 920

1. తెలిసినవారిలో మించినవాడు.

ఇతరుల జ్ఞానాల అతిశయాలను (గొప్పదనాలను) త్రోసివేయగలిగేదీ, సర్వ విషయాలను ఎరుగగలిగేదీ అయిన సంపూర్ణ జ్ఞానం ఈతనికి మాత్రమే ఉంది. జ్ఞాన రూపమే విష్ణువు. ప్రతి జీవిలో అంతర్యామియై, వ్యాపించిన చిత్స్వరూపుడు. అన్ని జ్ఞానాలలో శ్రేష్ఠమైనది ఆత్మజ్ఞానం. ఆ ఆత్మయే తాను కనుక విద్వత్తముడు.

విశ్వ విజ్ఞానమంతా ఈ విష్ణుని రూపమే.

మన్ర్తో విశ్వాని కావ్యాని విద్వాన్ ॥(ఋగ్వేదం)

సమర్థత, జ్ఞానం ఉన్న చోట భయానికి చోటు లేదు. కనుకనే –

వీతభయః.. 921

1. *భయంలేనివాడు.*

సంసారం వల్ల భయం, సంసార రూప భయం లేని నిత్యముక్తుడు – ముక్తి స్వరూపుడు విష్ణువు.

"దుర్భర సంసార దవాగ్నికిన్ వెఱతు" (పోతన భాగవతం) అన్నాడు ప్రహ్లాదుడు. జనన మరణ ప్రవాహరూపమైన సంసారమే భయం. అది లేని వాడితడు.

నిర్బలులకే భయం. సకల బల స్వరూపుడైన విష్ణునికి భయమెక్కడ? అన్ని తానైన వాడికి దేని నుండి భయం?

భయరహితుడు, భయ నాశకుడు. ఈతని గుణమహిమలు భయమూలకాలైన పాపాలనే దహనం చేస్తున్నాయి.

పుణ్యశ్రవణ కీర్తనః.. 922

1. *పవిత్రం చేసే శ్రవణ, కీర్తనలు కలవాడు.*

నారాయణుని నామ గుణ మహిమాదుల శ్రవణంగానీ, కీర్తనం కానీ పుణ్యములు. పాపాలను తొలగించి పవిత్రులను చేసే పుణ్య నామాలు కలవాడు శ్రీహరి.

కృష్ణా తమాంసి జంఘనత్ ॥(ఋగ్వేదం)

కృష్ణానితమాంసి –అజ్ఞాన రూపాలైన పాపాదులు. వాటిని పూర్తిగా తొలగించేవి భగవన్నామ శ్రవణం, కీర్తనం.

య ఇదం శ్రుణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్।

నాఽశుభం ప్రాప్నుయాత్ కించిత్ సోఽముత్రేహచ మానవః॥

(మహా భారతం)

– విష్ణు సహస్ర ఫలశ్రుతిగా భీష్ముడు చెప్పిన మాటలు.

"ఈ నామాలను ఎవడు నిత్యం వింటుంటాడో, సమగ్రంగా కీర్తిస్తుంటాడో అటువంటి మానవుడు ఈ లోకంలో కానీ, పరలోకంలో గానీ అశుభాన్ని కొంచెంగానైనా పొందడు." సర్వపాపహరం, చిత్తశుద్ధికరం శ్రీ హరినామం.

ఇది యొకటి హరినామ మింతైన చాలదా!
చెదరకీ జన్మముల చెదలు విడిపింప ॥
మదినొకటి హరి నామమంత్రమది చాలదా!
పదివేల నరకకూపముల వెడలించ... అని అన్నమయ్య కీర్తన.

ఈ పరమాత్మను కీర్తించి, ఆ పుణ్యం చేత గజేన్ద్రాదులు తరించారు. ఈ విధంగా చక్కగా తరింపజేసే తత్త్వ స్వరూపుడు కనుక –

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుఃస్వప్ననాశనః।
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః॥ 99

923. ఉత్తారణః,	*924.* దుష్కృతిహా,	*925.* పుణ్యః,
926. దుఃస్వప్ననాశనః,	*927.* వీరహా,	*928.* రక్షణః,
929. సన్తః,	*930.* జీవనః,	*931.* పర్యవస్థితః.

ఉత్తారణః.. 923

1. పైకి తీసి దాటించువాడు (ముక్తి ప్రదాత).

ఉత్ – తారయతి.

సంసార సాగరం నుండి ఉద్ధరించి, దాటించువాడు. ప్రవాహం నుండి దాటదలచినవారిని నావికుడు నావ ద్వారా దాటించినట్లుగా, తరించాలని తపించే శరణాగతులైన యోగులను జ్ఞానం ద్వారా తరింపజేసే ముక్తి ప్రదాత.

వీహి స్వస్తి సుక్షితిం దివో నృన్ ద్విషో అంహోసి ।
దురితా తరేమ తా తరేమ తవావసా తరేమ ॥ఋగ్వేదం॥
జాతవేదసే సునవామ సోమమరాతీయతో నిదాహాతి వేదః
సనః పర్షదతి దుర్గాణి విశ్వా నావేద సిన్ధుందురితాత్యగ్నిః ॥ ఋగ్వేదం॥
నమః ప్రతరణాయ చోత్తరణాయ చ ॥యజుర్వేదం॥
దురితాలను తొలగించి ముక్తినిచ్చు వాడు కనుక –

దుష్కృతిహా.. 924

1. *చెడు చేయువారిని నశింపజేయువాడు.*

చెడు చేతలను (పాపాలను) చెడు చేసేవారిని హరించువాడు.

జగదీశ్వరుడు కనుక, దణ్డ లక్షణంతో పాపాత్ములను (అధర్మపరులను) నశింపజేయువాడు, భక్తుల పాపాలను పరిహరించువాడు.

వినాశాయ చ దుష్కృతామ్ ॥భగవద్గీత॥
దుష్కృతుల నాశనానికై అవతరిస్తానని భగవానుని మాట.
ఋతస్య పన్థాం న తరన్తి దుష్కృతః ॥ ఋగ్వేదం॥
హన్తి రక్షో హన్త్యాసద్ వదన్త ముభా విభ్రస్య
ప్రసితౌ శాయాతే ॥ఋగ్వేదం॥
తే నో ముఞ్చన్త్వం హసః ॥ఋగ్వేదం॥
పాపనాశనుడై, పవిత్రతను కలిగిస్తున్నందున –

పుణ్యః.. 925

1. *పవిత్రులను చేయువాడు.*

పవిత్వా పుణ్యయతి = శుభకర్మవంతులుగా చేయువాడు పుణ్యుడు. మంచి కర్మలను చేయించి, పాపాలను హరింపజేసే పవిత్ర స్వరూపుడు.

2. **పుణ్యం ఆచష్టేవా**

పుణ్యాన్ని వ్యాఖ్యానించువాడు – ప్రవచించువాడు.

శ్రుతి స్మృతుల రూపంగా పుణ్యకరమైన ధర్మాన్ని ప్రబోధించువాడు.

తనను స్మరించుట, కీర్తించుట మొదలైనవి చేయువారికందరికి పుణ్యాన్ని కలిగించువాడు.

విశ్వతో నః శకునే పుణ్యమావద ॥ఋగ్వేదం॥

ఇమం చలోకం పరమంచ లోకం పుణ్యాంశ్చలోకాన్

విధృతీశ్చ పుణ్యాః ॥ అథర్వవేదం॥

దుఃస్వప్న నాశనః..926

1. చెడు కలలను కనబడకుండా చేయువాడు.

నారాయణుని ధ్యానం చేసినా, స్తుతి చేసినా, కీర్తించినా, పూజించినా రాబోయే అనర్థాలను సూచించే దుఃస్వప్నాలను నశింపజేయువాడు.

దుః స్వప్నేస్మరగోవిన్దం॥ 'దుః స్వప్నం కలిగినప్పుడు గోవిన్దుని స్మరించాలి' అని స్మృతి వాక్యం.

దుః స్వప్నోపశమాయాలమ్ (విష్ణు ధర్మోత్తరపురాణం)

సంపూర్ణంగా దుఃస్వప్నాలను ఉపశమింపజేయువాడు.

యే మాం త్వాంచ సరశ్చైవ...

దుస్స్వప్నం నశ్యతే తేషామ్ (భాగవతం)

గజేంద్ర మోక్ష కథలో – గజేన్ద్రుని, సరస్సును, విష్ణుని, వైకుంఠాదులను, అనుగ్రహించిన విధానాన్ని శ్రవణం చేసినంత మాత్రాన దుః స్వప్న నాశనం ఫలం.

'నాశ -అదర్శనే' అనే ధాతువుననుసరించి, కనబడకుండా చేయడమే నాశనం.

పునరేహి వృషాకపే సువితా కల్పయావహై।

య ఏష స్వప్ననంశనోఽస్తమేషి పథా

పునర్విశ్వస్మదిధ్వ ఉత్తరః ॥ఋగ్వేదం॥

జాగ్రద్దుఃష్వప్న్యం స్వప్నే దుఃష్వప్న్యమ్ ॥అథర్వవేదం॥

అగ్ని, సూర్యాదిరూపుడైన శ్రీహరి దుఃస్వప్నాలను, దుః స్వప్న దోషాలను పరిహరించువాడు.

2. అజ్ఞానమే నిద్రావస్థ. దానితో ఏర్పడిన మోహమయ సంసారమే దుఃస్వప్నం. 'అది కాని దానిని అదిగా తలచుట' – మిథ్యయైన సంసారాన్ని సత్యంగా భ్రమించి వేదన చెందడమే పీడ కల. దానిని తొలగించువాడు. మోహనాశకుడు – మోక్షకారకుడు.

యః సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మాన మేవాద్వయం ॥

(దక్షిణామూర్తి స్తుతం)

నిద్ర నుండి మెలకువ చెందినవాడు, కలను పోగొట్టుకున్నట్లుగా, అద్వయమైన ఆత్మను సాక్షాత్కరింపజేసుకున్నవాడు ప్రపంచ భ్రాంతి నుండి విడివడుతున్నాడు.

ముక్తి ప్రదానంతో – సంసారుల వివిధ గతులను తొలగించుతున్నందున–

వీరహా.. 927

1. *వివిధ గతులను తొలగించువాడు.*

శరణువేడినవారికి సంసారంలో వారి వారి కర్మలననుసరించి కలిగే వివిధ గతులను, ముక్తిని ప్రసాదించడం ద్వారా, నశింపజేయువాడు.

వి – ఈర – హన్ . ఈర= గతి.

(ఈ నామం 166, 741 నామాలుగా వచ్చింది. అక్కడ వివరణను గమనించవచ్చు)

2. *వివిధ గతులను కలిగించువాడు.*

'హన్తి గమయతి' – అనే అర్థాన్ని అనుసరించి వివిధాలైన గతులు కలిగిన గుఱ్ఱాలను సారధి కశ (కొరడాతో) తట్టి కదిలించినట్లుగా, గతికలిగిన

గ్రహాదులను, జీవులను క్రమానుగుణంగా కదిలించేవాడు.

కిరణాశ్వాలను కదిలించే సూర్యుని పరంగా వేదం వర్ణించింది -

త్వయాహినః పితరః సోమ పూర్వే
కర్మాణి చక్రుః పవమాన ధీరాః।
వన్వన్నవాతః పరిధీరపోర్ణు
వీరేభిరశ్వైర్మఘవా భవా నః ॥ (ఋగ్వేదం)

విశ్వనిర్వహణ ద్వారా, ముక్తి ప్రదానం ద్వారా పాలన చేస్తున్నందున -

రక్షణః.. 928

1. పాలించువాడు.

'రక్ష పాలనే' అనే ధాతువుననుసరించి, సకల విశ్వాన్ని పాలించువాడు.

రక్షాణో అగ్నే తవ రక్షణే భీ
రారక్షాణః సుముఖః ప్రీణానః। (ఋగ్వేదం)

సత్త్వ గుణాన్ని ఆశ్రయించి జగత్త్రయాన్ని రక్షించేవాడు.

పాలనకర్తగా విస్తరింపజేసుకున్నవాడు -

సన్తః.. 929

1. సంపూర్ణంగా విస్తరింపజేయువాడు.

విశ్వాన్ని సమగ్రంగా విస్తరింపజేస్తున్నవాడు.

సమ్యక్ తనోతి విస్తారయతి జగదితి 'సన్తః'। (సత్యభాష్యం)

అస్మైవత్సం పరిషన్తం న విన్దన్నిచ్ఛన్తో
విశ్వే అమృతాః అమూరాః ॥ (ఋగ్వేదం)

ఇందులో 'పరిషన్తం' శబ్దం పై అర్థాన్ని బలపరుస్తోంది.

2. సత్పురుషుల రూపంతోనున్నవాడు.

సజ్జనులలోని 'సత్' గుణాలు స్వామివిభూతులే.

'శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు ధర్మపదవియందు' (పోతన – భాగవతం)

'భగవంతుని ఉనికి. విద్యావినయాదికాలను వృద్ధి పరచడానికై సజ్జనుల రూపంలో నున్నవాడు.

దివ్యావతారాలను ధరించి సత్పురుషునిగా సంచరించేవాడు.

రక్షణాది సత్కృత్యాలను చేస్తున్న విష్ణువే సత్పురుషుడు.

3. సంతనోతీతి సన్తః.

ఆశ్రితులకు ఇష్టాలను ఇచ్చువాడు, వృద్ధి చేయువాడు.

విశ్వాన్ని విస్తరింపజేసి, ఇష్టాలను ప్రదానం చేసి పోషిస్తున్నందున–

జీవనః.. 930

1. జీవింపజేయువాడు.

సర్వజీవులను ప్రాణ రూపంలో జీవింపజేస్తున్న పరమాత్మ.

'జీవ ప్రాణ ధారణే' అనే ధాతువులననుసరించి, 'జీవయతి – ప్రాణయతి' – జీవనానికి ఉపకరించే సాధనల ద్వారా జగతిని జీవింపజేస్తున్నవాడు.

విశ్వస్య హి ప్రాణనం జీవనం త్వవే
వియదుచ్ఛసి సూనరిః ॥ఋగ్వేదం॥

జీవింపజేస్తున్న ఈ చైతన్యం అంతటా ఉన్నది కనుక –

పర్యవస్థితః.. 931

1. అన్నివైపుల ఉన్నవాడు.

విశ్వమంతటా వ్యాపించి అన్ని వైపులా నిలిచియున్నవాడు.

పరితః – సర్వతః (అన్నివైపుల).

అడ్డుగా, క్రిందుగా, మీదుగా, అంతటా విస్తరించిన చైతన్య స్వరూపుడు.

స పర్యాగాచ్ఛుక్రమకాయ మవ్రణమస్నావిరమ్ ॥యజుర్వేదం॥

ఘ్రుంసం రక్షన్తం పరివిశ్వతో గయమస్మాకం శర్మ
వనవత్ స్వావసుః ।।ఋగ్వేదం।।

అంతటా వ్యాపించిన కారణంగా అనంత విధాలుగా రూపింపబడు తున్నాడు -

అనంతరూపోఽనంతశ్రీర్జితమన్యుర్భయాపహః।
చతురశ్రో గభీరాత్మా విదిశో వ్యాదిశో దిశః।। **100**

932. అనన్తరూపః,	*933. అనన్తశ్రీః,*	*934. జితమన్యుః,*
935. భయాపహః,	*936. చతురశ్రః,*	*937. గభీరాత్మా,*
938. విదిశః,	*939. వ్యాదిశః,*	*940. దిశః.*

అనన్తరూపః.. 932

1. అనంతాలైన రూపాలు కలవాడు.

రూప్యతే ప్రకాశ్యతే అనేన ఇతిరూపం.

దేనిచేత ప్రకాశింపబడుతున్నదో అది రూపం.

తెలియజేసేది రూపం. అనంతంగా ప్రకాశింపజేస్తున్నవాడు అనన్తరూపుడైన విష్ణువు. ప్రకాశమనగా చైతన్యమే. విసారమైన జగతి అంతా ఆతని వెలుగే - ఆతని చైతన్యమే.

2. బహురూపములు కలవాడు.

విశ్వమే ఆయన రూపం కనుక - సర్వ ప్రపంచ రూపంలో ఉన్న ఈతని రూపాలు అనంతాలు.

లెక్కకందని రూపాలతోపాటు, లెక్కలేని విభూతులుగా విశ్వమంతా వ్యాపించినవాడు కనుక -

అనన్తశ్రీఃః.. 933

1. అనంతాలైన విభూతులు కలవాడు.

విష్ణుని ఐశ్వర్యాలే విభూతులు. వాటికి అంతం లేదు. అన్నిటిలో శ్రేష్ఠమైన కొన్నిటిని చెప్పినది విభూతి యోగం – అది యొక దర్శనం. అన్నిటిలో ఉన్న శ్రేష్ఠత్వాన్ని గమనిస్తే – అది విశ్వమంతా ఉన్నదని తెలుస్తుంది. అది విశ్వరూప సందర్శనం. ఇలా ప్రపంచమంతా పరచుకున్న పలు ఐశ్వర్యాలు కలవాడు.

ప్రతిరూపంలో ఉన్న విభూతులు అయనవే.

2. విభూతియే పరాశక్తి.

అది అపరిమితంగా కలిగిన పరమాత్ముడితడు.

(అనన్తశబ్దం – బహుత్వాన్నీ, అపరిమితత్వాన్నీ తెలియజేస్తున్నది)

అపరిమితమైన ఆ పరాశక్తియే బహువిధాలుగా వ్యక్తమౌతున్నది.

పరాస్య శక్తిర్వివిధైవశ్రూతే (శ్వేతాశ్వతరోపనిషత్తు)

'ఈతని (పరమాత్ముని) 'పరా' అనబడే శక్తి (సర్వోత్కృష్టమైన శక్తి) వివిధాలుగా శ్రుతులలో వినబడుతున్నది.

నహి తే శూర రాధసోన్తం విన్దామి సత్రా ॥ ఋగ్వేదం॥

అనంతవిభూతులతో అనుగ్రహిస్తున్నందున –

కేవల దయాస్వరూపుడు.

జితమన్యుఃః.. 934

1. క్రోధాన్ని జయించినవాడు.

కామక్రోధాది వికారాలు లేని శుద్ధుడు.

2. జ్ఞానంతో కూడిన క్రోధానికి 'మన్యుః' అని పేరు. ఇది భగవత్ స్వరూపంగా శ్రుతి చెప్తున్నది. ఇతరుల మన్యువులు ఈతని ముందు చెల్లవు.

స్వయంగా మన్యురూపుడు కనుక, ఈయనను జయించేవాడు లేడు. అందరి

మన్యువులను జయించిన వాడితడు. **స్వయం మన్యురూపః, నతస్యకశ్చిజ్జేతా** (సత్యభాష్యం). లోక రక్షణకై ఒక ప్రభువుగా ప్రకటించే మన్యువే కానీ, స్వతః సిద్ధంగా శాంత స్వరూపుడు.

మన్యురసి మన్యుం మయిధేహి ॥యజుర్వేదం॥

అహేడమానో వరుణేహ బోధ్యురుశంస మా న ఆయుః ప్రమోషీః

॥యజుర్వేదం॥

ఓవరుణా! (అహేడమానః) క్రోధములేనివాడవై ఈ కర్మలో మా విజ్ఞాపనని వినవలసినది. ఓ గొప్పగా స్తుతింపబడేవాడా! మా ఆయువును వినాశనము చేయవద్దు.

తన అపార దయతో ఇతరులను శాసించే 'మన్యు' శక్తితో భయాలను పోగొట్టువాడు కనుక –

భయావహః.. 935

1. భయాన్ని పోగొట్టువాడు.

జీవులకు సంసారం వలన కలిగే భయాన్ని నశింపజేసేవాడు. అజ్ఞాన జనిత భయాన్ని పోగొట్టే జ్ఞాన స్వరూపుడు.

యతోయతః సమీహసే

తతో నో <u>అభయం</u> కురు ।

శన్నఃకురు ప్రజాభ్యో <u>అభయం</u> న పశుభ్యః ॥యజుర్వేదం॥

సర్వజీవులు భయరహిత స్థితికై ఆయనను ప్రార్థిస్తున్నారు.

భయే మహతి మగ్నాంశ్చ త్రాతి నిత్యం జనార్దనః

మహాభయంలో మునిగిన వారిని నిత్యం జనార్దనుడు నాలుగు దిక్కుల వ్యాపించి అభయాన్నిస్తున్నవాడు కనుక–

చతురశ్రః.. 936

1. నాలుగు దిక్కుల వ్యాపించినవాడు.

చతుస్రో దిశోఽశ్నుతే-చతురశ్రః.

ఇరు ప్రక్కల, క్రిందు మీదుల వ్యాపించిన పరిపూర్ణుడు. అనంతశక్తి వ్యాపకమైతే చతురశ్రమే.

2. న్యాయసమవేతః (శంకరభాష్యం).

సముచితమైన రూపం, వర్తనం కలవాడు 'చతురశ్రః'. ఎన్నడూ వదలని ధర్మమే న్యాయం. జీవులకు కర్మానురూప ఫలాన్ని ఇవ్వడమే నారాయణుని న్యాయవర్తన. కర్మఫలప్రదాత చతురశ్రుడు.

'చతే యాచతే', 'అశూ వ్యాప్తౌ' 'అశభోజనే' అనే ధాతువుల ననుసరించి - **'యాచకానాం సర్వవిధ కామానాం పూరయితా - చతురశ్రః'** (సత్యభాష్యం). యాచకుల కోరికలనన్నిటిని పూరించువాడు.

ఎంత విస్తారమో అంతలోతైన తత్త్వం పరమాత్మునిది-

గభీరాత్మా.. 937

1. *లోతైన స్వరూపం / స్వభావం కలవాడు.*

'ఇంత' అని పరిమాణం నిర్ణయించడానికి వీలు కాని స్వరూపం, హృదయం కలవాడు.

సముద్ర స్యేవ మహిమా గభీరః॥ ఋగ్వేదం॥

సముద్రమునకు వలె ఈతని మహిమ అంతుపట్టనిది.

2. *గమనం కలిగించువాడు / అందరికీ గమ్యమైనవాడు.*

'గమ్లృగతౌ' అనే ధాతువు ననుసరించి గంభీరశబ్దానికి అర్థం సాధించబడింది.

గచ్ఛతి గమ్యతేఽనేన, గచ్ఛన్తి యమితి వా గభీరో గంభీరోవా

(సత్యభాష్యం)

ఎవనిచే కదులుతున్నవో అతడు గభీరుడు. జనులందరిచే పొందబడువాడు. ధ్యానింపబడేవాడు. ప్రార్థింపబడేవాడు = గభీరుడు. అటువంటి గభీరతయే ఈతని స్వరూపం – స్వభావం.

జగతి, వాయువు, జలాలు, – ఇవన్నీ గతిశీలాలు. వ్యాపకుడైన నారాయణుని చేతనే వీటికి గతి.

అందరిచే ప్రార్థింపబడి, అనుగ్రహించువాడు కనుక –

విదిశః..... 938

1. *వివిధాలను, విశేషంగా ఇచ్చువాడు.*

దిశతి – ఇచ్చుట. అధికారాన్ని అనుసరించి వారి వారి కర్మలకు తగిన విధంగా వివిధ ఫలాలను విశేష రూపంగా ఇచ్చువాడు.

2. *వివిధ దిక్కులు ఎవనివో అతడు విదిశుడు.*

సూర్యుని ఆధారంచేసుకొని దిశలు ఏర్పడుతున్నాయి. అన్ని దిశలనూ ఏర్పరచి, దిశలన్నిటా భాసించు సూర్యస్వరూపుడు.

'దిశ'కి 'దిక్కు' అను ప్రసిద్ధార్థం.

ఫలాలనిచ్చే ఈ ప్రభువే అందరినీ శాసించే స్వామి –

వ్యాదిశః..... 939

1. *వివిధంగా ఆదేశించువాడు.*

(వి–ఆదిశః) ఇంద్రాది దేవతలకు వివిధ ఆజ్ఞలను ఆదేశించువాడు – ప్రేరేపించువాడు.

సర్వ దేవతలకు, సర్వజగతికి ప్రేరకుడు ఈతడే.

తన ఆజ్ఞారూపంగా వేదాదులను ఏర్పరచినవాడు కనుక –

దిశః.. 940

1. ఆజ్ఞాపించువాడు – ఇచ్చువాడు.

వేదాది శాస్త్రముఖాలతో విశ్వనియమాలను, కర్తవ్యాలను ఆజ్ఞాపించువాడు. ఆ నియమ పూర్వక కర్మలకు ఫలితాలనిచ్చేవాడు.

దైవ్యాహోతారా ప్రథమా సువాచా
మిమానా యజ్ఞం మనుషో జయద్యై।
ప్రచోదయన్తా విదథేషు కారూ
ప్రాచీనం జ్యోతిః ప్రదిశా దిశన్తా ॥ఋగ్వేదం॥

✣ ✣ ✣

'చతురశ్రః నుండి దిక్స్వరూపునిగా ఉన్న నారాయణుని సంభావించవచ్చు. ప్రధానంగా వ్యాపకత్వాన్ని తెలియజేసేవి నాలుగు దిశలు. ఈశాన్య ఆగ్నేయ నైఋతి వాయవ్యాలుగా మూలలుగా నాలుగు 'విదిశలు' – క్రిందు మీదై వ్యాపించినవి 'వ్యాదిశలు'. తూర్పు ఉత్తర పశ్చిమ దక్షిణలు 'దిశలు'. ఈ నడుమనున్న అనంతత్వమే 'గభీరాత్మా'. దిక్కులలో ఇమిడినట్లు కనిపించినా, తాను అనంతుడే.

✣ ✣ ✣

శబ్దసహః (912) నామం నుండి ఈ 'దిశః' (940) నామం వరకు గజేంద్ర మోక్షఘట్టం, గజేంద్రుని కాపాడిన విష్ణు స్వరూపం చెప్పబడినట్లుగా శ్రీ పరాశరభట్టు దర్శనం.

✣ ✣ ✣

దిక్కులతో కూడిన జగతికి దిక్కునిచ్చిన 'తొలి' ఈతడే కనుక –

అనాది ర్భూర్భువో లక్ష్మీః సువీరో రుచిరాంగదః।
జననో జనజన్మాది ర్భీమో భీమపరాక్రమః॥ 101

941. అనాదిః, 942. భూర్భువః, 943. లక్ష్మీః,
944. సువీరః, 945. రుచిరాంగదః, 946. జననః,
947. జనజన్మాదిః, 948. భీమః, 949. భీమపరాక్రమః.

అనాదిః.. 941

1. మొదలు లేనివాడు.

అన్నిటికీ ఈతడే కారణుడు. కనుక ఇతనికి ఆది ఏదీ లేదు. కార్యం కంటే ముందుండేది కారణం. కార్యరూపమైన జగతిలో మొట్టమొదటి తత్త్వానికి ఆది భూతుడైన ఇతనికంటె ముందేదీలేదు. స్వయం సిద్ధ తత్త్వమే పరమాత్మ. అంతేకానీ సృజింపబడే కార్యవస్తువు కాదు.

2. గ్రహింపబడనివాడు.

న ఆదీయతే నగృహ్యతే - అనాదిః (సత్యభాష్యం)

మనస్సు చేగాని, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలచేగానీ గ్రహింపబడనివాడు. అచిన్త్యరూపుడు.

దేశ కాల వస్తు పరిమితులు లేనివాడు కనుక -

'ఇది'- 'ఇలా' అని నిర్దేశించి గ్రహించుటకు సాధ్యం కానివాడు'

(అనాదీయమానః అగృహ్యమాణఃసః అనాదిః)

అవ్యక్తోఽయమచిన్త్యోయ మవికార్యోయముచ్యతే ॥భగవద్గీత॥

'వ్యక్తం కానిది, చిన్తనకందనిది, వికారము (మార్పు) లేనిది ఈ పరమాత్మ తత్త్వమే.

సర్వకారణమేకాక, సర్వానికీ ఆధారమితడే-

భూర్భువః.. 942

1. *ఆధారానికి ఆధారం.*

'భూ సత్తాయాం' అనే ధాతువుననుసరించి ఆధారమైన ఉనికి భూః. దానికి ఆధారం (భువః భూః) ఈ పరతత్త్వం.

2. *తనంత తాను తనయందే కలుగువాడు. ఈతడే స్వయంభువు.*

స్వయం స్వస్మిన్ భవతీతివా భూర్భువః (సత్యభాష్యం)

అన్నిటికీ కారణం, ఆధారమే కాక వ్యక్తపరచే ఐశ్వర్యరూపుడు ఇతడే -

లక్ష్మీః.. 943

1. *'శోభ' అయినవాడు, సంపత్ స్వరూపుడు.*

'భూః' – అనగా భూలోకం. 'భువః' అనగా భువర్లోకం (అంతరిక్ష లోకం). ఈ రెండింటికీ శోభ, ఐశ్వర్యం ఈతడే. పరమాత్ముని విభూతులే ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి.

2. *దర్శింపజేయువాడు.*

లక్షయతి దర్శయతీతి లక్ష్మీః.

ఈ శోభాస్వరూపునిచేతనే సర్వమూ దర్శితమౌతోంది (చూడబడుతోంది). ఐశ్వర్యవంతుడే అందరిచే లక్షింప (దర్శింప, గుర్తింప) బడడం సహజమే.

అలా దర్శింపజేసే సంపత్తిరూపుడు.

దూరంగా ఉన్నవారిచే కూడా చూడబడే ప్రభాశాలి అయిన సూర్యరూప నారాయణుని సైతం ఈ నామంతో చెప్పవచ్చు.

3. *జగద్రూపంగా తటస్థ లక్షణంతో లక్షితమైనవాడు.*

నిజమైన సంపద ఈతడేనని భక్తులు యోగులు స్వానుభవంతో తెలుసుకుంటున్నారు.

భద్రైషాం లక్ష్మీర్ని హితాధివాచి ॥ఋగ్వేదం॥

లక్ష్మ్యాస్య సురుచో యతానాః ॥ఋగ్వేదం॥

శ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యావహోరాత్రే ॥యజుర్వేదం॥

శోభాయుక్తమైన చక్కని గతులతో జగతియందు వ్యాపించి యున్నందున-

సువీరః.. 944

1. *అందమైన వివిధ గతులు కలవాడు.*

'ఈరములు' అనగా గతులు. సుందరములైన వివిధ వర్తనములు - నడతలు - కలవాడు. స్వామి నడతలు లీలలు. అవి సొగసైనవి - వైవిధ్యమైనవి.

'హొయలు మీరనడలుగల్గు సరసుని...' అంటూ త్యాగయ్య స్వామి సొగసు నడలను వినుతించాడు.

2. *గ్రహాదులకు, జీవులకు ఆనందకరమైన, వివిధ విధాల గతులనిచ్చినది ఆతడే. ఈ వివిధ గతులు ఆ సర్వవ్యాపకునివే.*

3. జగతికి శోభ (లక్ష్మీ)గా ఉన్న ఈతడే గొప్ప శక్తిగా భాసిస్తున్న 'మంచి వీరుడు'.

యా తే ధామాని హవిషా యజన్తి
తా తే విశ్వా పరిభూరస్తుయజ్ఞం।
గయస్ఫానః ప్రతరణః సువీరోఽ వీరహా
ప్ర చరా సోమ దుర్యాన్ ॥ఋగ్వేదం॥

అందమైన గతినిచ్చే శోభ, శక్తి తన దివ్య మంగళ విగ్రహంలోనే కనబరచినవాడు.

రుచిరాఙ్గదః.. 945

1. *మనోహరమైన, కాంతి కలిగిన భుజకీర్తులు కలవాడు.*

'రుచ దీప్తావభిప్రీతౌచ' అనే ధాతువుననుసరించి, ప్రకాశం, ప్రీతి జనకము ఐనవి రుచిరములు.

అటువంటి రుచికరమైన భుజకీర్తులు - అనే భుజాభరణాలు (అఙ్గదములు)

ధరించినవాడు.

2. అందమైన తన దివ్య మంగళ విగ్రహాన్ని భక్తుల ధ్యానానికై ఇచ్చినవాడు *(అజ్గం దదాతీతి అజ్గదః).*

3. సృష్టిలో అన్నిటికీ చక్కని గమనశీలమైన ఆకృతినీ, గతి శక్తినీ ప్రసాదించినవాడే 'రుచిరాంగదుడు'.

అంగములనగా – గమనశీలములు, అవయవాలు (శరీరం) అని అర్థాలున్నాయి. గతి కలిగిన శరీరం అంగమే.

సర్వ ప్రాణుల హృదయంలో ఉండి గమనించి, గమింపజేస్తున్న ఈతడే అందమైన గమనాన్నీ – (అనగా లోక హితమైన గ్రహాదిగతులనీ – దేహాల చలనాన్నీ) శరీరాలనీ అందించినవాడు.

గతి కలిగిన ఆకృతులను ఇవ్వడమేకాక, వాటిని సృజింపజేసినవాడు ఈతడే కనుక –

జననః.. 946

1. జనింపజేయువాడు.

'జనీ ప్రాదుర్భావే' అనే ధాతువుననుసరించి,

ప్రాణులను జనింపజేస్తున్నవాడు 'జననుడు'. స్వయంగా తాను జన్మలేని వాడైనప్పటికీ, సర్వజగతినీ కలిగించినవాడు.

సోమాపూషణా జనా రయీణాం
జనా దివో జనా పృథివ్యాః ।
జాతౌ విశ్వస్య భువనస్య గోపౌ
దేవా ఆకృణ్వ న్నమృతస్యనాభిమ్ ॥ఋగ్వేదం॥

జన్మించిన ప్రాణులకు అన్నిటికీ మూలమైన చైతన్యమీతడే కనుక –

జనజన్మాదిః.. 947

1. జన్మించినవాటి పుట్టుకలకు మూలమైనవాడు.

జనన ధర్మం (పుట్టుక) కలవారు జనులు. వారిని పుట్టించడమేకాక, పుట్టుకకు కారణమైన కర్మాదులననుసరించి ఉపాధులను నిర్ణయించిన ఈశ్వరుడితడు.

'బీజ స్వరూపుడు' అనే భావాన్ని కూడా గ్రహించవచ్చు.

ఉత్పత్తి మొదలైన ధర్మాలు కలిగిన సర్వ జగతికి మూల కారణమైన పరమ చైతన్య స్వరూపుడు.

సర్వ జీవులకు తల్లిదండ్రుల వంటి పృథివీ, దివి స్వరూపముగా వ్యాపించినవాడు – అని కూడా భావించవచ్చు.

జనం జనం ధాయసే చక్షసే చ ॥ ఋగ్వేదం॥
తే హి ద్యావా పృథివీ మాతరా మహీదేవీ
దేవాంజన్మనా యజ్ఞయే ఇతః ॥ (ఋగ్వేదం)
ఇదం ద్యావా పృథివీ సత్యమస్తు ।
పితుర్మాతర్యది హోపబ్రువేవాం ॥యజుర్వేదం॥

సృష్టించడమే కాక, జగతిని శాసిస్తున్న శక్తి శాలి కనుక –

భీమః.. 948

1. భయాన్ని కలిగించువాడు.

సర్వ దేవతలకీ, ప్రకృతికీ శాసకుడు. ఒక దాని వలన మరొక దానికి కలిగే 'భయ' రూప చైతన్యం ఈతడే. భయాన్ని కలిగించే అగ్ని తీవ్రత, మేఘ గర్జనలు, పిడుగుపాట్లు, జలాల ఉప్పెనలు.. ఇలా ప్రకృతిలో తన భీమత్వాన్ని వ్యాపింపజేసిన పరమేశ్వరుడు.

మహద్భయం వజ్ర ముద్యతమ్ – అని శ్రుతి వాక్యం.

'పూనికతో ఎత్తబడిన వజ్రమువంటివాడు పరమేశ్వరుడు' సర్వాధికతని

సూచించే పదమే ఈ భీమనామం.

శత్రు ప్రతాపాలను మట్టుపెట్టే మహా తేజస్వి - సర్వాధికుడు.

నమ ఉగ్రాయ చ భీమాయ చ ॥యజుర్వేదం॥

ఉగ్రుడైన మరియు భీముడైన వానికి నమస్కారం.

స వజ్ర భృద్ దస్యుహా భీమ ఉగ్రః ॥ఋగ్వేదం॥

అతడు వజ్రాన్ని దాల్చినవాడు, శత్రు సంహారకుడు, భీముడు, ఉగ్రుడు.

అటువంటి భీముడై శత్రువులను ఆక్రమించినవాడు కనుక -

భీమ పరాక్రమః.. 949

1. *భయంకరమైన పరాక్రమం కలవాడు.*

బలవంతుడు బలహీనునికి భీముడు.

సర్వ జగతి కంటె మహోన్నతుడు, మహాబలశాలి, సర్వాధికుడు అయిన విష్ణువు ప్రతాపం అందరిలో మించినది. అంతటినీ ఆక్రమించినది.

అనేక అవతారాలను దాల్చి, లోక భీకరులైన అసురులకే భయాన్ని కలిగించే పరాక్రమాన్ని చూపిన వాడితడు.

యత్ర తమః పరాక్రమ్య వ్రతం ధారయత్యుత్తరమ్....

సృష్టికి హేతువుగా, ధర్మ రక్షణకై పరాక్రమాన్ని కలిగిన వానిగా, విశ్వానికి ఆధారభూతుడైనందున -

ఆధారనిలయో ధాతా పుష్పహాసః ప్రజాగరః।
ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః॥ 102

950. ఆధారనిలయః, *951.* అధాతా, (ధాతా), *952.* పుష్పహాసః,
953. ప్రజాగరః, *954.* ఊర్ధ్వగః, *955.* సత్పథాచారః,
956. ప్రాణదః, *957.* ప్రణవః, *958.* ప్రణః.

ఆధారనిలయః.. 950

1. ఆధారాలకు నివాసమైనవాడు.

పృథివ్యాది పంచభూతాలు ఆధారాలు. వాటిని ధరించి, ఆశ్రయమిచ్చిన వాడు కనుక ఆధార నిలయుడు. ప్రాణులకు, ఇతర ద్రవ్యాలకు స్థానములైన భూమ్యాది పంచ భూతాలకు ఆధార భూతుడు విష్ణువు.

యత్రాధి సూర ఉదితో విభాతి కస్మై దేవాయహవిషా విధేమ॥

(యజుర్వేదం)

యతః సూర్య ఉదేత్యస్తం యత్ర చగచ్ఛతి ॥
తదేవ మన్యేహం జ్యేష్ఠ తదు నాత్యేతి కించన ॥అథర్వవేదం॥

'దేనిని ఆధారం చేసుకొని సూర్యుడు ఉదయిస్తున్నాడో, ఆ అనిర్వచనీయ పరమాత్మకు హవిస్సును సమర్పిస్తున్నాం. ఎవని నుండి సూర్యుడు ఉదయిస్తున్నాడో, ఎవనియందు (ఎక్కడ) అస్తమిస్తున్నాడో, దానినే సర్వజ్యేష్ఠునిగా తలంచుతున్నాను. అతనిని దాటి మరేదీ లేదు'.

సర్వ లోకాలకీ ఆధారమైన వాడు కనుక-

అధాతా.. 951

1. తనను ధరించువాడు లేనివాడు.

తనకు తానుగా తన చేతనే నిలిచిన ఈ పరమాత్ముని ధరించువాడు (ఆధారమైనవాడు) మరియొకడు లేడు.

స పునాన ఉప సూరేన ధాతా ॥ఋగ్వేదం॥

ఈ పరమ పావనునికి పైనను మరొక ధాత లేడు.

స్నేమహిమ్ని ప్రతిష్ఠతః ॥యజుర్వేదం॥

తన మహిమ యందు తాను ప్రతిష్ఠింపబడినవాడు.

2. త్రాగువాడు.

ప్రళయ కాలంలో సర్వ ప్రాణులను త్రాగివేసేవాడు.

– అనగా తనలోనికి గ్రహించేవాడు. (ధయతి – పిబతీతి ధాతా).

ఆధారుడై, లయకర్తయై, తిరిగి జగతిని వికసింపజేస్తున్న ఆనంద స్వరూపుడు కనుక –

పుష్పహాసః.. 952

1. వికసించిన నవ్వు కలవాడు.

శోకరహిత, నిర్మల జ్ఞానానంద స్థితిని సూచించేది నవ్వు. జ్ఞానానంద స్వరూపుడైన దివ్య మంగళవిగ్రహుడు పుష్పం వలె వికసించిన నవ్వుతో భాసిస్తున్నాడు.

'దరస్మేరవదనుడు' 'మందస్మిత ముఖుడు' – వంటి మాటలు దేవతా వర్ణనలో ప్రసిద్ధాలు.

'నవ్వు రాజిల్లెడి మోము వాడు' (భాగవతం – పోతన) 'స్మితభాషీ' (రామాయణం)

– వంటి మాటలు చిరునగవు సొగసును తెలియజేస్తున్నాయి.

'పుష్ప వికసనే' అను ధాతువుననుసరించి **'పుష్యతి వికసతీతి పుష్పః'** – వికసించేది పుష్పం.

ప్రతి వస్తువులోనున్న వికాసరూపం విష్ణుని విభూతియే.

2. మొగ్గవలె సూక్ష్మరూపంలో, అవ్యక్త స్థితిలో ఉన్న జగతిని, వికసింపజేసి భాసింపజేసేవాడు.

జలం నుండి వికసించే పద్మంవలె, ఈజగత్పద్మం ప్రళయజలాలనుండి ఈయన చేతనే వికసితమయింది.

తత్రామృతస్య పుష్పం దేవాః కుష్ఠమవన్వత ॥ (అథర్వవేదం)

నిత్యానందంతో వికసనాత్మకంగా ఉండువాడు కనుకనే -

ప్రజాగరః.. 953

1. మిక్కిలి మెలకువతో ఉన్నవాడు.

ప్రకర్షేణ జాగర్తి - ప్రజాగరః

జ్ఞానమే జాగరణ. అజ్ఞానమే నిద్ర. స్వభావసిద్ధంగా నిత్య జ్ఞాన స్వరూపుడు కనుక నిత్యజాగరూకుడు. **'జాగృ నిద్రాక్షయే'** అను ధాతువుననుసరించి, నిద్రలేని స్థితియే జాగరణ.

అగ్నిర్జాగార తమృచః కామయన్తేగ్ని ర్జాగార తము సామాని చిన్త ॥ (ఋగ్వేదం)
అగ్నేత్వం సుజాగృహి వయం సుమన్దిషీమహి ॥యజుర్వేదం॥
య ఏషు సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః (కఠోపనిషత్తు)

'ప్రాణులందరూ ప్రకృతివశులై మై మరచిన స్థితిలో ఈ పరమాత్ముడు (కామ కామం) తానే అనుక్షణం సంకల్పించుచూ, కర్మఫలాలనిస్తూ నిరంతర జాగరూకుడై ఉన్నాడు.'

రామలక్ష్మణులకు రక్షకులుగా ఉండి కర్తవ్య నిర్వహణ చేయాలని ప్రయత్నించిన వానర వీరులందరూ ప్రకృతి వశులై నిద్రిస్తుండగా, ఆ రాత్రి వారికి రాక్షస బాధలేకుండా అతి జాగరూకులై రామలక్ష్మణులు రక్షించారట. ఇది ప్రజాగరుని రక్షణ.

జగద్రక్షణకు జాగరూకుడై అందరికంటె మహనీయతని చాటుతున్నందున-

ఊర్ధ్వగః.. 954

1. మీదుగా ఉన్నవాడు.

అందరిని మించి ఉన్నత స్థితిలో ఉన్నవాడు.

ఊర్ధ్వాన గమనం చేసి భాసించే సూర్యాది జ్యోతిః స్వరూపుడు ఈతడే. అన్నిలోకాలకు పైన భాసించే పరంజ్యోతి. ఇంద్రియ ప్రాణ మనో బుద్ధులను మించి ప్రకాశించే ఆత్మ స్వరూపుడు.

ఊర్ధ్వ ఊషణో అధ్వరస్య ॥ఋగ్వేదం॥

ఊర్ధ్వస్తిష్ఠాన ఊతయే ॥ఋగ్వేదం॥

స హ శ్రుత ఇన్ద్రో నామదేవ **ఊర్ధ్వో** భువన్ మనుషే దస్మతమః ॥ఋగ్వేదం॥

సమున్నతంగా భాసిస్తున్నందున –

సత్పథాచారః.. 955

1. మంచి మార్గాలను ఆచరించువాడు.

సనాతనమైన ధర్మమే సత్పథం. నిత్య శాశ్వతుడైన తాను, ప్రళయం వరకు శాశ్వతమైన సూర్యాది పథాలను ఏర్పరచి, తద్రూపుడై సంచరిస్తున్నందున, సత్పథాచారుడు.

స్వస్తి పంథామనుచరేమ సూర్యా చన్ద్రమసావివ ॥ఋగ్వేదం॥

2. సత్పురుషులు ఆచరించే సత్కర్మలే అనుసరించవలసిన పథాలు. ఆ యా ధర్మాలను ఏర్పరచిన ధర్మ నిర్దేశకుడు, తాను సైతం లోక శిక్షకై వాటిని అనుసరించాడు.

రామకృష్ణాది వివిధావతారాలలో సత్పథాలను ఆచరించి, ఆదర్శమై నిలిచిన సన్మార్గ ప్రవర్తకుడు.

ఉన్నత, సత్పథాలలో సంచరించి తన ధర్మాచరణతో జగతిని జీవింప జేస్తున్నందున–

ప్రాణదః.. 956

1. ప్రాణాలను ఇచ్చువాడు.

(ఈ నామం నాలుగవ పర్యాయం ఆవృతమయింది. చూ. 65, 321, 408)

అగ్ని, సూర్యాదుల రూపంలో సదా విశ్వనియమాలను (సత్పథాలను) ఆచరిస్తూ జగతిని జీవింపజేస్తున్నవాడు.

గోవర్ధన గిరి ఉద్ధరణ సమయంలో సమస్త గోపకులని, మరణించిన గురువుత్రుని, విషబాధితులనీ, కాళీయునిచే చంపబడినవారిని, విప్రకుమారులనీ బ్రతికించిన శ్రీకృష్ణుడు, మృత వానర జీవన ప్రదాత అయిన శ్రీరాముడు ఇక్కడ స్మరించదగిన దివ్యావతారాలు.

ప్రాణాలనిచ్చే ఆది మూలమితడే కనుక –

ప్రణవః.. 957

1. ప్రణమిల్ల (చక్కగానమస్కరింప)జేయువాడు.

బ్రహ్మాదులు మొదలుకొని సర్వ జీవులచే నమస్కరింపబడేవాడు.

త్వామభి ప్రణోనుమో జేతారమపరాజితమ్ ॥ఋగ్వేదం॥

2. ఓంకార స్వరూపుడు.

'తస్యవాచకః ప్రణవః' – అని యోగసూత్రం.

పరమాత్మను తెలియజేసేది ఓంకారం – ప్రణవం.

ప్రణూయతే అనేన ఇతి ప్రణవః

దేనిచేత చక్కగా నమస్కరింపబడుతున్నాడో ఆ వాచకం ప్రణవం. ఈ వాచకానికీ, వాచ్యమైన పరమాత్మకీ భేదం లేదు కనుక ఓంకార (ప్రణవ) స్వరూపుడు ఇతడు.

3. సంసారం నుండి ప్రకృష్టంగా, దాటించువాడు ప్రణవుడు.

ప్రాణాన్ సర్వాన్ పరమాత్మనిప్రణామయతి,

ఏతస్మాత్ ప్రణవ ఇతి (అథర్వ శిరః)

సమస్త ప్రాణులునూ పరమాత్మయైన తనయందు ప్రణామం కావించుటచే 'ప్రణవః' అని చెప్పబడుతున్నాడు.

ఈ ఓంకారరూపుడే సర్వ దృశ్య శబ్ద జగతిని వ్యవహరింపజేస్తున్నందున-

పణః. 958

1. వ్యవహరించువాడు - వ్యవహరింపజేయువాడు.

'పణ వ్యవహారేస్తుతౌచ' అనే ధాతువుననుసరించి, **'వ్యవహరతి, వ్యావహారయతివా విశ్వం స పణః'**

జగతిగా వ్యవహరించువాడు, జగతిని వ్యవహరింపజేయువాడు పణుడు. జగతిచే స్తుతింపబడుతున్నవాడు.

సర్వాణి రూపాణి విచిత్య ధీరః
నామాని కృత్వాఽభివదన్ యదాస్తే ॥(తైత్తిరీయ ఆరణ్యకం)

'పరమపురుషుడు దృశ్యప్రపంచంలోని సకల రూపాలను విచారణ చేసి చేసి, వాటికి నామాలను ఏర్పరచి వాటితో లోకాన వ్యవహరిస్తున్నాడు.'

అంతటా వ్యవహరింపబడేది ఈ పరమచైతన్యమే.

2. పుణ్య కర్మలన్నిటినీ 'పణం'గా (వెలగా) తీసుకొని, వారి వారి అధికారాన్ని అనుసరించి ఫలాలను ప్రదానం చేస్తున్నవాడు- అనే అర్థంలో 'లక్షణావృత్తి'చే పరమాత్ముని 'పణః' అని కీర్తించవచ్చు.

తన వలన వ్యవహరింపబడే జగతిని తనయందే భాసింపజేస్తున్నవాడు-

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృ త్ప్రాణజీవనః।
తత్త్వం తత్త్వవి దేకాత్మా జన్మమృత్యుజరాతిగః॥ 103

959. ప్రమాణం, *960.* ప్రాణ నిలయః, *961.* ప్రాణభృత్,
962. ప్రాణజీవనః, *963.* తత్త్వమ్, *964.* తత్త్వవిత్,
965. ఏకాత్మా, *966.* జన్మమృత్యుజరాతిగః.

ప్రమాణం.. 959

1. తెలియజేయువాడు.

ప్రమీయతే సర్వం జగదస్మిన్నితి వా 'ప్రమాణమ్'. (సత్యభాష్యం)

ప్రపంచమంతా ఈతనియందే తెలియబడుతోంది. ఈ అనంత విశ్వాన్ని సమగ్రంగా కొలవగలిగేవాడు, తెలియగలిగేవాడు ఈతనికంటె ఎవరూ లేరు. అలాగే ఈ జగతి కొలవబడేచోటు, తెలియబడేచోటు వేరే ఏదీలేదు. ఈతనియందే సర్వమూ తెలియబడుతున్నందున ఈతడే ప్రమాణం.

ఈతని తెలియజేసే, కొలిచే సాధనం లేదు. కొలత కందని ఈతడే ఈతనికి ప్రమాణం.

2. స్వయంగా జ్ఞాన స్వరూపుడు.

చిత్స్వరూపుడైన విష్ణునివలననే అందరూ విషయాదులను తెలుసు కోగలుగుతున్నారు.

సర్వ జ్ఞానాలకు ఆధారమైన చైతన్య (కేవల జ్ఞాన) స్వరూపుడు.

'ప్రజ్ఞానం బ్రహ్మ' అని ఐతరేయోపనిషత్తులోని మహావాక్యం. ప్రకృష్టమైన ఈ చిత్తత్త్వమే బ్రహ్మము.

ఆ పరబ్రహ్మమే ప్రమాణం.

జ్ఞాన స్వరూప మత్యంత నిర్మలం పరమార్థతః।
తమే వార్థస్వరూపేణ భ్రాంతి దర్శనతః స్థితమ్॥ (విష్ణు పురాణం)

"పరమార్థంగా జ్ఞాన మాత్ర స్వరూపుడు, అత్యంత నిర్మలుడు, భ్రాంతి జ్ఞానంచే అవిద్యావశంగా పదార్థ స్వరూపంగా వ్యవహరింపబడువాడు అయిన ఆ పరమాత్ముడు."

యస్యభూమిః ప్రమాన్తరిక్షముతోదరమ్ ॥అథర్వవేదం॥

ఈ ప్రమాణ స్వరూపుని ఆధారంచేసుకొనే అన్నీ జీవిస్తున్నందున ఆయనలోనే లయిస్తున్నందున –

ప్రాణ నిలయః.. 960

1. *ప్రాణాలకు నిలయమైనవాడు. సంపూర్తిగా లీనం చేసుకొనేవాడు.*

ప్రాణాలను ఆధారం చేసుకున్నవి ఉపాధులు. ఆ ప్రాణానికి కూడా ఆధారమైన ఆత్మ చైతన్యమే విష్ణువు.

ఇన్ద్రియాదులన్నీ ఎవరి అధీనంలో ఉంటూ, ఎవరిలో సంపూర్ణంగా 'లయమౌతున్నాయో అట్టి చైతన్యమే 'ప్రాణ నిలయః'. అది జీవుడని వ్యవహరింపబడినా, పరమార్థతః పరమాత్మకు అభిన్నుడే.

దేహధారకాలైన ప్రాణాపానాది ప్రాణాలు అతనిలో 'విలీనమౌ'తున్నాయి.

2. *ప్రాణితి ప్రాణః జీవః.*

ప్రాణ ధారణచేసే జీవుడు ఏ పరతత్త్వంలో లీనమౌతున్నాడో – ఏకత్వాన్ని పొందుతున్నాడో –

ఆ పరమాత్ముడు ప్రాణ నిలయుడు.

సర్వ ప్రాణులను తనలో సంపూర్తిగా లయింపజేసుకొనే పరమేశ్వరుడితడు.

ప్రాణాలను లయింపజేయడమేకాక, ధరించువాడు ఈతడే కనుక –

ప్రాణ భృత్.. 961

1. *ప్రాణాలను పోషించువాడు – ధరించువాడు.*

అన్నాది రూపాలతో ప్రాణాలను పోషించే జగద్భర్త.

అంతేకాదు, ప్రాణాలను ధరించినడిపే చైతన్యస్వరూపుడు.

పృథక్ సర్వే ప్రాజాపత్యాః ప్రాణానాత్మసు బిభ్రతి।
తాన్ సర్వాన్ బ్రహ్మ రక్షతి బ్రహ్మచారిణ్యాభృతమ్ ॥అథర్వవేదం॥

2. సూర్య చన్ద్రాదులను వేదం 'ప్రాణాలు' అని పేర్కొంది.

జగతికి చేష్ట కలిగించేవారు. వారికి సైతం ఆధారమైన ప్రాణ నిలయుడు, వారిని తన తేజస్సుతో ధరిస్తున్న నారాయణుడు.

ప్రాణో హ సూర్య చన్ద్రమాः ప్రాణ మాహుः ప్రజాపతిः ॥అథర్వవేదం॥

చేష్టను కలిగించే ప్రాణాలకు కూడా చైతన్యాన్నిచ్చే వాడు కనుక –

ప్రాణ జీవనः.. 962

1. ప్రాణులను, ప్రాణాలను జీవింపజేస్తున్నవాడు.

న ప్రాణేన నాఽపానేన మర్త్యో జీవతి కశ్చన।
ఇతరేణ తు జీవన్తి యస్మిన్నేతా వుపాశ్రితౌ। (కఠోపనిషత్తు)

'ఏ ఒక్క జీవుడూ ప్రాణవాయువుచే గానీ, అపాన వాయువుచేగానీ జీవించడం లేదు. ఈ రెండూ సన్నిహితాలై ఆశ్రయాన్ని పొంది ఉన్న మరియొక తత్త్వంచే (పరమాత్మునిచే) మాత్రమే జీవిస్తున్నాడు.'

ఈ సర్వాధారమే యథార్థమైన బ్రహ్మము కనుక –

తత్త్వమ్.. 963

1. జగతికి సారవస్తువు.

తన్యత ఇతి తత్. విస్తరించునది 'తత్'. విస్తారమైన ఈ జగత్తు. తస్యభావం 'త్వం' – జగతి యొక్క సార వస్తువు 'తత్త్వం'.

విశ్వానికి సారం ఆత్మయే. అదే విష్ణువు.

తత్త్వం యథార్థ్యే బ్రహ్మణి.

తథ్యం, అమృతం, సత్యం, పరమార్థం, ...

ఇవన్నీ ఏకార్థ వాచకాలు. దేశ కాల వస్తు పరిమితులు లేకుండా ఉనికి పొంది యుండే బ్రహ్మ తత్త్వాన్ని తెలిపే పదాలు ఇవి.

విశ్వమనే క్షీరంలో వెన్నలా వ్యాపించిన పరమాత్ముడు.

పరమార్థమశేషస్య జగతః ప్రభవాప్యయమ్।
శరణ్యం శరణం గచ్ఛన్ గోవిన్దం నావసీదతి॥
ఏకతో వా జగత్ కృత్స్నం ఏకతోవాజనార్దనః
సారతో జగతఃకృత్స్నాదతిరిక్తో జనార్దనః॥

"సమస్త జగతికి ఉత్పత్తి ప్రళయాలను చేసే పరమాత్మయే పరమార్థమైన వాడు (ముఖ్య ప్రయోజనంగా స్వీకరింపదగినవాడు). శరణు పొందినవారికి రక్షణ కల్పించువాడు.

జగతినంతా ఒక ప్రక్కన, జనార్దనుని మరొక ప్రక్కన ఉంచి పోల్చినప్పుడు ఈ జగత్తంతటి కంటె సారమైనవాడు గొప్పవాడు జనార్దనుడొక్కడే."

మణిమాలలో సూత్రంలా ఉన్నదే తత్త్వం.

సారమైన పరతత్త్వాన్ని అందరూ తెలియలేరు. తనను తానే తెలియగలడు కనుక –

తత్త్వవిత్.. 964

1. తత్త్వాన్ని తెలియువాడు.

స్వరూపాన్ని యథాతథంగా (ఉన్నదానిని ఉన్న విధంగా) ఎరిగినవాడు. సారాన్ని తెలిసిన సారవస్తువు అతడే. కేవల జ్ఞాన స్వరూపుడు.

త్వమేవ త్వాం వేత్థ (యజుర్వేదం)

'నిన్ను నీవు మాత్రమే ఎరుగుదువు.'

స్వయమేవాత్మనాత్మానం వేత్థత్వం పురుషోత్తమ॥

'పురుషోత్తమ! స్వయంగా నిన్ను నీవే తెలుసుకోగలవు' అని పురాణ వాక్యం.

బ్రహ్మవేత్త బ్రహ్మమే అవుతున్నాడు.

శరీరాదులలో తాదాత్మ్యం చెందిన జీవుడు ఆత్మను ఎరుగలేడు. ఆ ఆత్మగా ఉన్నవాడు తనకు తాను తెలుసుకొని, ఆ జ్ఞానస్థితితోనే సర్వాన్నీ చలింపజేస్తున్నాడు.

స విద్యాత్ సూత్రం వితతం యస్మిన్నోతాః ప్రజాః ఇమాః।
సూత్రం సూత్రస్య యో విద్యాత్ స విద్యాత్ బ్రాహ్మణం మహత్ ।
(అథర్వవేదం)

అనేకమైన జగతియందు విస్తరించిన తత్త్వం ఇదొక్కటే-

ఏకాత్మ. 965

1. ఒకటే అయిన ఆత్మ.

ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ (ఐతరేయోపనిషత్తు)

ఆదిలో ఈ దృశ్యమాన ప్రపంచమంతా ఒకే ఒక ఆత్మ తత్త్వంగా ఉన్నది.

యచ్చాప్నోతి యదాదత్తే యచ్చాత్తి విషయాని హ।
యేనాఽస్యసంతతో భావస్తస్మా దాత్మేతి గీయతే ॥

'అన్ని విషయాలను అనుభవించేది, సర్వ విషయానుభవాలను గ్రహించేదీ, సర్వ భోగ్య విషయాలను గ్రహించేది, అంతటను, అన్ని కాలాలలోను ఎడతెగని ఉనికి (భావః) కలది ఏదో - ఆ చైతన్యమే ఆత్మ. (ఆప్నోతి - ఆదత్తే - అత్తి- అతతి)' అని స్మృతి వచనం.

అన్నిటికీ 'ప్రధాన'మైనది ప్రథమమైనది ఆ 'ఒక్కటే'

ప్రథమేన ప్రభారేణ త్రేధా విష్వఙ్ విగచ్ఛతి ।
అద ఏకేన గచ్ఛత్యద ఏకేన గచ్ఛతీహైకేన నిషేవతే ॥(అథర్వవేదం)

ఈ ఏకమైన ఆత్మ స్వరూపం మార్పులు లేనిది కనుక -

జన్మమృత్యుజరాతిగః.. 966

1. పుట్టుట మరణించుట క్షీణించుట (వార్ధక్య) – అనే దశలను అతిక్రమించి పోయినవాడు.

శాశ్వతుడు, అమృత స్వరూపుడు.

జాయతే, అస్తి, వర్ధతే, విపరిణమతే, క్షీయతే, నశ్యతి (పుట్టును, ఉనికి పొందును, వృద్ధినొందును, మార్పులను పొందును, క్షయించును, నశించును) – అనే ఆరు వికారాలు లేని ఆత్మ స్వరూపుడు. పై ఆరు వికారాలు శరీర లక్షణాలు – వీటిని అతిక్రమించి వెళ్లే అమృత స్వరూపుడు ఆత్మ.

న జాయతే మ్రియతే వావిపశ్చిత్ (కఠోపనిషత్)

"ఆత్మ తత్త్వాన్ని తెలుసుకున్నవాడు మరి ఎన్నడూ జనించడు, మరణించడు".

ఈ అమృత తత్త్వాన్ని ఆశ్రయించుకునే యజ్ఞం, వేదం, లోకాలు పెంపు వహిస్తున్నాయి.

భూర్భువః స్వస్తరు స్తారః సవితా ప్రపితామహః।
యజ్ఞో యజ్ఞపతి ర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః॥ 104

967. భూర్భువః స్వస్తరుః,	*968. తారః,*	*969. సవితా,*
970. ప్రపితామహః,	*971. యజ్ఞః.*	*972. యజ్ఞపతిః,*
973. యజ్వా,	*974. యజ్ఞాంగః,*	*975. యజ్ఞవాహనః.*

భూర్భువః స్వస్తరుః.. 967

1. *భూః భువః స్వః* – లోకాలకు వృక్షం వంటివాడు.

ముల్లోకాలు స్కంధాలుగా విస్తరిల్లిన వృక్షం వంటివాడు విష్ణువు. ఈ విశ్వరూపుడే దీనికి మూలం, ఆశ్రయం.

మూడు లోకాల రూపంలో ఉన్న సంసార వృక్ష స్వరూపుడు.

విశ్వమనే వృక్షానికి పృథ్వి ఫలస్థానీయం – మధ్య భాగం భువర్లోకం –

ఊర్ధ్వం స్వర్లోకం మూల స్థానం. ఈ వృక్షం తలక్రిందులుగా ఉన్న అశ్వత్థం (ఊర్ధ్వమూల మధశ్శాఖం- భగవద్గీత).

ముల్లోకాల ప్రాణికోటికి ఆశ్రయమైన వృక్షము వంటివాడు.

సమాశ్రితాత్ బ్రహ్మతరోరనన్తాన్ని స్సంశయః పక్వఫల ప్రపాతః -అని పౌరాణికోక్తి.

'బ్రహ్మమనే వృక్షం అనత వైశాల్యం కలది. దానినాశ్రయించినవారికి పండి రాలిన మధుర ఫలాల అనుభవం (ముక్తి) తప్పక లభిస్తుంది'.

ఈ మూడింటి యందూ వ్యాపించిన చైతన్యం త్రివిక్రముడు నారాయణుడే.

2. మూడు వేదాలకు (ఋగ్యజుసామములకు) సారభూతాలు- భూః, భువః, స్వః - అనే మూడు వ్యాహృతులు. వీటిని త్రయీ (వేద) సారములైన చక్రములుగా బ్రహ్మ ఋచ శాఖీయుల వచనం.

ఇవి బీజములవంటి పవిత్ర శబ్ద రూపతత్త్వాలు. వీటితో హోమాదికాలను చేసేవారు, సంసార సముద్రం నుండి దాటగలుతున్నారు.

ఈ విధంగా మూడు వ్యాహృతుల రూపంగా జీవులను తరింపజేయువాడు - 'భూర్భువస్స్తరుః, తరతి అనేనేతి తరుః - దేనితో తరిస్తారో అది తరువు. భూ : - భూలోకం, భువః - అంతరిక్ష, స్వః - ద్యులోకం.

ఈ మూడు లోకాలలో వ్యాపించిన తత్త్వమే మనలను తరింపజేసేది.

త్వం త్రాతా తరణే చేత్యోభూః। (ఋగ్వేదం)

భువః సమ్రాడిన్ద్ర సత్యయోనిః।। (ఋగ్వేదం)

స్వః స్వాయ ధాయసే ।।ఋగ్వేదం।।

అర్వర్ధిరస్తు తరుతా ।।ఋగ్వేదం।।

✣ ✣ ✣

ఈ నామం నుండి యజ్ఞ స్వరూపాన్ని స్పష్టంగా ఆవిష్కరిస్తున్నారు. ప్రారంభంగా ఈ వ్యాహృతులు, అటు యజ్ఞానికీ, ఇటు వేదమాత అయిన గాయత్రీ స్వరూపానికి అన్వయాలు.

✣ ✣ ✣

తరింపజేసే తత్త్వం కనుకనే –

తారః.. 968

1. *దాటించువాడు.*

సర్వ జగతికి ఈతడే ఆధారం. ఈతడు తప్ప ఈ జగతికి సద్గతినిచ్చేవాడు, యుక్తులకు ముక్తినిచ్చేవాడు వేరొకడు లేడు.

తాను తరించేవాడే ఇతరులను తరింపజేయగలడు. తార స్వరూపుడై సంసారానికి అతీతంగా ఉన్న నిత్యముక్తుడు విష్ణువు.

2. *ప్రణవ స్వరూపుడు.* **'ఓంకార స్తారః'.**

నమస్తారాయ ॥యజుర్వేదం॥

వ్యాహృతులతో ప్రణవాన్ని కలిపి యజ్ఞాలను ఆచరిస్తారు.

ఈ ఓంకారమే 'భూర్భువస్వః' అనే వ్యాహృతులకు, లోకాలకు వృక్షం వంటిది – మూలం వంటిది.

సవితా.. 969

1. *జనింపజేయువాడు.*

తండ్రివలె సర్వ లోకాన్ని జనింపజేయువాడు.

అన్నిటికీ ఉత్పాదకుడు. సూర్యమండలాంతర్గత హిరణ్మయతేజస్సే విశ్వానికి మూలమైన పరమపురుషునిగా ఉపాసింపబడుతున్నది.

వ్యాహృతులతో ప్రారంభించి ప్రణవంతో కలిపి – వేద మాతయైన గాయత్రీ స్వరూపమే విష్ణువు – అని ఈ నామాల క్రమం ద్వారా ప్రతిపాదిస్తున్నారని భావించవచ్చు.

ఓం భూర్భువస్వః – తత్సవితుర్వరేణ్యం..... (గాయత్రీ మంత్రం)

సృష్టికర్తను కూడా సృజించిన వాడితడే కనుక –

ప్రపితామహః.. 970

1. పితామహులకు కూడా తండ్రి, పాలకుడు.

కారణమై, రక్షించి పోషించేవారిని 'పితృ' శబ్దం చేత చెప్తారు. సూర్యాదులు లోకానికి పితరులు, వారికి కూడా కారణమైన బ్రహ్మదేవుడు పితామహుడు.

వారికీ, బ్రహ్మకు కూడా మూలమై, పాలించే ప్రకృష్టమైన పితామహుడు విష్ణువు.

అనాది, సనాతనుడు – అనే భావాన్ని ఈ నామం తెలియజేస్తోంది.

భూః స్వాహా – అగ్నయ ఇదం న మమ

భువః స్వాహా – వాయవ ఇదం మమ

స్వః స్వాహా – సూర్యాయ ఇదం న మమ

భూర్భువస్వః – ప్రజాపతయ ఇదం న మమ

ఈ వరుసలో యజ్ఞక్రియలో ఆహుతుల సమర్పణ ఉంది.

అగ్నివాయుసూర్యులు... వసురుద్ర అదిత్యులు, పితరులు. మూడింటికి మూలమైన తరువు ప్రజాపతి. ప్రజాపతి నామం బ్రహ్మపరంగా, పరమేశ్వర పరంగా కూడా గ్రహించవచ్చు. ఈ ప్రజాపతి చతుర్ముఖబ్రహ్మకు కూడా మూలమైన విష్ణువు (ప్రపితామహః). ఈ యజ్ఞక్రియాక్రమం ఈ నామాలలో భావించవచ్చు.

✣ ✣ ✣

వేద, ప్రణవ, దేవ స్వరూపుడై, వాటికి మూలమై యజ్ఞంగా సృష్టియందు వ్యాపించినవాడు.

✣ ✣ ✣

యజ్ఞః.. 971

1. యజ్ఞ స్వరూపుడు.

దేవారాధన పూర్వక కర్మయే యజ్ఞం, యజనం సాగించే క్రియ, సాధనలు అన్నీ నారాయణ స్వరూపాలు.

తననారాధించే క్రియలు, సాధనలు (కరణాలు) అన్నీ తానే, తానై సమకూర్చేవాడు. (445వ నామంలో విస్తారంగా ఉన్న అర్థాన్ని గమనించాలి).

త్యాగపూర్వక కర్మయే యజ్ఞం.

ఈ యజ్ఞమే నారాయణుని స్వరూపం. దీనిని ఏర్పరచి పాలించువాడు –

యజ్ఞపతిః.. 972

1. యజ్ఞమునకు పాలకుడు.

అహంహి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ ॥(భగవద్గీత)

'సర్వయజ్ఞాలను అనుభవించువాడను, వాటికి స్వామిని నేనే' అని భగవద్వచనం.

దేవ సవితః ప్రసువ యజ్ఞం ప్రసువ యజ్ఞ పతింభగాయ॥ (యజుర్వేదం)

మాతే యజ్ఞపతి ర్హ్వార్షీత్ ॥యజుర్వేదం॥

యజ్ఞరూపుడు, యజనీయుడు (యజ్ఞము చేయబడువాడు) యజ్ఞ స్థానాలు – అన్నీ విష్ణువేననే సంపూర్ణ యజ్ఞ స్వరూపం ఈ (971 నుండి 984 వరకు) పదునాలుగు నామాలలో విస్తరించింది.

పాహిపాహి యజ్ఞం.

సంపూర్ణ యజ్ఞ స్వరూపుడై యజ్ఞాన్ని పాలించువాడు విష్ణువు.

సంకల్పం నుండి ఫలం వరకు సర్వ చైతన్యమూ ఆ పరమాత్మయే.

ఈ జ్ఞానంతో చేసే యజ్ఞమే కైవల్యప్రదం.

యజమాని రూపంలో ఉన్నదీ అతడే కనుక –

యజ్వా.. 973

1. యజనం చేయువాడు.

యజ్ఞం చేసే యజమానుని రూపంలో ఉన్న చైతన్యం ఈతడే.

విశ్వ నిర్మాణ నిర్వహణయే విష్ణునియజ్ఞం– 'ఫలాకాంక్షలేని త్యాగపూర్వక

కర్మ'. దీనిని చేసే వాడు కనుక యజ్వ ఈతడే.

తేషాతు పావనా యూఽహం నిత్యమేవ యుధిష్ఠిర ।

ఉభే సంధ్యేఽనుతిష్ఠామి హ్యస్మన్నం తద్వ్రతం మమ ।।(భారతం. ఆదిపర్వం)

'యధిష్ఠిరా! వారందరూ పరిశుద్ధులు కావడానికై నిత్యం రెండు సంధ్యలలో కర్మలను నేను అనుష్ఠిస్తున్నాను. ఈ వ్రతం నేను ఏనాడూ వీడను' అని కృష్ణ వచనం.

తన దివ్యావతారాలలో తానే యజ్ఞకర్మలనాచరించాడు.

యజ్ఞేవదయజ్యోర్వి భజాతి భోజనమ్ ।।ఋగ్వేదం।।

ఇన్ద్రో యజ్వనే పృణతే ।।ఋగ్వేదం।।

యజ్ఞమే ఆయన తనువుగా భాసిస్తున్నందున –

యజ్ఞాజ్ఞః.. 974

1. *యజ్ఞాలు ఈతని అంగాలు– యజ్ఞశరీరుడు.*

యజ్ఞ స్వరూపుడైన విష్ణుని వేద పురాణేతిహాసాలు బహుధా వర్ణించాయి. భూమిని, భూవాసులను ఉద్ధరించేది యజ్ఞమేనని ప్రకటిస్తూ, భూ సముద్ధరణకై యజ్ఞ వరాహస్వామిగా విష్ణువు ఆవిర్భవించాడు.

యజ్ఞాన్ని విష్ణుని తనువుగా, విష్ణువును యజ్ఞతనువుగా దర్శించే అద్భుత యజ్ఞ విజ్ఞాన దర్శనాన్ని గ్రహించవచ్చు.

వేద పాదో యూపదంష్ట్రః క్రతుహస్తశ్చితీముఖః।
అగ్ని జిహ్వో దర్భరోమా బ్రహ్మశీర్ష్ణో మహా తపాः।
అహో రాత్రేక్షణో దివ్యో వేదాంగ శ్రుతిభూషణः।
ఆజ్యనాసः స్రువతుండ సామఘోషస్వనోమహాన్ ।
ధర్మ సత్యమయ శ్రీమాన్ క్రమ విక్రమ సత్క్రియः।
ప్రాయశ్చిత్తనఖో ఘోరः పశుజానుర్మహాభుజः।।

ఉద్గాత్రన్త్రో హోమలింగో బీజౌషధి మహాఫలః।
వాయ్వన్తరాత్మా మన్త్రస్పిగ్ విక్రమః సోమశోణితః।।
వేదిస్కంధో హవిర్గన్ధో హవ్య కవ్యాతి వేగవాన్।
ప్రాంగ్వశకాయో ద్యుతి మాన్నానా దీక్షాభి రర్చితః।
దక్షిణా హృదయో యోగీ మహా సత్రమయోమహాన్।
ఉపా కర్మోష్ఠ రుచకః ప్రవర్ష్యావర్త భూషణః।।
నానాచ్ఛన్దో గతిపథో గుహ్యోపనిషదాననః।।
ఛాయాపత్నీ సహాయోవై మేరుశృంగ ఇవోచ్ఛ్రితః।। (హరివంశం)

నాలుగు వేదాలు పాదాలుగా, యూప స్తంభాలు కోరలుగా, క్రతువులు (యజ్ఞ ప్రక్రియలు) హస్తాలుగా, చితులు ముఖంగా, అగ్నులు నాలుకలుగా, దర్భలు రోమాలుగా, బ్రహ్మ (ఋత్విక్ విశేషం) శిరస్సుగా, అహోరాత్రులు కన్నులుగా, వేదాంగాలు కర్ణాభరణాలుగా, ఆజ్యం ముక్కుగా, స్రువం తుండం (ముట్టె)గా, సామఘోష ధ్వనిగా, క్రమ విక్రమాలనే ప్రక్రియలు ఉత్తమ క్రియాచరణంగా, ప్రాయశ్చిత్త కర్మలు గోళ్ళుగా, యజ్ఞ పశువులు మోకాళ్ళుగా, ఉద్గాత (సామగానం చేయువాడు) ఆంత్రములు (ప్రేవులు)గా, హోమం లింగంగా, బీజాలు ఓషధులు మహా ఫలాలు (వృషణాలు)గా, వాయువు అంతరాత్మగా, మంత్రం స్పిక్ (పిరుదులు)గా, సోమరసం రక్తంగా, యజ్ఞవేది మూపుగా, హవిస్సు గంధంగా, హవ్యకవ్యాలు వేగంగా, ప్రాగ్వంశం ప్రాక్కాయంగా, దక్షిణలు హృదయంగా, ఉపాకర్మలు ఓష్ఠాలుగా దంతాలుగా, ప్రవర్ష్యము భూషణాలుగా, నానా ఛందోగతులు మార్గాలుగా, గుహ్యమైన ఉపనిషత్తులు ఆసనంగా, ఛాయా అను పత్ని తనకు తోడుగా ఆవిర్భవించిన మహా తపస్వియు (జ్ఞాన స్వరూపుడు), దివ్యుడు, అత్యంతపూజ్యుడు, శోభాశాలి నానాదీక్షలచే అర్చితుడు, యోగిరూపుడు, మహాసత్ర (అనేకమంది కలిసి చేసే యాగాలు) మయుడు, మహారూపుడు, విక్రమశాలి, మేరు శిఖరం వలె అత్యున్నతుడు' అని యజ్ఞ వరాహస్వామిని హరివంశం వర్ణించింది.

2. యజ్ఞరూపంగా సాగినవాడు.

అంగః - గన్తాప్రాప్తావా.

యజ్ఞమునందు ప్రవేశించి హవిరాదులను పొందినవాడు- యజ్ఞాఙ్గుడు.

యజ్ఞకర్మల ద్వారా ప్రాప్తించేవాడు - అనే భావాన్ని కూడా గ్రహించవచ్చు. తిన్న అన్నం జఠరాగ్నిని ప్రాప్తించుతుంది. అలాగే యజ్ఞాలన్నీ అగ్నిని, తద్వారా సూర్యుని పొందుతున్నాయి. తద్రూపుడైనవాడు విష్ణువు.

హోత, అధ్వర్యుడు, బ్రహ్మ, హవిస్సు - మొదలైనవి యజ్ఞాంగాలే. ఇవన్నీ విష్ణు స్వరూపాలు.

తన అంగాలతో యజ్ఞాలను వహిస్తున్నందున -

యజ్ఞవాహనః.. 975

1. యజ్ఞాన్ని వహించువాడు.

ఫలానికి హేతువులైన యజ్ఞాలను ప్రవర్తింపజేస్తున్నవాడు.

అగ్ని, సూర్య రూపుడైన నారాయణుడు యజ్ఞాలను వహిస్తున్నవాడు. యజ్ఞాదులకు తగిన శక్తిని, శ్రద్ధను, యోగ్యతను కలిగించువాడీతడు.

హోమాగ్నిగా జ్వలించే నారాయణుని ఈ నామంలో స్మరించవచ్చు.

అగ్నిర్యజ్ఞస్య హవ్యవాట్ ।।ఋగ్వేదం।। **యజ్ఞ వాహనమ్...** ।ఋగ్వేదం।।

వహిస్తూ పోషిస్తున్నందున -

యజ్ఞభృ దృజ్ఞకృ దృజ్ఞీ యజ్ఞభు గృజ్ఞసాధనః।
యజ్ఞాన్తకృ దృజ్ఞగుహ్యా మన్న మన్నాద ఏవ చ।। 105

976. యజ్ఞభృత్,	*977.* యజ్ఞకృత్,	*978.* యజ్ఞీ,
979. యజ్ఞభుక్,	*980.* యజ్ఞసాధనః,	*981.* యజ్ఞాన్తకృత్,
982. యజ్ఞగుహ్యం,	*983.* అన్నం,	*984.* అన్నాదః, ఏవ చ।

యజ్ఞభృత్.. 976

1. యజ్ఞాన్ని పోషించువాడు, ధరించువాడు.

యజ్ఞాన్ని నిలబెట్టి, పుష్టి చేకూర్చి, రక్షించేవాడు.

ఈ యజ్ఞ రక్షణయే స్వామి అవతారాల ప్రయోజనం.

శుభ కర్మయే యజ్ఞం. వాటిని కాపాడే ప్రభువు విష్ణువు.

స్వామి స్మరణతోనే యజ్ఞాదులు పూర్ణాలవుతాయి. యజ్ఞ లోపాన్ని సవరించి, వృద్ధినీ సిద్ధినీ కలిగించువాడు.

ప్రమాదాత్ కుర్వతాం కర్మ ప్రచ్యవత్యధరేషు యత్।
స్మరణాదేవ తద్ విష్ణోః సంపూర్ణం స్యాదితి శ్రుతిః॥

'యాగంలో ప్రమాదవశంగా ఏదేనా దోషం కలిగితే అది విష్ణు నామ స్మరణ మాత్రం చేతనే తొలగి, యాగం పూర్తవుతుందని శ్రుతిమతం.'

యజ్ఞాన్ని పోషించి, ధరించే భాధ్యత గల ఈయననే శ్రుతిమాత పురోహితునిగా ప్రథమ మంత్రంలోనే అభివర్ణించింది.

అగ్ని మీళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజమ్॥ (ఋగ్వేదం)

యజ్ఞాలను ఏర్పరచినవాడీతడే కనుక –

యజ్ఞకృత్.. 977

1. యజ్ఞాలను కలిగించు (చేయు)వాడు.

జగన్నాథుని జగద్రూప కర్మయే యజ్ఞం. సృష్ట్యాదిలో దానిని చేసేవాడు (కరోతీతి–కృత్).

అంతంలో ఈ కర్మను పూర్తి చేయువాడు (కృన్తతీతి కృత్).

యజ్ఞాలను లోక హితం కోసమై కలిగించివాడితడు.

సహయజ్ఞాః ప్రజాన్ సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ॥(భగవద్గీత)

ప్రజాపతి అయిన పరమేశ్వరుడు ప్రజలతోపాటు, యజ్ఞాన్ని సృజించినట్లుగా భగవద్వచనం.

యజ్ఞకృతః సుకృతోయేన యన్తి ।।(అథర్వవేదం)

ఈ యజ్ఞాలన్నీ ఆయనతో కూడినవి, ఆయననే చేరునవి కనుక –

యజ్ఞీ.. 978

1. యజ్ఞములు కలవాడు.

యజ్ఞాలన్నీ ఈశ్వరారాధనలే. ఏ దేవతయైనా ఈశ్వర స్వరూపమే. ద్రవ్య, దేవ, త్యాగాత్మకమైన యజ్ఞకర్మలు ఈతని సొత్తులు. ఈ సొత్తులు గల స్వామి ఇతడు.

యజ్ఞానుభవ చైతన్యం ఈ విష్ణువే.

యజ్ఞభుక్.. 979

1. యజ్ఞాన్ని అనుభవించువాడు –రక్షించువాడు.

'భుజపాలనవ్యవహారయోః' అనే ధాతువుననుసరించి, యజ్ఞ రక్షకుడితడు.

యజ్ఞాలను స్వీకరించే పరమేశ్వరుడితడే.

భోక్తారం యజ్ఞ తపసా సర్వలోక మహేశ్వరమ్ (భగవద్గీత)

"యజ్ఞాలకు తపస్సుకు భోక్తను – సర్వలోకాలకు మహేశ్వరుడను అని నన్ను..." అంటూ భగవానుని మాట.

ఈ యజ్ఞాలే ఆతనికై సాధనలు –

యజ్ఞ సాధనః.. 980

1. యజ్ఞాన్ని సమృద్ధి చేయువాడు.

యజ్ఞాం సాధయతి – సమృద్ధి కురుతే కారయతి (సత్యభాష్యం)

యజ్ఞాన్ని సమృద్ధి చేయువాడు, చేయించువాడు.

స్వామి అనుకూలించితేనే స్వరమూ అనుకూలిస్తుంది. ఈతని అనుగ్రహంచేతనే యజ్ఞానికి అన్నీ సమకూరుతాయి.

2. యజ్ఞాలే సాధనలుగా కలవాడు.

యజ్ఞమే పరమాత్మను సిద్ధింపజేసే సాధనం.

అయితే 'జ్ఞానం చేతనే కైవల్యం' అనే మాటి ఏమిటి? యజ్ఞాలు సాక్షాత్ మోక్ష కారకాలు కాకపోయినా, చిత్తశుద్ధిని ప్రసాదిస్తాయి. తద్వారా జ్ఞానప్రాప్తి, జ్ఞానం ద్వారా కైవల్యప్రాప్తి.

3. యజ్ఞమునకు సాధనలు ఈశ్వర స్వరూపాలే.

సాధనలైన యజ్ఞాలకు సిద్ధినిస్తున్నందున -

యజ్ఞాన్తకృత్.. 981

1. యజ్ఞఫలాన్ని కలిగించువాడు.

పనికి అంతం ఫలం. యజ్ఞాన్తం - యజ్ఞఫలం.

యజ్ఞ సమాప్తినీ, ఫలాన్ని కలిగించేది ఈతడే.

విష్ణు దేవతాకమైన ఋక్కును 'శంసనం' (ఉచ్చారణ) చేయడంతో పూర్ణాహుతిని ఆచరించి, యజ్ఞాన్ని పూర్ణం (ఏ కొరతలేకుండా) చేసి, యజ్ఞసమాప్తి నాచరిస్తారు. ఈ విధంగా యజ్ఞాన్ని పూర్తిచేసే యజమాని కూడా పరమాత్మునికి అభిన్నుడే.

అన్ని కర్మలు జ్ఞానంతోనే పరిసమాప్తి చెందుతాయని గీతాచార్యుని వచనం.

'సర్వ కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే' (భగవద్గీత)

యజ్ఞాన్తం - జ్ఞానమే. దానిని కలిగించువాడు.

ఇదే యజ్ఞాల ఆంతర్యం కనుక -

యజ్ఞగుహ్యమ్.. 982

1. యజ్ఞ రహస్యం - యజ్ఞ హృదయం ఈతడే.

పాలలో వ్యాపించిన వెన్న రహస్యం. అదే క్షీర హృదయం. యజ్ఞాలలో వ్యాపించిన విష్ణువే యజ్ఞ హృదయుడు.

2. యజ్ఞములలో గుహ్యమైనది జ్ఞానయజ్ఞం.

లేదా – ఫలాపేక్షలేని యజ్ఞం. ఆ యజ్ఞం సాక్షాత్తు విష్ణు స్వరూపమే.

యజ్ఞం చేసేవారు తెలుసుకోవలసిన రహస్యమిదే. భగవత్కృపలేనిదే అంతుపట్టని తత్త్వమిది.

విదుః కృష్ణం బ్రాహ్మణాః తత్వతో యే

తేషాం రాజన్ సర్వ యజ్ఞాః సమాప్తాః॥

'ఏ బ్రాహ్మణులు (యజ్ఞ, వేద కర్మకర్తలు) కృష్ణుని యథార్థంగా తెలుసుకుంటారో, వారే సమస్త యజ్ఞాలను పూర్తి చేసిన వారవుతారు!

యజ్ఞాన్తమైన పరతత్త్వమే యజ్ఞరహస్యం.

ఈ యజ్ఞం వల్ల జగతికి లభించే అన్నాదులు కూడా విష్ణుని రూపాలే.

అన్నమ్.. 983

1. అన్న స్వరూపుడు.

ఆరగించేది అన్నం. **అత్తి భక్షతీతి అన్నం.**

'అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సంభవః

యజ్ఞాద్భవతి పర్జన్యః'... యజ్ఞం వలన పర్జన్యం, పర్జన్యం వలన అన్నం లభిస్తాయని గీతావచనం. అన్న కారకమైనది యజ్ఞం కనుక – యజ్ఞనామాల వెంటనే ఈ నామాన్ని కూర్చారు.

ఈ అన్నం భగవత్స్వరూపం.

ప్రాణులచే తినబడేది, ప్రాణులను తినేది అన్నం. ఈ విశ్వమంతా అన్నమయం.

2. *'అన ప్రాణనే'* అనే ధాతువుననుసరించి, *'అన్యతే ప్రాణ్యతే యేన తద్ అన్నం'* *(సత్యభాష్యం)* జీవింపజేయునది అన్నం.

ఇన్ద్రియాలు అనుభవించే ఐశ్వర్యాలు ఆయా ఇన్ద్రియాలకు అన్నాలు. కనుక ఇన్ద్రియార్థాలైనవన్నీ అన్నాలే. ఇవి విష్ణు విభూతులు.

భోగ్యమైన అన్నమే కాక – దానిని భుజించే చైతన్యం కూడా విష్ణువే.

అన్నాదః.. 984

1. *అన్నాన్ని తినువాడు.* **అన్నం అత్తి.**

హవిస్సే అన్నం – దానిని ఆరగించే యజ్ఞాగ్ని సూర్య స్వరూపుడు.

యజ్ఞాగ్ని హవిస్సులను ఆరగించినట్లే, మన అంతర్గత చైతన్యం ప్రపంచానుభవాలను ఆరగిస్తోంది. – జఠరాగ్ని ఆహారాన్ని ఆరగిస్తోంది. అరగిస్తోంది. ఇలా జీవులలో జఠరాగ్నిగా, చైతన్యంగా ఉన్న వాడు పరమాత్ముడే. కనుక ఆయనే 'అన్నాదః'

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః।।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ।।(భగవద్గీత)

"నేను ప్రాణుల దేహాన్ని ఆశ్రయించి, జఠరాగ్నినై ప్రాణాపాన వాయువులతో కలిసి, చతుర్విధాహారాలను పచనం చేస్తున్నాను."

సోగ్ర భుగ్విభజన్తిష్ఠన్నాహారమజరః కవిః।। (యజుర్వేదం)

'అంతర్గతమైన పరమాత్మ ప్రకాశమే ఆహారాన్ని – మొదటిగా అనుభవించునది. అది జరలేనిది. స్వయం ప్రకాశకమైనది.

యో అన్నాదో అన్నపతిర్బభూవ బ్రహ్మణస్పతిరుతయః।
భూతో భవిష్యత్ భువనస్య యస్పతిః।। (అథర్వవేదం)

అన్నాదమ్ ।।యజుర్వేదం।।, అన్నాదాయ ।।అథర్వవేదం।।
అన్నపతయే ।।అథర్వవేదం।। , అన్న భాగః ।।అథర్వవేదం।।

2. *ఈ జగమంతా 'అన్న – అన్నాదా'లతో కూడినది. భోగ్యం – అన్నం (అనుభవించదగినది), భోక్త (అనుభవించువాడు) అన్నాదుడు.*

ఇదే జగద్రూపం. నారాయణుడు ఈ వ్యవస్థగా వ్యాపకుడై విశ్వాన్ని నిర్వహిస్తున్నాడు.

సూర్య జలాలు, యజ్ఞద్రవ్యాలు అన్నాలు. ఆ సూర్యకాంతి, వర్షం భూమికి అన్నాలు. వీటిపై పెరిగే జీవ సమూహమంతా అన్నములు, అన్నాదులే. ఈ భోక్తృ భోగ్యరూపమే జగతి. 'భోక్త అగ్ని – భోగ్యం సోముడు' – 'అగ్నీ షోమాత్మకం జగత్' అనే శాస్త్ర వాక్యంలో అర్థమిది.

జగద్రూపం 'ఇదే' అని చెప్పడానికి 'ఏవ' అనే శబ్దం.

ఈ నామాలన్నీ ఏకైక పరతత్త్వమైన విష్ణువునందే వర్తిస్తున్నాయని 'చ' శబ్దం చెప్పబడింది.

✣ ✣ ✣

అగ్నీ షోమాత్మకతత్త్వమే యజ్ఞం.

ఆ యజ్ఞరూపుడై భాసించే శ్రీ మహావిష్ణువును పై నామాలలో ఒక చక్కని క్రమంలో అందించారు.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ భగవద్గీత॥

"యజ్ఞం చేయువాడు, హోమ ద్రవ్యాలు, అగ్ని – పరబ్రహ్మస్వరూపాలే. యజ్ఞ ఫలితం కూడా బ్రహ్మార్పణమే. ఇట్లు సర్వ కర్మలను యజ్ఞ దృష్టితో చేయడమే బ్రహ్మ కర్మ సమాధినిష్ఠ. ఈ నిష్ఠకలవాడు పరబ్రహ్మస్థితినే పొందుతాడు".

ఈ భగవద్వచన విస్తరణయే *'యజ్ఞః' (921)* నుండి చెప్పబడిన పదు నాలుగు నామాల విజ్ఞానం.

'అన్నం చ బ్రహ్మ అహం చ బ్రహ్మ భోక్తా చ బ్రహ్మ॥
(అన్నము కూడా బ్రహ్మమే – నేను కూడా బ్రహ్మమే – భోక్త కూడా బ్రహ్మమే' అని సంప్రదాయ వాక్యం.

వివిధ దేవతా, వివిధమంత్ర, వివిధ ద్రవ్యాదులతో కూడిన యజ్ఞాలను కలిపి 'ఏకత్వ' భావనతో ('ఒకే పరమాత్మ' అనే దృష్టితో) కూడిన తత్త్వ దృష్టితో దర్శించాలనే జ్ఞానం ఈ నామ పరంపర నుండి ప్రసరిస్తున్న ప్రభ.

✣ ✣ ✣

'యత్పురుషేణ హవిషా దేవా యజ్ఞ మతన్వత' మొదలైన పురుష సూక్త మంత్రాలు విరాట్పురుషుని యజ్ఞ స్వరూపునిగా ఆవిష్కరించాయి. ఆ పురుష సూక్త స్వరూపమే విష్ణు సహస్ర నామ విజ్ఞానం.

✣ ✣ ✣

ఈ జగద్రూప యజ్ఞాన్ని నిర్వహిస్తున్న ఈతడు జగతికి కారణం. కానీ తనకు ఏదీ కారణం లేదు కనుక –

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః॥ 106

985. *ఆత్మయోనిః,* ***986.*** *స్వయం జాతః,* ***987.*** *వైఖానః,*
988. *సామగాయనః,* ***989.*** *దేవకీ నందనః,* ***990.*** *స్రష్టా,*
991. *క్షితీశః,* ***992.*** *పాపనాశనః.*

ఆత్మయోనిః.. 985

1. తనకు తానే కారణమైనవాడు.

యోనిః – అంటే 'కారణం' అర్థం.

ఆత్మయే (పరమాత్మ) జగతికి కారణమైనది. స్వయం సిద్ధరూపుడని అర్థం.

'తనకు తానే కారణం – జగతిని కలిగించిన మూలకారణం – అని నామభావం.

మూల కారణమైన తానే, తనను కలిగించుకొను (వ్యక్తపరిచే) వాడు–

స్వయంజాతః.. 986

1. తనకు తాను కలుగువాడు.

సూర్యుడు తనంత తాను ఉదయించి జగతిని భాసింపజేయునట్లుగా,

తనంత తానుగా కలిగి, జగతిని కలిగించేవాడు. పై (ఆత్మయోనిః) నామం నిమిత్త కారణాన్ని, ఈ నామం ఉపాదాన కారణాన్ని తెలియజేస్తోంది.

'ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్'

'ఈ విశ్వం అంతా మొదట ఏక తత్త్వమైన ఆత్మగా ఉన్నది'.

జగతికి నిమిత్త ఉపాదానకారణుడు తానేనని ఈ రెండు నామాల ఆంతర్యం.

ఈ విషయం **'ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాంతానుపరోధాత్'** (బ్రహ్మసూత్రాలు)

"ఛాందోగ్యోపనిషత్ మొదలైన వాటియందు – 'ఏ ఒక దానిని గురించి వింటే, విశేషాకార గ్రహణంచే వినని దెల్ల వినినదే యగునో' ఇత్యాది ప్రతిజ్ఞయు, 'మట్టినొకదానిని తెలుసుకుంటే మృణ్మయమైన ప్రతి దానిని అనుభవంలో తెలుసుకున్నట్లే' ఇత్యాది దృష్టాంతమును – పరస్పర విరుద్ధం కాక సామంజస్యం కుదరవలెనన్నచో, 'పరమాత్మ తాను జగత్ సృష్టి చేయాలని సంకల్పించాడు'.

అనే శ్రుతులను బట్టి అతడు జగదుత్పత్తిలో నిమిత్త కారణమవడంతోపాటు, ఉపాదాన కారణం కూడా అని చెప్పాలి" –ఇదీ ఈ సూత్రానికి అర్థం.

ఉదీచీ దిక్ సోమోధిపతిః స్వజో రక్షితాశనిరిషవః ॥(ఋగ్వేదం)

స్వజమ్, స్వజాయ, స్వజస్య – అనే నామాలు అథర్వవేదంలో పలుచోట్ల చెప్పబడ్డాయి.

తనంత తానుగా జగతిని మలచినవాడు కనుక –

వైఖానసం 987

1. *విశేషంగా త్రవ్వువాడు.*

సముద్రాలు, నదులు, పర్వత గుహలు ఇవి త్రవ్వినట్లున్న లోతైన ప్రాంతాలలో ఏర్పడ్డాయి. గగనాలలో ఏర్పడిన అనేక జ్యోతిర్లోకాలు, అవకాశాలనిచ్చే ప్రాంతాలు త్రవ్వినట్లే కలిగి ఉన్నాయి. అవకాశాన్నిచ్చే అనంతాకాశం ఎవరో త్రవ్విన పెద్ద గోయివలె ఉంది. అందుకే అది 'ఖం'.

దానిలో సంచరిస్తున్నాయి జ్యోతిర్గణాలు.

ఈ తొలచబడిన ప్రాంతాలన్నిటినీ తొలచి ప్రపంచాన్ని మలచిన విశేష శిల్పి విష్ణువే.

ఈ విశ్వమంతా అణుమండలాలతో సహా విష్ణుని ఖనన క్రియలే.

ఖే రథస్య ఖేఽనసః ఖే యుగస్యశతక్రతో,

అపాలామిన్ద్ర త్రిష్ప్యవ్యత్కృణోఃసూర్యత్వచమ్ ॥ (ఋగ్వేదం)

యా ఆపో దివ్యా ఉత వా సువన్తి ఖనిత్రిమా ఉత వా యా స్వయంజాః।

సముద్రార్థా యాఃశుచయఃపావకాస్తా ఆపో దేవీరిహ మామవన్తు" (యజుర్వేదం)

2. *ఆది వరాహ స్వామిగా భూమిని మిక్కిలిగా (వి) త్రవ్వి పాతాళంలోని హిరణ్యాక్షుని చంపాడని పురాణ ప్రసిద్ధ కథ. సంసార దుఃఖాన్ని తొలచి, తొలగించేవాడు.*

ఈ మహత్కార్యాల నాచరించే యజ్ఞ రూపుడైన పరమ పురుషునే వేదం నాదమయంగా స్తుతించింది –

సామగాయనః.. 988

1. *సామగానపరులకు ఆశ్రయమైనవాడు.*

సామగానాం అయనమ్ (సత్యభాష్యం)

సామము తెలిసినవారు సామగులు. వారికి ఆశ్రయమై, గతియైనవాడు. భగవదనుభూతి నిండిన నాదమయ మంత్రమే సామం. దాని గానం యజ్ఞంలో ప్రధానం. దేవతలను వశం చేసుకొనే దివ్య మంత్ర గానమే సామం.

భగవత్ప్రాప్తి అనే పారవశ్యంతో ముక్తులు సామాలను గానం చేస్తారు. (శ్రీపరాశరభట్టు).

సంకీర్తన సంప్రదాయానికి మూలమిది.

ఏ తత్ సామాగాయన్నాస్తే' (తైత్తిరీయోపనిషత్తు)

'ఇట్లు సామగానం చేస్తూ సేవిస్తార'ని ఉపనిషద్వాక్యాలు విశదీకరిస్తున్నాయి. ముక్తులచే ప్రస్తుతింపబడువాడు.

2. సామమంత్రాలచే గానం చేయబడువాడు.

యజ్ఞాలలో సామగానం చేసే ఉద్గాత శ్రీవిష్ణు రూపుడే.

సామగానం చేయువాడు

ఉభే వాచౌ వదతి సామగా ఇవ గాయత్రంచ త్రైష్టుభం చానురాజతి।

(ఋగ్వేదం)

గాయన్తి త్వా గాయత్రిణః ॥ (ఋగ్వేదం)

ఉద్గాతేవ శకునే సామ గాయసి ॥(ఋగ్వేదం)

దివ్య నాద స్వరూపుడైన పరమాత్ముడే శ్రీ కృష్ణ రూపంగా బ్రహ్మ గాంధర్వ గీతిని, తన వేణువు ద్వారా వినిపించాడు.

నాదప్రధానమైన సామవేదానికి ఉపవేదం గాన్ధర్వ వేదం. సంగీత విద్య.

'వేద శిరో మాతృజసప్తస్వర నాదాచలదీప!

స్వీకృత యాదవకుల మురళీవాదన వినోద మోహన కర'!

- అని త్యాగరాజకీర్తనలో శ్రీకృష్ణుని సన్నుతించారు.

తన నాద తత్వాన్ని విష్ణువు కృష్ణావతారంలో వ్యక్తీకరించాడు -

దేవకీ నన్దనః.. 989

1. దేవకీ దేవి పుత్రుడైన శ్రీకృష్ణుడు.

యజ్ఞ స్వరూపుడైన నారాయణుడే, వేద ధర్మ రక్షణకై పరిపూర్ణుడైన శ్రీకృష్ణునిగా అవతరించారు.

బ్రహ్మణ్యోదేవకీ పుత్రో బ్రహ్మణ్యో మధుసూదనః ॥ (నారాయణోపనిషత్తు)

- అని శ్రుతివాక్యం.

య ఏషపృథు దీర్ఘాక్ష స్సంబన్ధీతే జనార్దనః ।

ఏష భూతం భవిష్యచ్చ - భవచ్చ భరతర్షభ।

'విశాలమైన పెద్ద నేత్రాలు కలిగిన ఈతడు నీ బంధువైన జనార్దనుడు (శ్రీకృష్ణుడు). భూత భవిష్యద్వర్తమానకాలాలకు నిర్వాహకుడైన పరమాత్మ ఈతడే' అని మహాభారతంలో భీష్మ వచనం.

దేవకీ దేవియే అదితిగా, వసుదేవుడు కశ్యపునిగా భాగవతాది గ్రంథాలు స్పష్టంచేశాయి. వారి తనయుడు దేవకీ నందనుడు.

2. *దీవ్యతీతి దేవకః. దీని స్త్రీలింగం దేవకీ.*

ప్రకాశ స్వరూపిణి– దేవకి. ఇది అదితీ శక్తి.

'అదితిర్దేవ మాతా' అని ప్రసిద్ధి.

'అదితిర్ద్యౌరదితి రంతరిక్షమదితిర్మాతా సపితా సపుత్రః' – ఋగ్వేదం

ఈ అదితియే దివి, అంతరిక్షం, తల్లి, తండ్రి, పుత్రుడు.

ఖండింపడని తేజోమయాకాశమే అదితి (దేవకి). తత్తేజంలో ప్రకాశించే జ్యోతి స్వరూపుడు ఆదిత్యుడు.

ఆకాశాన్ని ప్రకాశింపజేయడమే నందనం. అదే దేవకీనందన స్వరూపం. ఇది సూర్య పరమైన అర్థం.

మరొక కోణంలో – దేవకి – క్రీడామయి (దివ్ క్రీడాయాం– అనే ధాతువుననుసరించి) యోగమాయ. ఆ యోగ మాయతో జగద్రచన చేసే లీలామయుడు దేవకీనన్దనుడు.

ఇది సనాతనుడైన విష్ణుని పరంగా చెప్పబడిన అర్థాలు.

ఈ సనాతన స్వరూపమే జగద్రక్షకై శ్రీకృష్ణునిగా అవతరించి, ఆ నామానికి 'దేవకీపుత్ర' అర్థాన్ని అందించింది.

శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్రానికి **'ఛన్దోనుష్టుప్ తథా <u>దేవో భగవాన్ దేవకీసుతః</u>'** అని పూర్వ పీఠికలోనే భారతోక్తి.

శ్రీ విష్ణు సహస్ర నామాలకు దేవత 'దేవకీసుతుడు' అని చెప్పడంలోనే ఈ నామానికున్న ప్రశస్తి అవగతమవుతోంది.

ఇది కృష్ణ పరంగానూ, ఆదిత్యరూప విష్ణుపరంగాను, పరమాత్మ పరంగాను గ్రహించవలసిన నామం.

అవతారంగా వ్యక్తమైనప్పటికీ ఈతడు తనంత తాను కలిగిన స్వతంత్రుడు (ఆత్మయోనిః, స్వయంజాతః) - అంతేకాదు - విశ్వాన్నే కలిగించినవాడు -

స్రష్టా.. 990

1. సృజించువాడు.

సర్వ జగతిని సృష్టించిన పరమాత్ముడు.

ఇయం విసృష్టిర్యత ఆబభూవ యది వా దధే యది వా న॥
యోస్యాధ్యక్షః పరమే వ్యోమన్త్సో అంగ వేద యది వానవేద॥ (ఋగ్వేదం)

వసించుటకు యోగ్యమైన భువనాలను, భువనాధీశులను, భువనవాసులను సృజించినవాడు కనుక -

క్షితీశః.. 991

1. భూమికి ప్రభువు.

అనంతాకాశంలో తనంత తాను ఆవిర్భవించిన పరంజ్యోతి (దేవకీ నందనుడు), ఈ పృథివ్యాదులను సృజించి (స్రష్టా)పాలిస్తున్నాడు (క్షితీశః).

'క్షి నివాస గత్యోః' అనే ధాతువుననుసరించి 'నివాసం, ఆశ్రయం' అయిన భుమ్యాదుల శాసకుడు, పాలకుడు విష్ణువే.

ఈశాన ఇమా భువనాని వీయసే ॥ (ఋగ్వేదం)
స ఇత్ స్వపా భువనేష్వాసి య ఇమే ద్యావా పృథివీ జజాన ॥(ఋగ్వేదం)

ఈ పాలనా వ్యవస్థలో భాగంగా పాపాలను తొలగించి రక్షిస్తున్నవాడు కనుక -

పాపనాశనః.. 992

1. పాపాలను నశింపజేయువాడు.

దురితాలను, భయాలను, దోషాలను తొలగించే శుద్ధ స్వరూపుడు.

ఆశ్రయించినవారిని, యజ్ఞపరులను పాపరహితులుగాచేసి, పాపాత్ములను శిక్షించి పాపనాశనం చేసి పాలిస్తున్నవాడు.

విశ్వాని దేవ సవితుర్దురితాని పరాసువ ॥(యజుర్వేదం)

ఊర్ధ్వో నః పాహ్యంహసః ॥(ఋగ్వేదం)

సమస్త దోష సంహారానికై దివ్యాయుధ ధరుడై ఆవిర్భవించిన దివ్య మంగళ విగ్రహుడు కనుక –

శంఖభృ న్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః।
రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః॥
సర్వప్రహరణాయుధః ఓం నమః
(సర్వ ప్రహరణాయుధః ఓం నమ ఇతి.) 107

993. శంఖభృత్, *994. నన్దకీ,* *995. చక్రీ,*
996. శార్ఙ్గధన్వా, *997. గదాధరః,* *998. రథాఙ్గపాణిః,*
999. అక్షోభ్యః, *1000. సర్వ ప్రహరణాయుధః.*

శంఖభృత్.. 993

1. శంఖాన్ని ధరించినవాడు.

పాంచజన్య శంఖాన్ని దాల్చిన విష్ణువు.

స్వామి పరమైశ్వర్య చిహ్నాలై దివ్యాయుధాలు వరుసగా చెప్పబడుతున్నాయి. నిర్గుణ నిరాకార, సగుణ నిరాకార, సగుణ సాకార స్వరూపాలుగా పరమేశ్వరుని ఆరాధించే వైదిక సంప్రదాయంలో – ఈ మూడు స్వరూపాలు ఈ సహస్ర నామాలలో గోచరిస్తాయి.

✤సర్వ విశ్వ నిర్వాహకుడైన విష్ణువు భూతాది అహంకార రూపమైన శంఖాన్ని ధరించాడు. (శంకరభాష్యం)

✤ అపాంతత్త్వం దరవరమ్॥(శ్రీ మద్భాగవతం)

జలతత్త్వమే శంఖం.

ఇది పురుషాయుధం. దీని అధిదేవత శ్వేత వర్ణంలో సుందర నేత్రాలతో శోభిస్తుంటాడు. **'శంఖోపి పురుషోదివ్యః శుక్లాఙ్గః శుభలోచనః॥** (విష్ణు ధర్మోత్తర పురాణం॥)

'శంఖం సదాహం శరణం ప్రపద్యే' (పంచాయుధస్తోత్రం)

2. సూర్యునకు 'శంఖః' అనే పేరున్నది.

'శంఖః శిశిరనాశనః' (ఆదిత్య హృదయంలో – సూర్యనామాలు)

(ఖం) ఆకాశానికి (శం) సుఖాన్ని కలిగించువాడు (తన ప్రకాశంతో).

వాతాజ్జాతో అన్తరిక్షాత్ విద్యుతో జ్యోతిషస్పతి ।

స నో హిరణ్యజాః శంఖః కృశనః పా త్వంహసః॥

శంఖో నో విశ్వ భేషజః కృశనఃపాత్వంహసః ॥అథర్వవేదం॥

శంఖధ్మమే ॥యజుర్వేదం॥

అ శంఖుని (సూర్యుని) తన తేజస్సుతో పోషించువాడు, ధరించువాడు 'శంఖభృత్'.

నన్దకీ. 994

1. నన్దకం కలిగినవాడు.

విష్ణువు యొక్క ఖడ్గం పేరు నన్దకం. శత్రు సంహారానికై దానిని ధరించినందున అతడు నన్దకీ.

✤ విద్య (తత్త్వజ్ఞానం) అనే ఖడ్గాన్ని ధరించినవాడు (శంకరభాష్యం). అజ్ఞానాన్ని దునుమాడే విద్యాతత్త్వమే స్వామి నన్దకం.

✤ **నభోనిభం న భస్తత్త్వమసిమ్** (శ్రీమద్భాగవతం)

ఆకాశం వలె ప్రకాశించునది – నభస్తత్త్వమే (అంతరిక్ష తత్వమే) ఖడ్గం.

'ఖడ్గశ్చ పురుషః శ్యామ శరీరః క్రుద్ధ లోచనః'

ఈ నందకాయుధ దేవత నల్లనిశరీరంతో, క్రోధలోచనాలతో ఉన్న పురుషదేవత.

2. ఆనన్ద తత్త్వమే నందకం. ఎప్పుడూ ఆనందంతో దీపిస్తున్న పరతత్త్వమితడు (నన్దకీ)

చక్రీ..995

1. చక్రం కలవాడు.

సుదర్శన చక్రాన్ని ధరించినవాడు

✣ **మనస్తత్త్వరూపమే చక్రం** (శంకరభాష్యం)

మనః చక్రం నిగద్యతే (గోపాల తాపినీయోపనిషత్తు)

'మనస్సే చక్రమని చెప్పబడుతోంది.

దీనికి చేతనత్వం కలిగించే ఆత్మ చక్రీ.

✣ **తేజస్తత్త్వం సుదర్శనం** (శ్రీమద్భాగవతం)

అగ్నితత్త్వమే సుదర్శన చక్రం.

షట్కోణ కమలంలో, పదహారు భుజాలతో ప్రకాశించే పురుష దేవత సుదర్శనుడు.

చక్రం సదాహం శరణం ప్రపద్యే.

2. చేయునది చక్రం. **'కరోతిక్రియతే కరణం'** –

చేయునది, చేసేసాధనం చక్రం. విశ్వమే చక్రం – క్రియ. దానిని కలవాడు చక్రి.

మాటిమాటికి తిరిగే సంసార చక్రాన్ని తన అధీనంలో కలవాడు. సంసారాన్ని (జగతిని) చేయువాడు.

సత్రా తే అనుకృష్టయో విశ్వా <u>చక్రేణ</u> వావృతుః।

సత్రా మహాన్ అసి శ్రుతః ॥ఋగ్వేదం॥

శార్ఙ్గధన్వా. 996

1. శార్ఙ్గమనే ధనువును కలిగినవాడు.

విష్ణుని ధనువు పేరు శార్ఙ్గం. (శరములను పొందినది శార్ఙ్గం.)

✤ ఇన్ద్రియాది అహంకార రూపమైనది శార్ఙ్గ నామధనువు.

దానిని చైతన్యవంతం చేసే ఆత్మయే శార్ఙ్గ ధన్వా.

ఇన్ద్రియాణి శరానాహుః ॥(భగవద్గీత)

ఇన్ద్రియాలే శరాలు. వాటిని దాల్చిన ఇన్ద్రియాహంకారమే ధనువు.

✤ **కాల రూపం ధనుః శార్ఙ్గమ్** ॥ (శ్రీమద్భాగవతం)

కాల రూపమే శార్ఙ్గ ధనువు. కాలం నుండి లభించే అనుభవాలే శరాలు అని భావించారు.

ధనుః స్త్రీ పద్మ రక్తాభా మూర్ధ్ని పూరిత చాపభృత్ ॥(విష్ణుధర్మోత్తరపురాణం)

ధనుస్సు స్త్రీ దేవతాకమైనది. ఆ దేవత పద్మమువలె ఎఱ్ఱని కాంతితో, తలపై చాపం నిండిన రూపంతో భాసిస్తున్నది.

శార్ఙ్గం సదాహం శరణం ప్రపద్యే.

గదాధరః. 997

1. గదను ధరించినవాడు.

కౌమోదకీ అనే పేరుగల గదను ధరించిన విష్ణువు.

బుద్ధి తత్త్వమే గద (శంకరభాష్యం)

తేజస్సహోబలయుతం ముఖ్యతత్త్వం గదాం దధత్॥ (శ్రీమద్భాగవతం)

ఓజస్సు, సహస్సు అనే బలాలతో కూడిన ముఖ్యతత్త్వం గద.

విశ్వ ధారణ చేయగల బలమే ఓజస్సు. దానిని ధరించడమే సహస్సు.

గదా పీతప్రభా కన్యా సుపీన జఘన స్థలా । (విష్ణు ధర్మోత్తరపురాణం)

గదాధిదేవత పసుపుకాంతిలో, ఎత్తయిన జఘనస్థలంతో భాసించే కన్యారూపిణి.

గదాం సదాహం శరణం ప్రపద్యే.

రథాఙ్గ పాణిః.. 998

1. *రథాఙ్గాన్ని చేతియందు కలవాడు.*

రథాఙ్గం అంటే 'చక్రం' అనే రూఢ్యర్థం. 'చక్రపాణి' అని ఈ నామానికి అర్థాన్ని చెప్పుకోవచ్చు. కానీ మొదటి పాదంలో 'చక్రీ' నామం ఈ అర్థంతోనే ఉన్నది. స్వామి స్వరూప వర్ణనలో మళ్లీ చక్రహస్తుడని చెప్పడం 'పునరుక్తి' అనిపించవచ్చు. అయితే- స్వామి ఆయుధాలలో సుదర్శన చక్రం ప్రత్యేకమైనదనీ, దానితో భక్తరక్షణకు ఎల్లవేళలా సంసిద్ధుడనీ చెప్పడానికై ప్రస్తావించారు కనుక 'పునరుక్తి' అనిపించుకోదు - అని కొందరు అభిప్రాయపడ్డారు.

2. *'చక్రం' అనకుండా 'రథాఙ్గం' అనడంలో కొన్ని విశేషాలను గమనించవచ్చు.*

రథానికి అంగంగా (భాగంగా) ఉన్నది చక్రం. దానిని ధరించినవాడని అర్థాన్ని గ్రహించాం.

విశ్వానికీ, శరీరానికీ 'రథం' అని వ్యవహారం వేదాంత సంప్రదాయం. (రంహణ) గమనశీలమైనది రథం. దాని భాగాలు రథాంగాలు.

పైన పేర్కొన్న శంఖ, చక్రాదులు- భూతాద్యహంకారాలనీ, విద్యనీ, మనస్తత్వాన్నీ, ఆకాశతత్వాన్నీ, అగ్నితత్వాన్నీ, కాలతత్వాన్నీ, బలాన్నీ తెలియజేస్తున్నాయని శాస్త్రాధారంగా చెప్పుకున్నాం. ఆ తత్వాలన్నీ విశ్వ, శరీర రథాలకు అంగాలే. వాటిని తన చేతిలో ఉంచుకొని నియమించి, నిర్వహిస్తున్న 'రథాఙ్గపాణి' ఇతడు.

'పణ వ్యవహారే' అనే ధాతువు ననుసరించి, ఇత్ ప్రత్యయంతో ఏర్పడిన పదం పాణి. వ్యవహరించు స్థానం 'పాణి'. రథాఙ్గాలను వ్యవహరించు (ప్రవర్తింపజేయు) విశ్వకర్త విష్ణువు.

కాంతి రథంతో (గమనశక్తితో), దాని అంశాలన్నిటినీ వ్యవహరింపజేస్తూ, రాశి సంక్రమణం ద్వారా కాలగమనాన్ని ఏర్పరస్తున్న సూర్యరూప విష్ణువు రథాఙ్గపాణి.

విశ్వనిర్వాహకుడైన ఈ ప్రతాపవంతుని ఏ ఒక్కరూ చలింపజేయలేరు.

అక్షోభ్యః.. 999

1. కలవరపరచుటకు సాధ్యం కానివారు.

ఈయనను ఏ ఒక్కరూ కలవరపరచలేరు (చలింపజేయలేరు). దివ్యాయుధాలతో ప్రకాశించే ఈ పరాక్రమశాలిని ఏ ఒక్కరూ ఎదుర్కొనలేరు – దెబ్బతీయలేరు – కలవరపరచలేరు. సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతమైన నిశ్చలశాంత తత్త్వమితడే కనుక ఈ నామం.

యుద్ధాలలో సైతం దనుజాది వీరులు ఈతనిని ఎదుర్కొనలేరు. చలింపజేయలేరు.

వేదాలలో 'స్థవిరః ప్రవీరః' (ఋగ్వేదం) వంటి నామాలు 'నిశ్చలుడైన మహావీరుడైన' పరాక్రమశాలి 'అక్షోభ్య లక్షణాన్ని' ప్రకటిస్తున్నవే.

కలవరపడని అతడు దేనినైనా కలవరపరచగలడు కనుక –

సర్వప్రహరణాయుధః.. 1000

1. అన్ని ప్రహరణాలను (దెబ్బతీయునవి) ఆయుధాలుగా కలవాడు.

పైన శంఖచక్రగదాదులని పరిమిత సంఖ్యలో చెప్పినా, అవి మాత్రమే ఈతని ఆయుధాలు – అని పరిమితం చేయలేము. దెబ్బతీయగలిగే అన్ని ఆయుధాలను ధరించినవాడు. అంతేకాదు – అన్నిటినీ దెబ్బతీసే ఆయుధాలుగా ప్రయోగించగలిగేవాడు.

నారసింహావతారంలో కేవలం నఖాలనే (గోళ్లనే) ఆయుధాలుగా మహారాక్షసుని సంహరించాడు. మోహశక్తితో జగన్మోహినిగా దనుజులను ఆక్రమించాడు. ఛలం (వంచన)తో బలిని అణచాడు. శ్రీరాముడు గడ్డిపరకతో కాకాసురుని శిక్షించాడు. ఏ భావాన్నైనా, ఏ పదార్థాన్నైనా ఆయుధంగా ప్రయోగించే శక్తిమంతుడు ఈతడు.

రుద్రనమకమంత్రాలలో –

నమస్తే రుద్రమన్యవ ఉతోత ఇషవే నమః ॥

'ఓ రుద్రా! నీ కోపానికి నమస్కారం. మరియు నీ బాణానికి నమస్కారం' అని నమస్కరిస్తూ - పృథ్వి నుండి అన్న బాణాలనీ, అన్తరిక్షం నుండి వాయుబాణాలనీ, దివి నుండి వర్ష బాణాలనీ ప్రయోగించేవానిగా పరమేశ్వరునిని దర్శించింది యజుర్వేదం.

నమో రుద్రేభ్యో యే పృథివ్యాం యేఽన్తరిక్షే
యే దివి యేషామన్నం వాతో వర్ష మిషవః...॥

పోషక, రక్షకాలైన అన్న వాయు వర్షాలే శిక్షకాలుగా కూడ వ్యవహరిస్తున్నాయి. విశ్వవ్యాపకమైన ఈశ్వరుని శక్తి విశేషాలన్నీ ఆయుధాలే. రక్షణకీ, శిక్షణకీ వ్యవహరించే ఆ ఆయుధాలు వారి వారి కర్మఫలంగా కొందరికి అఘోరాలు. తత్త్వతః ఘోరాఘోరాలకి అతీతుడైన 'అక్షోభ్యుడు' (శాంతస్వరూపుడు) అతడు. అన్నీ ఆయన ప్రహరణాయుధాలే. (దెబ్బతీసే ఆయుధాలు)

సర్వవిధ మాయావికారాలను దునుమాడే సర్వశక్తిమంతుని ఈ నామంతో పేర్కొన్నారు.

✣ ✣ ✣

ఈ 'రథాంగపాణిః' 'అక్షోభ్యః' 'సర్వప్రహరణాయుధః' - అనే నామాలను మరొక ఔచితీమంతమైన భావనతో దర్శించవచ్చు.

దీనిని బోధిస్తున్న ఆచార్యుడు భీష్ముడు. ఆయన విష్ణుతత్త్వం క్షుణ్ణంగా తెలిసిన భాగవతశిఖామణి. వ్యాసుడు గ్రథితం చేసిన వేద సమ్మిత ఈశ్వర నామాలను సమకూర్చి ప్రబోధిస్తూ తాను మనసులో ధ్యానిస్తున్న దివ్య మంగళ విగ్రహుని ఈ మూడు నామాలలో పేర్కొన్నారు.

యుద్ధభూమిలో భీష్ముని అవక్ర పరాక్రమ తీవ్రతని గమనించి, దానిని నియంత్రించడానికై నారాయణుడు ఒక్క ఉదుటున రథం నుండి దిగి, ఒక రథచక్రాన్ని తీసుకొని భీష్మునిపైకి దూకినట్లు భాగవతం వర్ణిస్తోంది. ఆ సమయంలో పరమాత్ముని చేతిలో మరణించి, కైవల్యం పొందే భాగ్యం

లభించిందని పరమానంద భరితుడై రథం దిగి ఎదురుగా వచ్చి నమస్కరించాడు భీష్ముడు.

కానీ అర్జునుని ప్రార్థన మేరకు శ్రీ కృష్ణుడు వెనుదిరిగాడు. ఆ సమయంలో స్వామిలో లీనమయ్యే దివ్యక్షణం లభించినట్లు భావించిన తీవ్ర భక్తితో - మోక్షార్థియై అంపశయ్యపై ఆ మూర్తినే తలచుకుంటున్నాడు.

స్వనిగమ మపహాయ మత్ప్రతిజ్ఞా -
మృతమధికర్తు మవప్లుతో రథస్థః ।
ధృత రథచరణోఽభ్య యాచ్చలద్గు-
ర్హరి రివ హన్తుమిభంగతోత్తరీయః ॥
.... స భవతు మే భగవాన్ గతిర్ముకున్దః॥ *(శ్రీమద్భాగవతం)*

"తన ప్రతిజ్ఞను విడచి, నా ప్రతిజ్ఞను నిజం చేయడానికై రథం నుండి క్రిందకు దికి, రథచక్రాన్ని చేపట్టి భూమి చలించగా, పై నున్న వస్త్రం జారగా, ఏనుగుపైకి దుమికే సింహంలా ఎదురుగా వచ్చిన ముకున్దుడు నాకు గతి (ఆశ్రయం) అగుగాక!"

"చక్రంబు చేపట్టి చనుదెంచు రయమున
పై నున్న పచ్చని పటము జాఱు....." అని పోతనగారి పలుకులు.

ఈ విధంగా చక్రాన్ని పట్టుకు వస్తున్న శ్రీకృష్ణునే **'రథాఙ్గపాణిః'** అని స్మరించాడని ఈ నామం ద్వారా భావించవచ్చు. అయితే భీష్మాదులు విజృంభించినా శ్రీకృష్ణుని ఎదుర్కొనలేరు.

భాగవతం శ్రీ కృష్ణుడు 'రథచక్రాన్ని' పట్టినట్టు వర్ణించినా, భారతం ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు కేవలం తన చేతిలో గుఱ్ఱాలను తోలే మునికోలను మాత్రమే ధరించి దుమికినట్లు వర్ణించింది.

అభిదుద్రావ భీష్మం స భుజప్రహరణో బలీ।
ప్రతోద పాణిస్తేజస్వీ సింహవద్ వినిదన్ ముహుః ॥ (మహాభారతం, భీష్మపర్వం)

"భుజాలనే ఆయుధాలుగా కలిగిన మహాబలవంతుడైన తేజస్వి విష్ణువు,

మునికోలను చేబట్టి సింహం వలె గర్జిస్తూ భీష్మునిపైకి దుమికాడు".
రథాన్నితోలే పగ్గాలను, మునికోలను కూడా 'రథాంగాలు'గా స్వీకరించవచ్చు.
అయితే – భీష్మునికి మాత్రమే స్వామి యిచ్చిన దర్శనం భీష్మునికే తెలియాలి.
'భుజప్రహరణః'– అన్నప్పుడు 'బాహువులే ఆయుధాలు' అనే భావనలో, ఆ చేతులు ఏ దివ్యాయుధాలతో భీష్మునికి గోచరించాయో!
అంత మహాయుద్ధంలో శ్రీకృష్ణుని ఎదుర్కొనలేమనీ, కృష్ణ సహాయం ఉన్నంతకాలం పాండవులను జయించలేమనీ భీష్ముడే స్వయంగా దుర్యోధనునితో వచించాడు. (అక్షోభ్యః)
దేనినైనా ఆయుధంగా ప్రయోగించగలడు కనుకనే – భుజాలైనా, మునికోలఅయినా, రథచక్రమైనా ఆయనకు ప్రహరణాయుధమే.
ఈవిధంగా తనకు ముక్తిదాత అయిన విష్ణ్వవతారమైన శ్రీకృష్ణుని, ఈ స్తోత్రానికి దేవతగా భీష్ముడు ఉపాసించాడు. 'దేవకీనందనః' నామం నుండి ఈ నామం వరకు ఈ భావనను దర్శించవచ్చు.

✣ ✣ ✣

"సర్వప్రహరణాయుధః ఓం నమ ఇతి"

ఈ నామం ఈతని సంకల్పశక్తినీ, సర్వేశ్వరత్వాన్నీ ప్రకటిస్తోంది. రక్షణకీ శిక్షణకీ వినియోగించే స్వామి అనన్తశక్తులే ప్రహరణాయుధాలు.

'సంత్యసంకల్పః'

'ఏష సర్వేశ్వరః' (మాండూక్యోపనిషత్తు)

– అనే ఉపనిషద్వాక్యాలు 'సర్వకార్యాలను నేరవేర్చగలిగే సమర్థుడు', 'అమోఘ సంకల్పుడు' విష్ణువు అని ప్రతిపాదిస్తున్నాయి.

ఓంకారం, నమస్కారం అనే రెండు ప్రణవాలతో ఈ దివ్యస్తుతి సమాప్తమయింది.

'ఓం'కారం శుభార్థవాచకం.

ఓంకారశ్చాథ శబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణఃపురా ।

కంఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాంగలికా వుభౌ ॥ (బృహన్నారదీయం)

"ఓంకారం, 'అథ' శబ్దం– ఈ రెండు మొదటిగా బ్రహ్మదేవుని కంఠాన్ని భేదించి అతిస్పష్టంగా వెలుపలికి వచ్చినవి. అందువల్లనే ఈ రెండునూ శుభార్థప్రతిపాదకాలు".

'నమః' అనడం చేత 'పరిచరణ' (పూజ) పూర్తయినది.

ఇన్ని నామాల విష్ణువునకు నమస్కారము.

భూయిష్ఠాంతే నమ ఉక్తింవిధేమ (ఈశావాస్యోపనిషత్తు)

"నీకు మాటి మాటికి నమో వచనం పలికి పూజ చేస్తాం" – విష్ణు నమస్కారమే ధన్యం. పరిపూర్ణం.

ధన్యం తదేవ లగ్నం తన్నక్షత్రం తదేవ పుణ్యమహః ।
కరణస్య చ సా సిద్ధిః యత్ర హరిః ప్రాఙ్నమస్క్రియతే ॥

ఏ క్రియాచరణంలో మొదటిగా హరి నమస్కరించబడతాడో, ఆ క్రియను ఆరంభించిన సమయంలో ఉన్న లగ్నం ధన్యం. ఆ నక్షత్రం, ఆ దినం పుణ్యకరం. అలా ఆచరించిన క్రియకు, ఆ నమస్కారమే సిద్ధి కలిగిస్తున్నది'.

అతసీ పుష్పసంకాశం పీతవాసస మచ్యుతం ।
యే నమస్యంతి గోవిన్దం నతేషాం విద్యతే భయమ్ ॥

(భారతం. శాంతిపర్వం)

'నల్ల అవిసిపూవు వంటి దేహచ్ఛాయ కలవాడు, పచ్చని పట్టువస్త్రం ధరించినవాడు అయిన అచ్యుతుని గోవిన్దుని ఎవరు నమస్కరిస్తారో, వారికి ఎన్నడూ భయముండదు.'

లోకత్రయాధిపతిమప్రతిమప్రభావం
ఈషత్ ప్రణమ్య శిరసా ప్రభవిష్ణుమీశం ।
జన్మాంతర ప్రళయకల్ప సహస్రజాత
మాశుప్రశాంతి ముపయాతి నరస్యపాపమ్ ॥

'లోకత్రయాధిపతి, సాటిలేని ప్రభావం కలవాడు, సర్వసమర్థుడు,

ఈశ్వరుడైన నారాయణుని ఉద్దేశించి, కొంచెంగానైనా శిరస్సుతో నమస్కరిస్తే, వేయి కల్పాల వేయి ప్రళయాల కాలపరిమాణంలో జీవునకు కలిగే వేలకొలది జన్మాలలో సంభవించునంత పాపం కూడా శీఘ్రంగా పూర్తిగా తొలగుతుంది. హరికి చేసే నమస్కార మహిమను - ఆదిశంకరులు పై శ్రుతి స్మృతి వాక్యాలతో భక్త్యుద్రేకంతో స్మరించారు.

'శ్రీవిష్ణువిద్య' (శ్రీ విష్ణుసహస్రనామ భాష్య గ్రంథం) (వేయినామాల) దశమశతకం సంపూర్ణమ్.

వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ।
శ్రీమన్నారాయణో విష్ణుర్వాసుదేవోఽభిరక్షతు॥ 108

వనమాలను, గదను, శార్ఙ్గాన్నీ, శంఖాన్నీ, చక్రాన్నీ, నన్దకాన్నీ ధరించిన శ్రీమన్నారాయణుడు, విష్ణువు, వాసుదేవుడు. అన్ని విధముల (అన్ని వైపుల) సమగ్రంగా రక్షించుగాక!

ఈ శ్లోకం సహస్రనామాలలో లేదు. భీష్ముడు వచించలేదు. తరువాత ఏ మహర్షి కల్పుడో సమకూర్చి ఈ స్తోత్రానికి జతపరచారు.

ఇది అమోఘమైన మంత్రశక్తి భరితమైన శ్లోకంగా సంభావించవచ్చు. ఇందులో ఎనిమిది నామాలున్నాయి. వీటి కూర్పుతో మొత్తం అష్టోత్తర సహస్ర సంఖ్య. మంత్ర జపం తరువాత తన్మాంత్రాధిదేవత యొక్క గాయత్రిని జపించడం ఒకసంప్రదాయం. విష్ణుగాయత్రీ లోని మూడు నామాలను ఈ శ్లోకంలో నిబద్ధించారు.

నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి
తన్నో విష్ణుః ప్రచోదయాత్ ॥

దివ్యాయుధధారియైన నారాయణుడు మనలను సంపూర్ణంగా రక్షించాలి. ఈ శ్లోకాన్ని జతచేయడం వలన ఒక అద్భుతశక్తి ఏర్పడింది. వేయి నామాలలో ప్రతి నామానికీ ఈ 'అభిరక్షతు' అన్వయిస్తూ ఒక్కొక్క నామంతో వ్యక్తమయ్యే విష్ణువు మనలను రక్షించుగాక! అనే చక్కని భావం ఏర్పడుతుంది.
'విశ్వం అభిరక్షతు' 'విష్ణుః అభిరక్షితు'... ఈ విధంగా పంచాయుధ ధరుడై వనమాలను ధరించిన లక్ష్మీసమేత నారాయణుడు, విష్ణువు, వాసుదేవుడు మనలను సమగ్రంగా రక్షించుగాక!

ఉత్తరపీఠికా

ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః ।
నామ్నాం సహస్రం దివ్యానామశేషేణ ప్రకీర్తితమ్ ॥

కీర్తించదగినవాడు, పూజ్యతత్త్వ స్వరూపుడు (ఉత్తమమైన ఆత్మతత్త్వం) అయిన కేశవునకు సంబంధించి దివ్యములైన వేయి నామాలు ఈ ప్రకారంగా, ఏమీ మిగులకుండా (సంపూర్ణంగా) ఉత్కృష్టంగా కీర్తించబడినాయి.

య ఇదం శ్రుణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్ ।
నాఽశుభం ప్రాప్నుయాత్కించి త్సోఽముత్రేహ చ మానవః ॥

ఈ నామా సహస్రాన్ని ఏ మానవుడు ప్రతిదినం, నిరంతరంగా వింటుంటాడో,మరియు ఏ మానవుడు సంపూర్ణంగా కీర్తిస్తాడో అటువంటి మానవుడు పరలోకంలోను, ఈ లోకంలోను ఏ కొంచెం కూడా అశుభాన్ని పొందడు.

వేదాంత గో బ్రాహ్మణః స్యాత్ క్షత్రియో విజయీ భవేత్ ।
వైశ్యో ధన సమృద్ధః స్యాత్ శూద్రః సుఖమవాప్నుయాత్ ॥

బ్రాహ్మణుడు బ్రహ్మతత్త్వాన్ని ఎరిగినవాడవుతాడు, క్షత్రియుడు విజయాన్ని పొందినవవాడవుతాడు, వైశ్యుడు ధనసమృద్ధి కలవాడవుతాడు, శూద్రుడు

సుఖాన్ని పొందుతాడు. (వారి వారి ప్రవృత్తుల ననుసరించి దీని ఉత్తమ ఫలితాలను పొందుతారు)

ధర్మార్థీ ప్రాప్నుయాద్ధర్మమర్థార్థీ చార్థమాప్నుయాత్ ।
కామానవాప్నుయాత్కామీ ప్రజార్థీ చాప్నుయాత్ప్రజామ్ ॥

ధర్మాన్ని వాంఛించువాడు ధర్మానుష్ఠానఫలాన్నీ, అర్థాన్ని కోరువారు అర్థాన్నీ, కామములను కోరువాడు కామఫలాన్నీ, సంతతిని కోరువాడు సంతతిని పొందుతాడు.

భక్తిమాన్ యః సదోత్థాయ శుచిస్తద్గతమానసః ।
సహస్రం వాసుదేవస్య నామ్నామేతత్ ప్రకీర్తయేత్ ॥
యశః ప్రాప్నోతి విపులంయాతి ప్రాధాన్యమేవచ ।
అచలాం శ్రియమాప్నోతి శ్రేయః ప్రాప్నోత్యనుత్తమమ్ ॥
నభయం క్వచిదాప్నోతి వీర్యం తేజశ్చ విన్దతి ।
భవత్యరోగో ద్యుతిమాన్ బలరూపగుణాన్వితః ॥

భక్తికలవాడు, పవిత్ర చిత్తం కలవాడు, భగవానునిపైననే చేరియున్న మానసం కలవాడు, ఎల్లప్పుడు లేచి (ప్రయత్నపరుడై– మెలకువతో), ఈ చెప్పబడిన వాసుదేవుని వేయి నామాలను ఉత్తమంగా ఎవడు కీర్తిస్తున్నాడో – అతడు విస్తారమైన కీర్తిని పొందుతాడు. ప్రధానుడుగా ఉండే స్థితిని పొందుతాడు. (జ్ఞాతి ప్రాధాన్యం – అని పాఠాంతరం. 'తనవారిలో' అని అర్థం) స్థిరమైన సంపదను, అన్నిటికంటె గొప్పదైన శ్రేయస్సును (మోక్షాన్ని) పొందుతాడు. ఎక్కడ కూడా భయాన్ని పొందడు. వీర్యాన్నీ, తేజస్సును పొందుతాడు. రోగాలు లేనివాడై, కాంతి కలవాడై, బలంతో చక్కని రూపంతో సద్గుణాలలో కూడినవాడవుతున్నాడు.

రోగార్తో ముచ్యతే రోగాత్ బద్ధో ముచ్యేత బంధనాత్ ।
భయాన్ముచ్యేత భీతస్తు ముచ్యేతాపన్న ఆపదః ॥
దుర్గాణ్యతి తరత్యాశు పురుషః పురుషోత్తమం ।

స్తువన్నామ సహస్రేణ నిత్యం భక్తి సమన్వితః ॥

భక్తితో చక్కగా కూడినవాడై నిరంతరం, నామ సహస్రంతో పురుషోత్తముని స్తుతించే పురుషుడు – రోగం కలవాడైతే రోగం నుండి విడుదల పొందుతాడు. బంధితుడు బంధం నుండి, భీతుడు భయం నుండి, ఆపన్నుడు ఆపదల నుండి విడుదలౌతారు. ఎట్టి దుఃఖాల నుండైనా శీఘ్రంగా బైటపడతారు.

వాసుదేవాశ్రయో మర్త్యో వాసుదేవ పరాయణః ।

సర్వపాప విశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనమ్ ॥

వాసుదేవుడే తనకాశ్రయంగా కలవాడు, వాసుదేవుడే తనకు పరమ గమ్యంగా కలవాడు– అన్ని పాపాల నుండి శుద్ధిపొంది, శాశ్వతమైన బ్రహ్మ తత్త్వాన్ని పొందుతాడు.

న వాసుదేవ భక్తానామశుభం విద్యతేక్వచిత్।

జన్మమృత్యు జరావ్యాధిభయం నైవోపజాయతే॥

వాసుదేవుని భక్తులకు ఎక్కడైనా, ఎన్నడైనా అశుభం ఉండదు. పుట్టుక, చావు, ముసలితనం జబ్బుల వలన భయం కలుగనే కలుగదు.

ఇమం స్తవమధీయానః శ్రద్ధా భక్తి సమన్వితః ।

యుజ్యేతాత్మ సుఖక్షాన్తి శ్రీ ధృతి స్మృతి కీర్తిభిః ॥

శ్రద్ధాభక్తులతో ఈ స్తోత్రాన్ని అధ్యయనం చేయువాడు, సుఖం, క్షమ, సంపద, నిబ్బరం, స్మార్తి, కీర్తి– వీటితో ఉంటాడు. భక్తి కలవాడు, శుచి, సతత ప్రయత్నశీలుడు, ఏకాగ్రచిత్తుడు, ఆస్తిక్య బుద్ధి కలవాడు దీనికి ఉత్తమాధికారి. అటువంటివానికి ఇంతటి విశేష ఫలం కలుగుతుంది. (ఇది విష్ణు సహస్రనామ విద్యకు అధికారి నిర్ణయం)

న క్రోధో న చ మాత్సర్యం నలోభోన్నాఽశుభామతిః ।

భవన్తి కృత పుణ్యానాం భక్తానాం పురుషోత్తమే ॥

పుణ్యఫలం వలన పురుషోత్తముని యందు భక్తి కలిగిన వారికి క్రోధ, మాత్సర్య, లోభ, అశుభబుద్ధులు కలుగవు.

ద్యౌః సచన్ద్రార్క నక్షత్రా ఖం దిశో భూర్మహోదధిః ।
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః ॥

చన్ద్ర సూర్య నక్షత్రాలతో కూడిన ద్యులోకం, అంతరిక్షం, దిక్కులు, భూమి, మహాసముద్రం – ఇవన్నీ ఏకైక సమష్టి మహా చైతన్యమైన వాసుదేవుని అనంత శక్తి చేత విశేషంగా నిలుపబడియున్నాయని తెలుసుకోవాలి.

ససురాసుర గన్ధర్వం సయక్షోరగరాక్షసమ్ ।
జగద్వశే వర్తతేదం కృష్ణస్య సచరాచరమ్ ॥

దేవతలు, అసురులు, గంధర్వులతో కూడినది, యక్షులు నాగులు రాక్షసులతోనున్నది, చరాచరాలైన సకల పదార్థాలతో కూడిన ఈ ప్రపంచం కృష్ణుని అధీనంలోనే ఉన్నది.

ఇన్ద్రియాణి మనోబుద్ధిః సత్త్వం తేజోబలం ధృతిః ।
వాసుదేవత్మకాన్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవచ ॥

ఇన్ద్రియాలు, మనస్సు, బుద్ధి, సత్త్వం (అంతఃకరణం), తేజస్సు, బలం, నిబ్బరం, ప్రాణిశరీరం, జీవుడు – ఇవన్నీ వాసుదేవుడే ఆత్మగా కలవి అని తత్త్వజ్ఞులు చెబుతున్నారు.

సర్వాగమనామాచారః ప్రథమం పరికల్పతే ।
ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః ॥

అన్ని శాస్త్రాలకు ఆచారమే మొదట ఏర్పడినది. ఆచారం వల్ల (ఆచరణ) ధర్మం కలుగుతుంది. ధర్మానికి ప్రభువు అచ్యుతుడు. (శిష్టాచారం కలవాడే సర్వధర్మాలకు అధికారి).

ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః ।
జంగమాఽజంగమం చేదం జగన్నారాయణోద్భవమ్ ॥

ఋషులు, పితరులు, దేవతలు, పంచ స్థూల సూక్ష్మ మహాభూతాలు ప్రాణి శరీరాలలోని ధాతువులు, చరాచరరూపమైన ఈ ప్రపంచం నారాయణుని నుండి ఉద్భవించినదే.

యోగోజ్ఞానం తథాసాంఖ్యం విద్యాఃశిల్పాది కర్మచ ।
వేదాః శాస్త్రాణి విజ్ఞాన మేతత్ సర్వం జనార్దనాత్ ॥

ప్రాణాయామాది రూపమైన యోగం, విషయాల గూర్చిన తాత్వికజ్ఞానం, సాంఖ్యం, లౌకికాలౌకిక విద్యలు, శిల్పం మొదలైన కర్మలు, వేదాలు, శాస్త్రాలు, అనుభవ పూర్వక జ్ఞానం..... ఇదంతా జనార్ధనుని నుండియే ఏర్పడుతుంది.

ఏకో విష్ణుర్మహద్భూతం పృథగ్భూతాన్యనేకశః ।
త్రీంల్లోకాన్వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభుగవ్యయః ॥

మహద్భూతం= గొప్పదైనదీ, మూడు కాలాలలోనూ ఉనికి కలిగినదీ, ఏ వికారము, నాశనం లేనిదీ, ఏకైక తత్త్వమైన విష్ణువు. అన్ని భూతాలు తానే అయినవాడు, అన్ని భూతాలకు చైతన్య ప్రదాత అయిన ఆత్మతత్త్వం, విశ్వాన్ని అనుభవించువాడు, అనేకాలుగా భాసిస్తున్న భూతాలను రక్షిస్తున్నవాడు.

ఇమం స్తవం భగవతో విష్ణోర్వ్యాసేన కీర్తితం।
పఠేద్య ఇచ్ఛేత్పురుషః శ్రేయఃప్రాప్తుం సుఖాని చ॥

ఈ విష్ణుస్తోత్రం భగవానుడైన వ్యాసునిచే కీర్తింపబడినది, శ్రేయస్సును (మోక్షాన్ని) సుఖాలను (ఐహికాలను) పొందాలని కోరుకునేవారు దీనిని పఠించాలి.

విశ్వేశ్వర మజం దేవం జగతః ప్రభవాప్యయం ।
భజన్తి యే పుష్కరాక్షం న తే యాన్తి పరాభవమ్ ॥
న తే యాన్తి పరాభవం ఓం నమ ఇతి ॥

సకల విశ్వానికి స్వామి, జన్మరహితుడు, లోక సృష్టి స్థితి లయకారణుడు, స్వయం ప్రకాశుడు సత్యప్రకాశుడు అయిన పద్మనేత్రుని విష్ణుని ఎవరు ఈ స్తోత్రంతో సేవిస్తారో వారు అశుభాన్ని పొందరు.

ఇతి శ్రీ మహాభారతే శత సహస్రికాయాం సంహితాయాం
వైయాసిక్యా మనుశాసన పర్వాంతర్గతాను శాసనిపర్వణి
మోక్షధర్మే భీష్మయుధిష్ఠిర సంవాదే శ్రీవిష్ణోర్దివ్య

సహస్రనామస్తోత్ర నామ ఏకోన పఞ్చాశ దధిక శతతమోధ్యాయః.

– ఇది లక్ష శ్లోక సంఖ్య గల వేదవ్యాస విరచిత శ్రీ మహాభారత సంహితలో, అనుశాసన పర్వంలోని 'అనుశాసనిక పర్వమ'ందు మోక్షధర్మమందు దివ్యమైన శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమనే పేరు కలిగిన నూటనలభై తొమ్మిదవ అధ్యాయము.

ఈ 'శ్రీవిష్ణువిద్య' గ్రంథము
మదభీష్టదైవం
గజానన షడానన సమేత
శ్రీ ఉమామహేశ్వర పరబ్రహ్మమునకు అంకితము
ఈ గ్రంథాన్ని స్వీకరించిన
పురీక్షేత్రసంవాసి
బలభద్రా సుభద్రా సమేత శ్రీశ్రీశ్రీ జగన్నాథస్వామి దివ్యచరణారవిన్దాలకు
– ప్రణామసాహస్రి –
మంగళం మహత్ శ్రీశ్రీశ్రీ

నామానుక్రమణిక

501. కపీన్ద్రః	7	525. ప్రమోదనః	26
502. భూరిదక్షిణః	8	526. ఆనన్దః	27
503. సోమపః	9	527. నన్దనః	28
504. అమృతపః	10	528. నన్దః	28
505. సోమః	11	529. సత్యధర్మా	29
506. పురుజిత్	13	530. త్రివిక్రమః	30
507. పురుసత్తమః	13	531. మహర్షిః కపిలాచార్యః	31
508. వినయః	14	532. కృతజ్ఞః	33
509. జయః	15	533. మేదినీపతిః	33
510. సత్యసన్ధః	15	534. త్రిపదః	34
511. దాశార్హః	16	535. త్రిదశాధ్యక్షః	35
512. సాత్వతాం పతిః	17	536. మహాశృంగః	36
513. జీవః	17	537. కృతాంతకృత్	37
514. వినయితా సాక్షీ	18	538. మహావరాహః	37
515. ముకున్దః	19	539. గోవిన్దః	39
516. అమిత విక్రమః	19	540. సుషేణః	40
517. అంభోనిధిః	20	541. కనకాంగదీ	40
518. అనన్తాత్మా	21	542. గుహ్యః	41
519. మహోదధిశయః	21	543. గభీరః	41
520. అన్తకః	22	544. గహనః	41
521. అజః	23	545. గుప్తః	42
522. మహార్హః,	24	546. చక్రగదాధరః	43
523. స్వాభావ్యః	25	547. వేధాః	44
524. జితామిత్రః	26	548. స్వాంగః	44

549. అజితః 45
550. కృష్ణః 45
551. దృఢః 46
552. సంకర్షణోఽచ్యుతః 47
553. వరుణః 48
554. వారుణః 49
555. వృక్షః 50
556. పుష్కరాక్షః 51
557. మహామనాః 51
558. భగవాన్ 52
559. భగహా 53
560. ఆనన్దీ 54
561. వనమాలీ 55
562. హలాయుధః 56
563. ఆదిత్యః 57
564. జ్యోతిరాదిత్యః 57
565. సహిష్ణుః 58
566. గతిసత్తమః 58
567. సుధన్వా 59
568. ఖండపరశుః 60
569. దారుణః 62
570. ద్రవిణప్రదః 62
571. దివిస్పృక్ 63
572. సర్వదృగ్వ్యాసః 64
573. వాచస్పతిరయోనిజః 66
574. త్రిసామా 67
575. సామగః 68
576. సామ 69
577. నిర్వాణమ్ 70
578. భేషజమ్ 71
579. భిషక్ 71
580. సన్న్యాసకృత్ 72
581. శమః 73
582. శాన్తః 74
583. నిష్ఠా 75
584. శాంతిః 75
585. పరాయణమ్ 76
586. శుభాంగః 77
587. శాన్తిదః 78
588. స్రష్టా 79
589. కుముదః 79
590. కువలేశయః 80
591. గోహితః 82
592. గోపతిః 82
593. గోప్తా 83
594. వృషభాక్షః 83
595. వృషప్రియః 84
596. అనివర్తీ 85
597. నివృత్తాత్మా 86
598. సంక్షేప్తా 86
599. క్షేమకృత్ 87
600. శివః 87

601.	శ్రీవత్సవక్షాः	88	627.	శాశ్వత స్థిరः	104
602.	శ్రీవాసः	89	628.	భూశయः	105
603.	శ్రీపతిः	90	629.	భూషణः	105
604	శ్రీమతాంవరः	90	630.	భూతిः	106
605.	శ్రీదः	91	631.	విశోకः	107
606.	శ్రీశः	92	632.	శోకనాశనः	107
607.	శ్రీనివాసः	92	633.	అర్చిష్మాన్	108
608.	శ్రీనిధి	93	634.	అర్చితః	109
609.	శ్రీవిభావనः	93	635.	కుంభः	110
610.	శ్రీధరः	94	636.	విశుద్ధాత్మా	111
611.	శ్రీకరः	94	637.	విశోధనः	112
612.	శ్రేయः	95	638.	అనిరుద్ధः	113
613.	శ్రీమాన్	95	639.	అప్రతిరథः	113
614.	లోకత్రయాశ్రయः	96	640.	ప్రద్యుమ్నः	114
615.	స్వక్షः	97	641.	అమితవిక్రమः	114
616,	స్వంగः	98	642.	కాలనేమినిహా	115
617.	శతానన్దः	98	643.	వీరः	116
618.	నన్దిः	99	644.	శౌరిः	117
619.	జ్యోతిర్గణేశ్వరः	100	645.	శూరజనేశ్వరः	117
620.	విజితాత్మా	100	646.	త్రిలోకాత్మా	118
621.	అవిధేయాత్మా	101	647.	త్రిలోకేశः	118
622.	సతీర్థిः	101	648.	కేశः	119
623.	ఛిన్నసంశయः	102	649.	కేశిహా	120
624.	ఉదీర్ణः	103	650.	హరిः	121
625.	సర్వతశ్చక్షుः	103	651.	కామదేవः	123
626.	అనీశः	104	652.	కామపాలः	123

653.	కామీ	124	679.	స్తవ్యః	145
654.	కాన్తః	125	680.	స్తవప్రియః	146
655.	కృతాగమః	125	681.	స్తోత్రం	146
655.	అనిర్దేశ్యవపుః	127	682.	స్తుతిః	147
657.	విష్ణుః	128	683.	స్తోతా	148
658.	వీరః	128	684.	రణప్రియః	149
659.	అనన్తః	129	685.	పూర్ణః	150
660.	ధనఞ్జయః	130	686.	పూరయితా	150
661.	బ్రహ్మణ్యః	131	687.	పుణ్యః	151
662.	బ్రహ్మకృత్	132	688.	పుణ్యకీర్తిః	151
663.	బ్రహ్మా	133	689.	అనామయః	152
664.	బ్రహ్మ	133	690.	మనోజవః,	154
665.	బ్రహ్మవివర్ధనః	134	691.	తీర్థకరః	155
666.	బ్రహ్మవిత్	134	692.	వసురేతాః	156
667.	బ్రాహ్మణః	135	693.	వసుప్రదః	157
668.	బ్రహ్మీ	136	694.	వసుప్రదః	158
669.	బ్రహ్మజ్ఞః	137	695.	వాసుదేవః	159
670.	బ్రాహ్మణ ప్రియః	137	696.	వసుః	159
671.	మహాక్రమః	138	697.	వసుమనాః	160
672.	మహాకర్మా	140	698.	హవిః	160
673.	మహాతేజాః	140	699.	సద్గతిః	161
674.	మహోరగః	140	700.	సత్కృతిః	163
675.	మహాక్రతుః	141	701.	సత్తా	163
676,	మహాయజ్వా	142	702.	సద్భూతిః	164
677.	మహాయజ్ఞః	143	703.	సత్పరాయణః	165
678.	మహాహవిః	143	704.	శూరసేనః	167

705.	యదుశ్రేష్ఠః	168	731.	తత్	194
706.	సన్నివాసః	170	732.	పదమనుత్తమమ్	195
707.	సుయామునః	171	733.	లోకబంధుః	195
708.	భూతావాసః	172	734.	లోకనాథః	196
709.	వాసుదేవః	173	735.	మాధవః	197
710.	సర్వాసునిలయః	174	736.	భక్తవత్సలః	198
711.	అనలః	174	737.	సువర్ణవర్ణః	199
712.	దర్పహా	175	738.	హేమాఙ్గః	200
713.	దర్పదః	176	739.	వరాఙ్గః	200
714.	దృప్తః	177	740.	చన్దనాఙ్గదీ	201
715.	దుర్ధరః, (అథ)	178	741.	వీరహా	202
716.	అపరాజితః	179	742.	విషమః	203
717.	విశ్వమూర్తిః	181	743.	శూన్యః	203
718.	మహామూర్తిః	182	744.	ఘృతాశీః	204
719.	దీప్తమూర్తిః	183	745.	అచలః	205
720.	అమూర్తిమాన్	184	746.	చలః	205
721.	అనేక మూర్తిః	184	747.	అమానీ	207
722.	అవ్యక్తః	185	748.	మానదః	207
723.	శతమూర్తిః	186	749.	మాన్యః	209
724.	శతాననః	187	750.	లోకస్వామీ	209
725.	ఏకః	188	751.	త్రిలోకధృక్	210
726.	నైకః	189	752.	సుమేధా	210
727.	సవః	190	753.	మేధజః	211
728.	కః	191	754.	ధన్యః	213
729.	కిం	192	755.	సత్యమేధా	213
730.	యత్	192	756.	ధరాధరః	214

757.	తేజోవృషః	214	783.	లోకసారఙ్గః	232
758.	ద్యుతిధరః	215	784.	సుతన్తుః	233
759.	సర్వశస్త్రభృతాంవరః	215	785.	తన్తువర్ధనః	234
760.	ప్రగ్రహః	216	786.	ఇన్ద్రకర్మా	234
761.	నిగ్రహః	217	787.	మహాకర్మా	235
762.	వ్యగ్రః	218	788.	కృతకర్మా	236
763.	నైకశృఙ్గః	218	789.	కృతాగమః	236
764.	గదాగ్రజః	220	790.	ఉద్భవః	237
765.	చతుర్మూర్తిః	222	791.	సున్దరః	238
766.	చతుర్బాహుః	222	792.	సున్దః	239
768.	చతుర్వ్యూహః	223	793.	రత్ననాభః	240
768.	చతుర్గతిః	223	794.	సులోచనః	241
769.	చతురాత్మా	223	795.	అర్కః	241
770.	చతుర్భావః	224	796.	వాజసనః	242
771.	చతుర్వేదవిత్	224	797.	శృఙ్గీ	242
772.	ఏకపాత్	225	798.	జయన్తః	243
773.	సమావర్తః	226	799.	సర్వవిజ్జయీ	243
774.	అనివృత్తాత్మా	226	800.	సువర్ణబిన్దుః	244
775.	దుర్జయః	227	801.	అక్షోభ్యః	245
776.	దురతిక్రమః	227	802.	సర్వవాగీశ్వరేశ్వరః	246
777.	దుర్లభః	228	803.	మహాహ్రదః	246
778.	దుర్గమః	229	804.	మహాగర్తః	248
779.	దుర్గః	230	805.	మహాభూతః	249
780.	దురావాసః	230	806.	మహానిధిః	250
781.	దురారిహా	231	807.	కుముదః	250
782.	శుభాఙ్గః	232	808.	కున్దరః	251

809. కున్దుః 252
810. పర్జన్యః 253
811. పావనః 254
812. అనిలః 255
813. అమృతాశః 256
814. అమృతవపుః 257
815. సర్వజ్ఞుః 258
816. సర్వతోముఖుః 258
817. సులభుః 259
818. సువ్రతుః 260
819. సిద్ధుః 260
820. శత్రుజిత్ 261
821. శత్రుతాపనుః 262
822. న్యగ్రోధుః 262
823. ఉదుంబరుః 263
824. అశ్వత్థుః 264
825. చాణూరాన్ధ్ర నిషూదనుః267
826. సహస్రార్చిః 268
827. సప్తజిహ్వుః 269
828. సప్తైధాుః 270
829. సప్తవాహనుః 271
830. అమూర్తిుః 272
831. అనఘుః 273
832. అచిన్త్యుః 273
833. భయకృత్ 274
834. భయనాశనుః 275
835. అణుుః 276
836. బృహత్ 277
837. కృశుః 278
838. స్థూలుః 278
839. గుణభృత్ 279
840. నిర్గుణుః 279
846. మహాన్ 280
842. అధృతుః 281
843. స్వధృతుః 281
844. స్వాస్యుః 282
845. ప్రాగ్వంశుః 283
846. వంశవర్ధనుః 285
847. భారభృత్ 286
848. కథితుః 287
849. యోగీ 289
850. యోగీశుః 289
851. సర్వకామదుః 290
852, ఆశ్రముః 290
853. శ్రమణుః 292
854. క్షాముః 292
855. సుపర్ణుః 293
856. వాయువాహనుః 294
857. ధనుర్ధరుః 295
858. ధనుర్వేదుః 296
859. దణ్డుః 296
860. దమయితా 297

861.	దమః	297	887.	హుత్‌భుక్	315
862.	అపరాజితః	298	888.	భోక్తా	316
863.	సర్వసహః	298	889.	సుఖదః	316
864.	నియన్తా	299	890.	నైకజః	317
865.	అనియమః	299	891.	అగ్రజః	317
866.	అయమః	300	892.	అనిర్విణ్ణః	318
867	సత్త్వవాన్	301	893.	సదామర్షీ	318
868.	సాత్త్వికః	302	894.	లోకాధిష్ఠానమ్	319
869.	సత్యః	303	895.	అద్భుతః	319
870.	సత్యధర్మపరాయణః	303	896.	సనాత్	320
871.	అభిప్రాయః	304	897.	సనాతన తమః	321
872.	ప్రియార్హః	305	898.	కపిలః	321
873.	అర్హః	306	899.	కపిః	322
874.	ప్రియకృత్	307	900.	అప్యయ	323
875.	ప్రీతివర్ధనః	307	901.	స్వస్తిదః	323
876.	విహాయసగతిః	308	902.	స్వస్తికృత్	324
877.	జ్యోతిః	309	903.	స్వస్తి	324
878.	సురుచిః	310	904.	స్వస్తిభుక్	324
879.	హుతభుక్	310	905.	స్వస్తి దక్షిణః	325
880.	విభుః	311	906.	అరౌద్రః	326
881.	రవిః	312	907.	కుణ్డలీ	326
882.	విరోచనః	312	908.	చక్రీ	327
883.	సూర్యః	313	909.	విక్రమీ	328
884.	సవితా	314	910.	ఊర్జిత శాసనః	328
885.	రవిలోచనః	314	911.	శబ్దాతిగః	329
886.	అనన్తః	315	912.	శబ్దసహః	330

913.	శిశిరః	330	939.	వ్యాదిశః	348
914.	శర్వరీకరః	331	940.	దిశః	349
915.	అక్రూరః	333	941.	అనాదిః	350
916.	పేశలః	334	942.	భూర్భువః	351
917.	దక్షః	334	943.	లక్ష్మీః	351
918.	దక్షిణః	335	944.	సువీరః	352
919.	క్షమిణాం వరః	336	945.	రుచిరాంగదః	352
920.	విద్వత్తమః	336	946.	జననః	353
921.	వీతభయః	337	947.	జనజన్మాదిః	354
922.	పుణ్యశ్రవణ కీర్తనః	337	948.	భీమః	354
923.	ఉత్తారణః	338	949.	భీమపరాక్రమః	355
924.	దుష్కృతిహా	339	950.	ఆధారనిలయః	356
925.	పుణ్యః	339	951.	అధాతా, (ధాతా)	356
926.	దుఃస్వప్ననాశనః	340	952.	పుష్పహాసః	357
927.	వీరహా	341	953.	ప్రజాగరః	358
928.	రక్షణః	342	954.	ఊర్ధ్వగః	359
929.	సన్తః	342	955.	సత్పథాచారః	359
930.	జీవనః	343	956.	ప్రాణదః	360
931.	పర్యవస్థితః	343	957.	ప్రణవః	360
932.	అనన్తరూపః	344	958.	ప్రణః	361
933.	అనన్తశ్రీః	345	959.	ప్రమాణం	362
934.	జితమన్యుః	345	960.	ప్రాణ నిలయః	363
935.	భయాపహః	346	961.	ప్రాణభృత్	363
936.	చతురశ్రః	347	962.	ప్రాణజీవనః	364
937.	గభీరాత్మా	347	963.	తత్త్వమ్	364
938.	విదిశః	348	964.	తత్త్వవిత్	365

965.	ఏకాత్మా	366	983.	అన్నం	378
966.	జన్మమృత్యుజరాతిగః	367	984.	అన్నాదః	379
967.	భూర్భువః స్వస్తరుః	367	985.	ఆత్మయోనిః	381
968.	తారః	369	986.	స్వయం జాతః	381
969.	సవితా	369	987.	వైఖానః	382
970.	ప్రపితామహః	370	988.	సామగాయనః	383
971.	యజ్ఞః	370	989.	దేవకీ నందనః	384
972.	యజ్ఞపతిః	371	990.	స్రష్టా	386
973.	యజ్వా	371	991.	క్షితీశః	386
974.	యజ్ఞాంగః	372	992.	పాపనాశనః	386
975.	యజ్ఞవాహనః	374	993.	శంఖభృత్	387
976.	యజ్ఞభృత్	375	994.	నన్దకీ	388
977.	యజ్ఞకృత్	375	995.	చక్రీ	389
978.	యజ్ఞీ	376	996.	శార్ఙ్గధన్వా	390
979.	యజ్ఞభుక్	376	997.	గదాధరః	390
980.	యజ్ఞసాధనః	376	998.	రథాఙ్గపాణిః	391
981.	యజ్ఞాన్తకృత్	377	999.	అక్షోభ్యః	392
982.	యజ్ఞగుహ్యం	377	1000.	సర్వ ప్రహరణాయుధః	392

హరిః ఓమ్ శివాయ గురవేనమః

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాన్తయే ॥
వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥
వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥
యస్య స్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్ ।
విముచ్యతే నమ స్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ॥
నమః సమస్తభూతానామ్ ఆదిభూతాయ భూభృతే।
అనేకరూపరూపాయ విష్ణవే ప్రభవిష్ణవే ॥
ఓమ్ నమో విష్ణవే ప్రభవిష్ణవ ఇతి.

✧ ✧ ✧

ఓమ్

శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమ్

వైశంపాయన ఉవాచ :

1. శ్రుత్వా ధర్మా నశేషేణ పావనాని చ సర్వశః ।
యుధిష్ఠిరః శాంతనవం పునరేవాఽభ్యభాషత ॥

యుధిష్ఠిర ఉవాచ :

2. కి మేకం దైవతం లోకే కిం వాఽప్యేకం పరాయణం ।
స్తువన్తః కం క మర్చన్తః ప్రాప్నుయుర్మానవా శ్శుభమ్ ॥
3. కోధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమో మతః ।
కిం జపన్ముచ్యతే జన్తుః జన్మ సంసారబంధనాత్ ॥

శ్రీభీష్మ ఉవాచ :

4. జగత్ప్రభుం దేవదేవమనన్తం పురుషోత్తమమ్ ।
స్తువ న్నామ సహస్రేణ పురుష స్సతతోత్థితః ॥

5. తమేవ చాఽర్చయ న్నిత్యం భక్త్యా పురుష మవ్యయమ్ ।
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ ॥

6. అనాదినిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం ।
లోకాధ్యక్షం స్తువ న్నిత్యం సర్వదుఃఖాఽతిగో భవేత్ ॥

7. బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనమ్ ।
లోకనాథం మహద్భూతం సర్వభూతభవోద్భవమ్ ॥

8. ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః ।
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవై ర్చే న్నర స్సదా ॥

9. పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః ।
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్ ॥

10. పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం ।
దైవతాం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా ॥

11. యతః సర్వాణి భూతాని భవం త్యాది యుగాగమే।
యస్మింశ్చ ప్రలయం యాన్తి పున రేవ యుగక్షయే ॥

12. తస్య లోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే ।
విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాఽపహమ్ ॥

13. యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః ।
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే ॥

ఋషి - ఛందము - దేవత - మొదలగునవియు -
పూర్వన్యాసమును

ఋషి ర్నామ్నాం సహస్రస్య వేదవ్యాసో మహా మునిః।
ఛందోఽనుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీ సుతః॥

అమృతాంశూద్భవో బీజం శక్తి ర్దేవకినందనః
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే.
విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరం
అనేకరూపదైత్యాంతం నమామి పురుషోత్తమమ్.

అస్య శ్రీ విష్ణో ర్దివ్య సహస్ర నామ స్తోత్ర మహామంత్రస్య – శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః– అనుష్టుప్ ఛందః– శ్రీ మహా విష్ణుః శ్రీమన్నారాయణో దేవతా – అమృతాంశూద్భవో భానుః ఇతి బీజం – దేవకీనందనః స్రష్టా – ఇతి శక్తిః – ఉద్భవః క్షోభణో దేవః – ఇతి పరమో మంత్రః – శంఖభృన్నందకీ చక్రీ ఇతి కీలకం – శార్ఙ్గధన్వా గదాధరః ఇత్యస్త్రం – రథాంగపాణి రక్షోభ్యః ఇతి నేత్రం – త్రిసామా సామగః సామ – ఇతి కవచం – ఆనందః పరబ్రహ్మ – ఇతి యోనిః – ఋతుః సుదర్శనః కాలః ఇతి దిగ్బంధః – శ్రీ విశ్వరూపం ఇతి ధ్యానమ్, శ్రీ మహావిష్ణు ప్రీత్యర్థే సహస్ర నామజపే వినియోగః.

కరన్యాసః

విశ్వం విష్ణు ర్వషట్కారః – ఇతి అంగుష్ఠాభ్యాం నమః ; అమృతాం శూద్భవో భానుః – ఇతి తర్జనీభ్యాం నమః ; బ్రహ్మణ్యో బ్రహ్మకృద్ బ్రహ్మ – ఇతి మధ్యమాభ్యాం నమః ; సువర్ణబిందు రక్షోభ్యః – ఇతి అనామికాభ్యాం నమః ; నిమిషోఽనిమిషః స్రగ్వీ – ఇతి కనిష్ఠికాభ్యాం నమః ; రథాంగపాణి రక్షోభ్యః ఇతి కరతలకరపృష్ఠాభ్యాం నమః.

అంగన్యాసః

సువ్రతః సుముఖః సూక్ష్మః– ఇతి హృదయాయ నమః ; సహస్రమూర్ధా విశ్వాత్మా – ఇతి శిరసే స్వాహా ; సహస్రార్చిః సప్తజిహ్వాః – ఇతి శిఖాయై వషట్ ; త్రిసామా సామగః సామ – ఇతి కవచాయ హుమ్ ; రథాంగపాణి రక్షోభ్యః – ఇతి నేత్రాభ్యాం వౌషట్, శార్ఙ్గధన్వా గదాధరః – ఇతి అస్త్రాయ ఫట్ ; ఋతుః సుదర్శనః కాలః ఇతి దిగ్బంధః.

ధ్యానమ్

క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణివిలస - త్సైకతే మౌక్తికానాం।
మాలాక్లుప్తాసనస్థః స్ఫటికమణినిభై - ర్మౌక్తికై ర్మండితాంగః।
శుభ్రై రభ్రై రదభ్రై రుపరివిరచితై - ర్ముక్తపీయూష వర్షైః।
ఆనందీ నః పునీయా దరినలినగదా - శంఖపాణి ర్ముకుందః.
భూః పాదౌ యస్య నాభి ర్వియ దసు రనిల - శ్చంద్రసూర్యౌ చ నేత్రే।
కర్ణా వాశాః శిరోద్యౌ ర్ముఖ మపి దహనో - యస్య వాస్తేయ మబ్ధిః।
అంతఃస్థం యస్య విశ్వం సురనరఖగగో - భోగిగంధర్వదైత్యైః।
చిత్రం రంరమ్యతే తం త్రిభువనవపుషం - విష్ణు మీశం నమామి.

ఓం నమో భగవతే వాసుదేవాయ.

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం।
విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం।
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం।
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్.

మేఘశ్యామం పీత కౌశేయ వాసం।
శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం।
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం।
విష్ణుం వందే సర్వలోకైకనాథమ్.

సశంఖచక్రం సకిరీటకుండలం।
సపీత వస్త్రం సరసీరుహేక్షణం।
సహారవక్షఃస్థలశోభి కౌస్తుభం।
నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్.

హరిః ఓమ్

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః ।
భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః ॥ 1

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః ।
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ ॥ 2

యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః॥ 3

సర్వః శర్వః శివః స్థాణుః భూతాదిర్నిధిరవ్యయః ।
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః ॥ 4

స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః ।
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః ॥ 5

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమర ప్రభుః ।
విశ్వకర్మా మను స్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ॥ 6

అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః ।
ప్రభూత స్త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరమ్ ॥ 7

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః ।
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః ॥ 8

ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః ।
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్ ॥ 9

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః ।
అహః సంవత్సరో వ్యాలః ప్రత్యయః సర్వదర్శనః ॥ 10

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాది రచ్యుతః ।
వృషాకపి రమేయాత్మా సర్వయోగవినిఃసృతః ॥ 11

వసు ర్వసుమనాఃసత్యః సమాత్మాఽసమ్మిత స్సమః।
అమోఘుః పుణ్డరీకాక్షో వృషకర్మా వృషాకృతిః।। 12

రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోనిః శుచిశ్రవాః।
అమృతః శాశ్వతస్థాణు ర్వరారోహో మహాతపాః।। 13

సర్వగః సర్వవిద్భాను ర్విష్వక్సేనో జనార్దనః ।
వేదో వేదవిదవ్యంగో వేదాంగో వేదవి త్కవిః ।। 14

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాఽకృతః।
చతురాత్మా చతుర్వ్యూహ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః।। 15

భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా సహిష్ణు ర్జగదాదిజః।
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః।। 16

ఉపేన్ద్రో వామనః ప్రాంశు రమోఘుః శుచి రూర్జితః।
అతీన్ద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః।। 17

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః।
అతీన్ద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః।। 18

మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్తి ర్మహాద్యుతిః।
అనిర్దేశ్యవపుః శ్రీమా నమేయాత్మా మహాద్రిధృక్ ।। 19

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః।
అనిరుద్ధః సురానన్దో గోవిన్దో గోవిదాంపతిః।। 20

మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః।
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః।। 21

అమృత్యు స్సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః।
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా ।। 22

గురు ర్గురుతమో ధామ సత్యః సత్యపరాక్రమః।
నిమిషోఽనిమిషః స్రగ్వీ వాచస్పతి రుదారధీః।। 23

అగ్రణీర్గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః ।
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ ॥ 24

ఆవర్తనో నివృత్తాత్మా సంవృత స్సంప్రమర్దనః
అహః సంవర్తకో వహ్ని రనిలో ధరణీధరః॥ 25

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్ విశ్వభుక్ విభుః
సత్కర్తా సత్కృతః సాధు ర్జహ్ను ర్నారాయణో నరః ॥ 26

అసంఖ్యేయోఽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృ చ్ఛుచిః
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః॥ 27

వృషాహీ వృషభో విష్ణు ర్వృషపర్వా వృషోదరః
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః॥ 28

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేన్ద్రో వసుదో వసుః
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః॥ 29

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః
బుద్ధః స్పష్టాఽక్షరో మన్త్ర శ్చన్ద్రాంశు ర్భాస్కరద్యుతిః॥ 30

అమృతాంశూద్భవో భానుః శశబిన్దుః సురేశ్వరః
ఔషధం జగతః సేతుః సత్యధర్మపరాక్రమః॥ 31

భూతభవ్యభవన్నాథః పవనః పావనోఽనలః
కామహా కామకృ త్కాన్తః కామః కామప్రదః ప్రభుః॥ 32

యుగాదికృ ద్యుగావర్తో నైకమాయో మహాఽశనః
అదృశ్యోఽవ్యక్తరూపశ్చ సహస్రజి దనంతజిత్॥ 33

ఇష్టోఽవిశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహు ర్మహీధరః॥ 34

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవాఽనుజః ।
అపాంనిధి రధిష్థాన మప్రమత్తః ప్రతిష్ఠితః॥ 35

స్కన్దః స్కన్దధరో ధుర్యో వరదో వాయువాహనః।
వాసుదేవో బృహద్భాను రాదిదేవః పురన్దరః।। 36

అశోక స్తారణ స్తారః శూరః శౌరి ర్జనేశ్వరః।
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః।। 37

పద్మనాభోఽరవిన్దాక్షః పద్మగర్భః శరీరభృత్।
మహర్ధి ర్ధృద్ధో వృద్ధాఽఽత్మా మహాఽక్షో గరుడధ్వజః।। 38

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః।
సర్వలక్షణలక్షణ్యో లక్ష్మీవాన్ సమితిఞ్జయః।। 39

విక్షరో రోహితో మార్గో హేతు ర్దామోదర స్సహః।
మహీధరో మహాభాగో వేగవా నమితాఽశనః।। 40

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః।
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః।। 41

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః।
పరర్ధిః పరమస్పష్ట స్తుష్టః పుష్టః శుభేక్షణః।। 42

రామో విరామో విరతో(ఙో) మార్గో నేయో నయోఽనయః।
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః।। 43

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః।
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయు రధోక్షజః।। 44

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః।
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః।। 45

విస్తారః స్థావరః స్థాణుః ప్రమాణం బీజమవ్యయమ్।
అర్థోఽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః।। 46

అనిర్విణ్ణః స్థవిష్ఠోఽభూ ర్ధర్మయూపో మహామఖః।
నక్షత్రనేమి ర్నక్షత్రీ క్షమః క్షామః సమీహనః।। 47

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః।
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్॥ 48

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్।
మనోహరో జితక్రోధో వీరబాహు ర్విదారణః॥ 49

స్వాపనః స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్ ।
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః ॥ 50

ధర్మగు బ్ధర్మకృ ద్ధర్మీ సదసత్ క్షర మక్షరమ్ ।
అవిజ్ఞాతా సహస్రాంశు ర్విధాతా కృతలక్షణః॥ 51

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః ।
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః॥ 52

ఉత్తరో గోపతి ర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ।
శరీరభూతభృ ద్భోక్తా కపీన్ద్రో భూరిదక్షిణః॥ 53

సోమపోఽమృతపః సోమః పురుజి త్పురుసత్తమః।
వినయో జయః సత్యసంధో దాశార్హః సాత్వతాం పతిః॥ 54

జీవో వినయితాసాక్షీ ముకుందోఽమితవిక్రమః।
అంభోనిధి రనంతాత్మా మహోదధిశయోఽంతకః॥ 55

అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః ।
ఆనందో నందనో నందః సత్యధర్మా త్రివిక్రమః॥ 56

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః ।
త్రిపద స్త్రిదశాఽధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్ ॥ 57

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ ।
గుహ్యో గభీరో గహనో గుప్త శ్చక్రగదాధరః॥ 58

వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః।
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః॥ 59

భగవాన్ భగహాఽఽనందీ వనమాలీ హలాయుధః।
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణు ర్గతిసత్తమః ॥ 60

సుధన్వా ఖండపరశు ర్దారుణో ద్రవిణప్రదః ।
దివిస్పృక్ సర్వదృగ్వ్యాసో వాచస్పతి రయోనిజః॥ 61

త్రిసామా సామగ స్సామ నిర్వాణం భేషజం భిషక్।
సన్న్యాసకృ చ్ఛమః శాంతో నిష్ఠా శాంతిః పరాయణమ్॥ 62

శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః ।
గోహితో గోపతి ర్గోప్తా వృషభాక్షో వృషప్రియః ॥ 63

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృ చ్ఛివః ।
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాంవరః ॥ 64

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః ।
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః॥ 65

స్వక్షః స్వంగః శతానందో నంది ర్జ్యోతిర్గణేశ్వరః ।
విజితాత్మాఽవిధేయాత్మా సత్కీర్తి శ్ఛిన్నసంశయః ॥ 66

ఉదీర్ణః సర్వతశ్చక్షు రనీశః శాశ్వతస్థిరః।
భూశయో భూషణో భూతి ర్విశోకః శోకనాశనః॥ 67

అర్చిష్మా నర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః ।
అనిరుద్ధోఽప్రతిరథః ప్రద్యుమ్నోఽమితవిక్రమః॥ 68

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః ।
త్రిలోకాత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః॥ 69

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః ।
అనిర్దేశ్యవపు ర్విష్ణు ర్వీరోఽనంతో ధనంజయః॥ 70

బ్రహ్మణ్యో బ్రహ్మకృ ద్బ్రహ్మా బ్రహ్మ బ్రహ్మవివర్ధనః।
బ్రహ్మవి ద్బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః॥ 71

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః।
మహాక్రతు ర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః।। 72

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః ।
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తి రనామయః।। 73

మనోజవ స్తీర్థకరో వసురేతా వసుప్రదః ।
వసుప్రదో వాసుదేవో వసు ర్వసుమనా హవిః।। 74

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః ।
శూరసేనో యదుశ్రేష్ఠః సంనివాసః సుయామునః।। 75

భూతాఽఽవాసో వాసుదేవః సర్వాఽసునిలయోఽనలః।
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోఽథాపరాజితః ।। 76

విశ్వమూర్తి ర్మహామూర్తి ర్దీప్తమూర్తి రమూర్తిమాన్।
అనేకమూర్తి రవ్యక్తః శతమూర్తిః శతాననః ।। 77

ఏకో నైకః సవః కః కిం యత్త త్పద మనుత్తమమ్।
లోకబంధు ర్లోకనాథో మాధవో భక్తవత్సలః ।। 78

సువర్ణవర్ణో హేమాంగో వరాంగ శ్చందనాంగదీ ।
వీరహా విషమః శూన్యో ఘృతాశీ రచల శ్చలః ।। 79

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృక్।
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః ।। 80

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాం వరః ।
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాఽగ్రజః।। 81

చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః ।
చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేదవి దేకపాత్।। 82

సమావర్తోఽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః ।
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా।। 83

శుభాంగో లోకసారంగః సుతంతు స్తంతువర్ధనః ।
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాఽఽగమః।। 84

ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః।
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ।। 85

సువర్ణబిందు రక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః ।
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః।। 86

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః।
అమృతాశోఽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః।। 87

సులభః సువ్రతః సిద్ధః శత్రుజి చ్ఛత్రుతాపనః।
న్యగ్రోధోదుంబరోఽశ్వత్థ శ్చాణూరాంధ్రనిషూదనః।। 88

సహస్రార్చిః సప్తజిహ్వ్యః సప్తైధాః సప్తవాహనః।
అమూర్తి రనఘోఽచింత్యో భయకృద్ భయనాశనః।। 89

అణు ర్బృహత్ కృశః స్థూలో గుణభృ న్నిర్గుణో మహాన్।
అధృతః స్వధృతః స్వాఽఽస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః।। 90

భారభృత్ కథితో యోగీ యోగీశః సర్వకామదః।
ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః।। 91

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః।
అపరాజితః సర్వసహో నియంతాఽనియమో యమః।। 92

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః ।
అభిప్రాయః ప్రియాఽర్హోఽర్హః ప్రియకృత్ ప్రీతివర్ధనః।। 93

విహాయసగతి ర్జ్యోతిః సురుచి ర్హుతభు గ్విభుః।
రవి ర్విరోచనః సూర్య స్సవితా రవిలోచనః।। 94

అనంతో హుతభుగ్ భోక్తా సుఖదో నైకజోఽగ్రజః।
అనిర్విణ్ణః సదాఽమర్షీ లోకాధిష్ఠాన మద్భుతః।। 95

సనాత్ సనాతనతమః కపిలః కపి రవ్యయః।
స్వస్తిదః స్వస్తికృ త్స్వస్తి స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః।। 96

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః।
శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః।। 97

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః।
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః।। 98

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుఃస్వప్ననాశనః।
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః।। 99

అనంతరూపోఽనంత శ్రీ ర్జితమన్యు ర్భయాపహః।
చతురస్రో గభీరాత్మా విదిశో వ్యాదిశో దిశః।। 100

అనాది ర్భూర్భువో లక్ష్మీః సువీరో రుచిరాంగదః।
జననో జనజన్మాది ర్భీమో భీమపరాక్రమః।। 101

ఆధారనిలయో ధాతా పుష్పహాసః ప్రజాగరః।
ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః।। 102

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృ త్ప్రాణజీవనః।
తత్త్వం తత్త్వవి దేకాత్మా జన్మమృత్యుజరాతిగః।। 103

భూర్భువః స్వస్తరు స్తారః సవితా ప్రపితామహః।
యజ్ఞో యజ్ఞపతి ర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః।। 104

యజ్ఞభృ ద్యజ్ఞకృ ద్యజ్ఞీ యజ్ఞభు గ్యజ్ఞసాధనః।
యజ్ఞాన్తకృ ద్యజ్ఞగుహ్య మన్న మన్నాద ఏవ చ।। 105

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః।। 106

శంఖభృ న్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః।
రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః।। 107

సర్వప్రహరణాయుధ - ఓం నమ ఇతి
వనమాలీ గదీ శార్జ్గీ శంఖీ చక్రీ చ నందకీ।
శ్రీమన్నారాయణో విష్ణుర్వాసుదేవోఽభిరక్షతు।। 108

ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః।
నామ్నాం సహస్రం దివ్యానా మశేషేణ ప్రకీర్తితమ్।। 1

య ఇదం శృణుయా న్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్।
నాఽశుభం ప్రాప్నుయా త్కించి త్సోఽముత్రేహ చ మానవః।। 2

వేదాన్తగో బ్రాహ్మణః స్యాత్ క్షత్రియో విజయీ భవేత్।
వైశ్యో ధనసమృద్ధః స్యా చ్ఛూద్రః సుఖ మవాప్నుయాత్।। 3

ధర్మార్థీ ప్రాప్నుయా ద్ధర్మ మర్థార్థీ చార్థ మాప్నుయాత్।
కామానవాప్నుయా త్కామీ ప్రజార్థీ చాప్నుయా త్ప్రజామ్।। 4

భక్తిమాన్యః సదోత్థాయ శుచి స్తద్గతమానసః।
సహస్రం వాసుదేవస్య నామ్నా మేత త్ప్రకీర్తయేత్।। 5

యశః ప్రాప్నోతి విపులం జ్ఞాతిప్రాధాన్య మేవ చ।
అచలాం శ్రియ మాప్నోతి శ్రేయః ప్రాప్నో త్యనుత్తమమ్।। 6

న భయం క్వచి దాప్నోతి వీర్యం తేజశ్చ విందతి।
భవ త్యరోగో ద్యుతిమాన్ బలరూపగుణాఽన్వితః।। 7

రోగార్తో ముచ్యతే రోగాత్ బద్ధో ముచ్యేత బంధనాత్।
భయాన్ముచ్యేత భీతస్తు ముచ్యేతాఽఽపన్న ఆపదః।। 8

దుర్గాణ్యతితర త్యాశు పురుషః పురుషోత్తమమ్।
స్తువ న్నామసహస్రేణ నిత్యం భక్తి సమన్వితః।। 9

వాసుదేవాఽఽశ్రయో మర్త్యో వాసుదేవపరాయణః।
సర్వపాపవిశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనమ్।। 10

న వాసుదేవ భక్తానా మశుభం విద్యతే క్వచిత్।
జన్మమృత్యుజరావ్యాధిభయం నైవోపజాయతే।। 11

ఇమం స్తవ మధీయానః శ్రద్ధాభక్తిసమన్వితః।
యుజ్యేతాఽఽత్మసుఖక్షాంతి శ్రీధృతిస్మృతికీర్తిభిఃఽ। 12

న క్రోధో న చ మాత్సర్యం న లోభో నాఽశుభా మతిః।
భవంతి కృతపుణ్యానాం భక్తానాం పురుషోత్తమే। 13

ద్యౌః సచంద్రార్కనక్షత్రా ఖం దిశో భూ ర్మహోదధిః।
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనఃఽ। 14

ససురాఽసురగంధర్వం సయక్షోరగరాక్షసమ్।
జగద్వశే వర్తతేదం కృష్ణస్య సచరాచరమ్। 15

ఇంద్రియాణి మనో బుద్ధిః సత్త్వం తేజో బలం ధృతిః।
వాసుదేవాత్మకా న్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ। 16

సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పతే।
ఆచారప్రభవో ధర్మో ధర్మస్య ప్రభు రచ్యుత। 17

ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః।
జంగమాజంగమం చేదం జగ న్నారాయణోద్భవమ్। 18

యోగో జ్ఞానం తథా సాంఖ్యం విద్యాః శిల్పాదికర్మ చ।
వేదాః శాస్త్రాణి విజ్ఞానం మేత త్సర్వం జనార్దనాత్। 19

ఏకో విష్ణు ర్మహద్ భూతం పృథగ్భూతా న్యనేకశఃఽ।
త్రీన్ లోకా న్వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభు గవ్యయఃఽ। 20

ఇమం స్తవం భగవతో విష్ణో ర్వ్యాసేన కీర్తితమ్।
పఠే ద్య ఇచ్ఛే త్పురుషః శ్రేయః ప్రాప్తుం సుఖాని చ। 21

విశ్వేశ్వర మజం దేవం జగతః ప్రభు రవ్యయమ్।
భజన్తి యే పుష్కరాక్షం న తే యాంతి పరాభవమ్। 22

న తే యాంతి పరాభవం ఓం నమ ఇతి.

ఇతి శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం సంపూర్ణమ్.

అర్జున ఉవాచ:

పద్మపత్రవిశాలాక్ష! పద్మనాభ! సురోత్తమ!
భక్తానా మనురక్తానాం త్రాతా భవ జనార్దన!

శ్రీభగవానువాచ:

యో మాం నామసహస్రేణ స్తోతు మిచ్ఛతి పాండవ!
సోఽహ మేకేన శ్లోకేన స్తుత ఏవ న సంశయః -

వ్యాస ఉవాచ:

వాసనా ద్వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం।
సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే -
శ్రీ వాసుదేవ నమోస్తుత ఓం నమ ఇతి.

పార్వత్యువాచ:

కేనోపాయేన లఘునా విష్ణో ర్నామసహస్రకమ్।
పఠ్యతే పండితై ర్నిత్యం శ్రోతు మిచ్ఛా మ్యహం ప్రభో।

ఈశ్వర ఉవాచ:

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామతస్తుల్యం రామనామ వరాననే!
శ్రీ రామనామ వరానన ఓం నమ ఇతి.

బ్రహ్మో ఉవాచ:

నమోఽస్త్వనంతాయ సహస్రమూర్తయే।
సహస్రపాదాక్షిశిరోరుబాహవే।
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే।
సహస్రకోటి యుగధారిణే నమః-
సహస్రకోటియుగధారిణే నమ ఓం నమ ఇతి.

సంజయ ఉవాచ:

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ.

శ్రీ భగవా నువాచ:

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.
ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః।
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః।
సంకీర్త్య నారాయణశబ్దమాత్రం।
విముక్తదుఃఖాః సుఖినో భవంతి.

కాయేన వాచా మనసేంద్రియై ర్వా।
బుద్ధ్యా_ఉ_త్మనా వా ప్రకృతేః స్వభావాత్।
కరోమి య ద్య త్సకలం పరస్మై।
నారాయణాయేతి సమర్పయామి.

ఓం తత్ సత్.

శ్రీ విష్ణు సహస్రనామముల అకారాద్యనుక్రమణిక

నామం		నామసంఖ్య
	అ	
అక్రూరః	-	915
అగ్రజః	-	891
అగ్రణీః	-	218
అగ్రాహ్యః	-	55
అచలః	-	745
అచింత్యః	-	832
అచ్యుతః	-	100-318
అజః	-	95-204-521
అజితః	-	549
అణుః	-	835
అంతకః	-	520
అతీంద్రః	-	157
అతీంద్రియః	-	169
అతులః	-	355
అదృశ్యః	-	304
అద్భుతః	-	895
అధాతా	-	951
అధిష్ఠానమ్	-	324
అధృతః	-	842
అధోక్షజః	-	415
అనంతః	-	659-886
అనంతజిత్	-	307
అనంతరూపః	-	932
అనంత శ్రీః	-	933
అనంతాత్మా	-	518
అనఘుః	-	146-831
అనయః	-	400
అనర్థః	-	431
అనలః	-	293-711
అనాదిః	-	941
అనాదినిధనః	-	42
అనామయః	-	689
అనిమిషః	-	215
అనియమః	-	865
అనిరుద్ధః	-	185-638
అనిర్దేశ్యవపుః	-	177-656
అనిర్విణ్ణః	-	435-892
అనిలః	-	234-812
అనివర్తీ	-	596
అనివృత్తాత్మా	-	744
అనీశః	-	626
అనుకూలః	-	342
అనుత్తమః	-	80
అనేకమూర్తిః	-	721
అన్నమ్	-	983
అన్నాదః	-	984
అపరాజితః	-	716-862
అపాంనిధిః	-	323
అవ్యయః	-	900
అప్రతిరథః	-	639
అప్రమత్తః	-	325
అప్రమేయః	-	46

అప్రమేయాత్మా - 248
అంభోనిధిః - 517
అభిప్రాయః - 871
అభూః - 437
అమరప్రభుః - 49
అమానీ - 747
అమితవిక్రమః - 516-641
అమితాశనః - 372
అమూర్తిః - 830
అమూర్తిమాన్ - 720
అమృతః - 119
అమృతపుః - 504
అమృతవపుః - 814
అమృతాంశూద్భవః - 283
అమృతాశః - 813
అమృత్యుః - 198
అమేయాత్మా - 102-179
అమోఘుః - 110-154
అయమః - 866
అరవిందాక్షః - 347
అరౌద్రః - 906
అర్కః - 795
అర్చితః - 634
అర్చిష్మాన్ - 633
అర్థః - 430
అర్హః - 873
అవిజ్ఞాతా - 482
అవిధేయాత్మా - 621
అవిశిష్టః - 309
అవ్యంగః - 129
అవ్యక్తః - 722
అవ్యయః - 13
అశోకః - 336
అశ్వత్థః - 824
అసంఖ్యేయః - 247
అసత్ - 479
అహః - 90
అహఃసంవర్తకః - 232
అక్షరః - 17
అక్షరమ్ - 481
అక్షోభ్యః - 801-999

ఆ

ఆత్మయోనిః - 985
ఆత్మవాన్ - 84
ఆదిత్యః - 39-563
ఆదిదేవః - 334-490
ఆధారనిలయః - 950
ఆనందః - 526
ఆనందీ - 560
ఆవర్తనః - 228
ఆశ్రమః - 852

ఇ

ఇజ్యః - 446
ఇంద్రకర్మా - 786
ఇష్టః - 308

ఈ

ఈశానః - 64

ఈశ్వరః - 36-74

ఉ

ఉగ్రః - 412
ఉత్తరః - 494
ఉత్తారణః - 923
ఉదీర్ణః - 624
ఉదుంబరః - 823
ఉద్భవః - 373-790
ఉపేంద్రః - 151

ఊ

ఊర్జితః - 156
ఊర్జితశాసనః - 910
ఊర్ధ్వగః - 954

ఋ

ఋతుః - 416
ఋద్ధః - 278-351

ఏ

ఏకః - 725
ఏకపాత్ - 772
ఏకాత్మా - 965

ఓ

ఓజస్తేజోద్యుతిధరః - 275

ఔ

ఔషధమ్ - 287

క

కః - 728
కథితః - 848
కనకాంగదీ - 541
కపిః - 899
కపిలః - 898
కపీంద్రః - 501
కరణమ్ - 378
కర్తా - 380
కవిః - 132
కాంతః - 296-654
కామః - 297
కామకృత్ - 295
కామదేవః - 651
కామపాలః - 652
కామప్రదః - 298
కామహా - 294
కామీ - 653
కారణమ్ - 379
కాలః - 418
కాలనేమినిహా - 642
కిమ్ - 729
కుండలీ - 907
కుందః - 809
కుందరః - 808
కుంభః - 635
కుముదః - 589-807
కువలేశయః - 590
కృతకర్మా - 788
కృతజ్ఞః - 82-532
కృతలక్షణః - 485
కృతాంతకృత్ - 537
కృతాకృతః - 136
కృతాగమః - 655-789
కృతిః - 83

కృశః	-	837
కృష్ణః	-	57-550
కేశవః	-	23-648
కేశిహా	-	649
క్రతుః	-	448
క్రమః	-	79
క్రోధకృత్కర్తా	-	315
క్రోధహా	-	314
	ఖ	
ఖండపరశుః	-	568
	గ	
గతిసత్తమః	-	566
గదాగ్రజః	-	764
గదాధరః	-	997
గభస్తినేమిః	-	486
గభీరః	-	543
గభీరాత్మా	-	937
గరుడధ్వజః	-	354
గహనః	-	382-544
గుణభృత్	-	839
గుప్తః	-	545
గురుః	-	209
గురుతమః	-	210
గుహః	-	383
గుహ్యః	-	542
గోపతిః	-	495-592
గోప్తా	-	496-593
గోవిందః	-	187-539
గోవిదాంపతిః	-	188
గోహితః	-	591
గ్రామణీః	-	219
	ఘ	
ఘృతాశీః	-	74
	చ	
చందనాంగదీ	-	740
చంద్రాంశుః	-	281
చక్రగదాధరః	-	546
చక్రీ	-	908-995
చతురశ్రః	-	936
చతురాత్మా	-	137-769
చతుర్గతిః	-	768
చతుర్దంష్ట్రః	-	139
చతుర్బాహుః	-	766
చతుర్భావః	-	770
చతుర్భుజః	-	140
చతుర్మూర్తిః	-	765
చతుర్వ్యూహః	-	138-767
చతుర్వేదవిత్	-	771
చలః	-	746
చాణూరాంధ్రనిషూదనః	-	825
	ఛ	
ఛిన్నసంశయః	-	623
	జ	
జగతః సేతుః	-	288
జగదాదిజః	-	145
జనజన్మాదిః	-	947
జననః	-	946

జనార్దనః	–	126
జనేశ్వరః	–	341
జన్మమృత్యుజరాతిగః	–	966
జయః	–	509
జయంతః	–	798
జహ్నుః	–	244
జితక్రోధః	–	462
జితమన్యుః	–	934
జితామిత్రః	–	524
జీవః	–	513
జీవనః	–	930
జేతా	–	148
జ్ఞానగమ్యః	–	497
జ్ఞానముత్తమమ్	–	454
జ్యేష్ఠః	–	67
జ్యోతిః	–	877
జ్యోతిరాదిత్యః	–	564
జ్యోతిర్గణేశ్వరః	–	619
త		
తంతువర్ధనః	–	785
తత్	–	731
తత్త్వమ్	–	963
తత్త్వవిత్	–	964
తారః	–	338-968
తారణః	–	337
తీర్థకరః	–	691
తుష్టః	–	391
తేజోవృషః	–	757
త్రికకుబ్ధామ	–	61
త్రిదశాధ్యక్షః	–	535
త్రిపదః	–	534
త్రిలోకధృక్	–	751
త్రిలోకాత్మా	–	646
త్రిలోకేశః	–	647
త్రివిక్రమః	–	530
త్వష్టాః	–	52
ద		
దండః	–	859
దక్షః	–	423-917
దక్షిణః	–	918
దమః	–	861
దమనః	–	190
దమయితా	–	860
దర్పదః	–	713
దర్పహా	–	712
దామోదరః	–	367
దారుణః	–	569
దాశార్హః	–	511
దివఃస్పృక్	–	571
దిశః	–	940
దీప్తమూర్తిః	–	719
దురతిక్రమః	–	776
దురాధర్షః	–	81
దురారిహా	–	781
దురావాసః	–	780
దుర్గః	–	779
దుర్గమః	–	778
దుర్జయః	–	775
దుర్ధరః	–	266-715
దుర్మర్షణః	–	205

దుర్లభః	-	777
దుష్కృతిహా	-	924
దుఃస్వప్ననాశనః	-	926
దృఢః	-	551
దృప్తః	-	714
దేవః	-	375
దేవకీనందనః	-	989
దేవభృద్గురుః	-	493
దేవేశః	-	492
ద్యుతిధరః	-	758
ద్రవిణప్రదః	-	570
ధ		
ధనంజయః	-	660
ధనుర్ధరః	-	857
ధనుర్వేదః	-	858
ధనేశ్వరః	-	474
ధన్యః	-	754
ధన్వీ	-	76
ధరణీధరః	-	235
ధరాధరః	-	756
ధర్మః	-	403
ధర్మకృత్	-	476
ధర్మగుప్	-	475
ధర్మయూపః	-	438
ధర్మవిదుత్తమః	-	404
ధర్మాధ్యక్షః	-	135
ధర్మీ	-	477
ధాతా	-	43
ధాతురుత్తమః	-	45
ధామ	-	211
ధుర్యః	-	329
ధృతాత్మా	-	160
ధ్రువః	-	388
న		
నందః	-	528
నందకీ	-	994
నందనః	-	527
నందిః	-	618
నయః	-	399
నరః	-	246
నహుషః	-	312
నక్షత్రనేమిః	-	440
నక్షత్రీ	-	441
నారసింహవపుః	-	021
నారాయణః	-	245
నిగ్రహః	-	761
నిధిరవ్యయః	-	30
నిమిషః	-	214
నియంతా	-	864
నియమః	-	161
నిర్గుణః	-	840
నిర్వాణమ్	-	577
నివృత్తాత్మా	-	597-229
నిష్ఠా	-	583
నేతా	-	222
నేయః	-	398
నైకః	-	726
నైకకర్మకృత్	-	469
నైకజః	-	890
నైకమాయః	-	302

నైకరూపః	-	271	పురందరః	-	335
నైకశృంగః	-	763	పురాతనః	-	498
నైకాత్మా	-	468	పురుజిత్	-	506
న్యగ్రోధః	-	822	పురుషః	-	14-406
న్యాయః	-	221	పురుషోత్తమః	-	24
	ప		పురుసత్తమః	-	507
పణః	-	958	పుష్కరాక్షః	-	40-556
పదమనుత్తమమ్	-	732	పుష్టః	-	393
పద్మగర్భః	-	348	పుష్పహాసః	-	952
పద్మనాభః	-	48-196-346	పూతాత్మా	-	10
పద్మనిభేక్షణః	-	345	పూరయితా	-	686
పద్మీ	-	344	పూర్ణః	-	685
పరమస్పష్టః	-	390	పృథుః	-	410
పరమాత్మా	-	11	పేశలః	-	916
పరమేశ్వరః	-	377	ప్రకాశనః	-	274
పరమేష్ఠీ	-	419	ప్రకాశాత్మా	-	276
పరర్ధిః	-	389	ప్రగ్రహః	-	760
పరాయణమ్	-	585	ప్రజాగరః	-	953
పరిగ్రహః	-	420	ప్రజాపతిః	-	69-197
పర్జన్యః	-	810	ప్రజాభవః	-	89
పర్యవస్థితః	-	931	ప్రణవః	-	409-957
పవనః	-	291	ప్రతర్దనః	-	59
పవిత్రం	-	62	ప్రతాపనః	-	277
పాపనాశనః	-	992	ప్రతిష్ఠితః	-	326
పావనః	-	292-811	ప్రత్యయః	-	93
పుండరీకాక్షః	-	111	ప్రథితః	-	319
పుణ్యః	-	687-925	ప్రద్యుమ్నః	-	640
పుణ్యకీర్తిః	-	688	ప్రధానపురుషేశ్వరః	-	20
పుణ్యశ్రవణకీర్తనః	-	922	ప్రపితామహః	-	970
పునర్వసుః	-	150	ప్రభవః	-	34

ప్రభుః	–	35-299
ప్రభూతః	–	60
ప్రమాణమ్	–	428-959
ప్రమోదనః	–	525
ప్రసన్నాత్మా	–	237
ప్రాంశుః	–	153
ప్రాగ్వంశః	–	845
ప్రాణః	–	66-320-407
ప్రాణజీవనః	–	962
ప్రాణదః	–	65-321-408
	–	956
ప్రాణనిలయః	–	960
ప్రాణభృత్	–	961
ప్రియకృత్	–	874
ప్రియార్హః	–	872
ప్రీతివర్ధనః	–	875
	బ	
బభ్రుః	–	116
బహుశిరాః	–	115
బీజమవ్యయమ్	–	429
బృహత్	–	836
బృహద్భానుః	–	333
బృహద్రూపః	–	272
బ్రహ్మ	–	664
బ్రహ్మకృత్	–	662
బ్రహ్మజ్ఞః	–	669
బ్రహ్మణ్యః	–	661
బ్రహ్మవిత్	–	666
బ్రహ్మవివర్ధనః	–	665
బ్రహ్మా	–	663
బ్రహ్మీ	–	668
బ్రాహ్మణః	–	667
బ్రాహ్మణప్రియః	–	670
	భ	
భక్తవత్సలః	–	736
భగవాన్	–	558
భగహా	–	559
భయకృత్	–	833
భయనాశనః	–	834
భయాపహః	–	935
భర్తా	–	33
భానుః	–	284
భారభృత్	–	847
భావః	–	7
భావనః	–	32
భాస్కరద్యుతిః	–	282
భిషక్	–	579
భీమః	–	357-948
భీమపరాక్రమః	–	949
భుజగోత్తమః	–	193
భూగర్భః	–	71
భూతకృత్	–	5
భూతభవ్యభవత్ప్రభుః	–	4
భూతభవ్యభవన్నాథః	–	290
భూతభావనః	–	9
భూతభృత్	–	6
భూతమహేశ్వరః	–	489
భూతాత్మా	–	8
భూతాదిః	–	29
భూతావాసః	–	708

భూతిః	-	630	మహాద్రిధృక్	-	180
భూరిదక్షిణః	-	502	మహాధనః	-	434
భూర్భువః	-	942	మహాన్	-	841
భూర్భువఃస్వస్తరుః	-	967	మహానిధిః	-	806
భూశయః	-	628	మహాబలః	-	172
భూషణః	-	629	మహాబుద్ధిః	-	173
భేషజమ్	-	578	మహాభాగః	-	370
భోక్తా	-143-500-888		మహాభూతః	-	805
భోజనమ్	-	142	మహాభోగః	-	433
భ్రాజిష్ణుః	-	141	మహాసుఖః	-	439
	మ		మహామనాః	-	557
మంగళంపరమ్	-	63	మహామాయః	-	170
మంత్రః	-	280	మహామూర్తిః	-	718
మధుః	-	168	మహాయజ్ఞః	-	677
మధుసూదనః	-	73	మహాయజ్వా	-	676
మనుః	-	51	మహార్హః	-	522
మనోజవః	-	690	మహావరాహః	-	538
మనోహరః	-	461	మహావీర్యః	-	174
మరీచిః	-	189	మహాశక్తిః	-	175
మహర్షిః	-	350	మహాశనః	-	303
మహర్షికపిలాచార్యః	-	531	మహాశృంగః	-	536
మహాకర్మా	-	672-787	మహాస్వనః	-	41
మహాకోశః	-	432	మహాహవిః	-	678
మహాక్రతుః	-	675	మహాహ్రదః	-	803
మహాక్రమః	-	671	మహాక్షః	-	353
మహాగర్తః	-	804	మహీధరః	-	369-317
మహాతపాః	-	122	మహీభర్తా	-	182
మహాతేజా	-	673	మహేజ్యః	-	447
మహాదేవః	-	491	మహేంద్రః	-	268
మహాద్యుతిః	-	176	మహేష్వాసః	-	181

మహోత్సాహః	-	171	యోగవిదాంనేతా	-	19
మహోదధిశయః	-	519	యోగీ	-	849
మహోరగః	-	674	యోగీశః	-	850
మాధవః	-	72-167-735		**ర**	
మానదః	-	748	రక్షణః	-	928
మాన్యః	-	749	రణప్రియః	-	684
ముకుందః	-	515	రత్నగర్భః	-	473
ముక్తానాంపరమాగతిః	-	12	రత్ననాభః	-	793
మేదినీపతిః	-	533	రథాంగపాణిః	-	998
మేధజః	-	753	రవిః	-	881
మేధావీ	-	77	రవిలోచనః	-	885
	య		రామః	-	394
యజ్ఞః	-	445-971	రుచిరాంగదః	-	945
యజ్ఞకృత్	-	977	రుద్రః	-	114
యజ్ఞగుహ్యమ్	-	982	రోహితః	-	364
యజ్ఞపతిః	-	972		**ల**	
యజ్ఞభుక్	-	979	లక్ష్మీః	-	943
యజ్ఞభృత్	-	976	లక్ష్మీవాన్	-	361
యజ్ఞవాహనః	-	975	లోకత్రయాశ్రయః	-	614
యజ్ఞసాధనః	-	980	లోకనాథః	-	734
యజ్ఞాంగః	-	974	లోకబంధుః	-	733
యజ్ఞాంతకృత్	-	981	లోకసారంగః	-	783
యజ్వా	-	973	లోకస్వామీ	-	750
యజ్ఞీ	-	978	లోకాధిష్ఠానమ్	-	894
యత్	-	730	లోకాధ్యక్షః	-	133
యదుశ్రేష్ఠః	-	705	లోహితాక్షః	-	58
యమః	-	162		**వ**	
యుగాదికృత్	-	300	వంశవర్ధనః	-	846
యుగావర్తః	-	301	వత్సరః	-	470
యోగః	-	18	వత్సలః	-	471

వత్సీ	-	472	విదిశః	-	938
వనమాలీ	-	561	విద్వత్తమః	-	920
వరదః	-	330	విదారణః	-	464
వరాంగః	-	739	విధాతా	-	44-484
వరారోహః	-	121	వినయః	-	508
వరుణః	-	553	వినయితాసాక్షీ	-	514
వర్ధనః	-	261	విభుః	-	240-880
వర్ధమానః	-	262	విముక్తాత్మా	-	452
వషట్కారః	-	3	విరతః	-	396
వసుః	-104-270-696		విరామః	-	395
వసుదః	-	269	విరోచనః	-	882
వసుప్రదః	-	693-694	వివిక్తః	-	263
వసుమనాః	-	105-697	విశిష్టః	-	249
వసురేతా	-	692	విశుద్ధాత్మా	-	636
వహ్నిః	-	233	విశోకః	-	631
వాగ్మీ	-	267	విశోధనః	-	637
వాచస్పతిరయోనిజః	-	573	విశ్రామః	-	424
వాచస్పతిరుదారధీః	-	217	విశ్రుతాత్మా	-	207
వాజసనః	-	796	విశ్వకర్మా	-	50
వామనః	-	152	విశ్వదక్షిణః	-	425
వాయుః	-	414	విశ్వధృక్	-	238
వాయువాహనః	-	331-856	విశ్వబాహుః	-	316
వారుణః	-	554	విశ్వభుక్	-	239
వాసవానుజః	-	322	విశ్వమ్	-	1
వాసుదేవః	-332-695-709		విశ్వమూర్తిః	-	717
వికర్తా	-	381	విశ్వయోనిః	-	149-117
విక్రమః	-	78	విశ్వరేతాః	-	88
విక్రమీ	-	909-75	విశ్వాత్మా	-	225
విజయః	-	147	విషమః	-	742
విజితాత్మా	-	620	విష్ణుః	-	2-258-657

విష్వక్సేనః - 125
విస్తారః - 426
విహాయసగతిః - 876
విక్షరః - 363
వీతభయః - 921
వీరః -401-643-658
వీరబాహుః - 463
వీరహా -166-741-927
వృద్ధాత్మా - 352
వృషః - 313
వృషకర్మా - 112
వృషపర్వా - 259
వృషప్రియః - 595
వృషభః - 257
వృషభాక్షః - 594
వృషాకపిః - 101
వృషాకృతిః - 113
వృషాహీ - 256
వృషోదరః - 260
వృక్షః - 555
వేగవాన్ - 371
వేదః - 127
వేదవిత్ - 128-131
వేదాంగః - 130
వేద్యః - 163
వేధాః - 547
వైకుంఠః - 405
వైఖానః - 987
వైద్యః - 164
వ్యక్తరూపః - 305
వ్యగ్రః - 762
వ్యవసాయః - 384
వ్యవస్థానః - 385
వ్యాదిశః - 939
వ్యాపీ - 467
వ్యాప్తః - 413
వ్యాలః - 92

శ

శంఖభృత్ - 993
శంభుః - 38
శక్తిమతాంశ్రేష్ఠః - 402
శతమూర్తిః - 723
శతానందః - 617
శతాననః - 724
శతావర్తః - 343
శత్రుఘ్నుః - 412
శత్రుజిత్ - 820
శత్రుతాపనః - 821
శబ్దసహః - 912
శబ్దాతిగః - 911
శమః - 581
శరణమ్ - 86
శరభః - 356
శరీరభూతభృత్ - 499
శరీరభృత్ - 349
శర్మ - 87
శర్వః - 26
శర్వరీకరః - 914
శశబిందుః - 285
శాంతః - 582

శాంతిః	-	584	శ్రీనివాసః	-	183-607
శాంతిదః	-	587	శ్రీపతిః	-	603
శార్ఙ్గధన్వాః	-	996	శ్రీమతాంవరః	-	604
శాశ్వతః	-	56	శ్రీమాన్	-	22-178-220
శాశ్వతస్థాణుః	-	120		-	613
శాశ్వతస్థిరః	-	627	శ్రీవత్సవక్షాః	-	601
శాస్తా	-	206	శ్రీవాసః	-	602
శిఖండీ	-	311	శ్రీవిభావనః	-	609
శిపివిష్టః	-	273	శ్రీశః	-	606
శివః	-	27-600	శ్రుతిసాగరః	-	264
శిశిరః	-	913	శ్రేయః	-	612
శిష్టకృత్	-	250	శ్రేష్ఠః	-	68
శిష్టేష్టః	-	310		స	
శుచిః	-	155-251	సంకర్షణోచ్యుతః	-	552
శుచిశ్రవాః	-	118	సంగ్రహః	-	158
శుభాంగః	-	782-586	సంతః	-	929
శుభేక్షణః	-	393	సంధాతాః	-	201
శూన్యః	-	743	సంధిమాన్	-	202
శూరః	-	339	సంనివాసః	-	706
శూరజనేశ్వరః	-	645	సంన్యాసకృత్	-	580
శూరసేనః	-	704	సంప్రమర్దనః	-	231
శృంగీ	-	797	సంభవః	-	31
శోకనాశనః	-	632	సంవత్సరః	-	91-422
శౌరిః	-	340-644	సంవృతః	-	230
శ్రమణః	-	853	సంస్థానః	-	386
శ్రీకరః	-	611	సంక్షేప్తా	-	598
శ్రీగర్భః	-	376	సత్	-	478
శ్రీదః	-	605	సతాంగతిః	-	184-450
శ్రీధరః	-	610	సత్కర్తా	-	241
శ్రీనిధిః	-	608	సత్కృతిః	-	622

సత్కృతః - 242
సత్కృతిః - 700
సత్తా - 701
సత్పథాచారః - 955
సత్పరాయణః - 703
సత్యః - 106-212-869
సత్యధర్మపరాక్రమః - 289
సత్యధర్మపరాయణః - 870
సత్యధర్మా - 529
సత్యపరాక్రమః - 213
సత్యమేధా - 755
సత్యసంధః - 510
సత్రమ్ - 449
సత్త్వవాన్ - 867
సత్త్వస్థః - 487
సదామర్షీ - 893
సదాయోగీ - 165
సద్గతిః - 699
సద్భూతిః - 702
సనాత్ - 896
సనాతనతమః - 897
సప్తజిహ్వః - 827
సప్తవాహనః - 829
సప్తైధాః - 828
సమః - 109
సమయజ్ఞః - 358
సమాత్మా - 107
సమావర్తః - 773
సమితింజయః - 362
సమీరణః - 223
సమీహనః - 444
సమ్మితః - 108
సర్గః - 159
సర్వః - 25
సర్వకామదః - 851
సర్వగః - 123
సర్వజ్ఞః - 453-815
సర్వతశ్చక్షుః - 625
సర్వతోముఖః - 816
సర్వదర్శనః - 94
సర్వదర్శీ - 45
సర్వదృక్ - 199
సర్వదృగ్వ్యాసః - 572
సర్వప్రహరణాయుధః - 1000
సర్వయోగవినిఃసృతః - 103
సర్వలక్షణలక్షణ్యః - 360
సర్వవాగీశ్వరేశ్వరః - 802
సర్వవిజ్జయీ - 799
సర్వవిద్భానుః - 124
సర్వశస్త్రభృతాంవరః - 759
సర్వసహః - 863
సర్వాదిః - 99
సర్వాసునిలయః - 710
సర్వేశ్వరః - 96
సవః - 727
సవితా - 884-969
సహః - 368
సహస్రజిత్ - 306
సహస్రపాత్ - 227
సహస్రమూర్ధా - 224

సహస్రాంశుః	-	483	సుమేధా	-	752
సహస్రార్చిః	-	826	సుయామునః	-	707
సహస్రాక్షః	-	226	సురాధ్యక్షః	-	134
సహిష్ణుః	-	144-565	సురానందః	-	186
సాత్వతాంపతిః	-	512	సురారిహా	-	208
సాత్త్వికః	-	868	సురుచిః	-	878
సాధుః	-	243	సురేశః	-	85
సామ	-	576	సురేశ్వరః	-	286
సామగః	-	575	సులభః	-	817
సామగాయనః	-	988	సులోచనః	-	794
సాక్షీ	-	15	సువర్ణబిందుః	-	800
సింహః	-	200-488	సువర్ణవర్ణః	-	737
సిద్ధః	-	97-819	సువీరః	-	944
సిద్ధసంకల్పః	-	253	సువ్రతః	-	455-818
సిద్ధార్థః	-	252	సుషేణః	-	540
సిద్ధిః	-	98	సుహృత్	-	460
సిద్ధిదః	-	254	సూర్యః	-	883
సిద్ధిసాధనః	-	255	సూక్ష్మః	-	457
సుందః	-	792	సోమః	-	505
సుందరః	-	791	సోమపః	-	503
సుఖదః	-	459-889	స్కందః	-	327
సుఘోషః	-	458	స్కందధరః	-	328
సుతంతుః	-	784	స్తవప్రియః	-	680
సుతపాః	-	195	స్తవ్యః	-	679
సుదర్శనః	-	417	స్తుతిః	-	682
సుధన్వా	-	567	స్తోతా	-	683
సుపర్ణః	-	192-855	స్తోత్రమ్	-	681
సుప్రసాదః	-	236	స్థవిరో ధ్రువః	-	54
సుభుజః	-	265	స్థవిష్ఠః	-	53-436
సుముఖః	-	456	స్థాణుః	-	28

స్థానదః	–	387
స్థావరస్థాణుః	–	427
స్థిరః	–	203
స్థూలః	–	838
స్పష్టాక్షరః	–	279
స్రగ్వీ	–	216
స్రష్టా	–	588-990
స్వంగః	–	616
స్వధృతః	–	843
స్వయంజాతః	–	986
స్వయంభూః	–	37
స్వవశః	–	466
స్వక్షః	–	615
స్వస్తి	–	903
స్వస్తికృత్	–	902
స్వస్తిదః	–	901
స్వస్తిదక్షిణః	–	905
స్వస్తిభుక్	–	904
స్వాంగః	–	548
స్వాపనః	–	465
స్వాభావ్యః	–	523
స్వాస్యః	–	844

హ

హంసః	–	191
హరిః	–	650
హలాయుధః	–	562
హవిః	–	698
హవిర్హరిః	–	359
హిరణ్యగర్భః	–	70-411
హిరణ్యనాభః	–	194
హుతభుక్	–	879-887
హృషీకేశః	–	47
హేతుః	–	366
హేమాంగదః	–	738

క్ష

క్షమః	–	442
క్షమిణాంవరః	–	919
క్షరమ్	–	480
క్షామః	–	443-854
క్షితీశః	–	991
క్షేత్రజ్ఞః	–	16
క్షేమకృత్	–	599
క్షోభణః	–	374.

అందరూ గ్రంథాలయ వ్యవస్థ
A C No. 94570
హైదరాబాద్-500 044.

శ్రీవిష్ణువిద్య

(శ్రీ విష్ణు సహస్రనామ భాష్యము)

సామవేదం షణ్ముఖ శర్మ

"ఇది నామవిద్య.
ఈ నామాలు అక్షరాల గుంపులు కావు.
నారాయణుని శబ్దాకృతులు. మొత్తంగా ఈ సహస్రనామ స్తోత్రమే విష్ణుని శబ్దమయీమూర్తి. ఇవి వేదమందు ప్రతిపాదింపబడిన పరమాత్ముని శబ్దాలు. వీటి వ్యాఖ్యానం మన వైదిక విజ్ఞానాన్నీ, పరమేశ్వర జ్ఞానాన్నీ స్పష్టపరుస్తాయి. అందుకే ఇది 'విష్ణువిద్య'.
ప్రాచీన, అర్వాచీన భాష్యాల ననుసరించి, వైదిక శాస్త్రాల సంప్రదాయాధారంగా ఒక్కొక్క నామానికి ఉన్న ఔచితీమంతమైన క్రమబద్ధతనీ, నిర్దిష్టమైన వ్యాఖ్యానాన్నీ అందించే సమన్వయ భాష్యమిది.
ప్రతినామ వ్యాఖ్యానము పారాయణయోగ్యంగా,
భావనాయోగంగా సమకూర్చిన విష్ణుతేజో విలసిత గ్రంథమిది".

-సామవేదం

సమర్పణ : డా॥ వ్యాకరణం ఆంజనేయ శాస్త్రి

ఋషిపీఠం ప్రచురణలు